# వివేచన ఉద్వేగవాదం విప్లవం

(ద్వితీయ భాగం)



ఆంగ్లమూలం
మానవేంద్రనాథ్ రాయ్

అనువాదం
నరిశెట్టి ఇన్నయ్య

# వివేచన, ఉద్వేగవాదం, విప్లవం

## ద్వితీయ భాగం

ఆంగ్లమూలం

మానవేంద్రనాథ్ రాయ్

అనువాదకుడు

డా॥ నరిసెట్టి ఇన్నయ్య, ఎమ్. ఏ., పిహెచ్. డి.,

2019
వీణాధరీ పబ్లికేషన్స్
హైదరాబాద్

**వివేచన, ఉద్వేగవాదం, విప్లవం**

**ద్వితీయ భాగం**

**ఆంగ్లమూలం**

**మానవేంద్రనాథ్ రాయ్**

**అనువాదకుడు**

**డాక్టర్. నరిసెట్టి ఇన్నయ్య, ఎమ్. ఏ., పిహెచ్. డి.,**

**ప్రథమ ముద్రణ 2019**

**వీణాధరీ పబ్లికేషన్స్,**

**హైదరాబాద్**

# పరిచయం

ప్రపంచప్రసిద్ధిగాంచిన సామాజిక శాస్త్రజ్ఞుడు ఎరిక్‌ఫ్రాం తన సేన్‌సొసైటి గ్రంథంలో పేర్కొన్నట్లు పుట (56), ఐరోపా నాగరికత, పునర్వికాసం గురించి తెలుసుకోడానికి ఎం. ఎన్. రాయ్ రాసిన "వివేచన, ఉద్వేగవాదం, విప్లవం" రెండు భాగాలు చదవాల్సిందే.

20వ శతాబ్దంలో భారతదేశం సృష్టించిన సామాజిక రాజకీయ తత్త్వవేత్తలలో అగ్రగణ్యుడు ఎం. ఎన్. రాయ్. ఇతడిని గురించి ప్రాంతీయ భాషలలో నేటికి ఇంకా అంతగా తెలియకపోవడానికి, ఇతని రచనలు అనువాదం గాకపోవడం ఒక కారణమనవచ్చు.

1887 లో ఒక బెంగాల్ పురోహిత కుటుంబంలో ఎం. ఎన్. రాయ్ జన్మించాడు. అసలు పేరు నరేంద్రనాధ్ భట్టాచార్య. ఉత్తరోత్తరా రాజకీయ కారణాలుగా మానవేంద్రనాథ్‌రాయ్ అని పేరు మార్చుకున్నాడు. అదే స్థిరపడింది.

డిగ్రీల చదువులేని రాయ్ హైస్కూలు రోజులలోనే బెంగాలీ టెర్రరిస్టు జాతీయోద్యమంలో కార్యకలాపాలు సాగిస్తూ రాజకీయ జీవితాన్ని ఆరంభించాడు. 1906 లో మొదలెట్టిన అతివాదపోకడలవల్ల అనేక బ్రిటిష్ వ్యతిరేక, విధ్వంసకచర్యలు గావించి, పట్టుబడుతూ, విడుదల అవుతూ వచ్చాడు. ఆనాడు రాయ్‌కు గురువు జతిన్ ముఖర్జి. తమ కార్యకలాపాలకుగాను జర్మనీ సహాయం పొందాలని పథకాలువేసి, డబ్బు నిమిత్తం జావావెళ్ళి విఫల ప్రయత్నం చేస్తాడు. పరిస్థితులు విషమించగా స్వదేశానికి తిరిగిరాలేక, అక్కడ నుంచే దేశాలెన్నో తిరిగాడు. మళ్ళీ 15 సంవత్సరాలకుగాని ఎం.ఎన్.రాయ్ భారతదేశానికి రాలేదు.

టెర్రరిస్టు జాతీయవాదిగా ఆరంభించిన ఎం.ఎన్. రాయ్, ఇండొనేషియా, మలయా, చైనా, జపాన్‌లు పర్యటిస్తూ, క్రైస్తవ ఫాదరీవేషంలో అమెరికాలో శాన్‌ఫ్రాన్సిస్కో చేరుకున్నాడు (1916 జూన్ 14). అక్కడే మానవేంద్రనాథ్‌రాయ్ అవతారమెత్తి, ఎవిలిన్ అనే యువతిని వివాహమాడాడు. న్యూయార్కు చేరుకొని, లాలాలజపతిరాయ్‌తో పరిచయంకాగా, జాతీయవాదోద్యమం గురించి తెలుసుకునే ప్రయత్నంలో కనువిప్పు పొందాడు. న్యూయార్క్‌లో మార్క్సిజం చదవడం మొదలెట్టాడు. హిందూ – జర్మనీ కుట్రకేసులో అరెస్టు అయి, తప్పించుకొని మెక్సికో పారిపోయాడు. 1918లో మెక్సికన్ సోషలిస్టుపార్టీ పేరిట ప్రప్రథమ కమ్యూనిస్టు పార్టీని, రష్యా వెలుపల స్థాపించినవాడయ్యాడు.

బొరొడిన్‌తో పరిచయంగావడం, రష్యాకు రమ్మని లెనిన్ అహ్వానించడంతో 1919లో బయలుదేరి స్పెయిన్, జర్మనీల మీదుగా రష్యా చేరుకున్నాడు. లెనిన్‌తో సన్నిహిత సిద్ధాంతపరమైన మిత్రుడుగా చర్చలు జేయడం, భారత కమ్యూనిస్టుపార్టీని, దేశం బయట, తాష్కెంట్‌లో, 1920 అక్టోబరు 17న స్థాపించడం చరిత్రాత్మక సంఘటనలు. వలస రాజ్యాల విషయమై లెనిన్‌తో భేదించగా, రాయ్ ప్రత్యామ్నాయ ప్రతిపాదనలను కమ్యూనిస్టుపార్టీ చర్చించింది. రష్యాలో పార్టీపరంగా అన్ని అగ్రశేణిసభ్యత్వాలు పొంది, ప్రముఖ పాత్ర నిర్వహిస్తూ, లెనిన్ తరవాత స్టాలిన్‌తో దగ్గరవాడయ్యాడు. భారత కమ్యూనిస్టుపార్టీకి సాహిత్యాన్ని రాసి అందివ్వడం సలహాలనివ్వడం ఇత్యాది కార్యక్రమాలు ఎన్నో చేశాడు. బ్రిటిష్‌వారు దేశంలో కమ్యూనిస్టులపై మోపిన కుట్రకేసులలో రాయ్‌ను ఒకముద్దాయిగా చేశారు.

స్టాలిన్ పంపగా 1927లో చైనావెళ్ళి, అక్కడ కమ్యూనిస్టు ఉద్యమానికి తోడ్పడటంలో రాయ్ మరో ప్రముఖపాత్ర వహించాడు. తిరిగి రష్యాకు చేరుకునేసరికి పరిస్థితులు మారిపోగా, జర్మనీకి వచ్చి, సిద్ధాంతపరంగా వచ్చిన విభేదాలతో స్టాలిన్‌కు దూరమయ్యాడు. రష్యా రోజులలో ఆయనతో ఎవిలిన్ ఉంటూ, శాంతిదేవి పేరిట అనేక రచనలు చేసింది. తరవాత అభిప్రాయభేదాలవల్ల అమెరికా వెళ్లిపోయి, రాయ్‌తో సంబంధాలు తెంచుకున్నది.

జర్మనీలో ఎలెన్‌తో రాయ్‌కు పరిచయంకాగా, ఆమె జీవితాంతం ఇతడికి సిద్ధాంతపరమైన సహచారిణిగా ఉన్నది. 1930 లో భారతదేశానికి తిరిగివచ్చిన రాయ్ కరాచి కాంగ్రెసు మహాసభలకు హాజరై, నెహ్రూకు సన్నిహితుడుగా ఉన్నాడు. కాని త్వరలోనే పట్టుబడగా, 12 సంవత్సరాల శిక్ష పడడం, తరవాత అది ఆరేళ్ళ శిక్షగా హైకోర్టు తగ్గించడంతో, జైలు జీవితం తప్పలేదు. అయితే జైలులో ఉండగా రాయ్‌కు ఫ్రాన్స్ నుంచి ఎలెన్ అనేక గ్రంథాలు పంపుతూ ఎంతో తోడ్పడింది. సిద్ధాంతపరమైన అనేక రచనలు, సామాజిక పరమైన మిమర్శలు ఎన్నో రాయ్ జైలులో ఉండగానే చేశాడు. 1936లో విడుదల అయినతరవాత జాతీయవాద రాజకీయాలకు, కమ్యూనిస్టుపార్టీ రాజకీయాలకు దూరమై క్రమేణా రాడికల్ డెమొక్రటిక్ పార్టీని స్థాపించాడు (1940).

రాజకీయ పాఠశాలలు నిర్వహించి శాస్త్రీయ రాజకీయాల కోసం ప్రచారంచేసి ఎందరో శిష్యులను తయారుచేశాడు.

పార్టీ రాజకీయాలలో ఉన్న లోపాలను ప్రత్యక్షంగా అనుభవించి, గమనించిన రాయ్, తన పార్టీని రద్దుచేసి, అనుచరుల ఇష్టతకు వ్యతిరేకంగా నవ్యమానవవాద ఉద్యమాన్ని ప్రారంభించాడు (1948).

మార్క్సిజాన్ని చాలా క్షుణ్ణంగా పరిశీలించి వివిధ సామాజిక తత్వాలను

ఆపోశనంపట్టి, వాటి లోపాలను గ్రహించిన రాయ్ మార్గాంతరాలు అన్వేషించాడు. మానవుడి అభ్యున్నతికి, సమాజాభివృద్ధికి సమన్వయీకరణ ఉండేరీతిలో విలువలను ప్రతిపాదించాడు. రాజకీయాలలో నీతి ఆవశ్యకత శాస్త్రీయాధారంగా చెప్పిన వ్యక్తిగా రాయ్‌కు ఖ్యాతి దక్కుతుంది. ఆధునిక విజ్ఞానాన్ని అవగాహన చేసుకుని, దానినుంచి తాత్త్విక ఫలితాలు రాబట్టడం అనేది రాయ్ తత్త్వంలో కీలకపాత్ర వహిస్తుంది. తన అభిప్రాయాలను మిత్రులతో చర్చించి, మథించిన అనంతరం, ముఖ్యంగా బెంగాలీకవి సుధీంద్రనాథ్ దత్తతో చర్చల సారాంశంగా, “వివేచన, ఉద్వేగవాదం, విప్లవం” రాశాడు. రాయ్ భాషాపాటవానికి, శైలికి, సమాజ తత్త్వంపై అతడికిగల పట్టుకు ఈ గ్రంథం నిదర్శనం.

1954 లో రాయ్‌డెహ్రాడూన్‌లో మరణించాడు. ఇంకా అముద్రిత రచనలు ఎన్నో ఉండగా నేటి సాంఘిక సంక్షోభాలకు రాయ్ చేసిన ఈ రచన ఎంతో ఉపకరిస్తుందనడంలో సందేహం లేదు.

రాయ్ రచనలలో పేర్కొనదగినవి కొన్ని ఇండియా ఇన్ ట్రాన్సిషన్, రష్యన్ రివల్యూషన్, రివల్యూషన్ అండ్ కౌంటర్ రివల్యూషన్ ఇన్ చైనా, ఇండియాస్ మెసేజ్, సైంటిఫిక్ పోలిటిక్స్, ఫ్రం శావేజరీ టు సివిలిజేషన్, మెటీరియలిజం, ది ఫిలసాఫికల్ కాన్సిక్వెన్సెస్ ఆఫ్ మోడ్రన్ సైన్స్, న్యూ హ్యూమనిజం, న్యూ ఓరియంటేషన్, పార్టీస్ పవర్ అండ్ పోలిటిక్స్, బియాండ్ కమ్యూనిజం, సైన్స్ అండ్ ఫిలాసఫీ, మెమోర్స్.

రాయ్‌ను గురించి దేశవిదేశాలలో అనేక రచనలు, పరిశోధనలు వెలువడ్డాయి.

ఇటువంటి ప్రాధాన్యం పొందిన రాయ్ రచనలు తెలుగులో ప్రచురించడంవల్ల ఉపాధ్యాయులకు, విద్యార్థులకు, సామాజిక విషయాలలో ఆసక్తి ఉన్నవారికి ఎంతో సేవచేసినట్లయింది.

## విషయసూచిక


1. ప్రతిచర్య - ఉద్వేగవాదం 7

2. ఉద్వేగవాద చరిత్ర 28

3. మీతిమీరిన ఉద్వేగం 51

4. ఉదారవాదం, మూలం, సంప్రదాయం 63

5. ఉదారవాదంలో దోషాలు 91

6. నవ్య సంప్రదాయ వివేచనావాదం 117

7. హెగెల్ నుంచి మార్క్సుకు 143

8. మార్క్సిజం 166

9. వివేచనారహితవాదపు కవలలు 193

10. 20 వ శతాబ్దపు సంక్షోభం 217

12. మార్గాంతరం 238

13. నవ్య మానవవాదం 255

# ప్రతిచర్య - ఉద్వేగవాదం

ఫ్రెంచి విప్లవానంతరం మళ్ళీ రాజరికం ఏర్పడింది. అపుడు వచ్చిన మేధావుల ఉద్యమాన్ని 18 వ శతాబ్దానికి వ్యతిరేకంగా వచ్చిన తిరుగుబాటుగా చిత్రీకరించారు. అది ఫ్రాన్సుకే పరిమితం కాలేదు. ఫ్రెంచి విప్లవానికి వ్యతిరేకంగా వచ్చిన ప్రతిచర్య, ఆధునిక సాంస్కృతిక చరిత్రలో ఒక దశగా పేర్కొన్నారు. ఈ దశ ప్రభావం జర్మనీపై ప్రగాఢముద్రను వేసింది. వాస్తవానికి, "18 వ శతాబ్దంపై తిరుగుబాటు" జర్మనీలోనే ఆరంభం అయింది. ఫ్రెంచి విప్లవానికి సంబంధించిన విశ్వజనీనత, మానవతాదర్శాలకు వ్యతిరేకంగా జాతీయవాదం పేరిట ఈ తిరుగుబాటు వచ్చింది.

ఫ్రాన్సులో విప్లవానంతర ఉద్వేగ ఉద్యమం రాజకీయాలపై ప్రభావాన్ని చూపెట్టలేకపోయింది. దానికి తాత్త్విక ప్రాధాన్యం కూడా లేదు. సాహిత్య సంబంధమయిన ఈ ఉద్యమం ఆధునిక సంస్కృతిపై గట్టిముద్ర వేసింది. (1) రూసో సంప్రదాయప్రేరణ ఇందులో ఎక్కువగా ఉంది. తదనుగుణంగానే "ఉద్వేగవాద ఉద్యమం' అనే పేరుకూడా వచ్చింది. (2) జోసఫ్ డ మెస్ట్ర్, (3) మెయిన్ డ బిరన్, (4) షాటో బ్రాస్ బోధించిన కొత్తకేథలిక్ మతవాదంలోని మార్మిక విజ్ఞప్తి కూడా రూసోనుంచి స్వీకరించిందే. (5) మదాం డ స్టీల్ రాజకీయంగా ఉదారవాదాన్ని అనుసరించిన నిర్హేతుకతను ప్రబోధించిన ప్రవక్తను శ్లాఘించింది. జర్మనీ సాహిత్యంలో సంప్రదాయాన్ని తిరుగదోడిన తరవాత ఆ ప్రభావం ఆమెపై చూపెట్టేవరకూ ఈ ధోరణే అనుసరించింది.

ఫ్రాన్స్, జర్మనీలకు చెందిన విప్లవానంతర ఉద్వేగవాదులు, 18వ శతాబ్దంలో రూసో వాదానికి వ్యతిరేకంగా తిరుగుబాటు చేశారు. వివేచన, ఉద్వేగవాదం, విప్లవం చాలావరకు సమన్వయం పొందిన సమయంలో రూసో నివసించినప్పటికీ, ఈ తిరుగుబాటు తప్పలేదు. ఉద్వేగవాదులమని చెప్పుకునే సాంస్కృతిక తిరోగమన నాయకులు, పునర్వికాసానికి చెందిన వ్యక్తులు "మతేతర అవినీతి, రాగద్వేషరహిత వివేచనా వాదాన్ని" ఖండించారు. (6) గోతిక్ కళలలోని ఔన్నత్యాన్ని అభినందించడం, జర్మనీలో తొలుత ఉన్న సంస్కృతి పటుత్వాన్ని శ్లాఘించడంతో (అదికూడా మతరహితమైందని విస్మరించారు.) మధ్యయుగాల్లోని క్రైస్తవమత పవిత్రతకు ఉన్నత పరిశీలకులు సాహసోపేత కార్యకలాపాలకు తిరిగి పయనించాలని వీరు భావించారు. వీరిలో కొందరు, ముఖ్యంగా బ్రిటన్‌లో, పునర్వికాసకళ, సాహిత్యంకూడా 'వివేచన' అనే నిరంకుశత్వంపై మానవేచ్ఛ జరిపిన

తిరుగుబాటుగా పేర్కొన్నారు.” సంప్రదాయంగా వస్తున్న అచేతనంపై మానవుడి సృజనాత్మకత (ఉద్వేగవాదం) ప్రప్రథమంగా పెల్లుబికి వచ్చినట్లుగా పేర్కొన్నారు.

పునర్వికాస సంప్రదాయానికి వ్యతిరేకంగా రూసో తిరుగుబాటుచేశాడు. చరిత్రను వెనక్కు నడిపించాలనే ప్రయత్నమది. ఫ్రాన్సులో అది విఫలం అయింది. (7) డే కార్ట్ నుంచి (8) డిడరో వరకూ వివేచనాత్ములు, సెక్యులర్ భావకులను ప్రభావితంచేసిన మేధాసంబంధమైన జీవితం ఫ్రాన్సులో ఉన్నది. మార్మికవాదమూ, మత తిరోగమన వాదమూ, ఈ రెండూ కూడా ఫ్రాన్సులో, కృత్రిమంగా తప్ప, అంతకు మించిన ప్రభావాన్ని చూపెట్టలేకపోయాయి. జర్మనీలో విప్లవానంతర ఉద్వేగవాదం 18వ శతాబ్ధంపై తిరుగుబాటు కాదు. అప్పటి వికాసయుగంలో సహితం మధ్యయుగానికి చెందిన సామాజిక, మేధాసంబంధమైన వాతావరణమింకా జర్మనీలో లేకపోలేదు. (18 వ శతాబ్దంలో ఫ్రాన్సులో జరిగినట్లే 19వ శతాబ్దంలో జర్మనీలో కూడా అప్పటి రాజకీయ వ్యవస్థను విప్లవాత్మక తాత్విక భావనలు ఛేదించనారంభించాయి. కానీ ఉభయదేశాలకూ చాలా తేడా ఉంది. ఆనాటికి గుర్తించిన విజ్ఞానంపై ఫ్రెంచివారు బాహాటంగానే పోరాడారు. మతంపై తిరుగుబాటు కూడా చేశారు. తరచు రాజ్యానికికూడా ఎదురుతిరిగారు. ఫ్రెంచ్ రచనలు హాలెండ్‌లోనూ ఇంగ్లండ్‌లోనూ ప్రచురితమయ్యాయి. ఫ్రెంచివారు అప్పుడప్పుడూ బాస్టిల్ జైలులో బందీలయ్యారు. ఇందుకు భిన్నంగా జర్మనీవారు ప్రభుత్వంచే నియమితులైన బోధకులుగానూ, ఆచార్యులుగానూ ఉన్నారు. వారి రచనలను పాఠ్యగ్రంథాలుగా గుర్తించారు. (9) హెగెల్ సూచించిన ‘నిర్జిత విశ్వ ప్రగతి’ ప్రష్యా ప్రభుత్వ సోషలిస్ట్ ఫిలాసఫీస్”). 18 వ శతాబ్దపు భావం చొచ్చుకపోకుండగా జర్మనీలో అవరోధమేర్పడింది. ఆవిధంగా అది ఫలప్రదమై ఉత్తరోత్తరా చరిత్రపై ప్రభావం చూపింది.

మానవుడు ప్రాయికంగా వివేచనాత్ముడు. ఈ వాస్తవాన్ని వ్యతిరేకిస్తూ, హేతువాద నిరంకుశత్వమంటూ తిరుగుబాటు చేశారు. 12వ శతాబ్దంనుంచీ కూడా మేధస్సుకు సంబంధించిన పునర్వికాసం మానవుడి భావస్వేచ్ఛా పోరాటాన్ని సాగించడానికి సహకరించింది. మతపరమైన విశ్వాసపు సంకెళ్ళనుంచి విమోచన గావించడానికి తోడ్పడింది. కట్టుకథలూ, మూఢనమ్మకాలూ, అభూతకల్పనలూ ఇత్యాదులన్నీ కూడా ఆదిమ మానవుడి అజ్ఞానం కారణంగా జనించగా, వాటి నడుమ వ్యక్తులు నలిగిపోతున్నారు. అది కేవలం 18 వ శతాబ్దానికి వ్యతిరేకంగా జరిగిన తిరుగుబాటు మాత్రమే కాదు. ఆటవికతనుంచి నాగరికత వరకూ మానవ ప్రగతిని తోసిరాజనే ధోరణి ఇందులో ఉంది. అభ్యుదయ భావాల్ని వ్యతిరేకించడమూ మానవుడి సమగ్రతావకాశాల్ని తృణీకరించడమూ ఆ తిరుగుబాటులో గోచరిస్తున్నాయి. దీనిని ఉద్వేగవాద మనడం సరికాదు మరి. మానవుడి సమగ్రతలో నమ్మకం, అభ్యుదయభావం ఈ రెండింటిని మాత్రమే జీవితానికి సంబంధించినట్టి

ఉద్వేగ భావనలుగా పేర్కొనవచ్చు. వివేచనావాద సంప్రదాయానికి విరుద్ధంగా జరిగిన తిరుగుబాటు 18వ శతాబ్దానికి మాత్రమే పరిమితంకాదు. 17వ శతాబ్దంలో సంప్రదాయవాదాన్ని కూడా దాటిపోయి మతపాండిత్యవాదాన్ని కూడా కాదనడం తిరుగుబాటులో కనిపిస్తుంది. 'విప్లవానంతర ఉద్వేగవాదులు' అనబడేవారు క్రైస్తవమత విశ్వాసంలోకి పోయి, (12) సెయింట్ థామస్‌కు సంబంధించినట్టి మత జ్ఞానాన్ని కూడా పునరాలోచించాలంటూ, కొత్తరకమైన కేథలిక్ మతవాదాన్ని ప్రచారం చేశారు. "ఈ శతాబ్దారంభంలో ఫ్రెంచి రచయితలలో, జోసఫ్ ద మెయిస్ట్రే, (13) ద బొనార్డ్, (14) లామన అనే ప్రముఖులు ముగ్గురు 1789 నాటి సూత్రాలకు విరుద్ధంగానే, మధ్యయుగాలకు అనుకూలంగానూ పోవాలన్నారు. 18 వ శతాబ్దపు భావాలను వారు ప్రశ్నించడం గమనిస్తే వారు సంశయవాదానికి సంబంధించినట్టి వారనీ, దైవ సాక్షాత్కారాన్ని ప్రస్తుతించినట్లూ కన్పిస్తున్నది." (జి. లో డికిన్సన్, రివెల్యూషన్ అండ్ రియాక్షన్ ఇన్ మోడరన్ ఫ్రాన్స్, లామనాను ఈ జాబితాలో చేర్చడానికి వీలులేదు.)

ఉద్వేగవాదుల ధోరణిని కల్పిత రచనలలో బాగా అధ్యయనం చేయవచ్చు. వింత అంటే వారికి ఇష్టం. భూతాలు, శిథిలావస్థలో ఉన్న కోటలు, పతనావస్థలో ఉన్న ఉన్నత కుటుంబాలు, ఇంద్రజాల విద్యను ఆచరించేవారు, పిశాచాల గురించి అధ్యయనం, పతనమైన నిరంకుశం, సముద్రాలపై దోపిడీదారులు ఇత్యాదుల గురించి వీరికి చాలా ఇష్టం. మధ్య యుగాల్లోని విషయాలపట్ల ఉద్వేగవాదులకు ప్రీతి ఎక్కువ. గతాన్ని గురించికానీ, ప్రస్తుతాన్ని గురించికానీ వాస్తవానికి సంబంధం లేకుండా పోవడం వీరిలో కన్పిస్తుంది. (15) బెట్రాన్డ్ రసెల్, హిస్టరీ ఆఫ్ వెస్టరన్ ఫిలాసఫీ).

ఆ కాలంలోని రాజకీయ ఆలోచనాపరులలో రాయర్-కొలార్డ్, గజోలు చాలా ముఖ్యమయినవారు. ఉభయులూ గిరాన్‌డిస్ట్ సంప్రదాయానికి చెందినవారే గాక బ్రిటిష్ రాజ్యాంగ ధోరణిని అభినందించారు. అయినప్పటికి వారిరువురిమధ్యా, చాలా తేడా ఉంది. (16) గజో మతరహితంగా ఆలోచించిన చరిత్రకారుడు, ఉదారవాది. (17) రాయర్-కొలార్డ్ ఉద్వేగ వాదులలో ఒకడుగా భావించకపోయినప్పటికి తాత్త్విక సాంస్కృతిక తిరోగమనవాదిగా ఇతడు మతాన్ని తిరగదోడాలనే వాదాన్ని సమర్థించాడు. రాజరికం తిరిగి నెలకొన్న తరవాత పారిస్ విశ్వవిద్యాలయంలో తత్త్వాచార్యుడిగా పనిచేసిన రాయర్-కొలార్డ్ విప్లవాన్ని చవిచూసినవాడే. మహాసభలో అతడొక సభ్యుడు కూడా. (18) జాకోబిన్‌లు అధికారం హస్తగతం చేసుకొనగా ఇతడెట్లాగో పారిపోయి ఉరికంబం తప్పించుకున్నాడు. 1797లో నెపోలియన్‌కు చెందిన 500 మంది సమతిలో సభ్యుడుగా ఇతడు మళ్ళీ ప్రజాజీవితంలోకి వచ్చాడు. "విప్లవాత్మక పెనుభూతాన్ని పూర్తిగా నాశనంచేసి ప్రాచీన సాంప్రదాయాలపై నైతిక వ్యవస్థను పునరుద్ధరించాలని" బోధించాడు.

రాజకీయంగానూ సామాజికంగానూ విప్లవం సాధించినదంతా తోసిపారేయడానికి వీలులేదు. నెపోలియన్ వీటిని కట్టుదిట్టం చేయగా (19) 18వ లూయీ కూడా విప్ల వాస్తవాలను ఆమోదించాడు. రాజరికపు సాంఘిక ప్రాతిపదికను విప్లవం విచ్ఛిన్నం చేయగా, నూతన రాజ్యాంగం విప్లవానికీ, రాచరికపు ఛాయలకూ రాజీప్రయత్నం చేసింది. రాజరికానికి సంబంధించిన ప్రాచీన మతపరమైన నైతికాధారాన్ని కాస్తా విప్లవం కూలదోసింది. అందువల్ల దీనికి ప్రతిచర్యగా మతాన్ని మళ్ళీ పునరుద్ధరించాలని ఒత్తిడి వచ్చింది.

రాజరికం పునరుద్ధరించడానికి ఇంచుమించు 20 ఏళ్ళకు పూర్వం, 500 మంది సభ్యుల సమితిలో రాయర్-కొలార్డ్ చిరస్మరణీయమైన ఉపన్యాయం చేశాడు. "ఫ్రెంచివారిలో పదింట ఏడువంతుల మందిని కేథలిక్ మతం సమీకరిస్తున్నది. రాచరికంకంటే ముందేపుట్టిన ఈ మతం ఇంకా కొనసాగుతూన్నది. ప్రజల నైతిక విధానానికి ఈ మతమే ఆధారంగా ఉంది. పౌరులను కట్టుగా ఉంచడానికీ రాజ్యంతో వారి సంబంధాలను అట్టిపెట్టడానికీ ఈ మతమే తోడ్పడుతూ ఉంది. భవిష్యత్తుని గమనించి, భౌతిక ప్రపంచహద్దులను దాటి తమ ఆశలను భయాలను రూపొందించుకోవలసిన అవసరముంది." తాత్త్విక అధ్యాపకుడుగా రాయర్-కొలార్డ్, (20) లాక్ చెప్పిన ఇంద్రిజ్ఞాన వాదాన్ని ఎదుర్కొన్నాడు. పాస్కల్‌ను ప్రమాణంగా స్వీకరించాడు. (22) బర్క్ రాసిన రిఫ్లెక్షన్ ఆన్ ఫ్రెంచి రివెల్యూషన్ వల్ల ప్రభావితుడయ్యాడు. విప్లవానంతర ఉద్వేగవాదం, వ్యక్తి స్వేచ్ఛను కాపాడటానికి పోరాడిందంటారు. అయితే మతపరమయిన అభిప్రాయంతో కూడిన జీవితం ఆధారంగా సమాజ స్థాపన జరగాలని కోరినందువల్ల మానవుడిని స్వేచ్ఛగా ఉండనివ్వని ఈ ధోరణి వ్యక్తివాదానికి వ్యతిరేకంగా మారింది. పూర్తి రాజరికానికి పూర్తి ప్రజాస్వామ్యానికి మధ్య ఎంపికచేసుకునేదేమీ లేదని రాయర్-కొలార్డ్ వాదించాడు. "పెత్తందారీ ప్రజాస్వామ్యం" కావాలని సమైక్య రాజ్య మేర్పడాలని ఇతడు పేర్కొన్నాడు. తిరోగమన వాదంతోకూడిన తాత్త్విక భావాలేగాక, సంప్రదాయ బద్ధంగా ఉన్న ఉదారవాదంలోని దోషాలు, పరస్పర విరుద్ధాలు అన్నింటినీ రాయర్-కొలార్డ్ ప్రవేశపెట్టాడు.

ఇతని ప్రభావం వల్ల, మరో ఉదారవాది (23) బెంజమిన్ కోన్‌స్టాన్, అకాడమీలో ప్రవేశం పొందలేకపోయాడు. వ్యక్తి స్వేచ్ఛకు పరిమితులు ఉండరాదని కోన్‌స్టాన్ తన ఉదారవాదాన్ని చెబుతూ తార్కికంగా అరాచక వాదానికి సన్నిహితుడయ్యాడు. వ్యక్తి హక్కులను పూర్తిగా దూరంచేయాలనే రూసో సిద్ధాంతాన్ని నిరాకరించిన కోన్‌స్టాన్ ఇట్లా వాదించాడు. "స్వేచ్ఛ అంటే వ్యక్తిత్వం జయించడమే. మూకలపై నిరంకుశపాలన చేసే పెత్తందారీ విధానంలో అల్పసంఖ్యాకులు అధిక సంఖ్యాకులను పరిపాలిస్తారు. మనిషిలో వ్యక్తిగా, స్వతంత్రంగా కొంతభాగం తప్పనిసరిగా ఉంటుంది. సమాజం ఈ హద్దును దాటినపుడే దోపిడీదారుగా మారుతుంది. అధిక సంఖ్యాకులు తిరుగుబాటు చేస్తారు.

పెత్తందారీతనం ఇటువంటి పనులు ఏ ఆదర్శంతో చేసినా, దానికి జాతి అని, వ్యక్తి అని ఏ పేరుపెట్టినా ఫలితమొక్కటే." అది ఉద్వేగవాదం. విద్యారంగంలో తిరుగుబాటుతత్త్వం ప్రబలి ఉండటాన్ని సహించరాదన్నారు. "వివేచన అనే నిరంకుశత్వానికి" వ్యతిరేకంగా జరిగిన తిరుగుబాటులో ఎంత తిరోగమన స్వభావమున్నదో స్పష్టపడుతూంది.

నాడు ఫ్రాన్సులో మదాం డ స్టాల్ చాలా విశిష్టమయిన వ్యక్తి. "స్త్రీ పురుషులు ఆనందాతిశయంలో మునిగి తేలడం, విచారసాగరంలో నిమగ్నులు కావడం, దుఃఖ సముద్రంలో కరిగిపోవడం నిరంతరం జరగాలని కోరుకొనే కాలానికి" అమె ప్రతిబింబం వంటిది. (ఎన్‌సైక్లో పీడియా బ్రిటానికా 13వ ప్రచురణ). ఆవిడ విశిష్ఠమయిన ఉద్వేగ వ్యక్తిత్వం గలది. (24) నెకర్ కుమార్తెగా (25) జిరాన్‌డిస్టులను సానుభూతితో చూడటమేగాక, 18వ శతాబ్దపు తాత్త్విక విప్లవం ఆశించిన సామాజిక మార్పుకు విరుద్ధంగా 1791లో సంఘటనలున్నాయని అభిప్రాయపడింది. నెపోలియన్ పతనానంతరం 1789లోని విప్లవ సంప్రదాయ వారసత్వం తెచ్చామనే అతివాద (26) మోంటానాలపట్ల ఆవిడ నిశితమయిన వైఖరి అవలంబించింది. రోయర్–కొలార్డ్ తిరోగమన వాదాన్ని, ఉద్వేగ వాదుల మధ్యయుగాల వాదాన్ని దృష్టిలో ఉంచుకుని మడాం డ స్టాల్ వ్యంగ్యంగా ఇట్లా వ్యాఖ్యానించింది. "మన పూర్వీకులలో ఏ తరానికి నిర్దోషిత్వాన్ని సంక్రమింపజేసారో తెలుసుకోవడం ఆసక్తికరంగా ఉంటుంది." అయినప్పటికీ సంస్కృతిలో విశ్వాసంగల ఈమె తన యౌవనంలో 18 వ శతాబ్దపు ప్రవర్తన అత్యంత ఉత్సాహంతో శ్లాఘించింది. 1788లో ఆమె ప్రచురించిన "లెటర్స్ ఆన్ రూసో" వల్ల ఆవిడ సాహిత్య ఖ్యాతి ఆరంభమయింది. పరిణతి చెందే కొలదీ అనుభవంవల్ల, యౌవనపు ఉత్సాహంకంటే హుందాగా ఆలోచించడం ప్రారంభించి, ఉదారవాదాన్ని కావాలన్నది. అయితే రూసో ఉద్వేగవాదంలో ఆవిర్భవించినందువల్ల తన గురువు ప్రభావం ఆమెపై పూర్తిగా పోలేదు. జర్మనీపై ఆవిడ రాసిన గ్రంథం ప్రఖ్యాతి వహించింది. సాహిత్య సృష్టిలో వన్నెకెక్కినది. ఆ గ్రంథంద్వారా జర్మన్ ఉద్వేగ వాదాన్ని విప్లవానంతర ఫ్రాన్సుకు తెలియపరచింది. ఆవిడకూడా జర్మన్ జాతీయ వాదాన్ని శ్లాఘించ నారంభించింది. 18వ శతాబ్దపు ఫ్రెంచి సంస్కృతిలోని వైజ్ఞానిక విశ్వజనీనత, మానవతాధోరణి, ఫ్రెంచి విప్లవపు రాజకీయ, సాంఘిక భావాలూ, ఆదర్శాలూ ప్రతిఘటించడమే జర్మనీ ఉద్వేగవాదపు సారాంశం. జర్మనీలో కూడా జనేచ్ఛవంటి మార్మికమయిన మొండి సూత్రం ఉంది. మడాం డ స్టాల్ ఈ భావాలను గ్రహించింది. స్వదేశంలో విఫలం అయినప్పటికీ రూసో ఉద్వేగ ధోరణి జర్మనీని ఆకర్షించింది. సాహిత్యంలో మణిపూసవంటి మడాం డ స్టాల్ పుస్తకం ఉద్వేగవాదం, ఉదారవాదం, జాతీయ వాదాలతో కూడిన అతుకులబొంత మాత్రమే. "ఉదార రాజకీయ ఆలోచనతో జాతీయవాదం పొత్తు కలవడం ఇక్కడే ప్రారంభమై చాలా ఫలితాలకు దారితీసింది." (జె. పి. మేయర్, పొలిటికల్ థాట్ ఇన్ ఫ్రాన్స్ ఫ్రమ్ సైజ్‌టు సోరెల్).

జోసఫ్ డ మెయిస్ట్ర్ 18వ శతాబ్దపు తాత్విక వాదానికి జీవితాంతం శత్రువేగాక, మానవుడి ఆచరణకు వివేచనగాని, ఇచ్ఛగాని ప్రాతిపదిక కాదన్నాడు. ఉద్రేకం, మనోభీష్టం, అనురాగాలు మాత్రమే ఆచరణకు పునాదులన్నాడు. (ESSAIS SUR LE PRINCIPE GENERATEUR DE CONSTITUTIONS POLITIQUES). అతని దృష్టిలో ప్రభుత్వాలు పరిమితులు లేని సంపూర్ణ అధికారాలు కలవిగానే ఉండాలి. రాజకీయధర్మాలలో విధేయతగా ఉండటం ప్రథమంగా భావించాడు. "సార్వభౌమత్వాలు ఉండకుండా ప్రభుత్వాలు ఉండవు. ఏ దోషమూ చేయదనే భావం లేకుండానూ సార్వభౌమత్వం ఉండదు. లోకంలో సార్వభౌమత్వానికీ ఈ ధోరణి చాలా అవసరం". (డి మెయిస్ట్ర్ DU PAPE). పోప్ సంపూర్ణాధికారం పునరుద్ధరించాలనీ లోకంలో పెత్తనం అంతా అతనికి లొంగి ఉండాలనీ వాదించాడు. "రాజాధికారాలు కుట్రపన్ని పోప్‌కు చెందిన చట్టసమ్మతమయిన హక్కులను కాదనడాన్ని" అతడు ఖండించాడు. అధికారం అంతా దైవాంశంతో కూడినదనీ, పోప్ అధికారం వ్యక్తిగత నిర్ణయాలకు మించినదనీ అభిప్రాయపడ్డాడు.

"అతివాద మోంటానిస్టులూ లేదా మతజ్ఞానవాదులూ వ్యక్తిగత నిర్ణయాన్ని ఖండించారు. పునర్వికాసానికీ సంస్కరణవాదానికీ పూర్వమున్న ప్రాతిపదికపై సమాజాన్ని కొత్తగా నిర్మించాలనీ పెత్తనాన్ని తిరిగి స్థాపించాలనీ కోరారు. (ఫ్లింట్, హిస్టరీ ఆఫ్ ది ఫిలాసఫీ ఆఫ్ హిస్టరీ).

డ మెయిస్ట్ర్ అభిప్రాయాల్లో అతని శిష్యుడు లూయీ డ బొనాల్డ్ చాలా సమర్థంగా మద్దతు ఇచ్చాడు. ఫ్యూడల్ వ్యవస్థను పునరుద్ధరించాలనే డ బొనాల్డ్ కుటుంబం, మతసంస్థ, రాజ్యం అన్యోన్యమయిన సంస్థలని ప్రకటించాడు. ఇవన్నీ దైవన్యాయంవల్ల నడుస్తాయన్నాడు. ఇవి విశ్వవ్యాప్తమనీ మారనివనీ పేర్కొన్నాడు. అందువల్ల ఈ నియమమే ప్రమాణంగా స్వీకరించాలన్నాడు. ఈ అభిప్రాయం ఉన్నవారు, కొత్తభావాలు ఎవరైనా అన్వేషిస్తుంటే సహించలేరు–హక్కుల ప్రకటనను డ బొనాల్డ్ తీవ్రంగా విమర్శించడమేగాక, సమానత్వం అనేది క్రమానికి విరుద్ధం అన్నాడు. "సార్వభౌమత్వం దైవంలో ఉన్నది. దైవంలోనుంచే అధికారం అంతా వస్తుంది. దైవేచ్ఛే నియమం." తిరోగమన భావాలను పేర్కొనడానికి కూడా వివేచననే డ బొనాల్డ్ ఆధారం చేసుకున్నాడు.

తాత్విక తిరోగమనం, విక్టర్ కజిన్ పేర్కొన్న మతవాదంలో పరాకాష్ఠనందుకున్నది. ఇంద్రియ జ్ఞానవాదం, ఆదర్శవాదం, సంశయవాదం, మార్మిక వాదాలలో అతడు ఒకే విధానంలో కలిపివేశాడు. రోయర్–కొలార్డ్ అసహనం, అతివాద మోంటానుల పిడివాదం మేధా సంబంధమయిన ఉన్మత్తతలో తాత్కాలిక దశలు మాత్రమే. ఐరోపా మానవాళి భావపరిణామంలో జ్ఞానవికాసం ఒక మచ్చుతునక. విప్లవంవల్ల జనించిన సామాజిక

రాజకీయ ఫలితాలను ఎట్లా తుడిచిపెట్టలేమో, అట్లాగే జ్ఞానవికాస ప్రభావాన్ని మట్టం చేయడం కూడా సాధ్యపడదు. జ్ఞానాభివృద్ధి జరుగుతుండగా 19 వ శతాబ్దపు తొలి దశాబ్దాలలో భౌతికవాదతత్త్వ ప్రతిపాదనల గురించి సందేహాలు బయలుదేరాయి. కొత్త జీవశక్తివాదులు జీవితాన్ని గురించి చెప్పడానికి నిర్జీవపదార్థం ఆధారం కాజాలదనీ జీవితం ప్రాథమిక విధానమనీ చెప్పారు. అనుమానాస్పదమయిన ఈ వైజ్ఞానిక పునాదిని ఆధారంగా చేసుకుని విప్లవానంతర ఉద్వేగవాదం ఒక సిద్ధాంతాన్ని రూపొందించింది. వ్యక్తి ప్రాథమిక సత్యం. అతనిలో ఉద్రేకం ప్రేరేపణ సత్యం. జీవితాన్ని వ్యక్తీకరించే విధానమే ఉద్రేకం. తెలివి, వివేచన మానవుడిని అయోమయ అవస్థలో పడవేశాడు. మిడిమిడి వైజ్ఞానిక మార్మికవాదం ఆధారంగా 19వ శతాబ్దంలో పూర్వార్థపు ఉద్వేగవాదులు మానవ ప్రపంచానికి విశ్వాసమేగాని, వివేచన ప్రాతిపదిక కాదన్నారు. విశ్వాసం అంటే ఆశ, ఆశను ఆచరించడమని నిర్వచించారు. మానవుడు తన ఆశలను విశ్వాసంద్వారా ఎట్లా నేర్చుకోగలడు? అది ప్రకృతిలో గర్భితంగా ఉన్నదన్నారు. వివేచన ఊహించవచ్చునేమోగాని, చిక్కులను విడదీయలేదన్నారు. మానవుడు తన విధికి తానే నిర్ణీత అనే సూత్రాన్ని ఉద్వేగవాదంలోని వ్యక్తిసూత్రం నిరాకరించింది. దీని తాత్త్విక ఫలితం ఏమంటే దైవంపై నమ్మకముంచి పోవడమేనన్నమాట.

నెపోలియన్ పతనానంతరం రాజకీయ అస్థిరత్వం, సామాజిక రక్షణ లేకపోవడంవలన మతపరమయిన ఆలోచన పెంపొందినది. "ఊహ, సంవేదన, హృదయం-భావన, అతిభౌతికం-మతం, బాగా నిలదొక్కుకుని ప్రతిదానిని సంవేదన కింద మార్చేపద్ధతులు వచ్చాయి" (ఫ్లింట్). కేథలిక్ ఉదారవాదం ప్రభావంలో సనాతనత్వాన్ని అధిగమించి మతం సాగిపోయే సూచనలు కనిపించాయి. ఊహలనూ, ఆశలనూ రెచ్చగొడుతూ సంకెళ్ళు సడలించడానికి ఉద్వేగపూరిత సాహిత్యం సహకరించింది. వ్యవస్థాపితమైన సమాజపు నీతిని ప్రశ్నిస్తూ వ్యక్తిత్వవాదాన్ని అది ప్రోత్సహించింది. విప్లవాత్మకమైన ఆదర్శవాదం నిలదొక్కుకుని సోషలిజానికి ఆరాధనాగీతం ఆలాపించింది. అన్వేషిని, ఆకలిగొన్నవారిని, ఏకాకులుగా ఉన్నవారిని తృప్తి పరచడానికి (27) కజిన్ తత్త్వం ప్రయత్నించింది. అయితే 18వ శతాబ్దానికి ఎదురుతిరిగిన తత్త్వంగా, సార్వ జనీనతను అట్టేకాలం అట్టిపెట్టలేకపోయింది. అన్నిటికీ సహనంచూపే ధోరణివల్ల అంతా మరుగున ఉంచినట్లయింది.

తుది కారణం అనే భావాన్ని కజిన్ తిరగదోడి అదే దైవంగా పేర్కొన్నాడు. దేవుడు మూలపదార్థమనీ, మూలపదార్థమే మూలకారణమనీ అతడు వాదించాడు. అయితే (27) స్పినోజా చెప్పిన ప్రకృతేదైవమనే వాదంతో కజిన్ అంగీకరించలేదు. అంతేగాక గ్రీకు తత్త్వవేత్తలయిన ఎలియాటిక్స్ పేర్కొన్న మూల ఐక్యతతో కజిన్ పేర్కొనే మూలపదార్థానికీ

కారణానికీ సంబంధం లేదుకూడా. అతడి దైవం మానవత్వారోపణతో కూడిన భావనే. సర్వాంతర్యామీ, సర్వజ్ఞుడూ, అన్నింటికీమించిన అలౌకికుడూ అనే దైవ భావనల వల్ల, భౌతిక ప్రపంచంలో మానవుడి అనుభవానికి ఏమీ మిగల్చలేదు.

రోయర్-కొలార్డ్, డి మెయిస్ట్ర్ చేసిన పాత వాదనలవల్ల మతం పునరుద్ధరణ కాలేదు. దీనికిగాను తత్త్వాన్ని అనుకూలంగా చేసుకోవలసి వచ్చింది. దైవ భావానికి వచ్చిన అపఖ్యాతి పోగొట్టి, మానవుడిని ఏమీలేని శూన్యంగా చేసిన ధోరణి కజిన్ తత్త్వంలో కనిపిస్తుంది. అయితే విజ్ఞాన ధోరణిగల తత్త్వంగా కనిపించే కజిన్ వాదనల వల్ల, తానే దైవంతో సమానమని భావించే నియంతకు దైవాంశసంభూత అధికారాన్ని ఇతడు ప్రసాదించి పెట్టాడు. చిరకాలంగా స్వేచ్ఛకై పోరాడో మానవుడు అది జీవసంబంధమయిన ప్రేరణ అని మరచిపోయి, తన ఆడంబరత్వానికి బలైపోయాడు. స్వేచ్ఛ అంటే భయపడే ధోరణి మానవుడిని వెంటాడింది. జీవసంబంధంగా వచ్చిన ప్రేరణకూ, ఆదిమ దశలోని మానవ మనస్తత్వంలో ఏర్పడిన ఉపరి నిర్మాణానికీ పరస్పర విభేదం రావడంతో, దీని ప్రభావం మానవ చరిత్ర అంతటిపై కనిపించింది. భావపరిణామంలో గతితార్కికతను కూడా ఈ ధోరణి వివరిస్తున్నది.

డ మెయిస్ట్ర్, డ బొనాల్డ్‌లకు అనేక సంవత్సరాలపాటు సన్నిహితుడుగా ఉన్న ఫెలిసిటి డ లామన ఉదార కేథలిక్ వాదాన్ని స్థాపించడానికి అతివాద మోంటానాలతో తెగతెంపులు చేసుకున్నాడు. 1589 లోని క్లిష్ట దశలో మత గురువులు పాత వ్యవస్థను వ్యతిరేకించి విప్లవంలో చేరినట్లే, ఇతడు కూడా ఆ సంప్రదాయాన్ని అనుసరించాడు. మతాధికారాన్ని అంగీకరించి మేధా సంబంధమయిన ప్రతిచర్యను, కేథలిక్ మతం విప్లవంతో చేతులు కలిపినపుడు, ఏకాకినిచేసింది. మతమే విప్లవాత్మకంగా తయారయింది. క్రైస్తవ మతం, ఉదార కేథలిక్ మతం విప్లవాత్మక మతమయింది.

మతం యుగాలుగా వస్తున్న మానసిక అలవాటు. హఠాత్తుగా దానిని వదిలివేయడం కష్టం. నైతిక విలువలూ, సాంస్కృతిక విలువలూ సంప్రదాయానుసారంగా మతంతోజోడించి చూస్తున్నాయి. మతేతరంగా వాటికిగల ప్రమాణాన్ని గురించిన సందేహాలు తొలగించడానికి వ్యవధి అవసరం. ఈలోగా సాంస్కృతిక గందరగోళం, నైతిక శూన్యవాదం వస్తాయనే భయంవల్ల చిరకాలంగా ఉన్న మతంతో తెగతెంపులు చేసుకోవడానికి ఇష్టపడక పోవడం సహజం. ఈ సంధికాలం తప్పనిసరి. అప్పుడే విశ్వాసం క్రమంగా కుదురుకుంటుంది. మతం అమాయకమయిన అసూయగా మారుతుంది. అందులో ఆలోచనతో కూడిన నమ్మకమేదీ లేదు. 18 వ శతాబ్దంలోని సహజమతం ఈ ధోరణికి చెందినదే. అయితే అది మేధాసంబంధమయినదీ ఉద్వేగ పూరితమయినదీ కూడా. కవులకూ ఆచార్యులకూ అది సరిపడింది. సంధిదశలో సాధారణ మానవులు మతపరమయిన భద్రతనూ ఓదార్పునూ

కోరుకున్నారు. విప్లవం ప్రగాఢంగా ఉండాలంటే మతాన్నికూడా ప్రజాస్వామికీకరణ చేయాలి.

క్రైస్తవమతం లేదా ఉదార కేథలిక్‌మతం ఫ్రెంచి విప్లవకాలంలో సామాన్యుల ఆత్మను స్పందింపజేసింది. అతడికి మార్గదర్శకంగా మతం కావాల్సివచ్చింది. అప్పుడే మతంకూడా ప్రజాస్వామ్య వ్యవస్థగా మారవలసి వచ్చింది. ప్రజల విశ్వాసానికి సంరక్షకులుగా ఉండదలచుకుంటే పోప్‌ను అతడి పరంపరానుగత అధికారాన్ని తోసిపుచ్చమని లామనా నాటి మతగురువులను ఉద్దేశించి చెప్పాడు. (PROGS ET REVOLUTION).

తొలి క్రైస్తవ నిబంధనలను పోలిన మతాన్ని, నైతిక ఉత్సాహంతోనూ, ప్రజాస్వామిక ఇచ్ఛతోనూ లామనా బోధించాడు. "దైవ న్యాయంముందు రాజ్యేచ్ఛకంటే జనేచ్ఛ ఎక్కువ. రాజులను సృష్టించేది ప్రజలే. ప్రజలకోసం రాజులుగాని, రాజులకోసం ప్రజలుకారు. దైవం తాను సృష్టించినవారిని సంకెళ్ళతో బంధించడానికి బానిసత్వంతో బాధించేదానికి అంగీకరించదు" (LAMENNAIS, PAROLES D' UN CRLOYANT).

"స్వేచ్ఛా నియమమే దైవన్యాయం" అనే సూత్రంపట్ల ప్రజాదరణ గమనించిన లామనా తన సాంఘికతత్త్వాన్ని కొత్త గ్రంథంద్వారా విపులీకరించాడు. "క్రైస్తవమతం చెప్పే సమాన హక్కులను రాజకీయ వ్యవస్థలో ప్రవేశపెట్టినవాడు, నీవుకోరే పునరుత్థానం జరుగుతుంది. ఈ కోరిక దైవాజ్ఞను అనుసరించి ఉంటుంది. భౌతిక – మేధస్సు– నైతిక అనే విడదీయరాని మూడు పద్ధతులద్వారా ఇవి సాధించడం జరుగుతుంది" (LIVRE DU PEUPLE). నైతిక విధానాన్ని గురించి దానికి అవరోధంగా నిలబడే దోషాలనుగురించి ఇతడి చిత్రణలవల్ల క్రైస్తవ సోషలిజం పితామహులలో ఒకడుగా స్థానం పొందాడు. (29) మాబ్లే, మోరెల్లె అడుగుజాడలలో ఇతడు పయనించాడు.

17 వ శతాబ్దాంతంలో భావస్వాప్నికుల ఉద్వేగధోరణి ఇతడిలో మళ్ళీ తలెత్తింది. దీనినే తరవాత ఎన్‌ఫాంటిన్, (30) సెయింట్ సైమన్, (31) ఫోరోలు స్వీకరించారు.

లామనాను మతబహిష్కరణ గావించాడు. అతడు మతాన్ని ఎదిరించి, పవిత్ర సూత్రాలనే వాటిని తిరస్కరించి ధీరుడుగా చనిపోయాడు. జ్ఞానాభివృద్ధి జరిగినపుడు మతానికి సంబంధించిన మనో విజ్ఞాన ప్రాతిపదికలు సడలిపోతాయనీ, అనుభవంవల్ల చారిత్రక ప్రమాణాలు ప్రశ్నించబడతాయనీ గుర్తించడంలో, మత ద్వేషానికి గురైన వ్యక్తిగా లామనా గుర్తింపు పొందుతాడు.

కేథలిక్ విశ్వాసంలో కొత్త భావం ప్రవేశపెట్టే ఉద్యమంలో, మతాన్ని రాజకీయాన్ని వేరుచేయాలనడంలో లామనాకు తోడుగా (32) ఏబలార్డ్, మోంటాలెంబర్ అనే వారు ఉన్నారు. రాజరికంలో ఎగువసభలో సభ్యుడుగా మోంటాలెంబర్ ఉన్నాడు. ప్రతిచర్య వాతావరణమున్న సందర్భంలో తరచు అతడు చేసిన గంభీరోపన్యాసాలకు మచ్చుతునకగా ఒకటి పేర్కొనవచ్చు."

కేథలిక్‌లు వారి శత్రువులతో సమానులుకారు. నవసమాజం, ప్రజల ఆధునిక జీవితం విప్లవ ఫలితంగా వచ్చాయి. కేథలిక్‌లు దానిని ఆమోదించలేదు. దానిపట్ల వారు భయం వ్యక్తంచేశారు. ఇంకా చాలామంది ప్రాచీన రాజ్యానికి చెందినవారే. అందులో పౌరుల సమానత్వం కానీ రాజకీయ స్వేచ్ఛ కానీ అంతరాత్మ స్వేచ్ఛ కానీ లేదు. అటువంటి ప్రాచీన రాజ్యం నశించింది. అది మళ్ళీ ఎక్కడా తలెత్తలేదు. ప్రజాస్వామ్యమనే నవసమాజం దాని సూత్రాలకు అనుగుణంగా విస్తరిస్తుంది. మత వ్యవస్థ భయం అపనమ్మకం లేకుండా విశాలమయిన ప్రజాస్వామ్యంలో సాహసించి ముందుకుపోవచ్చు. పాత వ్యవస్థలో విచారించడానికి గాని కొత్త వ్యవస్థను చూసి భయపడటానికిగానీ కేథలిక్ మతానికి అవసరంలేదు.

ఫ్రాన్సులో విప్లవానంతరం ఉద్వేగ ఉద్యమానికి నాయకుడుగా షాటోబ్రాన్ గుర్తింపు పొందాడు. అసలీ ఉద్యమం (33) విక్టర్ హ్యూగో తోనే పోయిందంటారు. ఈ ఉద్యమంలో మరో ప్రముఖుడు (34) లామర్టిన్. సాహిత్యపరమైన శైలిని మినహాయిస్తే వీరి ముగ్గురికీ సర్వసాధారణమయిందేమీ లేదు. విచక్షణారహితంగా ఇట్లాంటి వారినందరినీ కలవడంవల్ల జీవితంలో ఉద్వేగవాదాన్ని గురించి చాలా గందరగోళం ఏర్పడింది. 1770 నుంచీ 1815 వరకూ ఐరోపాలో పుట్టినవారికి సంబంధించిన ఉద్వేగవాదానికి షాటోబ్రాన్ ప్రతినిధి అనవచ్చు. 19 వ శతాబ్దపు పూర్వార్థంలో తత్త్వం, రాజనీతిజ్ఞత, కళలలో ప్రతిభాశాలురుగా ఉన్నవారికికూడా అతడు ప్రతినిధే. ఈ అభిప్రాయాన్ననుసరించి కేవలం రాజ్యాంగవాదులేగాక ఉదారవాదులలో మిత-పక్షంవారేగాక పూర్తిగా తిరోగమనవాదులుకూడా ఉద్వేగవాదుల కిందకు వస్తారు. హ్యూగో, లామర్టిన్, మదాం డ స్టీల్ ప్రమాణాలనుబట్టి చూస్తే షాటోబ్రాన్ ఉద్వేగవాది అనడం కష్టమే. లామనా వంటి క్రైస్తవమత సంస్కరణవాదికి ఈ ఖ్యాతి దక్కాలి. (35) మిష్‌లా తదితర సోషలిస్టు పితామహులు, సాహిత్యకారులు జీవితంలో ఉద్వేగవాదానికి వాస్తవ ప్రతినిధులుగా ఉన్నారు. సాహిత్యానికీ కళలకూ మాత్రమే పరిమితంచేసి చూడటంవల్ల ఉద్వేగవాదానికి ఈ దోషపూరిత భావన వచ్చింది. మానవ కార్యకలాపాలన్నింటిలో జీవితదృక్పథం వెల్లడవుతూంటుంది. ఏమైనా 19 వ శతాబ్దంలో కావాలనిగాని లేదా ఆలోచనారహితంగా ఆదర్శవాదంపట్ల వ్యక్తపరచిన ఉత్సాహహంవల్లగాని సాంస్కృతిక ప్రతిచర్యకు జోడించి ఉద్వేగవాదాన్ని చూశారు. ఒక దోషపూరితమైన కారణంకోసం అట్లాంటి ఆదర్శవాదానికి షాటోబ్రాన్ ప్రాతినిధ్యం వహించాడు. 18వ శతాబ్దానికి వ్యతిరేకంగా అతడు తిరుగుబాటుచేశాడు.

తక్కువస్థాయివాళ్ళ సంగతి అట్లాఉంచి, హ్యూగో-లామర్టిన్‌లు భవిష్యత్తులో సమానత్వమూ న్యాయమూ ఉండే వ్యవస్థపై తమదృష్టిని సారించాడు. ఇదంతాకూడాను

పతనంచెందిన పాతవ్యవస్థపై నిర్మించాల్సి ఉంటుంది. జ్ఞానవికాసంవల్ల మేధాసంబంధంగానూ నైతికంగానూ అపఖ్యాతిని పొందిన పాతవ్యవస్థ, రాజకీయంగానూ సామాజికంగానూ విప్లవాల కారణంగా కూలదోయబడింది. “18వ శతాబ్దంలో నిశితంగా పరిశీలించే తత్త్వవేత్త తాను నివసించే భవనాన్ని తానే కూలదోశాడు. కొత్తతరంవారు నిర్మాణం సాగించాలి లేదా నాశనం కావాలి. ఉద్వేగవాదం నిర్మాణాత్మకమైనది 18 వ శతాబ్దం హరించివేస్తుండగా ఉద్వేగవాదం పరిష్కరించేదిగా మారింది.” (Jecques Barzon, Romantisism and Modern Ego).

హ్యూగో, లామార్టిన్, మిషెలా తదితరులు ప్రాతినిధ్యం వహించిన సరైన ఉద్వేగవాదం సంప్రదాయబద్ధమైన వివేచనావాద పరిమితులను నిశితంగా పరిశీలించింది. ఉద్వేగవాదులు గతాన్ని శ్లాఘించుతూ, పాత వ్యవస్థ పోతుండటంచూసి దుఃఖించేబదులు ధైర్యంగా భవిష్యత్ కోసం చూశారు. మానవ ఉనికికి సంబంధించినట్టి సత్యమంతాకూడాను 18వ శతాబ్దిలోనే కనుగొనడం జరగలేదు. ప్రయత్నానికి నాంది పలికింది. అది కొనసాగించాలి. కొత్త జ్ఞానం, ఎక్కువ అనుభవాలవల్ల అనుకోని సమస్యలు వచ్చి మానవప్రయత్నాన్ని ఇంకా ఎక్కువ చేయవలసి వచ్చింది. మానవాళి 18 వ శతాబ్దంలోనే శాశ్వతంగా నివసించదు. ముందుకు సాగిపోతూ నూతన వ్యవస్థను నిర్మిస్తుంటే అవన్నీ కూడాను క్రమేణా దారిపక్కన విడిదిగృహాలవుతుంటాయి. పరిమితులను గుర్తించడం, అసంబద్ధతలు గ్రహించడమనేది 18 వ శతాబ్దంలో జరిగింది. ఇదంతా ఆ శతాబ్దంపై తిరుగుబాటు మాత్రం కాదు. పైకి కనబడే నీరు బురదగా ఉన్నంతమాత్రాన, ఉప్పెనను వెనుక్కు పంపించే ప్రయత్నం జరుగదు. షాటోబ్రాన్ మాత్రం ఉద్వేగసాహిత్యంతో ప్రతిక్రియకు సహకరించాడు.

తాత్త్వికంగా అతడు రూసో అనుచరుడు. ఆ విధంగా చూస్తే విప్లవానికి తిరుగులేని శత్రువు కావడానికి వీలులేదు. తన తొలి గ్రంథంద్వారా, (ESSAI HISTORIQUE, POLITIQUE MORAL SURLA REVOLUTION). రాజరికానికి విధేయతనూ విప్లవ భావాలనూ సమన్వయీకరించడానికి ప్రయత్నించాడు. మతానికి సంబంధించినంతవరకూ ఇతడు స్వేచ్ఛగా ఆలోచన చేశాడు. నెపోలియన్ కేథలిక్ మతాన్ని పునరుద్ధరించిన 1802 లో షాటోబ్రాన్ తన గ్రంథాన్ని ప్రచురించి (LA GENIE DU CHRISTIALISNE) హఠాత్తుగా సుప్రసిద్ధుడయ్యాడు. పాండిత్య ప్రమాణంగాచూస్తే పనికిరానిదైనప్పటికీ గ్రంథానికి చాలా అనుకూలమయిన మానసిక వాతావరణమేర్పడింది. విప్లవాన్ని తెచ్చిన తాత్త్వికుల సాహసభావాలు, ఆకర్షణతో కూడినట్టి ఆదర్శాలు భూమి పైకి స్వర్గాన్ని తేలేవు. నిరంకుశత్వం బీదరికం అట్లాగే ఉన్నాయి. నిస్పృహ సర్వసాధారణంగా ఉంది. అటువంటి మానసిక పరిస్థితులలో సామాన్యుడు మతంలో భద్రతను ఓదార్పును కాంక్షించాడు. కొత్తగా

ప్రచురించిన పుస్తకం సాహిత్యంలో మణిపూసగా గుర్తింపు తెచ్చుకొంది. నిస్పృహతో కలవరపడుతూన్న ఫ్రెంచి స్త్రీ పురుషులు ఈ గ్రంథాన్ని చదివారు. "మతాలన్నింటిలో క్రైస్తవమతం కవితతోనూ మానవతతోనూ స్వేచ్ఛ, సాహిత్యం, కళలకు ఆస్కారం ఇస్తున్నది. ఆధునికలోకం ఆ మతానికే అన్ని విషయాల్లోనూ రుణపడి ఉన్నది. దీని బోధనలకుమించిన దైవత్వం లేదు. ఇందలి సూత్రాలు, సిద్ధాంతాలు ఆచారాలనుమించి హుందాతనం కలదీ, ప్రేమపూరితమయినదీ లేదు. ప్రతిభావంతుల్ని ఇది ఆదరిస్తుంది. ఇంద్రియాలను పావనం చేస్తుంది. పవిత్రమయిన ఉద్వేగాలను పెంపొందిస్తుంది. ఆలోచనకు జీవశక్తినిస్తుంది. రచయితకు ఉన్నతశైలినిస్తుంది. కళాకారునికి సంపూర్ణరూపాన్నందిస్తుంది.

ఉగ్రూతలూగించే ఈ శైలి రూసోను జ్ఞప్తికితెస్తోంది. ఇందలి రామణీయకానికి ముగ్ధులైన పాఠకులకు, భావాలు సైతం రూసోకు సన్నిహితంగానే కనిపించడం సహజం. ప్రాచీన సంప్రదాయాలను ఎలుగెత్తి చాటిన కొత్త ప్రవక్తవల్ల ఫ్రెంచి స్త్రీ పురుషులు ప్రభావితం అయ్యారు. వారే ఫ్రెంచి భావోద్రేకాలకు చాలా విధేయులుగానూ ఉన్నారు. అయితే 18 వ శతాబ్దానికి వ్యతిరేకంగా తిరుగుబాటు చేయవలసిందిగా వారిని పురికొల్పుతున్నట్లు గ్రహించలేదు. ఫలితంగా షాటోబ్రాన్ గ్రంథం, LA GENIE DU CHIRISTANISME, పాస్కల్ గ్రంథం PENSES కంటే ఫ్రెంచి మనస్తత్వాన్ని ఎక్కువగా ప్రభావితం చేసిందని అర్హులైన సాహిత్య చరిత్రకారులు అభిప్రాయపడుతున్నారు. (VICTOR GIRAUD, LE CHRISTIA NISNE DE CHATEAUBRIAND). ఏమైనా సంవేదనకు ఎక్కువగా ఈ గ్రంథం విజ్ఞప్తిచేసిందని పేర్కొనడం సబబుగా ఉంటుంది. షాటోబ్రాన్ తన రేనే (RENE) గ్రంథంద్వారా రూసో ఉద్వేగవాదాన్ని సంపూర్ణంగా వ్యక్తీకరించాడు. అతని సాహిత్య రచనలలో అది విశిష్టమయినది. అందులో రుగ్మతతో ఉన్న ఆత్మ ఎట్లా క్షోభిస్తున్నదో చాలా వివరంగా, రూసో రాశిన కన్‌ఫెషన్స్ (CONFESSIONS) అనే గ్రంథం నమూనాలో చిత్రీకరించారు. షాటోబ్రాన్ ఊహించిన క్రైస్తవమతానికి విధేయులుగా ఉన్నవారి క్షోభ ఈ గ్రంథంలో స్పష్టంగా కనిపిస్తున్నది.

రాజకీయ ప్రవక్తగా ఇతని కీర్తి నెపోలియన్‌కు వ్యతిరేకంగా రాశినచిన్న పుస్తకం వల్ల వ్యాపించింది. ఆ పుస్తకం పారిస్‌లో శుత్రుసైనికులు ప్రవేశించిననాడే అనుకోకుండా ప్రచురితమయింది. (DE BONAPARTE, DES BOURBONS ET DE LA LECESSITE DE SE RALLIER A NOS PRINCES LE GITIMES). ఈ రచనలో ప్రాచీన సామ్రాజ్యాన్ని పునరుద్ధరించాలనీ, అదే చట్టబద్ధమయిందనీ, రాజరికంపై విశ్వాసంతో అతడు రాశాడు. నెపోలియన్ కేథలిక్ మతాన్ని తిరిగి స్థాపించడానికి LA GENIE DU CHISTIANISME అనే గ్రంథమెట్లా ఉపయోగపడిందో, అట్లాగే ఈ గ్రంథంకూడా రాజరికం మళ్ళీ రావడానికి సహాయపడింది. అందువల్ల, లక్షమంది సైనికుల పెట్టు ఈ గ్రంథం ఒక్కటేనని 18 వ లూయీ వ్యాఖ్యానించాడట.

శైలి వల్ల చలించిపోయే ప్రజలు కొందరు ఫ్రాన్సులో ఉండటం షాటో్బ్రాన్‌కు మంచి అవకాశాన్ని ఇచ్చింది. ఇతనికి కృతజ్ఞతగా రాజు, షాటో్బ్రాన్‌కు విదేశాంగ మంత్రి పదవిని ఇచ్చాడు. అయినప్పటికీ నిరాశా నిస్పృహలతోనే అతడు జీవితాన్ని చాలించాడు. సాహిత్యంలో అతడికి అర్హస్థానం లభించింది. కానీ తిరోగమన ఉద్వేగవాద ప్రవక్తగా అతడు విఫలంపొందాడు. నిర్హేతుకవాదం, అంతర్బుద్ధి, ఊహ, అభూతకల్పన అనే వాటిని వివేచనాయుతమయిన ఆలోచనకు ప్రత్యక్షజ్ఞానానికి విరుద్ధంగా ప్రయోగించబోయాడు. అతని రచనలలో సాహిత్యపరమైన మేథస్సు కనిపిస్తుండగా ఇతడు రాసిన MEMORIES లో ఆడంబరత్వం, నిస్పృహ కనిపిస్తుంది. ఐరోపాలోని మధ్యయుగ విధానాలు అస్తమిస్తున్నందుకు ఎంతో చింతించి, ప్రజాస్వామ్య నూతన శక్తులూ, రిపబ్లికన్ వాదమూ తప్పనిసరి అని గ్రహించాడు. అయినప్పటికీ ముంచుకు వస్తున్న ప్రజాస్వామ్య యుగాన్ని అతడు హెచ్చరిస్తూ "ఆస్తి వంశపారంపర్యమనీ, అన్యాక్రాంతం చేయరాదనీ, ఆస్తి అంటే స్వేచ్ఛ" అని అన్నాడు. "కేవల సమానత్వం పూర్తిగా లొంగిపోవడమేననీ, అది బానిసత్వాన్ని సృష్టిస్తుంద"నీ అభిప్రాయపడ్డాడు.

దోషబద్ధమయిన ఇట్లాంటి ప్రజాస్వామ్యం అనుసరిస్తున్న పాపపు విధానాలకు ప్రత్యామ్నాయమేమిటి? "క్రైస్తవ మతంలో, అందులోనూ కేథలిక్ మతంలోనే భవిష్యత్తు ఉన్నది" ఇటువంటి అభిప్రాయాలతో తిరోగమన ఉద్వేగవాది అస్తమించాడు. అయితే జ్ఞానవికాసాన్నీ, విప్లవవాదాన్నీ చవిచూసిన ఫ్రాన్సు ఇతడిని అనుసరించలేదు. కానీ అతనికి అర్హమయిన గౌరవాన్ని మాత్రం ఇచ్చింది. 20 వ శతాబ్దపు ఫ్రాన్సులో సహితం ఛార్లెస్ మోరస్‌ను చదువుతున్నారంటే రాగద్వేషాలు అంత త్వరగా సమసిపోవని స్పష్టపడుతున్నది. ఏ ప్రయోజనం కోసం రాసినప్పటికీ ఉత్తమ సాహిత్యాన్ని అభినందించే సంప్రదాయం ఉందని, వివేచనాయుగంలో సంప్రదాయ సంస్కృతికి సంబంధించిన విధానాలు తెలుపుతున్నవి.

లేమనా ప్రారంభించిన ఉద్వేగవాదాన్ని లామర్టిన్ ఇంకా ఎలుగెత్తిచాటాడు. షాటో్బ్రాన్‌వలె ఇతడు కూడాసాహిత్యంలో ఖ్యాతిపొందాడు. ఇతడు రాసిన HORMONIES గ్రంథం విక్టర్‌హ్యూగో LEGENDES DES SIECLES గ్రంథంతోనూ, షాటో్బ్రాన్ రాసిన LA GENIE DU CHRISTIANISME తోను సమానహెదా పొందినది. ఫ్రెంచి ఉద్వేగ సాహిత్యంలో ఈ మూడు గ్రంథాలూ ఉన్నతస్థానాన్ని అలంకరించాయి. లామర్టిన్ కవితలో ఉద్వేగవాదం మానవుడి ఔన్నత్యాన్ని శ్లాఘించడానికి ప్రతీకగా ఉన్నది. రాజరికం పతనంకావడంతో విప్లవతత్త్వంపై మేధావుల తిరుగుబాటు కూడా సద్దుమణిగింది. మళ్ళీ విప్లవాత్మక భావవాదం తలెత్తింది. మేధస్సు, గౌరవం, విద్యార్హతలకు మన్నన రావాలంటే భయంకర పరిపాలనకు కారణాలను 18 వ శతాబ్దంలో వైజ్ఞానిక సహజవాదం, వివేచనాత్మక

సంప్రదాయవాదంలో, చూసేపద్ధతులు క్రమంగా తగ్గిపోవాలి. ఈ దిగ్భ్రమం నుంచి తేరుకోవడానికి ఫ్రాన్సుకు అనేక దశాబ్దాలు పట్టింది. దీనివల్ల ఐరోపా అంతాకూడా ప్రకంపించింది. నిరాశకు సంబంధించిన ఆ కాలం తత్ఫలితంగా ఉక్కిరిబిక్కిరి అయిన ఉద్రేక స్థితినుంచి తట్టుకుని మళ్ళీ మేధస్సుకు సంబంధించిన సమస్థితి ఏర్పడింది. జరిగిన సంఘటనలను నిష్పాక్షికంగా సింహావలోకనంచేసి వాటి ప్రాధాన్యాలకు చారిత్రకంగానూ రాగద్వేషాతీతంగానూ పరిశీలించే సమయం ఆసన్నమయింది. (36) థైర్, (37) మిగ్నెట్‌వంటి చరిత్రకారులు జాకోబిన్ పరిపాలనను హింసాత్మకంగా క్రూరమయినదిగా రక్తపాతంతో కూడినదిగా చిత్రీకరించలేదు. కేవలం చారిత్రకంగా ప్రారంభించిన రీతులను మిషెలా నైపుణ్యంగా రాయగా, లూయిబ్లాంక్ వంటివారు ఈ ధోరణిని సమర్ధించారు. విప్లవానికి సంబంధించిన పునరుద్ధరణ చరిత్రను లామర్టిన్ నాటకీకరించాడు. సత్యాన్ని రాయాలనే దృష్టితో అనవసరమయిన హింసాచర్యలను, అతిపోకడలను నిరాకరించడంగానీ, అసలే చెప్పకుండా వదిలివేయడం జరుగలేదు. అయితే లామర్టిన్ ఉద్వేగపూరితంగా వీటన్నింటిని కావాలని చేసిన నేరాలుగాక, అదుపులో పెట్టలేని విధి చర్యలుగా పేర్కొన్నాడు. విప్లవాన్ని ఇతడు చిత్రీకరిస్తూ నియంతృత్వ పాలకులపై విజృంభించిన ఆధునిక పెర్క్యులిస్‌వలె, మానవాళినంతా ఆవరించే విజయంగా పేర్కొన్నాడు. ఇతని సుప్రసిద్ధకవిత, JOCELYL విశ్వజనీన మానవతావాదానికి స్తోత్రపాఠంగా చెప్పవచ్చు. 1848 విప్లవం వల్లనే ఇటువంటి వాదం స్థాపించడానికి వీలుంటుంది. ఇతడు చరిత్రను కవితా ధోరణిలో రాశాడు. వాస్తవాలను సంఘటనలను నిశితంగా విశ్లేషించక అత్యుత్తమ ఉత్సాహంతో రాస్తాడు. "విప్లవ జ్వాలలు ప్రతిచోటా ప్రజ్వరిల్లుతున్నాయని అంటున్నారు. దీనివల్ల రానున్న విప్లవాల అనుభవం ప్రజలకు లభిస్తుంది. దైవేచ్ఛ అట్లా ఉండుగాక." (L 'HISTO' RE DES GIRONDINS) ఈ గ్రంథం ఉద్వేగ వాదంతోనే ముగిసింది. "దైవం ఇటువంటి భావనను ఆలోచించడంలో అవకాశంను కల్పించిన జాతికి మనం చెంది ఉండటం గర్వకారణం. మానవుడి ఆలోచనపై ఇటువంటి భావాల ఉద్యమాన్ని చూపుతున్న యుగంలో మనం ఉండటం అదృష్టం. ఫ్రాన్సు వివేచనకూ, విధికీ, ఆత్మకూ, రక్తానికీ ఔన్నత్యం కలగాలి. ఒక జాతి రక్తం శాశ్వత సత్యాలనుంచి ప్రవహిస్తున్నపుడు చింతించాల్సిందేమీ లేదు. భావాలు మానవ రక్తంలోనుంచి జనిస్తాయి. విప్లవాలు ఉరిపీఠంనుంచి వస్తాయి. భవిష్యత్తుకోసం ప్రాణాలర్పించిన అమరజీవులవలనా, మానవాళి శ్రమవలనా ప్రతి మతానికీ దివ్యత్వం చేకూరుతుంది."

రెండో రిపబ్లిక్ ఆవిర్భవించడానికి తన వాగ్ధోరణి, శక్తివంతమైన కవితను ప్రయోగించిన లామర్టిన్ ఇట్లా అన్నాడు. "కొత్త రిపబ్లిక్ స్థాపించబడింది. ఇది పవిత్రమైనదీ, శాశ్వతమైనదీ, ప్రజాదరణ పొందినదీ, పౌరలౌకికమయినదీ, ప్రయోజనాత్మకమైనదీ, ఘనత వహించినట్టిది కూడా." రెండో రిపబ్లిక్ విదేశాంగ మంత్రిగా ఐరోపా రాజ్యాలకు

అతడొక ప్రణాళికను ఇచ్చాడు. చిరస్మరణీయమైన ఈ పత్రంవల్ల ఉద్వేగవాది ఊహతోనూ, గాఢమైనట్టి భావనలతోనూ, ఉద్రేకాలతోనూ, న్యాయం–ధర్మం పాటించే నమ్మకంతోనూ ఉంటూనే వివేచనారహిత తిరోగమనవాది కానక్కరలేదని నిరూపించాడు." ఫ్రెంచి రిపబ్లిక్‌కు యుద్ధం ఒక ప్రాతిపదిక కాదు. అయినప్పటికీ భవిష్యత్తులో 1792లో యుద్ధం తప్పనిసరైంది. 1792 నుంచి 1848 వరకు అర్ధ శతాబ్దం ఉన్నది. 50 సంవత్సరాల అనంతరం 1792 లోని సూత్రాలకు పోవడం, లేదా ఐరోపాను జయించే సూత్రాలను గురించి ఆలోచించడం తిరోగమనమేగాని పురోగమనం కాదు. గతంలోని విప్లవం అభ్యుదయమే గాని వెనుకంజ కాదు. ప్రపంచం, మనం సౌభ్రాత్రంతోనూ శాంతితోనూ ముందుకు పోవాలని అభిలషిస్తున్నాం."

అందరిలోకి పిన్నమనస్కుడూ, చిన్నవాడైనప్పటికీ విక్టర్ హ్యూగో 19 వ శతాబ్దపు ఫ్రెంచి ఉద్వేగవాదులలో మహోన్నతుడు, సాహిత్యవేత్తగా, కవిగా, నవలాకారుడుగా, నాటకకర్తగా పేరొందినప్పటికీ, ఉద్వేగవాదపు ఊహాలోకంలో, మధ్యయుగాలకు చెందిన క్రైస్తవ స్వర్ణయుగాలను కలలుగంటూ ఇతడు కాలంగడపలేదు. కవిత్వపు ఊహలనుంచి గతానికీ భవిష్యత్‌కూ చెందిన ఆదర్శ వ్యక్తిని ఊహించలేదు. జీవిత వాస్తవాలలోకి అతని కవితా మేధస్సు తొంగిచూసిన మానవుడి లోటుపాట్లు, ఆనందాలు, ఆశలు ఇతడు అవగాహన చేసుకున్నాడు. ఉద్వేగవాదులలో విక్టర్‌హ్యూగో చివరివాడైతే వాస్తవ వాదులలో ప్రథముడు కూడా. ఆ పాత్రలో అతడు అత్యున్నత స్థానాన్ని అలంకరించాడు. ఉద్వేగ సాహిత్యంలో అతడు పరాకాష్ఠను అందుకున్నాడు. అంతర్బుద్ధి, ఊహ, తృష్ణ స్థానే విశ్లేషణశక్తీ, వివేచనతోకూడిన అవగాహనా, హేతుబద్ధమైన ఇచ్ఛా ప్రవేశపెట్టాడు.

విప్లవంలోని తొలి జ్వాలలు వీచిన అనంతరం విక్టర్ హ్యూగో జన్మించాడు. ప్రపంచాన్నే ఉగ్రరూతలూగించిన విప్లవ సంఘటనలపట్ల అతడికి అనుకూల వ్యతిరేక భావాలుండేవి. తల్లిదండ్రులవల్ల కేథలిక్‌గానూ, రాజరికాన్ని ఇష్టపడిన వాడుగానూ పెరిగాడు. ఆ భావాలతోనే తొలి కవిత అల్లాడు. రెండో రిపబ్లిక్ వచ్చేవరకూ అతడికి స్పష్టమైన రాజకీయభావాలు లేవు. యౌవనంలో సంక్రమించిన రాజ్యవిధేయత క్రమంగా తగ్గిపోగా అనూహ్యమైన సాహిత్యఖ్యాతి అతడి జీవితాన్ని దిగ్భ్రమంతో ముంచెత్తింది. 1848లో ఆకర్షణీయంగానూ, అధికారికంగానూ ప్రజాస్వామ్యంకోసం హ్యూగో నిలబడ్డాడు. రెండో రిపబ్లిక్‌లోని శాసన సభలో సభ్యుడుగా, సాంఘిక అన్యాయాన్ని ఖండిస్తూ సంస్కరణలు కావాలని ఉపన్యాసాలు చేశాడు. కేవలం కళకు సంబంధించిన వాతావరణంలోనే నివసించక, జీవిత వాస్తవాలకు సంబంధించిన వికారాలను అంటీఅంటనట్లు చూడకుండా ఈ భావకవి మనుగడ సాగించాడు. తాను నివసిస్తున్న సామాజిక పరిసరాలలోని వాస్తవాలను గమనించుతూ, ప్రజల బాధలనూ దుఃఖాలనూ సానుభూతితో చూస్తూ తోటివారి ఆనందాలనూ ఆశలనూ పంచుకుంటూ హ్యూగో నివసించాడు.

సోషలిజం అమలులోకి రాకముందే ఒక రాజకీయ విధానంగామారి ప్రజాస్వామ్యాన్ని చిన్నచూపు చూడటం, దానిపట్ల అపనమ్మకం వెల్లడించడం జరిగింది. ఈ సమస్యపై హ్యూగో చాలా హుందాగా మాట్లాడాడు. ఉద్వేగవాదికి అట్లా మాట్లాడటం సహజమైన విషయమేమీకాదు. అతడు సంశయాన్ని వెల్లడించినప్పటికీ తిరోగమనవాది మాత్రం కాదు. అగ్నిజ్వాలలు కురిపించే విప్లవవాది కూడా కాదు. "సోషలిజంలో దుఃఖపూరితమైన వాస్తవాలు ఆనాడున్నాయని అవి అన్ని కాలాలలోనూ ఉంటాయని" అన్నాడు. LES MISERABLES, CHATINELT వంటి గ్రంథాలు రాసిన రచయిత కాకుంటే ఈ విషయాలు ఇంతకంటే బాగా మరెవరికి తెలుస్తాయి? సమాజంలో అన్యాయానికి గురైన వారిపట్ల ప్రగాఢమయిన సానుభూతి ఇంకెవరికి ఉంటుంది? అయినప్పటికీ ఉద్వేగవాది అయిన హ్యూగో కలలుకనేవాడుకాడు. పేదవారంతా దేవతలని, అవకాశం లభిస్తే భూమిపై ఇట్టే స్వర్గాన్ని నిర్మిస్తారని నమ్మేటంత అమాయకుడు కాడతడు. హ్యూగో హేతువాది. పేదల ఆశలపట్ల సంపూర్ణ సానుభూతిని వ్యక్తపరుస్తున్నా సోషలిస్టు ఆశావాదులను అతడు హెచ్చరించాడు. "జీవితాన్ని మెరుగుపరచుకోవాలని మానవుడు భావించడం అసహజంకాదు. కానీ తరచుగా తప్పుదోవన పోవడం మరోచోట ఒరగబెట్టాలను కోవడం కద్దు." మరోప్రపంచాన్ని గురించి ప్రస్తావించడం ఆనవాయితీ అయింది. హఠాత్తుగా ప్రపంచాన్ని మార్చేయగలమనే ధోరణిని హ్యూగో నిరసించాడు. "ఈ ధోరణిని మన విప్లవాలు ప్రేరేపిస్తున్నాయి. మానవ గౌరవాన్ని ఉన్నతస్థాయిలో అట్టిపెట్టాలని, ప్రజల సార్వభౌమాధికారానికి విలువ ఇవ్వాలని ఉద్ఘాటిస్తున్నవి. కానీ సామాన్యుడు తన దీనావస్థను గురించి చాలా బాధపడుతూ పరస్పర విరుద్ధభావాలతో ఉన్నాడు." ఇది స్వీయపరిశీలన కూడా. కవిత్వంలోనూ, నాటకీకరణలోనూ మహోన్నతుడైన వ్యక్తి మనోవిజ్ఞానికూడా అయి ఉండాలి. కనుకనే అతడు తన అనుభవాన్ని దృష్టిలో పెట్టుకుని అందరికీ వర్తింపజేశాడు. అతడు చెప్పింది సత్యమని సామాన్య ప్రజల చరిత్ర చాటడం లేదా? సామాన్యుల భావాలకు బలి అయినటువంటి ప్రజానాయకులు ఎందరున్నారు? విప్లవం తన బిడ్డలనే హరించి వేస్తుంది. విప్లవం దానిని సృష్టించిన వారినే కబళించిన పితృహత్యా దోషి కూడా. మానవుడి గర్భిత వివేచనలోనూ, తత్ఫలితంగా న్యాయంలోనూ విశ్వాసంగల ఈ మానవతాకవి, మూర్ఖవాదంనుంచి మార్గాంతరాన్ని కనుగొనడానికికూడా సామాన్య ప్రజలను ప్రతిబింబించేవాడిగా ప్రయత్నించాడు. "అరాచకానికి వ్యతిరేకంగా చట్టాలు చేశారు. ఇప్పుడు దారుణ పరిస్థితులకు వ్యతిరేకంగా చట్టాలు చేయాలి!"

LES LEGENDES DES SIECLES అనే గ్రంథం ఆ శతాబ్దంలోనే మహోన్నతమైనదిగా, ఉద్వేగ సాహిత్యంలో పరాకాష్ఠగా గుర్తింపు పొందినది. మానవ చరిత్రను, భవిష్యత్‌లో రానున్న మానవజాతిని కవిత్వపు ఊహలలో స్పష్టంగా కనుగొనడం

ఇందులో చూడవచ్చు. మానవాళి మాతృమూర్తి ఈవ్ (EVE) ఈడెన్ ఉద్యానవనంలోకన్న స్వప్నాలలో మానవాళి ప్రతిభను ఎట్లా విప్పారతాయో ఇందులో చూడవచ్చు. కేవల ధర్మం ఈ నరకంలో జీవం పోసుకున్నది. సమానత్వాన్ని సాధించడం ఇందలి చరమాంకంగా ఉంటుంది.

L' HOMME UUI RITలో సరైన ఉద్వేగభావం గమనించవచ్చు. మానవుడి వీరోచిత ధోరణి ఇందలి ఇతివృత్తం. విధి అనూహ్యంగానూ, అతిమానవ నిరంకుశత్వం గుడ్డిగానూ ఉండగా దానితో తలపడి, అధిగమించి, జయించిన సంఘటన ఇక్కడ గమనించవచ్చు. కానీ విచ్ఛిన్నమై అదృశ్యంగావడం మాత్రం జరగదు. (ACTES ET PAROLES) లో మానవుడి "అంతఃకరణ–తెలివి" కి హ్యూగో విజ్ఞప్తి చేస్తాడు. వివేచనా రాహిత్యతకూ గుడ్డి ధోరణికి మాత్రమే ఉద్వేగవాదంలో చోటు ఉన్నదనే సంప్రదాయ భావనను ఇతడు సరైనదికాదని నిరూపించాడు. వంశపారంపర్యంగా సంక్రమించిన కేథలిక్ మతాన్ని అధిగమించినప్పటికీ హ్యూగో మతరహితుడు కాలేదు. మానవతావాదంతో పొందికగా ఉండే మతంకోసం అన్వేషించాడు. RELIGION ET RELIGON లో పవిత్రమైన విశ్వాసంకోసం ఆక్రందించాడు. దైవభావాన్ని హీనపరచిన ఆచారాలను మూఢ నమ్మకాలను సరైనవికావని అభ్యంతరం పెట్టాడు. జీవితం చరమదశలో హ్యూగో LE PAPE రాసి, క్రైస్తవమత ధోరణికి వ్యతిరేకంగా క్రీస్తువచ్చి వ్యక్తం చేయడం కనిపిస్తుంది. తనను తాను నియమించుకున్న పోప్‌ను ఆదర్శప్రాయుడైన ఏ క్రైస్తవుడైనా వ్యతిరేకిస్తాడని చూపాడు. L' ALE లో విశ్వాసాన్ని అంగీకరించడం కనిపిస్తుంది. గతంలో విజ్ఞుల అజ్ఞానంలోని దోషాలను వెక్కిరించాడు. అంటే మధ్యయుగాల్లోని మతపాండిత్య వాదులను ఉద్దేశించాడన్నమాట. భవిష్యత్తులో మానవుడి జ్ఞాన వికాసం వల్ల, స్వేచ్ఛతోకూడిన వివేచనను ప్రకటించి అందులో విశ్వాసాన్ని వెల్లడించాడు.

CHATIMENT, LES MISERABLES, NOTRE DALE వంటి హ్యూగో నవలలు కవిత్వ ధోరణిలో ఆకర్షణీయంగా చిత్రించిన సమాజశాస్త్రాలే. మానవుడి స్థితిగతులూ, అతడి గతమూ, వర్తమానమూ, భవిష్యత్తూ, అతడి అనుభవాలు, ఆశలూ, ధర్మాలూ, దోషాలూ, సాధించినవీ, సాధించగలవీ, మానవుడి బలహీనతలూ ఇవన్నీ హ్యూగో రచనలలో ఇతివృత్తాలుగా, సిద్ధహస్తుడైన అతని రచనలో చోటుచేసుకుని శాశ్వత కళాఖండాలుగా రూపొందాయి. హ్యూగో మానవతావాది. అతడివలన ఉద్వేగవాదం మళ్ళీ జీవంపోసుకుంది.

మిషెలావల్ల ఉద్వేగవాదంలోని మానవతా దృక్పథం ఎంతో హుందాగా వెల్లడయింది. చరిత్రకారులలో మహోన్నతుడైనప్పటికీ 19 వ శతాబ్దపు ఉద్వేగవాద సాహితీకారులకోవకు చెందినవారిలో అతడులేడు. చరిత్రను చిత్రీకరించడానికి సాహిత్యాన్ని

సాధనగా మిషెలా వాడుకొన్నాడు. సంఘటనల జాబితాగాక, యుగాలుగా మానవుడి స్వేచ్ఛా పోరాటాన్ని అతడు చరిత్రగా మలిచాడు. ఆ విధంగా రాసిన చరిత్ర సాహిత్యంలో భాగమై ఇదంతా మానవుడి సృష్టి అని రుజువవుతున్నది. మిషెలా ఉద్వేగవాదంలో చోటుచేసుకున్న మానవతావాదంతో వికో రాసిన 'న్యూసైన్స్' అనే గ్రంథం కూడా కళగా మారింది. ఈ ధోరణికి జర్మనీ ఉద్వేగవాద పితామహుడు చాలా తోడ్పడ్డాడు. మిషెలాద్వారా జర్మనీ ఉద్వేగవాద ఉద్యమవాద ఉద్యమప్రభావాన్ని, విప్లవానంతర ఫ్రెంచి ఉద్వేగవాదం చవిచూసింది.

మిషెలా ప్రజల మనిషి. విప్లవం వల్ల ప్రేరేపితమైన ధోరణిలో ఇతడు పూర్తిగా భాగం పంచుకున్నాడు. దీని కాధారమైన మానసిక ధోరణి హ్యూగోలో వెల్లడయింది. ఈ ధోరణిలోని పరస్పర వైరుధ్యం మిషెలా దృక్పథాన్ని నాశనం చేయలేకపోయింది. సునిశితమైన వ్యక్తిగా దారుణ పరిస్థితులను అతడు అనుభూతి పొందాడు. మానవుడి బలహీనతలు కుటిలత్వాలు గుర్తించడంవల్ల ఇవన్నీ జనిస్తాయి. గొప్ప చరిత్రకారులూ విప్లవనాయకులూ సహితం ఈ వైఫల్యాలకు మించిపోలేదు. ఇట్లాంటి దారుణ పరిస్థితి ఉన్నప్పటికి మానవజాతి పునరుజ్జీవంలోగానీ, మానవ మహోన్నత ఆదర్శంకోసం కృషిచేయడంలోగానీ అతడికి ఆశలు సడలలేదు.

మానవతావాదానికి విశాలమైన ఇంచుమించు అతి భౌతికమైన భావాన్ని మిషెలా సమకూర్చాడు. జీవితాన్ని గురించిన ఉద్వేగభావన మానవతా లక్షణాలలో సర్వసాధారణంగా అంతర్ముఖమైన వ్యక్తిత్వవాదమున్నది. ఇతడు దీనికి మించిన స్థాయిని సమకూర్చాడు. మానవాళి అంటే వ్యక్తుల కలయిక మాత్రమే కాదనీ, ప్రపంచానుభవ వాస్తవాలనుంచి రాబట్టిన ఒక భావన అనీ, చరిత్రలో మహోన్నత వ్యక్తులకంటే మానవాళి గొప్పదనీ పేర్కొన్నాడు. (ఆనాటి రాజకీయ చింతనాపరులలో ఉన్నత శ్రేణివారు ఈ అభిప్రాయాలనే వ్యక్తపరిచారు. ఉదా॥ (38) పెరీ–లారా, (PIERRE-LAROUX) ఇట్లా అన్నాడు. మానవాళి ఒక ఆదర్శం, వాస్తవ జీవుల కలయిక, ఇందులో స్పష్టం. వీరంతా బీజప్రాయంగానూ, ధర్మస్థితిలోనూ ఉన్న మానవాళి). ఇటువంటి ఉద్వేగవాగ భావనలవల్ల చరిత్రలో నాయకులు విఫలం అయినప్పటికీ మిషెలా కుంగిపోలేదు. మానవాళి అనే భావన నైరూప్యమైనదని చెప్పడానికి "TOUT LE MONDE" అనే పద ప్రయోగం చేశాడు. ఇతడి రచనలలో ఒక పాత్రగా ఇది కనిపిస్తుంది. ఈ నైరూప్య భావనను ఇతడు ఆదర్శప్రాయంమాత్రం చేయలేదు. అదొక ప్రజాస్వామిక భావన మాత్రమే. TOUT LE MONDE అనే భావనలో ఏ ఒక్కరిని గురించిగాక అందరిని గురించీ సాధారణంగా మిషెలా పేర్కొన్నాడు. ఐతే కొద్దిమంది మేధావులు సంస్కృతిపరులకు భిన్నంగా సామాన్య ప్రజానీకం ఉన్నారని అతడి మాటలవల్ల స్పష్టపడుతూన్నది – LOWES DICKINSON,

REVOLUTION AND REACTION IN MODREN FRANCE). నైరూప్య భావనగా వ్యక్తీకరించిన ఈ మానవాళి చరిత్రలో సృష్టిస్తున్నది.

చరిత్ర అంటే గొప్ప వ్యక్తుల, నాయకుల జీవితం మాత్రమే కాదని మిషెలా నిర్ధారించాడు. ఫ్రెంచి విప్లవ సంప్రదాయం సోషలిస్టు ఉద్యమానికి ప్రేరేపణగావించినట్లు అతడు పేర్కొన్నాడు. కానీ హ్యూగోవలె అతడుకూడా సోషలిస్టుకాడు. విప్లవాన్ని విశాల దృక్పథంతో చూచాడు. సమాజాన్ని బానిసత్వంనుంచీ నిరంకుశత్వంనుంచీ స్వేచ్ఛాపూరితం గావించాలని తలచాడు. స్వేచ్ఛాయుత కార్మికుడూ, రైతూ ఆధారంగా సమైక్య ఫ్రెంచిజాతి ఉండాలన్నాడు. అయితే అందరినీ సమానంగానూ స్వేచ్ఛగానూ చూడగలిగినట్టి ప్రజాస్వామిక ఫ్రాన్సు ఉండాలన్నాడు. "దుకాణదారులూ, వ్యాపారస్థులూ, ప్రభుత్వ ఉద్యోగులూ, సంపన్నులూ సాంఘిక విధానంలో బానిసలుగానే ఉన్నారు. ఈ నిరంకుశత్వాన్ని ఛేదిస్తేగాని అన్ని వర్గాల సమన్వయం సాధ్యపడదు. దేశ భవిష్యత్తు ఇటువంటి సమన్వయీకరణపైనే ఆధారపడి ఉంది. (JULES MICHELET, LE PEUPLE). విప్లవానంతరం ఉన్నతవర్గాల భావ బానిసత్వాన్ని మిషెలా తీవ్రంగా విమర్శించాడు. అంతేగాక మేధావుల నిరంకుశత్వాన్ని కూడా అతడు నిరసించాడు. ఈ మేధావులు తిరోగమనతత్వాన్ని ప్రచారంచేస్తూ వివేచనారాహిత్యతను దివ్యమైనదిగాచూపే సాహిత్యాన్ని సృష్టించి, ఆలోచనకంటే ఆవేశానికి ప్రాధాన్యమిచ్చాడు. ఇట్లాంటి దిగజారిపోయిన మేధావుల నిరంకుశత్వాన్ని, భావ బానిసత్వాన్నీ ఎదుర్కొనడం ద్వారా జ్ఞాన వికాసంతెచ్చిన తాత్విక విప్లవాన్ని అట్టిపెట్టడానికి మిషెలా కృషిచేశాడు. (18 వ శతాబ్దంలో సంశయవాదం, రామణీయకానికి చెందిన అభిప్రాయాలూ బహుళవ్యాప్తిలో ఉన్నప్పటికీ, వాటిని వ్యక్తీకరించనివ్వలేదు. మళ్ళీ సామ్రాజ్య పునరుద్ధరణ చెందిన అనంతరం, మతగురువులూ రాజకీయ తిరోగమనవాదులూ అణగారిన విప్లవ ధోరణులను రెచ్చగొట్టినప్పుడు, ఈ భావాలకు అవకాశం కలిగింది. ఫ్లింట్, హిస్టరీ ఆఫ్ హిస్టరీ.)

విప్లవ భావాలు మళ్లీ తలెత్తడానికి మిషెలా, లామనా ఉభయులూ సహరించారు. కావాలని కాకపోయినా హ్యూగో కూడా కొంతవరకు ఇందుకు ఉపకరించాడు. వీరంతా ఫ్రాన్సులో మేధావులకు నాయకత్వం వహించడంవల్ల, ఉద్వేగవాద సాహిత్యం ఆధారంగా భావ ప్రతిచర్య కొద్దికాలం మాత్రమే నిలువగలిగింది. ఆ కొద్దికాలంలో వ్యక్తి చారిత్రకశక్తిగా ఆవిర్భవించడం, వ్యక్తి తన ప్రాధాన్యాన్ని గమనించడం స్పష్టంగా కనబడింది. కనక ఉద్వేగవాద సాహిత్యం, లామర్టిన్, హ్యూగోలకు చెందినదేగాక షాటోబ్రాన్ రచనలు సహితం 18 వ శతాబ్దపు సంస్కృతికి వ్యతిరేకంగాగాక, దాని ఔన్నత్యాన్ని కాపాడటానికి తోడ్పడినట్లు గమనించవచ్చు.

# అధోజ్ఞాపికలు

1. జాన్ జాక్ రూసో : 1712–78, ఫ్రెంచి తత్త్వవేత్త, రచయిత. ఇతడు జెనీవా (స్విట్జర్లండ్)లో జన్మించాడు.

2. మెస్ట్ర్, కోంట్ జోసఫ్ ద : 1754–1821. తత్త్వవేత్త, రాజనీతిజ్ఞుడు.

3. మెయిన్ ద బిరన్ : 1766–1824, ఫ్రెంచి రాజకీయవేత్త, తత్త్వవేత్త.

4. షాటోబ్రాన్, ఫ్రాంస్వారాణా : 1768–1848, ఫ్రెంచి రచయిత, రాజకీయవేత్త.

5. మదాం ద స్టాల్ : 1766–1817, ఫ్రెంచి రచయిత.

6. గోతిక్ : మధ్య శతాబ్దాలలో వాస్తుశాస్త్రం.

7. రాణాడేకార్ట్ : 1596–1650, ఫ్రెంచి తత్త్వవేత్త, గణిత శాస్త్రజ్ఞుడు.

8. డిదరొ, డెనా : 1713–1784, ఫ్రెంచి విజ్ఞాన సర్వస్వకారుడు, విమర్శకుడు, తత్త్వవేత్త.

9. హెగెల్, జార్జి విల్‌హెల్మ్ ఫ్రెడరిక్ : 1770–1831, జర్మనీ తత్త్వవేత్త.

10. ఫ్రెడరిక్ ఏంజిల్స్ : 1820–1895, జర్మనీ సోషలిస్టు రచయిత, మార్క్సిజాన్ని ఒక క్రమంలో పెట్టినవాడు ఇంగ్లండులో ఎక్కువగా జీవితం గడిపాడు.

11. ఫ్యూమర్ బాహ్, లడ్విగ్ యాంప్రిమాస్ : 1804–1872, జర్మనీ తత్త్వవేత్త, నైతిక శాస్త్రజ్ఞుడు.

12. సెయింట్ థామస్ ఎక్వినాస్ : 1225–1274, ఇటలీ మతశాస్త్రజ్ఞుడు. ఇతడు రోమన్‌కేథలిక్ మతస్థుడు.

13. ద బానాల్డ్ : 1754–1840, ఫ్రెంచి తత్త్వవేత్త.

14. లామనా రాబర్ట్ : 1782–1854, ఫ్రెంచి మత తత్త్వవేత్త.

15. బెట్రాండ్ రస్సెల్ : 1872–1970, తత్త్వవేత్త, గణితశాస్త్రజ్ఞుడు. 1950లో నోబుల్ గ్రహీత. ఇతడు ఇంగ్లండ్ వాస్తవ్యుడు.

16. ఫ్రాంకో గజొ : 1787–1874, ఫ్రెంచి చరిత్రకారుడు, రాజకీయవేత్త.

17. రాయర్ కొలార్డ్ : 1762–1845, ఫ్రెంచి తత్త్వవేత్త, రాజకీయవేత్త.

18. జాక్‌బిన్‌లు : ఫ్రెంచి విప్లవంలో రాడికల్ రాజకీయ విప్లవానికి చెందిన వాదులు. 1789–1794 ఏరి కార్యకలాపాలు చాలా ఉధృతంగా ఉండేవి.

19. 18 వ లూయి : 1755–1824, ఫ్రెంచి చక్రవర్తి (1814–1815, 1815–1824).

20. జాన్‌లాక్ : 1632–1704, ఇంగ్లీషు తత్త్వవేత్త.

21. పాస్కల్ : 1623–1662, ఫ్రెంచి తత్త్వవేత్త, గణిత శాస్త్రజ్ఞుడు.

22. బర్క్ : 1729–1797, ఐరిష్ రాజనీతిజ్ఞుడు, వక్త, రచయిత.

23. బెంజిమిన్ కోన్‌స్టాన్ :1845–1902, ఫ్రెంచి చిత్రకారుడు.

24. నెకర్ : 1732–1804, ఫ్రెంచి ఆర్థిక శాస్త్రవేత్త, రాజనీతిజ్ఞుడు.

25. జెరాన్‌డిస్టులు : 1791–93, ఫ్రెంచి రిపబ్లికన్‌పార్టీకి చెందిన సభ్యులు.

26. మోంటానాలు : పర్వత ప్రాంతీయులు. వీరు ఫ్రాన్సులో ఉంటారు.

27. కజిన్ విక్టర్ : 1792–1867, ఫ్రెంచి చరిత్రకారుడు, తత్త్వవేత్త.

28.స్పినోజా బెన్‌డిక్ట్ : 1632–1677, హేతువాది, తత్త్వవేత్త.

29. మాచ్లె : ఫ్రెంచి తత్త్వవేత్త.

30. సెయింట్ స్రెమన్ : 1760–1825, ఫ్రెంచి సామాజిక శాస్త్రజ్ఞుడు, సోషలిజం స్థాపకుడు.

31. ఫోరా : 1772–1837, ఫ్రెంచి సోషలిస్టు, రచయిత.

32. ఎబలార్ట్ : 1079–1142, ఫ్రెంచి మత విజ్ఞానవేత్త.

33. విక్టర్ హ్యూగో : 1802–1885, ఫ్రెంచి కవి, నవలాకారుడు, నాటకకర్త.

34. లామర్టిన్ : 1790–1869, ఫ్రెంచి చరిత్రకారుడు, రాజకీయవేత్త, కవి.

35. మిష్‌లా : 1798–1874, ఫ్రెంచి చరిత్రకారుడు.

36. థైర్ : 1797–1877, ఫ్రెంచి రాజనీతిజ్ఞుడు, 1871–1873 వరకు ఫ్రెంచి అధ్యక్షుడు.

37. మిగ్నెట్ ఫ్రాంకో : ఫ్రెంచి చరిత్రకారుడు.

38. పరీ–లారా : రాజకీయ ఆలోచనాపరుడు.

# ఉద్వేగవాద చరిత్ర

ప్రతిచర్యను సాధనగా ఉపయోగించి ఉద్వేగవాదం ఆధునిక జర్మనీ చరిత్రపై చాలాప్రభావాన్ని చూపెట్టింది. గొప్ప పాత్రను నిర్వహించింది. అక్కడ తాత్త్విక రూపురేఖలు సంతరించుకుని, రాజకీయ సిద్ధాంతాలను ఆచరణను నిర్ధారించింది. జర్మనీలో ఉద్వేగవాద ప్రాధాన్యాన్ని పరిశీలించేముందు, ఆ వాదం ఏమిటో నిర్వచించడం ఆవసరం.

ఉద్వేగవాదాన్ని భిన్నరీతులలో నిర్వహించారు. ఆలోచనాచరిత్రలోను, జీవితంలోను ఉద్వేగవాదస్థానాన్ని దోషబద్ధంగానూ, గందరగోళంగానూ భావించడానికి, ఉద్వేగవాదాన్ని సరిగా అర్థం చేసుకోకపోవడమే కారణం. మొదట కళలో ఇదొక ధోరణి. కళకు సంబంధించిన సిద్ధాంతం జీవిత దృక్పథాన్ని సూచిస్తుంది. జీవితం ప్రకృతిలో భాగం. అందువల్ల ఆదినుంచీ ఉద్వేగవాదం ఒక జీవిత విధానం. ఆ విధంగా దానికి తాత్త్విక ప్రాధాన్యముంది. కానీ ఇది స్పష్టంగా గుర్తించడమూ, ఒక క్రమంలో సూత్రీకరించడమూ తరవాతగానీ జరగలేదు. తత్త్వం లేకుండా సంస్కృతి ఉండదు. పునర్వికాసంలో కళలకూ సాహిత్యానికీ ప్రాతినిధ్యం వహించిన వారు జీవితాన్ని ఉద్వేగ దృక్పథంలో చూశారు. చారిత్రకంగా అలౌకికవాద నిరంకుశత్వంపై మానవుడు చేసిన తిరుగుబాటే ఉద్వేగవాదం. తాత్త్వికంగానూ, సాంస్కృతికంగానూ ఉద్వేగవాదం మానవ వాదంతో కలిసిపోయింది. మానవుడి సార్వభౌమత్వం, అతడి అనంత సృజనాత్మక శక్తులలో విశ్వాసాన్ని ఈ వాదం చూపుతుంది. చరిత్రను మానవుడు సృష్టిస్తాడని, తన విధికి తానే బాధ్యుడని మానవుడి గురించి ఉద్వేగవాదం పేర్కొంటున్నది. కనుక 18వ శతాబ్దం, వివేచన యుగమేకాదు–ఉద్వేగవాదయుగం కూడా. 18వ శతాబ్దంలోని వివేచనావాదం మానవుడిని విశ్వకేంద్రస్థానంలో నిలబెట్టింది. అయితే ప్రకృతి నియమాలకు మానవుడు బద్ధుడై ఉండడని చెప్పింది. క్రమేణా ప్రకృతిపై మానవుడు ఆధిపత్యం వహిస్తాడని విజ్ఞానం ఆధారంగా పేర్కొన్నారు. జీవితాన్ని గురించి ఉద్వేగవాదంకూడా ఇటువంటి తాత్త్విక దృక్పథాన్నే వెల్లడిస్తూన్నది. మానవుడి సృజనశక్తి సర్వాధికారమయినదని పేర్కొన్నప్పటికీ, మానవుడి శక్తుల పరిమితులను ఈ వాదం గమనించకపోలేదు. పరిమితులు సహజమైనవి. మానవుడు ప్రకృతిలో భాగంకనక

ఇది తప్పదు. "కొన్ని పరిమితులలో మానవుడు తనను వ్యక్తీకరించుకుంటూ పోతాడు." అని ఉద్వేగవాదాన్ని గురించి ఒక వాఖ్యంలో [1]గెటె వ్యక్తంచేశాడు.

మానవ చరిత్రలో విజ్ఞానాభివృద్ధి మహోన్నత ఉద్వేగంగా భావించవచ్చు. ప్రకృతిని జయించడానికి, దాని రహస్యాలు తెలుసుకోవడంతో మానవుడి ఉద్రేకపూరిత సాహసయాత్ర ప్రారంభం అయింది. అదే సమయంలో విజ్ఞానం వివేచనాత్మకం కూడా. కనక వివేచనావాదానికీ ఉద్వేగవాదానికీ సమన్వయం చేకూరుస్తున్నది విజ్ఞానం. సంప్రదాయబద్ధమైన వివేచనావాదం, ఆగమన (inductive) పద్ధతివల్ల, మానవుడి సార్వభౌమాధికారాన్ని తృణీకరించింది. అట్లాంటి వాదంతో కొత్త ఉద్వేగవాదం తెగతెంపులు చేసుకుంది. అతి భౌతికంగా సర్వసాధారణ సూత్రాలను చెప్పడాన్ని ఉద్వేగవాదం తృణీకరిస్తుంది. స్పష్టమయిన వాస్తవాలుండాలనీ మానవుడు కూడా అందులో ఒక భాగంగా ఉండాలని ఉద్వేగవాదం పేర్కొంటున్నది. విజ్ఞానం కూడా అట్లాగే అంటున్నది. ఉద్వేగవాదం వివేచనపై తిరుగుబాటు కాదు. వివేచనావాదంనుంచి సృష్టికి ప్రయోజనమున్నదనేధోరణి అవలంబించిన 17 వ శతాబ్దపు సంప్రదాయవాదానికి వ్యతిరేకంగా ఉద్వేగవాదం బయలుదేరింది. మానవుడి వివేచనకు మొట్టమొదటి వ్యక్తీకరణ మతంలో కనిపిస్తుంది. క్రమాన్ని కోరుకోవడం మానవుడికి ప్రేరణాత్మకంగా వచ్చింది. సంప్రదాయబద్ధమైన వివేచనావాదంతో అదే నిలిచింది. మతపరమైన విశ్వనియమాన్ని ప్రాతిపదికగా స్వీకరించిన డేకార్ట్, స్పినోజాలలో కూడా ఈ ధోరణి ఉన్నది. 18 వ శతాబ్దంలోని వైజ్ఞానిక సహజవాదం, మానవుడి వివేచనను చుక్కానిగా స్వీకరించేటప్పటికి, సృష్టి ప్రయోజనవాదంతోకూడిన సంప్రదాయబద్ధమైన వివేచనావాదం తిరుగుబాటు చేసింది. "అనుభవంచెప్పిన మార్గాన్ని అనుసరిద్దాం తాత్త్వికుల వృథాచరిత్రతో మన తలలు పగులగొట్టుకోవడం అవసరం" అని డల మెయిత్[2] సూచించాడు. అతడేగాదు వివేచనావాదానికి మూలపురుషుడనుకొంటున్న వొల్తేర్[3] కూడా యిట్లా అన్నాడు. "ఓ ప్లేటో![4] నిన్నెందరో శ్లాఘించారు. నీవు చెప్పినవన్నీ కట్టుకథలే. 18 వ శతాబ్దంపై తిరుగుబాటు అనేది ఒక వంక మాత్రమే. వివేచనారహిత

---

1. గెటె, జాన్‌పుల్ఫ్ గాంగ్‌వాన్ 1749–1832 జర్మనీ కవి, నవలాకారుడు నాటకకర్త.
2. నెపోలియన్ పాలనలో ప్రవాసంవెళ్ళిన రాజకీయ తత్త్వవేత్త. "ఆన్ ది పోప్", "గాలికన్ చర్చ్" అనేవి ఇతడి ప్రసిద్ధ రచనలు.
3. వోల్తేర్ 1694–1778 ఫ్రెంచి తత్త్వవేత్త, చరిత్రకారుడు, నాటకకర్త అసలు పేరు ఫ్రాంకో మరీ ఆరా.
4. ప్లేటో క్రీ. పూ. 427–347 గ్రీక్ తత్త్వవేత్త.
5. 1786–1878 జర్మనీ సంగీత విద్వాంసుడు.

విధానం, కట్టుకథలు అల్లడం, మార్మికవాదం, మతతిరోగమనవాదం, వ్యక్తిగతాభిమానం అనేవి ఉద్వేగవాదంగా భావించరాదు. విప్లవం సాహసోపేతమయిన ఉద్వేగం. విప్లవానంతర ఉద్వేగవాదం ప్రాచీన సామ్రాజ్యాన్ని పునరుద్ధరించాలని ఆక్రందించింది. నవ్యసంప్రదాయవాదానికి ఇదొక బలహీనమయిన ప్రతిధ్వని మాత్రమే.

ఉద్వేగం అనే పదంనుంచి రాబట్టిన ఉద్వేగవాదం, వ్యుత్పత్తిపరంగాచూస్తే, సంప్రదాయానుసారంగా అవాస్తవికతను ఘనంగా పొగడటమేనని భావిస్తారు. వాస్తవాన్ని వివేచనతో హెగెల్ తాదాత్మ్యం చేశాడు. అందువల్ల అతని కాలంనుంచీ, ఉద్వేగవాదాన్ని వివేచనారహితవాదంగాను, అవాస్తవికంగాను భావించారు. వివేచనకు వ్యవస్థాపితాక్రమం ఉంటే, వాస్తవం వివేచనే అయితే, అప్పుడు ఉద్వేగవాద జీవిత దృక్పథం అవాస్తవమైనదేగాక వివేచనారహితంగా కూడా జర్మనీ ఉద్వేగవాది కార్ల్ 5 మరియావాన్ వెబర్ ఇట్లా అభ్యంతరపెట్టడాన్ని గమనించవచ్చు. "జీవితం అట్లా ఉంది. అట్లా ఉన్న జీవితాన్ని నేను స్వీకరించను. సహించలేని వాస్తవికత ఆధారంగా నేను మళ్ళీ సృష్టిస్తాను." ఏ పరిస్థితులలోనైనా వాస్తవాలు మానవుడి సృజనశక్తులకు హద్దులు విధిస్తాయి. మానవుడు వాటినిదాటి కొత్త వాస్తవాలను సృష్టిస్తాడు. అదే జీవితానికి చెందిన ఉద్వేగభావన.

ఉద్వేగ వాదానికి ఇంకా పాత చరిత్ర ఉన్నది. పునర్వికాసం నుంచి ఇదే ఐరోపా సంస్కృతికి ఆధారమయింది. అన్ని విశ్వాసాలను సంశయించిన 6 కోర్నా, 7రాసిల్, 8మోలర్, 9బ్వాలా మానవుడి సమగ్రతలో నమ్మకాన్ని వ్యక్తంచేశారు. దైవానుగ్రహం లేకుండా మానవుడి సమగ్రతలో నమ్మకాన్ని వ్యక్తం చేయడం జీవితానికి సంబంధించిన ఉద్వేగవాదంలో అతి ప్రధానమయినది. మానవుడి చైతన్యాన్ని, విశ్వపథకంలో అతడి ప్రాధాన్యాన్ని "మానవుడంటే" ఏమిటి? అనంతంతో పోలిస్తే ఏమీలేదు. శూన్యంతో పోలిస్తే సంపూర్ణం. అన్ని వస్తువులకు, ఏమిలేని దానికి మధ్యస్తంగా మానవుడున్నాడు" ఇది మార్మికంగా కనిపించవచ్చు. కానీ తరవాత ఇట్లా రాశారు. "మానవుడి హుందాతనం ఆలోచనలలో ఉన్నది. ఆలోచనే మనిషిని చేస్తుంది. ప్రకృతిలో మానవుడు అత్యంత బలహీనుడు, గడ్డిపోచ. కానీ ఆలోచనగల గడ్డిపోచ. అతడిని అణిచివేయడానికి ప్రకృతి ఆయుధాలను చేపట్టనక్కరలేదు. గాలిదుమారం, నీటి బిందువు మానవుడిని నాశనం చేయగలవు. విశ్వం అతడిని నాశనం చేస్తున్నప్పటికీ, తనను చంపే ప్రకృతికంటే మానవుడే ఉన్నతమయినవాడు. చంపబడుతున్నట్లు అతడు తెలుసుకుంటున్నాడు (Pascal, Pens'ees).

సంస్కృతి చరిత్రకారులు కొందరు చిత్రించినట్లుగా పాస్కల్ వివేచనారహిత వాదానికి ప్రవక్త కాదు. అతడొక గొప్ప గణిత శాస్త్రజ్ఞుడు. 10 పెరా ఇట్లా రాశాడు.

"మానవజాతిని శాశ్వత మానవాళిగా గుర్తించాలి. మానవుడి జీవితంలోవలె మానవజాతి జీవితంలో కూడా బాల్యం, యౌవనం అనే దశలు ఉంటాయి. ఇప్పుడు పరిణతి చెందిన దశఉన్న మానవజాతి పతనం కాదు. (PARALLELE ENTRE LES ALICIELS ET LES MODERLES).

మానవజాతి భవిష్యత్తులో 11 ఫోంటాకు అచంచల విశ్వాసం ఉండేది. "ప్రపంచ ఆరంభంనుంచి నేటివరకూ ఉన్న మానవజాతికి వృద్ధాప్యం లేదు. యౌవనంలో ఎంత శక్తిమంతంగా పనులు చేశాడో అట్లాగే మానవుడు అన్నివేళలా కార్యకలాపాలు కొనసాగించే సత్తాతో ఉంటాడు. మానవుడు ఏనాడూ దిగజారిపోడు. మానవుడికి తగిన పనులు అన్ని వేళలా చేయగలడు.

12 ఆబా డ సెయింట్ పెర్, మానవుడి సమగ్రతను చారిత్రకాభివృద్ధిలోను ఇంకా ఎక్కువ ఉత్సాహాన్ని, నమ్మకాన్ని చూపాడు. "వ్యక్తికి, సంఘానికి అనేక పథకాలువేసి వారి అభివృద్ధిని కోరిన ఇతడి విశ్వాసాన్ని చూసిన సమకాలికులు అవన్నీ అతడి స్వప్నాలుగా భావించారు. కానీ అవి కలలుకావు. ఒకవేళ కలలయినప్పటికీ, చైతన్యాన్ని పురిగొల్పే 13 టర్గో, 14 కాండోర్సేలను అతడు ముందే ఊహించాడు." (ఫ్లింట్, హిస్టరీ ఆఫ్ ది ఫిలాసఫీ ఆఫ్ హిస్టరీ.)

6. 1606–84 ఫ్రెంచి నాటకకర్త, కవి.

7. ఫ్రెంచి నాటకకర్త 1639–99.

8. 1622–73 ఫ్రెంచి నటుడు. నాటకకర్త మోలర్.

9. 1636–1711 ఫ్రెంచి కవి, విమర్శకుడు.

10. పెరా (Perrault) 1628–1703 ఫ్రెంచి కవి, విమర్శకుడు.

11. లఫోంటా–ఫ్రెంచి కథకుడు.

12. ఫ్రెంచి మత గురువు Abbe de st. Pierre.

13. 1727–81 Turgot ఫ్రెంచి ఆర్థిక శాస్త్రవేత్త, రాజనీతిజ్ఞుడు.

14. Condorcet 1743–94 ఫ్రెంచి గణిత శాస్త్రజ్ఞుడు, తత్వవేత్త.

రూసో ఉద్వేగవాదం పైన పేర్కొన్న సంప్రదాయాలకు చెందినదికాదు. కనక విప్లవానంతరం, ప్రతిచర్యతో ఈ వాదానికి జతగూడింది. ఫ్రాన్సులో దోషబద్ధమైన ఉద్వేగవాదం ఫలప్రదం కాలేదు. కానీ, జర్మనీలో ఇది స్వైరవిహారం చేసింది. బ్రిటన్‌లోకూడా కొంతవరకు ఇటువంటి ఛాయలు లేకపోలేదు. పునర్వికాస కళలు

సాహిత్యంతో కూడిన తొలి ఉద్వేగవాదాన్ని తిరగదోడాలని ఆదిలో ఈ ఉద్యమం భావించింది. పునర్వికాస ఉద్యమమే ప్రాచీన సంస్కృతిని, పాండిత్యాన్ని తిరగదోడటానికి తలపెట్టినటువంటిది. కనక దీని సంప్రదాయం ప్రాచీనమేగాక ఉద్వేగవాదంతో కూడినది. 17 వ శతాబ్దంలోని ఉద్వేగవాదాన్ని తిరగదోడటంవల్ల, రామణీయక సిద్ధాంతాలు స్వాతంత్ర్యంపై ఎంతో ప్రభావాన్ని చూపాయి. వివేచనావాదంపై తిరుగుబాటుగా ఇది తలెత్తలేదు. ఎందుకంటే ఆ ఉద్యమమే కొంతవరకూ నవ్య సంప్రదాయ ఉద్యమం. సాహిత్య వివాదంలో 3 దశాబ్దాల సమర ఫలితంగా ఇది జనించినట్లు సాంస్కృతిక చరిత్రకారులు వర్ణించారు. 18వ శతాబ్దారంభంలో ఈ సమరం ముగిసింది. 14వ లూయీ కాలంలో, ఫ్రెంచి సంస్కృతిలోని నవ్య సంప్రదాయానికి వ్యతిరేకంగా, ఈ సిద్ధాంతం వచ్చింది. మొదట 17వ శతాబ్దంలో ఇటలీలో ఈ రామణీయక సిద్ధాంతం పెంపొందింది. ఉద్వేగాన్ని తిరగదోడటం అంటే వివేచనపై తిరుగుబాటుగా భావించడం ఆనవాయితీ అయిపోయింది. రామణీయక సిద్ధాంతంగా ఉద్వేగవాదం, వ్యక్తి అనుభవానికి, ఉద్రేకానికి, యాదృచ్ఛికంగా వచ్చే తలపుకు, ప్రాధాన్యం ఇచ్చింది. దీన్ని వివేచనారహిత విధానంగా భావించడానికి, డేకార్ట్ తత్త్వ వ్యతిరేక ధోరణిలో మేధావులు సృష్టించిన వాతావరణమే కారణం.

రామణీయక సిద్ధాంతానికి చెందిన ఉద్వేగవాదులు వివేచనను తోసిపుచ్చలేదు. 15 గ్రానినా తాత్త్వికంగా డేకార్ట్ విధానానికి చెందినవాడు. మతపాండిత్యవాదంలోని పిడివాదానికి డేకార్డ్ చూపిన వ్యతిరేకతను ఇతడు ఆహ్వానించాడు. భావ విమోచనకు ప్రతిదానినీ సందేహించే డేకార్ట్ తత్త్వాన్ని కూడా ఇతడు హర్షించాడు. ఈ విధానాలలో కవిత్వానికి వ్యతిరేకత ఏమీలేదని కనుగొన్నాడు. డేకార్ట్ తత్త్వంలో భౌతికవాదధోరణులు మాత్రమే 16 వీకో అంగీకరించాడు. "మేధాసంబంధమయిన స్వేచ్ఛను ఇవ్వడంలో డేకార్ట్ అనుసరించిన పద్ధతి ఎంతో విలువయినదని ఇతడు గుర్తించాడు. ఈ పద్ధతివల్లనే డేకార్ట్ తన రచన కొనసాగించగలిగాడు. 17 బ్రూనో, 18 కాంపనెల్లాలకు భావసంబంధమైన వారసుడుగా ఉన్న వికో గనుక డేకార్ట్ విధానాలతో సంబంధం లేకుంటే మధ్యయుగాల మతపాండిత్యవాదపు నిరంకుశత్వం నుంచి

15. ఫ్రెంచి తత్త్వవేత్త డేకార్ట్ అనుచరుడు.

16. 1668–1744 ఇటలీ తత్త్వవేత్త, న్యాయశాస్త్ర నిపుణుడు జొవానా బటేస్తావికో పూర్తిపేరు.

17. 1548–1600 ఇటలీ తత్త్వవేత్త.

18. 1568–1639 పునర్వికాస తత్త్వవేత్త, పండితుడు.

బైటపడగలిగేవాడేకాడు. పైగా ఎంతో నిస్సహాయుడుగా తనను భావించు కోవలసి వచ్చింది. అరిస్టాటిల్ సంప్రదాయాన్ని వ్యతిరేకించడానికి ఫ్రెంచి తత్త్వవేత్త గ్రావినాకు, వికో తోడ్పడటంవల్ల వీరిరువురూ అతని విధానాలను ఆహ్వానించారు." (జె. జి. రాబర్ట్సన్, ది జెనిసిస్ ఆఫ్ ది రొమాంటిక్ థిరీ)

పునర్వికాస ధోరణి ఆల్ప్సు పర్వతాలను దాటిపోవడంతో, 12 వ శతాబ్దంలోని ఇటలీ, ఐరోపా సంస్కృతిలో వెనకబడిపోయింది. కళలలో నైతిక పతనం, సాహిత్యంలో నిస్సారం, కొట్టవచ్చినట్లు కనిపించింది. సంస్కరణ వాదానికి వ్యతిరేకత పైచేయి అయింది. ఇటలీ భావజీవితంలో తిరిగి వేటికాన్ ప్రవేశించి, మృత్యుప్రాయమైన పట్టుతో కబళించివేసింది. పునర్వికాసానికి పుట్టినిల్లే, బ్రూనో, 19 గెలీలియోలను పొట్టన పెట్టుకున్నది. పునర్వికాస సాహిత్యధోరణి కరిగిపోయింది. సూత్రాలు మాత్రమే మిగిలాయి. ఈ సూత్రాలను కావాలన్నవారు కృత్రిమంగా ఊపిరిపోసి వాటిని నిలపాలనిచూశారు. అతిశయోక్తులతో అపురూపాలతో వీటికోసం ఎంత ప్రయత్నించినా చివరకది సామాన్య వివేచనకు కూడా ఆకర్షణ కాలేకపోయింది.

20 మారినీ కవిత్వాన్ని వెర్రి ఆవేశంతో అభిమానించిన కాలంలో రామణీయక పతనావస్థ పరాకాష్ఠనందుకొన్నది. ఊహాలోకంలో విహరిస్తూ, సడలిన నీతితో హద్దులులేని వ్యక్తివాదంతో, నిర్లక్ష్యంతో, కూడిన స్వార్థంతో, బాధ్యరహితంగా, సంపన్నుల ఆడంబరతతో, ఇంకా అనేక దోషాలతో ఆ కాలం ఉండగా, అదంతా పునర్వికాస కర్తలకు అంటగట్టారు. ఇటలీలో కవితాసక్తి ఇంత దారుణంగా దిగజారిపోగా, ఫ్రాన్సులో ఆధునిక ఐరోపాసాహిత్యపు మహోన్నత అధ్యాయం ప్రారంభమై, పునర్వికాస ధోరణి వ్యక్తమయింది. 21 పెరె-బోహార్ వ్యాఖ్యానిస్తూ నీచమయిన అభిరుచికి ఇటలీ మాతృభూమి అన్నాడు. దీనివల్ల చాలాకాలం సాహితీరంగంలో వివాదం సాగింది. అందులోనుంచే రామణీయకానికి సంబంధించిన నూతన ఉద్వేగవాద సిద్ధాంతం ఇటలీలో పెంపొందింది.

17వ శతాబ్దంలో మేధస్సు, సాంస్కృతిక జీవితానికి సంబంధించిన అన్నిరంగాలలో డేకార్ తత్త్వం ఫ్రాన్సుపై ప్రభావాన్ని చూపెట్టగా, సాహిత్య విమర్శపైకూడా ఈ ఛాయలు కనిపించాయి. "రామణీయకంపై ఒక వాక్యమైనా

---

19. 1564–1642 ఇటలీ భౌతిక, ఖగోళ శాస్త్రజ్ఞుడు.

20. 1569–1625 ఇటలీ కవి.

21. ఫ్రెంచి సాహిత్యకారుడు.

రాయని డేకార్ట్ ఫ్రాన్సులో రామణీయక సూత్రాలకు సృష్టికర్త అయ్యాడు." (EMILE KRATZ, ESSAI SUR L' ESTHETIQUE DE DESCARTES) అత్యున్నత అందమే మహోన్నత సత్యమని డేకార్ట్ ప్రవచించిన ప్రసిద్ధ సూత్రం 17, 18 శతాబ్దాలలో ఫ్రెంచి సాహిత్య విమర్శకు గీటురాయి అయింది. ఆ ప్రయాణాన్నిబట్టి నిర్ధారిస్తే, అందంకోసమే అందం అనే మారినీ ధోరణి మంచి అభిరుచికి మార్గం కాదని భావించారు. కళల చరిత్ర దృక్పథాన్ని బట్టిచూస్తే డేకార్ట్ సూత్రం చాలా ప్రాధాన్యం వహించింది. రామణీయకాన్ని నీతిశాస్త్రంతో కలపడంవల్ల రామణీయక శాస్త్రాన్ని కూడా తత్త్వంలో ఒక భాగంగా చేశారు. అంటే ఈ వివాదం అంతా ముఖ్యంగా తాత్త్వికరపమైనదన్నమాట. నీతిశాస్త్రంపై డేకార్ట్ ప్రభావాన్ని అభ్యంతర పెట్టిన ఇటలీ నవ్య ఉద్వేగవాదం, తాత్త్వికంగా తిరోగమనమే. డేకార్ట్ విధానంకంటే ఇందులో మెరుగుపరిచిందేమీలేదు. ఉత్తరోత్తరా చిత్తశుద్ధిగల ఉద్వేగవాదులు 18 వ శతాబ్దంలో డేకార్ట్ నుంచి దూరమై అతడి పాండిత్య వివేచనావాదంనుంచి, ఫ్రాన్సులో దూరంగా జరిగారు. సహజవాదాన్ని డేకార్ట్ తత్త్వంలోని వైజ్ఞానిక దృక్పథంతో మెరుగులుదిద్దారు. మానవుడి తిరుగుబాటు తత్త్వానికి వారసులుగా ఫ్రెంచి విప్లవానికి వీరు స్వాగతం పలికారు.

ఫ్రెంచి విమర్శతో, తలవంపులకు గురైన ఇటలీ సాహితీపరులలో సునిశితులైన కొందరు, మారినీవాదాన్ని తృణీకరించారు. మరి కొందరు ధర్మబద్ధమైన ప్రేమ కవిత్వం రాయగా ఇంకా కొందరు శృంగార కవిత్వాన్ని అల్లారు. వేరే కొందరు ప్రేమ కవిత్వం మానేసి జీసస్‌ను శ్లాఘిస్తూ కవితలు అల్లారు. "అప్పటి సుప్రసిద్ధ వివాదఫలితంగా బోహార్ దూషణలను ఖండించడమేగాక, లోపాలను సరిదిద్దుకుంటూ ఫ్రెంచివారు సాధించినదానితో పోల్చి చూసుకోవడం స్పష్టంగా కనిపిస్తుంది." (ఫ్లింట్, హిస్టరి ఆఫ్ ది ఫిలాసఫీ ఆఫ్ హిస్టరీ) ఇటలీలో సాహిత్యవేత్తలంతా 1669లో అకాడమీని స్థాపించి "ప్రాచీన 22 ఆర్కేడియన్లు పెంపొందించిన ఆచారాలను, మధ్యయుగాలను" పునరుద్ధరించారు. ఇదంతా బోహార్ విమర్శ నుంచి బైటపడటానికి చేసి కృషిమాత్రమే. ఉద్వేగవాదాన్ని తిరగదోడడానికి ఆర్కాడియా ఒక భూమికగా ఉపయోగపడింది. 23 మురటోరి, గ్రావినాల రచనల ఆధారంగా రామణీయక సిద్ధాంతం రూపొందింది. (MURATORI, DELLA PERFETTA POESIA ITALIANA, GRAVINA, REGION POLITICA).

ఇటలీ నవ్య ఉద్వేగవాదానికి వాస్తవంగా వికోను పితామహుడనవచ్చు. కవిత కేవలం ఊహాజనితమని అందులో వివేచనకు స్థానంలేదని అతడన్నాడు. మురటోరీ రూపొందించిన రామణీయక సిద్ధాంతంలో, మేధస్సుకు అభూతకల్పన తోడుగా ఉంటుంది. డేకార్ట్ సిద్ధాంతాన్ని అనుసరించినవాడు గ్రానినా. "మనసుకు సంబంధించిన

విధానాన్ని గురించి దోషపూరితమైన భావాల ఆధారంగా", వికో సమకాలీనుల రామణీయక సిద్ధాంతాలు ఇటలీలో తలెత్తినవి. (J. G. రాబర్ట్‌సన్, ది జెనిసిస్ ఆఫ్ రొమాంటిక్ థిరీ) మతపక్షపాతం, మధ్యయుగాల మనస్తత్వం, పదార్థవాద వ్యతిరేకతవల్ల యాంత్రికీకరణ అనే భావన వికోకు జుగుప్సను కలిగించింది. ("డేకార్ట్‌కు వ్యతిరేకంగా వికో ఉండటానికి మత పక్షపాతంతో కూడిన అతని దృష్టి, కేథలిక్ విశ్వాసానికి డేకార్ట్‌వల్ల చాలా ప్రమాదం ఉన్నదని గ్రహించడం కారణం. చారిత్రక విజ్ఞానంకంటే తన అతి భౌతిక వాదాన్నీ, పదార్థ వాదాన్నీ, గణితాన్నీ అభిలషించిన డేకార్ట్,సాహిత్యాన్ని అరబ్బుల జ్ఞానంగా మాత్రమే పరిగణించాడు." – వికో స్వీయచరిత్రకు పీఠిక అనువాదాన్ని ఎమ్. హెచ్. ఫిష్, పి. జి. బెర్గిన్ చేశారు.)

బ్రూనో, కాంపనెల్లా, గెలీలియో, 24 మాకియవెల్లి (MACHIAVELLI) వంటివారు, ఇంకా పునర్వికాసకర్తలు పుట్టిన దేశంలో, వివేచనను తత్త్వంనుంచి పూర్తిగా విడదీయడం సాధ్యంకాలేదు. వీరంతా గొప్ప కళాకారులూ, శాస్త్రజ్ఞులు కూడా. నూతన విజ్ఞానానికి వికో స్థాపకుడు. చరిత్రను పరిణామ (వివేచన) విధానంగా అతడు కనుగొన్నాడు. కానీ రామణీయక వాదంలో ఊహకు ఆధిక్యాన్ని ఇచ్చాడు. రామణీయకం కూడా మానవ కార్యకలాపాలలో ఒక భాగమే. "వికో ఆలోచన ప్రకారం ఊహ సృజనశక్తి గలది. మురటోరీ విధానంలో పేర్కొన్నట్లుగా ఊహ కేవలం ప్రతిమలకు వస్తువులను అందించడమేగాక, దీనిని మేధస్సుగా వికో భావించాడు. ఊహ పనిచేసే తీరు మానవ పరిణామ ప్రథమ దశలలో సమష్టిశక్తిగా రామణీయక ఆలోచనలకు ప్రాతిపదికగా ఉపకరిస్తుంది. (జె. జి. రాబర్ట్‌సన్). మేధస్సు, ఊహా పరస్పరం వేరని తలచడం దోషపూరితం. ఆదిమ మానవులలో ఈ విచక్షణలేదు. ఊహలో అంతో ఇంతో ఆలోచన ఎప్పుడూ ఉంటుండేది. సృజనతో కూడిన ఊహలో ఇది మరీ ముఖ్యంగా కనిపించేది. ఆదిమానవుడు వట్టి ఊహలలోనే నివసించాడనడం, కేవలం మొండివాదన మాత్రమే.

ఏమైనప్పటికీ ఇటలీలో కొత్త రామణీయక సిద్ధాంతాలలోని తాత్త్విక ధోరణి, మొత్తంమీద డేకార్ట్ వ్యతిరేక రీతిలోనే ఉన్నది. ఫ్రాన్సులో డేకార్ట్ ప్రభావమే పైచేయి అయింది. ఈ తాత్త్వికతేడావల్ల ఇటలీలో మేధస్సుకు తక్కువ స్థానం లభించడమేగాక ఉద్వేగవాదం పేరిట వాస్తవాలను చిన్న చూపుచూసి వివేచనా రహిత విధానాన్ని పెంపొందించారు.

---

22. ప్రాచీన గ్రీస్‌లో అమాయకులైన ఆర్కేడియా కొండజాతులవారు.

23. ఇటలీ రచయిత.

24. 1469–1527 ఇటలీ రాజనీతిజ్ఞుడు, తత్త్వవేత్త.

ఈ వాదోపవాదమంతా చివరకు 18 వ శతాబ్దారంభంలోని 25 మతగురువు జీన్‌బాప్తిస్తే దూబ తీర్చాడు. ఐరోపాలో రామణీయక ఆలోచనకు అతడు ఎంతో సేవచేశాడు. ఇటలీ దృక్పథాన్ని చాలావరకు దూబ ఆమోదించినప్పటికీ ఇతడిని ఉద్వేగవాది అనజాలం. "మేధావుల హక్కులకోసం ఇతడు చిత్తశుద్ధితో అర్థించినప్పటికీ, వివేచన యొక్క నిరంకుశత్వానికి వ్యతిరేకంగా మాట్లాడినప్పటికీ, కేవలం ఉత్సాహంతో ఇతడు కొట్టుకపోలేదు." (రాబర్ట్‌సన్). తాత్త్వికంగా ఇతడు దేకార్ట్ వాదానికి చెందినవాడు. ఆస్థితిని అతడు విడనాడలేదని సాక్ష్యాధారాలున్నాయి. అత్యుత్సాహాన్ని సంశయించినట్లు, 26 బాల్, 27 లాక్ ప్రభావంలోకి వచ్చినట్లు ఆధారాలున్నాయి. ఉద్రేకవాదాన్నీ సంప్రదాయవాదాన్నీ సమన్వయీకరించడంలో ఇతడి ప్రతిభ అంతా ఉన్నది. ఉన్నతమైన రామణీయక విలువలను సృష్టించడానికి ఈ విధమయిన మేళవింపుల వల్ల నిజమయిన ఉత్తేజం కలుగుతుందని భావించాడు. ఇతడు పెరాల్ట్‌ను శ్లాఘించాడు. వివేచనాయుగంలో విలాసంగా మారిన భావోద్రేకానికి ఇతడిని స్థాపకుడనవచ్చు. ("ఈ ఉద్యమంలో గొప్పవ్యక్తి రూసో అయితే అంతకుముందే ఉన్న ధోరణులను మాత్రమే అతడు వ్యక్తపరిచాడు. భావోద్రేకాలను అభినందించడం, 18వ శతాబ్దంలో ఫ్రాన్సులో ఒక ఆనవాయితి అయింది. ఉద్రేకాన్ని ముఖ్యంగా సానుభూతితోకూడిన ఉద్రేకాన్ని, అలవాటు చేయడం ఇందులో కనిపిస్తుంది. ఉద్రేకం సూటిగానూ తీవ్రంగానూ ఉంటేగాని సంతృప్తి కలుగదు. ఆలోచనతో దీనికి సంబంధం ఉండరాదు. దారుణస్థితిలో ఉన్న ఒకరైతు కుటుంబాన్ని చూసి భావోద్రేక చలించిపోయి కంటతడి పెడతారు. కానీ రైతువర్గాలను ఉద్ధరించడానికి జాగ్రత్తగా ఆలోచనచేసిన పథకాలపట్ల అతడు ఉదాసీనంగా ఉంటాడు. సంపన్నులలోకంటే పేదలలో ధర్మగుణం ఎక్కువగా ఉంటుందని భావించారు." బెట్రాండ్ రస్సెల్, హిస్టరీ ఆఫ్ వెస్టర్న్ ఫిలాసఫీ). ఈ ధోరణికి విజ్ఞప్తిచేసిన రూసో 19 వ శతాబ్దపు ఉద్వేగవాదులకు దానిని అందించాడు. విప్లవానికి ముందు వివేచనారాహిత్యానికి ఫ్రాన్సు అతి సన్నిహితంగా రావడం బహుశా అప్పుడేనేమో, ఉద్వేగవాద స్థాపకుడుగా రూసో చరిత్రకెక్కాడు. కానీ సంవేదన ఉద్వేగవాదపు ప్రవక్త స్వదేశంలో అట్టేకాలం మన్ననలను పొందలేదు. చాలావరకు జర్మనీలోను, కొంతవరకూ ఇంగ్లండులోను ఇతడి ప్రభావం పడింది. ఇంగ్లండ్‌లో

---

25. (Jean Baptiste du Bos) జీన్ బాప్తిస్తే డుబ.

26. (Robert Boyle 1627–91) ఇంగ్లీషు రసాయనిక, భౌతిక శాస్త్రజ్ఞుడు.

27. 1632-1704 ఇంగ్లండు తత్త్వవేత్త.

28. (Richelien 1585–1642) ఫ్రెంచి రాజనీతిజ్ఞుడు.

సంవేదనా ఉద్వేగవాదం, సాహిత్యానికి పరిమితమై, అతి త్వరలోనే తేరుకున్నది. జర్మనీలో సంకుచిత సాంస్కృతిక ఉద్యమాన్ని ప్రేరేపించి, తీవ్రమైన రాజకీయ తత్త్వాన్ని రేకెత్తించి, ఎనలేని నష్టాన్ని ఈ వాదం తెచ్చిపెట్టింది.

30 సంవత్సరాల యుద్ధానంతరం, ఆధ్యాత్మికంగా అలసిపోయిన జర్మనీ, సాష్టాంగపడింది. ప్రష్యా సామ్రాజ్యం స్థాపించేటంతవరకూ దారుణమయిన ఫ్యూడల్ అరాచకత్వంలో మునిగితేలిన జర్మనీ, మధ్య యుగాల్లోని మతాధిక్యంతోకూడిన రాజరికానికి సైనికబలంతోకూడిన సామ్రాట్టు వచ్చేవరకు ఈ స్థితిలోనే ఉన్నది. మతయుద్ధాల అనంతరం 28 రిష్‌లూ అధ్వర్యాన ఫ్రాన్సులో రాజకీయాభివృద్ధి పైధోరణులలో ప్రారంభం అయింది. జర్మనీలో ఇదే ధోరణిని 29 బ్రాన్‌డన్‌బర్గ్‌కు చెందిన 30 హొహెన్‌జోలర్న్ (HOHENZOLLERNS) పై పద్ధతులననుసరించాడు. అయితే 18 వ శతాబ్దారంభం వరకు ప్రష్యా సామ్రాజ్యం గట్టిగా నిలదొక్కుకోలేదు. సామాజిక చారిత్రక ప్రాధాన్యంతోకూడిన ఈ అభివృద్ధికి అర్థమేమంటే, సంస్కరణవాదం కంటే పునర్వికాసధోరణే పైచేయిగా ఉందన్నమాట. రాజకీయాలను మతేతరంగా చూసే విధానమది. సంస్కరణవాదం, సంస్కరణ వ్యతిరేకవాదం పరస్పరం రద్దుకావించుకొనగా, 2 శతాబ్దాల మతయుద్ధాల ఒడిదుడుకులను తట్టుకుని పునర్వికాసం నిలబడింది. అట్లాగే రాజకీయ గందరగోళానికి సాంఘిక అస్థిరత్వానికి కూడా పునర్వికాసం తట్టుకున్నది.

అయినప్పటికీ సైనిక సనాతనత్వం పెత్తనం వహించిన మధ్యకాలంలో అసహనం, మతద్వేషం స్వైరవిహారం జరిపాయి. ఫ్రాన్సులోను ఇంగ్లండ్‌లోను ఇందుకు మినహాయింపు జరిగినా, పునర్వికాసానికి చెందిన రామణీయక సాంస్కృతిక సంప్రదాయం, లాంఛనప్రాయంగా జర్మనీలో దిగజారిపోయింది. 17వ శతాబ్దపు చివరిదశలో జర్మనీలోని మేధావుల జీవితం అట్టడుగు స్థానానికి కుంగిపోయింది. ఆ కాలంలో సృష్టించిన సాహిత్యం, రామణీయక అభిరుచికూడా పునర్వికాసానంతర పతనావస్థ సంస్కృతిలో ఇటలీ ఎట్లా ఉందో దాని ప్రభావమే జర్మనీపై పడింది. "అంతకుముందు సాధించిన వాటన్నింటికి ఐరోపాలో గ్రహణం పట్టింది. పాశ్చాత్యుల కళ్ళన్నీ ప్రాచీనత్వపు వెలుగులో బైర్లుకమ్మాయి." (జె. జి. రాబర్ట్‌సన్, ది జెనిసిస్ ఆఫ్ రొమాంటిక్ థియరీ). మారినిస్మో దిగజారుడు విధానం జర్మనీలోకూడా వ్యక్తమై, హాస్యాస్పదంగా మారింది.

జర్మన్ సాహిత్య చరిత్రలో తరచు వచ్చిన ఆటుపోటులు ఐరోపాదేశాలలో లేకపోవడం ఒకవిశేషం. ఇందుకు రాజకీయపు ఒడుదుడుకులే ప్రధానకారణం కాదు. ఆమాటకువస్తే రాజకీయాలు వీటిపై అంతగా ప్రభావాన్ని చూపలేదు. ఇతర దేశాలలో

సామాజిక పతనావస్థ, రాజకీయ గందరగోళంమధ్య, కళలు, మేధస్సుతో కూడిన సంస్కృతి విలసిల్లినది. పరస్పర విరుద్ధంగా కనిపించే ఈ చారిత్రకానుభవానికి ఇటలీలోని పునర్వికాసం గొప్ప ఉదాహరణ. (20వ శతాబ్దంలోనే జర్మనీకి ఇటువంటి అనుభవం ఉన్నది. మొదటి ప్రపంచయుద్ధంలో దారుణంగా ఓడిన జర్మనీలో కళలు సంస్కృతి మాత్రం యుద్ధానంతరం అత్యున్నత స్థాయికి చేరుకున్నవి. జాతీయ సంకుచిత తత్త్వం తాత్కాలికంగా ఉదారవాద విశ్వజనీన దృక్పథానికి తల ఒగ్గినప్పుడు చాలామంది కళాకారులు మేధావులు విప్పారడం గమనించవచ్చు.) జర్మనీ సాహిత్యం జాతీయవాదంతో మునిగిపోవడమే దీనంతటికీ కారణం. 16 వ శతాబ్ధంనుంచీ 18వ శతాబ్ధం వరకూ, ఇటలీలో ప్రారంభమై ఫ్రాన్స్ ద్వారా ఐరోపానంతటినీ 300 సం॥పాటు ముంచెత్తిన సాహిత్య సాంస్కృతిక ప్రభావ తరంగాలకు జర్మనులు ఇమడలేకపోయారు. బైటనుంచి వచ్చే ప్రభావాలను, ముఖ్యంగా లాటిన్ వాదాన్ని వ్యతిరేకించడం జర్మనీ సాహిత్యంలో సంస్కృతిలో కనిపిస్తుంది.

జర్మనీ మత ఆలోచనలు, మార్మికవాదం, మధ్యయుగాల్లోని విలక్షణంగా ఉంటూవచ్చింది. సంస్కరణవాదానికి నాందిపలికిన 31 రూఖ్‌లిన్ వంటివారు మార్మిక వ్యక్తిగత సంస్కృతివల్ల ప్రేరేపితులయ్యారు. రిచిలున్, అతని అనంతరం ఎరాస్మస్, మతగురువుల సనాతనత్వానికి వ్యతిరేకంగా ఉదారవాదం కోసం పోరాటం జరపడంవల్ల జర్మనీ సాహిత్యంలో సత్సంప్రదాయాలకు మార్గమేర్పడింది. సంస్కరణవాద కాలంలో 32 మెలాంచుతాన్, 33 వాన్‌హటన్ ఇరువురూ లాటిన్ మానవతా వాదంతో సానుభూతి వ్యక్తం చేశారు. ఆ కాలంలో మత వివాదంనుంచి బైటపడి వ్యంగ్యంతో కూడిన నాటకం ఒక్కటే సాహిత్యంగా వెలువడింది. 34 లూథర్ మత విద్వేషానికి వ్యతిరేకంగా, థామస్ మర్నర్ (1475-1537) తన వ్యంగ్య నాటకాల ద్వారా తీవ్రమయిన దాడి జరిపాడు. 16వ శతాబ్దపు ఉత్తరార్థంలో జోనస్ ఫిషర్ట్ జర్మనీ సాహిత్యంలో మానవతావాదాన్ని ప్రవేశపెట్టడానికి రాఫెల్ ధోరణిలో వ్యంగ్యాన్ని ప్రయోగించాడు. పునర్వికాస మానవతావాదుల అనువాదాలు దేశంలో పుంఖానుపుంఖంగా వెలువడ్డాయి. అది 35 హాన్స్ జాక్స్ కాలం. జర్మనీ సాహిత్య చరిత్రలో పేర్కొనతగిన ప్రజాబాహుళ్య సాహిత్య సంపద అంతటినీ ప్రభావితంచేసే షాస్ తన ముద్రను వేశాడు. ఇతడు

---

29. తూర్పు జర్మనీలో ఒకప్పుడు యీ పేరిట గల రాష్ట్రం.

30. రాచకుటుంబీకులలో ఒకరు 1871 నుంచి 1918 వరకు జర్మనీ పాలకులు.

31. (Reuchlin 1455-1522) జర్మనీ మానవతా పండితుడు.

"WUERTTEMBERGISCHE NACHTIGALL" కు అభిమాని. అయితే జర్మనీ సంస్కృతి సంప్రదాయానికి ప్రాతినిధ్యం వహించిన లూథర్ మత అసహనమే జయించింది. పునర్వికాస మానవతావాద ప్రభావం జర్మనీలో కొద్దికాలమే ఉంది. జాతీయవాదంతోకూడిన ప్రొటస్టెంట్ మతానికి, పోప్ కాంక్షలకు జరిగిన సంఘర్షణల ఫలితంగా 30 సంవత్సరాల యుద్ధం ముంచుకవచ్చింది. దీనివల్ల జర్మనీ చాలాకాలం రాజకీయ గందరగోళంలో, సామాజిక విచ్ఛిన్నతలో, మేధస్సుపరంగా ఉదాసీనతలో, సాంస్కృతిక తిరోగమనంలో పడిపోయింది. లూథర్ వాదం ఛాందసత్వంలో స్తంభించిపోయింది. నేలబారు పాండిత్యంవల్ల జర్మనీ మేధస్సుకు సంకెళ్ళు పడ్డాయి. మిడిమిడి సంప్రదాయవాదంవల్ల సాహిత్యానికి అంధకారం అలముకున్నది.

కవిత్వంలో మార్మికవాదాన్ని తిరగతోడటంలో ఈ ప్రతిష్ఠంభనం సడలింది. ఉద్వేగవాదాన్ని పునర్వికాస ధోరణిలో అనుకరిస్తూ, జానపద గేయాలద్వారా దేశభక్తిని ప్రచారం చేయడం జరిగింది. 36 ఓపిట్జ్ (1597-1639) సాహిత్యంలో మార్మిక ఉద్వేగవాద నాయకుడుగా, జర్మనీలో మారినీస్మో శకానికి నాంది పలికాడు. కవిత్వంపై అతని పుస్తకం జర్మనీ ఉద్వేగవాద సాహిత్యంలో 100 సంవత్సరాలపాటు సిద్ధాంతపరమైన పాఠ్యగ్రంథంగా ఉన్నది. ఆ కాలంలో జర్మనీ కవిత, నాటకం కేవల ఆడంబరంగా దిగజారిపోయింది.

ఫ్రెడరిక్ వాన్‌లోగా (ప్రథమ సైలీషియన్‌వాది) ఉద్వేగవాదంలోని నైచ్యతపై, మిడిమిడిజ్ఞానంపై తిరుగుబాటు చేశాడు. నాటి దోషాలను బైటపెడుతూ సంక్షిప్త సూత్రాలను ప్రచురించారు. క్రైస్తవమతంకోసం 30 సంవత్సరాలు యుద్ధంచేసి రక్తాన్ని చిందించడాన్ని అపహాస్యంగావించాడు. ఈ తిరుగుబాటు ప్రమాణాన్ని గ్రిమ్మెల్‌షాన్ ఇంకా ముందుకు తీసుకుపోయాడు. DER ABENTEUERLICHE SIMPLIZISSIMUS అనే నవల ఆకాలంలో అత్యుత్తమమైనది. 30 సంవత్సరాల యుద్ధ ఫలితాలను అరమరికలులేకుండా వాస్తవంగా బైటపెట్టడంలో ఈ నవల ప్రసిద్ధిచెందినది. లోహెన్‌స్టెయిన్, ఆఫ్‌మన్‌వాల్డెన్ 37 అనే వారిరువురూ జర్మనీలో సాహిత్యరంగంలో అట్టడుగుస్థాయికి పోయారు.

30 సంవత్సరాల యుద్ధఫలితాలనుంచి సామాజికంగా చాలానెమ్మదిగా తేరుకోవడం అట్లా ఉంచి 38 సామ్యూల్ పఫెన్‌డాఫ్, 39 క్రిస్టియన్ వూల్ఫ్, లెబ్నిస్ 40ల వివేచనావాద ప్రభావం కింద మేధావులు తేరుకున్నారు.

17వ శతాబ్దాంతంలో బ్రాక్స్ 41 వల్ల జర్మనీ సాంస్కృతికంగా సాహిత్యపరంగా తిరగదోడే విధానాన్ని ప్రారంభించింది. జర్మనీ ఉద్వేగవాదానికి అతడే నాందిపలికాడని అనవచ్చు. మారినిస్ట్‌గా సాహిత్య జీవితాన్ని ప్రారంభించినప్పటికీ ఆ అభిరుచి నచ్చక

మిల్టన్ తదితర ఇంగ్లీషు ఉద్వేగవాదుల ప్రభావం కింద వచ్చాడు. ప్రకృతిని పవిత్రంగా చూడటం, సహజ సంఘటనలకు మతపరమైన వ్యాఖ్యానం చేయడం అతని కవితలో ప్రధాన లక్షణాలు. ఇతడి ప్రధాన రచన IRDISCHES VERGLUEGEM IN JOTTI జర్మనీలో సహజ మతాన్ని ఈ గ్రంథం ద్వారా ఇతడు ప్రవేశపెట్టాడు. మతపరమైన అసహనం, పవిత్రంగా ఉన్నట్లు నటించడం, నైతిక అతిశయోక్తి ఇత్యాదులన్నీ సంస్కరణవాదంలో ఉండగా, బ్రాక్స్ కవితలో పునర్వికాసానికి సంబంధించిన మతేతరధోరణి, మానవతా లక్షణాలు కనిపించాయి. దైవంలో విశ్వాసానికి, లోకంలో సంతోషానికి సమన్వయీకరణ చేయవచ్చునన్నాడు. ఆనందంగా ఉండటాన్ని పవిత్రత అడ్డుకోదన్నాడు. బ్రాక్స్ ప్రారంభించిన సాహిత్య లక్షణాలు ఇప్పుడు పూర్తిగా విస్మరించినా క్లాప్‌ష్టాక్, క్లష్ట్ చేతులలో పరిణతి పొందింది. కానీ మధ్యకాలంలో ఇందుకు విరుద్ధధోరణిలో సాహిత్యం పయనించింది.

బోహార్ విమర్శ అవహేళనపై దాడి జరిపింది. తలబిరుసుతనానికి అతడు పెట్టిందిపేరు. "జర్మనీ పౌరుడికి భావం ఉంటుందా?" అని ప్రశ్నించాడు. ఫ్రెంచి విమర్శతో దెబ్బతిన్న కొందరు జర్మను రచయితలు అవహేళన పద్ధతులను ఎదుర్కొనడానికి సంసిద్ధులయ్యారు. జర్మన్ సాహిత్యంలో సంప్రదాయవాదాన్ని తిరగదోడారు. లెప్‌సిగ్‌లో వీరు స్థాపించిన సాహితి సమితికి గోట్‌షెడ్ 42 నాయకత్వం వహించాడు. అదే సమయంలో యూరప్ అంతటికీ సాహిత్యాభిరుచులలో మార్గదర్శిగా 51 బోయిలూ ఉన్నాడు. ఈ కొత్త సాహిత్య ఉద్యమం ఫ్రెంచి సంప్రదాయవాద ప్రభావంకింద వచ్చింది. లెబ్నిస్, థామసిస్‌లు జర్మన్‌భాషను మెరుగుపరచాలని జర్మనీసాహిత్యాన్ని సృష్టించాలనీ వాదించారు. (లెబ్నిస్ ఎక్కువగా లాటిన్, ఫ్రెంచి భాషలలోనే వ్రాసాడు). గోట్‌షెడ్ అతని అనుచరులు ఫ్రెంచి శైలిని అనుకరిస్తూ ఫ్రెంచి విమర్శ ప్రమాణాలకు కట్టుబడి ఉన్నారు. బోయిలూనుంచి అనుకరించిన గోట్‌షెడ్ కవిత్వం, నాటకం రాయడానికి మార్గదర్శక సూత్రాలను రూపొందించాడు.

---

32. (Melanchthon 1497-1560) జర్మనీ ప్రొటెస్టంట్ సంస్కర్త.

33. (Von Hutten) జర్మనీ మానవతావాది, వ్యంగ్యరచయిత.

34. 1483-1546 జర్మనీలో ప్రొటెస్టంట్ ఉద్యమ నాయకుడు.

35. (Hans Sachs 1494-1576) జర్మనీ రచయిత.

36. 1597-1639 జర్మనీ సాహిత్యరంగంపై ఎనలేని ప్రభావంచూపాడు.

37. 1776-1822 జర్మనీ రచయిత.

అతడు కవిగా గాక గద్య రచయితగా కృత్రిమతత్త్వాన్ని, ఆకృతిక దోషాలను చేశాడు. అయినప్పటికి జర్మనీ సంప్రదాయ వాదానికి అతడే పిలుపు ఇచ్చాడు. ఆ విధంగా లెస్సింగ్ 43కు ప్రాతిపదికలు వేసిఉంచాడు. కవిత్వాన్ని ముక్కుసూటిగా రాసినందుకు గోట్‌షెడ్‌ను లెస్సింగ్ విమర్శించాడు. జర్మనీ నాటక రంగంనుంచి అవహేళనను పారదోలడంలో గోట్‌షెడ్ సఫలీకృతుడయ్యాడు. ఇది పెద్ద విజయం. అతడిని ఇప్పుడు మర్చిపోయినప్పటికి అతడు లేకుండా లెస్సింగ్ లేడు.

జ్యూరిచ్ వర్గానికి చెందిన బోడ్‌మర్, బ్రెయిటింగర్‌ల ద్వారా జర్మనీ సాహిత్యంపై ఇటలీ ప్రభావం మళ్ళీ నిలదొక్కుకున్నది. ఈలోగా పునర్వికాసానంతర పతనావస్థనుంచి రామణీయక సిద్ధాంతం, సాహిత్యాభిలాష ఇటలీలో తేరుకుని మనుగడసాగించాయి. మొరటోరి, గ్రావినాలవల్ల ఇటలీ సాహిత్యంలో నవ్యఉద్వేగవాదం తలెత్తింది. ఈ కొత్త ఉద్యమంవల్ల బోడ్‌మర్, బ్రెయిటింగర్‌లు ప్రభావితులయ్యారు. మిల్టన్‌వల్ల ఆకర్షితులైన వీరికి షేక్స్‌పియర్ తెలియకపోలేదు. కానీ ఇటలీ ప్రభావమే వీరిపై ఆధిపత్యం వహించింది. కవితలో ఊహాస్వేచ్ఛ ఉండాలని వీరు వాదించారు. లెప్‌జగ్ వాదానికి సంబంధించిన మిడిమిడి సంప్రదాయాన్ని వీరు వ్యతిరేకించారు. కళాసృష్టికి ఊహేగాని వివేచన సాధన కాదన్నారు. శైలి, ఛందస్సుల నిబంధనలతో అదుపులు విధించరాదన్నారు. కవిత్వంలో అద్భుతాలు ఎంతవరకూ సమ్మతమనేది వివాదాంశంకాగా, ఇందులో జ్యూరిచ్ వాదమే నెగ్గింది. "చిరకాలంగా వివేచన బంధంలో ఉన్న కవిత్వం స్విస్ విజయంతో విమోచన పొందింది. కవి స్వేచ్ఛాపరుడయ్యాడు", (జె.జి. రాబర్ట్‌సన్).

సాహిత్యపరమైన ఈ వివాదానికి తాత్త్విక ఫలితాలు ఉన్నవి, మత పక్షపాతానికీ మతేతరవాదానికి సంఘర్షణ ఇందులో ఇమిడిఉంది. కార్నెల్, రాసిన్‌గారలకు చెందిన ఫ్రెంచి సంప్రదాయ సాహిత్యం జ్ఞానవికాసాన్ని కోరింది. అదే నమూనాలో గోట్‌షెడ్ సిఫారసు చేసిన విధంగా జర్మనీ సాహిత్య పునరుద్ధరణకు చారిత్రక ప్రాధాన్యం ఉన్నది. ఇటలీలోని నవ్య ఉద్వేగవాదం డేకార్ట్ విధానానికి వ్యతిరేకమయినది. అది కేథలిక్ విధానాలననుసరించింది. పునర్వికాసంతో క్రైస్తవమత వ్యతిరేకధోరణికి ప్రతిచర్యగా ఇది జనించింది. ఇంగ్లీషు విప్లవానికి చెందిన కవి ప్రభావంవల్ల జ్యూరిచ్‌కుచెందిన సాహిత్య ఉద్వేగవాదం ప్రభావితమయింది. పేరడైజ్ లాస్ట్ కావ్యంలోఉన్న విప్లవధోరణికంటే, మిల్టన్ పవిత్రవాదానికే ఎక్కువ ఆకర్షణ ఉన్నది. బ్రోడ్‌మర్, బ్రెయింటింగర్ ఎంత లూథర్ పవిత్ర విధానాన్ని అనుసరించినా, శక్తిమంతమయిన విప్లవాత్మక మతకావ్యాన్నిపోలిన కవితను సృష్టించలేకపోయారు. ఆ పని క్లాప్‌స్టాక్ చేయగలిగాడు. అతడు జ్యూరిచ్ వర్గానికి చెందినవాడు. కాని ఆ

వర్గం మరీ సంకుచితంగా ఉండటంవల్ల వారి ధోరణి అతనిలో జుగుప్సను కలిగించింది. జర్మన్ ఉద్వేగ సాహిత్యంలో ఇతడు రాసిన ది మెసయా (THE MESSIAH) అత్యుత్తమ కావ్యం. పునర్వికాస సంప్రదాయానికి చెందిన వాస్తవ ఉద్వేగవాదిగా క్లాప్‌స్టాక్ తన 60వ సంవత్సరంలో ఫ్రెంచి విప్లవాన్ని శ్లాఘించి, తన దేశస్థులను ఫ్రెంచివారి ధోరణిలో అనుసరించమన్నాడు. స్వేచ్ఛాపతాకాన్ని మొదట జర్మనీ ఎగురవేయలేనందుకు ఇతడు విచారం వ్యక్తపరచడం అతని జాతీయవాదంలో మహోన్నత విషయం.

లెస్సింగ్ నాయకత్వాన జర్మనీ సాహితీ పునరుద్ధరణ అంతా సంప్రదాయం వైపు నడచింది. గోట్‌షెడ్ నేలబారు విధానాన్ని, జ్యూరిచ్ వర్గపు మత ఛాందసాన్ని లెస్సింగ్ తృణీకరించినప్పటికీ గోట్‌షెడ్‌తోనే ఇతడికి చాలా సాధారణ లక్షణాలు ఉన్నాయి. ఈ లోపాలు ఎన్ని ఉన్నప్పటికీ జర్మనీ సంప్రదాయవాదానికి లెస్సింగ్ పితామహుడు. ఫ్రెంచి కేవలం అనుకరణగా జర్మన్ సాహిత్యం ఉండజాలదంటూ లెస్సింగ్ 18వ శతాబ్దపు ఫ్రెంచి తత్వాన్ని అభినందించాడు. తాను ఇతరులకంటే డిడరోనుంచి ఎక్కువగా నేర్చుకున్నానన్నాడు. తత్వాన్ని మత జ్ఞానంతో గందరగోళపరిచే వారి వల్ల భావ విమోచన ఆగిపోతున్నందుకు లెస్సింగ్ విమర్శించాడు. పిరికివారిని తప్పుడు ప్రవక్తలను అతడు తీవ్రంగా విమర్శించాడు. లూథర్ సనాతనత్వానికి వ్యతిరేకంగా వివేచనాత్మక క్రైస్తవమతం పేరిట బోధలు చేసేవారిని నిరసించాడు. ఇట్లాంటివారు క్రైస్తవులూ కాదూ వివేచనాపరులూ కారు అన్నాడు. జర్మనీ సంప్రదాయ వాదానికి లెస్సింగ్ స్థాపకుడు కాగా, అతని సమకాలీనుడైన హమన్ 44 దేశవాళీ ఉద్వేగవాదాన్ని ప్రభోదించాడు. ఇతడికి "ఉత్తరాది మాజీ" 45 అని పేరున్నది.

జర్మనులలో నిశిత మేధావిగా, అన్ని కాలాలలోను మహోన్నతుడుగా పరిగణించిన లెబ్నిస్, విచిత్రంగా జర్మనీ అధ్యాత్మిక మత్తుతో ఉన్నప్పుడు, జర్మన్ తత్వం పెల్లుబుకకముందు, జర్మన్‌సాహిత్యం పునరుద్ధరించకముందు నివసించాడు. పతనానికి నాంది అయిన 30 సంవత్సరాల యుద్ధం ఇంకో రెండు సంవత్సరాలకు

---

38. Samuel Puffendorf
39. 1679-1754 జర్మనీ తత్వవేత్త, గణిత శాస్త్రజ్ఞుడు.
40. 1646-1716 జర్మనీ తత్వవేత్త, రచయిత, గణిత శాస్త్రజ్ఞుడు.
41. Brockes
42. Gottsched
43. 1729-81 జర్మనీ విమర్శకుడు, నాటకకర్త.

ముగుస్తుందనగా జన్మించిన లెబ్నిస్, లెస్సింగ్ పుట్టకముందే చనిపోయాడు. లెబ్నిస్‌ను జర్మన్ అనేకంటే ఐరోపావాసి అనడం సబబుగా ఉంటుంది. రోమన్ విశ్వజనీనతకు చెందిన ఇతడు పారిస్‌లోను హెనోవర్ కొలువులోను స్వంత ప్రదేశంలో ఉన్నట్లే గడిపాడు. మధ్యకాలాల్లో ఉన్న క్రైస్తవమత విశ్వవ్యాప్తికి, సాంస్కృతిక సార్వజనీనతకు 18వ శతాబ్దంలో స్వస్తిపలికి జాతీయదృక్పథం వచ్చింది. మధ్యయుగాల ఆదర్శ వాతావరణంలో మానసికంగా గడిపిన లెబ్నిస్ జర్మనీ వాస్తవ స్థితిగతులపట్ల ఉదాసీనంగా ఉన్నాడు. అయినప్పటికీ జర్మనీ పునరుద్ధరణకు భావరంగంలో సహకరించిన ప్రధాన సంఘటనలలో ఇతడి తత్వాన్ని పేర్కొనకతప్పదు. జర్మనీ సాహిత్యంలో సంప్రదాయవాదానికీ ఉద్వేగవాదానికీ వచ్చిన సంఘర్షణ, ఉద్వేగవాదం సంకుచిత జాతీయవాదంగా దిగజారిపోవడం జరిగింది. పరస్పర విరుద్ధమైన ఈ రెండు దృక్పథాలూ గెటెలో మహోన్నత సమన్వయీకరణ పొందాయి. సంస్కరణవాద తాత్త్విక ఫలితాల వల్ల ఇది సంభవించింది. పునర్వికాస ఫలితంగా ఐరోపాలో జనించిన ఆలోచనలనుంచి జర్మనీ దూరంగా తమలో ఏకాకిగా ఉండటానికి క్రైస్తవమతాల మొండి పట్టుదలలమధ్య కలహాలే కారణం. ఫలితంగా పాండిత్యవాదం చాలాకాలం కొనసాగింది. 17వ శతాబ్దంలో జర్మనీస్థితి చాలా దారుణంగా ఉండేది. "సంస్కరణ వాదాల పోరాటం అనంతరం మేధస్సులో దేశం అలసిపోయింది. రాజకీయ ఆందోళనలు నైతికపతనం ఇందుకు సహకరించాయి. ఇతర దేశాలన్నీ వైజ్ఞానిక స్వేచ్ఛవల్ల కొత్తఊపిరి పీల్చుకోగా, దానిని సాధించడంలో జర్మనీ బలైనట్లు కనిపిస్తుంది. జర్మనీ ప్రొటస్టంట్లలో ఉన్న సంకుచిత మూర్ఖత్వం మరెక్కడా లేదు. ప్రకృతిశాస్త్రాల పరిస్థితి మరీ గడ్డుగా ఉండేది. సందేహవాదం, ఇంద్రియ జ్ఞానవాదం, పదార్థవాదం, ఫ్రాన్సులోనూ ఇంగ్లండులోనూ చోటుచేసుకొనగా, జర్మనీ నేలబారు మతపాండిత్య వాదానికి మాతృభూమిగా ఉండేది. ఫ్రాన్సులో కనిపించిన చురుకుదనం జర్మనీలో బొత్తిగా లేకపోలేదు. అయితే మతభావాల ప్రాధాన్యంవల్ల జర్మనీలో ప్రక్కదారులకు వెళ్ళిపోయారు. దేశంలో అత్యుత్తమశక్తులన్నీ అనవసర ఘర్షణలలో నిష్ప్రయోజనంగా పోరాడుకున్నారు. విశ్వవిద్యాలయాల్లో అధ్యాపకులు విద్యార్థులు చాలా మోటుగా తయారయ్యారు." (లాంజ్, హిస్టరీ ఆఫ్ మెటీరియలిజమ్). 17వ దశాబ్దపు ఉత్తరార్ధంలో, డేకార్ట్, బేకన్, హాబ్స్, స్పినోజా, లాక్ బోధించిన కొత్త తత్వానికి వ్యతిరేకంగా జర్మనీలో నాయకత్వం బయలుదేరింది. మతజ్ఞానాన్ని కాపాడడానికి శాయశక్తులా లెబ్నిస్ ప్రయత్నించాడు. ఇందులో అతడు చాలావరకు కృతకృత్యుడయ్యాడు. ఇతడి తత్వాన్ని వూల్ఫ్ "వివేచన మానవ విజ్ఞానంగా అతి సాధారణంగా ప్రచారంచేశాడు. 18 వ శతాబ్దపు తొలిభాషలు జర్మనీపై ఈ తాత్త్విక ప్రభావం చాలావరకు ప్రయత్నంచేసింది.

అటువంటి తిరోగమన తాత్త్విక వాతావరణంలో జర్మనీ ఉద్వేగవాదం పెంపొందింది. 17వ శతాబ్దాంతంవరకూ లెబ్నిస్ ఆధిపత్యంవల్ల జర్మనీలో దేకార్ట్ తత్త్వానికి చోటులేకపోయింది. చివరికి కొత్త తత్త్వం తిరోగమన కోటలో ప్రవేశించేసరికి స్పినోజా మార్మికతత్త్వంగాను, జగత్తేదైవం అనే ధోరణిలోనూ ప్రవేశించి, జర్మనీ ఉద్వేగవాదానికి ఉత్తేజాన్నిచ్చింది.

ఆధునిక కాలాల ఉషోదయంలోకూడా వివేచనావాదం జర్మనీ భావ పరిణామంలో చాలా అల్పస్థానాన్ని అలంకరించింది. మతపాండిత్య సాంప్రదాయానికి చెందినవాడయినా లెబ్నిస్‌కూడా వివేచనావాది. వివేచనను మతరహితం గావించడాన్ని ఇతడు ఎదిరించడంలో మతపాండిత్యంతోకూడిన వివేచనని వినియోగించాడు. అంతకుముందు వివేచనాత్మక మతజ్ఞానాన్ని కూడా అక్కడ తిరస్కరించారు. సంస్కరణవాదం గురించి మళ్ళీ విశ్వాసాన్ని పునరుద్ధరించారు. వివేచనాత్మక మతజ్ఞానానికి దీనివల్ల ప్రయోజనం లేకపోయింది. అరిస్టాటిల్‌ను పునరుద్ధరించాలనే ప్రయత్నం మెలాంచితాన్ చేశాడు. దీని ఫలితంగా అంధకారబంధురమయిన మధ్యయుగంలో సహితం ఇటువంటి అసహనంలేదంటే అతిశయోక్తి కాదు. అందువల్ల జర్మనీలో ఉద్యోగవాదం తులనాత్మకంగాలేదు. విప్లవానంతర ఫ్రాన్సుకంటే జర్మనీ చాలా తిరోగమనదేశంగా మారింది. వాస్తవానికి రూసో బోధించిన బాధ్యతా రహితమయిన ఉద్వేగవాదం జర్మనీకి సరిపడింది. మార్మిక భావనతో కూడిన జనేచ్ఛ అనేది అన్ని విధాలా శక్తిమంతమయిన రాజ్యం ఏర్పరచాలనే జర్మనీ సిద్ధాంతానికి ప్రాతిపదిక అయింది.

18వ శతాబ్దం మధ్యకాలానికి ప్రష్యా ప్రభువు ఫ్రెడరిక్ నాయకత్వాన జర్మనీ మేధావి రంగంలో ఏకాకితనాన్ని పోగొట్టుకొని బైటపడింది. ఇతర దేశాలనుంచి ముఖ్యంగా ఫ్రాన్సునుంచి సుప్రసిద్ధ శాస్త్రజ్ఞులను సాహిత్యవేత్తలను అతడు తన కొలువుకు ఆహ్వానించాడు. వోల్తేర్ 3 సం॥పాటు సాన్‌సూలో ఉన్నాడు. సుప్రసిద్ధ ఫ్రెంచి గణిత శాస్త్రజ్ఞుడు మపాటాను ప్రష్యా అకాడమీ అధ్యక్షస్థానానికి ఆహ్వానించారు. దీనిని ఫ్రెడరిక్‌తాత స్థాపించాడు. అకాడమీ పేరుకూడా మార్చివేశాడు. స్విస్ గణితశాస్త్రజ్ఞుడు యూలర్ ఆధ్వర్యాన అకాడమీ విజ్ఞానవిభాగం ఉంచారు. తరువాత లాగ్రేంజ్‌కు అప్పగించారు. అకాడమీలోని 18 మందిలో 13 గురు విదేశీయులుకాగా అందులో అధిక సంఖ్యాకులు ఫ్రెంచివారు. ఫ్రాన్స్, హాలెండ్‌లనుంచి బైటకు నెట్టివేయబడ్డ

---

44. 1730–1788 జర్మనీ ప్రొటెస్టంట్ చింతనాపరుడు.

45. క్రీస్తు పుట్టుకను చెప్పిన ముగ్గురు దూతలను Magi లంటారు.

డలమిట్ట్‌ను ప్రష్యా కొలువుకు ఆహ్వానించారు. ఫ్రెంచి కొలువులో అధికారభాషగా అయింది. "మేధావిరంగం అంతా ఫ్రెంచి వాతావరణంతో" ఉండటంవల్ల తాను ఫ్రాన్సులోనే ఉన్నట్లు వోల్తేర్ భావించాడు. స్పార్టా, ఏథెన్సు వాతావరణం పార్ట్సడామ్‌లో కనుగొన్నట్లు 1752లో వింకిల్‌మన్ పేర్కొన్నాడు. "ఉదయం అతడు మహాప్రభువు భోజనానంతరం ప్రతిభావంతుడైన రచయిత. అన్నివేళలా మానవతా తత్వవాది" అని వోల్తేర్ రాశాడు. తన కొలువు వాతావరణాన్ని "వివేచనకు విందుగాను, ఆత్మపొంగుగాను" ఫ్రెడరిక్ స్వయంగా చిత్రీకరించాడు.

అతి ఉత్సాహంవల్ల ఫ్రెడరిక్ అంతదూరం వెళ్ళాడు. "అయినప్పటికీ దేశంలోని మేధావి రంగాన్ని చాలా అశ్రద్ధగావించాడు. అయితే ఒకవిధంగా ఇది మంచికే ఉపకరించింది. రాజాశ్రయం కిందగాక జర్మన్ మేధావులు స్వయంశక్తిపై పెంపొందారు" (జి.పి.గూచ్, ఫ్రెడరిక్ ది గ్రేట్). జర్మనీ సాహిత్యాన్ని గురించి 1780లో ఫ్రెడరిక్ ఒకచిన్న గ్రంథాన్ని రాసి తాను యువకుడుగా ఉండగా జర్మనీ ఎట్లా ఉన్నదో వర్ణించాడు. "అసలు చిక్కుకుమూలం, భాషలో ఉన్నది. ఎంతమేధావి అయినా సమర్థంగా దీన్ని ప్రయోగించడం అసాధ్యమయింది. చిత్తశుద్ధిగా నిర్మొహమాటంగా ఒప్పుకోవాలంటే, జర్మనీలో సాహిత్యాభివృద్ధి జరగక ముందు జర్మనీ తత్త్వవేత్తలను సృష్టించిందేగాని కవులనూ చరిత్రకారులనూ సృష్టించలేకపోయింది. 30 సంవత్సరాల యుద్ధంవల్ల జర్మనీ సంస్కృతి వెనక్కుపోయింది." ఈ పరిస్థితిని మెరుగుపరచడానికి ఏమి చేయాలి? ముందుగా జర్మన్ భాషను సమగ్రంగా రూపొందించాలి. అన్ని భాషల ప్రాచీన గ్రంథాలు ఆధునిక పుస్తకాలు అనువదించాలి. అప్పుడు రచయితకూ పాఠకులకూ ఉత్తమ నమూనా ఏదో తెలుసుకునే అవకాశమేర్పడుతుంది. ఎంత సాధించవచ్చునో ఫ్రాన్సు ప్రపంచానికి చూపింది. 17 వ శతాబ్దంలో ఫ్రెంచి రచయితలు ఖండానికంతటికీ ప్రమాణాలను రూపొందించారు. జర్మనీ ఆ దేశం నుంచి నేర్చుకోవాలి. గ్రీక్‌ల నుంచి లాక్ వరకూ తత్త్వాన్ని చారిత్రక ప్రమాణక్రమంలో బోధించాలి.

చాలా ఆశతో కూడినదయినా ఈ కార్యక్రమం వాస్తమయినది. జడప్రాయంగా అట్టడుగుకుపోయిన దేశాన్ని పునరుద్ధరించాలంటే ఇదంతా తప్పదు. తన జీవితకాలంలో జర్మన్ మేధావులలో కన్పిస్తున్న భావావేశాన్ని ఫ్రెడరిక్ గమనించలేకపోయినా, అతడు ప్రారంభించిన సాహసోపేత కార్యక్రమాల చారిత్రక ప్రాధాన్యాన్ని తగ్గించ వీలులేదు. ఫ్రెంచి జ్ఞాన వికాస ప్రభావంవల్ల ఆలస్యంగానయినా, జర్మనీలో పునర్వికాసం వచ్చింది. ఇటువంటి స్వర్ణయుగం రావడం ముందే ఊహించిన ఫ్రెడరిక్ విశిష్టతను గుర్తించాలి. అతడిలా రాశాడు. "మెడిచె" 46ల వంటివారు కొందరుంటే, మనకు మేధావులు సిద్ధమవుతారు. ఆగస్టస్ ఉంటే వర్జిల్ జనిస్తాడు. మనకు ప్రయాణ రచయితలు

ఆవిర్భవిస్తారు. వారిని చదివి అందరూ లాభం పొందుతారు. మన సాహిత్యంలో ఇంకా అటువంటి మంచిదశ రాలేదు. కానీ ఆ దశ సమీపిస్తున్నది. అటువంటివారు వస్తారని, వృద్ధుడుగా నేను వారిని చూడలేకపోయినా, చెప్పగలుగుతున్నాను. మోసెస్‌వలె రానున్న స్వర్ణయుగాన్ని నేను చూడగలుగుతున్నాను."

ఫ్రాన్సు ద్వారా జర్మనీకి వచ్చిన పునర్వికాసానికి ఫ్రెడరిక్ సూత్రధారుడయ్యాడు. దురదృష్టవశాత్తు దీనివల్ల జర్మనీలో సామాన్యులు తక్కువవారమనే భావనతో బాధపడ్డారు. ఒకప్పుడు మానవతావాద విశ్వజనీనతతో, మితిమీరిన తెలివితో జర్మనీ చరిత్ర లేకపోలేదు. ఫిషె నుంచి జర్మనీ ఉద్వేగవాదం వివేచనారహితంగా రుగ్మతతోకూడిన మనోవిజ్ఞానంగా తయారయింది. అట్లా దిగజారకముందు ఉద్వేగవాదం జర్మనీలో ఉచ్ఛస్థాయిలో ఉండేది. అటువంటి పరిణతి సమయంలో వివేచనారహిత విధానంగాని, ప్రమాణగ్రంథాల వ్యతిరేకంగాని లేదు. సంప్రదాయానికి అధికారానికి లొంగిఉండే బదులు వ్యక్తి నిర్ణయం స్వేచ్ఛాన్వేషణ కావాలని జర్మనీలో ఒకధోరణి వ్యక్తమయింది.

"ఉద్వేగవాద సిద్ధాంతం పునర్వికాసంవల్ల జనించిందేగాక, బోయిలూ విశ్వాసంకూడా ఇందుకు తోడ్పడకపోలేదు. క్షుణ్ణంగా పరిశీలిస్తే ఉద్వేగ ఆలోచనకు ప్రాచీన ప్రమాణతకుగల వ్యతిరేకత ఆధారరహిత మయినది. ఈ వ్యతిరేకతనుగాక సమన్వయాన్ని అవగాహన చేసుకోవడంలో అభ్యుదయమున్నది." (జె. జి. రాబర్ట్‌సన్, ది జెనిసిస్ ఆఫ్ రొమాంటిక్ థిరీ).

వైమర్ కవులు, హెర్డర్ ఉద్వేగవాదానికి సంబంధించి ఇటువంటి వ్యాఖ్యానాన్ని చేశారు. వైమర్ కవుల సొంత స్తోత్ర పాఠాలనుంచి హెర్డర్ త్వరలోనే నివేదించాడు. ఉద్వేగవాదాన్ని సాహిత్యధోరణిగా గెటె, షిల్లర్‌లు స్వీకరించగా హెర్డర్ దృష్టిలో అది తత్త్వమయింది. గెటె ఇంకా విశాల దృక్పథంతో చూశాడు. తనను సంప్రదాయ సాహితీపరుడుగా భావించుకొన్నప్పటికీ గెటెలో ఉద్వేగవాదంతోకూడిన స్వీయసంస్కృతి భావన పోలేదు. అతడి తత్త్వానికి అదే మూలసూత్రంకూడా. ఉద్వేగవాదానికి హెర్డర్ తాత్త్విక స్థాయిని చేకూర్చగా, గెటె జీవితానికి సంబంధించిన వ్యక్తీకరణను స్వీకరించాడు. తన పరిసరాలను అధిగమించి, సాహిత్యంలో, విజ్ఞానంలో, తత్త్వంలో సృజనశక్తిని చూపగల స్వేచ్ఛాజీవిగా ఉద్వేగవాది ఉన్నాడు. లెనార్డో తరవాత మానవ ప్రతిభకు

---

46. 1389-1464 ఇటలీలో కళాసాహిత్య పోషకుడు జొవానడమెడిచె కుమారుడు. Medici

ప్రాతినిధ్యం వహించిన సంపూర్ణ మానవుడితడు.

హెర్డర్ పెంపొందించిన జర్మన్ ఉద్వేగవాదానికి మూలం వికో వరకూ పోయి చూడవచ్చు. రూసోకు దీనితో ఏమీ సంబంధం లేదు. కాంట్‌పై హేమన్ చేసిన తిరుగుబాటుతో ఇది మొదలయింది. కాంట్ విజ్ఞానానికి దూరమై పారలౌకిక అతి భౌతికతత్త్వాన్ని నిర్మించినప్పుడు ఇట్లా జరిగింది. హ్యూం సంశయవాద ప్రభావంతో కాంట్ కేవల వివేచనా విమర్శను ప్రారంభించాడు. 58 కాజైరర్ పేర్కొన్నట్లు, వివేచనపై రూసో చేసిన తిరుగుబాటు కాంట్‌పై ప్రగాఢ ముద్రను వేసింది. (ఎర్నస్ట్ కాజైరర్, రూసో, కాంట్, గెటె) జర్మనీ ఉద్వేగవాదంలో ప్రత్యక్షధోరణి అంతా వివేచనారహిత వాదంతో కూడిలేదు. వైజ్ఞానిక సహజవాదాభివృద్ధి అందులో ఇమిడి ఉన్నది, చరిత్రలో మానవుడి పాత్రను గమనించడం అందలి విశేషం. ఆత్మాశ్రయవాదం తప్పనిసరిగా వివేచనారహితం కానక్కరలేదు. కేవలం బాహ్య జ్ఞానమనేదేమీ లేదు.

మానవుడు సార్వభౌముడని, తన విధికి తానే నిర్ణేత అని ప్రకటించడం పిడివాదంకాదు. పాత మత సంబంధమయిన మొండివాదనలతో పోల్చిచూస్తే ఈ కొత్త సూత్రం మూఢవైఖరికాదని తేలుతుంది. చరిత్రలోను, చరిత్రకు ముందున్న గతాన్ని తరచిచూస్తే ఇందులో దైవప్రయోజనం బహిర్గతం కావడమనేదేమీలేదని స్పష్టపడుతుంది. చిరకాలంగా మానవ ప్రయత్నమే మనకు కనిపిస్తుంది. చరిత్రను ఇట్లా కొత్తగా అవగాహన చేసుకోవడంవల్ల, జీవితానికి సంబంధించిన ఉద్వేగవాదంలో వైజ్ఞానికి ప్రాతిపదికలు కల్పించాయి. మానవుడి సృజనశక్తిలో విశ్వాసం ఇందులో ప్రధానమయినది. చరిత్రకు సంబంధించిన వైజ్ఞానికతత్త్వం ఆవిర్భవించేసరికి, ఉద్వేగవాదంలో మానవతా విశ్వాసం అనేది ప్రాపంచికానుభవంగా మారింది. వికో దీనికి నాంది పలికాడు. హెర్డర్ ఉద్వేగవాద తత్త్వాన్ని రూపొందించాడు. మానవుడు ప్రకృతిలో భాగమని, మానవాభివృద్ధిలో భిన్నరూపాలన్నీ సహజమయిన రీతులేనని అతడు చూపాడు. మానవాభివృద్ధి అనేది వివేచనాత్మకమైన స్వేచ్ఛతోకూడిన ఇచ్ఛ అని ప్రకృతి విరుద్ధంగా ఇది జరుగుతుందని చెప్పాడు. కాంట్ చెప్పిన అలౌలిక మానవశాస్త్రానికి భిన్నంగా హెర్డర్ చరిత్రను నిర్వచించాడు. "మానవశక్తులు, చర్యలు కాలప్రదేశాలకు అనుగుణంగా మారడం కేవలం సహజమైన చరిత్ర". (IDEEN ZUR PHILOSOPHIE DER GESCHICHTE).

జీవపరిణామ క్రమంలో ఒక భాగంగా మానవాభివృద్ధిని గమనించినప్పుడు ప్రేరణకు తెలివికి తేడా అంతరించిపోతుంది. అంతర్బుద్ధికి వివేచనకుగల విచక్షణ లేకుండా పోతుంది. హెర్డర్ చెప్పిన ఉద్వేగవాదం వివేచనపై తిరుగుబాటు కాదు. మానవుడితో సహా ప్రకృతి అంతా సహజవాదమేనని అతడన్నాడు. జీవపరిణామంలో

ప్రేరణ అనేది కిందిస్థాయిలోను, తెలివి అనేది పైస్థాయిలోను ఉంటుందని హెర్డర్ భావించాడు. అంటే తెలివికి ఆదిమరూపమే ప్రేరణ అన్నమాట. ప్రేరణను విడమర్చిచూస్తే తెలివి అవుతుంది.

హెర్డర్ ఉద్వేగవాదంలో నీతిశాస్త్రం, రామణీయక శాస్త్రంకూడా కలిసిపోయాయి. ఒక ప్రమాణం ఆధారంగా వీటిని రాబట్టడమే అందుకు కారణం. మానవుడి భావనను జీవితం మొత్తంగా వ్యక్తీకరించేదే కళ అని అతడు భావించాడు. కళ రూపానికంటే కళాసృష్టిలోని విషయానికి అతడెక్కువ ప్రాధాన్యం ఇచ్చాడు. కళలో నీతిపైనొక్కు ఇచ్చాడు. హెర్డర్ నీతి శాస్త్రజ్ఞుడుకాడు. అతడు మానవతావాది. అత్యున్నత సత్యమే అత్యంత రమణీయమైనదని డేకార్ట్ చెప్పినట్లు ఇతడుకూడా మంచికి, అందానికి సన్నిహిత సంబంధముందన్నాడు. రామణీయక విలువలను నిర్ణయించడానికి ఆకృతికంటే అభిరుచికంటే, మానవ విషయం ప్రధానమని ఇతడు స్పష్టంచేశాడు. దీనివల్ల ఉద్వేగవాదానికి సంప్రదాయవాదానికి సాహిత్యపరంగా వచ్చిన వివాదంలో ఇతడు చిక్కుకొనలేదు. మానవతాతత్త్వంతో ఉద్వేగవాద రామణీయకాన్ని మిళితంచేశాడు.

హెర్డర్‌కంటె గెటె ఉద్వేగవాదిగా జర్మనీలో ధృవతార అయ్యాడు. 16 వ శతాబ్దంలో దోపిడీదారులైన వీరులను ఇతడు శ్లాఘించాడు (GOETZ VON BERLICHINGEN). చరిత్రలో వీరులపాత్రను శ్లాఘించడంవల్ల జర్మన్ ఉద్వేగవాదంలో క్లిష్టదశను ఎదుర్కొనవలసివచ్చింది. దీనివల్ల క్రూరమయినకాండ జరగడంతో అతడే ఉత్తరోత్తరా ఈ చర్యను ఖండించాడు. సమకాలీన ఐరోపాలో గెటె మహోన్నత రచయితగా ఖ్యాతిగడించడానికి సారోస్ ఆఫ్ వెర్థర్ అనే గ్రంథమే కారణం (SORROWS OF WERTHR).

ఇందులో ఇంద్రియజ్ఞాన సంవేదన ప్రధానాంశం. బలమైనవాడిదే రాజ్యమని అంతర్లీనంగా పేర్కొన్నాడు. ఉద్వేగవాదానికి సంబంధించిన ఈ ధోరణి, ఫాస్ట్ (Faust) 47 తొలిభాగంలో పరాకాష్ఠనందుకున్నది. జీవితానికి సారాంశం శాశ్వతమయిన నిరుత్సాహాన్ని అతడు చూపాడు. "జ్ఞానంతో విసుగుచెందిన" ఫాస్ట్ యువకుడుగా ఇలా ఆక్రందిస్తాడు. "సహజమయిన ఇంద్రియజ్ఞాన ధోరణులను ప్రీతిపరుద్దాం. కాలం అనే చైతన్యప్రవాహంలో మునిగిపోదాం." అయినా వయస్సు వచ్చిన తరువాత, తాను ఎన్నడూ నివసించలేదని ఫాస్ట్ ఫిర్యాదు చేస్తాడు. ఆత్మను అమ్ముకుని తృప్తికర జీవితాన్ని మెఫిస్టోఫిలెస్ 48 (MEPHISTOPHELES) వద్ద కొన్నట్లు పేర్కొంటాడు. జీవితానికి సంబంధించిన వీరోచిత భావనకాస్తా అనుభవంలోని ఒడుదుడుకుల వల్ల ''పైశాచికంగా'' మారిపోయింది. ఆ దశలో యౌవనంలో బాధ్యతారహిత ఉద్వేగవాదంనుంచి గెటె బైటపడ్డాడు. అయితే జీవితాన్ని ఆరాధించే విధానాన్ని

ఉదాత్తమయిన స్వార్థంగా చూపుతాడు. అదే ఉద్వేగవాద సారాంశం. చట్టవిరుద్ధంగా ప్రవర్తించడాన్ని విరోచితచర్య అని పేర్కొనడం, అతిమానవ భావనలుగా ఊహించడం జరిగింది. చిరకాలం నివసించిన గెటె ఉద్వేగవాదాన్ని గమనించి తన యౌవనదశలోని ఉద్వేగపు అతిశయోక్తికి తానే జుగుప్స చెందాడు. "ఉద్వేగం రుగ్మతతో కూడినది సంప్రదాయ ప్రమాణం ఆరోగ్యవంతమయినది" అని తీర్పు చెప్పాడు. ఉద్వేగవాదాన్ని తిరగదోడటం, రోమన్ ఆటవికదశకు ముందున్న స్థితిలోకి పోవడమేనని అతడు జర్మనీని హెచ్చరించాడు. నబలూంగన్ శకాన్ని తిరగదోడటాన్ని గెటె ఖండించాడు.

ఫాస్ట్ రెండో భాగంలో జీవితాన్ని గురించిన గెటె దృక్పథం మారింది. కవి స్వానుభవాన్ని ప్రతిబింబిస్తూ చరిత్రలో మానవుడి స్థానాన్ని సమాజంలో అతని విధులను గ్రహించడం కాలచరిత్ర సారాంశాన్ని రాయడం కనిపిస్తుంది. ఉద్వేగానికీ–వాస్తవానికీ, ఇంద్రియజ్ఞానానికీ–ఆలోచనతో కూడిన నిర్ణయానికీ, విశ్వాసానికీ–వివేచనకూ ఉద్వేగంగా విసర్జించడానికీ–నిశితమయిన అంతరాత్మకూ, మానవ ద్వేషానికీ–అమాయకతకూ సంఘర్షణ చిత్రించాడు.

ఫాస్ట్‌లో జీవితతత్త్వం అంతా ఉన్నది. పరిణతిచెందిన అనుభవంలోనుంచి, వివేకం నుంచి ఇదంతా రాబట్టారు. ఊహా ప్రతిపాదనలతో కూడిన తుదివిధానంగాగాక, అంతిమ సత్యాలుగాగాక, అనుభవంవల్ల మార్చుకుంటూపోయేవిధానం, పరిణామక్రమం ఆలోచనావిధానం, ఇందులో ఉన్నది. జీవితపు సారాంశమే స్పష్టమయిన చిత్రంగా ఇందులో ప్రత్యక్షీకరించాడు. "పునర్వికాసానంతరం ఐరోపాకవి ఎవరూ ప్రపంచానికి ఇటువంటిది అందించలేదు." (ఎన్‌సైక్లోపీడియా బ్రిటానికా, 13 వ ప్రచురణ). అందుకే ఫాస్ట్‌ను "18వ శతాబ్దపు మానవతావాదానికి చెందిన డివైన్ కామెడీ" అన్నారు.

గెటె స్వీయచరిత్ర DICHTULG UND WA HRHE IT లో అనుభవాల అస్థిరత్వపు సారాంశాన్ని ఆధారంగా వడబోసిన జీవితతత్త్వాన్ని చూపాడు. జీవితంలో అనూహ్యమైన సంఘటనలు ఉండటంవల్ల అస్థిరత్వం జనించింది. కవిత్వం అంతా అభూతకల్పనకాదు. స్వార్థంలేని అత్మాశ్రయవాదం, బాహ్యసత్య పునాదులను బద్దలుకొట్టడంలేదు. జీవితానికి సంబంధించిన ఉద్వేగవాదదృక్పథం నీతిశాస్త్రాన్ని రామణీయకశాస్త్రాన్ని సమన్వయీకరించాలి. పునర్వికాసకర్తలు విఫలమయినచోట గెటె సఫలీకృతుడయ్యాడు. అందుకని ఆధునిక ఐరోపా నమూనాగా పేర్కొనతగిన పునర్వికాసధోరణికి గెటె

---

47. గెటె నాటకం, జ్ఞానం, అధికారం కొరకు తన ఆత్మను అమ్ముకున్నవాడని జర్మనీలో ప్రసిద్ధిచెందిన పాత్ర.

48. గెటె నాటకంలో పైశాచిక పాత్ర.

మారురూపం అనవచ్చు. ఆ విధంగా ఉద్వేగవాదానికి, సంప్రదాయ సాహిత్యానికీ మధ్య వృథాగా జరుగుతున్న వివాదాన్ని అతడు ముగించేశాడు. స్వేచ్ఛకూ నియమానికీ విరుద్ధత్వంలేదని చెప్పాడు. నియమాన్ని అనుసరించడానికి మేధావి సిద్ధంగా ఉన్నాడు. కళ అంటే ప్రకృతికాదని మేధావికి తెలుసు. నియమం మాత్రమే స్వేచ్ఛను ఇవ్వగలదు.

# మితిమీరిన ఉద్వేగం

18వ శతాబ్దాంతానికి రూసో ప్రభావం జర్మనీలో వ్యాపించింది. ఉద్వేగవాదం, సాంస్కృతిక తాత్త్విక ప్రతిచర్యగా మారింది. "విజ్ఞానంలోని యాంత్రిక ధోరణి"పై తిరుగుబాటు చేస్తూ, విప్లవానంతర ఫ్రాన్సులో వచ్చిన, ప్రతిచర్యను పోలిన, కవిత్వ మర్మ ధోరణిని ఉద్వేగవాదం వ్యాపింపజేసింది. సంప్రదాయ బద్ధమైన ఉద్వేగవాదం పేర్కొన్న వ్యక్తిస్వేచ్ఛకు వ్యతిరేకంగా, "ఆధ్యాత్మిక సంపూర్ణతను" ఆచారంగా ప్రభోదించాడు. అదే సమయంలో విశ్వజనీనమయిన, ప్రజాస్వామిక, మానవతా వాదానికి వ్యతిరేకంగా ఒకానొక వీరుడు రావాలనే భావనను ప్రచారంచేసారు. వివేచనను ఉద్వేగానికి లొంగి ఉండేటట్లు చూసారు. అతీత మానవుడి భావనకు తప్పుడు శాస్త్ర ప్రమాణాన్ని కల్పించడంలో డార్విన్ సిద్ధాంతానికి విచిత్ర వ్యాఖ్యానం చేసారు. "స్పష్టమయిన ఉద్దేశాలలో చిక్కుకుని, డార్విన్ భావాలను వక్రీకరించి, రాజకీయ, నైతికరంగంలో విపరీత చోద్యాలను ప్రవేశపెట్టారు. పశ్చిమ ఐరోపాలోను జర్మనీలోను ఈ ధోరణి విపరీతాలకు దారితీసింది. అప్పటినుంచీ జర్మనీలో రాజకీయ ఆలోచన విచిత్రమయిన ద్వందవాదంగా మారిపోయింది. ఒకవైపున ఉద్వేగవాదం పుష్కలంగా ఉండగా ఆదర్శవాదంకూడా వెన్నంటి వచ్చింది. మరొకవైపున నీతిని ఆదర్శాలను పట్టించుకోని, మానవ ద్వేషంతో కూడిన వాస్తవవాదం వచ్చింది. ఈ రెండింటి కలయిక ఆశ్చర్యకరంగా జరిగింది. ఉద్వేగం పశుతుల్యంగాను, మానవ ద్వేషవాదం ఉద్వేగంగాను మారింది." (Ernst Treetlsch, The India's of Natural Law and Humanity in World Politics).

ఫ్రెంచి విప్లవ భావాలకు, ఆదర్శాలకు ప్రతిచర్యగా 19వ శతాబ్దారంభంలో జర్మనీ ఉద్వేగవాదం రూపురేఖలు సంతరించుకున్నది. విప్లవ ధోరణిని నిరోధించడానికి, జాతీయవాదానికి ఒక తప్పుడు తాత్త్విక ప్రమాణాన్ని సమకూర్చడమే దీని ఉద్దేశం. జ్ఞానవికాసానంతరం జర్మనీలో ఉద్వేగవాదాన్ని 18వ శతాబ్దంపై తిరుగుబాటుగా భావించాలి. ఆనాడు ఆధునిక ఐరోపాకు ప్రాతినిధ్యం వహిస్తున్న ఫ్రెంచి సంస్కృతి చొచ్చుక పోతుండగా, దానికి ప్రతిచర్యగా ఈ ఉద్వేగవాదం వచ్చింది.

ప్రష్యాలో కేంద్రస్థానంనుంచి సాంస్కృతిక విప్లవాన్ని బలవంతంగా అమలుపరిచారు. మిగిలిన జర్మనీలో, ముఖ్యంగా ఫ్రాన్సు సరిహద్దులను ఆనుకొని

ఉన్నచోట్ల జ్ఞానవికాసం మామూలుగానే వ్యాపించింది. పునర్వికాస కాలంలోని ఇటలీ నియంతను అనుకరిస్తూ, జర్మనీ ప్రభువులు సాహిత్యాన్నీ కళనూ, పాండిత్యాన్నీ ఆదరించారు. హెనోవర్ కొలువులో లెబ్నిజ్ ఉన్నాడు. క్లాప్‌స్టాక్, లెసింగ్, క్లైస్ట్ ఇంకా వారి సమకాలీనులు సాక్సనీలో ఉన్నారు. మేమర్‌ను 18వ శతాబ్దపు ఉత్తరార్థంలోని ఏథెన్సుగా భావించవచ్చు. పాండిత్యం సంస్కృతి ఎక్కడున్నా ఫ్రెంచి ప్రభావాన్ని ఆహ్వానించింది.

19వ శతాబ్దంలో జర్మనీ ఉద్వేగవాదం, జాతీయవాదంతో తాదాత్మ్యం చెందింది. జనాలకు గల ఆత్మభావాన్ని హెర్డర్ రూపొందించగా యవ్వనంలో ఉన్న గెటె ఉద్వేగవాదాన్ని అనుసరించాడు. వీరిరువురీ ప్రేరణవలన జాతీయవాదం వచ్చింది. జనాల ఆత్మ అనేభావన హెర్డర్ దృష్టిలో ఆదిమ మానవశాస్త్ర భావన. జనాలలో ఆత్మను మొక్కలవలె విచ్చుకుంటూపోయే జీవంగా, చారిత్రక పరిణామాన్ని అతడు చిత్రీకరించాడు. అదొక ఉద్వేగభావన. బహుశా వికోనుంచి స్వీకరించి ఉండవచ్చు. దీనిలో చాలా ప్రమాదకరమైన ధోరణులున్నాయి. అయినప్పటికీ, తన విశ్వజనీన మానవతావాదానికి హెర్డర్ దీనినే ప్రతిపాదనగా స్వీకరించాడు. జనాల ఆత్మ అనే మర్మభావం చక్కని సాహిత్యానికి ప్రేరణ ఇచ్చినట్లు తొలుత ఉద్వేగవాదులు ఊహించారు. ఫ్రెంచి విప్లవానంతరం జర్మనీ ప్రజల ఆత్మ దివ్యమయినదిగా భావించడం ఉద్వేగవాద నినాదంగా మారింది. "ఉద్వేగవాదానికి చెందిన జర్మనీ భావకవులు నూతనంగా వచ్చిన జాతీయవాదంతో ప్రేరణపొందారు. 18వ శతాబ్దపు మానవాళి ధోరణికి భిన్నంగా, ఆయా ప్రజానీకానికి విశిష్టమైన మేధస్సు ఉంటుందనే భావం ప్రబలింది. గతంలోని రచనలు ఈ విషయాన్ని వెల్లడిచేసాయన్నారు. ప్రజలలో తలవని తలంపుగా వెల్లడయే నమ్మకాలు, కథలు, పాటలు అన్నీ ఇందుకు సాక్ష్యం అన్నారు. జర్మనీ ఉద్వేగవాదులు వీటినుంచే తమకు కావాలసిన భావాలను సమకూర్చుకున్నారు." (ఛార్లెస్ సైనోబాస్, ది రైజ్ ఆఫ్ మోడరన్ యూరోపియన్ సివిలిజేషన్).

ఉద్వేగవాదం జర్మనీకి విలక్షణమయిన ధర్మమని ట్యూటానిక్ ఆత్మ పెల్లుబకడం ఇందులో కనిపిస్తుందని అన్నారు. "ఉద్వేగవాదం జర్మనీది. రోమన్ వలసలనుంచి విముక్తి పొందిన భూభాగాలలో ఇది పవిత్రంగా వ్యక్తమయింది. వివేచనారహిత వాదం వ్యక్తిని వస్తువుని మార్మికంగా మేళవించడం కళలను కలగాపులగం చేయడం వింతను ఎక్కడో ఉన్నవాటి కొరకు తాపత్రయపడటం, అనంతం ఉన్నదనే భావన, చారిత్రకాభివృద్ధి కొనసాగించడం – ఇత్యాది విలక్షణ జర్మనీ ఉద్వేగవాద లక్షణాలన్నీ విశిష్టమయినవని అన్నారు. అందువలన లాటిన్‌భాష ప్రబలిఉన్నచోట ప్రజలకు ఇదంతా అవగాహన కాదన్నారు. ఫ్రాన్సులో ఉద్వేగవాదానికి జర్మనీలో ఉద్వేగవాదానికీ

పేరులోనేతప్ప సాధారణ లక్షణం మరెందులోనూ లేదు.'' (GUSTAV PAULI, ఉదహరించిన GEORGE DEHIO గ్రంథం GESCHICHTE DER DEUTSCHEN KUNST).

నవ్య ఉద్వేగవాదంలో ప్రాతిపదికలు చూడాలంటే పరస్పర విరుద్ధమైన పైరెండు వాదాలలోను గమనించవచ్చు. ఫాస్ట్ విడిభాగం రచించేటప్పుడు ఇదే గెటెను వెన్నాడింది. సంస్కృతికి నాగరికతకు భిన్నత్వం చూపించే సిద్ధాంతాన్ని ఆవిర్భవింపచేయడానికి గాఢంగా నాటుకుపోయిన కవిత్వధోరణే మూలం అయింది. నాగరికత పాశ్చాత్యం, లాటిన్ సంబంధమైనది. సంస్కృతి జర్మనీకి చెందినది. స్పీచెస్ టు ది జర్మన్ నేషన్ అనే తన సుప్రసిద్ధ గ్రంథంలో ఫిషె ఈ సిద్ధాంతాన్ని పెంపొందించాడు. జర్మనులు స్వచ్ఛమైన ప్రాచీనభాష మాట్లాడే వారుగా అతడు గుర్తుచేస్తాడు. దానివలన ప్రకృతిశక్తులతో వారికి సంబంధం ఏర్పడుతుందన్నాడు. ఆవిధంగా జర్మనీ జాతీయవాద తత్త్వవేత్త ఎలుగెత్తి చాటగా, మిగిలిన జాతులకంటే జర్మనీ జాతులవారు ఆదిమ భావాలకూ ప్రేరణలకూ అతి సులభంగా మరలిపోయారు. సంప్రదాయబద్ధమైన ఆలోచన క్రైస్తవమత ప్రభావంనుంచి వైదొలగడానికీ పాశ్చాత్యలోకం ప్రయత్నించింది. నాగరికతపై ఆటవికత్వం చేసిన తిరుగుబాటే జర్మనీ జాతీయవాదం. రూసో పేర్కొన్న ఉన్నతమైన ఆటవికుడి ధర్మమే సంస్కృతి. ఆటవికుడు తనధర్మాన్ని చూపడానికి నాగరిక ప్రపంచంలోకి వచ్చినప్పుడు అతడు ఉన్నతుడౌతాడు.

"పశ్చిమ ఐరోపా మానసికంగా అంతర్జాతీయ ధోరణిని చూపింది. నాగరికతను ఒక ప్రవర్తనారీతిగా భావించింది. మానవతాభావాలను విశ్వవ్యాప్తంగా అన్వయించవచ్చునని తలచింది. జర్మనుల దృష్టిలో సంస్కృతి అంటే తమకూ ప్రకృతి శక్తులకూ గల సన్నిహితసంబంధం మాత్రమే. ప్రకృతి చర్యలను వారే అవగాహన చేసుకొనగలరు. ప్రకృతి శక్తులను ఆటవిక క్రమశిక్షణతో జర్మనులు మలచగలరు. ఈ సన్నిహిత సంబంధాన్ని జర్మనులే తెలుసుకోగలరని'' ఫిషె నొక్కిచెప్పాడు.

పాశ్చాత్య వివేచనావాదాన్ని నిరాకరించడంలోనే జర్మనీ జాతీయవాదపు ఉద్వేగం ఉన్నది. మానవాళి విశ్వచరిత్ర తాత్త్వికుడుగా, పరిణామక్రమంలో భాషోత్పత్తినీ మానవశాస్త్రాన్నీ గ్రహించిన వాడుగా, 19వ శతాబ్దపు "ద్వార పాలకుడు"గా, హెరడర్‌ను అమరుడు గావించారు. కానీ విచిత్రమేమంటే ప్రజల ఆత్మ అనే ఇతడి భావనతో ఉత్తేజం పొందిన జర్మనీ జాతీయవాదం అతడి విశ్వజనీన మానవతా తత్త్వాన్ని విసర్జించింది. చరిత్ర అంటే "నియమరహితమార్పు" అని అతీతమానవులకు మచ్చలేని పాలకులకు పుట్టినిల్లు అందువలన వారికి బాధ్యతలేమీ ఉండవనీ పేర్కొన్నారు.

"సహజమయినా శాశ్వతమయినా దైవ నియమముందని ఎవరు నమ్మినా, అంటే విశ్వవ్యాప్తంగా మానవాళికి ఒక సాధారణరీతి ఉందని అంగీకరిస్తే, జర్మనీ

ఆలోచనలు మార్మికత, పశుత్వం విచిత్రంగా కలిసిపోవడం గమనించవచ్చు. చరిత్ర అంటే ఎడతెరిపిలేకుండా వ్యక్తులు జనించడం అయితే, మారుతూన్న నియమాలను అనుసరించి ఇలా సంభవిస్తుంటే, వివేచనావాదం పాశ్చాత్య భావాలలో కన్పించడం సహజం."(ERNST TROELSCH, DEUTSCHER GEIST UND WESTEVROPA). ఉద్వేగ జాతీయవాదానికి ఫిషె తత్త్వవేత్త అయితే దానిని ఛాందసంగా ప్రచారం చేసినవాడు ఫ్రెడరిక్ లగ్విగ్ జాన్. ఇతడిని ఫాదర్‌జాన్ అని అతడు శిష్యులు అప్యాయంగా పిలిచేవారు. నాగరికతకు వ్యతిరేకంగా గుహలలో నివసించే మనుషులు అభ్యంతర పెట్టడానికి ప్రతీకగా ఇతడు యువకుడుగానే చాలా నిడివైన గడ్డాన్ని పెంచడంవలన ఫాదర్‌జాన్ అనేపేరు వచ్చింది. (జాన్ కొంతకాలం గుహలో నివసించాడు. తనను వెక్కిరించే గుంపుమీదికి పెద్దరాళ్ళను దొర్లించేవాడు). జనావళి ఆత్మలనుంచి ప్రచారం చేయడంలో ఆంట్ అనే కవితోపాటు జాన్ కూడా ప్రసిద్ధి చెందాడు. అప్పుడే చనిపోయిన హెర్డర్ ఇదంతా చూసి ఆశ్చర్యపోయి ఉండాలి. జర్మనీ భాషపై వ్రాసిన ఒక గ్రంథానికి లెప్సిగ్ యూనివర్సిటీ జాన్‌కు డాక్టరేట్ పట్టాను ఇచ్చింది. విద్యార్థిగా ఇతడు 1800లో ష్లెగల్ సోదరులు స్థాపించిన నవ్య ఉద్వేగ ఉద్యమ ప్రభావానికి గురైనారు. జనావళి ఆత్మ అనే నినాదం ఆధారంగా జర్మనీ ఉద్వేగవాదానికి సంబంధించిన నూతనవర్గం "జీవం-ఏకాకితో కూడిన సమాజం అనే సమస్యను తెచ్చారు. ఉద్వేగవాదం స్వయంగా గోతులు త్రవ్వుకోవడం ప్రారంభించింది. వ్యక్తిత్వం స్వేచ్ఛగా అభివృద్ధి కావాలనేది దీని నినాదం. కొత్త విధానంలోకి ఛాందసంగా మారిన ఉద్వేగవాది జాన్, జర్మనీకి సంబంధించని మాటలను తొలగించడంద్వారా తన గ్రంథాన్ని "ప్రక్షాళనం" చేశాడు. నాజీల సంప్రదాయం దాదాపు 100సం॥కు పైగా ఉంది. జాన్ తన మూర్ఖత్వంలో ఇంకా ముందుకుపోయాడు. స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం అనే నినాదాలను వ్యతిరేకిస్తున్నానని ప్రకటించాడు. అవి విప్లవ నినాదాలైనందుకుగాక ఫ్రెంచి మాటలు అయినందుకు వ్యతిరేకిస్తున్నానన్నాడు. జనాల అవ్యక్తశక్తే చరిత్రను రూపురేఖలు దిద్దుతుందని జాన్ ప్రభోదించాడు. ఇదొక మార్మికమయిన శక్తి" జనావళికి సర్వసాధారణంగానూ అంతర్లీనంగానూ చలనంతోనూ ప్రచారంచేసే శక్తితోనూ ఇది ఉంటుంది. దీనివలన జనంలో ఒకవిధమైన ఆలోచన భావన ప్రేమ ద్వేషం అంతర్బుద్ధి విశ్వాసం కొనసాగుతుంది. (ఫ్రెడరిక్ లడ్విగ్ జాన్, WERKE, కార్ల్ వ్యూలర్ పరిష్కృతము).

జాన్ ఛాందస భావాలన్నీ VOLKSTUNE అనే గ్రంథంలో సమకూర్చబడినవి. గ్రీకులు జర్మనులు "మానవాళి పవిత్రజనం" అని వ్రాసారు. హెగెల్‌ను ఈ విషయంలో ముందే వూహించారు. హెగెల్ చరిత్ర తత్త్వాన్ని వ్రాసి గ్రీకులు జర్మనులు

ప్రత్యామ్నాయంగా దైవస్వరూపాలని రుజువు చేయడానికి ప్రయత్నించాడు. హెగెల్ ఉద్వేగవాది కాడు. అతని కాలానికి ఉద్వేగవాదం ఫాషన్ కాకుండాపోయింది. సాంస్కృతికంగా సంకుచిత జాతీయవాదంవలన పూర్తిగా మారిపోయిన ఉద్వేగవాదం భయానకమైన ఛాయలను ప్రసరింపజేసింది. హెగెల్‌నేకాదు హిట్లర్‌ను కూడా జాన్ వూహించాడు. జనం జీవసంబంధంగా ప్రక్షాళనమై ఉండాలన్నాడు. "సంకరజాతి పశువులు వృద్ధిచెందే శక్తిని సరిగా అట్టిపెట్టలేవు. అలాగే సంకరజాతి మనుషులుకూడా వృద్ధిచెందలేరు. ఎంత ప్రక్షాళితంగా ఉంటే అంత మంచిది. ఎంత సంకరమైతే అంతచెడు. (జాన్‌గ్రంథం). మధ్యధరా సముద్రతీర ప్రజలు సంకరజాతి. వారికి జనాలకు ఉండాల్సిన ఆత్మలు లేవు. కనుక భవిష్యత్తు లేదు. జర్మనులు ఎవరితోనూ కలవకుండా ఉండటం వలన జనాల ఆత్మతోకూడిన ప్రక్షాళన జాతిగా ఉన్నది. భవిష్యత్తు వారిదే.

ఫిషె వ్రాసిన "స్పీచెస్ టు ది జర్మన్ నేషన్"తోపాటు, జాన్ వ్రాసిన "ఓక్‌స్టం" కూడా జర్మనీ జాతీయవాదానికి పవిత్ర గ్రంథంగా మార్చారు. ఇందులో ఒకతను శుద్ధిలేని మొరటు వాడయితే మరొకడు తాత్త్వికుడు. "కొత్త జర్మనీకి అధ్యాత్మిక దైవాలుగా" వీరిరువురూ గౌరవం పొందారు. (J ఫ్రెడరిక్, JAHN ALS ERZIEHER ) చరిత్రలో ఇది మరొక వైపరీత్యం!

జర్మనీ ఉద్వేగవాదానికి పుట్టిన ఈ సంకరవాదం వ్యక్తివాదాన్ని సమష్టివాదానికి బలిచేసింది. అందరి సుఖదుఃఖాలలో వ్యక్తి భాగం పంచుకోవాలని జాన్ పిలుపునిచ్చాడు. ఉద్వేగభావంతో ఉన్న జర్మనీ ఈ పిలుపుకు స్పందించింది. జర్మనీ ఉద్వేగవాదంలో వ్యక్తి త్యాగంచేయవలసి వచ్చింది.

ఉద్వేగవాద మురికికూపంలో జనించిన చివరివ్యక్తి రిచర్డ్ వాగ్నర్ (మాక్స్‌నార్డా, డీ జనరేషన్). 1830లో వాగ్నర్ స్వయంగా పేర్కొన్నట్లు ఒక్కసారిగా విప్లవవాది అయ్యాడు. జాతీయ ఆడంబరత్వానికి మించిపోయి విశ్వజనీనత భావం కలిగించడమే కళ ఉద్దేశమని అతడు ప్రకటించాడు. ఇటలీ, ఫ్రెంచి, జర్మన్ ధోరణిలో వ్రాసేవాళ్ళు కాకుండా వేరేవ్యక్తి రావాలని ప్రార్థించాడు. (రిచర్డ్ వాగ్నర్, MEIN LEBEN ). మానసిక పారవశ్యంతో అతడు "ప్రపంచ సంస్కృతి రాజధాని" అయిన పారిస్ వెళ్ళాడు." "వివేచనావాదం వ్యక్తి ఉదారవాదంతో కూడిన ఫ్రెంచిభావాల" ప్రభావంతో వాగ్నర్ సగర్వంగా తనను "మార్మికమయిన మర్మ వ్యతిరేక భౌతికవాదిని" అన్నాడు. మూడేళ్ళ అనంతరం మానసిక రుగ్మతతో జర్మనీ తిరిగివచ్చాడు. తన స్వీయ చరిత్రలో ఇలా వ్రాసాడు. "గృహం లేదనే భావనవలన మళ్ళీ స్వస్థలమైన జర్మనీ వచ్చానన్నాడు." ఏకాకి అయిన వ్యక్తివాదంలో జనించినప్పటికీ ఇతడు ఉద్వేగవాద భావనతో కలిసిపోయాడు. ఇతనిలో వచ్చిన ప్రతిచర్య వలన సమష్టి జీవనంలో

మిళితమయాడు. అప్పుడు MEISTER SINGER అనే శీర్షికన కవితలు అల్లాడు. అందులో పాశ్చాత్య అవినీతికర ప్రభావం క్రిందకు పోవద్దని జర్మనీని హెచ్చరించాడు. ఈ గ్రంథాన్ని "నాగరికతకు గుచ్చిన బల్లెమని" నిషె వర్ణించాడు.

1848లో విప్లవం విఫలమైన తరువాత, షోపెన్‌హర్ పేర్కొన్న స్వేచ్ఛా సంకల్పంలోని సర్వశక్తివంతమనే వాదం సరిగాలేదని ఉద్వేగవాదం భావించింది. ఈ కొత్తతత్వాన్ని వాగ్నర్ తన TRISTAN లో చూపాడు. వివేచనాభివృద్ధిలో మళ్ళీ అతడు ఆశను చూపెట్టాడు. "వాస్తవంగా ఏమీ జరగదని సంకల్పం నుంచి వచ్చేదంతా గుడ్డిప్రేరణ" అన్నాడు. జర్మన్ సంగీతం, యూదుల సంగీతం ఉన్నదని అతడు కనుగొన్నాడు. ఇందులో ఒకటి మంచిది రెండోది కాదన్నాడు. మంచి జర్మనీ సంగీతాన్ని స్తుతించడానికి ట్యూటానిక్ గాథలను చిత్రీకరించాడు. ఇటువంటి ఉద్వేగవాదాన్ని గురించి గెటె హెచ్చరికచేసాడు. జర్మను ఉద్వేగవాదాన్ని గురించి వాగ్నర్ ఆలాపిస్తూ "మేధస్సును తృణీకరించడానికి ధైర్యంగా ఉండమన్నాడు." షోపెన్‌హోర్ పేర్కొన్న సంకల్పం చేతుల్లో కీలుబొమ్మ కావాలి. దీనినే నిరాశావాది అయిన తత్త్వవేత్త ద్వేషించాడు. నిరోధించాలన్నాడు. నాశనం చేయాలన్నాడు. కానీ వాగ్నర్‌మాత్రం సంపూర్ణంగా లొంగిపోవాలని ప్రభోదించాడు. "చైతన్యతలో విప్లవశక్తిని చూడదలచినప్పుడే నీవు తప్పుదారిన పడుతున్నావు. మేధస్సు ఆధారంగా పనిచేయదలచుకున్నప్పుడు తడబడుతున్నావు. నీవు కొత్తమార్గాన్ని చూపలేవు. వివేచనతో సంబంధం లేకుండా ప్రకృతి ప్రేరణతో, అవ్యక్తంగా ప్రజలు చేసేదే సరైనది. ఇన్నాళ్ళూ వ్యక్తుల చేతులలో ఉన్న శక్తి ఇప్పుడు జనం ప్రయోగిస్తేకాని విప్లవోద్యమం రాదు. వ్యక్తికి ఉన్న శక్తి జనం పొందినప్పుడే స్వేచ్ఛ సాధ్యమౌతుంది." రూసోను ప్రమాణంగా స్వీకరించి రాబస్ పీర్, జనసంకల్పంతో అంగీకరించని అల్ప సంఖ్యాకులపై స్వేచ్ఛను బలవంతంగా రుద్దాలన్నాడు. నాజీ నియంతకు వాగ్నార్ దారిచూపుతూ "నేను స్వేచ్ఛను ఈసడిస్తాను. జనం స్వేచ్ఛగా ఉండాలి" అన్నాడు. "19వ శతాబ్దానికి వ్యతిరేకంగా విప్లవవాది" (K. R. GANZER, RICHARD WAGNER, DER REVOLUTIONAER GEGAN DAS NEUNZEHNTE JHRHU NDERT) ఆ విధంగా జర్మనీ ఉద్వేగవాదులు 18వ శతాబ్దపు విప్లవంపైన తిరుగుబాటేగాక, 19వ శతాబ్దపు ఉదారవాద ప్రజాస్వామ్యంపై కూడా తిరుగుబాటే.

జర్మనీలో ఉద్వేగవాద తిరుగుబాటుకు చాలా ప్రాధాన్యత ఉన్నది. 19వ శతాబ్దంలో ఆధిపత్యం వహించిన తత్త్వంవలన దీనికి నూతన ప్రమాణం చేకూరింది. 18వ శతాబ్దపు ప్రాపంచికానుభవ తత్త్వం, ముఖ్యంగా లాక్ హ్యూంల తత్త్వం, దేకార్ట్ విధానంలోని ఆత్మాశ్రమ పునాదులను బలహీనపరిచింది. లెబ్నిస్ నుంచి షోపెన్‌హోర్

వరకూ జర్మనీ భావవాదం మళ్ళీ ఆత్మాశ్రమ వాదాన్ని తిరగదోడింది. స్వీయప్రేమ ఆచారం అనే తప్పుడు ఉద్వేగ విధానానికి ఇందులో తాత్త్వికబలం చేకూరింది. లెబ్నిస్ రూపొందించిన చిత్తంలోని అంశవాదం ఉద్వేగ వ్యక్తిత్వవాదానికి, స్వీయాభివృద్ధికి ఆదర్శంగానూ, నీతికి ప్రధాన సూత్రంగానూ మారింది. గెటె పేర్కొన్న స్వీయసంస్కృతి ప్రభావం చిత్తాన్ని ఒక అంశగా చూసే లెబ్నిజ్‌పై ప్రభావాన్ని చూపెట్టింది. కానీ ఆత్మాశ్రయనీతి శూన్యవాద నీతికి దారితీయవచ్చు. 19వ శతాబ్దపు తిరుగుబాటులో వెర్రితలలు వేసిన మితిమీరినతనమంతా ఇందుకు నిదర్శనం.

"ఉద్వేగ ఉద్యమం మానవ వ్యక్తిత్వాన్ని సాంఘిక ఆచారాల బంధంనుంచి సామాజిక నీతినుంచి విమోచన గావించడానికి ఉద్దేశించినది. కానీ స్వార్థ దృష్టి ఒకసారి విచ్చలవిడిగా పోనిస్తే మళ్ళీ సమాజ అవసరాల నిమిత్తం అదుపులో ఉంచడం కష్టం. ఉద్వేగ ఉద్యమం నైతిక రంగంలో తిరుగుబాటును తెచ్చింది. నియమరహితమైన నూతన అహాన్ని ప్రోత్సహించడంవలన, సాంఘిక సహకారం అసంభవమయింది. అరాచకం లేదా నియంతృత్వం ప్రత్యామ్నాయాలుగా మిగిలిపోయాయి. తొలుత అహంవాదం ఇతరులనుంచి మనిషికి తల్లిదండ్రుల వాత్సల్యాన్ని ఆశించింది. ఇతరులకు కూడా వారి అహం ఉంటుందని కనుగొన్న తరువాత కరుణకాస్తా ద్వేషంగానో హింసగానో రూపాంతరం చెందింది. మానవుడు ఏకాకి అయిన జీవి కాదు. సాంఘికజీవనం సాగేంతవరకూ నైతిక రంగంలో తననుతాను తెలుసుకోవడమనేది ప్రధానసూత్రం కాజాలవు." (బెట్రాండ్ రస్సెల్, హిస్టరీ ఆఫ్ వెస్టరన్ ఫిలాసఫీ).

ఫిషెతో తాత్త్విక రంగంలో ఉద్వేగవాదం పరాకాష్ఠ నందుకొన్నది. అతడికి అహం ఒక్కటే అంతిమ సత్యం. అహం దానంతటదే ఉంటుంది. అతిభౌతికమైన అహంభావన ప్రస్తుతం జనంపరంగా చెప్పాను. జర్మనీ ప్రజల అహం పరమార్థ సత్యం. బెట్రాండ్ రస్సెల్ వ్యాఖ్యానించినట్లుగా, సమష్టి ఆత్మాశ్రయవాదాన్ని ఫిషె "ఒకరకమైన ఉన్నతస్థాయికి" తీసుకుపోయాడు. "శీలంతో ఉంటూ జర్మన్ కావడం నిస్సందేహంగా" పైనచెప్పిన రీతిలోనే సాధ్యమన్నాడు. ఈ ఉన్మత్తత అంటురోగంగా ప్రబలింది. దీనిపై గెటె చేసిన వ్యంగ్యరచన జాతీయవాదానికి ఇష్టపూరిత నినాదమయింది. "మర్యాదగా ఉంటే జర్మనీలో నీవు వంచనపరుడివన్నమాట" అని ఫాస్ట్‌లో ఉద్వేగపూరిత యువకుడు చాటి చెబుతాడు.

ఉద్వేగపూరిత అహం వాదం తననుతానే కబళించివేసింది. అహం కనుక ఏకైక పరమసత్యమయితే, అనేక అహములు ఉండవు. జనానికి సంబంధించిన ఆత్మ అంటే వ్యక్తి అహాన్ని, ఉన్మత్త తాత్త్వికుని అహంతోసహా తొలగించడమే. నియంతృత్వానికి

ఫిషె తత్త్వవేత్త. విశ్వాత్మ భావనలో షెల్లింగ్ ఉద్వేగతత్వాన్ని ఇంకో అడుగు ముందుకు తీసుకుపోయాడు. విశ్వం విభజించరాని జీవం. భాగాలన్నింటికంటే ముక్తంగా చూసినదే గొప్ప. ఆ తాత్త్విక ప్రాతిపదికపై అతిభౌతిక సిద్ధాంతపరమైన రాజ్యభావనను హెగెల్ పెంపొందించాడు. పెనుభూతమైన రాజ్యంలో వ్యక్తిస్వేచ్ఛకు తావులేదు. తన ఆదర్శాన్ని తానే నాశనం చేసుకున్న ఉద్వేగవాదం ప్రతిక్రియకు సాధనగా మారింది.

జర్మన్ తత్వంలో జరిగిన ఈ అభివృద్ధి దారి మళ్ళడం వలన సంభవించింది. 18వ శతాబ్దంలోని వైజ్ఞానిక సహజవాదం, మానవతావాదాలను ఎదుర్కొనడానికి ఈ కొత్తరకపు మత పాండిత్య వాదం పూనుకొంది. లెబ్నిజేకాదు, కాంట్, ఫిషె, హెగెల్ కూడా ఈ తిరోగమన ధోరణికి ప్రాతినిధ్యం వహించారు. షెల్లింగ్ షోపెన్‌హార్‌లలో ఇది సంపూర్ణంగా వ్యక్తమయింది. మత జ్ఞానాన్ని తిరగదోడి, జగత్తు అంతా దైవం అనే మార్మికమైన భావానికి జ్ఞానాన్ని తిరుగుబాటు చేసారు. కాంట్ నిశిత తత్వానికి హ్యూం సంశయవాదం ప్రారంభదశగా భావిస్తారు. వాస్తవమేమంటే, హ్యూం భావాలు విచ్ఛిన్న కరమైనవని, వాటిని ఎదుర్కొని అతి భౌతిక సనాతనత్వాన్ని కాపాడాలని కాంట్ తలపోసాడు. రూసోతో ఇతనికిగల సన్నిహిత పరిచయం వలన ఫ్రెంచి విప్లవాన్ని తొలిదశలో సానుభూతిగా చూసాడు. రూసో ప్రభావం వలన తిరోగమనంతో కూడిన ఉద్వేగపు తిరుగుబాటును తాత్త్వికంగా సమర్థించాడు. ప్రపంచానుభవ జ్ఞానవాదంగా కనిపించే ధోరణితో తత్త్వంలో అంతరాత్మ వాదాన్ని ప్రవేశపెట్టాడు. ఇదికూడా, తప్పుడు విజ్ఞాన ప్రాతిపదికపై చేసాడు. అనుభవానికి ముందే జ్ఞానం ఉంటుందని చెప్పడం వలన తత్త్వంలో వివేచనారాహిత్యత చోటుచేసుకున్నది. "సిద్ధాంత పరమయిన వివేచనకు వ్యతిరేకంగా అతడు తన తత్త్వంలో హృదయానికి చోటు ఇచ్చాడు". (బెట్రాండ్ రస్సెల్)

కాంట్ తత్త్వంలోని వైజ్ఞానిక పదజాలాన్ని షోపెన్‌హార్ తొలగించి, అసలైన వివేచనారాహిత్యతను రూసో సంప్రదాయాన్ని బైటపెట్టాడు. జ్ఞానంకంటే సంకల్పానికి ఉన్నతస్థాయిని కల్పించడంతో, ఇతడు ఉద్వేగపు తిరుగుబాటును సమర్థించాడు. కానీ తత్వానికి ఆధారం లేకుండా చేసి మళ్ళీ మతపరమయిన మార్మిక వాదంలోకి వెళ్ళిపోయాడు. ఉద్వేగపు తిరుగుబాటు సాంస్కృతిక జాతీయ వాదానికి చెందిన వివేచనారహిత ఆచారంగా దిగజారిపోయింది. 20వ శతాబ్దంలో ఇదొక పెద్ద చీడగా మారింది. జాతీయ వాదంలో ప్రమాదాన్ని గ్రహించిన ఆనాటి ఉద్వేగవాది గెటె దీనిని ఒక రుగ్మతగా చిత్రీకరించాడు. "ప్రజలు ఎంత వెనుకబడి ఉంటే ఇదంత ఉదృతంగా ఉంటుందన్నా"డు. "చరిత్రను దేశభక్తి కలుషితం చేస్తుందన్నాడు. ఉద్వేగవాదులలో చిట్ట చివరి వాడైన నిషెకూడా జాతీయ వాదాన్ని సంస్కృతికి పనికిరాని

ఉన్మత్తతగా, రుగ్మతగా" చిత్రీకరించాడు. వాగ్వర్, ఫిషె, బిస్మార్క్‌లను విస్మరించ వలసిందిగా జర్మనులను కోరుతూ అతడిలా ప్రవచించాడు. "తటపటాయించే జాతులు మరొక అర్ధ శతాబ్ధం పోతేగాని దేశభక్తి చేసే దాడికి ఎదురు నిలవలేరు. జన్మభూమికి అంటిపెట్టుకోవడం కూడా దేశభక్తిలో భాగమే. మళ్ళీ వివేచనను చేపట్టి మంచి ఐరోపా పౌరుడుగా రూపొందాలన్నాడు."

షేక్స్‌పియర్, మిల్టన్, ఎడిసన్‌ల నుంచి ఇటలీ, జర్మనీలకు చెందిన ఉద్వేగ తిరోగమన సాహిత్యాలను ఆవేశాన్ని పొందాయి. ఇంగ్లీషు సాహిత్యానికి స్వంత సంప్రదాయమున్నది. 17, 18 శతాబ్దాల సంప్రదాయ వాదాలతో అంటిపెట్టుకొనని సంప్రదాయమది. సంప్రదాయబద్ధమైన వివేచనాత్మక ప్రమాణాలను కవిత్వంలో గుర్తించడానికి షేక్స్‌పియర్ నిరాకరించినందు వలన ఇంగ్లీషు రామణీయక సంప్రదాయం ఉద్రేకపూరితమైనది. డ్రైగన్ సంప్రదాయ వాదం వైపుకు మొగ్గడానికి ప్రయత్నించాడు. కానీ దేశీయ సంప్రదాయానికి స్థానమివ్వక తప్పలేదు. తుదకు జాతీయ సాహిత్యాన్ని నిశితంగా అభినందించిన ఎడిసన్, ముఖ్యంగా మిల్టన్‌ను దృష్టిలో పెట్టుకుని రామణీయక సిద్ధాంతాన్ని రూపొందించాడు, ఐరోపాలో ఉద్వేగ ఉద్యమంపై దీని ప్రభావమున్నది. "ఊహను గురించి సూచనప్రాయంగా వ్రాసినదానినిబట్టి, ఎడిసన్ ఇంగ్లండులో ఉద్వేగపూరిత రామణీయతకు ప్రాతిపదికలు నిర్మించాడు. సృజనాత్మక ఊహకు సంబంధించిన ఈ నూతన సిద్ధాంతం ప్రాతిపదికగా 18వ శతాబ్దపు ఉత్తరార్థంలో జర్మనీలో గొప్ప కవిత్వం వచ్చింది." (జె. జి. రాబర్ట్‌సన్, ది జెనిసిస్ ఆఫ్ ది రొమాంటిక్ థియరీ).

డాంటె, గెటెలవలె మిల్టన్ కూడా ఒక ప్రత్యేక వర్గానికి చెందినవాడు. ఇంగ్లీషు మత పవిత్ర వాదంలో ప్రతిభాశాలి అయిన మిల్టన్, కాల్విన్‌కు సంబంధించిన సనాతనత్వాన్ని తృణీకరించాడు. మతద్వేషంతో కూడిన అసహనాన్ని అభ్యంతరపెడుతూ ARIOPAGITICA వ్రాసాడు. అది సంప్రదాయబద్ధమైన ఏథెన్సు సాహిత్యశైలిని పోలి ఉన్నది. భావస్వేచ్ఛ, సార్వాధికృత అనే వాటిని స్వతంత్రంగా ఉంటే వివేచనావాదులు ధైర్యంగా సమర్థించారు. ఉదారవాదానికి ఇదే మూలమయింది. అయితే రూసోను ముందే వూహించిన మిల్టన్ ఉన్నత వర్గాల ప్రజస్వామిక సిద్ధాంతాన్ని ప్రతిపాదించాడు. మిల్టన్ ప్రజాస్వామ్యవాది. కానీ వివేచనాపరులకూ ఉత్తములకూ ప్రజలు లొంగి ఉండాలన్నాడు. ప్రభుత్వం సామాన్యుల ఒత్తిడికి మించిన స్థాయిలో ఉండాలన్నాడు. పౌరుల విధులను ఒక మతంగా మార్చివేసాడు. ఎన్నడో ప్రారంభం అయిన సమరం వలన ప్రజలు తమ హక్కులను కోల్పోయారని అందరూ బానిసలు కావడంకంటే ఎక్కువ మంది స్వేచ్ఛను అంటిపెట్టుకుని ఉండేటట్లు కొందరయినా ఒత్తిడిచేయడం న్యాయసమ్మతమన్నాడు.

పౌరులతో కూడిన సమాజాన్ని గురించి మిల్టన్ భావాలు హాబ్స్ భావాలను పోలినవి. హాబ్స్ వాస్తవవాది. మిల్టన్‌లో ఆ లక్షణం లోపించింది. మానవుడు పతనం చెందుతాడని నమ్మిన మిల్టన్ ప్యారడైజ్ లాస్ట్ వ్రాసాడు. అందువలన మిల్టన్ కూడా ఉద్వేగవాదే. “ఆ కాలంలోని సమస్యలతో మానవులను చలింపజేసిన అత్యుత్తమ ఉదాహరణ ఇతడిలో అగుపిస్తుంది. తమ ఆదర్శాల నిమిత్తం త్యాగంచేయడానికి సిద్ధంగా ఉన్న ధోరణి, నూతన మత భావనలతో ప్రజాస్వామిక ఉద్యమ పునాదులు ఉన్నాయి.” (ఎన్‌సైక్లో పీడియా బ్రిటానికా, 13వ ప్రచురణ).

19వ శతాబ్దంలో ఇంగ్లీషు ప్రకృతి కవులు, జర్మనీ ఉద్వేగవాదంవలన, వివేచనకు దూరంగా పారిపోయిన రూసోవలన ప్రభావితులయ్యారు. ఆదిలో వీరి తిరుగుబాటు కేవలం రామణీయకతతో కూడినది. ఆధునిక నాగరికతలోని ప్రయోజనవాద ప్రమాణాలకు భిన్నంగా వీరు బయలుదేరారు. డార్విన్ వానపాము ఉపయోగాన్ని ప్రస్తుతించడాన్ని, అపహాస్యంచేస్తూ, బ్లేక్, పెద్దపులి అందాన్ని మెచ్చుకోవడం, రామణీయకతలో ఔన్నత్య విషయంగా పేర్కొనడంతో ఈ ఉద్యమం ఎందుకూ కొరగాకుండా పోయింది. ఆటవికమయిన, భయంకరమైనవాటి అందాన్ని మెచ్చుకోవడంలోని రామణీయకతను గమనించడం మంచిదే. కానీఉద్వేగవాదులు వింతను, భయంకర విషయాలను గంభీర వస్తువులను మధ్య యుగాలను గోతిక్ కట్టడాలను నిర్మాణుష్యమైన కోటలను మెచ్చుకుంటూ అందులో రామణీయకత విలువలు చూడటంతో ఈ ఉద్యమం చాలా దూరంగా పోయింది. “ఒక స్థాయిలో ఉన్మాదంగాను మరొకస్థాయిలో మితిమీరిన విధంగాను, తెలియనిది తెలిసేవిధంగా ఊహించే ఇంకొక స్థాయిగాను ఉండవచ్చు. ఇంగ్లీషు జీవిత విధానంలోను సాహిత్యంలోను నక్షత్రాన్ని నలకగా చూసే పద్ధతిపోలేదు. వాస్తవంపట్టి అపనమ్మకం సంపూర్ణత, క్రమత్వం, ప్రణాళిక విషయమై అపనమ్మకం వీరిలో ఉండేది. జీవితాన్ని ఒక శక్తిగా గ్రహిస్తూ దానిపై అదుపును పెట్టడం వలన బలహీనపడి నాశనం అవుతున్నట్లుగా భావించారు. అసంభవాన్ని సాధించడానికి జీవితం కృషిచేసి విఫలంకావాలి. ప్రయత్నించి విఫలం కావడానికి ప్రత్యామ్నాయం మరణమే. చట్టం, వివేచన, సంప్రదాయం అన్నీ మానవ చర్యలకు హద్దులనేర్పరచి, జీవితాన్ని అసాధ్యం చేస్తున్నవి. ఉద్వేగాన్ని అభిలషించేవారు కళకు వ్యతిరేకంగా ప్రకృతిని కోరతారు. కృత్రిమంగా తయారుచేసే దానికంటే సహజంగా పెంపొందడం అభిలషణీయం”. (CRANE BRINTON, THE POLITICAL IDIAS OF THE ENGLISH ROMANTISISTS).

ఇవన్నీ హామీలేని పెడదారులు కావచ్చు. జర్మనీ ప్రభావంతో బ్రిటిష్ ఉద్వేగవాదులు జాతిభావనలో ఆధ్యాత్మిక ఆదర్శాన్ని చూడకపోతే ఇలానే అనుకునేవారు.

కానీ వారు రాజకీయ ప్రతిక్రియలో దిగబడ్డారు.

వివేచనకు వ్యతిరేకంగా తిరుగుబాటు చేయడమే ఉద్వేగవాద సారాంశం అయితే బర్క్ మహోన్నత ఉద్వేగవాది అనవచ్చు. మానవ వివేచనకు విజ్ఞప్తిచేసిన విప్లవాదులను వ్యతిరేకించడానికి, రాజకీయాలలో వివేచన సరిఅయిన ప్రాతిపదిక కాదని బర్క్ అన్నాడు. పైగా మంచి ప్రభుత్వమేర్పడటానికి సంప్రదాయంలో విశ్వాసం ఉండాలన్నాడు. అనుభవం వలన నేర్చుకున్న ఈ పాఠం, వంశపారంపర్యంగా వస్తున్న పరిపాలనా వర్గం చాలా ప్రాధాన్యతను పొందినది. విప్లవానికీ వివేచనకూ వ్యతిరేకంగా ఇతడు చేసిన తిరుగుబాటు ఉద్వేగంలేని ధోరణిలో, తత్త్వానికి పాత వ్యవస్థను అట్టిపెట్టే పద్ధతిలో పనిచేసింది.

ఫ్రెంచి విప్లవం సందర్భంగా వర్డ్స్‌వర్త్, వాల్‌రిడ్జ్, సౌథే పరిణితి చెందిన కవులు విప్లవాన్ని అత్యంత ఉత్సాహంతో వీరు ప్రస్తుతించారు. విప్లవానికి చెందిన ఆకర్షణీయభావాలు, ఆదర్శాలు ఇంగ్లండులో విలియం గాడ్విన్‌చే బహుళప్రచారం పొందాయి. అతడు వ్రాసిన పొలిటికల్ జస్టిస్‌వలన, వైజ్ఞానిక వివేచనావాదం ఉద్వేగపు ఉత్సాహం మేళవించిన తత్త్వం యువకవులకు లభించినది. కానీ ప్రకృతిని ఆరాధించే ఈ కవులు, జ్ఞాన వికాసంకంటే, రూసో ఉద్వేగవాదం వలన ప్రభావితులయ్యారు. ఫలితంగా, విప్లవం ఆశించిన ఆదర్శాన్ని సాధించలేనప్పుడు కవులలో ఉత్సాహం చల్లారింది. నిస్పృహ చెందిన ఉద్వేగవాదం విప్లవ వ్యతిరేకులతో చేతులు కలిపింది. స్కాట్‌లాండ్ కవులు ప్రకృతిని గరించి మానవాళిని గురించి మార్మికంగా ప్రీతిపాత్రంగా ఆలోచించారు. 18వ శతాబ్దంలో విప్లవ ఆదర్శానికి తోడ్పడిన సహకరించిన వైజ్ఞానిక సహజవాదానికీ ఈ కవులకూ పొత్తుకుదిరే లక్షణాలేవీ లేవు. విప్లవాభివృద్ధిలో నిరాశను పొందిన కవులు విశ్వజనీన మానవతావాద ఆదర్శాలపట్ల విధేయులుగా ఉండలేక పోయారు. జర్మనీలో తిరోగమన ఉద్వేగవాదం విలసిల్లినది. గెటె, షెల్లర్ జన్మించిన ప్రాంతాలకు వర్డ్స్‌వర్త్ తీర్థయాత్ర చేసి వచ్చాడు. తానూహించినదానికంటే జన్మభూమి చాలా ప్రియతమైనదని అతడు భావించాడు. సౌథే ఉద్దేశంలో ఒకప్పుడు మృతప్రాయమైన భావాలన్నీ పునరుజ్జీవనం పొందాయి. ఉద్వేగ కవులు బర్క్ అండనచేరి, 18వ శతాబ్దానికి వ్యతిరేకంగా అతడు చేసిన తిరుగుబాటును ఫ్రెంచి విప్లవానికి వ్యతిరేకంగా ఇచ్చిన నినాదాన్ని సమర్థించారు. "ప్రజలు వారి ప్రస్తుతస్థితికి సమాధానం చెప్పవలసిన పనిలేదు. మార్గదర్శకత్వం లేకుండా ప్రజలు ఆలోచించడం గానీ, ఆచరణకు పూనుకోవడంగాని జరగదు. దేవుడు, ప్రకృతి వారిని అలా ఎన్నడూ చేయమనలేదు కూడా. సంపన్నదేశంలో ఊరటనిచ్చే వటవృక్షాల వంటివారు (రిచ్‌మండ్ డ్యూక్‌లేఖ). ఉద్వేగవాద కవి కాల్ రిట్జ్‌ను టోరి

కారింగ్‌తో సమంగా భావించి, బర్క్‌కు అర్హుడైన శిష్యుడని పేర్కొన్నారు. 1798లో కాల్ రిట్జ్ ఇలా వ్రాసాడు. “దేశద్రోహానికి వ్యతిరేకంగా గుండెలు బాదుకొనడాన్ని నేను హర్షించలేదు, పశ్చాత్తాపంలో దీనికి ప్రాయశ్చిత్తం ఉన్నది.”

వర్డ్స్‌వర్త్‌వలె కాట్‌రిట్జ్ ద్రష్టకాదు. అయితే స్కాట్‌లాండ్ కవుల ఉద్వేగవాదంలోని తిరోగమన పాత్రను సమర్థించడానికి కాల్‌రిట్జ్ ఒక తత్త్వాన్ని రూపొందించాడు. షెల్లింగ్ నుంచి ఉత్తేజంపొంది, ఇతడు ప్రక్షాళితమయిన క్రైస్తవమతానికి పారలౌకిక తత్త్వానికి సమన్వయంసమకూర్చే ప్రయత్నంచేసాడు. తత్త్వాన్ని మతాన్ని సమన్వయించి, రాజకీయాలను ఆ ప్రాతిపదికపై నడిపించాలని చూసాడు. మతం నుంచి రాజకీయాలు తత్త్వం వేరుకావడమే ఆ శకంలో శాపంగా భావించాడు. వైజ్ఞానిక మనస్తత్త్వాన్ని మతపరమైన ప్రేరణలను మేళవించి మార్మికమైన క్రైస్తవమత సార్వభౌమాధిక్యంలో ఒక ఆదర్శ తత్త్వాన్ని రూపొందించే ప్రయత్నం చేసారు. బ్లేక్ వ్యక్తంచేసిన సహజమతజ్ఞానంలో బ్రిటిష్ ఉద్వేగవాదం మార్మికమైన మతవైఖరిని కనుగొన్నారు.

ఇంగ్లండ్‌లో ఉద్వేగాన్ని తిరగదోడటానికి బైరన్, షెల్లీలు నాయకత్వం వహించారు. వారు ప్రకృతి ఆరాధకులు కూడా. వీరు లేకుంటే, “ప్రకృతి” వివేచనకు ఉద్వేగపూరితమైన ధోరణిగానే జ్ఞానవికాస తాత్త్వికుల దృక్పథంలో ఉండేది. స్కాట్లండ్ కవులు ఆనాడున్న సాంఘిక వ్యవస్థతతో ఆచారవ్యవహారాలతో సరిపెట్టుకోవడంపట్ల బైరన్, షెల్లీలు తిరుగుబాటు చేసారు. మార్పు ఒక్కటే నియమమనీ దానికే ఒడంబడి ఉంటామని, సమాజాన్ని జీవితాన్ని మార్చాలని వీరు కోరారు. అయితే వారు అభిలషించిన మార్పును చారిత్రక దృష్టితో చూడలేకపోయారు. మానవుడి సృజనలో అచంచల విశ్వాసమే వారికి ఉద్వేగవాదం అయింది. మేధస్సు సంబంధంగా దీనికి ఒక క్రమశిక్షణ లేదు. ఉద్వేగంకంటే వివేచనకు తక్కువస్థాయిని ఇచ్చారు. వూహలను, ఉత్సాహాలను నిశిత వాస్తవం, జ్ఞానం ఆధారంగా అట్టిపెట్టలేదు. కనుక ఉద్వేగాన్ని తిరగదోడాలనే వారు అరాచకవాదానికి దారితీసారు. మహోన్నత కవిత్వంద్వారా చూపిన తిరుగుబాటు నిస్పృహతో అంతమయింది. పునర్వికాసం, జ్ఞానవికాస సంప్రదాయాల ప్రేరణతో ఉద్వేగాన్ని తిరగదోడితే అది జయప్రదమవుతుంది. వివేచన–ఉద్వేగం, నియమం–స్వేచ్ఛ, మేధస్సు–సంకల్పం పరస్పర విరుద్ధాలు కావు. మారుతున్న మానవుడిలో ఇవన్నీ పడుగు పేకలుగా అల్లుకుపోయాయి. మానవ ఉనికికి సంబంధించిన ఈ ప్రాథమిక సత్యాలను గమనిస్తే, మానవుడు అనంతయాత్రలో స్వేచ్ఛవైపు పురోగమిస్తాడు. అది ఆదర్శంకాదు, అనుభవం. మానవ జీవితమే సాహసోపేతమైన మహోన్నత ఉద్వేగం అనవచ్చు.

✦ ✦ ✦

# ఉదారవాదం - మూలం, సంప్రదాయం

జ్ఞానవికాసానికి తోడ్పడిన తాత్త్విక సిద్ధాంతానికీ, రాజకీయ సూత్రాలకూ మూలం ఇంగ్లండ్‌లో ఉన్నది. డేకార్ట్‌కంటే లాక్ వలన ఫ్రెంచి విప్లవ తత్త్వవేత్తలు ఎక్కువ ప్రభావితులయ్యారు. వారి యాంత్రిక సహజ వాదానికి అంతకుముందు 2 శతాబ్దాలుగా పెంపొందిన భౌతిక, జీవ జ్ఞానం ఆధారమయింది. పునర్వికాసంనుంచి, 1 గసెండి తిరగదోడిన ఎపిక్యూరస్ సంప్రదాయంనుంచి ఈ సహజవాదం ఉత్తేజాన్ని పొందింది. కానీ హాబ్స్ సూచించిన పదార్థవాద వివేచనతత్త్వ ఫలితంగా యాంత్రిక సజహవాదం వచ్చింది. ఇంగ్లండ్‌లో జనించిన విప్లవ భావాలు ఐరోపాలో వ్యాపించి ఫ్రెంచి విప్లవాన్ని ఉత్తేజపరచగా, సంస్కరణ వాదంతో కూడిన తిరోగమన ప్రభావానికి మాతృభూమి గురిఅయింది. ఈ ప్రభావం వలన బ్రిటన్‌లో విప్లవం రాజీపడవలసి వచ్చింది. పునర్వికాసంలోని మానవతావాదం 17వ శతాబ్దంలో వివేచనావాదానికి దారితీసింది. బాల్ తీవ్ర విమర్శ, మోంటేన్ సూచించిన నగరసంబంధమయిన మతరహిత విధానం, ఓల్టేర్ భావ విచ్ఛేదన అన్నీ కలిసి జ్ఞాన వికాసానికి సహకరించినవి. అయితే ప్రొటస్టంట్ మతవాదం, మతపరమయిన విద్వేషానికి సాంస్కృతిక ప్రతిచర్యకు, సాంఘిక మితవాదానికి దిగజారిపోయింది. లాక్ రాజకీయ శిష్యులయిన విగ్‌ల అజమాయిషీలో బ్రిటిష్ ప్రభుత్వం ఫ్రెంచి విప్లవాన్ని వ్యతిరేకించింది. “18వ శతాబ్దానికి వ్యతిరేక తిరుగుబాటు”ను బర్క్ చాలా శక్తివంతంగా చాటాడు. దీనివలన విగ్‌పార్టీలో తేడాలొచ్చాయి. వ్యవస్థను అట్టిపెట్టాలనే ఉదారవాదులకూ, రాడికల్సుకూ మధ్య చీలిక వచ్చింది. ఉదారవాదులు టోరీలలో కలసిపోయారు. విప్లవాత్మక ప్రజాస్వామ్యం ఒక పీడగా భావించారు.

కాని బర్క్ తాకిడికి తట్టుకుని వివేచనావాదం నిలబడింది. 19 వ శతాబ్దంలో, ఆధునిక నాగరికత స్థానాన్ని ఫ్రాన్సునుంచి బ్రిటన్ చేపట్టింది. ఫ్రెంచి విప్లవం వలన చచ్చిపుట్టిన ప్రజాస్వామ్యం బ్రిటన్‌లో సురక్షితంగా ఉన్నది. 18 వ శతాబ్దం ఉద్వేగవాదంతో పొత్తుపెట్టుకున్న వివేచనాయుగం. ఈ పొత్తువలన జ్ఞానవికాసం జనించింది. ఆధునిక చరిత్రలో ఇది అత్యంత ఫలప్రదమయిన కాలం. మానవుడి

---

1. Gassendi, Pierre 1592–1655 ఫ్రెంచి సంశయవాది, ఎపిక్యూరస్‌వాది.

సృజనశక్తిని, పునర్వికాస సంప్రదాయానుసారం, జ్ఞాన వికాసం వ్యాపింపచేసింది. అదొక విమోచనా సందేశం. ప్రాచీన సంస్కృతి, వివేచన, పాండిత్యం, జ్ఞానం సంపదలుగా ఈ జ్ఞానవికాసం ప్రేరణ పొందినది. అయితే 19వ శతాబ్దంలోని ఉదార వివేచనావాదం చాలావరకు సంస్కరణ వాదంనుంచే ఉత్తేజాన్ని పొందినది. అందువలన ఉద్వేగవాదానికి వ్యతిరేకంగా వ్యవస్థను అట్టిపెట్టాలనే ధోరణి దృఢంగా చెప్పింది. ఇదొక నూతన సంప్రదాయవాదం. ఇంగ్లండ్‌లో ఎలిజబెత్‌రాణి కాలం, ఐరోపాలో 14వ లూయీ శకం పెంపొందించిన సాంస్కృతిక తేజస్సు, మహోన్నత మేధస్సును పేలవంగా అనుకరించడం కొత్త సంప్రదాయంలో చూడవచ్చు. స్కాట్లండ్ కవుల ఉద్వేగవాగం వలన టోరీలతో చేరిపోవడాన్ని గమనించిన షెల్లీ, బైరన్‌లు ఉదారవాదంలో ఆశను, అభ్యుదయాన్ని కొనసాగించారు.

అదే సమయంలో మానవుడి సృజనశక్తి విజ్ఞానంలో మహోన్నతంగా వ్యక్తం అయింది. ఫ్రెంచి విప్లవపు ఉద్వేగ పెడదారుల నుంచి నిలద్రొక్కుకుని, 19వ శతాబ్దంలో, ప్రశాంతంగా, వైజ్ఞానిక విప్లవానికి, వివేచన బీజాంకురం వేసింది. విస్తరిస్తున్న విజ్ఞానశక్తితో మానవుడు ప్రకృతిని జయించడం సాహసోపేతమైన ఉద్వేగం అయింది.

ఉదారవాద ఆలోచనా పరిణామం ఆధునిక కాలాలలో జరుగుతుండగా, దానితోపాటు వాణిజ్య, పారిశ్రామికీకరణవంటి ఆర్థికసంస్థలు పెంపొందడంతో ఆవిర్భవిస్తున్న బూర్జువావర్గానికి ఇదే సిద్ధాంతమని తలపోసారు. ఆర్థిక విషయాలు సాంఘికమార్పులు, నిస్సందేహంగా, భావాలపై ప్రభావాన్ని చూపెడతాయి. కాని చారిత్రకంగా చేసే ఆర్థిక వ్యాఖ్యానం, కొత్త చరిత్రలో చూపే సామాజిక ధోరణి, తరచు ప్రక్కతోవలు పట్టిస్తున్నాయి. అదీగాక, మార్క్సిస్టు పద్ధతిని అనుసరించారు. ఉదాహరణకు, ఉదారవాద మూలాన్ని, అభివృద్ధిని పరిశీలించడంలో ప్రొఫెసర్ లాస్కీ ఈ పనే చేసాడు. "మధ్యయుగాల చివరి రోజులలో నూతన ఆర్థిక సమాజం తలెత్తడంతో, ఉదారవాదం జనించింది. సామాజిక అవసరాలనుబట్టి ఇదొక సిద్ధాంతంగా మారింది." (Harold J. Laski, The rise of European Liberalism) చారిత్రకంగా ఇదంత వాస్తవంకాదు. 16, 17 శతాబ్దాల ఆర్థిక సమాజాలలో ఉదారవాదం అంతంత మాత్రంగానే ఉన్నది. వాణిజ్య బూర్జువా వర్గాలు, రాజకీయంగా, అప్పుడే తలెత్తుతున్న జాతీయ రాజ్యాలతో పొత్తుకలిపాయి. కేథలిక్ మతాధిపత్యానికి వ్యతిరేకంగా నిరంకుశ ప్రభువులు తమ దైవాంశసంభూత హక్కును గట్టిపరచుకోవడంకొరకు జాతీయ రాజ్యాలలో కృషిచేసారు. చరిత్రను ఇంకా సునిశితంగా పరిశీలించినవారు ఇలా వ్రాసారు. "16 వ శతాబ్దంలో జాతీయరాజ్యాల కొరకు ఆర్థిక కట్టుదిట్టాలు కూలంకషంగా జరిగాయి. కొత్త నిరంకుశ విధానాల యుగం అది. అప్పటికంటే

మధ్యయుగాలలోనే ఉదారవాదం ఎక్కువ మోతాదులో ఉండేది." (A. L. Rowre, The End of An Epoch. Chapter on the rise of Liberalism) ప్రొఫెసర్ లాస్కీ సహితం తన ప్రకటనలను తరువాత సరిదిద్దుకున్నాడు. "సంస్కరణ వాదానికీ ఫ్రెంచి విప్లవానికీ మధ్యకాలమంతా వాణిజ్య యుగమని పిలవడం సంప్రదాయమైపోయింది. 18వ శతాబ్దపు చివరి రోజులవరకు ఆర్థికరంగంలో ఉదారవాదాన్ని అంతగా హర్షించలేవనేది వాస్తవం." ఒక తత్త్వంగా ఉదారవాదం 16వ శతాబ్దంలోను, అంతకుముందు కూడా మేధావులమధ్య ఉన్నట్లు కనుగొనవచ్చు. కానీ చాలాకాలంవరకూ బూర్జువా వర్గాలు ఈ తత్త్వాన్ని హర్షించలేకపోయాయి. అందువలన, నూతన ఆర్థిక సమాజావసరాలకొరకు ఉదార స్వేచ్ఛావాదం సృష్టికాలేదు. ఒక తత్త్వంగా ఉదార స్వేచ్ఛావాదం, ఆలోచనా పరిణామ తర్కాన్ననుసరించి స్వతంత్రంగానే అభివృద్ధి చెందింది. ఉత్తరోత్తరా ఒకానొక వర్గం దీనిని ఆమోదించింది. అంతమాత్రాన ఉదార స్వేచ్ఛావాదం బూర్జువా సిద్ధాంతం అనిగాని, పెట్టుబడిదారీ తత్త్వమనిగానీ భావించ వీలులేదు. ప్రొ॥ లాస్కీ, చరిత్రకు మార్క్సిస్టు ఆర్థిక వ్యాఖ్యానాన్ని చేయడంపట్ల, మాక్స్ వెబర్, సోంబర్ట్, ట్రాలిష్, హసర్, టానేవంటి చరిత్రకారులు, పండితులు అంగీకరించలేదు. కానీ వీరుకూడా పెట్టుబడిదారీ ఆర్థిక వ్యవస్థకూ ప్రొటస్టంట్ మతానికీ కార్యకారణ సంబంధాన్ని వెదకనారంభించారు. జీవితంలో ఉదారవాద దృక్పథానికి ప్రొటస్టంట్‌వాదం ఉత్తేజాన్ని ఇచ్చిందని భావించారు. ఉదా॥ మాక్స్ వెబర్ ప్రొటస్టంట్ క్రైస్తవమత సిద్ధాంతాలు, కాపిటలిస్టు ఆర్థికవ్యవస్థ తలెత్తడానికి సహకరించిందని వాదించాడు. పెట్టుబడిదారీ ఆర్థిక విధానానికి తోడ్పడే నిమిత్తమే ప్రొటస్టంట్ క్రైస్తవమత ప్రచారం జరిగినట్లు ఒక నిర్ణయానికి వచ్చారు. (Max Weber, Protastent Ethics and Rise of Capitalism) చరిత్రకు మార్క్సు ఇచ్చిన వ్యాఖ్యానానికి అనుకూలంగా వెబర్ గ్రంథం ఒక ప్రమాణంగా తోడ్పడింది. సామాజిక చారిత్రక సిద్ధాంతానికి నాందిపలికిన ఈ గ్రంథం ఆ రంగంలో ఎంతో సాహిత్యం రావడానికికూడా కారణం అయింది. ఆవిర్భవిస్తున్న బూర్జువా వర్గం తమ ఆర్థిక ప్రయోజనాల నిమిత్తమే ప్రొటస్టంట్ మతాన్ని ప్రభోదించారనే అర్థం వచ్చింది. వాస్తవానికి ఇక్కడ కార్యకారణ సంబంధమేమీ లేదు. పెట్టుబడిదారీ ఆర్థిక విధానానికీ ఉదారవాదానికీ కార్యకారణ సంబంధం చూపడం కష్టం.

క్రైస్తవమతంలో పవిత్రవాదం, ఆర్థిక విధానం వెనువెంటనే అభివృద్ధిచెంది పరస్పరం ప్రభావాన్ని చూపెట్టాయని ప్రొ॥ టానే పేర్కొన్నాడు. ఈ రెండింటికీ కార్యకారణ సంబంధాన్ని అతడెక్కడా మొండి వాదంతో చూపలేదు. "క్రైస్తవమతంలో పవిత్రవాదానికి స్వంత ప్రమాణాలతోకూడిన సాంఘిక నియమావళి ఉన్నది. వాణిజ్యవర్గాల

స్వార్థప్రయోజనం నుంచి కొంతవరకు, దైవస్వభావం మానవుడిగతిని అనుసరించి కొంతవరకు, ఈ మతధోరణులు రాబట్టారు. ఈ ప్రమాణాలు ఇంగ్లండ్ సమాజంలో ఫ్యూడల్ ధోరణులకు, పెత్తందారీతనంతో ఉన్న రాజ్యవ్యవస్థకు, హెచ్చుతగ్గులున్న సమాజ వ్యవస్థకు వ్యతిరేకంగా ఉన్నవి. ఫ్యూడల్ ప్రభావంతో సంబంధాలు త్రెంచుకుని, నిరంకుశ రాజ్యవ్యవస్థపై విమర్శ దాడిచేసిన మత పవిత్ర వాదం, వాణిజ్య నాగరికతకు రంగాన్ని సిద్ధంచేయడంలో ఒక బలవత్తరమైన శక్తిగా రూపొందినది. చివరకు విప్లవంలో ఈ వాణిజ్య నాగరికత విజయం సాధించింది. (R. H. Tawney, Religion and the rise of Capitalism).

ఉదారవాదానికి చెందిన మతవాదుల సాంఘిక సిద్ధాంతాలు, కొంతవరకే వాణిజ్యవర్గాల ఆసక్తులతో ప్రభావితం అయినట్లు చెబుతున్నారు. ఈ ప్రభావంతో నిమిత్తంలేకుండా దైవస్వభావం, మానవుడికి దైవంతో గల సంబంధం గురించి మూలసూత్రాలను రూపొందించారు. మతవిశ్వాసాలు తాత్త్విక సూత్రాలు, సామాజికమయిన మార్పులు ఆర్థికాభివృద్ధి ఇత్యాదులన్నీ పరస్పర ప్రభావాన్ని చూపెట్టాయి. వీటిల్లో ఏ ఒక్క దానికైనా అత్యంత ప్రాధాన్యతనిచ్చి, మూలకారణంగా పేర్కొంటేమాత్రం అది దోషమే అవుతుంది. “చారిత్రక పోరాటాలు సాంఘిక మార్పులు దృక్పథంనుంచిచూస్తే సిద్ధాంతాలన్నీ వాటిలోంచి పుట్టినట్లుగానే సులభంగా చెప్పేసెయ్యొచ్చు. సిద్ధాంతపరంగాను మానవుడి అనుభవ విలువల దృష్ట్యానుచూస్తే చారిత్రక స్థితిగతులకుమించిన ప్రాధాన్యతలు ఉండవచ్చు. ఏమయినా ఇదే తుదిలక్ష్యం అనేటంతవరకూ పోనవసరం లేదుగానీ కేవలం దీనిమూలంగానే జనించాయని అనడంకంటే అంతకుమించిన పరిస్థితులు ఉన్నాయని చెప్పకతప్పదు” (A. L. Rowse, The end of an Epoch). చరిత్రను సృష్టించడంలో వివిధ విషయాలకు తగినంత ప్రాధాన్యత ఇవ్వడం, వాస్తవ దృక్పథం. మతసిద్ధాంతాలు, తాత్త్విక భావాలు, సాంఘిక విషయాల వలన చాలా వరకు ప్రభావితం అవుతుందని గమనించాలి. అంతేగాని సాంఘిక విషయాల వలననే ఇవన్నీ జనించవు. వాటిలోనే జనించవుకూడా. గతంలోనూ భవిష్యత్తులోని వాటి చరిత్ర వాటికి ఉన్నది. ఆలోచనా చరిత్ర సాంఘిక సంఘటనల చరిత్ర కొన్ని విషయాలలో మిళితమైపోవడం వలన అంతసులభంగా విడదీసిచూడటానికి వీలులేకపోవచ్చు. అందుకే వీటి సంబంధాలలో గందరగోళం ఏర్పడుతున్నది.

ఉదారవాద నిశితవిమర్శకుడొకడు పైన ఉదహరించిన సంబంధాన్ని చక్కగా వర్ణించాడు. “తలెత్తుతున్న వాణిజ్యవర్గాల ఆదర్శాలను, సాంఘిక, ఆర్థిక, రాజకీయ ఆశలను, జీవిత విధానంగా ఉదారవాదం ప్రతిబింబించింది. ఫలితంగా ఉదారవాదానికీ

పెట్టుబడిదారీ విధానానికీ సన్నిహిత సంబంధం ఏర్పడింది. అయితే పెట్టుబడిదారీ విధానానికి సమర్థనీయ సిద్ధాంతంగా మాత్రమే ఉదారవాదంగా పరిగణించడం దోషమే అవుతుంది. ఉదారవాద సిద్ధాంతం ఒక ఆర్థిక విధానానికి ప్రతిబింబంగా గాక ఇంకా వేరే దృక్పథం కూడా ఉన్నది. 17వ శతాబ్ధపు మనస్తత్వానికి అది ప్రతీకగా నిలిచింది. ఫ్యూడల్ విధానం పతనం అవుతుంటే ఆ సమయంలో పెంపొందే ఆర్థికవిధానానికి ఉదారవాదం కారణమేగాక ఫలితముకూడా. అదొక ఆర్థిక తత్త్వం, జీవిత విధానం మాత్రమేకాదు, రాజకీయ సాంఘిక మేధస్సుకు సంబంధించిన తత్త్వంకూడా అలాగే జీవిత విధానం మాత్రమేకాదు, రాజకీయ సాంఘిక మేధస్సుకు సంబంధించిన తత్త్వంకూడా అలాగే జీవిత క్రమంకూడా. ఉదారవాదం, పెట్టుబడిదారీ విధానం వెనువెంటనే ఒకదానినొకటి అనుసరించాయి. పెట్టుబడిదారీ విధానం ఆచరణలోనేగాక భావవిధానంగా కూడా ఉండటంవలన తలెత్తుతున్న వాణిజ్యవర్గాల మనస్తత్వం వలన ఇది జనించింది. అలాగే ఆ మనస్తత్వంకూడా ఈ విధానంవలన వచ్చింది. పునర్వికాసం సంస్కరణవాదం కాలంలో ఆవిర్భవించిన వ్యక్తివాదం నుంచి ఉదారవాదం పెట్టుబడిదారీవాదం వచ్చాయి" (John H. Hallowell, The Decline of Liberalism as an Idiology).

ఆధునిక ఉదారవాదానికి ప్రవక్త లాక్. అతడు ఆస్తికి అత్యంత ప్రాధాన్యత ఇచ్చాడు. అధికారికమయిన ఈ సాక్ష్యాధారంవలన ఉదారవాదాన్ని పెట్టుబడిదారీ తత్త్వంగా చిత్రీకరించాడు. ఉదాహరణకు ప్రొ॥ లాస్కీ ఇలా అన్నాడు. "ఉదారవాద భావం ఆస్తి యాజమాన్యంతో చారిత్రకంగా ముడిపడి ఉన్నవి." అయితే ముందే ద్వేషభావాన్ని ఏర్పరచుకోకుండా లాక్‌ను చదివితే, అతడుచెప్పే ఆస్తి భావనకు ఉత్పత్తి సాధనాలపై పెట్టుబడిదారీ యాజమాన్యం ఉండాలనేదానికి పోలికలేదని తెలుస్తున్నది. ఆస్తిఅంటే కష్టార్జితమని, మానవుడు తన శరీరంపై తానే యజమాని కనుక అతని చేతులతో సృష్టించినదానిపై అతనికి హక్కు ఉండాలన్నాడు (Locke, Two treatiser on Governament). వివేచన అనేది ప్రకృతిలో పరమార్థంకనుక, "అందరూ సమానము, స్వతంత్రులు అయినప్పుడు ఎవరూ ఇతరుల జీవితానికి ఆరోగ్యానికి స్వేచ్ఛకు ఆస్తికి నష్టంచేయరాదు." అన్నాడు. పెట్టుబడిదారీ దోపిడీవిధానపు తత్త్వవేత్తగా మాత్రంకాక కమ్యూనిస్టు ప్రవక్తగా లాక్ మాట్లాడాడు. తాత్త్విత ఉదారవాదానికి కమ్యూనిజానికీ గల సంబంధం తర్కబద్ధమయినది. కానీ పెట్టుబడిదారీ ఆర్థిక విధానంలోగల సంబంధం యాదృచ్ఛికమైంది. ఆస్తిపై మొక్కు పెట్టి చెప్పడం వలన ఆర్థిక భద్రత లేకుండా స్వేచ్ఛ అర్థరహితమయిన, సోషలిస్టు ప్రజాస్వామిక ధోరణిని ఇతడూహించాడు. అతడి కాలపు రాజకీయ ఆలోచనలలో స్వేచ్ఛ అనే భావన నైరూప్యంగానూ, అతి భౌతికంగాను

ఉన్నవి. లాక్ ఆ భావనలో భౌతికరూపాన్ని ప్రవేశపెట్టాడు. కష్టార్జిత ఫలితాన్నే అనుభవించాలని సోషలిస్టులు చెప్పేదానికీ ఇతడు చెప్పేదానికీ ఆస్తి భావనకు సరిపోతుంది. అదొక స్వేచ్ఛా సందేశం. తమ దేహాలపై యాజమాన్యం లేని వారికేగాక, భవిష్యత్తులో పెట్టుబడిదారీ నియంతృత్వ విధానంలోని బానిసలకు కూడా ఇది స్వేచ్ఛావాద సందేశమే. ఆసక్తికి సంబంధించి లాక్ చెప్పిన భావనలలో వస్తువులతోపాటు జీవితం, స్వేచ్ఛకూడా ఇమిడిఉంది. కనుక పౌరసమాజం ఆస్తిని కాపాడే నిమిత్తం వ్యవస్థాపితమైందని లాక్ ప్రకటించాడు.

ఆవిర్భవిస్తున్న బూర్జువా వర్గానికి ఆదర్శంగా ఉదారవాదం ఉన్నదనడం దోషం అయితే దీనికి మూలం సంస్కరణ వాదంలో ఉన్నదనడంకూడా చరిత్రను దోషబద్ధంగా అధ్యయనం చేయడమే అవుతుంది. మతం వ్యక్తి అంతరాత్మకు సంబంధించినదని లూథర్ తొలుత ప్రతిపాదించిన సిద్ధాంతం నిష్పాక్షికంగాచూస్తే, విమోచనతో కూడిన ప్రాధాన్యత గలది. అయితే అతడు మానవుడి అధ్యాత్మిక విమోచనకోరలేదు. పోప్ అధికారాన్ని విచ్ఛేదం గావించడమే లూథర్ మత సంస్కరణలోని లక్ష్యం. ఆ ఉద్దేశంతో జర్మనీ ప్రభువులను అతడు రెచ్చగొట్టాడు. ఫలితంగా ఆవిర్భవిస్తున్న పెట్టుబడిదారీ విధానానికి సంస్కరణవాదం సహకరించకపోగా ఫ్యూడల్ విధానాన్ని బలపరిచిన నిరంకుశ ప్రభువు.

జాతీయ రాజ్యాలు ఆవిర్భవించడానికి దోహదంచేసింది. నిరంకుశ రాజరికాన్ని సమర్థించడం దీనికి దైవాంశసంభూత హక్కు ఉన్నదనడంవలన, లూథర్‌వాదం మతస్వేచ్ఛకు పీడగా తయారయింది. అటువంటి మాతృస్థానాన్ని గురించి ఉదారవాదం గర్వించాల్సిందేమీ లేదు. రాజకీయ ఉదారవాదానికి మూలం క్రైస్తవమత వ్యవస్థలోని తిరుగుబాటుకు సంబంధించిన చరిత్రలోనే ఉన్నట్లయితే, 15వ శతాబ్దపు సమన్వయీకరణ రచయితలలోనే ఇది గమనించవచ్చుగాని సంస్కరణవాదంలో కాదు. ఫ్యూడల్ ప్రభువుల ప్రొటస్టంట్ మతగురువుల స్వేచ్ఛ కోసం లూథర్ పోరాడాడు. "కేవలం రాజకీయ స్వేచ్ఛకై అతడెన్నడూ లక్ష్యపెట్టలేదు. మతేతరంగా అధికారం ఉండాలని అతడు ఉద్దేశించాడు. దైవ మూలంలోను, మానవుడి అసమానత్వాలతోను లూథర్‌కు నిజంగా నమ్మకముంది." (కేంబ్రిడ్జ్ మోడరన్ హిస్టరీ, రెండవ సంపుటి.) మానవుడు దైవానుగ్రహం కోల్పోవడంవలన ప్రపంచంలో అసమానత్వం వచ్చినట్లు సంప్రదాయబద్ధమైన క్రైస్తవమతం చెప్పింది. అంటే అసమానత్వం అసహజమయినదని భావించింది. మానవుల అసమానత్వం దైవికమని లూథర్ నమ్మాడు. ఉదార రాజకీయ సిద్ధాంతానికి సంబంధించిన ప్రజాస్వామ్యానికి కేథలిక్ మతంలోనే ఆధారం ఉన్నదికాని, సంస్కరణ వాదంలో కాదు.

తొలి సంప్రదాయాలను ప్రక్కనపెడతే ఉదారవాదానికి, ప్రజాస్వామిక రాజకీయ సిద్ధాంతాలకు మూలాన్ని, రాజకీయాలను మతేతరంగా ఉంచాలంటూ సంస్కరణ వాదానికి ముందువచ్చిన ఉద్యమాలలో గమనించవచ్చు. రాజకీయాధికారానికి అలౌకిక ప్రమాణం చూపినంత వరకూ అది కేవల పారమార్థికమే. రాజకీయాధికారాన్ని మతరహితం చేస్తేనే ప్రజాస్వామిక అదుపు అనేది సంభవం. రాజకీయాలను మతరహితం గావించడానికి సంస్కరణవాదం కూడా తోడ్పడింది. ఆ మేరకు ఇది ఉదారవాదానికి ప్రజాస్వామ్యానికి దోహదం చేసిందనవచ్చు. అదే సమయంలో సంస్కరణవాదం ప్రతిచర్యకుకూడా ప్రాతినిధ్యం వహించింది. అరిష్టోటల్‌పట్ల లూథర్ వ్యతిరేకత వ్యక్తంచేసినంత మాత్రాన మతజ్ఞానం పట్టు సడలలేదు. పైగా సంస్కరణ వాదం మతద్వేషాన్ని కనీవినీ ఎరుగనంతగా ప్రవేశపెట్టి ఐరోపాను సుదీర్ఘమైన మత యుద్ధాలతో అంధకారంలో ముంచెత్తింది. ఆ కాలంలో మతజ్ఞానం-మధ్యయుగాలతో పోల్చిచూస్తే, బలహీనంగా లేదు. అరిష్టోటల్‌ను లూథర్ ఖండించిన ఫలితంగా, ప్రొటస్టంటు మతజ్ఞానం-రాజకీయాలు, వివేచననుండి విడిపోవడానికి పరాకాష్ఠ అనవచ్చు. లోగడకంటే ఇంకా మొండిగా పవిత్రగ్రంథాల ప్రమాణాన్ని ఇంకా గట్టిచేసారు. రాజకీయాలను మతరహితంగావించడంలో ఆటంకం ఏర్పరిచారు. ప్రొటస్టంట్ విలువల ఆధారంగా ప్రతి సామాజిక సంస్థను సమర్థించడానికి పవిత్ర గ్రంథాలను ప్రమాణంగా చూపారు. 16వ శతాబ్దంలో, మతానికిగాక పౌరసంఘాదికారానికి మానవుడు విశ్వాసం చూపించాలనేది ఒక ముఖ్య లక్షణం. కాల్విన్ వాదంతో ప్రభావితమయిన దేశంలో ఈ ధోరణి పైకిరాకుండా చేసారు. పోప్ తన క్రిందగల కేథలిక్ మతగురువులద్వారా ఆధ్యాత్మిక అధికారాన్ని కొనసాగించడానికి వ్యతిరేకంగా పౌరుల హక్కులను సమర్థిస్తున్నట్లు లూథర్ వాదాన్ని అనుసరించిన ప్రభువులు ప్రకటించారు. కానీ ఈ పౌరహక్కులను దైవాంశసంభూత హక్కుతో నొక్కి వేసారు. వారి నిరంకశత్వానికి లూథర్ సమర్థిస్తూ మానవుడి పాపాలకు దైవం విధించేశిక్షగా నిరంకుశ ప్రభువుల చర్యలను పేర్కొన్నారు. ప్రాతినిద్యపు సంస్థలపట్ల అతడేమాత్రం సానుభూతి చూపలేదు. సమన్వయీకరణ ఉద్యమంలో, సంస్కరణవాదంతో పోల్చిచూస్తే ప్రజాస్వామిక ధోరణి ఎక్కువగా ఉన్నది.

శతాబ్దాలుగా ఆధ్యాత్మిక, లౌకిక శక్తులమధ్య ఆధిపత్యం కొరకు జరిగే పోరాటం అలా ఉండగా తరచు లౌకికశక్తి నిలద్రొక్కుకున్నది. ఈ పోరాటం పౌరహక్కుల స్వాతంత్ర్యం కొరకు జరిగిందనేది స్పష్టం. ఆ పోరాటంలో సంస్కరణవాదం ఫలప్రదమైన పరాకాష్ఠఅనడానికి వీలులేదు. తద్భిన్నంగా మొట్టమొదటగా ప్రొటస్టంట్ ప్రభువులు రెండు అధికారాలను పూర్తిగా కలిపివేసారు. సంస్కరవాదం, రాజకీయంగాచూస్తే,

మతజ్ఞానాధికారాన్ని మళ్ళీ తెచ్చిపెట్టింది. 16వ శతాబ్దంలోని జాతీయరాజ్యం మతజ్ఞానపరమైనది. లూథర్‌తో పోల్చిచూస్తే మెలాంచుతాన్ ఉదారవాది. రాజ్యంకంటే ఉన్నతమైనదేదీలేదని అతడు ప్రకటించాడు. హెగెల్ ఛాయలు ఇతడిలో ముందే కనిపించాయి. ఆధునిక రాజ్యవాద ప్రవక్త లూథర్ మతానికి చెందడం తలవనితలంపుగా జరిగిన సంఘటన కాదు.

సంస్కరణవాదంలోని తిరోగమన ధోరణులు, దీనివలన జనించిన మతపరమైన అసహనం, ఎలా ఉన్నప్పటికీ 16వ శతాబ్దంలో రాజకీయాధికారాన్ని మతేతరంగా ఉంచాలనే ఉద్యమం ఉదారవాదానికి పునాదులు వేసింది. మతవ్యవస్థలో వివిధ సంస్థలకు ప్రాతినిధ్యం ఉండాలనే ప్రజాస్వామిక ఒత్తిడి సమన్వయీకరణ ఉద్యమం వలన వచ్చింది. మతజ్ఞానంతో ప్రతిపాదించే ప్రభువులు దైవాంశ సంభూత హక్కు ఉన్నట్లు నటిస్తున్నప్పటికీ రాజ్యం సెక్యులర్ సంస్థగా పెంపొందడాన్ని ఆపలేకపోయింది. ఆ విధంగా మానవుడి అదుపుకుమించి మతరాజ్యం ఉండటం కష్టమయింది. ప్రభువు అధికారం పారమార్థికమైతే కావచ్చు కానీ ఎలాంటి దైవాంశ సంభూత హక్కులేని, దోషపూరిత మానవులే రాజ్యపాలన చేస్తున్నారు. రాజు తన రాజరికపు హక్కును కోల్పోకుండా దైవాంశసంభూత శక్తిని పరిపాలకులకు ఇవ్వడం సాధ్యమయ్యే పనికాదు. మెలాంచితాన్ మతపరమైన సరైనవి కావని ప్రశ్నించాడు. దైవాంశసంభూత హక్కు పేరిట చట్టాలు చేసే అవకాశం రాజుకు లేదన్నాడు. అతడుచేసే చట్టాలు కూడా మతస్వభావంతోనే ఉంటాయన్నారు. సెక్యులర్ పాలకులుచేసే పౌరచట్టాలకు స్థానం లభించింది. మతరహితంగా పరిపాలించే విధానంలో మత సంస్థలస్థానే రాజ్యం చోటుచేసుకుని పౌరసమాజానికి చిహ్నంగా నిలిచింది. ఈ విప్లవాన్ని సిద్ధాంతపరంగా హూకర్ సమర్థించాడు. ఇతడు పవిత్ర వాదానికి వ్యతిరేకంగా ఆంగ్లికన్ హై చర్చ్‌ని సమర్థించాడు. పాలకులకు పాలితులకు మధ్య ఉన్న ఒడంబడికలోనే రాజ్యానికి మూలం ఉన్నదంటూ ఇతడు ఉదారవాదం ప్రజాస్వామిక రాజకీయ సిద్ధాంతానికి మూలసూత్రాలు రూపొందించాడు.

హూకర్ వ్రాసిన ECCLESIATICAL POLITYలో ఆధునిక రాజకీయ సిద్ధాంతానికి ప్రాతిపదికలు వేసాడు. మతం రాజ్యం కలిసిపోవాలనే కాల్విన్ ప్రతిపాదనను ఇతడు వ్యతిరేకించాడు. రాజ్యం ఆధిపత్యం వహించింది అన్నాడు. లౌకిక ప్రవర్తనను మత ప్రమాణ గ్రంథాల ననుసరించి నియమాలు రాబట్టడం తప్పని హూకర్ చెప్పాడు. దేవుడు విశ్వవ్యాప్తంగా పనికివచ్చే సూత్రాలను చెప్పలేదన్నాడు. కాలం, ప్రదేశాన్ని అనుసరించి మానవుడే తన ప్రవర్తనను నిర్ధారించుకోవడానికి దేవుడు స్వేచ్ఛను ఇచ్చాడన్నాడు. ప్రకృతి నియమం, వివేచన అనేవాటి పాలనలోనే మానవుడు

ఉంటాడన్నాడు. హూకర్ వివేచనాయుతంగా చెప్పిన వాటిని ఆధారంగా లాక్ ఆధునిక ఉదారవాద తత్త్వాన్ని ప్రభోదించాడు. అతడు కాల్వినిస్ట్ కాదు. ప్యూరిటన్‌కూడా కాదు, లాక్ ఆంగ్లికన్, ఇంగ్లండ్ సంస్కరణ వాదానికీ జర్మనీలో ఉద్యమానికీ ఆట్టే పోలిక లేదు. రాజు పరిపాలనలో ఇంగ్లండు సమస్యలన్నీ కేవలం మతేతరంగానే ఉన్నవి. ఇంగ్లండ్ మతసంస్థకు, రోమ్ కేథలిక్ వ్యవస్థకు చెప్పుకోతగిన మత కలహాలేమీ లేవు. ఉదారవాదం, ఇంగ్లండు సంస్కరణవాదం నుంచి వచ్చింది. మధ్యయుగాల్లో కేథలిక్ మతవ్యవస్థ, వివేచనాయుత ఆలోచనకు, అభ్యుదయకర పాండిత్యానికి, ఆలయం కాగా, అప్పుడే ఉదారవాదానికి బీజాంకురం జరిగింది. ఐరోపాలో వచ్చిన సంస్కరణవాదం మధ్యలో చొరబడింది. చిరకాలంగా జరుగుతున్న మేధస్సు అభివృద్ధికి భావస్వేచ్ఛకు ఇది కొంత ఆటంకం అయింది.

17వ శతాబ్దంలో ఉదారవాదానికి తోడ్పడినవాటిల్లో ప్రభువులకు, ఐరోపాలో కొన్ని చోట్ల పాలితులకూ, వచ్చిన సంఘర్షణలను కారణాలుగా పేర్కొనవచ్చును. మధ్యయుగాల్లో క్రైస్తవమత వ్యవస్థను కలవరపరచిన ఈ ధోరణి, సంస్కరణవాదం వలన జనించింది. లూథర్ ప్రత్యక్ష ప్రభావంక్రింద జర్మనీ ఈ గందరగోళం నుంచి స్వేచ్ఛగా ఉన్నది. అలా కాకున్నట్లయితే "17వ శతాబ్దంలో స్వేచ్ఛకు, రాజరికపు నిరంకుశత్వానికి అదుపు విధించే అవశేషాలు కొద్దోగొప్పో మిగిలిపోయాయి." సంస్కరణవాద ప్రభావంవలన ప్రభువులు దైవాంశసంభూత హక్కు స్థిరపడింది. కేథలిక్ సామ్రాజ్యంపై జర్మన్ ప్రభువులు తిరుగుబాటు చేయడాన్ని సమర్థించారు. పాలితులపై ప్రభువుల సంపూర్ణ హక్కును నిర్ధారించారు. కానీ ఇతర దేశాలలో ప్రభువు హక్కును అంగీకరించని ప్రజలు ఈ ధోరణులను ఎదుర్కొన్నారు. ఈ పరిస్థితివలన ఆనాటి న్యాయశాస్త్రజ్ఞులు నీతిశాస్త్రజ్ఞులు ఒక ప్రధాన సమస్యను ఎదుర్కొనవలసి వచ్చింది. మతస్వేచ్ఛకొరకు, అంతరాత్మ స్వేచ్ఛకొరకు ప్రభువును వ్యతిరేకించడాన్ని అనుమతించవచ్చునా? లూథర్‌గాని, కాల్విన్‌గాని, సంస్కరణ వాదానికి చెందిన ఇతర నాయకులు గాని ఇటువంటి ప్రశ్న జనిస్తుందని వూహించలేదు. ఒకేవిధమయిన జాతీయ రాజ్యాన్ని కోరిన వీరంతా ప్రభువు హక్కుకు సంబంధించిన వివాదాన్ని సహించేవారుకాదు. కానీ నెదర్లండ్స్, ఫ్రాన్స్, బ్రిటన్‌లలో రాజుకు పాలితులకు మధ్య హక్కులకు సంబంధించిన వివాదం తలెత్తింది. వాటి ఆధారంగానే ఆధునిక ఉదారవాదం ప్రజాస్వామ్యం, అంతరాత్మ, ఆరాధన, సహనం, నిరంకుశత్వాన్ని నిరోధించే ప్రజాహక్కు ఇత్యాదులన్నింటికీ స్వేచ్ఛ ఉండాలని సూత్రీకరణలు జరిగాయి. ఫ్రాన్సులో సెయింట్ బార్తలోమియోను చిత్రహింసచేసి చంపడంతో, స్వేచ్ఛనిమిత్తం చరిత్రలో చిరస్మరణీయమయిన రెండు ప్రచురణలు వెలువడినది. సుప్రసిద్ధ న్యాయనిపుణుడు

ఫ్రాన్సిస్ హాట్‌మన్ వ్రాసిన ఫ్రాంకో గలియా ఒకటి. ప్రభువుల దైవాంశసంభూత హక్కును, పవిత్రమైన పౌర న్యాయానికి అతడు విన్నపం చేసుకోలేదు. ప్రాచీన గ్రీసులో నిరంకుశత్వం ఒక ధర్మంగా భావించినప్పటినుండీ స్వేచ్ఛకోసం వెల్లడైన అనేక సంఘటనలను ఉదహరిస్తూ, ఇతడు చరిత్రకు విజ్ఞప్తిచేసాడు. చారిత్రకాధారంతో హాట్‌మన్, ప్రజాసంస్థలను నిరోధించే హక్కును సమర్థించాడు. ఆధునిక రాజ్యాంగ చరిత్రలో తొలుత వచ్చిన గ్రంథాలలో ఒకటిగా ఇతడి పుస్తకాన్ని శ్లాఘించారు.

అదే సమయంలో, VINDICIAE CONTRA TYRANNOS అనే పుస్తకం రచయిత ఎవ్వరో తెలియకుండా ప్రచురితం అయింది. ఈ గ్రంథ ప్రాధాన్యత చాలా ఎక్కువగా ఉన్నది. 17, 18 శతాబ్దాల విప్లవ ప్రణాళికగా దీనిని పేర్కొనవచ్చు. హాబ్స్, లాక్, రూసోలకంటే ముందే ఒడంబడిక సిద్ధాంతాన్ని ఈ గ్రంథం పేర్కొన్నది. అయితే ఒక ముఖ్యమయిన నిబంధనే చేర్చబడింది. “మంచి ప్రభుత్వం ఉంటుందనే ఉద్దేశంతోనే ప్రజలు లొంగిఉండటానికి అంగీకరించాలి. ఇది లొంగిఉండటానికి తప్పనిసరి”. రాజ్యస్థాపనకు ప్రజలు తమ సహజమయిన స్వేచ్ఛలో కొంత దత్తం చేయవలసి ఉంటుంది. శాంతిభద్రతల రక్షణకు ఇది అవసరం. కనుక లొంగుబాటు అనేది సంపూర్ణమూ కాదు మార్చడానికి వీలులేనిదీ కాదు. ఫ్రెంచి ప్రొటస్టంటు వాదులయిన హ్యూగనాట్ ప్రారంభించిన ఉదారవాదం, రూసోకంటే ఎక్కువ ప్రజాస్వామికమయినది. “సహజంగా స్వేచ్ఛాపూరితులూ సమానత్వంగల మానవులు తమ ఆస్తిని, జీవితాలను కొన్ని పరిమితులకు లోబడితప్ప ప్రభుత్వానికిపూర్తిగా ధారాదత్తంచేయాలనడం హేతుబద్ధమా?” అని హ్యూగనాట్ ఉద్యమకారుడు చాటాడు.

హ్యూగనాట్ ఉద్యమం ప్రజాస్వామికం కాదు. కాల్విన్ ధోరణిలో ప్రభావంపొందిన ఉద్యమం అది. మత కారణాలతో సమాజాలు ఎదుర్కొనే హక్కును ఉండాలన్నప్పటికీ వ్యక్తులకు ఆ హక్కును నిరాకరించారు. ప్రార్థనలతో–కన్నీళ్ళతో వ్యక్తులు పరిష్కరించుకోవాలన్నారు, ఇంగ్లండ్‌లో ప్యూరిటన్‌లు ఈ ధోరణిని ప్రచారంచేసారు. “ప్రాతినిధ్యపు ప్రభుత్వం” అనేభావాన్ని హ్యూగనాట్ ఉద్యమకారులు ప్రచారం చేసారు. ప్రతినిధుల సభలలో ప్రజాపాలకులు ఎదిరించే హక్కును కలిగి ఉండాలన్నాడు.

ఇంగ్లండ్‌లో ఇలాంటి ధోరణికే విజ్ఞులు ప్రాతినిధ్యం వహించారు. ఆధునిక ఉదారవాదానికి వారు పితామహులు. వారంతా భూస్వాములు. 8వ హెన్రీ సంస్కరణవాదం వలన లాభంపొందినవారు. కనుక సింహాసనానికి విధేయులుగా ఉన్నారు. టోరీలకు చెందిన ఇరాస్టస్ వాదంవలన వీరు ఆంగ్లికన్ మతవ్యవస్థపై తిరుగుబాటు చేసేలోపు ఇలా కొనసాగారు. రాజు స్వరాధికారాన్ని వీరు నిరోధించారు.

వీరంతా పూరిటన్‌లు కారు. అసమ్మతివాదులు మాత్రమే. వీరి రాజకీయ మతసిద్ధాంతాలను "ప్రక్షాళనవాదం-నీరు" అని వ్యంగ్యంగా చిత్రించేవారు. 17వ శతాబ్దపు మధ్యలో రాజులు దైవాంశ సంభూత హక్కు, రాజులకు ప్రజలకు మధ్య పౌరాధిపత్యం విషయంపై ఒడంబడిక అనే సమస్యను సెల్టన్ ప్రస్తావించాడు. బూర్జువా విగ్గుల మిత ఉదారవాదాన్ని న్యాయశాస్త్రజ్ఞుడుగా ఇతడు బైటపెట్టాడు. "రాజరికం దైవికం. పితృస్వామ్యాధిపత్యం ఆధారంగా ఇది ఉంటుంది. అయితే ప్రజలు తమకోసం రాజును సిద్ధంచేసుకుని అతడికి కొన్ని అవకాశాలు ఇస్తారు. తమ స్వేచ్ఛను అతడు కాపాడతాడని వారిలా చేస్తారు. రాజు వీటిని అశ్రద్ధచేస్తే అతడు సదవకాశాలను కోల్పోతాడు. రాజుకూడా చట్టపరిధిలోకి వస్తాడు" (W. Celden, Table talks).

ఇటువంటి సిద్ధాంతాలనే చాలామంది రచయితలు ప్రభోదించారు. అందులో ఒకరిలా అన్నారు. "దైవేచ్ఛవలన పాలకులు ఉన్నారు. అయితే వారు మానవుడికి జవాబుదారీగా ఉండాలి. దేవుడు సృష్టించిన పదవికి మానవుడు హద్దులను ఏర్పరుస్తున్నాడు." (J. Ware, the privileges of the people) సంస్కరణ వాదానికి ఇది చాలాదూరం. ఈ వాదాన్ని దేవతల తిరుగుబాటు అనేవారు. దైవాధికారాలలో రాజరికాన్ని ప్రవేశపెట్టాడు లూథర్. విగ్గుల ఉదారవాదం దేవుడి సర్వాధికార వాదాన్ని నిరాకరించింది. పైగా ఈ సూత్రాన్ని తిరగేసి ఇలా పేర్కొన్నారు. "దేవుడు ప్రతిపాదిస్తాడు, మానవుడు తృణీకరిస్తాడు." ఉదారవాదానికీ సంస్కరణవాదానికీ అంత దగ్గరసంబంధం లేదు. ఇంగ్లండులో సంపన్నులయిన విగ్గులు ఉదారవాదానికి ప్రారంభకులు. జర్మనీలో సంస్కరణవాదం ఫ్యూడల్ ప్రభువులకు సహకరించిందేకానీ, పెట్టుబడిదారీ విధానానికి మాత్రం కాదు.

దైవాధికారంపై జరిగిన దాడి సన్నిహితంగా కనిపించినప్పటికీ రాజు దైవాంశసంభూతుడనే సిద్ధాంతాన్ని దెబ్బతీసింది. ఫిల్మర్ ఇందులో ప్రధానపాత్ర వహించాడు. రాజాధికారం వంశపారంపర్యంమీద పెద్దల నుంచి సంక్రమించింది అన్నాడు. బైబిల్‌ను సామాజిక గ్రంథంగా స్వీకరించి రాజకీయాలను చరిత్రను అన్వయించాడు. మానవ సమాజాభివృద్ధి, దీనికి మూలంకూడా సహజంగా ఉన్నదేనన్నాడు. ఆధునికపద్ధతిలో అతడు, రాజ్యంలో రాజరికం అనేది చట్టబద్ధమయినదనే నిర్ణయానికి వచ్చాడు. రాజరికంతోకూడిన రాజ్యం దైవికమనీ, సహజమైనది కనుక ఈ నిర్ణయానికి వచ్చినట్లు పేర్కొన్నాడు. (R. Filmer PATREARCHA NON NONNARCHA). ఇంగ్లండ్‌లో విప్లవంపై ఫిల్మర్ రచనల ప్రభావం చాలా ఉన్నట్లు భావిస్తారు. దైవాంశసంభూత హక్కును అతడు సమర్థించడం విజయవంతమయింది. "దైవాంశసంభూత హక్కు ఒక విధంగా ఒడంబడి ఉండటాన్ని,

కర్మత్వాన్ని, కొనసాగించడాన్ని వ్యక్తీకరించడమే. 1660లోను 1889 లోను జరిగిన రక్తపాతరహిత విప్లవం, 1679లో సంకర విధానంనుంచి సింహాసనాన్ని కాపాడింది.” (కేంబ్రిడ్జ్ మోడరన్ హిస్టరీ).

ప్రతిచర్యను విజయవంతంగా సమర్థించడం, వ్యవస్థను అట్టిపెట్టడానికి తగు కారణాలు ఫిల్మర్ చెప్పడంతో ఉదార రాజకీయ సిద్ధాంతం వేగాన్ని పుంజుకొనేటట్లు చేసింది. సిడ్ని 2 ఈ విషయాన్ని ధైర్యంగా పేర్కొన్నాడు. ఫ్రాన్సులో హూగోనాట్లు ఎంత ప్రజాస్వామికులో విగ్గులుకూడా అంతే. “ప్రాతినిధ్యపు ప్రభుత్వాన్ని” వారు కావాలనడమేగాక ప్రజలకు ధర్మకర్తలుగా ఉంటామన్నారు. అందువలన సిడ్ని పేర్కొన్న రిపబ్లిక్ వాదాన్ని వారు కాదన్నారు. హేరింగ్‌టన్ అంత చిరాకును వీరు ప్రదర్శించలేదు. అయితే లాక్‌కుమించి ఎక్కువ విప్లవ భావాలను సిడ్ని చెప్పలేదు. ఆవిర్భవిస్తున్న బూర్జువా వర్గానికి ఒక తత్త్వంగా ఉదారవాదం ఉన్నదనడాన్ని పైనపేర్కొన్న విషయంకాదని చెబుతున్నది. అలాగే సంస్కరణవాదం వలన పెట్టుబడిదారీ ఆర్థిక అవసరాలు వచ్చాయనికూడా అంగీకరించడం లేదు.

సిడ్నీ–విగ్ కాదు, ప్యూరిటన్‌కాదు. ఫిల్మర్‌ను వెక్కిరిస్తూ అతడిలా వ్రాసాడు. “పోప్ అధికారం క్రింద రాజు, తన సంకల్పమే చట్టం అంటాడు. అలాంటివాడి క్రింద ప్రొటస్టంట్‌వాదం స్వేచ్ఛ విలసిల్లుతాయి” (Algrnon Sedny, Works, Edited by J. Robetson). రాజకీయ శాస్త్రంలో విశేషమైనదిగా గుర్తింపుపొందిన పటుత్వశైలిలో సిడ్నీ ఇలా వ్రాసాడు. “చట్టాన్ని ధిక్కరించే రాజు ఏ మాత్రం రాజు కాదు. ప్రజలు నిర్ణయించి రాజును తొలగించవచ్చు. జాతివలె పార్లమెంటు కూడా ప్రాచీనమైనది. స్వేచ్ఛాయుతమైన ప్రజలు తమ ఇష్టంవచ్చినప్పుడు సమావేశం కావచ్చు.” మితవాద లిబరల్ విగ్ పార్టీకి ఇదంతా చాలా విప్లవకరమైనదైతే, అటువంటి రిపబ్లికన్ వాదానికి క్రాంవెల్ 3 కూడా నిలబడలేదు. రాజద్రోహ నేరానికి సిడ్నీని ఉరితీయించినపుడు క్రాంవెల్ నోరెత్తలేదు. “దివ్యమయిన విప్లవం” రిపబ్లికన్ వాదానికి నిలబడిన మిల్టన్‌ని కూడా తృణీకరించింది. ఆక్స్‌ఫర్డ్‌లో ఇతడి రచనలను ఇతర రిపబ్లిక్ గ్రంథంతోపాటు మంటలకు అర్పించారు.

గ్రోషస్, హాబ్స్ తదితరులు నాటిన ఆధునిక ఉదారవాద బీజాలు మొక్కలుగా పెరిగి మిల్టన్, హేరింగ్‌టన్, సిడ్నీల రిపబ్లికన్ వాదంగా పుష్పించి తుదకు లాక్ తత్త్వంగా ఫలించాయి. విగ్గులవిధానం దైవనియమాలకు మానవ నియమాలకు, దైవాంశ హక్కుకు–ప్రజల హక్కుకు మధ్య రాజీ కుదిర్చింది. క్రమాభివృద్ధిలో భద్రతలో ఆసక్తి ఉన్నవారు తులనాత్మకంగా ఉండేటట్లు చూసుకోవాలని చెప్పారు. “రాజుకు వ్యతిరేకంగా ప్రభువంశీకులు సామాన్య ప్రజలతో చేతులు కలపకుండా ఉండటానికి”

ఈ సూచన చేసారు. మితవాద ఉదారులు విగ్ పార్టీగా రూపొందారు. వీరికి ప్రమాణయుత సిద్ధాంతకర్త డేనియల్ డెఫో. 4 ఇతడు ఒక వాదన చేస్తూ తరచు పార్లమెంట్ దేశానికి హానిచేయగా, ప్రజలు ఆస్థితినుంచి కాపాడారు అంటాడు. సంప్రదాయబద్ధంగా వస్తున్న దివ్యవాణి అనేది ఎవరు ప్రస్తావించారు? రాజు మాత్రమే. ప్రజల సంకల్పానికి రాజు ఒక చిహ్నమని డెఫో చెప్పాడు. నిరంకుశమయిన శాసనానికి హింసించే మతవ్యవస్థకు వ్యతిరేకంగా రాజు ప్రజలు కలిసి "దేశభక్తితో కూడిన రాజును" సృష్టించాలన్నాడు. ఫ్రాన్సులో 14వ లూయీ ఈ ప్రయోగాన్ని చాలా విజయవంతంగా చేసాడు. ఇంగ్లండ్‌లో ఇదింకా జయప్రదమయింది. అప్పుడే ఆరంభమైన ఉదారవాదం మధ్యయుగాల మూఢనమ్మకాలతో రాజీపడి అలాగే ఉండిపోయింది. దివ్య విప్లవం ఏర్పరచిన భ్రమలను ఫ్రెంచి విప్లవం పోగొట్టేవరకూ ఈ పరిస్థితి కొనసాగింది. అప్పటివరకూ మరుగుపడిన తాత్త్విక రాజకీయ సమస్యలు బర్క్ మేధస్సువలన స్పష్టపడినది. అంతటితో విగ్‌పార్టీ అనుసరిస్తున్న ధోరణి తల్లక్రిందులై ఉదారవాద ఆలోచనకు వూతాన్ని ఇచ్చింది. ఒక శతాబ్దం క్రితం విగ్ ధోరణికి ఫిల్మర్ ఇలాగే చేసాడు.

ఉదారవాదం, ప్రజాస్వామిక భావాల మూలం కనుగొనాలంటే వాటి వాస్తవప్రాధాన్యత తెలుసుకోవాలంటే, ముందుగానే ఏర్పరచుకున్న భావాలతో ప్రారంభించకూడదు. ఆలోచన పరిణామ తర్కాన్ననుసరించి, భావాల చైతన్యతలోని నిష్పాక్షికతలో చూడాలి. శతాబ్దాలుగా ఆలోచనారీతులన్నీ మతం అనే మూసలో మలచబడ్డాయి. ఏదో ప్రయోజనం వలన విశ్వంలో నియమం ఉన్నదనే సూత్రాధారంగా ఆధునిక విజ్ఞానం ప్రేరణ పొందినది. మధ్యయుగాలలోని మతపరమయిన ఆశ్రమాలలో వివేచనావాదం పుట్టింది. మత పండితుల వాదోపవాదాలలో సంశయవాదం జనించింది. ఇది విశ్వాసానికి, సంప్రదాయానికి, ప్రమాణానికి చాలా శక్తివంతమైన పరిష్కారమార్గం. అలాగే ఆధునిక సామాజిక రాజకీయ భావాలకుకూడా మితవాదాల ఆధారంగాను, అతిభౌతిక వూహలను స్వార్థంగా చేసిన ఫలితంగాను జనించినట్లు కనుగొనవచ్చు. 16వ శతాబ్దంలో పౌరసమాజపు మూలాన్ని గురించి వూహించినవన్నీ క్రైస్తవమతాన్ని చిన్నచూపుచూపినట్లే, బైబిల్ సిద్ధాంతాన్ని తృణీకరించడం అంతర్లీనంగా ఈ వూహలలో చూడవచ్చు. అంతేగాక ఉదారవాదానికి ప్రజాస్వామిక రాజకీయ సిద్ధాంతానికి

---

2. Sir Philip Sidney 1554–1586 ఇంగ్లీషు కవి, రాజనీతిజ్ఞుడు.
3. అలివర్ క్రాంవెల్ 1599–1658 బ్రిటిష్ జనరల్.
4. 1659–1731 ఇంగ్లీషు నవలాకారుడు, వ్యాసకర్త, పత్రికా రచయిత.

ఇందులోనే ప్రాతిపదికలున్నవి. రూసో, లాక్, హాబ్స్‌లకంటే చాలా విలువనిచ్చే ఒడంబడిక భావన ఉన్నది. 16వ శతాబ్దంలోని "మతయుగం" ఆధారంగా ఇది జనించింది. వాస్తవానికి మధ్యయుగాలలోని రచయితలు ఈ సూచన చేసారు. "స్వేచ్ఛకు ఊతాన్నిచ్చింది. మతం లేకపోయినట్లయితే కేంద్రీకృతమయిన శక్తి పెంపొందుతుండగా స్వేచ్ఛ నామరూపాలు లేకుండా పోయేది" (J. N. Figgs, ఇన్ కేంబ్రిడ్జ్ మోడరన్ హిస్టరీ, వాల్యూమ్ 3).

మర్సిగ్లివో, జోడినీ, మెకవల్లి వంటివారి తొలి ప్రయత్నాలవలన రాజరికపు సర్వాధికారానికి మతపరమయిన సమర్థన లభించింది. పౌరహక్కులను మతేతరంగా చూడటంకూడా ఇందుకు దోహదం చేసింది. దైవాంశ సంభూతపు హక్కు రాజుకు ఉందని వాదించిన సంస్కరణ ధోరణి దీనికి మద్దతును చేకూర్చింది. రాజుల సర్వాధికార ధోరణి అరాస్టిన్ సూచించగా, మతపరమైన అల్పసంఖ్యాక వర్గాలవారు తిరుగుబాటు చేసిన ఫలితంగా రాజకీయాలు ప్రజాస్వామికం అయినవి. 16వ శతాబ్దంలో రాజరికపు జాతీయ రాజ్యాల కేంద్రీకృత అధికారం చాలా విపరీతంగా ఉండేది. నిరంకుశులపై తిరుగుబాటు చేయడం మతపరమైన విధియని, అంతరాత్మ ప్రభోదాన్ని అనుసరించాలని చెప్పకపోతే ఆనాటి అధికారంపై తిరుగుబాటు చేయడం సాధ్యం అయ్యేదికాదు. VINDICIAE CONTRA TYRANNOS అనే గ్రంథం నాటి సాహిత్యంలో చాలా శక్తివంతమయినదిగా పరిగణించారు. ఈ గ్రంథం కొన్ని ప్రశ్నలను జనింపచేసింది. (1) దైవ నియమాలకు ప్రభువులు విరుద్ధంగా ఉత్తరువులు ఇస్తే ప్రజలు వాటికి కట్టుబడి ఉండాలా? (2) దైవ నియమాన్ని పాటించని రాజును ఎదిరించడం చట్టబద్ధమేనా? మతపరమైన హింసకు వ్యకిరేకంగా 16వ శతాబ్దంలో వినిపించిన వాణి 17వ శతాబ్దంలో ప్యూరిటన్ తిరుగుబాటుకు 18వ శతాబ్దంలో ఫ్రెంచి విప్లవానికి మేలుకొలుపు పాడింది.

16వ శతాబ్దంలో మతపరమైన చిత్తశుద్ధి, ప్రమాణాల సంఘర్షణలు, చిత్రహింసాధోరణి వలన రాజకీయ స్వేచ్ఛాధోరణి సజీవంగా నిలబడింది. రోమన్ సామ్రాజ్య ఆరంభ దశలో రిపబ్లికన్ ఆదర్శాలు నాశనం అయినట్లుగాగాక విశ్వవ్యాప్తంగా స్వేచ్ఛాభావాలు నాశనం కాకుండా 16వ శతాబ్దపుధోరణి వెలబెట్టింది". (పైన సూచించిన గ్రంథంలో).

కేంద్రీకృతమైన రాజరికం, నిరంకుశత్వం, ఫ్యూడల్ అరాచక వాదం నుంచి వచ్చింది. దీన్ని ప్రకృతి నియమ సిద్ధాంతం వ్యతిరేకించింది. 16వ శతాబ్దంలో తిరగదోడిన ఈ ప్రాచీన సిద్ధాంతం మతేతర వివేచనావాదం వైపుకు మొగ్గింది. ప్రజాస్వామిక రాజకీయ తత్త్వానికి ప్రారంభదశగా ఒడంబడిక సూత్రం ఉన్నదని

భావించి, ప్రకృతి నియమం బయలుదేరింది. విప్లవ బీజాలుగల ఈ సిద్ధాంతాన్ని అంక్తూజియస్, హూకర్‌వంటి సుప్రసిద్ధ మతపరమయిన రచయితలు సమర్థించారు. 16వ శతాబ్దంలో రాజ్యాన్ని గురించిన అభిప్రాయం అంక్తూజియస్ ఆమోదించాడు. రాజ్యం సర్వశక్తివంతమయినది, పవిత్రమైనట్టిది, మత వ్యవస్థ దీనిపై ఆధిపత్యం వహించడానికి వీలులేనిది, ఎరాస్ట్రియన్ వాదానికి చెందినవాడు అంక్తూజియస్. రాజ్యానికి సంబంధించిన ఇతడి అభిప్రాయాలు మధ్యయుగాలకు చెందినది. అందులో వ్యక్తికి స్థానంలేదు. సమాజాల సమూహమే రాజ్యం. తరతమ భేదాలతో వంశపారంపర్యతతో ఉన్న భావనే ఇది. అయినప్పటికీ ఒడంబడిక ఆధారంగా ప్రజాప్రభుత్వం ఉన్నదని, ప్రజలు సర్వాధికారులు కావాలని అంక్తూజియస్ భావించాడు. ప్రజాస్వామ్యాన్ని గురించిన నియంతృత్వ భావనే ఇది. రూసో ఉద్దేశాలు కూడా ఇలానే ఉండేవి. ఆధునిక ప్రజాస్వామ్యంలో ఈ నియంతృత్వ ధోరణి ఉండటమే ఒక శాపం. 16వ శతాబ్దంలోని మతవాది అంక్తూజియస్, 18వ శతాబ్దంలోని ప్రజాస్వామ్య ప్రవక్త రూసోకంటే ఎక్కువ ప్రజాస్వామ్య ధోరణిని కనబరిచాడు. అంక్తూజియస్ ఉద్దేశంలో సార్వభౌమాధికారం అన్యాక్రాంతం కావడానికి వీలులేనిది. అది ప్రజలతోనే ఉండాలి. రూసోకంటే లాక్‌కు సన్నిహితంగా వచ్చిన అంక్తూజియస్ ఉదారవాదానికి ప్రారంభకుడనవచ్చు. (VIDEJ. ALTHUSIUS, POLITICS).

ప్రకృతి నియమంలో ప్రజాస్వామ్యానికి దైవ ప్రమాణాన్ని కనుగొన్నాడు హూకర్. దైవాంశ హక్కుతో రాజులు పరిపాలిస్తే ప్రజల సార్వభౌమాధిక్యత కూడా దైవాంశ కలది. రాజరిక సంపూర్ణాధికారాన్ని ఎదుర్కొనడానికి మతం మహా శక్తివంతమయిన ఆయుధంగా పనిచేసింది. స్వేచ్ఛకు వూతాన్ని ఇచ్చింది. "దేవుని హృదయంలో మతానికి చోటున్నది. ప్రపంచ నియమమే మత వాణి. స్వర్గంలోనూ భూమిపైనా ఉన్న సమస్త విషయాలు మతానికి జోహార్లు అర్పించాల్సిందే. దాని శక్తినుంచి ఎవరికీ మినహాయింపు లేదు. దేవతలు మానవులు, ప్రాణులు అన్నీ, ఎంత భిన్నత్వంగా ఉన్నప్పటికీ శాంతి సుఖాలకు మాతృ స్థానంగా మతాన్ని శ్లాఘిస్తారు." (Richard Hooker, Eccliseastical Polity).

ఉదారవాదానికి ప్రజాస్వామ్య భావాలకు మూలాన్ని అన్వేషించడంలో ఇంకా చరిత్రలో వెనుక్కు వెళ్ళి చూడవచ్చు. ఒడంబడిక భావన, చరిత్రవలె ప్రాచీనమయినది. చరిత్రకు ముందున్న బైబిల్‌లోని పాతనిబంధనలను అలా అట్టిపెట్టి, గ్రీక్ తత్త్వంలోను, రోమన్ శాసనాలలోను మధ్యయుగాలలోని మత సాహిత్యంలోను ఒడంబడిక భావాన్ని చూడవచ్చు. వ్యక్తులను నీతిపరులుగా స్టాయిక్‌లు భావించగా క్రైస్తవమతం దీన్ని

స్వీకరించింది. అందరికీ ఆత్మలుంటాయి గనుక, విశ్వనైతిక విధానంలో ఇవన్నీ ఒకటిగా కలసిపోతాయి. కనుక మానవుడు సమానమని చాటి చెప్పడం జరిగింది. విశ్వనైతిక క్రమం వివేచనాత్మకమయినది. సృష్టికి ప్రయోజనమున్నదనే విషయాన్ని ఆధారంగా చూస్తే, మానవులలో కూడా వివేచన ఉన్నది. దీనివలన రాగద్వేషాలు, చెడు ఉద్రేకాలు అదుపులో ఉంచడానికి వారికి వీలవుతున్నది. క్రైస్తవమత విశ్వాసం గ్రీకు సంస్కృతిలో చొచ్చుక పోలేకపోయింది. ఈ సంస్కృతిలో గల వివేచనావాదాన్ని స్వీకరించి విలసిల్లితేతప్ప క్రైస్తవ మతానికిది సాధ్యంకాని పని, క్రైస్తవమత జ్ఞానం ప్లేటోనుంచి మార్మిక వాదాన్ని స్వీకరించింది. అరిస్టోటల్ నుంచి వివేచనావాదాన్ని, స్టాయిక్ నుంచి నీతిని తీసుకున్నది.

ఏమయితేనేమి, క్రైస్తవమతం చాటిన వ్యక్తిత్వం మానవుల సమానత్వం అనేవి అలౌకిక శక్తినుంచి వచ్చిన పారితోషకాలు గనుక, మానవులు చివరకు స్వేచ్ఛాపరులు కాకుండా పోతున్నారు. సంకల్పంలో సృష్టిలో, శాసనాలలో మానవుడికి స్వేచ్ఛలేదు. దైవసంకల్పాన్ని వ్యక్తపరచినంతవరకే మానవేచ్ఛ మంచిది. లేకుంటే అది పైశాచికం. దేవుని ప్రతినిధిగా మాత్రమే మానవుడిని సృష్టించగలదు. దేవుని దృష్టిలోనే వ్యక్తులు సమానత్వంతోకూడిన నీతిమంతులు. దేవునికి సంపూర్ణంగా లొంగిపోవడం వలన వ్యక్తులు తమలో ఉన్న ప్రతిభను గుర్తిస్తారు. అది దేవుని కటాక్షంవలన జీవితంలో ఆచరణయుక్తంగా చూస్తే ఇవన్నీ భ్రమలు. మధ్యకాలాలలో అవధులులేని క్రైస్తవమత విశ్వాసం, వివేచనపై ఆధారపడి ఉన్నది. అదొక్కటే కొంతవరకు రక్షణ కల్పించింది. ఈ వివేచనవలన క్రైస్తవ మతాలోచన ఆధునిక ఉదారవాదానికి చుక్కాని అయింది.

"12వ శతాబ్దంలో పునర్వికాసం క్రైస్తవమత విశ్వాసంలో మేధస్సుపరంగా జరిగిన జిజ్ఞాస అనవచ్చు. ప్రాచీన సంపదగా సంక్రమించిన వివేచనే మార్పుకు దోహదకారి అయింది. 15వ శతాబ్దంలో జరిగిన మానవుడి తిరుగుబాటుకు నామినలిస్టులు నాంది పలికారు. ఆధునిక ఉదారవాదబీజాలు 13వ శతాబ్దంలో కేవల మతాధిపత్యానికి వ్యతిరేకంగా జరిగిన మతతిరుగుబాటులోనే చూడవచ్చు. ఫ్రాన్సిస్ వ్యవస్థకు సంబంధించిన" ఆధ్యాత్మికవాదుల పక్షాన మాట్లాడుతూ ఓకం అల్పసంఖ్యావర్గాల హక్కును సమర్థించాడు. ఆనాడు వ్యవస్థాపితమైన పెత్తందారీ విధానం అల్పసంఖ్యాకులను చిత్రహింసలు పెట్టింది. అంతరాత్మ స్వేచ్ఛ పేరిట ఓకం విజ్ఞప్తి చేసాడు. ఒత్తిడి చేయడాన్ని ఎదుర్కొనే అల్పసంఖ్యాకుల హక్కును ప్రస్తావించాడు, అతడు సెక్యులరిజాన్ని ప్రభోదించాడు. రాజు అధికారాలు పోప్ ఇచ్చిన పారితోషికం కాదన్నాడు. రాజుకుకూడా సంపూర్ణాధికారాలు లేవన్నాడు. ఎన్నికయిన ప్రతినిధుల వలన రాజుకు పెత్తనం లభిస్తుందన్నాడు. ఆనాడు అంతకుమించి విశాలమైన

ప్రజాస్వామిక ఓటుహక్కును ఊహించడం కష్టమేమో. 14వ శతాబ్దం మతవ్యవస్థ పరిధిలోనే ఐరోపా సమాజం నిర్మితమైంది. శతాబ్దాలుగా సాగుతున్న పోరాటమెలా ఉన్నప్పటికీ ఇంకా ఆధ్యాత్మికానికి లొంగి లౌకికశక్తి పనులు నిర్వహించింది. ప్రజాస్వామిక భావాలు, సంస్థలు రావడానికి చిరకాలంగా మత ప్రభుత్వాలను సంస్కరించాలనే పోరాటమే కారణం. పోప్‌కుగల సంపూర్ణాధికారాలను ఎలా అణచివేయడమనేది నాటి రాజకీయ సమస్య.

14వ శతాబ్దారంభంలో, పాడాకుచెందిన మార్‌సిగ్లియో, సెక్యులరిజాన్ని, పునర్వికాసాన్ని అభిలషించిన వ్యక్తి. అతడు వాదిస్తూ పోప్, అతనిక్రింద మత వ్యవస్థలో హెచ్చుతగ్గులతో ఉన్నవారందరూ మానవులేగనుక, విశ్వాసానికి సంబంధించినంతవరకు తుది నిర్ణయాన్ని చేసేహక్కు వారికి ఇవ్వరాదన్నాడు. ఎన్నుకోబడిన ఒక సాధారణ సమితి ఉండాలని అతడు సూచించాడు. దైవ నియమాలకు అధికారపూర్వక వ్యాఖ్యానంచేయడానికి ఈ సమితి మతగురువులకు, పాలకులకు పనికివస్తుందన్నాడు (BEFENSOR PACIS) సాధారణసమితి ఉండాలనే ప్రజాస్వామిక భావనను ఓకం స్వీకరించాడు. మత పరిపాలనలో మత గురువులతోపాటు సామాన్యులు కూడా ప్రాతినిధ్యం వహించాలని వీరు వివేచనకు విశ్వాసానికి ప్రతినిధులుగా ఉంటారని ఓకం అభిప్రాయం వెలిబుచ్చాడు. ఆ తరువాత రెండు శతాబ్దాల వరకు సాధారణ సమితి అనేది ఒక శక్తివంతమయిన సంస్థగా రూపొందినది. ఆధునిక పార్లమెంటుకు ఇదే దారి చూపింది. సాధారణ సమితిలో డొమీనికన్లు, ఫ్రాన్సిస్‌కన్‌లు అనే క్రైస్తవమత శాఖలు రెండు ప్రాతినిధ్యం వహించాయి. ఇవి రెండుకూడా ప్రజాస్వామికంగానే అంతర్గతంగా ఏర్పడినవి. క్రైస్తవసమాజాలలో స్వేచ్ఛాన్వేషణ నిర్ణయాలు, ఉండాలనే పోరాట ఫలితంగా అత్యంత ప్రాధాన్యత వహించిన ఈ రాజకీయ ఫలితాలు వచ్చాయి.

కన్సిలియర్ ఉద్యమాన్ని మొట్ట మొదటి రాజకీయ బోధనా పాఠశాలగా పేర్కొనవచ్చును. ప్రజాస్వామికంగా ఉన్న ఈ ఉద్యమ సిద్ధాంతాన్ని అనుసరిస్తూ, ఆనాటి ఏకైక ప్రభుత్వంగా ఉన్న మత ప్రభుత్వం, ప్రాతినిధ్యంలోకూడి ఉండాలన్నారు. పోప్ ఆ తరువాత వివిధ దశలలో ఉన్న మతాధికారులందరూ ప్రజాసేవకులు, సామాన్యులలోని విశ్వాస పాత్రులతోసహా మత వ్యవస్థ అంతా, నియమాలు రూపొందించడానికి ఆధారం అని ఈ ఉద్యమం పేర్కొన్నది. మత వ్యవస్థ సమాజాన్ని అంతటినీ ఆవరించి ఉంటుంది. దీనికే సార్వభౌమత్య హక్కుకూడా ఉంటుంది. పోప్ సర్వాధికారానికి ఈ సిద్ధాంతం చాలా విచ్ఛిన్నకరమైనది.అయినప్పటికీ ఓకం ఈ విషయాలన్ని ధైర్యంగా పేర్కొన్నాడు. ఎన్నుకోబడిన సమితి పోప్‌ను కూడా పదవినుంచి తొలగించవచ్చునేది సాధారణంగా అభిప్రాయం. విక్లిఫ్, జాన్‌హస్

ఇరువురూ ఆధునిక ప్రజాస్వామ్యానికి స్వాగతం పలికారు. మధ్యకాలాలలోని క్రైస్తవ సామాజిక వ్యవస్థను కుదిపివేసిన మతవ్యతిరేక ఉద్యమం విప్లవాత్మకమైనది. మత వ్యవస్థలో సంస్కరణ జరగాలని ఉద్యమంలో రాజకీయ ధోరణులు చాలా ఉన్నవి.

రాజు దైవాంశ సంభూతుడు అనే సిద్ధాంతాన్ని సంస్కరణ వాదం ఇంకా నొక్కి చెప్పింది. దీని వలన కేవల అధికారంగల రాజరికం, అప్పుడే జనిస్తున్న ప్రజాస్వామ్యాన్ని చంపేయడానికి అవకాశం ఏర్పడింది. విక్లిఫ్ ఈ తొలి ప్రజాస్వామిక ఆలోచనను చేసాడు. ఇతడు ఇంగ్లండ్‌లో రైతుల తిరుగుబాటుకు నాయకత్వం వహించాడు. ఐరోపాలో మత వ్యతిరేక ఉద్యమాలకు ఉత్తేజాన్ని ఇచ్చాడు. రాజు దైవదూత అని ప్రకటించాడు. పోప్ అధికారానికి అదొక సవాలుగా మారింది. పోప్ సర్వాధికారానికి వ్యతిరేకంగా జరిగిన పోరాటంనుంచే ప్రజాస్వామ్యం పుట్టక వచ్చింది. రాజు దైవాంశ హక్కుగలవాడనీ సిద్ధాంతం వలన, ఆధ్యాత్మిక పెత్తనానికి వ్యతిరేకంగా లౌకిక శక్తి వచ్చింది. రాజకీయాలను మతరహితంగా అట్టిపెట్టాలనడం ప్రజాస్వామికీకరణకు అవసరమయింది. ప్రపంచ వ్యవహారాలలో మతాధిపతుల పెత్తనంకంటే రాజాధికారం ఉన్నతమయిందని విక్లిఫ్ చాటాడు. మత పాలనలో దోషాలను సరిదిద్దే అధికారం రాజుకు ఉన్నదన్నాడు.

1433లోనే నికోలాస్ క్యూసా బయలుదేరి కన్సిలియర్ ఉద్యమంలోగల ప్రజాస్వామిక లక్షణాలను స్పష్టంగా బైటపెట్టాడు. పౌర, మతపరమయిన వ్యసనాలుగాని, రాజాజ్ఞలు పోప్ ఆజ్ఞలుగాని, సమాజం ఒప్పుకుంటే తప్ప చెల్లవని ఇతడు స్పష్టంగా చెప్పాడు. ప్రకృతి నియమానికి సంబంధించిన ప్రజాస్వామిక సిద్ధాంతాలను క్యూసా శ్లాఘిస్తూ, మానవులలో సహజంగా ఉండే సమానత్వాన్ని అభినందించాడు. 16వ శతాబ్దంలోగానీ ఈ భావాలు బాగా అభివృద్ధి చెందలేదు. రాజును చేసింది చట్టమే గనుక, రాజుకూడా చట్టానికి లోబడి ఉండాలన్నాడు. (NICHOLAS CUSA DE CONCORDIANTIA CATHOLICA).

సమానత్వం, సౌభ్రాతృత్వం అనే భావాలు ఇంకా ప్రాచీన కాలంలోను కనుగొనవచ్చు. తొలి క్రైస్తవమతం బోధించిన ఆదర్శాల వలన మధ్య యుగాలలో ఉత్తేజంపొంది, రైతుల తిరుగుబాట్లు జరిగాయి. గ్రీక్ వివేచనావాదంలో ఉదారవాదాన్ని చూడవచ్చు. రాజు దైవాంశసంభూతుడనే సిద్ధాంత ఫలితంగా రాజకీయాలలో మతేతర ధోరణి వచ్చింది. ఈ మతేతర ఉద్యమం వలన వ్యవస్థాపిత ధోరణులను సవాల్ చేస్తూ ప్రజాస్వామిక భావాలు జనించాయి. ఓకంకు సమకాలీనుడైన మార్ సిగ్లియో, పౌరుల అధికారం మతేతరంగా కొనసాగాలన్నాడు. ఇతడి రాజకీయ సిద్ధాంతానికి తాత్త్విక ప్రాతిపదిక ఉన్నది. ఇది అరిస్టోటల్ సంప్రదాయం నుంచి, అరబ్బువివేచనావాది

అవరో స్వీకరించాడు. DEFENSOR PACIS అనే తన గ్రంథం అరిస్టోటల్ పోలిటిక్స్‌కు అనుబంధం అని మార్ సిగ్లియో నమ్మాడు. అయితే సహజవాదం, వివేచనావాద దృక్పథాలు తప్ప, వీరిరువురూ అంగీకరించే విషయాలు చాలా తక్కువ. ఆధునిక ఉదారవాద, ప్రజాస్వామిక ఆలోచనలను ప్రారంభించిన ఈ మధ్యయుగాన్ని శాస్త్రనిపుణులు ఇలా ప్రకటించారు. "పౌరులంతా ఆదేశించగా మానవచట్టం రూపొందుతుంది. వారు చట్టం చేయడానికి అర్హులు. మానవులు స్వచ్ఛందంగా చేయతగినవి. చేయకూడనివాటినుంచి, ప్రపంచంలో అత్యుత్తమమైన వాటిని సాధించడానికి చట్టాలు ఉద్దేశించబడినవి" (MARSIGLIO DE PADUA, DEFENSOR PACIS) 12వ శతాబ్దం పునర్వికాసం ఆరంభమైనప్పటినుండి నామినలిస్టులు వివేచననూ విశ్వాసాన్నీ విడదీయాలని వాదించడం వలన మతేతర అధికారానికి స్వతంత్ర విధానం ఉండాలని సిద్ధాంత ప్రాతిపదికలు వచ్చాయి. అంతేగాక ప్రజాస్వామికీకరణకు కూడా నాంది ఏర్పడింది. మార్‌సిగ్లియో ప్రాతినిధ్య ప్రభుత్వ సిద్ధాంతాన్ని కూడా సూచించాడు.

ఆవిధంగా మత వ్యవస్థలో పుట్టి, మధ్యయుగాలు మత సాంఘిక రీతులకు వ్యతిరేకంగా వచ్చిన తిరుగుబాటులో బీజాలునాటుకొన్న ఉదార ప్రజాస్వామికాలోచన సహజ నియమ సిద్ధాంతాలలో ఇంకా స్పష్టంగా వెల్లడయింది. 16, 17 శతాబ్దాలలో పౌరసమాజానికి బీజాంకురాలు చూడవచ్చు. ఎందరో ఆలోచనాపరులు ప్రారంభించిన ఈ రీతులు జాన్ లాక్‌కు ఒక తాత్త్విక విధానంగా రూపురేఖలు సంతరించుకున్నవి. బ్రిటన్‌లో లాక్‌కు ముందు హూకర్ తన (ECCLESIASTICAL POLITY) మత రాజకీయంలో సమీక్ష చేస్తూ, థామస్ ఎక్వినాస్ ప్రాతినిధ్యం వహించిన మధ్యయుగాల రాజకీయాలోచనలను పేర్కొన్నాడు.

ఈ విధంగా ఆధునిక, ఉదార, ప్రజాస్వామికాలోచన 17వ శతాబ్దంలో రూపొంది, విస్తృతపడి కొత్తభావాలు వెల్లడించినప్పటికీ, దీని వేరులు గల చరిత్రలోను, మధ్యయుగాలద్వారా అరిస్టోటల్ వరకూ ప్రాకిపోయినట్లు చూడవచ్చు. మతరహిత విధానం అందలి ప్రధానలక్షణం. ఈ లక్షణం రావడానికి పునరుజ్జీవం పొంది విజ్ఞానం దానిఫలితంగా వచ్చిన తాత్త్విక విప్లవం కారణాలు. మధ్యయుగాంతంలో ఎన్నో శతాబ్దాలుగా వూహాలోచనకు సంబంధించిన దేవుడు – మానవుడు మధ్య సంబంధాన్ని గురించిన సమస్యస్థానే, మానవుడికీ మానవుడికీ మధ్య ఉండే సంబంధం చోటుచేసుకున్నది. రాజకీయాలు మతేతరంగా ఉంచితేకాని ప్రజాస్వామికీకరణ వీలుపడదు. వాస్తవ ఉదారవాదానికి మానవతావాదం పునాదులు వేసింది. ఉదారవాదం ఉన్నత స్థాయికిచేరుకున్న అనంతరం 18వ శతాబ్దంలో పతనం చెందింది.

లాక్ రూపొందించిన ఈ వాదం మతేతరంగా పోవలసినంత దూరం పోనందున ఇలా సంభవించింది. మతగురువులకు వ్యతిరేకంగాతప్ప ఉదారవాదం మతరహితం కాలేకపోయింది. దీనికి సంబంధించిన మానవతావాదం వైజ్ఞానిక దృక్పథంతో చూస్తే సహజవాదం కాదు. ప్రకృతి మతంవైపుకు మొగ్గుచూపింది. ఉదారవాదానికి సంబంధించిన వివేచనావాదం,సృష్టికి ప్రయోజనమున్నదని అనలేకపోయినా అతి భౌతికమయినదే. వివేచన మానవుడిలో ఉన్నదని చెప్పినప్పటికీ అది జీవసంబంధమయినదని గాక పారలౌకికమయిందని భావించింది. చివరకు ఉద్వేగవాదంతో ముడివేసుకోవడంవలన మతరహిత మానవతారీతిని నిరాకరించినట్లయింది. నీతికి అలౌలిక ప్రమాణాలను అన్వేషించే మతంలోకి ఉదారవాదం పోయింది.

మతజ్ఞానంతో కూడిన వివేచనావాదానికి మంచి సంప్రదాయాలున్నాయి. పోప్ కేవలాధికారానికి వ్యతిరేకంగా పోరాటం జరిగింది. మతపరమైన ప్రభుత్వాలను ప్రజాస్వామికీకరణ చేయాలన్నారు. ఇవన్నీ ఉదారవాదం అభివృద్ధిచెందడానికి, ప్రజాస్వామిక రాజకీయ సిద్ధాంతాలు దోహదం చేసాయి. తత్త్వాన్ని మతరహితంగా చేసినందువలన ఈ ఫలితాలు వచ్చాయి. విజ్ఞానమంతటికీ మతమే కీలకమనే స్థానంనుంచి తొలగించడంతో పరలోక సమస్యలను గురించి వృధా వూహలుగాక ఈ లోకంలో జీవితసమస్యల వైపుకు దృష్టి మళ్ళించడం వలన పైన పేర్కొన్న ఫలితాలు జనించాయి. మెకవెల్లి, హాబ్స్‌లు కూడా ఆధునిక మతరహిత రాజ్య సిద్ధాంత సృష్టికర్తలుగా చరిత్రలో అర్హస్థానం పొందారు. కానీ మానవుడి భావ విమోచనాజ్ఞానం ఒక అంతర్లీన తాత్త్విక రీతిగా మార్‌సిగ్లియోతోనే ప్రారంభమయింది. అది హాబ్స్‌లో ఉన్నతస్థాయికి చేరుకున్నది. ఉదారవాద తత్త్వానికి జాన్ లాక్ పితామహుడని గుర్తింపువచ్చింది. అయితే మహోన్నత తత్త్వవేత్త అయిన స్పినోజా కూడా ఈ చారిత్ర విశిష్టతకు చెందినవాడే. వీరిరువురూ రాజకీయ సిద్ధాంతవాదులుగా హాబ్స్ శిష్యులే. తాత్త్వికంగా స్పినోజా గురువుకు సన్నిహితంగా ఉంటాడు. కనుకనే అతడి రాజకీయ సిద్ధాంతం కూడా రాజీలేని ప్రజాస్వామిక ధోరణిలో ఉన్నది. లాక్ ఉదారవాదం హూకర్ ప్రభావం క్రింద ఉన్నది. ఇందువలననే కాబోలు మత సంప్రదాయంనుంచి అతడు పూర్తిగా తెగత్రెంపులు చేసుకోలేకపోయాడు. హెల్విషస్, కాండిలా ఇరువురూ పై బలహీనతలను తొలగించారు. విప్లవానంతర ఇంగ్లీషు ఉదారవాదం జ్ఞానవికాస విప్లవ ప్రభావాన్ని వదిలివేసి లాక్ సంప్రదాయానికి చెందిన మతపరమైన మితవాద ఉదారతత్త్వం వైపుకు పోయింది.

ఉదారవాదానికి హాబ్స్ తాత్త్వికపునాదులు నిర్మించాడు. ఇతడు అరమరికలు

లేకుండా రాజకీయ ఆలోచనను మతరహితంగా అట్టిపెట్టాడు. పౌరులకు మతాధికారులకూ, రాజ్యానికీ మతానికీ ఉన్న సంబంధం కలవరపెడుతుండగా మొట్టమొదటిసారిగా హాబ్స్ ఈ సమస్యయొక్క మూలానికి వెళ్ళాడు. శతాబ్దాలుగా మతపండితులనూ, వివేకవంతులయిన న్యాయనిర్ణేతలనూ, ఊహలు చేసిన తత్త్వవేత్తలనూ సార్వభౌమత్వమనే సమస్య గందరగోళపరచింది. హాబ్స్ దీనిని గుర్తించడంలో ప్రథముడనవచ్చు. సార్వభౌమత్వానికి స్పష్టమయిన, నిర్దిష్టమైన నిర్వచనాన్నివ్వడం ఇతడుచేసిన వాటిలో అతిముఖ్యమయిన విషయం. సార్వభౌమత్వానికీ ప్రజలకూ తేడా లేదనేది హాబ్స్ సిద్ధాంతంలో మౌలిక అంశం. అవి రెండూ ఒకటే. అంటే ప్రజలను సార్వభౌమాధికారాన్ని హాబ్స్ కలిపివేసాడనిపిస్తుంది. కొంచెం జాగ్రత్తగా పరిశీలిస్తే ఇందులోని ప్రజాస్వామిక మూలం విదితమవుతుంది. అది రెండువైపులా పదునుగల కత్తివంటిది.

సార్వభౌమత్వం, దైవాంశవాదం స్వతహాగానే రాజునకు చెందినవని అంగీకరించినప్పటికీ, ట్యూడర్ కాలంలో న్యాయవాదులు తమ మేధస్సు నుపయోగించి రాజుకు గల అవకాశాలకు రాజ్యాంగ పరిమితులను ఏర్పరిచాడు. సార్వభౌమత్వ సమస్యను కృత్రిమంగా చూడటంలో గల ద్వేషాన్ని హాబ్స్ బైటపెట్టాడు. సార్వభౌమత్వమే గనుక దైవాంశతో కూడినదైతే, మానవుడు చేసిన చట్టాలు దానికి ఎలా పరిమితులను విధించగలవు? పైగా సార్వభౌమాధికారాన్ని పేర్కొన్న రాజు లేదా పార్లమెంటు లేదా సంరక్షకుడు, ఆచరణలో పట్టుదలను అధిగమించారు. సార్వభౌమత్వం ప్రజల ఇచ్ఛను వ్యక్తపరిచేదని భావిస్తే తప్ప ఈ సంఘర్షణలు విరుద్ధత్వాలు తప్పవు. అది స్పష్టంగా ప్రజాస్వామిక సిద్ధాంతం, రాజుల దైవాంశ హక్కుకు హాబ్స్ తృణీకరించగలిగాడంటే అతడి సిద్ధాంతం మతరహితం, ప్రజాస్వామికం కావడమే మూల కారణం. "లౌకిక, అధ్యాత్మిక అనే రెండు మాటలు వాడుకలోకి రావడంవలన చట్టబద్ధమయిన సార్వభౌమత్వం నుంచి తప్పుగా అర్థంచేసుకున్నారు. ఇద్దరు యజమానులకు ఒకడు లొంగి ఉండలేడు. తనకు తానే వ్యతిరేకంగా ఉండే సభ నిలువలేదు. భూమిపైన మానవులెవరూ అధ్యాత్మికులు కాదంటే, అధ్యాత్మిక సంక్షేమ రాజ్యం ఉండదు." (థామస్ హాబ్స్, 'లెవియథాన్').

హాబ్స్ చేసిన సార్వభౌమత్వ నిర్వచనంలో రాజు కొట్టొచ్చినట్లు కనిపిస్తాడు. ఈ ప్రస్తావన వ్యక్తిగత పాలకునికి చెందినది కాదు. సమాజంలో జనేచ్ఛకు చెందినది మాత్రమే. "ఇక్కడ ముఖం స్టువర్ట్ రాజుది. వాణి ప్రజలది" (కేంబ్రిడ్జ్ మోడరన్ హిస్టరీ, వాల్యూం 6). సార్వభౌమత్వం "అందరి సహజ హక్కు అన్నింటికి మార్చడం వలన" జనిస్తుంది. ఈ హక్కులు సార్వభౌమత్వానికి ఆధారం. అవి తప్పనిసరిగా

రాజుకు సంక్రమింప నక్కరలేదు. తొలుత ఇట్లా జరిగేది కనుక సార్వభౌమత్వాన్ని రాజుతో తాదాత్మ్యంచేసి చూపాడు హాబ్స్. "అందరికి చెందిన సహజ హక్కులు అన్నింటికీ" మార్చడానికి వీలులేదని కాని, సార్వభౌమత్వానికి ప్రత్యామ్నాయ సూచన చేయలేమనిగాని హాబ్స్ అనలేదు. సార్వభౌమత్వాధికారానికి మూలమేమిటనేది కీలకమైన విషయం, సహజమేనని హాబ్స్ ఈ విషయాన్ని స్పష్టంగా పేర్కొన్నాడు.

సార్వభౌమత్వాన్ని గురించి హాబ్స్ దృక్పథం కేవలం అతని సొంతం. ప్రప్రథమంగా మౌలిక సూత్రాల ఆధారంగా రాజకీయ సిద్ధాంతంవచ్చింది. సెయింట్ అగస్టీన్ కాలంనుంచీ మతప్రమాణ గ్రంథాల ఆధారంగా రాజకీయసిద్ధాంతం రాబట్టారు. రాజకీయం మతంలోభాగం గనుక, మతజ్ఞానాధిపత్యం ఉండేది. మార్‌నిగ్లియో, బోడిన్‌వంటి సెక్యులరిస్టులు ఈ విషవలయం నుంచి బైటికి రాలేకపోయారు. మెకవెల్లి ప్రయత్నించాడుగానీ అతడు తత్త్వవేత్తకాడు. అతని రాజకీయ సిద్ధాంతాలు సునిశితంగా పరిశీలించినవికావు. మానవ ద్వేషభావంతో, రాజకీయ ఆచరణకు ఇతడు కొన్ని నియమాలు సూచించాడు. "ప్రకృతి సూత్రాలనుంచి" హాబ్స్ సార్వభౌమాధికార సిద్ధాంతాన్ని రాబట్టాడు. మతజ్ఞానంనుంచి రాజకీయతత్త్వాన్ని విమోచన గావించాడు. సంస్కరణవాద మత ఈర్ష్యలనుంచి తొలి ప్రజాస్వామిక ఉద్యమాన్ని వేరుచేసాడు. "హాబ్స్‌వలె మరెవరూ ఈ విషయంలో మూలానికి పోలేదు. ఏదో ఒక నిరంకుశ రూపాన్ని మిగిలినవారు ఆశ్రయించారు. లెవిథియన్ సిద్ధాంతం అంధకారాన్ని చీల్చుకుంటూ సుడిగాలివలె ముందుకుపోయింది. ఇతరులకు కనిపించనిచోట ఈ సిద్ధాంతం స్పష్టంగా చూడగలిగింది. గందరగోళం ఉన్నచోట పొందికగా ముందుకు పోగలిగింది. ఇతరులు పరస్పర విరుద్ధాలతో ఉండగా ఈ సిద్ధాంతం ఏకాగ్రతలక్ష్యంతో సాగింది. 17వ శతాబ్దపు మధ్యకాలం సృజనాత్మక మహోన్నతదశ. కానీ ఆ సృష్టి అంతా గందరగోళంగా ఉంది. కాంతి ఎటువైపునుంచి ప్రసరిస్తుందో, ఇతరులకంటే హాబ్స్ స్పష్టంగా చూచాడు" (కేంబ్రిడ్జ్ మోడరన్ హిస్టరీ వాల్యూం 6).

హాబ్స్ రాజకీయ సిద్ధాంతం తత్త్వంలో ఒక అంతర్భాగంగా పెంపొందడంలోనే దాని ప్రాధాన్యత ఉన్నది. ఇది చాలా తీవ్రమయిన వివేచనాత్మకమైన ధోరణిలో ఉండటంవలన మతానికి ఏమాత్రం సంబంధం లేకుండా స్వేచ్ఛగా సాగింది. అతి భౌతిక మర్మాలలో రాజ్యం కప్పిపుచ్చుకుపోయే ధోరణి ఇందులో లేదు. హాబ్స్ తత్త్వం విశ్వాన్ని అంతటినీ ఆవరించింది. రేఖాగణితం, యాంత్రిక విధానంవలన వివరణ జరిగింది. మనోవిజ్ఞానంవలన శారీరక శాస్త్రం అనేది యాంత్రికమైన విశ్వ విధానంలో జీవసంబంధమైన రీతులను చూపాడు. వీటిమధ్య సమాజం వచ్చింది. సహజ నియమాలననుసరించి ఏర్పడి, నడుస్తున్న సమాజం చాలా క్లిష్టమయినది. విశ్వపథకం

అంతా స్వయం సంపూర్ణం. ఇందులోనే శరీరం మనసు ఆత్మగల మానవుడు కూడా ఉన్నాడు. ప్రపంచానికి బైటిశక్తులు ప్రభావితం చేయడంగాని, అదుపులో ఉంచడంగాని, మార్గం చూపడంగాని ఈ పథకంలో లేవు. ఆధ్యాత్మిక బానిసత్వంపై మానవుడి తిరుగుబాటు హాబ్స్ తత్త్వంలో పరాకాష్టనందుకున్నది. మానవ స్వేచ్ఛకు హక్కులపత్రంగ ఈ తత్త్వం ఉదారవాదానికి ప్రజాస్వామ్యానికి పునాదులు నిర్మించింది.

హాబ్స్ తత్త్వం అన్ని కోణాలనుంచి భయాన్ని, ఆగ్రహాన్ని, ద్వేషాన్ని రెచ్చగొట్టింది. అంటే ఏ వర్గానికి ఇది ప్రాతినిధ్యం వహించడం లేదన్నమాట. ఉదారవాదం బూర్జువావాద సిద్ధాంతం మాత్రం కాదు. భావాలు వాటితత్త్వాన్ని అనుసరించి పెంపొందుతాయని రుజువయింది. హాబ్స్ విప్లవతత్త్వాన్ని మతవాదులు, రాజు అనుచరులు, మతప్రక్షాళనవాదులు, కొత్తగా ఆవిర్భవిస్తున్న బూర్జువావర్గం వ్యతిరేకించడం గమనించవచ్చు. “అన్ని వర్గాలవారు తమకొక శత్రువున్నట్టు భావించారు. అన్ని జాతులకు వినాశకారి అని హాబ్స్ సిద్ధాంతాలను ఖండించారు. రాజరికపు పదవులకు వినాశకారి అని, దోపిడీదారులను ప్రోత్సహిస్తోందని, చారిత్రకంకాదని, ప్రమాణగ్రంథ వ్యతిరేకమని, అవినీతికరమని హాబ్స్ సిద్ధాంతంపై విరుచుకపడ్డారు. ఇతడు ఎపిక్యూరసే వాదానికి చెందినవాడని, క్రాంవెల్ ధోరణిని అనుసరిస్తున్నాడని, అంతరాత్మకు మతానికి శత్రువని, నాస్తికుడనీ అన్నారు. అవిర్భవిస్తున్న బూర్జువావర్గ దృష్టిలో హాబ్స్, ఆస్తికి శత్రువు, వ్యాపార సంస్థలకు వైరి” (కేంబ్రిడ్జ్ మోడ్రన్ హిస్టరీ, వాల్యూం 6).

రెండవ ఛార్లెస్ ఇతడినిగురించి చిత్రీకరిస్తూ, బైబిల్‌లో చేసిన వర్ణనను స్వీకరించి “అతడందరికీ వ్యతిరేకం, అందరూ అతడికి వ్యతిరేకం” అన్నాడు. అందువలన రాజరికపు సర్వాధికారాన్ని హాబ్స్ సిద్ధాంతపరంగా సమర్థించాడనడం కూడా సంప్రదాయంగా వస్తున్నదేకాని సరైన అభిప్రాయం కాదు. రాయలిస్ట్ పార్టీ నాయకుడు కార్లెండన్ వ్యాఖ్యానిస్తూ, క్రాంవెల్‌ను సంతృప్తిపరచడానికి లెవియథాన్ వ్రాసాడన్నాడు. అయితే ఇది సత్యదూరం కాదు. ఏ వాస్తవ ప్రభుత్వానికయినా తన అభిప్రాయాలు సరిపడతాయని హాబ్స్ దాపరికం లేకుండా చెప్పాడు. అన్ని కాలాలలోను భావ విచ్ఛేదకుడుగా మహోన్నత స్థాయిని అందుకోగల హాబ్స్ ఆంగ్లికన్ వాది అయిన క్లారెండన్‌కు, ప్యూరిటన్ అయిన క్రాంవెల్‌కు స్తోత్రపాఠకుడూ కాలేదు. కానీ క్రాంవెల్ చెప్పే కారణాలు ప్రజాస్వామికమైనంతవరకు హాబ్స్ తత్త్వంలో వాటికి మద్దతు లభించింది. రాజుకు దైవాంశసంభూతపు హక్కు ఉన్నదనే కట్టుకథను అందరూ గౌరవిస్తున్నా హాబ్స్ దానిని బట్టబయలు చేసాడు.

హాబ్స్ సాహసోపేత వాదిగా తన కాలానికి మించిపోయి భవిష్యత్తులోకి

చూచాడు. సమకాలీనులెవరూ అతడి తత్త్వాన్ని ఆమోదించలేదు. భవిష్యత్తుకు 19వ శతాబ్దంవరకు దీనినెవరూ మెచ్చుకోలేకపోయారు. విగ్గుల వాదం "ప్రక్షాళన వాదం–జలం". అయితే 19వ శతాబ్దంలోని రాడికల్ తత్త్వం హాబ్స్ వివేచనా వాదంతో పవిత్రతతోనూ ఉన్నది. మధ్యయుగాలలోని భావోద్యమాల నుంచి ఉదారవాదం జనించింది. అది బూర్జువా సృష్టి కాదు. కానీ యాదృచ్ఛికంగా బూర్జువా వర్గం తమ సాంఘిక ప్రయోజనాలకు అనుకూలంగా ఉన్న ఉదారవాదాన్ని స్వీకరించింది.

ఆధునిక ఉదారవాదానికి గట్టి తాత్త్విక ప్రాతికలువేసిన ఖ్యాతి హాబ్స్‌కు దక్కుతుంది. మరే రాజకీయ సిద్ధాంతం కూడా ఆ కాలంలో వ్యక్తివాదాన్ని ప్రాతిపదికచేసి చెప్పలేదు. శారీరకంగాను మానసికంగాను మనషులంతా ప్రాయికంగా సమానంగా ప్రకృతి చూపుతున్నట్లు పేర్కొన్నాడు. మత జ్ఞానాన్నుంచి వేరుగా రాజకీయ తత్త్వాన్ని సృష్టించే ప్రయత్నంలో న్యాయశాస్త్రానికి పౌరుల ప్రభుత్వానికి సామాజిక సంబంధాలకు ఆచరణాత్మకమైన ధోరణి అవలంభించడానికి దోహదంచేసింది. ఈ వైఖరి 19వ శతాబ్దంలో తాత్త్విక రాడికల్స్‌కు చెందిన ప్రయోజనవాదంలో వచ్చి కలిసింది. అప్పటికప్పుడు పబ్బంగడుపుకునే ఈ విధానం ఏ సమస్యనూ పరిష్కరించలేదు. కప్పదాట్లను వేసే ఆంగ్లేయ సంప్రదాయాలు ఆచారాలుగా మార్చడంలోనే ఇది ఉపకరించింది. కాలానుగుణంగా ఈ కలగాపులగానికే రాజ్యాంగబద్ధమైన అర్హత చేకూర్చారు. మత జ్ఞానంనుంచి విమోచన పొందిన బ్రిటిష్ రాజకీయాలోచన తర్కబద్ధంగా ఉండజాలదని నమ్మారు.

రాజకీయాలలో వివేచనావాదాన్ని హాబ్స్ ప్రవేశపెట్టాడు. అతడి తత్త్వంలో రాజీలేని మతరాహిత్యత ఉన్నందున, రాజకీయ చింతనలో ఈ విశేషానికి ఆస్కారమేర్పడింది. అందువలననే రాజకీయ తత్త్వంకూడా సాధ్యం అయింది. మానవుడిలోనే అంతర్లీనంగా వివేచన ఉన్నదని అతడు భావించాడు. (మానసిక శక్తులవలె సరైన వివేచనకూడా మానవ స్వభావంలోభాగమే. సరైనవివేచన స్పష్టమయిన నియమం వంటిది. (DE CIVE). హాబ్స్ తన తర్కవిధానంతో రాజకీయతత్త్వాన్ని రాబట్టాడు. మానవ స్వభావంలో వివేచన, కోరిక ఉన్నవి. కోరికవలన ఆలోచనకు పూనుకోవడం సంభవిస్తుంది. వివేచన క్రమబద్ధంచేసే శక్తిగా ఉంటుంది. ప్రకృతి నియమం "సరైన వివేచనను" అనుసరించి ఉంటుంది. జీవితంలో ఏ పనులు చేయాలి, వేటిని చేయకూడదు, అనే విషయాలను గురించి వివేచన స్పష్టంగా తెలుసుకుంటుంది. (సరైన వివేచన అంటే దోషంచేయని శక్తి అని అర్థంకాదు. హేతుబద్ధమయిన కళగా ప్రతి మానవుడికి సంబంధించిన ఈ శక్తి తనకు తోటివారికి ఎంతవరకు సహకరిస్తుంది, హానిచేస్తుంది అనే విచక్షణ కలిగి ఉండటమే.) మతరహితమయిన మనస్తత్వంకూడా సాధ్యమని హాబ్స్ రాజకీయ తత్త్వం

సూచిస్తున్నది. వివేచన, ప్రేరణ (కోరిక) పరస్పర విరుద్ధాలు కావు. ఇవి రెండూ జీవశక్తులు. వీటికి మూలం అలౌకికం కాదు. ఇవి మార్మికంగా మరుగునపడలేదు. ఈ రెండు పిపాసల సహకారం వలన మానవుడి సృజనశక్తి ఉంటుంది. మతరహిత వివేచనావాదం, వైజ్ఞానిక (వూహకు వ్యతిరేకంగా) మనస్తత్వం రాబట్టిన అనంతరం, రాజకీయ తత్త్వానికి అవి రెండూ మూల స్తంభాలుగా నిలుస్తాయి.

గ్రోషన్, ప్రాచీన సిద్ధాంతమయిన ప్రకృతి నియమాన్ని మతజ్ఞానంనుంచి విమోచనచేసి, ఆవిధంగా వివేచనావాదాన్ని ప్రస్తుతించాడు. దైవభావంతో నిమిత్తం లేకుండా ప్రకృతిని యాంత్రికంగా వ్యాఖ్యానం చేయవచ్చునని సూచించేటంతవరకూ పోయాడు. అయినప్పటికీ అతడి వివేచనావాదంలో చాలావరకు, సృష్టికి ప్రయోజనం ఉన్నదనే అతిభౌతికత మిగిలిపోయింది. 17వ శతాబ్దంవరకు ప్రకృతి తత్త్వంలో ఇదొక విలక్షణంగానే ఉంది. మతజ్ఞాన సంప్రదాయానికి తిలోదకాలు ఇచ్చినప్పటికి ఉన్నత నియమం ఇంకా సృష్టి ప్రయోజనాభావంతోనే ఉన్నది. దీనిని హాబ్స్ పూర్తిగా విప్లవాత్మకం చేసాడు. ప్రకృతిలో మార్చడానికి వీల్లేని నియమాలంటూ ఏమీలేవు. మానవుడితోసహా ప్రకృతి విధానం అంతా కార్యకారణ సంబంధాలతో ఉన్నదే. ఈ సంబంధాలు తెలిసిన మానవుడు ప్రకృతి నియమాలను కనుగొంటాడు. "సరైన వివేచన" వలన ప్రకృతి నియమం వస్తుంది. (DE CIVE) "ప్రకృతి నియమం ఒక ఉదాహరణ, లేదా సాధారణ సూత్రం దీనిని వివేచన కనుగొంటుంది" LEVIATHAN 300సం॥ క్రితం హాబ్స్ వూహించిన ఆత్మాశ్రయ వివేచనా దృక్పథానికి చెందిన ప్రకృతి నియమం 20వ శతాబ్దంలోని విజ్ఞానం చెబుతున్న దానికి సరిపోతున్నది.

హాబ్స్ ఒక సమగ్ర విధానాన్ని ప్రభోదించాడు. అందులో మానవుడికీ ప్రకృతికీ గల వైవిధ్యం తొలగిపోయింది. మానవుడు ప్రకృతిలో ఒక భాగం. ప్రకృతి వివేచనల రీతి. మానవుడి భావ విమోచన పూర్తి అయింది. పునర్వికాసంలోని మానవతావాదం హాబ్స్ తత్త్వంలో వైజ్ఞానిక ప్రకృతి వాదంగా మారింది. ఇది ఉదార ఆలోచనకూ, ప్రజాస్వామ్య ఆచరణకూ బాటలు వేసింది.

ఒకవైపున హాబ్స్ తత్త్వంలోని సహజ మానవతా వాదంలోనుంచి, తార్కికంగా వ్యక్తిత్వ సూత్రాన్ని రాబట్టారు. మరొకవైపున అతడి వివేచనాత్మక సిద్ధాంతంనుంచి సమాజానికి మూలం ఏమిటో తెలుసుకున్నారు. సమాజానికి సంబంధించిన మిగిలిన సిద్ధాంతాలన్నీ ప్రకృతి నియమంలో మతజ్ఞానానికి చెందినవి లేదా సృష్టి ప్రయోజనవాదానికి చెందినవి. ఆపద్ధర్మంగా కొన్ని సూత్రాలను అడ్డం పెట్టుకున్నారు. ఇందులో ఒకటి వ్యక్తివాదం ఆధారంగా మానవతా తత్త్వానికి అవకాశం లేదంటూంది. మరొకటి ప్రజాస్వామ్యాన్ని పుట్టుకలోనే చంపివేసింది. జీవిని కాపాడుకోవడమనే

మవులికమయిన తృష్ణ వ్యక్తులను మనుగడ పోరాటంలో కలిసేటట్లు చేసింది. వివేచనకూడా జీవసంబంధమయినది. సమాజం సాగడానికి ఇది కొన్ని నియమాలను సూచిస్తుంది. వ్యక్తుల సంబంధాలను క్రమబద్ధం చేసే ప్రయత్నానికి సహకరిస్తుంది. సమాజం తలెత్తితే వ్యక్తి హరించి పోవాలని అర్థం కాదు. సమాజాన్ని వ్యక్తులు సృష్టించుకున్నారు. వ్యక్తుల ప్రయోజనాలు సమర్థవంతంగా కాపాడుకోవడానికి తోడ్పడే నిమిత్తమే సమాజ సృష్టి జరిగింది.

ఏ రాజకీయ తత్త్వానికి అయినా మానవ స్వభావాన్ని గురించి నిర్దిష్ట అభిప్రాయం ఉండాలి. మానవస్వభావం స్వార్థపూరితమైనదని ప్రారంభిస్తే అంటే ఆత్మరక్షణ జీవపిపాస అనీ స్వార్థంనుంచి వివేచన జనిస్తుందని అంగీకరిస్తే హాబ్స్ తన రాజకీయ తత్త్వంలో వ్యక్తుల వికాసానికి తోడ్పడేదే సాంఘిక వ్యవస్థ అని చెప్పాడు. వివేచనాత్మక వ్యక్తివాదంలో హాబ్స్ తన రాజకీయతత్త్వంలో బహిర్గతం కాకపోయినా తార్కికంగా ప్రజాస్వామ్యానికి సిద్ధాంతపరమయిన గట్టి ప్రాతిపదికలు నిర్మించాడు.

"హాబ్స్ సంపూర్ణంగా ప్రయోజనవాది, వ్యక్తివాది, రాజ్యాధికారం శాసనాధికారం సమర్థనీయం అన్నాడు. ఎందుకంటే అవి రెండూ వ్యక్తుల భద్రతకు తోడ్పడతాయి గనుక. పెత్తనానికి లొంగిఉండటం గౌరవంచూపడం అంటే వ్యక్తికి ఎక్కువ అవకాశాలు లభిస్తాయనే దృష్టితోనే తప్ప అందుకు భిన్నంగామాత్రం కాదు. సమాజ కృత్రిమ నిర్మాణం మానవులు వ్యక్తులుగా వస్తువులను, సేవలను మార్పిడీ చేసుకోవడానికి సహకరించే సమష్టి విధానమే సమాజం. స్పష్టమయిన ఈ వ్యక్తి వాదమే నాడు హాబ్స్ తత్త్వాన్ని చాలా విప్లవాత్మకం గావించింది" (G. H. SAVILE, HISTORY OF POLITICAL THEORY).

ఒకవేళ హాబ్స్ సంపూర్ణ అధికారానికి అవకాశం ఇస్తున్నాడనే అంగీకరించినా, అతడి తత్త్వంలోని వివేచనావాదం, ఉదారవాదానికి ప్రజాస్వామ్యానికి మాత్రమే తోడ్పడగలదు (రాజు నిరంకుశత్వాన్ని సమర్థించడానికి వివేచనను అడ్డంపెట్టుకోవడం ప్రమాదకరం. రాజుకు ప్రజలకు మధ్య ఉన్న వివాదాన్ని నైరూప్య భావనలతో తర్కబద్ధంగా చూపడం అన్నమాట. అలా చేయడం అంటే, న్యాయసంఘాధికారాన్ని గుర్తించడమే. ఆ నిర్ణయం వ్యతిరేకంకూడా కావచ్చు – కేంబ్రిడ్జ్ మోడ్రన్ హిస్టరీ వాల్యూం, 8). భావాలు వాటంతటవే వాటి స్వంతతర్కంవలన విప్పారుతాయనడానికి హాబ్స్ తత్త్వమే ప్రమాణమయిన సోదాహరణ. భావాలకు సాంఘిక సంఘటనలకు కార్యకారణ సంబంధంలేదు. 12వ శతాబ్దపు పునర్వికాసంనుంచి హాబ్స్ వరకు ఐరోపా ఆలోచనారంగం అభివృద్ధి, వివేచనావాదం, సహజవాదం, సెక్యులిరిజంవైపు నిరంతరంగా ప్రవహించింది. ఆ విధానాన్ని కొనసాగించడమే ఉదారవాదం.

హోబ్స్ తత్త్వంలో ఇమిడి ఉన్న అభ్యుదయ ధోరణులను స్పష్టపరచడం ద్వారా లాక్, ఉదారవాద సూత్రాన్ని రూపొందించాడు. కేవలం తాత్త్విక ప్రశ్నలు, అంటే వైజ్ఞానిక సహజవాదం విషయమై హోబ్స్‌తో లాక్ అంగీకరించలేదు. అతడు ఈ విషయంలో హూకర్‌కు చేరువగా ఉన్నాడు. సంస్కరణల వాద సంప్రదాయంనుంచి ఉదారవాదం వేరుచేయడం మాత్రం హోబ్స్ అడుగుజాడలలోనే లాక్ నడిచాడు. పౌరుల అధికారానికి మూలం ఏమిటి? అనే వివాదాల విషయమై మతగ్రంథాలు ఉదహరించే పద్ధతిని లాక్ నిరసించాడు. ఏ ప్రమాణాన్ని ఆధారంగా తీసుకోవడాన్ని ఇతడు అంగీకరించలేదు. "ఇతరుల దృష్టితో మనుషులు ఎవరి ప్రెస్‌బిటేరియలిజంలోని అసహనాన్ని, స్వతంత్రవాదుల మూర్ఖత్వాన్ని చూసి ఇతడు జుగుప్సచెందాడు. ఆక్స్‌ఫర్డ్‌లో వీరే ఆధిపత్యం వహించేవారు. యువకుడైన లాక్ ప్యూరిటన్ ప్రమాణాలలో ఉత్సాహాన్ని కోల్పోయాడు. తరువాత ఆంగ్లికన్ చర్చికి సంబంధించిన ఉదార దివ్యత్వ ప్రభావం క్రిందకు వచ్చాడు. హూకర్‌తో అతనికి గల సంబంధాన్నిబట్టి, అధికారంలో నైతికపరిమితులు ఉండాలనడాన్ని బట్టి, మధ్యయుగాలలోని రాజకీయాలోచనాపరులూ, థామస్ ఎక్వినాస్ సంప్రదాయం ఇతడిపై ప్రభావం చూపెట్టాయని తెలుసుకోవచ్చు. అయినప్పటికి, లాక్ వ్రాసిన ఎస్సేకన్సర్నింగ్ హ్యూమన్ అండర్‌స్టాండింగ్ అనే గ్రంథం హోబ్స్ యాంత్రిక మనోవిజ్ఞానంతో తార్కికంగా సంబంధం ఉన్నట్లు చూపవచ్చు. హోబ్స్ విధానంనుంచి లాక్ కావాలని దేనినీ రాబట్టలేదు. లాక్‌తత్త్వం 18వ శతాబ్దంలో ఫ్రెంచితత్త్వాన్ని ప్రేరేపించింది. ఇందులో మాంటేల్‌కు చెందిన ఎపిక్యూరిన్ సంప్రదాయం, డేకార్ట్‌కుచెందిన ఆత్మాశ్రయవివేచనావాదం, బాల్ చేసిన సునిశితవిమర్శ ఇమిడి ఉన్నది. సంశయవాదం ప్రమాణాన్ని తగ్గించి చూపుతుంది. అలౌకిక శక్తిలో మానవుడి విశ్వాసం సడలింది. హోబ్స్ తత్త్వంలోని వైజ్ఞానిక సహజవాదం లాక్ ఇంద్రియజ్ఞాన మనస్తత్వం మానవుడికి నూతన విశ్వాసాన్ని చేకూర్చింది. ఉదారవాదానికి సారాంశం అది.

సరైన వివేచన వలన మానవుడి సహజ హక్కులను కనుగొనవచ్చు. ఆ హక్కులను కాపాడటం చట్టం యొక్క ధర్మం, పరిపాలనయొక్క ప్రయోజనం. ఇచ్ఛికంగా చట్టానికి లోబడటమంటే సహజహక్కులను సమర్పించడమన్నమాట. అందరి సౌకర్యార్థం వివేచనను కనుగొన్న సూత్రాలివి. అవసరమైతే పౌరహక్కుల రక్షణార్థం తిరుగుబాటు చేసైనాసరే సార్వభౌమాధికారంపై పోరాడటం సమాజంలో తప్పుకాదు. సహజ హక్కులను సమర్పిస్తున్నప్పుడు ప్రభుత్వం దోషాలు చేస్తుంది కనుక, దాని అధికారాలను పరిమితం చేయాలి. ఉదారవాద రాజకీయ సూత్రాలివి. మానవుడి వివేచనే అత్యున్నతమయిన నియమం అనే తాత్త్విక ప్రతిపాదన ఈ సూత్రాలకు ఆధారం.

వివేచనను వ్యతిరేకించే చట్టం ఏదీ మానవుడిని కట్టుబాట్లలో ఉంచదు.

ఉదారవాదం వివేచనతోపాటే నిలవాలి లేదా పోవాలి. వివేచనకు విజ్ఞప్తి చేయడం చాలా పాతకథ. వివేచనను మానవుడికి వెలుపల లేక మానవుడి అవగాహనకు అందనిదిగాను అట్టిపెట్టారు. విజ్ఞప్తి చేసుకోవలసిన న్యాయస్థానం మార్మికమయిన ముసుగులో ఉండటంవలన, మానవుడిస్థితి మెరుగుపడలేదు. వివేచన మానవుడి శక్తి, జీవ విధానం. మానవుడి వివేచనకు ప్రతీకగా రూపొందడానికి ముందు ఈ విషయాన్ని గ్రహించాలి. దీనికి విజ్ఞానం అవసరం. 17వ శతాబ్దంలోని విజ్ఞానం చాలినంతగా లేదు. అయినప్పటికి మౌలికమయిన ప్రతిపాదన ఆధారంగా తార్కికంగా రాబట్టడం సాధ్యమే. ఆధునిక ఉదారవాదానికి ప్రాతిపదికలువేసే నిమిత్తం హాబ్స్ ఈ పని చేసాడు.

✦ ✦ ✦

# ఉదారవాదంలో దోషాలు

నెపోలియన్ ఇంగ్లీషు సముద్రాన్ని దాటలేక పోయాడుగాని, ఫ్రెంచి విప్లవ ప్రభావం మాత్రం, థామస్ పెయిన్, విలియం గాడ్విన్ ప్రభృతుల వినూత్న సిద్ధాంతాల బోధనల రూపంలో బ్రిటన్‌పై ప్రభావాన్ని చూపెట్టింది. వీటివలన ఎడ్మండ్ బర్క్ ప్రేరేపితుడై విరుచుకపడ్డాడు. 18వ శతాబ్దానికి, వివేచనాయుగానికి వ్యతిరేకంగా "రిఫ్లెక్షన్స్ అండ్ ఫ్రెంచి రివల్యూషన్" అనే గ్రంథం వ్రాసాడు. రాజకీయాలలో వివేచన సరైన ప్రాతిపదిక ఎన్నడూ కాలేదని బర్క్ నొక్కి వక్కాణించాడు. ఫ్రెంచి విప్లవాన్ని ఖండించడానికి రూసోనుండే వాదనలు స్వీకరించాడు. వివేచనకు వ్యతిరేకంగా సమాజానికి విధేయతగా ఉండటం, మత పవిత్ర భావాలు మార్మికమైన నైతిక ధోరణి ఉండాలని రూసో చాటిచెప్పాడు. ఈ ఉన్నత భావనలన్నింటినీ "గాఢమయిన వివేచనగా" మేళవించవచ్చునని, "కేవలం తార్కిక స్పష్టత" కంటే రాజకీయాలలోను జీవితంలోను ఆదర్శ సూత్రంగా భావించాలని బర్క్ చెప్పాడు. రూసో ఉద్వేగవాదాన్ని కాంట్ హేతుబద్ధం చేసాడు. దీనిని హెగెల్ రాజకీయతత్త్వంగా ఇంకా మలచాల్సి ఉంది. ఇందులో రాజ్యానికి సంబంధించిన అతి భౌతిక భావనకూడా ఇందులోనే ఉంటుంది. చట్టానికి ఆధారంగా "జాతి అంతర్గత భావనను హెగెల్ కంటే ముందే బర్క్ ఊహించాడు. రూసోపట్ల విశ్వాసంలేని శిష్యుడుగా బర్క్ హ్యూం సూచించిన నిర్దిష్టమైన వివేచనా వ్యతిరేక తర్కానికి హెగెల్ పేర్కొన్న సర్వబుద్ధి వాదానికి బర్క్ వారధి నిర్మించాడు. వివేచన వ్యక్తి సొత్తుకాదు. మానవ ప్రవర్తన. ఉద్రేకాలు సంవేదనలవలన సంప్రదాయానికి గౌరవం చూపడంవలన సమాజానికి విధేయతగా ఉండటంవలన, నిర్ధారితమవుతుంది. ఇవన్నీ వివేచనాత్మకం కాదు. జాతిలో లేక దేశంలో అంతర్లీనంగా ఉన్న చిత్తవృత్తి క్రమంగా వివేచనా రూపేణా బహిర్గతమవుతున్నది. కానీ అదే సమయంలో, బర్క్, సమాజం సహజమయింది కాదని పేర్కొన్నాడు. అది కృత్రిమసృష్టి అన్నాడు. వివరించాలని ప్రేరణలవలన సమాజం ముందుకు సాగిందన్నాడు. తన వివేచనారహిత వాదం, వ్యక్తివాదాన్ని నిరాకరించడం, మార్మికమయిన జాతీయవాదం అన్ని లాక్ తత్త్వాన్నుంచి రాబట్టినట్లు ఇతడు పేర్కొన్నాడు. అతడు చెప్పినదానిలో చాలావరకు సత్యం లేకపోలేదు. లాక్ ఉదారవాదంలోని విరుద్ధత్వాలను, బర్క్ స్పష్టంగా బైటపెట్టాడు. హూకర్‌ద్వారా వచ్చిన మధ్యయుగాల సంప్రదాయం, హాబ్స్ పేర్కొన్న

వైజ్ఞానిక వివేచనావాదం మధ్య ఈ విరుద్ధత్వాలున్నవి. టోరీలకు ఒక తత్త్వాన్నిచ్చిన బర్క్, రాజకీయ ప్రాపంచికానుభవ వాదాన్ని రాజకీయ వ్యావహారిక వాదాన్ని కావాలన్నాడు. 9వ శతాబ్దపు ఉదారవాదంలో ప్రయోజనసూత్రం ప్రథమ విశ్వాస సూత్రమయింది.

విగ్ పార్టీకి ఆలోచన అందించినవాడు బర్క్. ఇతడు పార్టీమారడంతో మితవాద ఉదారులు చాలా సంక్షోభంలో మునిగిపోయారు. విగ్గులలో సంపన్న వర్గాలవారు చాలామంది బర్క్‌తోపాటు టోరీలలో చేరిపోయారు. ఫ్రెంచి విప్లవాన్ని సమర్థించిన రాడికల్ వాదం సంప్రదాయ ఉదారవాద హద్దులను దాటిపోయే సూచనలు కనిపించాయి. వివేచనారహిత ఆచారాన్ని చాలా దివ్యమయిన వివేకంగా బర్క్ ప్రభోదించాడు. ఫలితంగా మతపునరుద్ధరణకు ఒత్తిడి వచ్చింది. ఈ విషయంలో లాక్ ప్రమాణాన్ని కూడా అతడు చూపాడు. ఫ్రెంచి విప్లవసూత్రాలపై ఇతడు చేసినదాడి ప్రజాస్వామ్యభావాన్ని కించపరచడంవలన రాజకీయ సాహిత్యం వెలువడి, ఉదారవాదం పునరుజ్జీవం పొందడానికి సహకరించింది. జెరెమి బెంథామ్ ఫ్రెంచి విప్లవ సూత్రాలను సమర్థించిన రాడికల్ ఇతడు హాబ్స్‌ను అనుసరించి సహజ వివేచనావాదాన్ని తిరిగి ప్రవచించి తాత్త్వికమయిన రాడికలిజంగా పేర్కొన్నాడు.

గాడ్విన్ భార్య, షెల్లీకి తల్లి, ఉపాధ్యాయిని, అయిన మేరీ ఓల్‌స్టోన్‌క్రాఫ్ట్ ఉద్యమాన్ని ఆరంభించింది. వివేచన కావాలంటూ, ఆమె ఇలా విజ్ఞప్తి చేసింది. “వివేచనకు వ్యతిరేకతను కనబరుస్తున్నారు. వాదన లేదా తొలి సూత్రం అనేదేమయినా మీరు ఖండించేవాటిలో ఉంటే, ఫలితమేమిటో చూడండి. ప్రాచీనకాలంలో తుప్పుపట్టిపోయిన వాటినన్నింటినీ మనం పవిత్రంగా చూడాలన్నమాట. అజ్ఞానంవలన స్వార్థంవలన అట్టిపెట్టిన అనహజమయిన ఆచారాలను అనుభవంలో కొనసాగించాలన్నారు” (Mary WOLL STONE CRAFT, Vidication of the rights of the Man) 18వ శతాబ్దపు భావాలకు, ఆదర్శాలకు వ్యతిరేకంగా బర్క్ సాగించినదాడిని, 38 సమాధానాలతో చాలా శక్తివంతంగా ఆలోచనాపూరితంగా, మొట్టమొదట ఈమె ఎదుర్కొన్నది. ఓల్‌స్టోన్‌క్రాఫ్ట్ పేర్కొన్న మానవహక్కులలో, ఉదారవాదంలోని విప్లవ సూత్రాలను పునరుద్ఘాటించడం గమనించవచ్చు. 18వ శతాబ్దంలో, ఫ్రెంచి సాంప్రదాయ శైలిలో ఇది జరిగింది. ఇందువలన రూసో నైతిక ధోరణి, ఓల్తేర్ ఘూటైన వ్యంగ్య విమర్శలను సమన్వయీకరించడంలో, ఫలప్రదమయిన రీతిని చూడవచ్చు. పెత్తందారీ విధానంపై తీవ్రంగా దెబ్బతీస్తూ, మతానికి వ్యతిరేకంగా తిరుగుబాటు చేయడం స్పష్టంగా కనిపిస్తుంది. 20వ శతాబ్దపు జీవశాస్త్ర పరిశోధనలను వూహించిన మేరీ ఓల్‌స్టోన్‌క్రాఫ్ట్ నిర్దాక్షిణ్యంగా బర్క్ వాదనలను విశ్లేషించి, అవి

ఎంత అర్ధరహితమైనవో బైటపెట్టింది. "హృదయానికి సంబంధించిన నైతిక ప్రవర్తనావళి అనడంలో నీ ఉద్దేశం ఏమిటి? అలాగే అంతర్గతంగా జనించిన భావవృత్తులంటే ఏమిటి? సదుద్దేశాలను ప్రేరణలుగా చిత్రీకరించిన ఈ నైతిక ప్రయోజనాన్ని సాధించవచ్చు. ప్రేరణ అనేది సూటిగా పయనిస్తూ ప్రయోజనాలక్ష్యానికి చేరుకుంటుందన్నారు. దానికి ఆధారంగాని, మార్గదర్శకత్వంగాని, అవసరంలేదన్నారు. అనుభవంవలననే ధర్మాన్ని అనుకరిస్తే ఉదాహరణలనుసరించి బోధనలుజరిగితే, చిత్త వృత్తులన్నింటికీ వివేచన మార్గదర్శకంగా ఉండాలి. వివేచనే చుక్కానిపెట్టాలి. లేకుంటే పడవగాలికి కొట్టుకుపోయే ప్రమాదముంది." (Mary, పైన ఉదహరించిన గ్రంథంలో).

వెనువెంటనే పెయిన్, ఓల్‌క్రాఫ్ట్, గాడ్విన్ వచ్చారు. రాడికల్ ఉద్యమానికి పెయిన్ జీవంవంటివాడు. ఫ్రెంచి విప్లవధోరణి అంతా అతడు నూరిపోసాడు. "మొదలంటా గొడ్డలిపెట్టు పెట్టి ప్రభుత్వాలకు మానవాళి అంటే ఏమిటో నేర్పాలి." (థామస్ పెయిన్, రైట్స్ ఆఫ్ మాన్). రూసో చెప్పిన మార్మిక ఉద్వేగవాదాన్ని పెయిన్ బోధించలేదు. ఇతడి ప్రజాస్వామ్యం నియంతృత్వం కాదు, మానవ వాదంతో కూడినది. విజ్ఞాన సర్వస్వకర్తలు సూచించిన మతరహిత ధోరణి పెయిన్‌లో స్పష్టంగా చూడవచ్చు. "మరణానంతరం కూడా పరిపాలించాలనుకోవడం నిరంకుశత్వాలలో అతి హీనమయిన ధోరణి." (పెయిన్ గ్రంథంలో.)

ఓల్‌స్టోన్ క్రాఫ్ట్, పెయిన్ గ్రంథాలలో రాడికలిజం ఎలుగెత్తి చాటగా, జేమ్స్ మకిన్‌టోష్ చాలా హుందాగా ఇదే విషయాలను ప్రవచించాడు. "ప్రాచీనకాలపు సూత్రాలనుంచి" రాబట్టిన బర్క్‌ను ఇతడు ఖండించాడు. "మితవాదాన్ని సమర్థించడం కూడా ఖండించాడు." "వివేచనకు న్యాయానికి ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వాలని సంప్రదాయానికి ఆచారానికి ప్రాధాన్యత ఇవ్వరాదని ఇతడన్నాడు." (James Mackintosh, VEWOICIAE GALLIEU) 1688లో విగ్గులకు, రాకీ సూత్రాలకు సంపూర్ణంగా అన్వయం జరిగినట్లు మకిన్‌టోష్ ఫ్రెంచి విప్లవాన్ని చూసి భావించాడు. అంతకుముందు శతాబ్దంలో ఐరోపాలోని తత్త్వవేత్తలు కృషిచేసిన సూత్రాలను విప్లవకారులు అన్వయిస్తున్నట్లు ఇతడు వాదించాడు. వీరి సిద్ధాంతాలకు రాజకీయాలకు ఉన్న సంబంధం రేఖాగణితానికి-యాంత్రిక సూత్రాలకు సంబంధాన్ని పోలి ఉన్నది. మానవ హక్కులే నైతిక మూలసూత్రాలు.

రాడికలిజానికి విలియం గాడ్విన్ తత్త్వవేత్త. 18వ శతాబ్దంలో విజ్ఞాన సర్వస్వాలతోబాటు అంతకుముందున్న మాబ్లే, మోరెల్లెవంటి నైతికవాదులు ఇతడి భావాలకు ప్రోదిచేసాడు. కనుక గాడ్విన్ భావాలు ఉదారవాద హద్దులను అధిగమించిపోయినవి. ఉదార ప్రజాస్వామిక రాజ్యాన్ని మించిపోయి, కమ్యూనిస్టు

సహజ వ్యవస్థవైపు అతడి దృష్టి ప్రసరించింది. ఉదారవాదాన్ని విస్తృతపరచిన గాడ్విన్ తత్త్వం, సోషలిజానికి దారి చూపింది. బూర్జువా ఆదర్శాలు విప్లవతత్త్వంగా పరిణమించి తార్కికంగా కార్మికుడికి సన్నిహితం అయ్యాయి. అయితే ఈ రెండు స్వభావాలు సరైనవికాదని రుజువైంది. సంఘంలో దోషాలన్నింటికీ మూలం వ్యక్తిపరమయిన ఆస్తి అని గాడ్విన్ అన్నాడు. ప్రజాభిప్రాయాన్ని మార్చడంవలన కావాలనుకునే సాంఘిక విప్లవాన్ని తీసుకరావచ్చని నమ్మాడు. మానవ స్వభావంలో అంతర్గతంగా ఉన్న వివేచనాధారంగా ఇతడు మానసిక, నైతిక విప్లవం వూహించాడేగాని రాజకీయ సాంఘిక వ్యవస్థను హింసాయుతంగా మార్చాలని కోరలేదు. ఇతడు ఆదర్శప్రాయమైన విప్లవవాది. కనీసం ఊహలోనయినా ఉద్వేగవాదాన్ని, వివేచనను ఒకదారికి తీసుకురావచ్చుననుకున్నాడు.

ఆధునిక వైజ్ఞానిక పరిశోధనల ప్రారంభ దశలలో ముఖ్యంగా గణితం, ఖగోళశాస్త్రం, పదార్థవిజ్ఞానం చాలా సన్నిహితంగా తత్త్వంతో కలిసి ఉండేవి. పదార్థవిజ్ఞానాన్ని న్యూటన్ సహజతత్త్వం అన్నాడు. ఓల్తేర్ వ్యాఖ్యానించినట్లు ఇది 18వ శతాబ్దంలో యాంత్రిక సహజవాదంగా పెంపొందింది. విప్లవానంత ఉదార ఆలోచన, మతరహిత విధులనుంచివేరై, జగత్తే దైవమనే ప్రకృతి మతానికి చేరువగా పోయింది. ఇంగ్లండ్‌లో సనాతన హై చర్చినీ, మత ప్రక్షాళనవాదుల అసహనాన్నీ, అసమ్మతివాదులు వ్యతిరేకించారు. జగత్తే దైవం అనే విశ్వశాస్త్రంతో ముడిపడిన వివేచన, అతిభౌతికమయినది. 19వ శతాబ్దపు ఉదార వివేచనావాదం, జగత్తే నైతికక్రమాన్ని నమ్మింది. 17వ శతాబ్దపు తత్త్వంలోని వివేచననుంచి దీనికి చాలా దూరం ఉన్నది. అంతేగాక వైజ్ఞానిక సహజవాద సంప్రదాయంనుంచి కూడా తెగత్రెంపులు చేసుకుంది. సృష్టికి ప్రయోజనమున్నదనే స్థాయిగల వివేచనా వాదనలోకి వెళ్ళిపోయారు. ఈ వాదాన్ని ప్రొటస్టంట్ క్రైస్తవ న్యాయనిర్ణేతలు స్వీకరించారు. లూథర్, కాల్విన్ వాదనల ననుసరించి జాతీయ రాజ్యాల చట్టాలకు అతి భౌతిక ప్రమాణాలను సమకూర్చడంలో ఇవి తోడ్పడినవి. 19వ శతాబ్దంలో కూడా ప్రయోజనా ఉదారవాదం మతపరమయిన ఎవాంచలికల్ ఉద్యమంతో పొత్తు కలిసింది. స్టీఫెన్, "ఉదారవాద సిద్ధాంతం" అనే వ్యాసంలో - టైమ్స్‌లిటరరే సప్లిమెంట్ (1948, నవంబర్ 27) ఇలా వ్రాసింది. ప్రయోజనావాదులు - ఎవాంజలికల్స్ మధ్య సన్నిహిత సంబంధం వలన, 19వ శతాబ్దపు పూర్వార్థంలో ఇంగ్లీషు చరిత్రను వివరించవచ్చు. ఇది తలవనితలంపుగా జరిగింది కాదు. 18వ శతాబ్దపు మితవాదానికి అభ్యంతరకరంగా, ఆకృతి విధానాలకు అతి గౌరవాన్నిస్తూ, ఈ రెండు ఉద్యమాలూ తలెత్తాయి. బెంథాం న్యాయవాదులను పిలిచి వాదించడానికి తోడ్పడమనగా, వెస్లీ - ఆంగ్లికన్‌లను బ్రెజిల్ ప్రమాణంగా చూడమన్నాడు.

"విక్టోరియా శకంలో తాత్త్విక వివాదానికి ప్రధాన సమస్య ఏమంటే, క్రైస్తవమతాన్ని మారుతున్న సమాజంలో సాంకేతికంగా, నిర్మాణ రంగంలో, సంపదలో, జరుగుతున్న పరిణామాలదృష్ట్యా, ఎలా సరిపుచ్చడమో అని మాత్రమే" (ఎలన్ విలార్డ్ బ్రౌన్, ది మెటఫిజికల్ సొసైటీ). ఆదిలో మానవుడు పాపం చేసాడనే క్రైస్తవ పిడివాదం ఈ ఆలోచనలో కొనసాగింది. అతి భౌతిక నైతిక విధానం వివేచనాత్మకమయినది. ఎందుకంటే మానవుడి సహజధోరణులకు వివేచనహద్దులను విధిస్తుంది. మానవుడిలో వివేచనగాని నీతిగాని అంతర్గతంగా లేవు. మానవుడు చేయవలసిన విధుల ఫలితంగా ఇవి జనిస్తాయి. కనుక అంతరాత్మభావన ఈ విధానంలో కేంద్రస్థానం ఆక్రమించుకున్నది. ఇది, వివేచన వలన వచ్చిందంటారు.

పౌరలౌకిక, సృష్టి ప్రయోజనావాదాల దృష్ట్యా, వ్యక్తిస్వేచ్ఛకు సంబంధించిన ఉదార సిద్ధాంతం కుంచించుకపోతుంది. ఆచరణలో అపభ్రష్టమవుతుంది. విప్లవానంతరం వివేచనపై జరిగిన తిరుగుబాటు స్వేచ్ఛా సంకల్పానికి పరిమితులు విధించింది. వ్యక్తి స్వేచ్ఛా భావన అంటే బాధ్యతా రాహిత్యత అనేటంత వరకూ పోయారు. స్వేచ్ఛాధర్మం నీతిని నిరాకరించడం గమనించవచ్చు. మితిమీరిన ఉద్వేగవాదానికి ప్రతిచర్యగా, 19వ శతాబ్దపు ఉదారవాదం, మానవ స్వేచ్ఛను ప్రకృతిలోని నైతిక క్రమాన్ని పొందుపరచాలని ప్రయత్నించింది. వివేచనను కనుగొన్నారో ఆ మనుషులతో సంబంధం లేని నియమాలు పరిపాలించడం వలన ఈ సమన్వయం సాధ్యమన్నారు. ఈ చట్టం నిష్పాక్షికమైనది, న్యాయమయినదీ. అటువంటి చట్టాలు వ్యక్తిస్వేచ్ఛను అదుపులో పెట్టలేవన్నారు. కాగా, మానవుడికి, జంతుజాలానికి, విచక్షణ చూపుతూ కొన్ని శాశ్వత సత్యాలను, విలువలను, ఆమోదించడమే ఇందలి విశేషమన్నారు. మానవుడికి ప్రత్యేకంగా ఉన్న అంతరాత్మవలన అతడుచట్టానికి విధేయుడుగా ఉంటాడు. కనుక ఉదార ప్రజాస్వామిక సాంఘికనిర్మాణం, స్వేచ్ఛగానూ, నైతికంగానూ ఉంటుంది. దీని నియమాలన్నీ ప్రకృతిలోని నైతిక క్రమానికి చెందిన న్యాయమయిన నియమాలనుంచి రాబట్టినవి.

స్వేచ్ఛ అంటే ఇష్టంవచ్చినట్లు ప్రవర్తించే ప్రమాదాన్ని ఈ నియమాలు నిరోధించాయి. ఉదారవాదం తన సాంఘికతత్త్వాన్ని రాజకీయసిద్ధాంతాన్ని ప్రభుత్వ కనీసజోక్యం అనుసరణీయం అనడంలో, తేల్చి చెప్పింది. 17వ శతాబ్దంలోని యాంత్రిక విశ్వవాదాన్ని, మతరహిత వివేచనావాదాన్ని ఆధారంగా ఫ్రెంచి ఫిజాక్రాట్లు ఉదారవాద సూత్రంలో కొన్ని ప్రధాన భాగాలను స్వీకరించారు.

న్యూటన్ భౌతిక తత్త్వంలో యాంత్రిక విశ్వవాదానికి తుదికారణంగా దేవుడిని తెచ్చిపెట్టారు. ఇదికూడా ఒక యంత్రం. ఈ యంత్రాన్ని ఒకసారి చలనంలో పెడితే

దానంతటదే నడుస్తుంది. బ్రిటిష్ భౌతిక శాస్త్రజ్ఞులు ఈ విశ్వవాదాన్ని ఇంకా అభివృద్ధిచేసారు. 19వ శతాబ్దంలో సమకాలీన ఉదార తత్త్వవేత్తలు, వైజ్ఞానిక సహజవాదం నుంచి దారిమళ్ళి, స్టాయిక్‌లు సిద్ధాంతీకరించిన అతిభౌతిక-నైతిక క్రమంలోకి, ప్రొటస్టంట్ మతజ్ఞానం వ్యాఖ్యానించిన రీతులలోకి వెళ్ళిపోయారు. ప్రకృతి యాంత్రికీకరణకు భిన్నంగా దేవుడులేడు. తుది కారణానికి సంబంధించిన మానవత్వారోపణ బదులుగా, జగత్తే దైవం అనే భావన వచ్చింది. ప్రకృతిలో క్రమత్వం నైతికం అన్నారు. ఎందుకంటే తుది సత్యాలకు శాశ్వత విలువలకు రూపం అయిన దేవుడు అంతర్లీనంగా ఇందులో ఉన్నాడు. మానవ ఉనికికి ప్రయోజనం ఏమంటే నైతిక క్రమానికి అనుగుణంగా నివసించేటందుకు వీలుగా, స్వేచ్ఛను పొందడమే. మానవ స్వభావంలో అంతర్గతంగా ఉన్న చెడు గుణాలను అదుపులో పెట్టడంవలన ఇది సాధ్యం అవుతుంది. అంటే అంతరాత్మ లేదా నైతిక భాధ్యతను గుర్తించడం అన్నమాట. 19వ శతాబ్దం ఉదారవాదం, యాంత్రిక సహజ విజ్ఞానంనుంచి సూత్రాలను రాబట్టడం మానేసింది. అప్పటికే అది, జగత్తే దైవం అనే సృష్టి ప్రయోజనవాద సిద్ధాంతాన్ని, ఉదారవాదం చేపట్టింది. నియమబద్ధమైన విశ్వం, మతరహితమైన వివేచనాక్రమం అనే భావాల స్థానే, హేతుబద్ధం గావించిన విశ్వాసంతో, దైవాన్ని నమ్మడం మొదలైంది. సాధ్యమయిన వాటన్నింటిలో ఇప్పుడున్న ప్రపంచం ఉత్తమమైనది. ఉన్నది ఉన్నట్లే ఉండాలి. ఎందుకంటే తద్భిన్నంగా ఉండజాలదు గనుక. కనిపించకుండానే, ముందే నిర్ధారణ అయిపోయిందనే పిడివాదం చోటుచేసుకున్నది. 19వ శతాబ్దంలో ఉదార వివేచనావాదం ఈ విధంగా వ్యక్తి స్వేచ్ఛను చట్టబద్ధమయిన కట్టుకథ గావించింది.

ఫిజాక్రాట్లు - క్విజ్‌నె సిద్ధాంతాలననుసరించి భూమి సంపదకు పన్నులకు ఆధారమని భావించి రాజకీయ ఆర్థిక శాస్త్రజ్ఞుల విధానం, పెట్టుబడిదారీ ఆర్థిక విధానాన్ని వీరు కోరతారు.

ఆచరణలో ఉదారవాద సిద్ధాంతం, తలెత్తుతున్న పెట్టుబడిదారీవాద ప్రయోజనానికి తోడ్పడింది. చట్టబద్ధమయిన పాలన అంటే అల్పసంఖ్యాకుల పాలన అయింది. ఉన్న పరిస్థితులలో వారు చట్టాలు చేసే అధికారంతో ఉంటారు. ఉదారవాదం, మానవుడిని మానవుడే దోపిడీచేస్తుంటే, దానికి నైతికంగా మద్దతునివ్వడం, తాత్త్వికంగా ప్రమాణాన్ని చేకూర్చడంజరిగింది. వీటిని ఆచరణలో పెడుతున్న ఆధునిక రాజకీయ సిద్ధాంతాలు, వ్యక్తిని రాజ్యానికి లొంగిఉండేటట్లు చేసాయి. రాజ్యాన్ని గురించి హెగెల్ చెప్పిన అతిభౌతిక సిద్ధాంతాన్ని, గ్రీన్, బొసాంకెలు ఉదారవాదాన్ని ప్రవేశపెట్టారు.

విప్లవానంతర రాజకీయ ప్రతిచర్య, పెట్టుబడిదారీ ఆర్థిక విధానం, 19వ

శతాబ్దంలో పెంపొందిన ఉదారవాదంపై ప్రభావాన్ని చూపెట్టాయి. వివేచనావాదం, వ్యక్తివాదంతో కూడిన తొలి సూత్రాలనుంచి దారి తప్పడానికి లాక్ తత్త్వంలో అంతర్లీనంగా తగిన అస్పష్టతలు, విరుద్ధత్వాలు ఉన్నవి.

హాబ్స్ చెప్పిన వివేచనా మనోవిజ్ఞానం ఆధారంగా, లాక్ మానవ అవగాహన సిద్ధాంతం ఉన్నది. కానీ లాక్ మత అసూయల నుంచి సంపూర్ణంగా స్వేచ్ఛను పొందలేదు. సమాజానికి మూలాన్ని రాజకీయ సూత్రాలకు ఆధారాన్ని, మానవ వివేచనలోనే హాబ్స్ గమనించాడు. లాక్, వీటినే ప్రకృతి నియమాల నుంచి రాబట్టినా, అవన్నీ దైవ నియమాలని భావించాడు.

లాక్ తత్త్వంలో దోషాలను తొలగించిన కాండిలా, ఫ్రాన్సులో 18వ శతాబ్దంలో వైజ్ఞానిక సహజవాదానికి, శక్తివంతమయిన ఆధారాన్ని కల్పించాడు. (డేకార్ట్ సూచించిన అంతర్గత భావాలను లాక్ నిరాకరించినప్పటికీ, ఆత్మ శక్తులను తృణీకరించేటంత వరకూ అతడు పోలేకపోయాడని కాండిలా చూపాడు). హాబ్స్ విప్లవతత్త్వం ఐరోపా సముదాయంగా మారినప్పటికీ, బ్రిటన్‌లో వేర్లు లోతుగాపోలేదు. అక్కడ ఆవిర్భవిస్తున్న బూర్జువావర్గంపై మతఅసూయలు, ప్రక్షాళనవాదం, ఆంగ్లికన్‌వాదంవచ్చి ప్రభావితం చేసాయి. ఒకవైపున ఇంగ్లండ్ ప్రపంచానికే పరిశోధనాలయంగా మారుతున్నా, ఇలా జరిగింది.

లాక్ జ్ఞానవాదంలో బలహీనతలను దృష్టిలో ఉంచుకొని, బర్కలి పదార్థవాదంపైనా, నాస్తికతపైనా దాడి చేసారు. లాక్‌లోని అస్పష్ట హేతువాదం, సహజ నియమాన్ని గురించి మతపరంగా ఆలోచించడంవలన, హ్యూం ప్రాపంచిక అనుభవవాదం నుంచి దూరమయ్యాడు. హ్యూం వాదం మానవ అవగాహనకు అవకాశాలను, మానవ జ్ఞానప్రమాణంతోగల విశ్వాసాన్ని చలింపజేసింది. 18వ శతాబ్దంలో అతి ప్రధానమయిన ఆంగ్లేయ తత్త్వవేత్తల ప్రభావం వలన, మానవత్వ వివేచనావాదశక్తి చల్లారిపోయింది. (సహజనియమ సిద్ధాంతాన్ని హ్యూం విమర్శించడం, వివేచనావాదంపై దెబ్బకొట్టడంతో, బర్క్ ఉత్తేజితుడై ఫ్రెంచి విప్లవ ప్రజాస్వామిక సూత్రాలపై విరుచుకపడ్డాడు. కాంట్‌ద్వారా ఈ భావాలే, హెగెల్ మిడిమిడి జ్ఞానంతో రూపొందించిన ఉద్వేగపు నవ్య మధ్యయుగాల వాదానికి సహకరించింది). అలౌకికవాదం, పారలౌకికవాదం రెండూ సహజ మతంగా పునరుద్ధరించబడ్డాయి. (హ్యూం ప్రత్యక్షవాదం విపులమైన అతి భౌతికతను మత తిరోగమనాన్ని కేవల నైతిక విలువలలో ధృఢ విశ్వాసాన్ని కలిగించడానికి తోడ్పడటం విశేషం. G. SABINE, A History of Political Theory) బ్రిటన్‌లో ఉదారవాదం, రాజకీయ వ్యవహారిక వాదంగాను, ఆర్థికంగా మానవులను పీల్చి పిప్పిచేసేదిగాను దిగజారిపోయింది. వ్యక్తి

చౌరవ స్వేచ్ఛ పేరిట ఇవన్నీ జరగడానికి కారణం, అలౌకికవాదంతో ఉదారవాదం పొత్తు కావడమే.

ఉదారవాదం మొదట్లో ఆధ్యాత్మిక బానిసత్వానికి వ్యతిరేకంగా మానవుడు చేసిన తిరుగుబాటుకు ప్రతిచర్య అయింది. హాబ్స్ తత్త్వంలో చివరిదశకు చేరుకున్న ఈ ధోరణి, లాక్‌తోనే ఆరంభమయింది. (ఇంద్రియజ్ఞాన తత్త్వంలో జ్ఞానవాద బలహీనత ఉన్నది. హాబ్స్ పదార్థ వివేచనావాదాన్ని అరమరికలు లేకుండా అంగీకరించడానికి లాక్ వైముఖ్యం చూపడం వలన ఇలా జరిగింది. రాజకీయ తత్త్వంలో అతడు హాబ్స్‌ను నిరాకరించాడు. హూకర్‌ద్వారా సంక్రమించిన మధ్యయుగాల సంప్రదాయాలు, ప్రమాణాలవలన ఇలా చేయగలిగాడు). సిద్ధాంతపరమైనమూర్ఖత్వం, మతపరమయిన అసహనం జుగుప్సాకరమైన వాతావరణాన్ని సృష్టించింది. అటువంటప్పుడు లాక్ మతసహనాన్ని బోధించడం ఆహ్వానించిందేకానీ విశ్వాసానికీ–వివేచనకూ జరుగుతున్న పోరాటంలో, రాజీపడినట్లు చారిత్రకంగా చూస్తే, అర్థమవుతుంది. మతానికి, పౌరుల అధికారానికి స్పష్టమయిన విచక్షణ చూపిస్తూ లాక్ తన తొలి రచన చేసాడు. ఉత్తరోత్తరా, మతానికీ రాజ్యానికీ పొందికపొత్తు ఉండాలన్నాడు. మతం సహనంతోను, విశాల దృక్పథంతోను ఉండాలన్నాడు. రాజ్యం, మతాన్ని ప్రాతిపదికగా గుర్తించాలన్నాడు. తొలుత మతం మానవుడి వ్యక్తిగత విషయంగా, లాక్ పరిగణించాడు. ఎట్లాంటి గందరగోళం లేకుండా ఆ దృష్టిని కొనసాగించవచ్చు. కానీ నీతికి ప్రత్యామ్నాయ ప్రమాణాన్ని కనుగొనలేక, లాక్ మతంపై ఆధారపడ్డాడు. నైతిక ప్రవర్తనకు ప్రమాణాన్ని చేకూర్చడానికి సర్వసాధారణమయిన మతం మాత్రమే అనుకూలమన్నాడు. మతానికి సారాంశం ఏమిటి? అలౌకికంలో విశ్వాసం, మానవ అవగాహనకు అందుబాటులో లేకపోవడం మాత్రమే. లాక్ ఉదారవాదం వలన వివేచన దెబ్బతిని విశ్వాసం చోటుచేసుకున్నది.

ప్రయోజనావాదంలో కొన్ని దోషాలు ఉన్నప్పటికీ, వ్యక్తి ప్రయోజనాన్ని పౌరహక్కుల ఆచరణను విప్లవాత్మకంగా చూచింది. అతి భౌతిక వూహా ప్రమాణాలతోగాక వ్యావహారిక దృష్టితో, ప్రజాసంక్షేమాన్ని పెంపొందించేదిగా ఉండేటట్లు చూడాలన్నాడు. కానీ అలౌకికవాదంలోకి పోవడం స్పష్టంగా కనిపిస్తుంది. ప్రయోజనావాదానికి లాక్ దైవ ప్రమాణాన్ని చేకూర్చాడు. "ధర్మాన్ని ప్రజల ఆనందాన్ని విడదీయడానికి వీలు లేనిదిగా దేవుడు రూపొందించాడు. ప్రజాసంక్షేమానికి పనికివచ్చేవి దైవసంకల్పాలే". మంచి చట్టాలను ధర్మాత్ములు రూపొందిస్తే ప్రజా సంక్షేమం పెంపొందుతుందని అదే దైవసంకల్పమనీ భావించారు. అంటే దైవేచ్ఛవలన మానవుడు ధర్మపరుడుగా ఉంటున్నాడన్నమాట. క్రైస్తవమతం పేర్కొన్న

దైవానుగ్రహభావనే ఇది. ఉదారవాదం, దాని ప్రవక్తవలన, మానవతావాదం నుంచి దూరంగా పోయింది. నీతికి మతేతర ప్రమాణాన్ని చూడలేకపోవడం వలననే ఇలా దారిమళ్ళారు. 19వ శతాబ్దంలో రాజకీయ తత్త్వవేత్తలను ఈ సమస్య కలవరపరచింది. అదింకా పరిష్కారం కాలేదు. విజ్ఞానాభివృద్ధికి తగినట్లుగా తత్త్వం వేగాన్ని పుంజుకోలేకపోవడమే ఇందుకు కారణం.

ప్రయోజనా సూత్రం ఉదారనీతి శాస్త్రానికి రాజకీయాలకు పునాది అయింది. సమాజ మూలాన్ని గురించి హాబ్స్ పేర్కొన్న వివేచనాయుత సిద్ధాంతంవలన ఇది రాలేదు. ఆ సిద్ధాంతం ప్రకారం సమాజం ఒక కట్టుకథ. వ్యక్తుల సహకారమే వాస్తవం. ఎవరినివారు కాపాడుకోవాలనే పిపాసవలన సహకారం వస్తుంది. హాబ్స్ సిద్ధాంతంలో మానవ చర్యకు ప్రోత్సాహకారిగా ఆనందం, బాధ మధ్య ఏదోఒకటి ఎన్నుకోవాలనుకోవడానికి చోటులేదు. తమనుతాము కాపాడుకోవాలనే పిపాసే, జీవ సంపద. జీవ పరిణామం నిర్ధారితమయిన ఒక విధానం. ఆనందానికి దుఃఖానికి మధ్య ఎంపికచేసుకోవడం, తనను కాపాడుకోవాలనే పిపాస, ఇవి రెండూ భిన్నమయిన భావాలు. మొదటిదానిలో చాలా ఉన్నతస్థాయి చైతన్యత అవసరం. రెండవదానిలో చైతన్యత లేని తెలివితేటల స్థాయికి రాకముందే పనిచేయడం ప్రారంభిస్తుంది. ఒకటి తెలివితేటలతో కూడిన విచక్షణ కాగా రెండవది యాంత్రికంగా ఇమిడి పోవడం మాత్రమే. మానవుల సహకారం, ఆనందం, బాధ మధ్య ఎంపిక చేసుకోవడంతో ప్రారంభం కాలేదు. తనను కాపాడుకోవాలనే పిపాసవలన నిర్ధారితమైన విధానమే సహకారం. మరొక మార్గాంతరం లేదు. జీవులు పుట్టుకతోనే చనిపోతే తప్ప, సహకారం మినహా గత్యంతరం లేదు.

సమాజ మూలాన్ని గురించి హాబ్స్ పేర్కొన్న సిద్ధాంతంలో ఇమిడి ఉన్న విషయాలను లాక్ పూర్తిగా గ్రహించలేదు. హాబ్స్ యాంత్రిక మనోవిజ్ఞానం దృష్ట్యా "కొత్త భావాలకు దారితీసినట్లు తప్ప" లాక్ మరోవిధంగా గ్రహించలేకపోయాడు. తాత్త్వికంగా హాబ్స్‌ను కొన్ని పరిమితులతో లాక్ అనుసరించాడు. ఆ విధంగా లాక్ తన భావాలతో హెల్‌విషస్‌ను ప్రయోజన నైతిక విధానానికి ఉత్తేజితుడిని గావించాడు. ఇదే తాత్త్విక రాడికలిజంగా బెంథాం బ్రిటన్‌కు తెచ్చాడు. లాక్ కాలంలో అభ్యుదయ రాజకీయాలోచన అనేది సహజ నియమ సిద్ధాంత ఫలితంగా జనించింది. ఇదే స్వేచ్ఛాభావనకు మానవుడు వ్యక్తిగా గౌరవాన్ని పొందడానికి దారిచూపింది. లాక్ మతభావాలలాఉంచి అతడుసహజ నియమాన్ని విపులీకరిస్తూ ప్రతివ్యక్తి అంతర్గతంగా కొన్ని హక్కులతో ఉంటాడని పేర్కొన్నాడు. అతడింకా ముందుకుపోయి, సమాజం ప్రభుత్వం కూడా వ్యక్తుల హక్కులను కాపాడాలన్నాడు.

సమాజం ప్రత్యేక ఉనికిని కలిగి ఉంటుందనే అరిస్టోటల్ నమ్మకాన్ని మధ్యయుగాల ద్వారా, హ్యూకర్ స్వీకరించగా, అది లాక్‌కు సంక్రమించింది. ఈ భావాన్ని తృణీకరించడం ప్రజాస్వామ్యానికీ ఉదారవాదానికీ అవసరం. స్వేచ్ఛ, వ్యక్తి ప్రధానం అనేవి ఈ భావంలో మూలాంశాలు. కానీ ఆంగ్లేయ విప్లవాన్ని సమర్థించిన లాక్ ప్రజాస్వామ్య వ్యతిరేక భావాలుగల మధ్యయుగాల నమ్మకాలపై ఆధారపడ్డాడు. బర్క్‌కు వాదాన్ని అందించడానికన్నట్లు, హ్యూకర్‌ను అనుసరించిన లాక్, ఇంగ్లీషు సమాజాన్ని ఇంగ్లీషు ప్రభుత్వాన్ని వేరు చేసి చూసాడు. సమాజం అన్ని కాలాలలోనూ ఉండగా ప్రభుత్వం అవసరమయినప్పుడు మారుతుందన్నాడు. సహజ నియమం అంటే శాశ్వతమైనదని నైతిక క్రమాన్ని అట్టిపెట్టేదని, వ్యక్తుల సమాజాలద్వారా ఇది వ్యక్తమవుతుందని లాక్ భాష్యం చెప్పాడు. లాక్ ఉదారవాదం పుడుతూనే మితవాదాన్ని సమర్థించింది. సంపన్న విగ్గుల సనాతన రాజకీయాచారాలకు ఇదొక సిద్ధాంతం అయింది. వారే బూర్జువా విప్లవాన్ని తెచ్చి, పెట్టుబడిదారీ ఆర్థిక వ్యవస్థను స్థాపించారు. లాక్ తత్త్వంలోని వాస్తవమయిన ఉదార ధోరణి ఫ్రాన్సులో రెండు దిక్కులలో పెంపొందడానికి మాంటెస్క్యూ, ఓల్టేర్‌లు సహకరించారు. మానవ ప్రవర్తనకు బాధను ఇష్టపడలేకపోవడం, సుఖాన్ని కోరడం ప్రాతిపదిక అని హెల్‌మిషన్ తన ప్రయోజన నైతిక విధానంలో పేర్కొన్నాడు. కాండిలా జ్ఞాన సిద్ధాంతాన్ని మెరుగుపరిచి, ప్రత్యక్షజ్ఞానం ద్వారాభావాలొస్తాయన్నాడు. అప్పటినుండీ ప్రయోజన నైతికవిధానం, తాత్త్విక రాడికలిజం రెండూ ఉదారవాదంతో కలిపిచూసారు. విగ్గుల సనాతనత్వం మితవాదం పొత్తువలన అపఖ్యాతి పొందిన సిద్ధాంతాలకు, విప్లవానంతర ప్రతిచర్యగా ఇంగ్లండ్‌లో ఉదారవాదం, ప్రయోజనావాదంగాను లేదాతాత్త్విక రాడికలిజంగానూ పేరొందినది. ఈ రెండూ లాక్ తత్త్వంనుంచే రాబట్టినట్లు చెబుతారు. వాస్తవానికి ఇవి భిన్న ఆలోచనాస్రవంతులు. ఒకటి ప్రాపంచికానుభవంతోను మరొకటి వివేచనావాదంతోనూ ఉన్నది. అయినప్పటికీ రెండింటికీ ఒకే మూలాధారాన్ని చూడటానికి కారణం, లాక్ తత్త్వంలోని అస్పష్టత, వైవిధ్యాలేకారణం.

వివేచనే తుది ప్రమాణంగా లాక్ పేర్కొన్నప్పటికీ ఇది అరమరికలులేని విషయంకాదు. సంప్రదాయబద్ధమైన అతిభౌతిక దృష్ట్యాకాని, జీవసంబంధంగాగాని, వివేచనను లాక్ భావించలేదు. వివేచనకు అతడిచ్చిన నిర్వచనం అస్పష్టంగానూ, పరస్పరవిరుద్ధంగానూ ఉన్నది. జ్ఞాన నిర్ధారణకు సంబంధించిన అన్వేషణ అతడు చేసాడు. కానీ ఆచరణలో ఉజ్జాయింపుగా పోవడమే ఉత్తమమన్నాడు. మన అనుభవాన్ని లేదా ఇతర అనుభవాలను ఆధారంగా ఇలా ఉజ్జాయింపుగా పోయే సూత్రాన్ని రాబట్టడం జరిగింది. (ఎస్సే కన్సర్నింగ్ హ్యూమన్ అండర్‌స్టాండింగ్). లాక్ దృష్టిలో వివేచన

అంటే లౌకిక జ్ఞానం మాత్రమే తర్కంకంటే దీనికే అతడెక్కువ విలువ ఇచ్చాడు. (అతడు తెలివితేటలతో, తర్కాన్ని త్యాగం చేయడానికి సిద్ధపడ్డాడేతప్ప, పరస్పర విరుద్ధం కావడానికి అంగీకరించలేదు. ఇందుకు సాధారణ సూత్రాలను రూపొందించి వింత ఫలితాలకు దారితీసేటట్లు చేసాడు. కానీ ఆ వింత ఫలితాలను రాబట్టకుండా తనను తాను లాక్ నిభాయించుకున్నాడు. తార్కికుడికి ఇది చాలా చికాకుని కలిగిస్తుంది. కానీ ఆచరణలో ఉన్న వ్యక్తికి ఇది మంచి నిర్ణయమనిపిస్తుంది–బెట్రాండ్ రస్సెల్ హిస్టరీ ఆఫ్ వెస్టరన్‌ఫిలాసఫీ). అందుకే ఇతడిని ప్రాపంచికానుభవ పితామహుడంటారు. 19వ శతాబ్దంలో ఉదారవాదానికి చెందిన ప్రయోజనాసూత్రాన్ని లాక్ తత్త్వంనుంచి రాబట్టారు. ఇందుకే మొదటఉన్న ఉదారవాదంలోని వివేచనాస్థితినుంచి దారిమళ్ళించారు.

కాండిలా అభివృద్ధి చేసిన లాక్ జ్ఞానసిద్ధాంతం. 18వ శతాబ్దంలో వైజ్ఞానిక సహజవాదానికి లేదా భౌతిక వివేచనావాదానికి ఎంతో సహకరించింది. డేకార్ట్ సిద్ధాంతంలోని అంతర్గత భావాలను పూర్వపక్షం చేస్తూ ఎస్సె కన్సర్నింగ్ హ్యూమన్ అండర్‌స్టాండింగ్‌లో వాదనలు ప్రారంభం అవుతాయి. అయినప్పటికీ లాక్ అరమరికలు లేకుండా ఈ సిద్ధాంతాన్ని తృణీకరించలేదు. “వ్యక్తమయ్యే సత్యాలను గ్రహించడానికి వివేచనతో కూడిన అంతర్బుద్ధి శక్తిలో” లాక్‌కు నమ్మకమున్నది. ఇంద్రియసంవేదనల ద్వారా మానసికరీతులనన్నింటినీ వివరించవచ్చునని కాండియాక్ వాదించాడు. కనుక అంతర్గత భావాలకు లాక్ చూపిన ప్రత్యామ్నాయం ఎంత కృత్రిమమో కాండియాక్ భావాలూ అంతే. శారీరక శాస్త్రంలో జ్ఞానాభివృద్ధి జరుగుతుండగా కాబినా ఈ సిద్ధాంతాన్నింకా పెంపొందించాడు. లాక్ ప్రాపంచికానుభవ వాదంలోని దోషాలను అధిగమించి ఇంద్రియజ్ఞాన వాదం పెంపొందింది. తుదకు హెూల్‌బాహ్ రూపొందించిన పదార్థవాద తత్త్వంలో ఆధునిక విజ్ఞానం చోటు చేసుకున్నది. ఉదారవాద సూత్రాలను ప్రజాస్వామిక ఆచరణను ఈ తత్త్వం స్పష్టపరిచింది. వ్యక్తుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని వారికి సేచ్ఛ సమాజం ఉత్తమమైనది. స్వేచ్ఛ విడదీయరాని హక్కు ఆ హక్కు లేకుండా పెంపొందడం కష్టం. మానవ ద్వేషి ఈ స్వాప్నిక భావాన్ని చూసినవ్వాడు. ఈ “అద్భుతాన్నెలా” సాధిస్తారని ప్రశ్నించాడు. ఉదారవాద తత్త్వవేత్తలు, ప్రజాస్వామ్యం కావాలనేవారు మానవుడి అంతర్గత వివేచనలో తమ విశ్వాసాన్ని చాటారు. దీని ఫలితంగా సృజనశక్తికూడా వస్తుంది. మానవులు వివేచనాపరులు. ఏది తమకుమంచో నిర్ణయించుకోగల శక్తి, ఆ నిర్ణయాన్ని అనుసరించగల శక్తి వారికున్నది. వారికి జ్ఞాన వికాసాన్నందించి, అజ్ఞానం, మూఢనమ్మకాలు సృష్టించిన ఆటంకాలు తొలగిస్తే వివేచన వెలుగులో సరైన మార్గం కనిపిస్తుంది. ఎవరికివారు

వాస్తవమయిన తమ ఆసక్తులను అనుసరిస్తే అందరిమంచి అందులోనే ఉంటుంది (HOLBACH, The System of Nature).

ఈ విధంగా విపులీకరించిన లాక్ తత్త్వంలోని ఉదార దృక్పథం మానవుడి స్వేచ్ఛా ప్రణాళికలో చేర్చబడింది. ప్రాపంచికానుభవ వాదానికి తారీ–కంగాతుది వరకూ తీసుకువెళ్ళిన హ్యూం ఉదారవాద తాత్త్విక పునాదులను పెకలించి వేసాడు. ప్రయోజనా సూత్రం నీతి శాస్త్రానికీ సాంఘిక సంబంధాలకూ అన్వయిస్తే అవే ప్రాపంచికానుభవ సూత్రాలవుతాయి. కనుకనే ఉదారవాదానికివి వ్యతిరేకంగా ఉంటాయి. 19వ శతాబ్దంలో ఉదారవాదంను ప్రయోజనా వాదంతో కలిపిచూసినప్పటికీ ఇది అంగీకరించక తప్పదు. వివేచనా ధోరణి వ్యక్తివాదంతో కూడిన తత్త్వాన్ని విడనాడిన ఉదారవాదం, తనకుతాను చులకన చేసుకుని, తనకు వ్యతిరేకంగా పయనించి, సంకుచిత జాతీయ వాదానికి సంఘపరంగా సమష్టివాదానికి పయనించింది, జాతీయ సంకుచిత వాదం వైపుకు పోవడానికి ఫిషె, హెగెల్ తత్త్వాలు సహకరించగా, సాంఘిక సమష్టి వాదానికి కార్ల్‌మార్క్స్ ప్రవక్త అయ్యాడు.

# ప్రయోజనవాదం

లాక్ చెప్పిన ప్రాపంచికానుభవవాదంలో, అస్పష్టతలను దోషాలను హ్యూం తొలగించగా, వివేచనా వాదాన్ని పూర్తిగా నిరాకరించే ధోరణిలో అది అభివృద్ధి చెందింది. వివేచనాభావాన్ని విశ్లేషిస్తూ, హ్యూం ఒక నిర్ణయానికి వచ్చాడు. ప్రకృతి నియమంను రాబట్టదగిన స్వేచ్ఛ, హక్కు, న్యాయం ఇత్యాది సూత్రాలేవీ లేవన్నాడు. ఈ నిర్ణయాన్ని సర్వసాధారణమయినదిగా ప్రకటిస్తూ, వివేచనాభావం వలన గందరగోళం వచ్చినట్లయితే, సహజనియమాలలో వివేచన ఉన్నదనే నమ్మకాన్ని తొలగిస్తే సరిపోతుందన్నాడు. వివేచన అనవసరమని, ఆధారరహిత ప్రతిపాదన అని పేర్కొన్నాడు. వివేచనాయుత సహజమతానికి, దానితో సంబంధం ఉన్న 18వ శతాబ్దపు ఉదారవాదానికి వ్యతిరేకంగా హ్యూం విమర్శలు చేసాడు. అంతేగాక వివేచనాయుత నీతిశాస్త్రం సాధ్యంకాదని చెప్పాడు. విలువల మంచిచెడులు నిర్ణయించడం సంప్రదాయబద్ధంగా వచ్చేదేతప్ప తార్కికంగాగాని, వాస్తవ కొలమానాలనుబట్టిగాని జరగదన్నాడు. వివేచన, వాస్తవం, విలువలుమధ్య ఖచ్చితమయిన తేడాలను చూపడమనేది, హ్యూం సంశయవాదానికి ప్రధాన ప్రాతిపదిక. దీనివలన లాక్ ప్రపంచానుభవవాదం "పొందికగా ఉన్నా – విడ్డూరమయినది" అన్నాడు. "ఒకవిధంగా మృతప్రాయమయిన లక్ష్యానికి అతడు ప్రాతినిధ్యం వహిస్తున్నాడు. అతడు చూపే మార్గంలో ముందుకుపోవడం అసాధ్యం." (బెర్ట్రాండ్ రస్సెల్, హిస్టరీ ఆఫ్ వెస్టరన్ ఫిలాసఫి). సమకాలీన ప్రత్యక్షవాదం హ్యూం ననుసరించి వచ్చింది. ప్రపంచానుభవ వాదాన్ని అతడు బాధ్యతారహిత సంప్రదాయంగా రూపొందించాడు.

వివేచనాయుత నీతిశాస్త్రం సాధ్యమేనని లాక్ నమ్మాడు. వివేచనకూ నీతికీ సంబంధాన్ని ప్రదర్శించి చూడలేమని హ్యూం భావించాడు. నీతికి బాహ్యప్రమాణం ఉంటుందనడాన్ని అతడు ప్రశ్నించాడు. అది కేవలం సంప్రదాయం మాత్రమేనన్నాడు. "నీతి, మోహావేశాలను ప్రేరేపిస్తుంది. ఆచరణను ఆపడంకాని, పురిగొల్పడంకాని చేస్తుంది. ఇందులో వివేచన దానంతటదిగా శక్తిహీనమయింది. కనుక నైతికసూత్రాలు వివేచనవలన వచ్చిన నిర్ణయాలు కావు." హ్యూం నీతిశాస్త్రాన్ని నిర్వచిస్తూ ఈ భావాన్ని సమర్థించాడు. "నీతికి సంబంధించిన వివేచనకు ఏకైకలక్షణం, ఏమంటే, శ్లాఘించతగిన లక్షణాలు ఏ పరిస్థితులలో ఉన్నాయో కనుగొనడమే. అభినందించతగిన లక్షణాలను

తృణీకరించతగిన లక్షణాలను ఏ మేరకు ఒప్పుకుంటామో లేదో పట్టి చూడాలి. అప్పుడు నీతిశాస్త్రానికి పునాది ఏర్పడుతుంది. విశ్వ నియమాలు కనుగొంటే దానివలన తుది సత్యాలను రాబట్టవచ్చు. ఇది వాస్తవానికి సంబంధించిందేగాని నైరూప్య విజ్ఞానానికి చెందినది కాదు గనుక పరిశోధనా పద్ధతి వలననే ఫలితం పొందవచ్చు. ఇదమిత్థమైన సంఘటనలతో పోల్చి సర్వసాధారణ సూత్రాలను రూపొందించవచ్చు." (ఎంక్వయిరీ కన్సర్నింగ్ ది ప్రిన్సిపుల్స్ ఆఫ్ మోరల్స్).

హ్యూం ప్రధాన ప్రాతిపదిక అంగీకరిస్తే, ఉదారవాదం ప్రజాస్వామ్యానికి చెందినది. మూల సూత్రాలన్నీనాశనం అయినట్లే, సహజ నియమ సిద్ధాంతాన్ని తుడిచిపెట్టాలి. దానినుంచి రాబట్టిన సహజ హక్కులు, స్వయంప్రమాణ సత్యాలు, నీతికి బాహ్య ప్రమాణాలు అన్నింటికీ తిలోదకాలివ్వాల్సిందే. న్యాయం, స్వేచ్ఛ వంటి విలువలకు నైతికాధారమేమీ ఉండదు. ఉపయోగం ఒక్కటే, ఏ నిర్ణయానికయినా ప్రమాణం అవుతుంది. సంప్రదాయాంకంటే అనుకూలత మాత్రమే అత్యున్నత న్యాయస్థానమన్నాడు. కానీ ఎవరికి అనుకూలత? ఎవరు అధికారంలో ఉంటారో, ఎవరికి అవకాశాలు ఉంటాయో, వారికి అనుకూలత అన్నమాట. ఇదే ప్రయోజనావాదంలోని ఆచరణ.

హ్యూం ఈ పదాన్ని ప్రయోగించకపోయినప్పటికీ తత్త్వచరిత్రలోనూ, నీతిశాస్త్రంలోనూ ఇతడిని ప్రయోజనవాద పితామహుడుగా పేర్కొన్నారు. విశ్లేషించిచూస్తే ప్రయోజనవాదం ఒక నైతిక సిద్ధాంతం. (ఖడ్వర్త్, ప్రైస్‌లతో ప్రారంభించిచూస్తే, ఇంగ్లీషు నీతిశాస్త్రమంతా ప్రయోజనవాదంతోనే ఉన్నది.) హ్యూం ప్రాపంచికానుభవ నీతిశాస్త్రాన్ని అన్వయిస్తే, ఇదొక రాజకీయ సిద్ధాంతం అవుతుంది. "హ్యూం చెప్పిన ఉపయోగవాద సిద్ధాంతాలు స్పష్టంగానూ పొందికగానూ ఉన్నవి. 19వ శతాబ్దంలో మరే రచయితా ఇలా చెప్పలేదు. హ్యూంనుంచి జాన్‌స్టువర్ట్‌మిల్ వరకు ఈ సిద్ధాంతంలో చెప్పుకోదగిన మార్పులను ఎవరూ చేయలేరు." (లెస్లీ స్టీఫెన్, హిస్టరీ ఆఫ్ ఇంగ్లీష్ థాట్స్ ఇన్ ఎయిటీన్త్ సెంచరి). హ్యూం సంశయవాదం, తన ఉనికినే సందేహించేటంతవరకూ పోయింది. ఉదారవాదానికి పునాదే కంపించింది. వ్యక్తి స్వేచ్ఛాభావం అర్థరహితమైనది. స్వంతఉనికిని సంశయించినపుడు ఈ స్థితి తప్పదు. దీని పరిణామాలు చాలా దూరంపోయాయి. మానవుడి సృజనశక్తిలో నమ్మకం ఉంచడం ఒక భ్రమ. స్వీయచైతన్యత ఉంటేగాని, సృజన ఉండటానికి వీలులేదు. మరో కోణంనుంచి చూస్తే, మానవుడి సృజనను హ్యూం సందేహవాదం నిరాకరిస్తూ జ్ఞానం సాధ్యం కాదని చెబుతున్నది. అసమాన పద్ధతిని అతడు నిరాకరించాడన్నమాట. ఈ పద్ధతిలేనిదే ప్రకృతి శాస్త్రమే లేదు. ప్రకృతికి సంబంధించిన జ్ఞానాన్ని

పెంపొందించుకోకుండానే మానవుడెన్నడూ ప్రకృతి శక్తులను అలవర్చి, తన సంక్షేమానికి వినియోగించలేడు. ఈ అజ్ఞానానందంతో మానవాళి ఆటవికస్థితిలో నివసించాల్సిందే. (హ్యూం తత్వాన్ని విపులంగా విమర్శించడం ఈ గ్రంథం పరిధిలోని విషయంకాదు. పైన పేర్కొన్న అంశాలను బట్టి పొందికైన ప్రపంచానుభవవాదం తాత్విక ఉదారవాద మూలసూత్రాలకు వ్యతిరేకమని స్పష్టం చేస్తున్నది).

ఒక విధంగా ఇతడి సందేహవాదం చిత్తశుద్ధితో కూడినది. అదెలాగూ అతడు ఆచరణలో పెట్టలేడు. అయితే ఒక చర్యకంటే మరోచర్య మంచిదని రుజువుచేయలేని స్థితిలో ఈ వాదం ఉంటుంది. వివేచనను ఇలా స్వయంగా నిరాకరించడం, వివేచనారహిత విశ్వాసాన్ని అత్యంత ఉత్సాహంతో అనుసరించడమే ఔతుంది. హ్యూం ప్రపంచానుభవవాదం వినాశకారి. 19వ శతాబ్దంలో పెంపొందిన వివేచనారాహిత్యత, దానినుండి 20వ శతాబ్దంలోకి వచ్చిన రీతులన్ని హ్యూం సంశయవాద ఫలితాలే. (బెర్ట్రాండ్ రస్సెల్, హిస్టరీ ఆఫ్ వెస్టర్న్ ఫిలాసఫి). వివేచనావాదాన్ని అనుసరించి మానవుడిలో జీవసంపదలో భాగంగా హేతువు ఉంటుంది. దీనిని వ్యతిరేకించిన ప్రపంచానుభవవాదం అవధులులేని సందేహవాదానికి, నిస్సారమైన ప్రత్యక్షవాదానికి దారితీస్తుంది. దురదృష్టవశాత్తూ, ప్రయోజన సూత్రం 19వ శతాబ్దంలో ఉదారవాదాన్ని ఆచరణలో పెట్టడానికి మార్గదర్శి అయింది. హ్యూం విపులీకరించిన ప్రపంచానుభవ వాదం దీనంతటిపై ప్రభావాన్ని చూపింది.

ఆనందం, బాధలననుసరించి, విషయాల మంచి చెడ్డలుంటాయని లాక్ అన్నాడు. "ఆనందాన్ని ఇచ్చేవాటిని, పెంపొందించేవాటిని, సుఖమయిన వంటాము. సుఖం కోరికను జనింపచేస్తుంది. ఆనందాతిశయమే మనం అనుభవించగలిగినదంతా." గందరగోళంతో కూడిన ఈ వాదంనుంచి లాక్ ఇలా నిర్ణయించాడు. "స్వేచ్ఛకు ప్రాతిపదిక ఏమంటే వాస్తవానందాన్ని అభిలషించడమే." నీతిశాస్త్రానికి పునాదులు వేస్తూ అతడిలా అన్నాడు. "సరైన నిర్ణయం చేయలేకపోతే ధర్మానికి బదులు దోషానికి స్థానం ఇస్తున్నామని వ్యక్తం అవుతుంది." ప్రవర్తనకు అతడొక మూలసూత్రాన్ని యీవిధంగా చెప్పాడు. "మన మోహావేశాలను పాలించడమే స్వేచ్ఛాభివృద్ధికి దోహదం చేయడం." (ఎస్సె కన్సర్నింగ్ హ్యూమన్ అండర్‌స్టాండింగ్).

కేంబ్రిడ్జ్ ప్లేటోనిస్టుల నాయకుడు బిషప్ కంబర్లాండ్ (1632-1718). "విశ్వనికర" సిద్ధాంతాన్ని నీతిశాస్త్రానికి ప్రాతిపదికగా చెప్పినప్పటినుంచీ, విశ్వవ్యాప్త సుఖవాదం ఇంగ్లీషు నీతితత్వానికి మార్గదర్శక సూత్రమయింది. ఇది హాబ్స్ చెప్పిన వివేచనావాదానికి వ్యతిరేకంగా వచ్చింది. 19వ శతాబ్దపు మధ్యలో బెంథాం, జాన్‌మిల్, జాన్‌స్టువర్ట్‌మిల్ (తండ్రీకొడుకులు) పేర్కొన్న సాంఘిక రాజకీయ సిద్ధాంతాలకంటే

ఒక నైతిక సిద్ధాంతంగా ప్రయోజనావాదం చాలా ప్రాచీనమయినది. కంబర్లాండ్ ననుసరించి నైతిక సిద్ధాంతం ఏమంటే "మానవుడి నిర్ణయానికి సహకరించే ఒక నియమం మాత్రమే. దాని సహకారంతో మానవుడు తన చర్యలను కొలుస్తాడు. అందులోనే ధర్మమున్నది. (బిషప్ కంబర్లాండ్, DE LEGIBUS NATURAE) ) సరైన నైతిక సిద్ధాంతపు ఆచరణ విలువలను గురించి కంబర్లాండ్ చాలా నొక్కిచెప్పాడు. వ్యక్తులు పరోపకారంతో పనిచేయడం తమ సంతోషం కోసమేనని అతడు చెప్పాడు. "నైతికంగా మంచిని చూపని ఏ చర్యా మానవుడి సంతోషానికి దోహదం చేయదు." గె, టక్కర్, పాల్ మతజ్ఞానంతో కూడిన ప్రయోజనావాద నైతికశాస్త్రాన్ని రూపొందించారు. హ్యూం వీటిని మతరహితంగా రూపొందించాడు. నీతిశాస్త్రం సాపేక్షతగామారి, నైతిక విలువలకు శాశ్వత తత్త్వాన్ని పోగొట్టింది.

ఉత్తరోత్తరా పెంపొందిన ప్రయోజనావాదం, మానవ ప్రవర్తన లక్ష్యం ఏమంటే, అత్యంత ఆనందాన్ని అనుభవించడమేనన్నారు. సాధ్యమయినంతవరకూ బాధలేకపోవడమేనన్నాడు. ఈ రూపంలోనే ప్రయోజనావాదం ఫ్రాన్సులో ప్రవేశించింది. మళ్ళీ హెల్విటన్ ఇచ్చిన రూపంలో, బెంథాం దీనిని వెనక్కు తీసుకువచ్చాడు. అంతవరకు లాక్ చేతులలో ప్రయోజనావాదం విగ్గుల సనాతనత్వంగామారి, జీవితానంతరం ప్రయోజనాదర్శంగా మతశాస్త్రజ్ఞులు వ్యాఖ్యానించి పోషించారుకూడా.

ప్రయోజనావాద విశ్వాసంలోగల రెండు మూలసూత్రాలమధ్య పరస్పర విరుద్ధత్వాన్ని సమన్వయీకరించాలంటే, ఒక ఆదర్శం ఉండాలి. వ్యక్తిగతంగాను మానసికంగాను సుఖంగా ఉండాలనే వాదం సాంఘికంగానూ నైతికంగానూ సుఖంగా ఉండాలనే మరొకవాదం ఇటువంటి ఆదర్శాలుగా పేర్కొనవచ్చు. ఎవరికి వారు తమ సంతోషాన్ని చూచుకోవాలి అనే ప్రతిపాదన ఒకటి. సాధ్యమయినంత ఎక్కువమందికి సాధ్యమయినంత ఎక్కువ ఆనందాన్ని ఇచ్చేరీతులు కూడా ఉండాలని భావించారు. ఇప్పుడు నైతిక సంఘర్షణ స్పష్టంగా కనిపిస్తుంది. స్వార్థాన్ని సమర్థించే రీతి ఒకటి. కాగా, సామాజిక విధిని సమర్థించే రీతి మరొకటి అయింది. మరణానంతరం జీవుడికి శిక్షలు బహుమతులు శాశ్వతంగా ఉంటాయనే విశ్వాసంవలన, విధిగా చేయతగిన రెండుపనులమధ్య సంఘర్షణ సంభవిస్తుంది. జ్ఞానవికాసం పొందిన స్వార్థంవలన శాశ్వతానందానికై మానవుడు, సాంఘికనీతి కనీసం చేయతగిన పనులు చేస్తాడు. వ్యక్తి అహం సమష్టిత్వానికి లొంగి ఉండాలి. ఆవిధంగా ప్రయోజనావాదం ఆ కాలానికంటే చాలా ముందుచూపుతో, వివిధ నియంతృత్వ ఆచారాలకు నైతిక ప్రమాణాన్ని సమకూర్చింది.

ప్రయోజన సూత్రాధారంగా హెల్విటస్ నీతిశాస్త్రాన్ని ఏర్పరిచాడు. లాక్ సిద్ధాంతంలోని మనసు–జ్ఞానం ఆధారంగా ఈ నీతిశాస్త్రంలో ఇంద్రియజ్ఞాన మనస్తత్వం ఉన్నది. 18వ శతాబ్దపు ఫ్రెంచి తత్త్వ ధోరణి ననుసరించి హెల్విటస్, లాక్ కంటే ముందుకుపోయి, ఇంద్రియజ్ఞానానికి సంబంధించిన హాబ్స్ భౌతిక వర్ణనలను తన నీతిశాస్త్రానికి ఆధారంగా చేసుకొన్నాడు. నీతిశాస్త్రాన్ని ఇతర విజ్ఞాన శాస్త్రాలవలె అతడు పరిగణించి, భౌతికశాస్త్రంవలె ప్రపంచానుభవంతో చూడాలనుకొన్నాడు. అలౌకిక ప్రమాణంతో నిమిత్తం లేకుండా నీతిశాస్త్రం ఉండాలంటే, మానవచర్యలకు తోడ్పడే శక్తుల నర్థంచేసుకోవాలి. ఈ అవగాహనకు ముందు మానవ స్వభావ సిద్ధాంతం ఉండాలి. వివేచనారహిత అంచనాలను హాబ్స్ త్రోసిరాజంటూ తన సిద్ధాంతాన్ని ప్రతిపాదించాడు. అయితే అతడు తన మానవ స్వభావ సిద్ధాంతంనుంచి నీతిశాస్త్రాన్ని రాబట్టలేదు. సుఖం కోసమే కోరిక ఉండాలని, బాధను ఇష్టపడరాదంటూ, మానవ ప్రవర్తనకు ఇవే సూత్రాలని, లాక్ ఇంద్రియజ్ఞాన తత్త్వంగా రాసాడు. హాబ్స్ పదార్థ మనస్తత్వానికి ఇది ఒకరకంగా విస్తరణే. హెల్విటస్ తన నైతిక సిద్ధాంతానికి ప్రారంభ సూత్రాలుగా లాక్ ప్రభోదించిన సుఖదుఃఖాలను స్వీకరించాడు.

అయితే, మానవుడు ఆచరణకు ఉపక్రమించాలంటే ఆనందమనే ప్రేరణ ఉండాలని హెల్విటస్ మొండిగా చెప్పలేదు. "స్వంత ఆసక్తి" అనే పదాన్ని ఇతడు వాడాడు. దీనికి విస్తృతమైన అర్థమున్నది. స్వంత ఆసక్తేమిటో తెలుసుకొనేటట్లు సరైన విద్యద్వారా బోధపరిస్తే, అందరి సంక్షేమానికి అనుగుణంగా దీనిని మలచుకోవచ్చు. మనస్తత్వాన్ని, శారీరక తత్త్వంతో మేళవించడంద్వారా హెల్విటస్, ప్రయోజన నీతి శాస్త్రానికి చక్కని మనో విజ్ఞాన పునాదులను నిర్మించాడు. మానవ ప్రవర్తనకు మూలం ఇంద్రియ సంవేదనే. సుఖసంతోషాలు రెండూ మానసిక స్థితులే. కనుక వీటిని మానసిక రీతులుగా విశ్లేషించవచ్చు. ఇంద్రియసంవేదనలనే కలిపి చూస్తే మనసు అవుతుంది. అత్యధిక సంఖ్యాకులకు అత్యంత మంచి అనేదొక్కటే ప్రవర్తనకు వివేచనాయుత ప్రమాణమని అతడు పేర్కొంటూ, మంచితనమనేది వ్యక్తి నిర్ణయానికి వదిలేయాలన్నాడు. అంటే తుదకు, అతని నైతిక శాస్త్రానికి ప్రయోజనాసూత్రం ప్రమాణం కాదు. మానవ స్వభావమే గీటురాయి. ఇతడి మనోవిజ్ఞానాన్ని అనుసరించి మానవ స్వభావం వివేచనాత్మకం. నైతిక ప్రవర్తనకు విద్య తప్పనిసరిగా ఉండాలన్నాడు. మూఢ నమ్మకాలనుంచి మానవుడి మనస్సును విమోచన గావించి అతడిని హేతుబద్ధంగా ప్రవర్తించేటట్లు విద్య సహకరిస్తుందన్నాడు.

అయినప్పటికీ హెల్విటస్ పెంపొందించిన ప్రయోజనానీతిశాస్త్రం దోషపూరితంగానే ఉన్నది. నైతిక విలువలకు సంపూర్ణతను ఇవ్వలేకపోవడం వలన,

సాపేక్షతానీతి, శూన్యవాదంతోకూడిన నీతిశాస్త్రంలో తేలుతుంది. ఇంగ్లండులో ప్రయోజనావాదాన్ని బెంథాం మళ్ళీ ప్రవేశపెట్టడంతో ఈ విధంగా జరిగింది. ఆర్థిక శాస్త్రానికి అన్వయించినప్పుడు దీని ప్రభావమేమిటో ఫ్రాన్సులో తెలిసివచ్చింది. క్విస్‌నెను అనుసరించిన ఫ్రిజాకాట్లు ఆర్థికరంగంలో ప్రయోజనాసూత్రాన్ని ప్రవేశపెట్టి, ప్రతివారు జ్ఞానవికాసంతోకూడిన స్వంత ఆసక్తిననుసరించి పనులుచేస్తే తత్ఫలితంగా, ప్రజాసంక్షేమం, సాంఘిక సమన్వయం వస్తుందన్నారు, అయితే ప్రజాసంక్షేమాన్ని కాపాడటానికి, పెంపొందించడానికి శాసనం ఒక సాధనంగా ఉండాలని హెల్విటస్ చెప్పినప్పటికీ అటువంటి ప్రాధాన్యతలు వీరుమాత్రం గుర్తించలేదు. ఇందుకు విరుద్ధంగా, ఆర్థిక నియమాలు సహజంగా సాగుతుంటే వాటిలో ప్రభుత్వం జోక్యం చేసుకోరాదని ఫ్రిజాకాట్లు పట్టుబట్టారు. ఆనందాన్ని కోరడం మానవ ప్రవర్తనలో సర్వసాధారణ విషయంగనుక, ఆనందాన్ని కోరేవ్యక్తుల స్వేచ్ఛ ఫలితంగానే ప్రజాసంక్షేమం ఉంటుంది కనుక, వ్యక్తి చొరవకు ఆర్థికరంగంలో ఉత్సాహానికి హద్దులుండరాదని వీరు చెప్పారు. అందరి నిమిత్తం కోరినప్పటికీ, సిద్ధాంతరీత్యాచూస్తే, ప్రభుత్వ జోక్యంలేకుండా స్వేచ్ఛగా ఉండే విధానాలు. ఆర్థిక రంగాలలో, అదృష్టవంతులైన కొందరికే ఆచరణలో సహకరిస్తాయి. ప్రయోజనావాద సూత్రంనుంచి పెట్టుబడిదారీ ఆర్థిక సిద్ధాంతాన్ని రాబట్టవచ్చు. అందుకే ఈ సిద్ధాంతాన్ని కావాలన్నారు. ఉదారవాదంతో పొత్తుపెట్టుకున్నారు.

పెట్టుబడిదారీ ఆర్థిక విధానం దానివలన లాభాలుపొందే వర్గాల ఆసక్తులు ఉదారవాదానికి చెందాయనుకున్నప్పటికీ, కార్యకారణ సంబంధాలున్నాయని చూపే సాక్ష్యాధారాలేమీ లేవు. అలాగే నీతితో సంబంధం లేని మార్క్సిజానికి ప్రయోజనావాద (సాపేక్షత) నీతిశాస్త్రానికి చెందిన ఉదారవాదంతో పొత్తును చూపవచ్చు. అంతమాత్రాన ఇది కార్మికవర్గ సిద్ధాంతంగా ఎవరూ చెప్పజాలరు. భావాలనేవి అక్రమంగాని, సంక్రమంగాని, దానంతటవే పెంపొందుతాయి. వాటిని ఏదో ఒక వర్గ ప్రయోజనానికి వినియోగించుకోవడం, సమర్థించుకోవడం అనేది తలవనితలంపుగా, జరగడమేతప్ప కార్యకారణ సంబంధం మాత్రం కాదు.

బెంథాం అతని అనుచరులు స్పష్టమయిన వివేచనావాదులే అయినప్పటికి, ప్రకృతి నియమాన్ని తృణీకరించిన హ్యూం ప్రాపంచికానుభవ వాదం వీరిని ఎంతో ప్రభావితులను గావించింది. బ్లాక్‌స్టోన్ పేర్కొన్న నియమసిద్ధాంతంపై బెంథాం చేసిన విమర్శ అంతా, హ్యూం వాదనలపైనే ఆధారపడింది. ప్రభుత్వానికి ఒడంబడిక సిద్ధాంతం ఉంటుందనే వాదాన్ని సహజ హక్కుల భావాలను "అర్థరహితం" అని హ్యూం పేర్కొన్నాడు. ఉదారవాద మూలసూత్రాలకు భిన్నంగా, బెంథాం తన స్వంత వాదనలు

కొన్ని, హ్యూం నుంచి స్వీకరించినవి కొన్ని తీసుకున్నాడు. చట్టం ఏది చేయాలో ఏది చేయతగునో అనేది అత్యధిక సంఖ్యాకులకు అత్యంత సంతోషాన్నిచ్చే సూత్రంపై చర్చించవచ్చునన్నాడు. "శాసనకారుడు, వివేచన, శాసనం అనేవాటి ఆధారంగా అల్లుక రావాలన్నాడు (Bentham, Fragments on Governaments).

ప్రయోజనావాద నీతిశాస్త్రతర్కంలో మౌలికమయిన దోషం ఉంది. వ్యక్తిపరమయిన మానసికమయిన సుఖానికీ, సంఘపరమయిన, నైతిక సుఖానికి ఉన్న సంఘర్షణే ఈ దోషం. తమ సంతోషానికై వ్యక్తులు చేసేవి, చేయదగినవి ఒక ప్రక్కన, అత్యధిక సంఖ్యాకులకు అత్యంత ఆనందాన్నిచ్చే ప్రతిపాదన మరొక ప్రక్కన ఈ సంఘర్షణలకు దారితీస్తున్నవి. మరణానంతరం జీవి ఇంకా ఉంటాడని, శాశ్వతంగా సుఖాలు, శిక్షలు ఉంటాయనే విశ్వాసంవలన ఈ సంఘర్షణ వస్తుంది. పాలె పేర్కొన్న పవిత్ర నీతిశాస్త్రం కంటే, బెంథాం, అతడి అనుచరులు ముందుకుసాగలేదు (ఉదాహరణకు, నరకమనే భావన ఒక సాంఘిక ఆవశ్యకత అని స్టీఫెన్ నమ్మాడు).

"విక్టోరియా కాలంలో రాడికలిజానికి సంబంధించిన ఈర్ష్యలు, భావనలు గందరగోళంతో వ్యక్తమయినవనడానికి" మిల్ వ్రాసిన ఎస్సె ఆన్ లిబర్టీ చక్కని నిదర్శనం. పార్లమెంటరి ప్రజాస్వామ్యంలో ఇమిడిఉన్న పెత్తందారీ విధానాన్ని బైటపెట్టడంద్వారా, స్టీఫెన్, ఉదార ఆశావాదానికి ఆధారంలేదని చూపాడు. స్వేచ్ఛ సమానత్వం పరస్పరం చేతులు కలిపి ఉంటాయనడం భ్రమయని ఇతడు వాదించాడు. వాస్తవానికి ఇందుకు వ్యతిరేకమైనదే సత్యం. రాజకీయ సమానత్వం ఓటువేసేహక్కు అందరికీ సమానంగా పంపిణీచేయడంవలన, ప్రభుత్వానికి ప్రజలకు మధ్య అసమానత్వం పెరిగిపోయింది. ప్రజల సార్వభౌమాధికారంపై వచ్చిన ప్రభుత్వాన్ని పడద్రోయుడంకంటే కష్టమయిందేమీలేదు. అత్యధిక సంఖ్యాకులు సమాజంలో దురదృష్టవంతులుగా ఉంటున్నారు. రాజకీయాలలో తమ గొప్పకోసం వాడుకోవాలనే ఆశ వారికి ఎక్కువగా ఉంటుంది (జేమ్స్ ఫిడ్జ్ జెమ్స్ స్టీఫెన్, లిబర్టి ఈక్వాలిటి వెటర్నటి).

ఉదారవాదం ఆదిలో ప్రారంభమయిన దశంకంటే ప్రయోజనావాదం చాలా ఎడంగాపోయింది. మానవుడు తన విధికి తానే నిర్మాతఅంటూ మానవుడి హక్కునుచాటిన మానవత్వ తత్త్వమది. ఈ హక్కు మానవుడికి ఉన్నదని విజ్ఞానం ఆధారంగా చాటారు. మానవుడు స్వేచ్ఛగా పుట్టాడనడం కట్టుకథ. కానీ స్వేచ్ఛగా ఉండేందుకు పుట్టాడనడం వాస్తవం. తన స్వేచ్ఛకై ప్రయత్నించే శక్తి ప్రకృతి అతడికి ప్రసాదించింది. ప్రతి మానవుడికి ఈ విమోచనాశక్తులున్నాయని ఉదారవాదం చాటింది. అందువలన స్వేచ్ఛ అతడి సహజహక్కు. లేకుంటే వ్యక్తివాదానికి అర్థం లేదు. ఉదారవాదంలోని మానవ సూత్రానికి బదులు, ప్రయోజనావాదం చట్టానికి

సంబంధించిన సమస్యలలో మానవ కారుణ్య ధోరణిని ప్రవేశపెట్టింది. అలాగే రాజకీయపరిపాలన సాంఘిక సంబంధాలలోకూడా ఇదే ధోరణిచూపింది. రాజకీయ సాంఘిక సంస్కరణలు కావాలన్నప్పటికీ అవన్నీ పైనుంచే రావాలని, వివేచన ఆధారంగా తెలివితేటలుగల శాసనకారులు వీటిని తేవాలని అన్నారు. ఇటువంటి వివేచనాత్మక విశ్వాసంతో, దయామయుడైన నిరంకుశ ప్రభువుపై కూడా ఆధారపడవచ్చు (బెంథాం స్వేచ్ఛను అంతగా పరిగణించలేదు. ఫ్రెంచి విప్లవానికి పూర్వం ఉన్న నిరంకుశులను అతడు శ్లాఘించాడు. మానవహక్కుల సిద్ధాంతమంటే అతనికి జుగుప్స ఉండేది. అవి అర్థరహితమనే వాడు– రస్సెల్. (హిస్టరీ ఆఫ్ వెస్ట్రన్ ఫిలాసఫి).

"మానవహక్కులు" అనేవి "అరాచక దోషాలు" అని బర్క్ వెల్లడించిన అభిప్రాయాలతో బెంథాం అంగీకరించాడు. సమానత్వంకంటే భద్రతకు హెచ్చు ప్రాధాన్యతను బెంథాం ఇచ్చాడు. "ఆనందానికి భద్రత ఉండాలికాని సమానత్వం కాదు. సమానత్వం రావాలంటే భద్రత హరించిపోతుంది. నా పొరుగువాడికంటే నా ఆస్తి ఎక్కువగా ఉన్నప్పుడు, దానిని తీసుకుపోతూ ఉంటే నాకు భద్రతలేదు. కనుక రెండు సూత్రాలకు సంఘర్షణ వచ్చినప్పుడు సమానత్వమే తక్కువ. భద్రత ప్రాథమికం. ద్వితీయ లక్షణంకంటే దీనికి ప్రాధాన్యత ఉండాలి." (ప్రిన్సిపుల్స్ ఆఫ్ పీనల్‌కోడ్).

బెంథాం భావాలు చిందరవందరగా ఉండగా వాటన్నింటినీ ఆస్టిన్ సమీకరించి క్రమబద్ధంచేసాడు. దానివలన ప్రాతినిధ్యపు ప్రభుత్వం ప్రజాస్వామిక ప్రభుత్వం కాదని స్పష్టంగా పేర్కొన్నట్లు తెలిసింది. ప్రాతినిధ్యపు పెత్తనంలోని భావాలు విశ్లేషిస్తూ ఆస్టిన్ తన నిర్ణయాలనిలా ప్రకటించాడు. ఇతరులను పరిపాలించే అధికారంగల వారితో ప్రభుత్వం ఏర్పడుతుంది. పాలకులకు పాలితులకు ఉన్న సంబంధం అంతా పాలితులు ఒడంబడి ఉండే ఆచారాన్నిబట్టి నిర్ధారణ అవుతుంది. బెంథాం ఉదారవాదంవలన ప్రభావితమయిన ఆస్టిన్ న్యాయ శాస్త్రంలో, దేవుడు ఎటువంటి నిబంధనలకు పరిమితం కాకుండా చట్టాన్ని రూపొందిస్తారు. అతడి శక్తి నిరోధించడానికి వీలులేనిది. (జాన్ ఆస్టిన్, లెక్చర్స్ ఆన్ జ్యూరిస్ ప్ర్యూడెన్స్). లండన్ యూనివర్శిటీలో ఆస్టిన్ తన ఉపన్యాసాన్ని ఇచ్చాడు. 19వ శతాబ్దపు ఉదారవాద కేంద్రంగా ఈ విశ్వవిద్యాలయం స్థాపితం అయింది).

19వ శతాబ్దపు ప్రయోజనావాదులు, వ్యక్తివాదంలో తమ విశ్వాసాన్ని ప్రకటించారు కానీ వాస్తవంగా సమష్టి వాదం వైపుకు మొగ్గుచూపారు. హ్యూం వివేచనా వ్యతిరేక ప్రాపంచానుభవవాద ప్రభావం క్రింద, వీరు సిద్ధాంతపరంగా సహజ నియమాన్ని తృణీకరించారు. వ్యక్తిస్వేచ్ఛ అనే ప్రజాస్వామిక సూత్రానికి తాత్త్విక ప్రమాణాన్ని ఈ నియమమే సమకూర్చింది. మళ్ళీ ఆచరణకు వచ్చేసరికి సాంఘిక

క్రమాన్ని కొనసాగించడం కొరకు వీరు సహజ నియమానికి పోయారు. (న్యాయం, స్వేచ్ఛవంటి విలువలకు ప్రమాణాన్ని సమకూర్చేది వివేచనాయుతమయిన సహజ నియమమే అయితే ప్రత్యక్షంగా చూడటంద్వారా దీన్ని అనుభవపూర్వకంగా రుజువు చేయలేం. అంతమాత్రాన తార్కిక భావాలన్నీ కేవలం మాటల ప్రతిపాదనలు కావు. వాటివెనుక అనుభవం ఉన్నది. ప్రపంచానుభవవాదం, హేతువాదాన్ని నాశనం చేస్తున్నది. ప్రపంచానుభవవాదంలో వివేచన అలౌకిక విషయం గావడమే ఇందుకు కారణం. అనుమాన ప్రమాణాన్ని తృణీకరించని ప్రాపంచికానుభవ వాదానికి, వివేచనను జీవ సంబంధంగా చూచే సహజ వివేచనావాదానికి విరుద్ధం ఏమీలేదు.) సమాజ సంక్షేమాన్ని వ్యక్తి ఆనందం దృష్ట్యానే వారు నిర్ణయించారు. అయితే వారి పెట్టుబడిదారీ విధానంలోని ఆర్థికాభివృద్ధి అధిక సంఖ్యాకులను నిస్సహాయులను గావిస్తున్న సంప్రదాయంగా వస్తున్న ఉదార భావాలు, వ్యక్తి సార్వభౌమత్వం, చట్టమూ సమానత్వం, స్వేచ్ఛా వ్యాపారం చౌరవ ఇత్యాదులన్నీ చట్టబద్ధమయిన కట్టుకథలుగాను, నిష్ప్రయోజనమయిన నినాదాలుగాను మారాయి. (లెస్లీ స్టీఫెన్ నిశితంగా పరిశీలిస్తూ బెంథాం చెప్పిన ప్రయోజనావాదం గురించి ఇలా చిత్రించాడు – "గౌరవంగల పౌరుడు పోలీసు సంరక్షణలో ఉంటాడు. అలాంటివాడు చిత్తశుద్ధే అత్యుత్తమ విధానాలనవచ్చు. అతడు వృద్ధురాలయిన తన తల్లిపట్ల చాలా సానుభూతిగా ఉండవచ్చు. కష్టాలలో ఉన్న స్నేహితుడిని ఆదుకోవచ్చు. కానీ ఉద్వేగ పూరితమయిన ఉన్నత ప్రవర్తన అంశమని అతడనుకోడు. వీరోచితుడు అతడికి తటస్థపడితే అదేదో మినహాయింపుగాను అసంబద్ధంగాను అనిపిస్తుంది. అతడు గనుక చరిత్రను పరిగణనలోకి తీసుకోకపోతే, తాను తృప్తిగా ఉంటున్న సమాజం ఎలా వచ్చిందో కూడా ఆలోచించడు. ఎంత విధేయత వీరోచిత చర్యలు ఆ సమాజానికి అవసరం అయ్యాయో గమనించడు. అతడికి న్యాయం చేకూర్చడానికి ఎటువంటి ప్రతిభలు అవసరం అవుతాయో తెలుసుకోడు–(ది ఇంగ్లీష్ యుటిలిటేరియన్స్). 19వ శతాబ్దపు ఉత్తరార్థంలో ప్రయోజనా ఉదారవాదం, అవినీతికి గురైంది. ఉదారవాదంలోని మూలసూత్రం అయిన వ్యక్తి సార్వభౌమత్వం, గౌరవం అనేవి సమష్టి విమర్శ ప్రభావానికి గురి అయ్యాయి.

హ్యూం సంశయవాద ప్రభావంతో కాంట్ కేవల వివేచనావిమర్శలు వ్రాసాడు. కాంట్ అతిభౌతిక ధోరణిని ఫిషె, హెగెల్ అభివృద్ధి చేసారు. సమవాద తత్త్వవేత్త హెగెల్ నుంచి, సంకుచిత జాతీయవాదం, విప్లవాత్మక కమ్యూనిజం ఉత్తేజాన్ని పొందాయి. అదే సమయంలో, హెగెలియన్ భావవాదిగా ఉదారవాదాన్ని తిరగదోడటానికి గ్రీన్ ప్రయత్నించాడు. బొసాంక్ మార్మికంగా చెప్పిన రాజ్యభావన, ఉదారవాదం స్వీకరించి, ప్రజాస్వామ్యాన్ని హతమార్చి, తాను ఆత్మహత్య చేసుకుంది.

పెట్టుబడిదారీవిధానం పతనంగావడానికీ ఉదారవాదం దిగజారి భ్రష్టంకావడానికీ సంబంధంలేదు. 19వ శతాబ్దపు చివరి దశలో పెట్టుబడిదారీ విధానం ఉచ్ఛస్థాయిలో ఉన్నది. ప్రయోజనావాదంపేరిట, సహజమయిన మానవతావాదంనుంచి, వైజ్ఞానిక హేతువాదంనుంచి, అతిభౌతిక పదార్థవాదంనుంచి దూరమైపోవడం వలన ఉదారవాదం పతనంచెందింది.

లోగడ ఉద్వేగవాదాన్ని వివేచనతో పదునుపెట్టడం సాధ్యం అయ్యేదికాదు. ఫలితంగా 19వ శతాబ్దపు తొలి రోజులలో విప్లవానంతర ప్రతిక్రియ ఏర్పడింది. ప్రయోజన ఉదారవాదం తిరోగమన నవ్య ఉద్వేగవాదానికి వ్యతిరేకంగా వివేచన చేసిన తిరుగుబాటుకు ప్రాతినిధ్యం వహించింది. అప్పుడు వివేచన ఉద్వేగవాదంతో ప్రజ్వరిల్లలేకపోయింది. పైనుంచి సాంఘిక రాజకీయ సంఘర్షణలను రుద్దాలని ప్రయోజనవాదం పథకం వేసింది. శాసనాలద్వారా సుఖాన్ని సృష్టించాలనుకున్నది. ప్రతి మానవుడు అనంతమయిన సృజనశక్తితోను, తన విధికి తానే నిర్ణేతగాను ఉంటాడని విశ్వసించలేకపోయింది. ప్రజాస్వామ్యం సాధ్యం కావాలంటే, ప్రజలయొక్క ప్రజలవలన ప్రజలకొరకు ప్రభుత్వమేర్పడాలంటే మానవుల సమానత్వాన్ని గుర్తించాలి. ప్రయోజనావాదపథకం ప్రజాస్వామ్యాన్ని వ్యతిరేకిస్తున్నది. ఏదో ఒకవిధమైన నియంతృత్వాన్ని అది ఆహ్వానించింది.

ప్రయోజనంతో కూడిన వివేచనావాదం, ఉద్వేగాన్ని ఊహను బాగా తగ్గించివేసాయి. మిల్స్ ఇరువురూ ఈ ధోరణికి ప్రాతినిధ్యం వహించారు. ఇందులో తండ్రి దృష్టిలో వివేచన అంటే ప్రశాంతంగా అంచనావేయడం. వాణిజ్యవర్గం సంపదతో విలసిల్లుతుండగా, అంచనావేస్తూ పోయిన ప్రయోజనవాదం వారికి ఒకధర్మం అనిపించింది. అదే లాభసాటిగా వారు పోషించారు. ఆర్థికరీతులకు సంబంధించిన వివేచనా నియమాలు అభివృద్ధిని, ముందే నిర్ధారించాయి, అత్యధిక సంఖ్యాకులకు అత్యంత మంచి అనేది ఈ సూత్రాల లక్ష్యంగా ఉన్నది. 19వ శతాబ్దంలో ప్రయోజనా ఉదారవాదానికి చెందిన మతేతర సృష్టి ప్రయోజనా క్రమంలో మానవుడికి స్వేచ్ఛ లేదు. వారు ఈ నూతన ఆర్థిక దైవానికి లొంగి ఉండాలి. అదృష్టవంతులయిన కొద్దిమంది తమ సంపద ఆధారంగా చొరవతీసుకుని స్వేచ్ఛావ్యాపారం చేయడం కూడా దైవికమైన ఆర్థిక నియమమే కారణం. న్యాయం సమానత్వం పేరిట వారి స్వేచ్ఛను అదుపులో పెట్టాలంటే అది మితిమీరిన ఉద్వేగం మాత్రమే. జేమ్స్‌మిల్ తదితర ప్రయోజనావాదులు ఈ వైఖరిని తీవ్రంగా ఖండించారు. వివేచనావాదాన్ని నీచంగా చూడటమే ఇందుకు కారణం అన్నారు.

జాన్‌స్టువర్ట్‌మిల్ తన తండ్రి అజమాయిషిలో విద్యాభ్యాసం గావించాడు. హెల్విటస్ సిద్ధాంతాన్ని ఆచరణలో పెడుతున్నట్లు ఇతడు నమ్మాడు. కానీ ఇతడు తండ్రికి నకలుగాతప్ప కొత్త వ్యక్తిత్వంగా రూపొందలేదు. తండ్రి మరణానంతరం జాన్ స్టువర్ట్‌మిల్, తండ్రి ప్రాభావాన్ని తొలగించి, జీవరహితమయిన ప్రయోజన హేతువాదంలో జీవం పోయడానికి ప్రయత్నించాడు. అప్పటి ఆవాదం సంపన్న మధ్య తరగతి సేవలో నిమగ్నమై ఉంది. ఇతడు బెంథాం కంటే హ్యూంకు సమీపంగా వచ్చి, ప్రయోజనావాదంపై హ్యూం చేసిన విమర్శవలన ప్రభావితుడైనాడు. ఫలితంగా అహంవాదానికి ఇతడంతగా ప్రాధాన్యం ఇవ్వలేదు. ఇతడు తండ్రి వివేచనావాదాన్ని గురించి సంకుచితంగా చేసుకున్న అవగాహనను ఇతడు నిరాకరించాడు. కోంటె ప్రత్యక్షవాదంవలన సూటిగా ప్రభావితుడైన స్టువర్ట్‌మిల్, కార్లైల్, కోల్‌రిడ్జ్‌వలన కూడా ప్రభావితుడయ్యాడు. వీరిరువురూ ఫిషె బోధించిన జర్మనీ సమష్టివాదం ఉదార ధోరణిని ఇంగ్లండుకు పరిచయం చేసారు. నవ్య ఉద్వేగ మితవాద ప్రభావం క్రిందకు వచ్చిన స్టువర్ట్‌మిల్ సోషలిజం వైపుకుకూడా మొగ్గాడు.

మిల్ వ్రాసిన ఎస్సే ఆన్ లిబర్టీ, పూర్తిగా అసంబద్ధలతో ఉండినప్పటికీ ఆకాలంలో మరే రాజకీయ శాస్త్రంకూడా చూపరాని ప్రభావం ఈ గ్రంథం చూపింది. ప్రయోజనవాద దోషాలవలన అసంబద్ధతలు జనించాయి. పెత్తందారీ వైఖరులకు నైతికంగా మద్దతునివ్వడం ద్వారా ఉదారవాదంలోని తాత్త్విక సూత్రాలను వ్యతిరేకించినట్లయింది.

మిల్ వ్రాసిన ఎస్సే ఆన్ లిబర్టీ, “విక్టోరియన్ కాలం రాడికల్ వాదానికి సంబంధించిన ఈర్ష్యలు అసూయలతో వ్యక్తం అయిన గందరగోళంగా” చిత్రించబడింది – ఫిడ్జ్ జేమ్స్ స్టీఫెన్, లిబర్టీ ఈక్వాలిటి వెటర్నిటి.

‘‘అభిరుచినిబట్టి మిల్ సూత్రాలను వాడుకోవచ్చు. నియంతృత్వాన్ని సమర్థించడానికి వినియోగించుకోవచ్చు. సామాజిక ప్రమాణమనే భావన చాలా ప్రమాదకరమయినదీ నియంతృత్వాన్ని సమర్థించేది కూడా. కొన్ని పరిస్థితులలో మనుషులను వారి ఇష్టానికీ వ్యతిరేకంగా కాపాడటం తప్పదని అంగీకరించడం వలన, నిరంకుశత్వానికి మిల్ సిద్ధంచేసి ఉంచిన ప్రాతిపదిక అందించినట్లయింది. విరుద్ధాత్వాలు లేకుండా చూడాలని ఆందోళన చెందడంలో వాస్తవ సంకల్పమనే భావానికి దరిదాపులలోకి వచ్చాడు. వ్యక్తిగత సంకల్పానికంటే ఇది ఆధిక్యత వహించినది. రాజ్యాధికార ప్రకటనలు ఇందులో వ్యక్తం అయినవి. జర్మన్ తత్త్వాలకు, అతి భౌతికాలకు ఇది ఆధారమంటారు. మిల్ ఉదారవాదం సర్వసాధారణంగా పై ధోరణిని సరిచేసినట్లు చెబుతారు. మతేతర ఉదారవాదం స్వేచ్ఛా సంకల్పంలో నమ్మకం

ఉంచినప్పటికీ, వాస్తవానికి నెమ్మదిగా సమష్టివాదంలోకి దిగజారింది. క్రైస్తవమతం పౌరహక్కుల కోసం పోరాడే అపరిచితపాత్రను నిర్వహించేదిగా తయారయింది”- దిటైమ్స్ లిటరరీ సప్లిమెంట్, జూలై 10, 1948.

ఆన్ లిబర్టీ అనే వ్యాసంలో మిల్, సంప్రదాయ ఉదారవాదానికి చెందిన తాత్త్విక సూత్రాలను కాకపోయినా, నైతిక ఆదర్శాలలోకి వెళ్ళాడు. బెంథాం హెల్విటస్‌కు చెందిన ప్రయోజనవాద నీతిశాస్త్రం శాసనసభలను సంస్కరించడానికి మార్గదర్శిగా ఉండాలని భావించారు. అందులో వ్యక్తిగతంగా అన్వయించడానికేమీలేదు. అత్యధిక సంఖ్యాకులకు అత్యంత మంచిని సాధించడమనేది ఓ ఒక్క వ్యక్తికీ సంభవించేది కాదు. ఆనందం వ్యక్తి ప్రవర్తనలో మౌలికమయినదని దోషపూరితంగా భావించారు. దీనికి నైతిక విలువల స్థాయిని సమకూర్చలేదు. నూతన నైతిక తత్త్వానికి విమర్శనా సిద్ధాంతంగా ప్రయోజనావాదం బయలుదేరింది. కానీ స్పష్టమైన ప్రత్యామ్నాయాన్ని అందించడంలో విఫలమయింది. బెంథాం చట్టాన్ని గురించి ప్రధానంగా ఆలోచించాడు. మానవతానీతి శాస్త్రానికి మనోవిజ్ఞాన పునాదులను నిర్మించే ప్రయత్నాన్ని హెల్విటస్ చేసాడు. L ESPRIT గ్రంథం నీతి శాస్త్రానికంటే విద్య, సంఘ సంస్కరణపై సిద్ధాంత గ్రంథం అనవచ్చు.

ఈ విషయంలో స్టువర్ట్‌మిల్ ప్రముఖపాత్ర వహించినా, ప్రయోజన వాదానికి పొంకగాలేని పాత్ర వహించాడు. సరైన ఉదారవాదాన్ని కూడా, పునరుజ్జీవన గావించలేకపోయాడు. ఆర్థిక రంగంలో సహజ నియమం” అవధులు లేకుండా పనిచేస్తున్న విధానాన్ని చూసి, నైతికంగా రెచ్చిపోయిన జాన్‌స్టువర్ట్‌మిల్, సంపదను సమానంగా పంపిణీ చేయడానికి శాసనబద్ధమైన అదుపు ఉండాలని కోరాడు. ఈ సూచన ఉదారవాదానికి అయిష్టం కాదు. అయితే మానవతా సూత్రాలు వ్యక్తి సార్వభౌమత్వాన్ని వదిలేసి సోషలిస్టు భావంలోని సమష్టితత్త్వానికి పోతే దారితప్పినట్లే. జాన్‌స్టువర్ట్‌మిల్‌లో అట్లాదారితప్పినట్లు పైకి స్పష్టంగా కనిపించదు. కొత్తగా వస్తున్న సోషలిస్టు భావాలను సానుభూతితో చూడటంవలన, వివేచనావాది అయిన ఇతడి తండ్రి ఆగ్రహావేశుడయ్యాడంటారు.

సోషలిజానికి సానుభూతి అనేది పెత్తందారీతనానికి సమర్థతగానూ వ్యాఖ్యానించవచ్చు. తార్కికంగా ఇదంతా ఉదారవాద దోషాలనుంచి వస్తుంది. మిల్ వ్రాసిన ఎస్సే ఆన్ లిబర్టీ ఆనాడు ఇంగ్లండులోని ఆలోచన రంగంలో జరుగుతున్న సంఘర్షణకు ప్రతిబింబం మాత్రమే. ఉదారవాద సూత్రాలలోని నైరూప్య భావాలకు, కేంద్రీకృత అధికారంగల ఆధునిక సామాజిక అవసరాలకు సమన్వయీకరణ చేయవలసిరావడం ఈ సంఘర్షణ జనించింది.

ప్రయోజన వాదంలో జాన్‌స్టువర్ట్‌మిల్ విపులీకరించిన దానినిబట్టి, అత్యంత ప్రధానమైన లక్షణమేమంటే, వ్యక్తిత్వాన్ని అభిలషించే నైతికవిలువల గుర్తింపు మాత్రమే. ప్రయోజనవాద రాజకీయ సిద్ధాంతంలో, వ్యక్తిగత హక్కుగా స్వేచ్ఛకు ఇంతటి ప్రాధాన్యతను ఎన్నడూ ఇవ్వలేదు. అత్యధిక సంఖ్యాకులకు అత్యంతమంచి అనే ఆదర్శపు హద్దులను దాటిపోయాడు మిల్. ఈ ఆదర్శంతో పొందికగా ఉండాలంటే స్వేచ్ఛాలోచన సమస్యపట్ల ఓల్తేర్ దృక్పథంగాని, జాన్ స్టువర్ట్‌మిల్ ధోరణిగాని అనుసరించడం సాధ్యం కాదు. సనాతన ప్రయోజనవాద సూత్రంవలన అల్పసంఖ్యాకులయిన 49 మందిని అణచివేయడం తార్కికంగా సమర్థనీయమే (51 అత్యధిక సంఖ్య గనుక) ఈ విధంగా నియంతృత్వానికి దారి నేర్పించారు. నియంతృత్వ రాజకీయ సిద్ధాంతాలు సమష్టివాద సాంఘిక సిద్ధాంతాలు రెండూ తర్కబద్ధంగా చూస్తే ఉదారవాదంలో దిగజారిపోయిన ప్రయోజన సూత్రంవలన వచ్చింది. సనాతన ఉదారవాదం ప్రయోజనవాద హద్దులలోనే ప్రజాస్వామ్యం సాధ్యం అయినప్పటికీ, దాని లోపభూయిష్టతవలన నియంతృత్వాన్ని సరిగా ఎదుర్కొనడం సాధ్యం కాదు.

గ్రీన్ పునరుద్ఘాటించినట్లు 9వ శతాబ్దపు ఉదారవాదం నియంతృత్వానికి తాత్త్వికవైఖరిని కల్పిస్తుంది. "స్వేచ్ఛగా ఉండేందుకు నిరాకరించే కొద్దిమంది అల్పసంఖ్యాకులకు వ్యతిరేకంగా సమాజానికంతటికీ ప్రాతినిధ్యం వహించే రీతులు ఇందులో ఉన్నాయన్నాడు. హెగెల్ ధోరణిలో గ్రీన్ ప్రత్యక్ష పరోక్ష స్వేచ్ఛల మధ్య తేడా చూపించాడు. ఒడంబడిక స్వేచ్ఛకు సంబంధించిన ప్రాచీన ఉదార సిద్ధాంతాన్ని విమర్శిస్తూ, హద్దులను తొలగించడంలో పొరుడి స్వేచ్ఛ లేదన్నాడు. అది స్వేచ్ఛకు పరోక్షభావంగా చెప్పాడు. ప్రత్యక్షస్వేచ్ఛ అంటే స్వయంగా గుర్తించే శక్తి ఉండటం. పొందికగా ఉండే సాంఘిక విధానంలోనే ఈ ఆదర్శాన్ని సాధించవచ్చు. (19వ శతాబ్దపు ఉదారవాదానికి సుప్రసిద్ధ తత్త్వవేత్తగా ఉన్న బెనడెటోక్రీబె స్వేచ్ఛను నిర్వచిస్తూ, హెగెల్ వైఖరిలో "నైతికాదర్శం" అన్నాడు. "ఆధునికకాలంలో స్వేచ్ఛ అంటే క్లిష్టమయిన అవకాశాలు అనే దశనుండి సహజమయిన హక్కనే స్థితికి వచ్చింది. ఈ నైరూప్య దశనుండి ఆధ్యాత్మిక స్వేచ్ఛ అనే భావానికి వెళ్ళింది. చారిత్రకంగా ఇదొక వ్యక్తిత్వానికి చెందినది. క్రమంగా ఈ సూత్రం పొందికగాను స్థిరంగాను బలపడి, తత్త్వంతోపాటు పెంపొందినది. ఉనికి నియమమే ఉండవలసిన నియమం అని వ్యాఖ్యానించారు" – ది హిస్టరీ ఆఫ్ ది నైన్‌టీన్త్ సెంచరీ యూరప్. ఆ విధంగా ఉదారతత్త్వాన్ని హెగెల్ ధోరణిలోకి మార్చడం అధికారికంగా ఒప్పుకున్నారు. స్వేచ్ఛకు సంబంధించిన నైతికాదర్శం ప్రపంచంలో దోషాన్ని పోగొడుతుందనే హామీలేదు, అంటూ వాదించేవారికి వ్యతిరేకంగా పోరాడటంలోనే నీతికి మనుగడ వాస్తవికత ఉన్నవి". అంటే పాపం

శాశ్వతం అన్నమాట. లోగడ మాలికాన్స్ ఇలానే బోధించారు. (స్వేచ్ఛా భావానికి సంబంధించిన ప్రత్యక్ష ధోరణిలో ఫలితాలు స్పష్టం. వ్యక్తిస్వేచ్ఛ సమాజంతో పొందికగా ఉంటేనే సాధించబడుతుంది. (T. H. గ్రీన్, లెక్చర్స్ ఆన్ పొలిటికల్ ఆబ్లికేషన్స్). రాజ్యాన్ని గురించి హెగెల్ సిద్ధాంతానికి ఇది ప్రతిధ్వని మాత్రమే. గ్రీన్ ఇంకా వెనుక్కువెళ్ళి అరిస్టోటిల్ భావించిన కార్పొరేట్ సమాజాన్ని పేర్కొన్నాడు. ఈ భావం ఉదారవాదం తలెత్తేవరకు మధ్యయుగాల రాజకీయ సిద్ధాంతాలలోను ఆవరించింది. వ్యక్తులతో సమాజం ఉంటుంది. అయితే భాగాలకంటే మొత్తం ఎక్కువ. కనుక మొత్తానికి ప్రాధాన్యత ఉండాలి. సమాజ సంక్షేమం అంటే సభ్యులకు మంచి జీవితం అని అర్థం. పొందికగా ఉండే సమాజ సభ్యులకు ప్రత్యక్ష స్వేచ్ఛ లభిస్తుంది, కనుక, వ్యక్తి స్వేచ్ఛకు ముందుగా సమష్టి సంక్షేమం, సమష్టి అంగీకారం ఉండాలి.

అయినప్పటికీ వ్యక్తి స్వేచ్ఛాభావాన్ని గ్రీన్ విడనాడలేదు. కాకపోతే అతడి దృష్టిలో సమాజానికి తెలివిగా సేవచేయడమా లేదా అనేదే చర్చనీయాంశం అయింది. సమాజానికి సేవచేయకపోతే అది పరోక్ష స్వేచ్ఛగా అతడు భావించాడు. వ్యక్తిస్వేచ్ఛకు ముందు సమష్టి సంక్షేమ ఉండాలనే అర్థం వచ్చేటట్లు ఉదారవాదానికి వ్యాఖ్యానం చేసాడు. ఫలితంగా సాంఘిక సేవతో కూడిన రాజ్యం అనే భావన వచ్చింది. ఫేబియన్ సమాజంవారు ఈ భావాన్ని స్వీకరించారు. బ్రిటిష్ లేబర్‌పార్టీ పుట్టుకకు ఆ విధంగా నాంది పలికింది.

గ్రీన్ తిరగదోడటం వలన ఉదారవాదం తప్పనిసరై తనకు వ్యతిరేక ధోరణిలో మితవాదానికి పయనించవలసి వచ్చింది. బొసాంకె ఈ వైఖరికి ప్రాతినిధ్యం వహించాడు. ఇతడు పూర్తిగా హెగెలియన్. రాజ్యంద్వారా నడుస్తున్న సమాజం అన్ని నైతిక విలువలకు ధర్మకర్త అన్నాడు. సభ్యులుకోరే వాటన్నింటికి ఈ వాదం ప్రాతినిధ్యం వహిస్తుంది. అయితే కలిసిఉండే విషాయాన్ని సభ్యులు గ్రహించాలి. నైరూప్య భావనతో కూడిన వ్యక్తివాదంకంటే అందరూ కలిసి ఉండేదే వాస్తవికం. (బి. బొసాంకె, ది ఫిలసాఫికల్ థీరీ ఆఫ్ స్టేట్). ఈ నియంతృత్వ సిద్ధాంతమే ప్రయోజన ఉదారవాదాన్ని దైవంగా ఆరాధించింది. లాంఛన ప్రాయమయిన ప్రాతినిధ్యపు ప్రజాస్వామ్యంనుంచి కూడా ఇలాంటి నియంతృత్వం అతి సులభంగా ఆవిర్భవించవచ్చు.

# నవ్య సంప్రదాయ వివేచనావాదం

18వ శతాబ్దపు సహజవాదం హేతుబద్ధమయినదేగాక, ఉద్వేగపూరితమైనది కూడా. సంప్రదాయ వివేచనావాదంలో యిమిడి ఉన్న అతిభౌతికతను నిరాకరిస్తూ, మానవుడిలోనే వివేచన ఉన్నదని, సహజవాదం చెప్పింది. పునర్వికాస సంప్రదాయంకూడా ఉత్తేజంపొంది, మానవుడి సార్వభౌమత్వాన్నిచాటి, సృజనాత్మక శక్తి అనంతంగా ఉంటుందని సహజవాదం పేర్కొన్నది. ఆధునిక విజ్ఞానాభివృద్ధితో సన్నిహిత సంబంధంగల సహజవాదం అనుసరించే పద్ధతి ప్రాపంచిక అనుభవం గలది. బ్రిటన్‌లో బర్క్‌లీ, హ్యూంలు భాష్యం చెప్పినట్లు, సహజవాదం అతిభౌతికతపై (సత్ లేదా ఉనికివాదం) సందేహాన్ని వెలిబుచ్చింది. వివేచనా వాదానికి వ్యతిరేకవాదంగా కనిపించింది. 18వ శతాబ్దపు సహజవాదం వివేచన ఆధారంగా నీతిశాస్త్రాన్ని పెంపొందించే ప్రయత్నం చేసింది. సామాజిక వ్యక్తిగత నీతికికూడా ఈ విధానాన్నే అనుసరించింది. హ్యూం వంటి ప్రాపంచిక అనుభవవాదులు ప్రోత్సాహపరచగా కావాలని చేయకపోయినా, వివేచనావాదాన్ని సందేహించడంవలన మతం ఒక్కటే నీతికాధారం అనే సంప్రదాయ విశ్వాసం తిరగదోడినట్లయింది. బర్క్ లీ తత్త్వంలో ప్రాపంచికానుభవవాదంలోనే ఇమిడిఉన్న వ్యతిరేకత వ్యక్తం అయింది. ఇదే ధోరణి రూసోలోని మార్మికమయిన ప్రకృతి ఆరాధనలలోను, తిరోగమన ఉద్వేగవాదంలోను చివరిదశకు చేరుకున్నది. హెగెల్ తత్త్వంలో తిరోగమన ఉద్వేగవాదం, సంప్రదాయ వివేచనావాదం కలిసిపోయాయి. ఆలోచనారంగంలో అదొక గీటురాయి. గ్రీక్ సంస్కృతిలో, సోక్రటీస్‌కు ముందుశకంలో అరిస్టోటిల్ విధానాలవలె, 19వ శతాబ్దంలో కూడా ఇంచుమించు అదే వైఖరి వ్యాపించింది.

19వ శతాబ్దంలో ఐరోపాలోని తాత్త్వికాలోచనకు జర్మనీ నాయకత్వం వహించింది. హ్యూం అనంతరం బ్రిటన్‌లోగాని విజ్ఞాన సర్వస్వకర్తల అనంతరం ఫ్రాన్సులోగాని గొప్ప తత్త్వవేత్త లేడు. “పాశ్చాత్య శక్తులన్నీ వాస్తవ జీవిత సమస్యలతోనే సతమతమైనాయి. ఈలోగా అతిభౌతికమంతా జర్మనీకి వదిలివేసారు.” (F. A. లాంజ్, హిస్టరీ ఆఫ్ మెటీరియలిజం).

పశ్చిమ ఐరోపా దేశాలన్నీ రాజకీయాభివృద్ధితో, భౌతిక సంపదతో అల్లుకుపోతుంటే, జర్మనీ – కవులకు తత్త్వవేత్తలకు పుట్టినిల్లుగా ఉండటానికి కారణం

ఏమిటి? మార్క్సిస్టులు మాత్రమే ఈ ప్రశ్నకు స్పష్టమైన సమాధానం చెప్పగలరు జర్మనీ సాంఘికంగా, ఆర్థికంగా చాలా వెనుకబడి ఉంది. జర్మనీ బూర్జువావర్గం అధికారాన్ని హస్తగతం చేసుకునేటంత బలవత్తరంగా లేదు. హెగెల్‌లో పరాకాష్ఠ అందుకున్న మార్మిక అతిభౌతిక వాదం, ఫ్యూడల్ సాంఘిక రీతులకు చెందిన సిద్ధాంతపరమైన ఉపరితల నిర్మాణం మాత్రమే. అది జర్మనీలో ఇంకా కొనసాగుతున్నది.

చరిత్రను ఇంత సాధారణంగా చెప్పడానికి వాస్తవాలు ఒప్పుకోవడంలేదు. బూర్జువావర్గం తలెత్తడానికి సంస్కరణవాదం కారణం అంటారు. పెట్టుబడిదారీ సాంఘిక వ్యవస్థకు కూడా ఇదే సిద్ధాంతపరమయిన పునాదులు వేసింది. జర్మనీలో ఈ సంఘటన ఆ దేశంపై ఎక్కువ ప్రభావాన్ని చూపించడం ఇతరదేశాలకంటె ఫలితాలిక్కడ భిన్నంగా ఉండటం సహజం. సంస్కరణవాద ప్రభావం స్పష్టంగా ఉన్నట్లు కాంట్, హెగెల్ తత్త్వాలు చూపుతున్నవి. రూసో సహితం జెనీవాలోని కాల్విన్ విధానాన్ని శ్లాఘించినవాడే. ఇతడి ప్రభావం జర్మనీ తత్త్వవేత్త లిరువురిపైనా ఉన్నది. కాంట్, హెగెల్ ఇరువురూ వైజ్ఞానిక సంస్కరణ వాదులుగా, 18వ శతాబ్దంలో ప్రారంభించి, ఫ్రెంచి విప్లవాన్ని సమర్థించినవారే. జర్మనీలో ఫ్యూడల్ ప్రభువులపై నెపోలియన్ విజయాన్ని వారాహ్వానించారు. కాంట్, హెగెల్ తత్త్వాలను నిష్పాక్షికంగా అభినందించాలంటే, మధ్యయుగాలలో ఆధిపత్యం వహించిన మతజ్ఞానాన్ని త్రోసిరాజన్న "కొత్త తాత్త్విక" సంప్రదాయంలోనే వీరిరువురూ ఉన్నారు. "ఆధునిక ఆలోచనవైపుకుపోయే సంధియుగాన్నే కాంట్ అనవచ్చు". (జాన్ డ్యూయి, జర్మన్ ఫిలాసఫీ అండ్ పోలిటిక్స్). వికో "నవ్యవిజ్ఞానం"ను హెగెల్ పెంపొందించాడు. అది మార్క్సుకు అందించగా, అతడు రానున్న కార్మిక విప్లవాన్ని ఊహించాడు. కమ్యూనిజానికి ప్రవక్త అయిన మార్క్స్, క్రైస్తవమత ప్రవక్త జాన్ వంటివాడు.

"నేటి ప్రధాన భావాలన్నీ జర్మనీలో 1780 నుంచి 1830 వరకు జనించాయి" (TAINE) ఈ కాలంలో కాంట్ జీవితంలో చివరిదశ, హెగెల్ జీవితం యావత్తూ ఆవరించి ఉన్నవి. పునర్వికాసం సంస్కరణవాదం నుంచి ప్రవహించిన ఆలోచనా స్రవంతులు ఆధునిక ఐరోపా మేధావులకు ఆధారమైనవి. ఈ సంపదలో కాంట్, హెగెల్ కాలానికి చెందిన జర్మనీ తత్త్వపువంతు కూడా ఉన్నది.

30 సంవత్సరాలు యుద్ధంవలన అలసిపోయిన జర్మనీ అన్నిరంగాలలోను అభివృద్ధిలో వెనుకంజ వేసింది. అయినప్పటికీ 17వ శతాబ్దపు మేధస్సు పరిమళాలు ఇక్కడ సోకకపోలేదు. అందరూ అనుకునే దానికంటే, లెబ్నిజ్ తత్త్వంలోని రెండు మౌలికభావాలు ఉదారవాదంపై చాలా ప్రభావాన్ని చూపెట్టాయి. విశ్వానికి మూల పదార్థ అంశావాదం (Manadology) అనేది ప్రధానంగా భౌతిక సిద్ధాంతం. దీనికి

సాంఘికమయిన ప్రభావం ఉన్నది. ఎపిక్యూరస్ సంప్రదాయంలోని వ్యక్తివాదానికి తాత్త్వికంగా లెబ్నిజ్ వాదం మద్దతునిస్తుంది. ముందే పొందిక కుదిర్చి ఉన్నదనే భావంవలన, వ్యక్తి స్వేచ్ఛకు సాంఘిక వ్యవస్థకు, సమన్వయం సాధ్యమని చెబుతున్నది.

లెబ్నిజ్ అనంతరం, లాక్ ఉదారవాదానికి చెందిన స్పష్టమయిన సహజ సిద్ధాంతాన్ని జాన్ టోలెండ్, జర్మనీలో ప్రవేశపెట్టాడు. స్పినోజా తత్త్వానికి చెందిన ప్రష్యారాణి సోఫీ ఛార్లెట్, ఇతడికి స్నేహితురాలయింది. క్లాప్‌స్టాక్ కాలంనుంచీ జర్మనీ కవితలో వివేచనారహిత ఉద్వేగవాదం ఆత్మాశ్రయ ఆదర్శవాదం ఆధిపత్యం వహించింది. స్పినోజా, లాక్ ప్రభావం కాంట్‌కు ముందున్న తత్త్వంపై చాలావరకు పనిచేసింది. ఆనాడు వైజ్ఞానిక సంస్కరణ వాదానికి, లేదా, భౌతిక తత్త్వానికి వ్యతిరేకంగా వాదోపవాదాలతో కూడిన సాహిత్యం చాలా వెలువడింది. దీనినిబట్టే జర్మనీ మేధావులలో భౌతికవాద ప్రాధాన్యతను గమనించవచ్చు. నీతిశాస్త్రం రామణీయకతలను మినహాయిస్తే కాంట్ తత్త్వం వైజ్ఞానిక సహజవాదానికి, పదార్థతత్త్వానికి ఎంతో తోడ్పడింది. అయినప్పటికీ భౌతికవాదాన్ని తుడిచిపెట్టడమే కాంట్ విధానలక్ష్యమని నమ్మారు.

పునర్వికాసం నుంచి వెలువడిన వివేచనా స్రవంతి, దానికి మద్దతుగా 17వ శతాబ్దపు సంప్రదాయ వాదానికి ప్రాతినిధ్యం వహించిన లెబ్నిజ్, లెస్సింగ్ తత్త్వం పేర్కొనతగినవి. వివేచనా సంప్రదాయాన్ని ఇంకా బాగా పెంపొందించడం హెర్డర్‌లో చూడవచ్చు. ఈ ధోరణి మానవతా చారిత్రకవాదాన్ని అభివృద్ధిపరచిన వికోలో, ఉద్వేగవాదంగా వెల్లడైంది. సామాజికాభివృద్ధికి ఇదొక జీవసంబంధమయిన భావన అనవచ్చు. జీవపరిణామానికి సారాంశం పొందికగా ఉండటమేనని లెబ్నిజ్ నుంచి నేర్చిన లెస్సింగ్, ఆ తరువాత హెర్డర్, జర్మనీలో చారిత్రక దృష్టిని ప్రవేశపెట్టారు. ఇటువంటి దృష్టి ఫ్రెంచి జ్ఞానవికాసంలో కూడా పూర్తిగా లేదు. ఈ భావాన్ని హెగెల్ స్వీకరించి నవ్య సంప్రదాయ వివేచన మూసలో పోసాడు. దీని ఫలితంగా ఒక సమగ్ర తత్త్వం అవతరించింది. ఆ తత్త్వం ఒక శతాబ్దంపాటు ఐరోపా మేధావి జీవితాన్ని ప్రభావితంచేసింది. ఈనాటికీ మార్క్సిజంద్వారా ఆ ప్రభావం కొనసాగుతున్నది. అదే సమయంలో, కాంట్ ద్వారా, హెగెల్ సంస్కరణవాద సంప్రదాయంలోని పవిత్ర ధోరణిని సంక్రమింప చేసుకున్నది.

18వ శతాబ్ద తత్త్వంలో ప్రాపంచికానుభవవాదం కీలకస్థానం వహించింది. ప్రాపంచానుభవధోరణి ఖచ్చితంగా అనుకరిస్తే ఆత్మాశ్రయవాదానికి దారితీస్తుంది. తార్కికంగా దీని ఫలితమే ఆత్మ పరిమితవాదం. డేకార్ట్ వివేచనావాదంలోకూడా ఈ వైఖరి గర్భితంగా ఉన్నది. నేను ఆలోచిస్తున్నాను కనుక నేను ఉన్నాను. అనే సూత్రం ఆధారంగా డేకార్ట్‌వాదం ప్రారంభం అయింది. డేకార్ట్‌తత్త్వం ఆత్మాశ్రయవాదం, లెబ్నిజ్

చిదంశవాదంలో తుదిస్థాయికి చేరుకున్నది. ప్రపంచం అంతా తుడిచిపెట్టుకుపోయినా సరే చిత్తంలోని అనుభవంలో మార్పుండదని, దానికి ఎక్కడా ప్రవేశద్వారంలేదని అతడు చెప్పాడు. ఇటువంటి ఆత్మపరిమితి వాదం పరిణామంనుంచి లాక్ తప్పించుకుని స్పష్టమయిన ప్రాపంచానుభవవాదాన్ని వ్యక్తీకరించాడు. భావాలకు సంబంధించిన అతని సిద్ధాంతం ఇంద్రియజ్ఞానం మనస్తత్వం నుంచి, జ్ఞాన సిద్ధాంతం నుంచి వేరేమార్గాన్ని అనుసరించింది. బర్క్లీ చెప్పినదాని ప్రకారం ప్రాపంచానుభవవాదానికి, అతిభౌతికవాదం ఉండేందుకు వీలులేదు. బిషప్ మతపరమైన అసూయవలన, ప్రాపంచానుభవ తత్త్వవేత్త ఆత్మ కేంద్రవాదాన్నుంచి తప్పించుకున్నాడు. కేవల ప్రపంచానుభవంలో శూన్యవాదం ఇమిడి ఉన్నది. ప్రత్యక్షానుభవవాదానికి అందని దానివలన ప్రభావితం కావడంగాని, అటువంటి ఆలోచన, నిర్ణయం అనుమతించడంగాని జరుగదు. ఈ విషయాలను హ్యూం బాగా ఆలోచించాడు. అతడి తార్కిక సంశయవాదం చాలా నిక్కచ్చి అయినది. అందరి నిర్ణయాలన్నీ సామాన్య ఆలోచనకు జుగుప్సాకరమయినది. ఆత్మీయ కేంద్రవాదాన్నుంచి హ్యూం తప్పించుకున్నాడు. కానీ బేకెన్, డేకార్ట్ పెంపొందించిన ఆధునిక వివేచనా తత్త్వాన్ని నాశనం గావించాడు.

ఫ్రాన్సులో వివేచనపై రూసో చేసిన తిరుగుబాటు ఉద్రేకపూరితమైన ఉత్సాహాన్ని ఎదుర్కొనవలసి వచ్చింది. విజ్ఞాన సర్వశ్వకారుల శాస్త్రీయ సహజవాదం తెరవెనుక్కు పోయింది. విప్లవానంతరం మార్మిక మతపరమైన ఉద్వేగవాదం తాత్త్వికాలోచనకు గ్రహణం పట్టించింది. 18వ శతాబ్దంలో గొప్ప తత్త్వవేత్తగా పేరొందినవాడు తాత్త్వికాలోచనలను అసంభవం క్రింద జమకట్టాడు. అట్లాంటి పరిస్థితులలో, బ్రిటన్ ఫ్రాన్సులలోని సృజనాత్మక శక్తివంతులంతా ప్రకృతిలోని భిన్న సంఘటనలను గురించి అన్వేషణ ప్రారంభించగా సత్ఫలితాలు అనేకం వచ్చాయి.

జర్మనీలో తత్త్వానికి పునరావాసాన్ని కల్పించే బాధ్యత కాంట్ స్వీకరించగా, హెగెల్ పూర్తిచేసాడు. 18వ శతాబ్దంలో ప్రపంచానుభవ వాదానికి హ్యూం ఎలాగో, సంప్రదాయ వివేచనాయుత భావవాదానికి హెగెల్ తత్త్వం కూడా అట్లాంటిదే. వివేచనకూ, విశ్వాసానికీ ఉన్న విచక్షణను హ్యూం తొలగించాడు. హెగెల్ జీవికి, అజీవికి తాదాత్మ్యం చూపించాడు. అతడు తత్త్వాన్ని మళ్ళీ నిలబెట్టాడు. అంటే బేకన్‌నుంచి డేకార్ట్ వరకూ, ఆ తరువాత ఫ్రెంచి విజ్ఞాన సర్వస్వుల వరకూ, అనేకమంది ఆలోచనాపరులు పరంపరానుగతంగా వేసిన ప్రాతిపదికలాధారంగా హెగెల్ తత్త్వాభివృద్ధికి దోహదం చేసాడు. భౌతిక, జీవశాస్త్రాల ప్రత్యక్ష జ్ఞానంవలన లభించిన విషయాలు కూడా ఇందుకు దోహదం చేసాయి.

ఆలోచన, జ్ఞానం అనేవాటికి ముందు అజీవ, జీవ ఉనికి ఉండటం అవసరం. ఇంత స్పష్టమయిన విషయాన్ని గ్రహించకపోవడంలోనే డేకార్ట్ విధానంలోని లోపమని చెప్పవచ్చు. అహం అనేది కొంతవరకూ లేదా తాత్కాలికంగా, బాహ్యంగా వ్యక్తం అయితేతప్ప, స్వీయచైతన్యత సాధ్యంకాదు. ఆలోచననుంచి జీవిని డేకార్ట్ రాబట్టాడు. కానీ ఆలోచనను అతడు విశ్లేషించలేదు. ఆలోచనకు బైటివిషయాలు అవసరం అని గ్రహించలేదు. అహం ఏదో ఒకదానిని గూర్చి ఆలోచిస్తుంది. అది స్వంతాన్ని గురించికూడా కావచ్చు. అట్లాంటప్పుడు అహం అనేది బాహ్యంగా మారి, ఆలోచనకు వస్తువు అవుతుంది. డేకార్ట్ విధానంలో రెండవ దోషం ఏమంటే, మనసుకు పదార్థానికి అనూహ్యమయిన అఘాతాన్ని వూహించడమే. తత్త్వాన్ని కాపాడిన వ్యక్తి ఆలోచనారీతిలో ఇది తప్పిపోయింది. డేకార్ట్ ఆలోచననుంచి జీవిని రాబట్టాడు. కాని అవి రెండూ భిన్న సుగుణాలన్నాడు. వాటిని కలపడానికి సాధ్యం కాదన్నాడు. నేను ఆలోచిస్తున్నాను కనుక నేను ఉన్నాననే సూత్రంలో ఆత్మాశ్రయ వాదాన్ని తత్ఫలితంగా వచ్చిన శూన్యవాదాన్ని తప్పించుకోవడానికి, ద్వంద వాదాన్ని నిరంకుశంగా ప్రవేశపెట్టాడు. డేకార్ట్ ద్వంద వాదంవలన బాహ్యజ్ఞానం ఉండదు. అతిభౌతిక తత్త్వం వూహ క్రిందకు మారుతుంది. నైరూప్య శూన్య భావాలు మిగులుతాయి. తత్త్వం నాశనం అవుతుంది. బర్క్‌లీ సూచించినట్లుగా ఇంద్రియజ్ఞాన వాదంలో ఇట్లాంటి ప్రాధాన్యతే ఉంది. డేకార్ట్ ద్వందవాద సంప్రదాయ ప్రభావాలను, హ్యూం అతిభౌతికంపై తిరగబడి, తన ప్రపంచానుభవ వాదంతో, తాత్త్విక పునాదులను పటాపంచలు చేసాడు.

వ్యక్తికి వస్తువు ఉన్న సంబంధం తత్త్వంలో ఒక క్లిష్టసమస్య అయింది. కాంట్ దీన్ని పరిష్కరించబోయి విఫలం అయ్యాడు. అతడుకూడా ప్రపంచానుభవ వైఖరిలో పోవడమే ఇందుకు కారణం. ప్రపంచంలో ద్వందవాదాన్ని ఉన్నదనుకొని, ఈ రెండింటి పరస్పర సంబంధంవలన జ్ఞానం జనిస్తుందని కాంట్ చెప్పాడు. గుణంలో భిన్న ప్రపంచాలకు చెందిన రెండింటిమధ్య చర్య ఉండాలంటే అనుభవానికి ముందే జ్ఞానం ఉండే మానసికరీతులను కాంట్ ప్రవేశపెట్టాడు. అనుభవ ప్రపంచం మానసిక సృష్టికాదు. వాస్తవ విషయాలకు సరైన చిత్రణకూడా కాదు. కనుక జ్ఞానం, అహానికి సంబంధించిన స్వంత ధ్యానం కాకపోయినా, యదార్ధ వస్తువుకు సంబంధించిన జ్ఞానంకూడా కాదు. అనుభవానికి వచ్చిన మేరకి జ్ఞానం ఉంటుంది. కనుక ఈ రెండు ప్రపంచాల మధ్య ఐక్యత అనుభవానికి చెందిన విషయం. అవి వ్యక్తిగతమయిన భావాలు. బాహ్యంగా చూస్తే, ద్వంద విధానం ఉంటుంది. న్యూటన్ శిష్యుడుగా ఆరంభించిన కాంట్ 18వ శతాబ్దంలో ప్రకృతి తత్త్వాన్ని నిరాకరించాడు. ఇది మధ్యయుగాల అతిభౌతికననుసరిస్తూ, కేవల జ్ఞానమని ఎండమావులను వెతుకుతుందన్నాడు. అదొక తప్పుడు దోషారోపణ.

వైజ్ఞానిక సమాజవాదం జ్ఞానానికి బాహ్యసత్యాన్నే కోరింది. బాహ్యజ్ఞానం కేవల జ్ఞానం కాదు. మనసుకు తెలిసిందల్లా అనుభవానికి ముందున్న ఆలోచనా రీతులేనని కాంట్ వాదించాడు. యదార్థ వస్తువులను అసలు తెలుసుకోలేదు. తెలియక పోవడమే కాదు, అది తెలియరానిది కూడా. ఇందలి భావం ఏమంటే జ్ఞానం ఆత్మాశ్రయం. అంటే బాహ్య సత్యం లేదు. సత్యం కనుక వ్యక్తిగతమయితే అది సాపేక్షతతో కూడినది. అట్లాంటప్పుడు విలువల తరతమభేధాలన్నీ కుప్పకూలిపోతాయి. కనుకనే కాంట్ తన విధానానికి పిడివాదంతో కూడిన నీతిశాస్త్రాన్ని ఆధారంగా చేసుకున్నాడు.

కాంట్ జర్మనీలో కనుగొనిన తత్త్వం, 18వ శతాబ్దపు సహజవాదాన్ని తృణీకరించడానికి కారణం, సంస్కరణవాద సంప్రదాయమే. పునర్వికాసం, మానవతా సంస్కృతీ చరిత్రవలన సంస్కరణవాదం ఉత్తేజం పొందింది. ఫ్రెంచి విప్లవాన్ని తొలిదశలో సమర్థించిన కాంట్, జ్ఞానవికాసంతో విభేదించాడు. మానవుడు స్వతహాగా మంచివాడనే మానవతా విశ్వాసాన్ని, అతడు నిరాకరించాడు. లూథర్‌ను అనుసరించి, ఆదిలో పాపం ఉన్నదనే సిద్ధాంతాన్ని ఇతడు నమ్మాడు. కాంట్ పిడివాదపు నీతిశాస్త్రానికి ఈ తాత్త్విక వ్యాఖ్యానమే ప్రాతిపదిక అయింది. మతపక్షపాత విషయాలనుంచి, లూథర్ అనంతరం రెండు శతాబ్దాల తరువాత నివసించిన కాంట్, విద్యాధికుడుగా, విజ్ఞానాభివృద్ధిని త్రోసిరాజనలేక పోయాడు. మోహం, ఇంద్రియేచ్ఛాలన్ని వాటంతటవే దోషాలని అతడు భావించలేదు. అయితే మానవ ఉనికికి వూతాన్నిచ్చే విధికి వ్యతిరేకంగా ఇవి పనిచేసాయన్నాడు. కనుక అవి దోషాలు. అవి జీవసంబంధమయినవి కనుక మానవుడు స్వభావ సిద్ధంగా దోషపూరితుడు. జీవిలో అంతర్గతంగా ఉన్న దోషాలకు వ్యతిరేకంగా నిరంతర పోరాటం సాగించడం నీతికి ప్రాతిపదిక చేస్తుంది. అప్పుడు మానవుడు చట్టానికి లోబడి తన కర్తవ్యాన్ని నిర్వహిస్తాడు. ఇటువంటి నీతిశాస్త్రానికి ప్రమాణంగా తప్పనిసరిగా చేయవలసిన వాటిని పేర్కొనవలసి వచ్చింది.

తాత్త్వికంగా కాంట్ పేర్కొన్న రెండు ప్రపంచాల పిడివాదపు నీతిశాస్త్రానికి దారితీసాయి. వ్యక్తికి వస్తువుకి మధ్య సంబంధాన్ని గురించి చెప్పడంలో ప్రాపంచిక అనుభవ దృక్పథాన్ని ఇతడు అనుసరించడం వలన, దోషపూరితమయిన ఈ విధానం మరొక ద్వందవాదానికి దారితీసింది. విజ్ఞాన ప్రపంచం, నైతికలోకం వేరే ఉందని కాంట్ అన్నాడు. ఈ విచక్షణకు వివేచన ఇంద్రియాతీతమయినది. దీనిని గురించి ఎవరైనా, "వివేచనే దైవవాణి" అని వ్యాఖ్యానిస్తే తప్పులేదు. కాంట్ నిశితతత్త్వం మతంలో తేలింది. తప్పనిసరిగా పాటించవలసిన కర్తవ్యాల వలన కాంట్ వాటిని వివేచన పేర్కొన్నదని అవి నైతిక విలువలతో కూడినవని చెప్పాడు. "విశ్వాసానికి చోటు కల్పించే నిమిత్తం దైవజ్ఞానాన్ని, స్వేచ్ఛను, అమరత్వాన్ని తృణీకరించడం అవసరమని భావించారు."

కాంట్ మతాన్ని సంస్కరించే ప్రయత్నంలో తన భావాలకు, ఆదర్శాలకు నైతిక ప్రమాణాలు కనుగొనడం ఆరంభించాడు. అవతారం, సృష్టి ఆదిలో పాపం, క్షమాభిక్ష అనే పిడివాదపు సిద్ధాంతాలను తాత్త్వికంగా హేతుబద్ధం గావించాడు. చారిత్రకంగా సంస్కరణవాదాన్ని పూర్తిగావించాడు. సాహిత్యపరమైన వ్యాఖ్యానాన్ని కాంట్ తృణీకరించాడు. కానీ మానవుడి ద్వంద స్వభావానికి ప్రతీకలుగా వాటిని సమర్థించాడు. సాహిత్యపరంగాను, కాలానుగుణంగాను ఇవన్నీ ప్రపంచపరమయినవని, నైతికంగా పారమార్థికాలని అన్నాడు. మతపరమైన క్రతువులకు, మతాధికారానికి, శిక్షించడం బహూకరించడంలోని విశ్వాసానికి కాంట్ పవిత్రమయిన గౌరవాన్ని చూపాడు. అవన్నీ నైతిక సత్యాలకు చిహ్నాలన్నాడు. మతపరమైన పిడివాదాలను కాంట్ ఒకవైపున నిరాకరిస్తూనే, మరొకవైపున – “శాశ్వత ఆధ్యాత్మిక సత్యాలకు సాధనలుగా, అంతరాత్మ కాపాడేవిగా” వాటిని భావించాడు. మతాధికారులు ధరించే వస్త్రాలను సైతం కాంట్ గౌరవిస్తూ “మానవుడి ఆత్మలో ఉన్న అధికారాన్ని అందరూ గౌరవించడానికి ఇవి తోడ్పడుతున్నాయన్నాడు. “తత్త్వాన్ని అంతటినీ కంపింపచేసిన కాంట్, నైతికశాస్త్రంలో, “దేవతల తిరుగుబాటు” సంప్రదాయం వలన ప్రభావితుడైనాడు. ఈ సంస్కరణవాదం మతాన్ని మళ్ళీ పునరుద్ధరించి, అలౌకిక వివేచనాధారంగా పిడివాదంతోకూడిన నీతివైపు మొగ్గుచూపాడు. “మానవుడి తిరుగుబాటువలన” ఆధునిక నాగరికత ఉత్తేజంపొంది సాంస్కృతిక విలువలను, మేధస్సు రంగానికి పునరావాసం కల్పించగా, కాంట్ వాటన్నింటినీ పెకలించే ప్రయత్నం చేసాడు. కాంట్ నవ్యద్వందవాదంవలన, రెండు ప్రపంచాల సిద్ధాంతం వలన జర్మనీలో నాగరికత, సంస్కృతి అనేవి ఆచారాలుగా మారాయి. సంస్కృతి అని సాధారణంగా భావించేదానికి, జర్మనులు పేర్కొనే సంస్కృతికి చాలా తేడా ఉన్నది. (T. S. ఇలియట్ నోట్స్ టువర్డ్స్ ది డిఫినిషన్ ఆఫ్ కల్చర్ అనేది ఒక మినహాయింపు). నాగరికతకు జర్మనీ సంస్కృతికి గుణంలో చాలా తేడా ఉంది. నాగరికత లౌకిక ప్రపంచానుభవంకాగా, జర్మనీ సంస్కృతి మార్మికమయిన నైతిక పిపాసలను జనించింది. ఇది అలౌకిక ప్రపంచానికి చెందినది. కాంట్ ననుసరించి అంతరాత్మ క్రమంగా విద్యాధికలు చేయడంద్వారా జర్మనీ సంస్కృతి జనించింది. సమాజంలో భాగంగానే వ్యక్తి ఈ సంస్కృతిలో పాలుపంచుకొంటాడు. ఆ విధంగా కాంట్ పేర్కొనే జర్మనీ సంస్కృతి, నాగరికతకు విరుద్ధమయినది. మానవాళి మనుగడకు సంబంధించినది నాగరికతకాగా, తద్భిన్నంగా, సమాజానికి చెందిన అంతరాత్మ వలన జర్మనీ సంస్కృతి జనించింది. అవి వ్యక్తిపరంగా ఉండవు. “కర్తవ్యానికి బాధ్యతవహించే సమాజాన్ని” ఈ సంస్కృతి ఆవరిస్తుంది. (రాజకీయంగా కాంట్ ప్రజాస్వామికుడు, పౌరహక్కులను సంరక్షించాలన్నవాడు. అయినప్పటికీ సంస్కర సంప్రదాయాన్ననుసరించి, తాత్త్వికంగా, సమష్టివాద ప్రవక్త అయ్యాడు. బుర్జువా విప్లవానికి నాందిగా

సంస్కరణవాదం వచ్చిందనడం చరిత్రకు సంబంధించిన తప్పుడు దోషభావన అనవచ్చు. వ్యక్తివాదానికి సమష్టివాదానికి అందులో ప్రమాణం కల్పించబడింది. మానవుడిలో భావచైతన్యానికి మూలం ఉన్నప్పటికీ, ప్రయోజనావాదంతోకూడిన చరిత్రముందే నిర్ధారితమయిన నమూనాలలో ఇది ఇమడదు).

నాగరికతకు భిన్నంగా తిరోగమన మార్మిక భావనగా వచ్చిన సంస్కృతిని రూసో అంగీకరించినట్లే కాంట్ కూడా ఆమోదించాడు. ఆటవికత్వాన్ని ఆదర్శప్రాయం అన్నాడు రూసో. సాంస్కృతికంగాను, మనోదృక్పథంలోను, కాల్విన్‌వాదానికి చెందినవాడు. కనుకనే పునర్వికాసానికి చెందిన మానవతా సంప్రదాయాన్ని కూడా అతడు కాదన్నాడు. ప్రజాస్వామ్య ప్రవక్తగా శ్లాఘించబడిన రూసో, సమష్టివాదాన్ని ప్రస్తుతించాడు. ప్రకృతిని దైవంగా చూచిన రూసో దృక్పథం వలన, సమాజపు ఆత్మనుంచి సంస్కృతి జనిస్తుందనే భావన జర్మనీలో పెంపొందడానికి సహకరించింది. రూసో ప్రభావం క్రింద, జర్మనీ ఉద్వేగవాదులు "భౌతిక నాగరికతను ఖండిస్తూ నైతికంగా అవినీతికరమని సాంఘికంగా విచ్ఛిన్నకరమని అన్నారు.

19వ శతాబ్దపు జర్మనీ తత్త్వంలో నాగరికతకు సంస్కృతికి తేడాను చూడటం, సమాజానికి రాజ్యానికి విచక్షణ చూపడం, రెండు విలక్షణాలు. ఒకదానినుంచి మరొకటి తాత్త్వికంగా జనించింది. సమాజం, అందలి భౌతిక ప్రగతి నాగరికతగా భావించి అదంతా ఈ లోకానికి చెందినదన్నాడు. సంస్కృతి, రాజ్యమనేవి నైతిక ప్రపంచానికి చెందాయన్నాడు. సమాజ ధోరణిలోని మార్మికమయిన అనుభవానికి చెందిన సంస్కృతి, అత్యున్నత స్థాయిలో సృష్టించినదే రాజ్యం. ఇది అతిభౌతిక నైతిక విధానం. కాంట్‌లో రాజ్యభావన అస్పష్టంగానే ఉన్నది. 18వ శతాబ్దంలోని వ్యక్తివాద ప్రభావాన్ని అతడు పూర్తిగా కదిలించలేకపోయాడు. ఇతడి ఆలోచనా రీతులను అందుకున్న హెగెల్, తన రాజకీయ తత్త్వంలో రాజ్యాన్ని అత్యున్నత నైతిక స్థాయికి తీసుకపోయాడు.

"స్వేచ్ఛకు సంబంధించిన నైతిక రంగం" ఏమేరకైతే "ప్రకృతిలోని ఇంద్రియ పరిధిని" ప్రభావితం చేయగలదో అంతవరకు కాంట్ ద్వందవాదం కొంత తక్కువ స్థాయిలోనే ఉన్నది. ఇంద్రియ లోకం తక్కువ స్థాయిది కనుక నైతికస్థాయి సార్వభౌమత్వంపై ప్రభావముండదు. కాంట్ నిర్మించిన ఈ వారధి ఆధారంగా ఫిషె, తన సంకల్ప సిద్ధాంతాన్ని పెంపొందించడానికి వాడుకున్నాడు. ఉగ్ర జాతీయవాదానికి నైతికంగా సమర్ధత కల్పిస్తూ రాజకీయ పెత్తందారీతనాన్ని ఫిషె బలపరిచాడు. 18వ శతాబ్దంలోని ప్రజాస్వామిక విశ్వజనీన ధోరణి ఇదంతా వ్యతిరేకం. సంకల్పమంటే వివేచనను ఆచరణను అన్వయించడమేనని కాంట్ నిర్వచించాడు. 18వ శతాబ్దంలో వివేచనావాదానికీ ఉద్వేగవాదానికీ ఉన్న సమన్వయానికి ఇది ప్రతిధ్వని మాత్రమే.

ఈ సంబంధాన్ని ఫిషె తల్లక్రిందులుచేసి వివేచన అనేది సంకల్పాన్ని వ్యక్తీకరించడమే అన్నాడు :-అనుభవ ప్రపంచ స్వేచ్ఛాయుత, వివేచనాత్మక, నైతిక వ్యక్తి సృష్టి మాత్రమే. వ్యక్తి సంకల్పానికి ఒక సాధనగా మాత్రమే ఇది సహకరించాలి. ప్రపంచాన్ని గురించి హెగెల్ చెప్పిన చిత్రణకు నేలబారుగా వ్యక్తిపరంగా వూహించిన భావనే ఇదంతా. పరమార్థం తననుతాను వ్యక్తీకరించుకునే ధోరణే ప్రపంచమన్నాడు హెగెల్. పోరాటంద్వారా స్వయంగా వ్యక్తీకరించుకునే సిద్ధాంతాన్ని ఫిషె చెప్పాడు. ఇది హెగెల్ గతి తార్కికవాదాన్ని ముందుగా వూహించినట్లయింది. మానవ స్వభావ దోషాలకు వ్యతిరేకంగా పోరాడటంలో నైతికత ఉంటుందని కాంట్ నమ్మాడు. ఈ సూత్రంనుంచి కూడా ఫిషె రాబట్టి ఉండవచ్చు. ఫిషె ద్వారా కాంట్ నైతిక వాదం జర్మనీ జాతీయవాదాన్ని బలపరిచింది. మానవతా సంస్కృతిలోని విశ్వజనీన వైఖరికి వ్యతిరేకంగా ఇదంతా సంభవించింది.

హెర్డర్ హ్యూమనిస్టు భావాన్ని, కాంట్ చెప్పిన సంస్కృతి దృక్పథంలో వ్యాఖ్యానిస్తూ, జర్మనీకి ఒక ప్రత్యేక ఆశయం ఉన్నదని ఫిషె ప్రకటించాడు. "జర్మనీకి మిగిలిన ఐరోపాకు తేడా అంతా ప్రకృతిలోనే ఉంది." (ఫిషె, అడ్రస్ ది జర్మన్ నేషన్). ఈ ఆశయాన్ని సాధించడానికి జర్మనీ ప్రజలు రాజ్యం ద్వారా నైతిక ఐక్యతను పొందాలి. రాజ్యం అనేది దైవాంగం. మిగిలిన మానవాళికి భిన్నంగా ఒక సమాజంలో ఇది ప్రత్యేకంగా ఉన్నది. దైవికమయిన రాజ్యం జాతి నైతిక వ్యక్తిత్వానికి చిహ్నం. దేశభక్తే మతం. "మానవాళి ఉనికికిగల ప్రయోజనాన్ని ప్రథమంగా ఒక జాతిలో ప్రసాదించడం సాధ్యం. ఆ జాతికి చెందిన వారు జర్మనులు. వారు సాధించినదానినిబట్టి మానవజాతికి కూడా తెలుస్తుంది." జర్మనీ సంస్కృతికీ రాజ్యానికీ తార్కికంగా ఉన్న సంబంధం, కాంట్ చెప్పిన రీతిలో, ఫిషె సాంస్కృతిక జాతీయవాదంగా స్పష్టపడింది. లూథర్, కాంట్‌ల భావాలను ఆచరించమని చెప్పడం ద్వారా వారు తలపెట్టిన ప్రయోజనాన్ని కొనసాగిస్తున్నట్లు ఫిషె నమ్మాడు.

ఫిషె పేదకుటుంబంలో పుట్టినందున, అతడు చెప్పినదానిని కార్మిక తత్త్వంగా శ్లాఘించడం, మార్క్సిస్టు చారిత్రకవాదంలో ఒక వింత విషయం. వాస్తవానికి అతడు నియంతృత్వ తత్త్వవేత్త. జాతీయ సోషలిజానికి ప్రవక్త. అతడు ఆధ్యాత్మిక సామ్రాజ్య వాదాన్ని బోధించాడు. జర్మన్ జాతి, జర్మన్ రాజ్యం మానవాళి నైతిక పునరుజ్జీవనానికి కృషి చేస్తాయని అన్నాడు. అందువలన జర్మన్ ప్రజలను అతడు పురిగొల్పాడు. "జర్మనీ పేరును సమస్త ప్రజలలో అత్యంత దివ్యమయినదిగా చేయాలి. ప్రపంచ పునరుద్ధరణ జాతిగా రూపొందించాలి. మన పూర్వీకులు చెప్పే మాటలు వినండి:- రోమన్ సామ్రాజ్యంనుంచి జర్మనీని కాపాడాం. మీకు ఇంకా ఎక్కువ అదృష్టం ఉంది. వివేచన,

భావసామ్రాజ్యాన్ని శాశ్వతంగా మీరు స్థాపించవచ్చు. లౌకికశక్తికి చోటులేకుండా చేయవచ్చు. మధ్యేమార్గంలేదు. మీరు కృంగిపోతూ మీతోపాటు మానవాళి అంతా క్రుంగిపోతుంది. భవిష్యత్తులో పునరుద్దరణకు ఇంకా ఆశ ఉండదు." రాజ్యం నైతికమయింది కనుక రాజ్య వ్యవహారాలలో, జాతి నైతిక, భౌతిక విషయాలు చూచే హక్కు ఉన్నదని ఫిషే అన్నాడు. ఆస్తి అంటే కేవలం భౌతికంగా వస్తువులను పొందడం కాదు. భౌతిక ప్రపంచం సంకల్పానికి లొంగి ఉండాలి. నైతిక ప్రయోజనాన్ని సాధించడానికి ఆస్తి ఒక సాధన మాత్రమే ఈ వాదనలద్వారా రాజ్యపరంగా సమష్టి యాజమాన్యం ఉండాలని ఫిషె వాదించాడు. అతడు పేర్కొన్న "పరిమిత పారిశ్రామిక రాజ్యం" ఒకవిధంగా రాజ్యపరమైన సోషలిజమే. జాతీయ సోషలిస్టు రాజ్యాన్ని ఇంకొంచెం ముందుకు తీసుకుపోవడం మాత్రమే.

తనకంటే ముందు కాంట్, తన తరువాత హెగెల్ ఉండగా, ఆదర్శవాదిగా ఫిషె, కేవల ఐక్యతలో సంపూర్ణంగా నమ్మకం ఉంచదు. తత్త్వంలోని ఈ కేవలత్వం రాజకీయ సిద్ధాంతంలో కూడా రాజకీయ తత్త్వానికి దారితీసింది. ఆ విధంగా పెత్తందారీ రాజ్యానికి ఫిషె తాత్త్విక మద్ధతును కల్పించాడు. ఇది లూథర్‌నుంచి వచ్చిన సంపద.

కాంట్ ప్రారంభించిన భావోద్యమాన్ని హెగెల్ కొనసాగించాడు. "కాంట్‌ను ఇతడు తరచు విమర్శించినప్పటికీ కాంట్ లేకుంటే హెగెల్ తత్త్వం ఉండేదికాదు." (బెట్రాండ్ రస్సెల్, ఎ హిస్టరీ ఆఫ్ వెస్టర్న్ ఫిలాసఫీ).

సంస్కరణవాదానికి చెందిన మతసాంప్రదాయాన్ని కూడా హెగెల్ తాత్త్వికీకరణ చేసాడు. కాంట్‌లోని మత పక్షపాతం ఇతడికి సంక్రమించింది. "హెగెల్ దృష్టిలో ప్రొటస్టంట్ క్రైస్తవమత సిద్ధాంతం కేవల తాత్త్విక సత్యాలతో సమానం". (జాన్ డ్యూయీ, జర్మన్ ఫిలాసఫీ అండ్ పోలిటిక్స్). రాజకీయ తత్త్వాలలో కూడా హెగెల్‌కు పితామహుడు కాంట్. విశ్లేషణతోకూడిన ఆలోచన, ప్రాపంచిక అనుభవ విధానానికి భిన్నంగా కేవల విశ్వవ్యాప్త వివేచనను ప్రకృతిలో ప్రత్యక్షమయిన రీతిగాను మానవచరిత్రలో జీవపద్ధతిగాను చూపడం తొలుత కాంట్ చేసినపనే.

కార్యకారణ భావాన్ని హ్యూం విమర్శించడంతో ప్రేరేపితుడైన కాంట్ వివేచనావాదాన్ని కాపాడే ప్రయత్నం చేసాడు. కానీ అతడే తొలుత ప్రాపంచిక అనుభవవాది కావడంవలన ఆత్మాశ్రయవాదంలో అతి పోకడలను పెంపొందించాడు. కాంట్ విఫలమైనచోట ఆత్మాశ్రయవాదాన్ని ఎదుర్కోవడానికి హెగెల్ పూనుకున్నాడు. తత్త్వచరిత్రలో ఇదొక క్లిష్టసమస్య. బాహ్యసత్యాన్ని కాపాడటంద్వారా హెగెల్ తత్త్వానికి పునరావాసం కల్పించాడు. వ్యక్తి తననుంచి తాను తప్పించుకునే మార్గాన్ని చూపాడు. ఆత్మ కేంద్రవాదం నుంచి విశ్వజనీన వాదానికి దారిచూపాడు. వివేచనను గురించి

కాంట్ ఆలోచించిన దానికంటే హ్యూం సంశయవాదాన్ని ఎదుర్కోవడానికి ఇంకా విశాలమయిన భావన కావలసివచ్చింది. వాస్తవాల విలువల ఐక్యతను స్థాపించడానికి ఇది అవసరమయింది. కనుక హెగెల్ విధానమంతా కొత్తతర్కంతో ఉన్నది. ఆధునిక విజ్ఞానం అభివృద్ధి చెందుతుండగా, పాత సమస్య చెలరేగింది. హెగెల్ తత్త్వం దానిని పరిష్కరించడానికి పూనుకున్నది. సంప్రదాయబద్ధంగా ప్రకృతిలో వివేచనాత్మక క్రమం ఉన్నదనే భావానికి, సంప్రదాయిక మతవిశ్వాసాలు నైతిక సిద్ధాంతాలకు పరస్పర విరుద్ధం ఉండటమే ఈ సమస్య. భౌతికనాగరికత సాధించినవాటిని, నైతిక మతపరమయిన భావాలు విజ్ఞానాన్ని వ్యతిరేకించడాన్ని రూసో ఎదుర్కొన్నాడు. (ఆలోచనవలన నిలిచిపోయిన సంశయాన్ని భావం పరిష్కరించాలని రూసో తలచాడు. 1750 నుంచి 1794 వరకు ఈ హృదయపు ఆక్రందన ఎక్కువైంది. తీవ్రంగా వస్తున్న ఈ ప్రకటనలను థెర్మిడర్‌వచ్చి అంతం చేసాడు–బెట్రాండ్ రస్సెల్, ఎ హిస్టరీ ఆఫ్ వెస్ట్రన్ ఫిలాసఫి. రూసో ఉద్వేగసహజవాదంతో కాంట్ చాలా ప్రభావితుడయ్యాడు. హెగెల్ సానుభూతిని పంచుకున్నాడు. రూసో విచ్ఛిన్నం చేస్తున్న ఉద్వేగవాదానికి బర్క్ వ్యతిరేకతచూపగా, సంప్రదాయానికి ఉన్న గౌరవాన్ని చూసి హెగెల్ మెచ్చుకున్నాడు. ఒకేతత్త్వంలో ఉద్వేగవాదాన్నీ మితవాదాన్నీ కలిపేప్రయత్నం హెగెల్‌లో కనిపిస్తుంది. సంఘర్షణవలన అభివృద్ధి వస్తుందనే భావం హెగెల్ పద్ధతిలో కనుగొనవచ్చు.

చరిత్రను గతితార్కికంగా వ్యాఖ్యానించడం వలన, మానవాభ్యుదయం కొరకే జార్ చక్రవర్తుల మధ్య పోరాటాలు సంభవిస్తాయని హెగెల్ ఒక నిర్ణయానికి వచ్చాడు. నాగరికత చరిత్ర అంతా జాతీయ సంస్కృతుల ఆవిర్భావం, పతనం మాత్రమే. నాగరికత చరిత్రకు వర్గపోరాటం ఆధారమని చెప్పిన మార్క్సిస్టు సిద్ధాంతంకూడా హెగెల్ గతితార్కికతకు దారిచూపింది. కార్మిక విప్లవ సిద్ధాంతానికి, కమ్యూనిజానికి ప్రోత్సాహకారిగా హెగెల్‌ను గుర్తించవచ్చు. (హెగెల్ గతితార్కికం శీర్షాసనం వేయగా, మార్క్సు మళ్ళీ వాటిని సరిగా నిలబెట్టాడనడం ఆధారంలేని వాదం. ఈ విషయం తరువాతి అధ్యాయంలో చూడవచ్చు). జాతిని దివ్యమయినదిగా శ్లాఘించడం, అత్యంత ఉన్నత నైతిక రీతిగా సర్వాధికారి అయిన రాజ్యాన్ని ఒక మార్మిక భావనతో చూడటంవలన, హెగెల్ వాదం ఫాసిజంతో వచ్చి చేరింది.

హెగెల్ తాత్త్విక పరిణామం కేవలం ఒక మానసిక రీతి–నైరూప్య భావాలతో కూడినది. అందులో చాలా దోషాలు అతిశయోక్తులు, అసంభవాలు అయితే హెగెల్ కావాలని ఏ ఒక్క సిద్ధాంతాన్ని అల్లలేదు. ఆత్మాశ్రయ వాదానికి బద్ధశత్రువుగాను, వాస్తవవాదిగాను ఉన్న హెగెల్, వూహాలోకంలోగాక, వస్తువుల వలన ఏర్పడిన

ప్రభావాలను అలానే స్వీకరించాడు. (డ్యూయీ ఇతనిని "పశుప్రాయుడు" అన్నాడు). ఒక పర్యాయం వాస్తవాలకు సంబంధించిన బాహ్యజ్ఞానం, భావాలుగా రూపొందితే వాటి తర్కాన్ని అనుసరించి అవి పరిణమిస్తాయి.

యవ్వనంలో హెగెల్ ఆనాటి ఉదార మనస్కులవలె ఫ్రెంచి విప్లవంపట్ల ఉత్సాహాన్ని కనబరిచాడు. ("స్వర్గంలో సూర్యుడు అవతరించిన తొలి పర్యాయం మొదలుకొని, దానిచుట్టూ గ్రహాలు పరిభ్రమిస్తుండగా, మానవుడు ఆలోచనాజీవిగా కొత్త ప్రపంచాన్ని గురించి వివేచనతో తన దృక్పథాన్ని మరల్చుకున్నాడు" హెగెల్.

విద్యార్థిగా ఇతడు షెల్లి భావాలను అంగీకరిస్తూ తన దేశంలోని మత రాజకీయ దృష్టిని నిశితంగా పరిశీలించి, స్వేచ్ఛ వివేచన సిద్ధాంతాలకు సహకరించాడు. జెన (Jena) యుద్ధానంతర ఉత్సాహవంతులైన యువకులు షెల్లి, హెగెల్ ఇద్దరూ ఒకనాడు ఉదయమే, సమీపంలోని అడవికిపోయి, తాము నాటిన "స్వేచ్ఛ అనే మొక్క" చుట్టూ నాట్యం చేశారట). కాంట్, గెట్ ఇంకా తక్కువస్థాయి వారితోసహా హెగెల్ ఆనాడు నెపోలియన్‌ను మధ్యయుగాల ధోరణిని నాశనం చేసినవాడుగా మెచ్చుకున్నాడు. ప్రష్యాలో అతడి విజయాన్ని విని ఆనందించాడు. 1798లో హెగెల్ ఇలా వ్రాసాడు. అంతవరకూ మౌనంగా పరిస్థితులను పరిశీలిస్తున్న, నిరాశతో ఓపికగా విధిని అనుభవిస్తున్న ప్రజలు మళ్ళీ ఆశతో ఏదో జరగబోతుందనే దృష్టితో ఉన్నారు. మంచి, న్యాయం తమలో ప్రవేశించిందనుకున్నారు. ఆనాడున్న పరిస్థితులకు భిన్నంగా, స్వేచ్ఛ, పవిత్రత ప్రవేశించిందనుకున్నారు. దీనిని ప్రకోపించిన తీక్షణత అంటే అనవచ్చుగాని, తత్ఫలితంగా మరణమైనా సంభవిస్తుంది, రోగ కారణమయినా పోతుంది. (Hegel, UEPER DIE NEUESTEL ILLERL VERHAELTLISSE WUERT TEMVERG'S - ON THE LALEST ENTERNAL CONDITIONS OF WUERTTEMVERG).

"జర్మనీ రాజ్యాంగం" అనే వ్యాసంలో హెగెల్ రాజకీయ భావాలు ఒక రూపాన్ని సంతరించుకున్నాయి. ఇది నాలుగేళ్ళ అనంతరం ముద్రితమయింది. దాతి సమష్టిసంకల్పాన్ని ఉద్దేశించి అతడు విజ్ఞప్తి చేసాడు. ఇది 18వ శతాబ్దపు రాజకీయ తత్త్వంలో వ్యక్తివాదానికి భిన్నమయినది. అప్పటికి అతడిలా వ్రాసాడు. "సంస్థలు, రాజ్యాంగాలు, చట్టాలు వాటినీతిని, అవసరాలను, మానవ ప్రయోజనాలను పోగొట్టుకున్న తరువాత ఇంకా కొనసాగుతాయని నమ్మడం ఎంత గుడ్డితనం. అవగాహన భావనలేనివి ఒక జాతిని కట్టుగా ఉంచగలవని ఎలా అనుకుంటారు". జబ్బును గుర్తించిన తరువాత చికిత్స చూపాడు. జాతిఐక్యతకు, జాతి ఆశయాలకు ప్రతీకగా రాజ్యం ఆవిర్భవించాలి. జర్మనీ చీలిపోయింది. "ఒక రాజ్యంకాని" జర్మనీ రాజ్యమెలా

అవుతుందని హెగెల్ అడిగాడు. ఆనాటి ప్రశ్నకు హెగెల్ రాజకీయతత్త్వమే సమాధానం ఇచ్చింది. ప్రపంచానుభవ సిద్ధాంతంగాగాక వివేచనకు సంబంధించిన సమన్వయీకరణ ఫలితంగా ఇది జనించింది.

పండితుడుగా హెగెల్ మతచరిత్ర విషయాన్ని పట్టించుకున్నాడు. లెస్సింగ్, కాంట్‌ల ప్రభావం వలన, క్రైస్తవమత పుట్టుపూర్వోత్తరాలను అధ్యయనం చేయాలని తలపెట్టారు. ఫలితంగా జీసస్ అద్భుతం కాదని నిరాకరిస్తూ, జోసఫ్, మేరీల పుత్రుడు చెప్పాడు. (WILHELM DILTHEY, JUGENDGESCHICHTE, HEGELS - The history of Hegels of Youth). షెల్లింగ్‌తో కలసి ఇతడు మతజ్ఞానాన్ని పునరుద్ధరించడాన్ని వ్యతిరేకించాడు. కాంట్ తన నీతిశాస్త్రానికి ప్రమాణంగా అమరత్వం అనే ప్రతిపాదనతెచ్చి పెట్టి మళ్ళీ మతజ్ఞానాన్ని తీసుకువచ్చాడు. షెల్లింగ్ ప్రాపంచిక, శాశ్వత లోకాలకు సమన్వయం చేయాలని మర్మదృష్టితో చెప్పాడు. ఫిషె ఈ సిద్ధాంతాన్ని బలపరిచాడు. హెగెల్ ఈ రెండింటినీ విభేదించాడు. అంతకు ముందు మతజ్ఞానాన్ని హేతుబద్ధంగా నీతివంతం కావించాలని కాంట్ ధోరణిని వ్యతిరేకించి హెగెల్ కొత్త విధానానికి నాంది పలికాడు. మానవాళి జీవితంలో దైవం ప్రత్యక్షంగా ఉందని హెగెల్ అంటాడు. క్రైస్తవమతం "దేవుని కుమారుడిలో" వుంచిన నమ్మకాన్ని యూదులుకూడా అనుసరించారు. మానవుడి పాపాలు తొలగించడానికి దైవకుమారుడు శిలువను అనుభవించాడు. ఈ వైఖరికి వ్యతిరేకంగా హెగెల్, జీసస్‌ను బాధపడుతున్న మానవుడికి ప్రతీకగా చిరునవ్వుతో విధిని అనుభవిస్తున్నవాడిగా భావించాడు. అది సోక్రటిస్ భావన అనేది స్పష్టం. హోల్డర్‌లిన్‌తో స్నేహంవలన హెగెల్ పునర్వికాస సంప్రదాయ ప్రభావానికి గురిఅయ్యాడు. అయితే అతడిలో లూథర్ పిడివాదం, సనాతనత్వం ఉన్నందుకు అంతకుముందున్న భావాలతో సంఘర్షణతప్పలేదు. హెగెల్ విధానంలో ఎంతో అభ్యంతరకరమయిన లక్షణాలు అలా అట్టిపెట్టి, పునర్వికాస సంప్రదాయం అంతర్లీనంగా ఉత్తేజాన్ని ఇస్తుండగా హెగెల్‌ని అనుసరించిన యువకులు మతాన్ని విమర్శించారు.

క్రైస్తవమత పుట్టుపూర్వోత్తరాలను అధ్యయనం చేయడంలో హెగెల్‌కు గతితార్కిక భావన స్ఫురించి ఉండవచ్చు. గ్రీస్‌కు సంబంధించిన మానవతా మేధావి సంస్కృతిని సిద్ధాంతంగా భావించాలి. ప్రాచీన నాగరికత విచ్ఛిన్నం కాగా, గందరగోళం ప్రబలి నిరాశావాదం, మార్మికమయిన పలాయనవాదం రావడం సిద్ధాంత వ్యతిరేకం అవుతుంది. క్రైస్తవమతం ఆవిర్భవించడంలో సమన్వయం ఉన్నది. ఇది సంపూర్ణమయిన హెగెల్ వాదానికి సరిపోతుంది. పవిత్ర రోమన్ సామ్రాజ్య పతనానంతరం జర్మనీలో స్థితి గతులను చూస్తే, వెస్ట్‌ఫేలియా సంధి ననుసరించి జర్మన్ రాజ్యాంగంలో చాలా

సమర్థవంతంగా విశ్లేషించడం వలన జనించిన పతనావస్థనుంచి క్రైస్తవమతం ఆవిర్భవించడం, హెగెల్‌కు కొట్టొచ్చినట్లు కనిపించింది. లెస్సింగ్ ప్రచారం చేసిన భావాలు, హెర్డర్ సూచించిన భావాలుకూడా, లోగడ యూదులవలె ఇప్పుడు జర్మనులు ఎంపికయిన ప్రజలుగా భావించడం జరిగింది. తార్కికంగా చూస్తే జర్మనీ కొత్త మతాన్ని స్థాపించాల్సి ఉంది. అత్యున్నత నైతిక విధానంగా, "భూమిపై దైవం నడుస్తున్నట్లుగా" జర్మనీలో రాజ్యపరమైన ఆచారం ప్రబలింది. జర్మన్ సామ్రాజ్యం పతనం కావడానికి ఫ్యూడల్, మతద్వేషాలు కారణమని పేర్కొంటూ, సమర్థవంతమయిన కేంద్రీకృత అధికారాన్ని జర్మనీలో మళ్ళీ తీసుకురావచ్చని హెగెల్ వూహించాడు. అయితే రాజనీతిజ్ఞుడుగా విప్లవకారుడుగా ఆయన తన పాత్రను నిర్వహించదలచ లేదు. హెగెల్ తత్త్వవేత్త మాత్రమే. జీవితాన్ని ఉన్నది ఉన్నట్లే అతడు చిత్రించగలడు. భవిష్యత్తులోని అనుభూతిని గమనించగలడు. ఉన్న పరిస్థితులను చిత్రించిన హెగెల్ రానున్న శకాన్ని తన హక్కులతత్త్వంలో చూపాడు. అదొక సంపూర్ణమైన తత్త్వం. నైతిక రాజకీయ భావాలతోకూడిన ఈ తత్త్వంలో రాజ్యానికి సంబంధించిన మార్మిక అతిభౌతిక భావన ఉన్నది. అయితే వ్యవస్థాపిత క్రమాన్ని కొలవడం హెగెల్ రాజకీయ తత్త్వంలో లేదు. ఏవిధమయిన రాజ్యాన్ని ఆదర్శప్రాయంగా చూడటంకూడా అతడి ఉద్దేశం కాదు. సంఘటిత వ్యవస్థలో విలువను గమనించడం ఇందలి ప్రధాన ఉద్దేశం. స్వేచ్ఛాభావాన్ని క్రమంనుంచి వేరుచేయగలమని, అందరి సంక్షేమం నిమిత్తం నైతికంగా చేసే కృషిలో సంపూర్ణతకు విడి భాగాలకు ఉండే సంబంధాలని అశ్రద్ధ చేయజాలమని ఈ తత్త్వం పేర్కొంటున్నది. రాజ్యానికి సంబంధించిన హెగెల్ సిద్ధాంతం హాబ్స్‌కు సమీపంగా ఉంది. అది కేవలం సిద్ధాంతపరమయినది. రాజరికం, రిపబ్లికన్ ప్రజాస్వామికం లేదా ఉన్నత వ్యక్తులకు చెందిన ఏ ప్రభుత్వానికైనా ఈ సిద్ధాంతాన్ని అన్వయించవచ్చు.

"జర్మనీ రాజ్యాంగమ"నే వ్యాసానికి పీఠికవ్రాస్తూ హెగెల్, వస్తువులు ఉన్నస్థితిలో అవగాహన పెంపొందాలని, రాజకీయచరిత్ర హఠాత్తుగాగాక ఆవశ్యకంగా ఉన్నదని చూపాడు. వాస్తవానికి ఆదర్శానికి ఉన్న తేడావలన విచారం కలుగుతుంది అని హెగెల్ భావించాడు. ఉన్నదేదో తప్పనిసరని గ్రహిస్తే, అదే ఉండతగినదని గ్రహించడంకూడా సాధ్యమంటాడు హెగెల్. వాస్తవమైన వివేచనాత్మకమనే సుప్రసిద్ధసూత్రం అప్పుడే విప్పారుతున్నది.

హెగెల్ యవ్వనదశలో బీజాంకురంగా ఉండిన ఈ భావాలు, "తాత్త్విక నియమం"లో తర్కబద్ధంగా విస్తరించిచూపాడు. ఇందలి సిద్ధాంతం ఏమంటే అవగాహనకు (విశ్లేషణ భావానికి) సంబంధించిన నైరూప్యహక్కు అత్మాశ్రయ నీతికి,

విరుద్ధంగా ఉన్నదని భావించడమే. వివేచన బాహ్యసంకల్పం పరస్పరం చర్యకు ఉపక్రమించడం వలన స్వేచ్ఛ జనిస్తుందన్నాడు. వివేచనకు సంబంధించిన సమన్వయక్రమంవలన రాజ్యం జనిస్తుందని హెగెల్ ప్రకటించాడు. హెగెల్ తత్త్వం అతడు వ్రాసిన భావదృగ్ ధోరణి (Fenaminology of Spirit) రూపురేఖలను సంతరించుకున్నది. తెలివితేటలు తలెత్తడం అనేది వ్యక్తిగత అనుభవంగాగాక, చారిత్రకరీతులలో, జాతీయపాత్రలలో, సంస్కృతులలో, తాత్త్విక విధానాలలో జరుగుతుందన్నాడు. తాత్త్వికుడి మానసిక స్వీయచరిత్రే ఇదంతాను. హెగెల్ తనమేధస్సు పరిణామాన్ని బాహ్యరూపంగా చెప్పాడు. బాహ్యసత్యానికి ఇదొక ప్రతిబింబం అన్నాడు. చారిత్రకంగా విచ్ఛిన్నమవుతూ పునర్నిర్మాణానికి పెనుగులాడుతున్న వ్యవస్థ ఫలితంగా హెగెల్ తత్త్వం ఆవిర్భవించింది. కేంద్రీకృత అధికారం ఉండాలని అభిలషించడం, అదొక జాతీయ విధానమని తలచడం, జర్మనీ సాంస్కృతిక సంప్రదాయం, లూథర్ వ్యాఖ్యానించిన క్రైస్తవమతం ఇవన్నీ హెగెల్ తత్త్వానికి తోడ్పడినవి. విశ్వంలో వాస్తవస్థితిని గ్రహించే మానవ మనస్తత్వమే ఇదంతాను. యవ్వనంలో ఉద్వేగవాదంనుంచి సంప్రదాయ వివేచనావాదం, మతం నుంచి తత్త్వం పెంపొందినరీతులన్నీ హెగెల్ స్వీయచరిత్రగా ఆవిర్భవించాయి. విశ్వభావం బాహ్యసత్యంగా విప్పారడం హెగెల్ వంటి తత్త్వవేత్తలోనే చూడవచ్చు.

చైతన్యతకు వాస్తవానికి ఉన్న సంబంధాన్ని గురించి హెగెల్ ప్రస్తావిస్తూ, ఆత్మాశ్రయవాదాన్ని తీవ్రంగా ఖండించాడు. ప్రపంచంనుంచి వేరైన స్వీయ చైతన్యత, జీవన స్రవంతినుంచి కూడా దూరం అవుతుంది. ఆత్మహత్యాసదృశ్యమైన ప్రాధాన్యతను గ్రహించడమే వివేచన. ఈ మానసిక ధోరణి ఆధునిక తత్త్వాన్ని కుంచింపజేసింది. పరస్పర విరుద్ధత్వాలమధ్య బందీలను గావించింది. కానీ వివేచన, విశ్లేషణాత్మక అవగాహనగా, వాస్తవానికి స్వీయ చైతన్యతలో చిక్కుకున్న అహానికి మధ్య ఆఖాతానికి వారధి నిర్మించలేదు. వాస్తవ ప్రపంచాన్ని ఆత్మాశ్రయ వూహా ప్రపంచంనుంచి వేరుగా చూడలేని వివేచన గందరగోళానికి గురైంది. మార్మికమయిన శక్తి ఏదోవచ్చి ధర్మాన్ని కాపాడుతుందని భావించి సహనంతో వేచి ఉండాల్సిందే. అయినా ప్రపంచం సాగిపోతూనే ఉంటుంది. దానిని సరిదిద్దాలనే ప్రయత్నాన్ని వివేచన వదిలేస్తుంది. ఆత్మాశ్రయవాదం గందరగోళాన్ని సృష్టిస్తుంటే, చూస్తూ వూరుకుంది. కాగా వ్యక్తుల చర్యలకు సంబంధించిన సంఘర్షణలలో వివేచన ప్రవేశించి కొన్ని ఆచరణలను చూపుతుంది. 18వ శతాబ్దంలో ఉద్వేగ వివేచనా వాదానికి ఇదొక విమర్శనాత్మక ధోరణి. ప్రయోజనావాద ఉదార సిద్ధాంతానికి సంబంధించిన రాజ్య వ్యవహారాలనుంచి కూడా విమర్శ ఉంది. తార్కికంగా ఇదంతా సమష్టి వాదానికి దారితీసింది.

కేవలం విశ్లేషణతో కూడిన అవగాహన స్థాయికంటే ఇంకా ఉన్నత దశకుచేరుకున్న చైతన్యత, వివేచనలో భావుకత దశను పొందినప్పుడు, ప్రపంచం నుంచి చైతన్యతను వేరుచేసి చూడటానికి వీలులేదు. సమాజంలో ఉన్న చైతన్యత పరిసరాలలో జీవితంలో వాస్తవాలతో తాదాత్మ్యం చెందడం కేవలం చైతన్యత దశనే సూచిస్తుంది. జ్ఞానం ఇంకా రావలసి ఉంది. ఆదిమ సమాజ జీవన చిత్రణ ఇదంతాను. భావం ఉత్తేజాన్ని కలిగిస్తుంది కానీ, ప్రతిబింబించదు. నీతి అచేతనము, తలవని తలంపుగా వచ్చేది మాత్రమే. వ్యక్తిని కాపాడుకోవాలనే వైఖరి ఒక్కటే ప్రోత్సాహకారిగా ఉంటుంది. అయితే సంస్కృతి విప్పారుతుంటుందీ, కొత్త భావాలు జనిస్తుంటాయి. క్రమంగా మనస్సు సంప్రదాయాలనుంచి మూఢనమ్మకాలనుంచి విమోచన పొందుతుంది. ఆవిధంగా వివేచనాయుత పాలనకు రంగం సిద్ధం అవుతుంది. అదే నైతిక చైతన్యావస్థ. ఈ దశలో మతం వచ్చి ప్రపంచం నైతిక నియమాలకు కట్టుబడి ఉండాలని ప్రభోదిస్తుంది. దైవభావం, ప్రకృతి ఆరాధన, సంకేతాలు, మొదలయిన దశల్లో పయనిస్తుంది. తుదకు సాక్షాత్కరించిన మతం మానవుడికీ దేవుడికీ మధ్య ఐక్యతను సాధిస్తుంది :– "భావం తననుతాను భావంగా తెలుసుకుంటుంది." మానవుడికి నమూనాగా క్రీస్తుకు హెగెల్ ఇచ్చిన భాష్యమే ఇదంతాను. హెగెల్ మానసిక భావ సాహస చిత్రహింసలను అనుసరించడం కష్టం. కానీ ప్రయాణపు లక్ష్యాన్ని గమనిస్తే మానవ ఉనికికి ప్రయోజనంతో కూడిన ఉత్తేజాన్ని చూపుతుంది. ఆత్మాశ్రయ కారాగారంలో కుంచించుకపోవడంగాక సత్యాన్వేషణలో, అనంత జ్ఞానపథంలో, విశ్వ ఐక్యత వైపుకు పయనించడం చూడవచ్చు.

షెల్లింగ్, హోల్డర్ లింగ్, ఫిషె లకు చెందిన ఉద్వేగవాదంతో హెగెల్ తెగత్రెంపులు చేసుకోవడానికి దృగ్విషయవాదం ఆరంభ దశ అనవచ్చు. తన తత్త్వాన్ని సూచించిన హెగెల్, జీవితం, ప్రపంచం వాటి సమస్యలపట్ల తన ధోరణికి కళాహృదయుల ఆశలకు సంబంధం లేదన్నాడు. ప్రపంచంలో ఉన్న లోపాలను ఎలుగెత్తి చాటుతూ ఆదర్శవాదాన్ని పేర్కొని, వాస్తవంకంటే ఇంకేదో మంచి కావాలని భావించే విధానాన్ని ఈ తత్త్వం నిరాకరించింది. హెగెల్ దృష్టిలో తత్త్వం అంటే వాస్తవ ప్రపంచ విజ్ఞానమే. ఉన్నదే వాస్తవంగా గుర్తించాలని అతడంటాడు. వాస్తవానికి సంబంధించిన మరే భావమయినా వృథా వూహేనన్నాడు.

వాస్తవానికి, కనిపించేదానికి, మనసుకు పదార్థానికి, ఆలోచనకు–జీవికి ఉన్న వైవిధ్యాన్ని హెగెల్ విశ్లేషించాడు. ఉనికి చలనరహిత శిలవంటిదికాదని ఆలోచనా ప్రయత్నాలకు హద్దులు విధించదని అతడు వాదించాడు. ఉనికిలోనే ఆలోచన ఉన్నది. కనుక భావాలు వెల్లడికావడమే ఉనికి విధానం. "మానసిక–పదార్థం"లో

హెగెల్‌కు నమ్మకంలేదు. భౌతిక ప్రకృతికి మనస్సుకు మూలం ఒక్కటే అయినా, రెండూ సమానం కాదన్నాడు. ప్రకృతిలో అంతర్లీనంగా చైతన్య శక్తులున్నాయని భావిస్తేతప్ప మనస్సును వివరించలేమన్నాడు. స్పినోజా వాదానికి చెందిన హెగెల్ మూలపదార్థం, భావంతోకూడినదని నమ్మాడు. ఆధునిక పదార్థానికి చెందిన ప్రతిపాదనలో "మానసిక" లక్షణాలు హెగెల్ ముందే వూహించిన ఖ్యాతిని అతడికి ఇవ్వవచ్చు. మనస్సు, పదార్థం ఆవిర్భవించడానికి మూలం "భావం" అంటాడు హెగెల్. దీనికి చైతన్యత లక్షణాన్ని అతడు ఆపాదించలేదు. ఇది మాటలగారడీ అని స్పష్టపడుతున్నది. ఇంతకుముందు వాదనలో హెగెల్ చైతన్యశక్తి ఎప్పుడూ ఉంటుందన్నాడు. ఈ శక్తి కేవలం మానసికమయిన దానిలోనే ఉండటానికి వీలులేదు. ఏమయినప్పటికీ వాస్తవాన్ని చైతన్యతతో హెగెల్ ముడిపెట్టాడు. వ్యక్తి చైతన్యతకు సంబంధం లేకుండా వాస్తవం ఉన్నది. అయితే వ్యక్తుల మనసులతో సంబంధంలేని వాస్తవికత అసాధ్యం. తార్కికంగా ఈ ప్రతిపాదనను కాదనలేదు. అలాగే వాస్తవానికి చైతన్యతశక్తి ఉండటం వరుసక్రమంలో తొలుత వస్తుంది. అంటే మానవుడి అవగాహనకు అందుబాటులో ఉండే ప్రపంచ చరిత్ర ఆలోచనలతో ఆరంభం కావాలన్నమాట. కనుక ఆలోచన వలన ఉనికికి పరిమితి ఏర్పడుతుందని భావించడం మానవుడికి సహజం.

చైతన్యతకు సంబంధించిన చరిత్ర గురించి హెగెల్ పట్టించుకున్నాడు. వివిధ సందర్భాలలో భిన్ననామకరణచేస్తూ పోయాడు. ఆలోచన, భావం, భావుకత ఇత్యాదులన్నీ అతడుపెట్టిన పేర్లే. సంప్రదాయికంగా చూస్తే తత్త్వపరిధిలోనే ఇదంతా ఉన్నది. మానసిక ప్రపంచ హద్దులను అధిగమించిన తత్త్వం, విజ్ఞానంతో కలిసిపోతుంది. వృత్తిరీత్యా ఉన్న తత్త్వవేత్తలు తమనుతాము రూపుమాపుకోవడానికి అంగీకరించరు. అందువలన సంప్రదాయ దృష్టిలో హెగెల్ తత్త్వం తార్కికంగా పొందికయినది. అంతకంటే, తత్త్వవేత్తనుంచి ఆశించడం భావ్యంకాదు. ఎందరో విఫలమయిన పరీక్షకు హెగెల్ తట్టుకుని నిలబడ్డాడు.

వాస్తవాన్ని అన్వేషించే సంప్రదాయ తత్త్వంలో, తుది సత్యం పరస్పర విరుద్ధంగా ఉండరాదనే సూత్రాన్ని హెగెల్ అనుసరించాడు. సంపూర్ణత తప్ప మరేదీ పూర్తిగానూ తుది సత్యంగాను ఉండదన్నాడు. ఈ అన్వేషణ ఫలితంగా విశ్వానికి సంబంధించిన జీవ భావన వచ్చింది. అతడి అతిభౌతికతనుంచి తార్కికంగా రాజ్యానికి, సమాజానికి సంబంధించిన జీవ దృక్పథం వచ్చాయి.

విశ్వం స్వయంసంపూర్ణ భాగాలైన అణువులు, చిదంశల కలయిక కాదు. అదొక సమగ్ర జీవ సంపూర్ణత. కనుక పరిమితులుగల వస్తువుల వాస్తవికత కనిపించేది

మాత్రమే. వాస్తవానికి కనిపించేదానికి తేడాను చూపే సిద్ధాంతాన్ని హెగెల్ తృణీకరించాడు. కాంట్ పేర్కొనే సంఘటనల పరమార్థ ప్రపంచాలను హెగెల్ అంగీకరించలేదు. "యదార్థ వస్తువు" అనే భావాన్ని హెగెల్ ఆగ్రహంగా చూసాడు. ఒక వస్తువు లక్షణాలను దృక్పథాలను తెలిసినప్పుడు యదార్థ వస్తువు తెలిసినట్లే. వాస్తవ ప్రపంచభాగాలు మొత్తంలో భాగాలు కనుక అవీ వాస్తవాలే. "వస్తుసారానికి, కనిపించేదానికిఉన్న వైవిధ్యం హెగెల్ దృష్టితో ఇద్దరు వ్యక్తుల భావాలలో ఉన్న వైవిధ్యంవంటిదే. ప్రపంచాన్ని కనిపించేదిగాను, సారంతో కూడినదిగాను నిర్వచించారు. సారమంతా వ్యక్తం అయినప్పుడు మొత్తం వాస్తవం ఉంటుందన్నారు." (లాంజ్, హిస్టరీ ఆఫ్ మెటీరియలిజం).

ఈ అతిభౌతిక ప్రతిపాదన నుంచి హెగెల్ సుప్రసిద్ధ సూత్రం రాబట్టడం జరిగింది:-"వాస్తవం వివేచనాత్మకం, వివేచన వాస్తవం." ప్రాపంచికానుభవవాద దృష్టిలో భాష్యం చెప్పాలంటే ఈ సూత్రాలననుసరించి ఉన్నదంతా సరైనదే. వ్యవస్థను సమర్థిస్తున్నారని హెగెల్ తత్త్వాన్ని ఖండించవచ్చు. హెగెల్ శకంలో ఈ భాష్యం సర్వసాధారణంగా ఆమోదం పొందింది. ప్రపంచానుభవ వాదికి వాస్తవంగా కనిపించేది వివేచనారహితమైనది కనుక వాస్తవం కాదని హెగెల్ చెప్పాడు. అపోహలను తొలగించడంకోసం అతడీ విధంగా నొక్కి చెప్పవలసి వచ్చింది. మొత్తంలో భాగం చూచినప్పుడు దీని ప్రాధాన్యత భిన్నంగా ఉంటుంది. ఆ దృక్పథాన్ని అనుసరించి వాస్తవాలన్నీ సత్య సారాంశంలో భాగాలే.

కాంట్‌వలెగాక, హెగెల్ విధానం అంతా కట్టుదిట్టమయిన హేతు క్రమంలో ఉంటుంది. అతిభౌతికతను తర్కంలో అతడు మేళవించేసాడు. తర్కంపై వ్రాసిన రెండు గ్రంథాలతో దీని సారాంశం ఉన్నది. ఒకవిధంగా చెప్పాలంటే అతడి మిగిలిన రచనలన్నీ అతడి తత్త్వాన్ని అన్వయించినవి మాత్రమే. "వివేచన చైతన్యతతో కూడిన సంపూర్ణ ఉనికి మాత్రమే." మొత్తంలో భాగంగా ఉండేవి ఏవైనా సంపూర్ణము, తుది సత్యం గనుక, ప్రతీదీ వాస్తవమే. ప్రతిదానిలో భాగం పంచుకునే విషయాన్ని గురించి వివేచన తెలుసుకుని ఉండాలి. ఎవరు ఎంతగా చైతన్యతతో ఉంటారో ఆ మేరకు అతడు వివేచనతో ఉంటాడు. చరిత్ర తత్త్వానికి పయనించిన హెగెల్ వాదంలో ఇదొక సంధి యుగం. చరిత్ర తత్త్వంకూడా వివేచనాత్మకమే. "తత్త్వం తనతోపాటు తెచ్చే ఏకైక ఆలోచన వివేచన మాత్రమే. అది చరిత్రను గురించి ఆలోచించడానికి ఉపకరిస్తుంది. ఆ వివేచన ప్రపంచ సార్వభౌమత్వంతో కూడినది. ప్రపంచ చరిత్ర వివేచనారీతిగా మనముందున్నది." (హెగెల్ ఫిలాసఫీ ఆఫ్ హిస్టరీ). సంప్రదాయానికి చెందిన పొందికైన హేతువాదిగా హెగెల్ ప్రపంచం సంపూర్ణత వైపు పయనిస్తుందన్నాడు. ప్రస్తుతాన్ని

లక్ష్యానికి దాపులో ఉన్న విషయంగా భావించి గతంకంటే గొప్పదని గ్రహించాలన్నాడు. విశ్వం అంతా తననుతాను ఆలోచనా క్రమంలో బహిర్గతంచేస్తున్న కేవల సత్యవిధానంగా చూడాలి. (హెగెల్, లాజిక్). ప్రకృతి ప్రపంచంలో ఈ విధానం పదార్థ శక్తులుగాను, జీవన రూపాలుగాను వ్యక్తం అవుతుంది. భావ ప్రపంచంలో మానవుడి ఆత్మగాను, సాంఘిక చట్టంగాను, మతం, కళ, తత్త్వంగాను కేవల సత్యం వ్యక్తం అవుతుంటుంది.

కాంట్‌ను విమర్శిస్తూ హెగెల్ తన యవ్వనంలోనే, మతానికీ రాజ్యానికీ, చట్టానికీ నీతికీ, వాణిజ్యానికీ కళకూ ఉన్న సంబంధాన్ని మానవ జీవిత దృక్పథంలో చూడాలేతప్ప నైరూప్యభావనతో పరిశీలించరాదన్నాడు. చరిత్రతత్త్వంలో ఈ భావాన్ని విపులీకరించాడు. మతం, తత్త్వం, చట్టం, ఆర్థిక సమస్యలను గురించి చారిత్రక దృక్పథంతో హెగెల్ చేసిన పరిశీలనను అతడి విమర్శకులు సైతం మెచ్చుకున్నారు. "చరిత్ర రచనపై హెగెల్ ప్రభావాన్ని గమనిస్తే, ముఖ్యంగా నాగరికత చరిత్రను అతడు పరిశీలించిన తీరు చూస్తే, విజ్ఞానాభివృద్ధికి హెగెల్ అతడి ధోరణిలో ఎంతో దోహదంచేసాడు". (లాంజ్, హిస్టరీ ఆఫ్ మెటీరియలిజం).

"పండితుల పరిశోధనలు, సంప్రదాయాల నిశిత పరిశీలనవలన మన చారిత్రక రచనలు తృప్తి చెందకపోతే, వాస్తవాలను ఆచరణయుక్తంగా చూడకపోతే, సంఘటనలమధ్య సంబంధాన్ని గ్రహించడానికి, చారిత్రకాభివృద్ధిలో విశాల దృక్పథాన్ని చూడటానికి, వీటన్నింటి వెనుకగల మేధాశక్తిని దృష్టిలో పెట్టుకోవాలంటే హెగెల్ చరిత్రతత్త్వాన్ని చూడాలి – జల్లర్, హిస్టరీ ఆఫ్ జర్మన్ ఫిలాసఫీ). 18వ శతాబ్దపు అభ్యుదయ సిద్ధాంతాన్ని అనుసరించి సర్వసాధారణమయిన ప్రాపంచికానుభవ దృక్పథం ఉండేది. భావాలు, సంస్థలు జడప్రాయంకాదని అధ్యయనంవలన పరిశోధనలవలన బైటపడింది. హ్యూంచెప్పిన ప్రాపంచికానుభవవాదం, ఆగమన సాధారణీకరణాన్ని వాస్తవంకాదని పేర్కొన్నది. ఆ విధంగా ఏర్పడిన శూన్యపరిస్థితిని హెగెల్‌వచ్చి, చరిత్రను వివేచనాత్మకంగా వ్యాఖ్యానించి లోపాన్ని పూరించాడు. అతడి చరిత్రవాదం అదృష్టవశాత్తు జరిగే సంఘటనల సాధురిణీకరణకాదని చెప్పాడు. 18వ శతాబ్దంలోని అభ్యుదయ భావంకంటే ఇదింకా నిర్దిష్టమైనట్టిది. ప్రకృతిలోని మానవుడి మనసులోను అంతర్లీనంగా ఉన్న సమన్వయ సిద్ధాంతాన్ని కనుగొనడంపై హెగెల్ వాదన ఆధారపడి ఉన్నది. వాస్తవాలకు విలువలకు హ్యూం చూపిన విచక్షణకు హెగెల్ సమాధానం చెప్పాడు. ప్రకృతిలోను మానవుడి మనసులోను వ్యాపించిఉన్న వివేచనవలన ఐక్యతఏర్పడి ఉన్నది. 18వ శతాబ్దపు మానసిక ధోరణి అంతా విశ్లేషణతో కూడినది. చరిత్రకు సంబంధించిన జీవిత విధానాన్ని విడిభాగాలుగాచేసి చూసారు. ఈ భాగాలన్నింటినీ ఏకంచేసి చూపవచ్చునని హెగెల్ తన తర్కబద్ధమయిన వివేచనవలన నమ్మాడు.

హ్యూం అజ్ఞానవాదంవలన చరిత్రలో తర్కబద్ధమయిన నిరంతరత ఆవశ్యంకాకుండా పోయింది. ఫలితంగా మత, నైతిక విలువలు అన్నీ సమాజిక ప్రయోగస్థాయికి తగ్గించి వేసింది. సందేశవాదాన్ని ఆరాచకపు ఆచారాన్ని చెబుతుండగా, దానిని వివరించే నిమిత్తం హెగెల్, రూసో చెప్పిన జనేచ్ఛ భావాన్ని స్వీకరించాడు. వ్యక్తులలోగాక సమాజాలలో అంతర్లీనంగా ఉన్న జీవశక్తి సమన్వయంతో కూడినదని వ్యాఖ్యానం చెప్పాడు. ఇదే విశాలమయిన భావశక్తిగా వ్యక్తమవుతుంటుంది. వస్తువులలోని శాశ్వతసూత్రం విప్పారుతుండగా, విశ్వపరిణామానికి ఒక నమూనా ఏర్పడుతుంది. నాగరికతాభివృద్ధికి ఒక పథకం లభిస్తుంది. ప్రతిజాతి సంపూర్ణ సత్యంతో సంబంధం ఏర్పరచుకుని సజీవంగా చర్యలకు ఉపక్రమిస్తుంది. సహజ నియమంస్థానే, చరిత్రలో కేవల సత్యం వివేచనాత్మకంగా విప్పారుతుందని హెగెల్ సూచించాడు.

చట్టానికీ నీతికీ వైరుధ్యాన్ని తొలగించే ప్రయత్నంలో కాంట్ ఫలప్రదం కాలేకపోయినా, హెగెల్ తన సమన్వయీకరణ ద్వారా అది పూర్తిగావించాడు. రాజ్యానికి కుటుంబానికి నైతిక ఐక్యతను చూపాడు. అతడి హక్కుల తత్త్వంలో మూల విషయంగా, మనస్సును బాహ్యరూపంలో, చట్టం, కుటుంబం, రాజ్యం అనే సంస్థల పరం చేసాడు. నైతిక జీవితాన్ని సాధించడానికి ప్రేరణాత్మకమయినదే కుటుంబం అన్నాడు. అంటే సామాజిక ఒడంబడిక సిద్ధాంతాన్ని తృణీకరించాడన్నమాట. అయితే హాబ్స్ దృక్పథంలో హెగెల్ అంగీకరిస్తూ వ్యక్తులు కుటుంబాలు స్వంత ఆసక్తులవలన కలుస్తారన్నాడు. రాజ్యం నైతిక భావనలతో కూడిన కుటుంబంగా ఆవిర్భవిస్తుంది. అటువంటిచోట పరస్పరం ఆధారపడే చనువు, స్వేచ్ఛతోకూడిన వికాసం సమన్వయీకరణ పొందుతాయి. మానవుడు కొన్ని హద్దులలో వాస్తవం అని రాజ్యం గుర్తిస్తుంది. కళ, మతం, తత్త్వంవంటి రంగాలలో కేవల ఉనికి ఉన్నతస్థాయిలో కొనసాగడానికి కొంత వేరే మార్గాన్ని అనుసరించడం అవసరం. హెగెల్ పదజాలాన్ని అర్థం చేసుకోవాలంటే, సంస్కృతిని ఒక వ్యవస్థగా రూపొందించదలిచాడని తెలుసుకోవచ్చు.

వ్యక్తికి సమాజానికి వాస్తవమైన సంఘర్షణ రాదని హెగెల్ ఉద్దేశం. అత్యున్నత నైతిక విలువ గనుక, స్వేచ్ఛను వ్యతిరేకించడం రాజ్యం దృష్టి కాదు. రాజ్యానికి వ్యతిరేకంగా వ్యక్తిపరమైన నిర్ణయం ఉంటుందనే భావాన్ని హెగెల్ అపహాస్యంపాలు చేసాడు. అయినప్పటికీ ప్రాచీనం కంటే ఆధునిక రాజ్యమే ఉండాలని అందులోనే వ్యక్తి స్వేచ్ఛకు ఎక్కువ గౌరవం ఉన్నదని, ఎంపికచేసుకునే హక్కు ఉన్నదని పేర్కొన్నాడు. ఐరోపా నాగరికతకంటే క్రైస్తవమతమే వ్యక్తి స్వేచ్ఛకు ఉన్నతస్థాయిని కల్పించిందని ఇతడు భావించాడు. భావభేదకులను హెగెల్ అభినందించాడు. తన అంతరాత్మ ననుసరించి సమాజాన్ని సమర్థించే వ్యక్తి చాలా విలువయిన సాంఘిక శక్తి అని

అతడన్నాడు.

హెగెల్ గతితార్కికంలో వ్యతిరేకత సంపూర్ణం కాదు. సిద్ధాంత ప్రతిసిద్ధాంతాలు అనే విరుద్ధ ప్రతిపాదనలు కొంతవరకు వాస్తవం, కొంతవరకు కాదు. రెండింటినీ వివేచనాత్మకంగా నిర్ణయిస్తే రెండింటికంటే ఉత్తమమైన మూడవ ప్రతిపాదన ఆవిర్భవిస్తుంది. ప్లేటో సంభాషణలు, సోక్రటీస్ ప్రశ్నల పద్ధతిలో అంచలవారీగా సత్యానికి చేరువగా, హెగెల్ ఈ పద్ధతిని కనుగొన్నాడు. గతితార్కికమనే గ్రీక్ మాటకు సంభాషణ అని అర్థం. సిద్ధాంత ప్రతిసిద్ధాంతాలను సమన్వయ సిద్ధాంతంగా రూపొందించడమే వివేచన యొక్క ప్రయోజనం. విరుద్ధత్వమే అంతిమం అనే విషయాన్ని వివేచన సహించదు. అంటే ప్రకృతి పూర్తిగా వివేచనాత్మకం కాదన్నమాట. హెగెల్ ననుసరించి, విశ్వం అంతా వివేచనాత్మకం. చివరకు పరిష్కరించజాలని సమస్య అంటూ ఏదీ ఉండదు. గతితార్కిక భావన హెగెల్ చెప్పే వాస్తవికతతో సన్నిహిత సంబంధం గలది. కనుక ఇతడి విధానం అతిభౌతికతను తర్కంతో మిళితం చేస్తుంది. ఫలితంగా సర్వబుద్ధి వాదం జనించింది.

వ్యక్తి స్వేచ్ఛను సామాజిక జీవన భావంతో సమన్వయీకరించడానికి హెగెల్ రాజ్యసిద్ధాంతంలో ప్రయత్నం జరిగింది. సిద్ధాంతం ప్రతిసిద్ధాంతం రెండూ సరైనవే. కనుక సంఘర్షణ పైకి కనిపించేది, ఆవాస్తవికం, హెగెల్ సమన్వయవాదం రాజీకాదు. విరుద్ధ ప్రతిపాదనలను రెండింటినీ సంపూర్ణంగా ఇది స్వీకరిస్తూన్నది. రెండింటినీ అధిగమించి, లీనం చేసుకుంటుంది. అరిస్టోటల్ చెప్పేరీతిగా జీవవిధానంగాక, అతిభౌతిక విధానంగానే హెగెల్ రాజ్యానికి అర్థాన్ని సమకూర్చాడు.

"హక్కు అనేది ప్రాయికమయిన, వ్యక్తిగత విషయమేతప్ప సంపూర్ణతకాని వివేచనతోకూడిన సంకల్పంకాని కాదు. ఇందులో వూహాలోచనలేదు. తాత్త్విక భావనకూడా దీన్ని తృణీకరిస్తుంది". (హెగెల్, ఫిలాసఫీ ఆఫ్ రైట్).

మానవేచ్ఛ ప్రకృతిలోని వివేచనగా హెగెల్ భావించాడు. ఫలితంగా ఒకేతీరు లేకుండా భిన్నమయిన వ్యక్తుల సంకల్పాలు ఉండేందుకు వీలులేదు. సామాన్యమయిన మానవ ప్రయోజనం లేకుంటే, వ్యక్తివాదం సామరస్యపు సాంఘిక విధానాన్నిగాక గందరగోళాన్ని సృష్టించి తనకుతానే అర్థరహితంగా ఎంచుకుంటుంది. మానవ స్వభావంలో సాధారణ లక్షణం ఉంటేతప్ప, మానవసహకారం అసంభవం. ప్రకృతిలో నుంచి ఆవిర్భవించే మానవస్వభావానికి సామాన్య లక్షణం ఉంటుంది. ప్రకృతితో మానవుడికిగల సంబంధమే వ్యక్తుల సంకల్పాలు గనుక సామాన్య లక్షణం. అదే వివేచన.

సామాజిక ఒడంబడిక సిద్ధాంతం వాస్తవంకాదని హెగెల్ నిరాకరించాడు. కుటుంబం ప్రపంచానుభవ సంబంధమయిన ఒకకేంద్రం. దానినుంచి పితృస్వామ్యం, ఫ్యూడల్ రాజ్యం జనించాయి. అది సిద్ధాంతం, బూర్జువా ప్రజాస్వామ్య రాజ్యం వ్యక్తిపరమయిన సమాజంగా, వ్యతిరేక సిద్ధాంతం. అయితే సమన్వయం ఏమిటి? రాజ్యభావనలో సమన్వయం ఉన్నది. రాజ్యంలో భాగాలన్నీ, తెలిసి, యావత్తు విధానంతో కలసిపోతాయి.

జనేచ్ఛ సిద్ధాంతాన్ని ఆమోదించిన హెగెల్, ఆచరణను ప్రశ్నించాడు. ఆచరణలో రూసో చెప్పిన ప్రజాస్వామిక నియంతృత్వం వచ్చింది. జనేచ్ఛను తెలుసుకోవడానికి ఓట్లు లెక్కించే విధానాన్ని అతడు నిరాకరించాడు. ఈ పద్ధతి ఫలితంగా జనేచ్ఛ "నైరూప్య ప్రత్యేకత"గా మారుతుందన్నాడు. జనేచ్ఛ గణితబద్ధంగా రాబట్టేదికాదు. అది వివేచనాత్మకం. వివేచనం వాస్తవం. జనేచ్ఛకు వ్యక్తుల నిరోధం అవాస్తవికం. ఒక బల్లను క్రిందపడవేసి, ఆ సంఘటనలో నిరోధం ఉన్నది కనుక అదికూడా వివేచనాత్మకమనే వాదించవచ్చు. హెగెల్ ఇటువంటిది వూహించకపోలేదు. రాజ్యం సాధారణమయిన జీవం అనిగాని వ్యక్తులతోకూడిన యంత్రం అనిగాని అతడు పేర్కొనలేదు. లేనిదేదీ కోల్పోయే ప్రసక్తిలేదు. కనుక వ్యక్తి తన సంకల్పాన్ని జనేచ్ఛకు అర్పించడంలో అతడికి పోయేదేమీ లేదు. వ్యక్తి హేతుబద్ధంగా చర్యతీసుకుంటాడు. హెగెల్ శ్రమించి రూపొందించిన వివేచనావాద ఫలితంగా నిరంకుశత్వాన్ని సమర్థించే తీరేదయినా ఉంటే, అటువంటిది ప్రజాస్వామ్య ప్రవక్త చెప్పిన మార్మిక ఉద్వేగవాదంలోనే ఉన్నది, స్వేచ్ఛను అమలుపరచడానికి నియంతృత్వాన్ని సమర్థించాడు. జనేచ్ఛ నిజమయిన సంకల్పమని, దానికి లొంగి ఉండటం వలన ఎవరికివారు తమ స్వభావాన్ని గుర్తిస్తారని రూసో వాదించాడుకూడా. (రూసో, హెగెల్ ఇరువురూ ద్వంద స్వభావంగల అరిస్టోటల్ సిద్ధాంతాన్ని తమ రాజకీయ తత్త్వాలకు ప్రాతిపదికగా స్వీకరించారు).

హెగెల్ దృష్టిలో రాజకీయాలు వివేచనాత్మకమయినవి. అంతేగాని ప్రపంచాను భవంతో కూడినవి కావు. హక్కుల తత్త్వం "రాజ్యాన్ని వివేచనాత్మకమయినదిగా అర్థంచేసుకునే ప్రయత్నం జరిపింది. తత్త్వంగా దీనికి రాజ్యనిర్మాణానికి చాలాదూరం ఉన్నది. రాజ్యాన్ని అర్థం చేసుకోవడం ఎలాగ? అనేది ఈ గ్రంథం చూపుతుంది. అదొక నీతి ప్రపంచం."

నిష్పాక్షికమయిన బాహ్యరీతులతో ఉన్న తాత్త్వికుడికి భిన్నంగా రూసో రాజకీయతత్త్వం ప్రవచనాలతో కూడినది. దానికి ఒక సందేశం ఉన్నది. విధిగా చేయవలసిన వాటిని ఆ తత్త్వం పోషించింది. "జనేచ్ఛకు ఒడంబడటానికి ఎవరు నిరాకరించినా, అందరూ కలసి ఒడంబడేటట్లు చేస్తారు. అంటే వ్యక్తిని స్వేచ్ఛగా

ఉండటానికికూడా వత్తిడిచేయడమే అవుతుందన్నాడు. ప్రతిపౌరుడు తన దేశంలో వ్యక్తిగతంగా ఆధారపడేందుకు వ్యతిరేకంగా పరిస్థితులను సృష్టిస్తుంది.” (Social Contract).

“రాజ్యం నైతిక వ్యక్తిత్వమైతే దానికి సభ్యులకు సాధారణ ఐక్యత ఉండాలి. అన్నిటికంటే తనను తాను కాపాడుకోవడం ముఖ్యం. రాజ్యానికి విశ్వవ్యాప్తమయిన శక్తి ఉండాలి. తద్వారా పూర్ణస్థితికి అనుకూలంగా భాగాలను మలచడం సాధ్యం అవుతుంది.” (సోషల్ కంట్రాక్ట్).

హెగెల్ తత్త్వ పాఠాలను ప్రష్యన్ రాజువద్ద నేర్చుకోలేదు. “ప్రజాస్వామ్య ప్రవక్తవద్ద” స్వీకరించాడు. హెగెల్ రాజ్యసిద్ధాంతం స్వయంగా వూడిపడలేదు. అతడి అతిభౌతికలో, కేవల ఆలోచననుంచి తర్కబద్ధంగా రాజ్యసిద్ధాంతం వచ్చింది. ప్రకృతికి సంబంధించిన జీవ దృక్పథం అరిస్టోటల్ నాడే ఉన్నది. అతడికి ప్లేటోనుంచి సంక్రమించింది. చరిత్రను నిష్పాక్షికంగా చూసేవారికి హెగెల్, అరిస్టోటల్ రాజ్యభావనల పోలిక కనిపిస్తుంది. ప్రకృతి అభివృద్ధి క్రమంలో, ఉన్న స్థితి నుంచి ఉండగల స్థితికి ఉండవలసిన స్థితికి పురోగమిస్తుందని అరిస్టోటల్ భావించాడు. ఈ విధాన లక్ష్యం అంతా నైతికాదర్శం కావడంవలన మానవుడు మాత్రమే దీనిని సాధించగలడు. మానవుడిలో ఇటువంటి నైతిక అభివృద్ధికి రాజ్యం దోహదం చేస్తుంది. కనుక వ్యక్తి కంటే ముందు రాజ్యం ఉన్నది. “ప్రకృతి సృష్టే రాజ్యమనీ వ్యక్తికంటే ముందు రాజ్యం ఉన్నదని రుజువుపరచాలంటే ఏకాకి అయిన వ్యక్తి స్వయంగా సంపూర్ణుడు కాడు. కనుక సంపూర్ణతలో భాగమని తేలిపోతుంది.” (అరిస్టోటల్, పోలిటిక్స్). అందుకే మానవుడు స్వభావసిద్ధంగా రాజకీయ జీవి. ఇది సుప్రసిద్ధమైన అరిస్టోటల్ సూత్రం. మానవుడు మనుగడ సాగించడానికి, అతడు ఎలా రూపొందాలో వాటన్నింటికీ రాజ్యం అవకాశం ఇస్తుంది. మానవుడు నైతిక, వివేచన లక్ష్యాలను సాధించడానికి రాజ్యం అవసరం. తార్కికంగా రాజ్యం ముందుండాలి. ఈ విధంగా ప్రపంచానుభవంలో అసంభవమయిన దానిని తార్కికంగా హేతుబద్ధం గావించారు.

“కుటుంబానికి వ్యక్తికంటే స్వభావ సిద్ధంగా రాజ్యమే ముందుంటుంది. సంపూర్ణత అనేది విడి భాగాలకంటే ముందుండటం అవసరం.” (అరిస్టోటల్, పోలిటిక్స్). అరిస్టోటల్ రాజ్యసిద్ధాంతం శతాబ్దాలుగా ఎదురులేకుండా సాగింది. హాబ్స్ వచ్చేవరకు పరిస్థితి ఇంతే. (అరిస్టోటల్ అతిభౌతికతకంటే సహజతత్త్వంలోను అర్థంలేనిది మరొకటిలేదు. అతడు చెప్పిన రాజకీయం ప్రభుత్వానికి జుగుప్సాకరమయినది. అతడి నైతిక విధానంలో చాలాభాగం అజ్ఞానపూరితం–హాబ్స్, లెవియథాన్). మధ్యయుగాలలో రాజకీయ ఆలోచనలన్నింటిని, జీవసమాజ భావనే ఆవరించింది. నాడు అత్యంత

ఆధిపత్యం వహించింది మతం, రాజ్యం కాదు. సంస్కరణ వాదానంతరం రాజకీయంగా రాజ్యం ప్రాధాన్యతలోకి వచ్చింది. మతజ్ఞానంలో, అరిస్టోటల్‌పై లూథర్ తిరుగుబాటు చేసాడు. కానీ రాజ్యసిద్ధాంతాన్ని అరిస్టోటల్‌నుంచే స్వీకరించాడు. పవిత్ర రోమన్ సామ్రాజ్యం కరిగిపోతున్న కాలంలో ఎరాస్టియన్‌వాదం బలాన్ని పుంజుకున్నది. రాజ్యాన్ని దివ్యమయినదిగా శ్లాఘించడం సంప్రదాయమైంది. లూథర్ ప్రొటస్టంట్ మతానికి చెందిన హెగెల్ ఈ సంప్రదాయాన్ని సంక్రమింప చేసుకుని తన సంపూర్ణతత్త్వంలో ప్రకృతిరాజ్య భావాలలో జీవవిధానాన్ని ప్రవేశపెట్టి రెండింటినీ లీనం చేసాడు.

హెగెల్ తత్త్వంలో కొట్టొచ్చినట్లు, సృష్టి ప్రయోజన ధోరణిగల 17వ శతాబ్దపు సంప్రదాయ వివేచనావాదం బైటపడింది. 18వ శతాబ్దపు ఆలోచనకూడా ముద్రణను వేయలేకపోలేదు. మానవ స్వభావంలో సమగ్రతఉందని హెగెల్ విశ్వసించాడు. మానవాళి నిరంతర చైతన్యతలో కిందిస్థాయినుంచి పైస్థాయికి గమనిస్తున్నట్లు హెగెల్ వూహించాడు. చరిత్రకు సంబంధించిన ప్రేరణాత్మక దృక్పథానికి ముందు 50 సంవత్సరాల క్రితం డార్విన్ జీవపరిణామ సిద్ధాంతాన్ని బైటపెట్టాడు. అందులోనుంచి ఈ సిద్ధాంతాన్ని రాబట్టవచ్చు. మార్పులన్నీ సమగ్రతవైపుకు పురోగమిస్తున్నట్లు హెగెల్ పేర్కొన్నాడు. ప్రపంచ భావనతో మానవుడిలో సృజనశక్తి తాదాత్మ్యం చెందుతున్నట్లు భావించడంలో హెగెల్‌కు ఎట్లాంటి ఆటంకం కనబడలేదు. ప్రపంచభావం మానవుడి మనసులో ఉంటుందని హెగెల్ పేర్కొని దానిని మర్మబద్ధం చేయడానికి అనేకపేర్లు పెట్టాడు. హెగెల్ వివేచన సూక్ష్మస్థాయిలో చూస్తే జీవ విధానంగాను స్థూలంగా చూస్తే విశ్వ నియమంగాను కనిపిస్తుంది. ప్రపంచభావం మానవుడి మనసులో ఉంటే స్వేచ్ఛాసంకల్పం ఎలా సాధ్యం? హెగెల్‌కు ఈ ప్రశ్న అసందర్భం. సంకల్ప పరిమితులు హానికరమయినవి కావు. చలనం ఎప్పుడూ స్వేచ్ఛ వైపుకే తన పైస్థాయికే పోతుంటుంది. కనుక ఇట్లాంటి ప్రశ్న రాదు. హెగెల్ సర్వబుద్ధి వాదంలో ఇది ఒక అతిపోకడ.

వాస్తవానికి ఈ స్థితిని విధివాదంగా భావించరాదు. మార్మికశక్తి మానవుడి మనసులో ఉంది. మనస్సు మానవుడికి చెందినది. కనుక మానవుడు విధిని అదుపులో ఉంచగలడు. ప్రకృతి వివేచనా విధానంలో తాను భాగం పంచుకుంటున్నట్లు గ్రహించిన మానవుడే ఇలా చేయగలడు. హెగెల్ విధానంలో అంతర్లీనంగా ఉన్న మానవతావాదం ఫ్యూయర్‌బాహ్ తత్త్వంలో వ్యక్తమయింది.

చరిత్రను భావవాద దృక్పథంలో చూడటంవలన వీరుడిని కేంద్రస్థానంలో ఉంచారు. అతడు ఇంచుమించు దైవంతో సమానం. నియమాలు అతడికి పరిమితులు విధించవు. మానవాళి చరిత్ర అంతా గొప్ప వ్యక్తుల జీవిత చరిత్రల సమూహమే. ఈ

భావాన్ని హెగెల్ పూర్తిగా వదిలేసాడు. అతడి చరిత్ర తత్త్వంలో వీరులకు స్థానంవేరు. వారు మానవాతీతులు కారు. చరిత్రలో వీరుడు ఆ కాలంలో సాధనగా మాత్రమే ఉపకరించాలి. అచేతన సాంఘిక ప్రయోజనం చేతనంకావడానికి, గుర్తించడానికి వారు తోడ్పడాలి. చరిత్ర గొప్ప వ్యక్తుల సృష్టికాదు. వారంతా చరిత్ర సృష్టి మాత్రమే.

చరిత్రతత్త్వంపై హెగెల్ ఉపన్యాసాలలో ఈ భావాలు స్పష్టంగా ఉన్నవి. ఉదాహరణకు జూలియస్ సీజర్ చారిత్రకపాత్రను విశ్లేషిస్తు ఇలా అన్నాడు. "కేవలం అతడి వ్యక్తిగత లాభానికిగాక ఆ కాలంలో పరిపక్వత దశకువచ్చిన అచేత ప్రేరణను అతడు ఆధారంగా చేసుకుని సాధించగలిగాడు." హెగెల్ ఈ విషయాలను సాధారణ భావంగా పేర్కొన్నాడు. "చారిత్రక మహాపురుషులు తమ లక్ష్యాలను ప్రపంచ భావంతో మిళితం చేస్తారు. ఆ వ్యక్తులు తాము సాధారణ భావాన్ని విప్పారనిస్తున్నాయని అనుకోరు. పైగా వారంతా ఆచరణయుక్తమయిన రాజకీయ వ్యక్తులుకూడా. కాలావసరాలను గురించి వారికి సునిశిత దృష్టి ఉంటుంది. అభివృద్ధికి ఏవి పరిణితి చెందినదో తెలుసుకుంటారు. ఇదే వారి కాలంలో సత్యం."

సృష్టి ప్రయోజన వాదానికి భిన్నంగా చారిత్రక చైతన్యతను చూపినప్పటికీ మార్మికమైన మాటల వలన భౌతిక వూహల వలన ఇదంతా క్రమ్ముకపోయింది. మితిమీరిన మాటల ఆధారంగా అసలు విషయాన్ని రాబట్టితే వికో సంప్రదాయాన్ని పునర్వికాస మానవతావాదాన్ని గ్రహించవచ్చు.

గురువుగారి ప్రేరణవలన హెగెల్ శిష్యుడు ఫ్రెడరిక్‌స్ట్రాన్ జీసస్ జీవితాన్ని వ్రాస్తూ, ప్రొటస్టంట్ క్రైస్తవమత మొండివాదనలను ధైర్యంగా విమర్శించాడు. లూథర్ కాలంనుంచీ వ్యవస్థాపిత పెత్తనానికి నైతిక ప్రమాణాన్ని సమకూర్చిన ప్రొటస్టంట్ క్రైస్తవమతాన్ని దుయ్యబట్టాడు. "ఈ గ్రంథంలో, ఇంగ్లండులో ప్రారంభంఅయి, ఫ్రాన్సులో కొనసాగిన పోరాటాన్ని జర్మనీ చేపట్టింది. మతసంప్రదాయాన్ని స్వేచ్ఛగా విమర్శించడమే ఈ విధానంలో ఉన్నది. ఉద్వేగవాద కాలంనుంచీ, కొనసాగుతూ వచ్చిన అనేక భావాలకు, ఆధిపత్యం వహిస్తూ వచ్చిన ఉద్దేశాలను నిశితంగా పరిశీలించడం గమనించవచ్చు. బైబిల్‌ను మతచరిత్రను వివేచనాయుత విమర్శకు గురిచేయడం నవశకంలోని విజ్ఞాన సంప్రదాయం అయింది. ఆచరణ యుక్తమయినది వివేచనాయుతమైనది నిలద్రొక్కుకోవడం జరిగింది". (లాంజ్, హిస్టరీ ఆఫ్ మెటీరియలిజం). వివేచనకు విజ్ఞానానికి బద్ధశత్రువయిన లూథర్ పిడివాదం జర్మనీ భావదృక్పథాన్ని చుట్టివేసింది. దేశంలో మేధస్సును విమోచన గావించాలంటే సనాతనత్వంపైనా, మితవాదంపైనా తీవ్రదాడి అవసరం. హెగెల్ శిష్యులు ఆ విప్లవాత్మకపాత్రను నిర్వహించారు. గురువుబోధనలలోని వివేచనా దృక్పథానికి వీరు

ప్రాతినిధ్యం వహించారు. జ్ఞానవికాస తత్త్వవేత్తలను అనుకరిస్తూ 1848 విప్లవాన్ని ప్రోత్సహిస్తూ వీరంతా జర్మనీచరిత్రలో నవశకానికి నాందిపలకడంతో తోడ్పడ్డారు.

కొత్తమార్గానికి ముందంజ వేసినవాడు ఫ్యూయర్ బాహ్, కాంట్‌కు సంబంధించిన హెగెల్‌వలె, ఫ్యూయర్ బాహ్ కూడా హెగెల్‌కు విమర్శనాత్మక శిష్యుడు. హెగెల్ విధానంలో ప్రత్యక్ష సారాంశాన్ని ఆధారంగా ఇతడు "భవిష్యత్తు తత్త్వాన్ని" నిర్మించాడు. ది ఎస్సెన్స్ ఆఫ్ క్రిస్టియానిటి అనే చిరస్మరణీయమయిన గ్రంథంలో స్ట్రాస్ కంటే ఇతర హెగెల్ శిష్యులకంటే మతాన్ని విమర్శించడంలో ఫ్యూయర్ బాహ్ చాలా ముందుకు పోయాడు. దేవుడు, మతం మానవ వూహా జనితాలేనని ఇతడు ప్రకటించాడు. పునర్వికాస ధోరణికి ప్రాతినిధ్యం వహిస్తూ ఫ్యూయర్ బాహ్, స్వేచ్ఛను కోరేవారందరూ "దైవానికి బానిసలు కావద్దని" పిలుపునిచ్చాడు.

కేవల తత్త్వ పరిధిలో ఫ్యూయర్‌బాహ్ హెగెల్ చెప్పిన కేవలతత్త్వం అనవసరమని నిరాకరించాడు. భావపరంపర తాత్త్విక జనితమని, మార్మికమయిన వాటిని ఇవి తొలగించగలవని అన్నారు. ఫ్యూయర్‌బాహ్ తత్త్వంలో కేవలత్వాన్ని సృష్టించింది మానవుడే. హెగెల్ తత్త్వాన్ని ఇలా తిరిగదోడటం వలన తత్త్వానికి ఆరంభదశ పదార్థ విశ్వం అయింది. వాస్తవానికి ఇది తిరగదోడటం కాదు. ఎందుకంటే తర్కంనుంచి ప్రకృతి రాదు. వాస్తవమే వివేచన అనే హెగెల్ సూత్రంనుంచి సూటిగా పదార్థ వాస్తవ దృక్పథాన్ని రాబట్టవచ్చు. ఫ్యూయర్ బాహ్ తత్త్వంలో ఆలోచన జీవ పరిస్థితుల ఫలితమే. మానవ ఉనికికి సంబంధించిన జీవ స్థితిగతులన్నీ భౌతిక విశ్వవిధాన రూపాలే. కనుక వ్యక్తి స్వయంగా ధ్యానంచేస్తే ఆలోచన రాదు. దానికి బాహ్యంతో సంబంధం ఉన్నది. ఆత్మాశ్రయవాద విషవలయంనుంచి ఎలాగయితేనేమి తత్త్వం బైటపడింది. మానవతా వాదానికి బాహ్యమయిన వివేచన ఆధారం అయింది. ఈ రీతిలో హెగెల్ విధానం మానవతా సహజ వాదానికి జన్మనిచ్చింది.

✦ ✦ ✦

# హెగెల్ నుంచి మార్క్స్‌కు

వివేచన యుగానికి నాంది పలికిన ఫ్రెంచి విప్లవం, కట్టలు త్రెంచుకుని పొంగి పొరలిన ఉద్వేగవాదానికి చిహ్నం. విప్లవానంతరం తాత్కాలికంగా వచ్చిన రాజకీయ మేధస్సు, ప్రతిక్రియతోబాటుగా ఉద్వేగ వాదాన్ని తిరగదోడటంతో, విప్లవోద్యమంలో ఈ వైఖరులన్నీ కలసిపోయాయి. 19వ శతాబ్దపు మధ్య కాలంలో ఐరోపాలో ఈ ఉద్యమాలు వుగ్రూతలూగించాయి. ఆ శతాబ్దారంభంలో హెగెల్ తత్త్వం సంప్రదాయ వివేచనావాదాన్ని తిరగదోడింది. కార్ల్ మార్క్స్ తన గతి తార్కిక పదార్థ వాదంలో ఈ రెండు ఆలోచనా స్రవంతులను మేళవించాడు. అదే నూతన తత్త్వంగా ప్రకటిస్తూ, ఆవిర్భవిస్తున్న కార్మికవర్గ సిద్ధాంతంగా చెప్పాడు. ఇది అంతకు పూర్వంలేని తత్త్వమని, కేవల ఆలోచనవలన సృష్టించినది కాదని, సమాజంలో వాస్తవ జీవిత ఫలితంగా జనించినదని చాటాడు. ప్రపంచాన్ని వ్యాఖ్యానించే అలవాటును వృథా అని చెప్పి తృణీకరిస్తూ, ప్రపంచాన్ని మళ్ళీ నిర్మించే చారిత్రక పాత్రను అతడి కొత్తతత్త్వం చేపట్టింది. అయితే ఈ తత్త్వం అంత కొత్తదేమీ కాదు. దీని మౌలిక సూత్రం గెటెనుంచి తస్కరించినది :-"ఆదిలో క్రియ ఉన్నది." అనేది గెటె సూత్రమే. వాస్తవ తత్త్వం, కేవల ఆలోచన, ఆదర్శాలకు భిన్నంగా, వాస్తవ జీవితానుభవాన్ని ఆయా కాలాలలో నివసించిన రీతులను ప్రతిబింబిస్తుంటే, సిద్ధాంతపరంగా ఏ వర్గానికయితే ప్రాతినిధ్యం వహిస్తున్నట్లు పేర్కొంటున్నదో, ఆవర్గంకంటే ముందు ఈ తత్త్వం ఉండేందుకు వీలులేదు. వాస్తవానికి మార్క్సిజం కొత్త తత్త్వం కానే కాదు.

హెగెల్‌లో "విప్లవతత్త్వం" కంటే ఇంకా చాలా ఎక్కువ భాగాన్నే మార్క్స్, ఏంగెల్స్ స్వీకరించారు. చరిత్రలో గతి తార్కిక విధానం లేకుండా ఆలోచనా చైతన్యతకు భిన్నంగా స్వతంత్రంగా ఉండజాలదు. కనుక గతితార్కిక పదార్థవాద స్థాపకులు హెగెల్‌నుంచి భావ వాదంతోపాటు గతి తార్కిక పద్ధతిని కూడా సంక్రమింప జేసుకున్నాడు. హెగెల్ గతి తార్కికాన్ని తల్లక్రిందులుచేసి, భావవాదంనుంచి పదార్థ వాదాన్ని తయారుగావించాడనుకోవడం, వూహాపూరిత కల్పన మాత్రమే. వాస్తవానికి హెగెల్ భావవాదంలోని చారిత్రక పరిణామ క్రమానికి, మార్క్సిస్టు సిద్ధాంతంలోని చారిత్రక నియతి వాదానికి మౌలికమయిన తేడా లేదు. హెగెల్ చరిత్ర తత్త్వం ప్రాయికంగా మానవతావాదం ప్రకృతిలోను చరిత్రలోను భావానికిగల గతి తార్కిక

సంబంధం, అతి భౌతిక వూహల విషవలయాన్నుంచి తప్పించుకున్న ధోరణిగా గమనించవచ్చు. ఉన్నత ఆదర్శాలతో ఆచరణకు ప్రాతిపదిక ఏర్పడింది. లౌకిక ప్రపంచ వ్యవహారాలలో పాల్గొంటు, దానిని పునర్మించుకుంటూ, ఆలోచనాపరుడైన మానవుడు వీటన్నింటినీ చేయగలడని ఈ తత్త్వం చెబుతున్నది. ఇటువంటి మానవతా దృక్పథంగల హెగెల్ భావవాదం, ఆచరణతోకూడిన పదార్థవాద తత్త్వానికి ఎలా దారిచూపుతుందో తెలుసుకోవడం సులభం.

భావవాద సంప్రదాయంనుంచి తెగత్రెంపులు చేసుకోవడానికి వీలుగా, ఆలోచనలకు మూలం "చలనంతో" ఉన్న పదార్థంలో ఏంగెల్స్ చూచాడు. తార్కికంగా, ఇవిరెండూ జీవపరిణామంలో ఉన్నాయని, ఆవిధంగా పరస్పరం ప్రభావితం గావించి నిర్ధారించడం సాధ్యమని హెగెల్ అంగీకరించాడు. లేకుంటే సాంఘిక ప్రపంచానికి మానవుడు యజమానికాలేడు. న్యూటన్‌యొక్క ప్రకృతితత్త్వం విశ్వాన్ని యాంత్రిక భావంతో చూచినా, అందులోనే దేవుడికి స్థానం కల్పించాడు. చలనంతో కూడిన పదార్థభావన ఆపద్ధర్మంగానైనా ఈ స్థితినుంచి కొంత మెరుగయింది. చలనం (శక్తి లేదా జీవశక్తి) రూపంలో దేవుడు భౌతికక్రమంలో జోక్యంచేసుకుని పదార్థ పరిణామాన్ని ప్రభావితం చేస్తాడు. మానవుడికి సృజనశక్తి ఉండదు. అటువంటప్పుడు ఆచరణతో కూడిన మార్క్సు తత్త్వానికి నిలువనీడ లేదు. కనుక మార్క్సిస్టు పదార్థవాదం, తాత్త్విక ఆలోచనగా స్వయంసంపూర్ణ విధానం కావాలంటే తప్పనిసరిగా, పైకి కనిపించకపోయినా భావాల సార్వభౌమత్వాన్ని గుర్తించాలి. భౌతిక సాంఘిక రీతులవలె భావాలు కూడా వాస్తవమని ఒప్పుకోవాలి. వివేచనాత్మక భావవాదం, మతజ్ఞానానికి సృష్టి ప్రయోజనా వాదానికి భిన్నంగా, పదార్థవాద ఏకత్వంలోకి చేరుకోవాల్సిందే. అలాగే పదార్థవాద తత్త్వం కూడా నీచంగా దిగజారిపోతుంది. లేదా న్యూటన్ ప్రకృతి తత్త్వంలోకి సడలిపోతుంది. అప్పుడు మానవత్వారోపణగల దైవం చోటుచేసుకుంటుంది.

ఆలోచనను జీవినికలిపి మొట్టమొదట సిద్ధాంతీకరించింది హెగెల్ మాత్రమే. మార్క్సు ఏంగెల్స్ తమ గతితార్కిక పదార్థవాదానికి ఒక మూలసూత్రంగా దీనిని స్వీకరించారు. ప్రాయికంగా ఇది భావ సిద్ధాంతం. రెండు వస్తువుల తాదాత్మ్యం అంటే అందులో వాటి సహవాసం ఇమిడిఉంది. జీవపరిణామానికి ముందే పదార్థపు ఉనికి ఉంది. ఆలోచన ఉనికి తాదాత్మ్యంచెందితే చైతన్యావస్థ జీవితంపై ఆధారపడదన్న మాట. చైతన్యతలోనే ఆలోచన జనిస్తుంది. భౌతిక విశ్వంతోపాటు, విశ్వచైతన్యతకూడా ఉనికిలో ఉన్నదన్న మాట. ఇది అంగీకరించడం వలన, ఆలోచన–ఉనికి తాదాత్మ్యంచెందిన సిద్ధాంతం ఆలోచనారహితంగా మార్క్సిస్టు పదార్థవాదంలో చోటుచేసుకున్నది. పదార్థవాద తత్త్వాన్ని మొదలంటా నరికివేసిన ఆలోచన ఇది.

మరొకవైపున ఆలోచన, ఉనికితో తాదాత్మ్యం చెందిందని, జీవపరిణామంలో ఒకస్థాయిలో ఇది జరిగినదని ఒప్పుకుంటే, అప్పుడు భావవాదసిద్ధాంతాలన్నీ ఆర్థికసంబంధాలపై ఉపరితల నిర్మాణంలోనే మార్క్సిస్టు సిద్ధాంతం తుడిచిపెట్టుకుపోతుంది. చైతన్యతను జీవితంతో ముడిపెట్టిచూసే పదార్థవాదతత్త్వం, ప్రాణానికి మూలాన్ని జీవపదార్థంలో అన్వేషించినప్పుడు, ఆలోచన ఉనికి తాదాత్మ్యం చెందుతాయనే సిద్ధాంతం చెప్పేదేమంటే, ఆలోచన భౌతిక (సాంఘిక) ఉనికితో సమానంగా ఉంటుందనే. జీవపరిణామంలో, సాంఘిక చారిత్రక పరిణామంలో ఇలాంటి క్రమం ఉంటుందన్నమాట. ఇటువంటి సిద్ధాంతం వలన భావవాదం కాస్తా పదార్థవాదంలోకి ప్రవహిస్తుంది. భావవాదంస్థానే పదార్థవాదంవచ్చి. సమకాలీన–భవిష్యత్తు తత్త్వంగా రూపొందుతుంది. గతంలో ఆలోచన చరిత్ర సాధించినదంతా తొలగించి. ఈ కొత్త తత్త్వం ఇలా ఆవిర్భవిస్తుంది.

“పదార్థవాదం రావడానికి భావవాదం తోడ్పడిందనవచ్చు. క్రమపద్ధతిలో ప్రధానమయిన భావాలను ఏర్పరచడం ముందుకుపోతున్న ప్రకృతివిజ్ఞానాన్ని వ్యతిరేకించి రెచ్చగొట్టడం వలన ఇలా జరిగింది”. (లాంజ్, హిస్టరీ ఆఫ్ మెటీరియలిజం). 19వ శతాబ్దంలోని మధ్యకాలంలో జర్మనీమేధావులపై హెగెల్ తత్త్వప్రభావం ఇక్కడ సరిగ్గా అంచనావేసారు. ఫిషె సాంస్కృతిక సంకుచిత వాదాన్ని భగ్నంచేసి సాహిత్యంలో మార్మికమయిన ఉద్వేగవాదాన్ని అదుపులో ఉంచేందుకు హెగెల్ తత్త్వం సహకరించింది. ఉద్వేగ పరవలింతల నుంచి, అతిభౌతిక వూహలను నుంచి కోలుకుని, ప్రకృతి విజ్ఞాన అధ్యయనంలో శ్రద్ధను కనబరచడం స్పష్టంగా ఉంది. ఈ ధోరణి కొత్తేమీకాదు. కాంట్‌తోనే ఇది ప్రారంభం అయింది. అతడు తన విమర్శనా రచనలు చేయకముందే తరచుపదార్థవాదానికి సమీపంగా వచ్చాడు.” (లాంజ్). న్యూటన్ అనుచరుడుగా కాంట్ ప్రారంభించాడు. యాంత్రిక విశ్వవాదచరిత్రలో కాంట్–లాప్లాస్ సిద్ధాంతం ఒక మచ్చుతునక అతి భౌతికవాదంలోకూడా, భావవాదంకంటే పదార్థవాదానికి కాంట్ చేరువలో ఉన్నాడు. యదార్థ వస్తువు భావన వలన భౌతిక ప్రపంచపు బాహ్యసత్యాన్ని గుర్తించినట్లయింది. కాంట్ ఇరువురిశిష్యులలో, హెర్డర్ పునర్వికాస మానవతా సంప్రదాయం వలన ఉత్తేజితులు కావడమేగాక వైజ్ఞానిక ఆలోచనకూడా సంక్రమింపజేసుకున్నాడు. ఫిషె ఉద్వేగపు దేశభక్తిలో ఉద్రేకంగా కొట్టుకుపోయాడు.

హెగెల్ అనంతరం అతడి బోధనల విప్లవ దృక్పథ ప్రభావంవలన, జర్మనీ వివేచనాత్మక సంప్రదాయ వాదానికి, కవిత్వపూరిత ఉద్వేగవాదానికి స్వస్తి పలికింది. హెగెల్ అనంతరం సంప్రదాయ మితవాదాలను వ్యతిరేకిస్తూ, ఫ్రెంచి జ్ఞానవికాసపు వైజ్ఞానిక సహజవాదం తిరిగి తలెత్తింది. లెబ్నిజ్ దాడికి తట్టుకుని నిలబడిన స్పినోజా

హెగెల్ అనంతరం జర్మనీ తాత్త్విక ఆలోచనపై తన ప్రభావాన్ని చూపెట్టాడు. ప్రాచీన వివేచనకు అరిస్టోటల్‌గాక ఎపిక్యూరస్ ఆధారమయ్యాడు. యువ హెగెల్ వాదులు గట్జ్‌కోవ్, ముంట్, లాబె, ప్రభృతుల వలన జర్మన్ విశ్వవిద్యాలయాలలో ఎపిక్యూరస్ తత్త్వం చొచ్చుకపోయింది. అప్పటివరకు మతపరమైన సనాతనత్వం, మితవాదం పీఠం వేసుకుని ఉన్నది. ఎపిక్యూరస్‌పై మార్క్స్ సిద్ధాంత గ్రంథం వ్రాయగా అతడికి డాక్టరేట్ పట్టా జెన విశ్వవిద్యాలయంలో లభించింది.

యువ హెగెల్ వాదుల మతవిమర్శ వలన, క్రైస్తవ మతంపైనా, లూథర్ రాజ్యంపైనా పోరాటానికి ప్రోత్సాహం లభించింది. 'లెబిగ్, అలెగ్జాండర్ వామ్ హంబోల్ట్' వంటి గొప్ప శాస్త్రజ్ఞుల కార్యకలాపాలు ఈ పోరాటానికి మద్ధతునిచ్చాయి. ఇందులో ఒకరు మొట్టమొదటిసారిగా జర్మనీ విశ్వవిద్యాలయంలో (గ్రైసెన్) రసాయినిక శాస్త్రాధ్యాయనం ప్రవేశపెట్టగా, మరొకరు బెర్లిన్ విశ్వవిద్యాలయాన్ని స్థాపించారు. ఇతడు భౌతిక శాస్త్రజ్ఞుడు ఐరోపాలో ప్రసిద్ధి చెందినవాడు. బెర్లిన్ విశ్వవిద్యాలయంలోనే హెగెల్ తత్త్వబోధన చేసాడు. కేబనా, తదితర సుప్రసిద్ధ ఫ్రెంచి శాస్త్రజ్ఞులనుంచి నేర్చిన జోనాస్ ముల్లర్, ఎర్నస్ట్ హెన్ రిట్జ్ వెబర్ మెదడును గురించిన శారీరక శాస్త్రజ్ఞానాన్ని వ్యాప్తిలోకి తెచ్చారు. చిరకాలంగా గౌరవవాదరం పొందుతున్న పదార్థరహిత ఆత్మ అనే సిద్ధాంతం ఇంతటితో తగ్గుముఖం పట్టింది. పదార్థవాద ప్రచారకులయిన కార్ల్ ఓక్ట్, మోషాట్, బుఖనర్ వంటి వారికి ప్రాతిపదిక లేర్పడినవి.

"మత రంగంలో భావవాద ఉప్పెన వెనుకంజ వేయడంతో చాలా ప్రభావాన్ని చూపెట్టింది. పవిత్ర ఉద్వేగవాదం, కవిత్వ మతవాదంపట్ల ఉన్న ఉత్సాహం అంతా అదృశ్యం అయింది." (లాంజ్) హెగెల్ చరిత్రతత్త్వ ప్రమాణంతో విజ్ఞానానికి గీటురాయిగాచేసి మతసంప్రదాయాలను క్రైస్తవ వ్యవస్థను పరిశీలింప నారంభించారు. "పెత్తందారీతనం అంటువ్యాధిలా వ్యాపిస్తుండగా" (కార్ల్ ఓక్ట్, పిక్చర్స్ ఆఫ్ ఏనిమల్స్ లైఫ్). 18వ శతాబ్దంలో పదార్థవాదం పెంపొందించిన హెగెల్ వాదులు. పై ధోరణికి వ్యతిరేకంగా మేధారంగంలో తిరుగుబాటు చేసారు. హెగెల్‌ను ప్రమాణంగాచేసి మార్క్స్ 18వ శతాబ్దపు పదార్థవాదాన్ని తిరస్కరించాడు. ("కార్ల్‌మార్క్స్ 18వ శతాబ్దపు పదార్థవాదంతో ఆగిపోలేదు. తత్త్వాన్ని అతడింకా ముందుకు తీసుకుపోయాడు. జర్మనీ సంప్రదాయ తత్త్వంతోనూ ముఖ్యంగా హెగెల్ విధానంతోను మార్క్స్ తత్వస్థాయిని పెంపొందించాడు. "లెనిన్,టీచింగ్స్ ఆఫ్ కార్ల్‌మార్క్స్")

సాహిత్య రచనలు మతవాదాన్ని పురిగొల్పాయి. (కార్ల్‌ఓల్ట్, పిక్చర్స్ ఆఫ్ ఏనిమల్ లైఫ్, కోలర్‌గ్లాబే అండ్ విస్సెన్ సాఫ్ట్ : రుడోల్స్ వాగ్నర్, లెటర్స్ ఆన్ ఫిజియాలజి: మోల్‌షాట్, క్రిస్‌లాఫ్‌డెస్ లెబస్ : బుఖనర్, క్రాఫ్ట్ అండ్ స్టోఫీ). హెగెల్ అనంతరం

జర్మనీ పదార్థవాదులు తెచ్చినవివాదం, సంస్కరణ వాదంలోతీవ్రతను స్ఫురణకు తెస్తుంది. అయితే ఈసారి విజ్ఞాన శాస్త్రజ్ఞులు సనాతనత్వాన్ని వదులుకున్నారు. బుఖనర్ గ్రంథం చాలా చలనం కలిగించింది. భావవాద తాత్త్వికులు మితవాద విద్యావేత్తలు, సనాతన మతవాదులు, మతజ్ఞానులు ఈ గ్రంథాన్ని అతి తీవ్రంగా ఖండించారు. మార్క్స్ యాంత్రిక పదార్థవాదంలోని అసంగతాలను అతికష్టంతో బైటపెట్టినా బుఖనరీతో పోలిస్తే ఇతడి గతితార్కిక పదార్థవాదం అంతగా ఆమోదయోగ్యం కాలేదు. అది అర్థరహితమైనది. వాస్తవానికి వ్యవస్థాపిత క్రమానికి చెందిన సిద్ధాంతపరమైన ఉపరితల నిర్మాణాలనుపడగొట్టే ప్రయత్నాలను, మార్క్స్ వాదం బలహీనపరిచింది. ఈ ఉపరితల నిర్మాణం అనేది మతాన్ని గురించి, పూజారులను గురించి, మార్క్స్ ప్రవచించాడు. దీనివలన ఆనాడు వాస్తవ అతిభౌతికత నుంచి హెగెల్ తత్త్వానికి సంబంధించిన వివేచనాత్మక మానవతా చారిత్రకవాదంనుంచి జనించిన అభ్యుదయ ఆలోచనలకు మార్క్స్ దూరంగా ఉన్నాడు. హెగెల్ అనంతరం వైజ్ఞానిక పదార్థవాదానికి సంబంధించిన ప్రజాస్వామ్య ధోరణికి ప్రాతినిధ్యం వహిస్తున్న బుఖనర్ తన ప్రసిద్ధ గ్రంథపీఠికలో ఇలా వ్రాసాడు. "తత్త్వస్వభావాన్ని బట్టి సాధారణధోరణి ఉండాలి. విద్యావంతులకు అర్థంగాని వాదనలు చెప్పడం దండగ స్పష్టంగా ఆలోచించినదాన్ని స్పష్టంగానే చెప్పాలి," (బుఖనర్ క్రాఫ్ట్ అండ్ స్టాఫ్). మార్క్స్‌వలె యాంత్రిక పదార్థవాదులుకూడా తత్త్వాన్ని వూహల పరిధినుంచి భూమిమీదకు తెచ్చి జీవిత వాస్తవ అనుభవాలను ప్రతిబింబించాలన్నాడు. అంటే విశ్వజనీనమయిన వాస్తవికతలను, నైరూప్యతలను, అతిభౌతికతకు సంబంధించిన ఇంద్రియాతీత విషయాలను. తత్సంబంధమయిన అస్పష్టభావాలను పూర్తిగా నిరాకరించడమే నన్నమాట.

"బుఖనర్ తన బహుముఖ ప్రజ్ఞలను విజ్ఞాన అన్వేషణకు కొంతవరకు అన్వయించాడు. భౌతిక విజ్ఞాన పరిశోధనా ఫలితాలు సాంఘిక రాజకీయ దృక్పథంలో చూడటానికి వాటిని ప్రజలలో ప్రచారం చేయడానికి తన శక్తిని కొంతవరకు వినియోగించాడు. అతడి కార్యకలాపాల మధ్య, మానవాళి పురోభివృద్ధి దృష్టిమాత్రం ఎన్నడూ విస్మరించలేదు." (లాంజ్, హిస్టరీ ఆఫ్ మెటీరియలిజం). బుఖనర్, మోల్‌షాట్ ఇరువురూ కేవలత్వ భావాన్ని నిరాకరించి. జ్ఞానవాదంలో సాపేక్షత దృష్టిని అనుసరించాడు. తొలి సత్యం అనే సమస్య ఎన్నడూ పరిష్కారం కాదు. ప్రాపంచికానుభవ పరిశోధనలు వెల్లడించిన సత్యాలతోనే మానవుడు సంతృప్తి చెందాలి. ఇందులో అలౌకిక భావాలకు తావులేదు. అనుభవ హద్దులను దాటిపోవడానికి వూహ ప్రయత్నించి నప్పుడల్లా, తత్త్వం దోషబద్ధమవుతున్నది. వివేచన విశ్వాసాన్ని అనుసరించలేదు. తత్త్వాన్ని ప్రకృతివలె దారిచూపే నడిపించాలి. (బుఖనర్, N ATUR UND GEIST).

వ్యక్తికి వస్తువుకు ఉన్న సంబంధాన్ని మోల్‌షాట్ జ్ఞానపరంగా పరిశీలించాడు.

ఆలోగా ఉనికి ఐక్యతకు సంబంధించిన హెగెల్ సిద్ధాంతాన్ని ఇతడు సందేహించాడు. హెగెల్ తత్త్వంలో తార్కికంగా చూస్తే, జగత్తే దైవం అనేభావంతో, విశ్వం మానవుడు తాదాత్మ్యం చెందడం గుర్తించవచ్చు. యదార్థవస్తువు తెలియదని, తెలుసుకోవడానికి వీలులేదని చెప్పిన కాంట్ భావాన్నికూడా మోల్‌షాట్ నిరాకరించాడు. "ప్రతీదీ మనతో ఉన్న సంబంధాన్ని బట్టి తెలుసుకుంటాం. దీన్నే పరిమితజ్ఞానం అంటాం. మానవ జ్ఞానం ఇంద్రియాలవలన పరిమితులకు లోనవుతున్నది. ఇటువంటి జ్ఞానం చెట్టును ఉన్నది ఉన్నట్లుగా పరిశీలించి చెబుతుంది. అది చాలా స్వల్పం. చెట్టు దానంతటదే ఎలా ఉందో మనం తెలుసుకోవాలి. అప్పుడు మనకు కనిపించినట్లుగా ఉన్నదనే భ్రమ తొలగిపోతుంది. అయితే చెట్టు దానంతటది ఎక్కడ ఉన్నది? జ్ఞానం అంటే తెలుసుకునే వాడొకడుంటాడని భావించదా? ఫలితంగా వస్తువుకు పరిశీలకుడికి మధ్య సంబంధం ఏర్పడదా? రెండూ ఉనికిలో ఉంటే, మనిషివలె చెట్లుకూడా మానవుడితో సంబంధాన్ని బట్టి అతడి దృష్టిపై పడే ప్రభావాన్ని బట్టి అది వ్యక్తమవుతూ ఉంటుంది. ఈ సంబంధం వలననే చెట్టును స్వతహాగా ఉంటుందంటున్నాము. వస్తుజ్ఞానం, పరిశీలకునికి స్వతహాగాఉన్న వస్తువుకూ మధ్య ఉండే జ్ఞానంలో కలిసిపోతుంది. జ్ఞానం అంతా బాహ్యజ్ఞానమే"

జ్ఞానానికి సంబంధించిన వస్తుగత లక్షణం తప్పనిసరి అయినప్పటికీ అంతమాత్రాన బాహ్యప్రమాణం నాశనంకాదు. బాహ్యజ్ఞానం సంపూర్ణజ్ఞానం కాదు. ప్రపంచానుభవంతో పొందిన జ్ఞానం బాహ్యమేగాని, సాపేక్షకము కూడా. ఇది "ఉన్నత సమన్వయం." వస్తువుకి వ్యక్తికి మధ్య జ్ఞానసంబంధమయిన సమస్య ఇలా పరిష్కారం అయింది. హెగెల్ వివేచనాత్మకవాద ఫలితంగా ఈ సమన్వయం కుదిరింది. తత్త్వాన్ని అనేక యుగాలుగా పట్టిపీడిస్తున్న ఆత్మాశ్రయ వాదం, ద్వంద వాదం అంతవరకూ కొనసాగుతూ వచ్చాయి. ఇది వ్యతిరేకతకు ప్రతికూలించడం కాదు. సత్యానికీ దోషానికీ వివేచనాత్మక విచక్షణా ఫలితంగా ఈ విధానం జనించింది. ప్రపంచానుభవం, తర్కంవలన నిర్ణయానికి ఒక ప్రమాణం ఏర్పడింది. వూహతోకూడిన భావ వాదాన్ని మొండి భౌతికవాదాన్ని ఒక తత్త్వంలో కలిపి, వీటన్నింటికి మించిన వాస్తవికతతో రూపొందించడానికి, అన్నింటికి ఆవరించిన హెగెల్ విధానం తోడ్పడింది.

18వ శతాబ్దపు పదార్థవాదం లోప భూయిష్టం. ఆనాటికి విజ్ఞానం తగినంత లేకపోవడమే ఇందుకు కారణం. విజ్ఞానం విస్తరిస్తుంటే అందుకు అనుగుణంగా పదార్థవాద అతి భౌతికం, ఇంద్రియ జ్ఞానంతో కూడిన జ్ఞానవాదం, మనో విజ్ఞానం దోషాలనుంచి విమోచన పొందాయి. హెగెల్ అనంతరం మేధావుల కార్యకలాపాల వలన ఇటువంటి తాత్త్వికాభివృద్ధి జరిగింది. ఓక్ట్, మోల్‌షాట్ బుఖనర్‌ల "యాంత్రిక"

పదార్థవాదాన్ని, గోటిన్‌జన్‌కు చెందిన తత్త్వాచార్యుడు లోట్జె అనుసరించాడు. చికిత్సా విధానంలో అతడు యాంత్రిక విజ్ఞానాన్ని అనుసరించడంతో, జీవశక్తి సిద్ధాంతం చావుదెబ్బ తిన్నది. ఇటువంటి ప్రోత్సాహం వలన యువకుడైన హెన్రిడ్జ్ జోల్‌బె, పుస్తకాన్ని ప్రచురిస్తూ ప్రపంచానుభవ జ్ఞానవాదాన్ని భౌతికవాద తత్త్వంతో గట్టిపరిచాడు. (NEUE DARSTELLUNG DES SELSATIOMALISMUS) పదార్థంలోని చలనంవలన ఈ గ్రంథం సమస్యను పరిష్కరించింది. పదార్థాన్ని అతి భౌతిక విషయంగా పరిగణించారు. క్రమబద్ధం చేసే సూత్రంగా చలనాన్ని గ్రహించారు. జోల్‌బె కొత్తగా చెప్పిన వాదాన్నిబట్టి, ఇంద్రియ వాదం ఆత్మాశ్రయ దోషంలో పడకుండా విముక్తి పొందింది. కాన్‌డియాక్, హెల్‌విషస్‌లు అభివృద్ధిచేసిన అనంతరం కూడా ఆత్మాశ్రయ దోషం కొనసాగింది. లాక్, అతడి ఫ్రెంచి అనుచరులు, భావాన్ని పదార్థాలలో ప్రస్తావించాడు. అయితే ఇంద్రియవాది పొందికగా చేస్తే ఇంద్రియ సంవేదనలో గోచరమవుతున్నాయి గనుక, పదార్థ భావన అనవసమనిపించవచ్చు. ఫలితంగా ఇంద్రియ వాదంనుంచి తార్కికంగా అజ్ఞానవాదం ఆత్మాశ్రయ భావవాదం రావచ్చు. ఈ ప్రమాదం జరగకుండా ఉండాలంటే జ్ఞానవాద హద్దులను అధిగమించి, అతి భౌతికతతో కాపాడుకోవాలి. లాక్, కాన్‌డియాక్, హెల్‌విషస్‌నుంచీ సంక్రమించిన జీవజ్ఞాన సహాయంతో జోల్‌బె సంవేదన వాదాన్ని అభివృద్ధి పరిచాడు. దీనిని పదార్థవాదంతో మేళవించగా అది కూడా మెరుగయింది.

ఫ్యూయర్‌బాహ్, ఓక్ట్, మోల్‌షాట్ ఇటీవల సాధించినదంతా సునిశితంగా పరిశీలిస్తే అసంతృప్తికరంగా ఉంటుంది. ప్రతీదీకేవలం సహజధోరణిలో వివరించడం సాధ్యమని పేర్కొన్నారుతప్ప, స్పష్టమయిన రుజువుకోసం ప్రయత్నించలేదు. వారింకా మతప్రాతిపదికపైనా వూహతోకూడిన తత్త్వంపైనా ఆధారపడి ఉన్నారు. మళ్ళీ ఈ ధోరణినే వారు విమర్శించారు.'' (CZOLBE, NEUE DARSTELLUNG DES SALSATIONALISLUS).

పదార్థవాద భౌతిక విధానాన్ని పెంపొందించే ప్రయత్నంలో జోల్‌బె, పిడివాదంనుంచి, ఆధారంలేని వూహలనుంచి విమోచనపొందాడు. కేవలం వైజ్ఞానిక దృక్పథంలో కొనసాగించాడు. సంవేదనవాదాన్ని కొత్తగా ఒక మూలసూత్రంగా పేర్కొనడంతో అలౌకిక పద్ధతులను తొలగించి, శారీరకజ్ఞానంపై ఆధారపడ్డాడు. ప్రయోజనకారీ అయిన ప్రతిపాదనకుమించి మరే ప్రమాణమూ అక్కరలేదన్నాడు. అటువంటి ప్రతిపాదన (కావాలంటే ఇష్టమయినది అనుకోవచ్చు) లేకుండా ఏ సంఘటన గురించి అయినా ఒక అభిప్రాయాన్ని ఏర్పరచుకోవడం సాధ్యంకాదు. అంతర, బాహ్య అనుభవాలేగాక, వస్తుతత్త్వాలకు సోపాధిక ప్రతిపాదనకూడా అవసరం.'' (జోల్‌బె).

అతడింకా ఇలా వాదించాడు : ఇంద్రియాతీత ధోరణిని తుదికారణాన్ని త్యజించడం వలన బేకన్ తత్త్వంలో ముందుకుపోగలిగాడు. అతడి కాలంనుంచీ ఆ పద్ధతికి మద్ధతు చేకూరింది. జీవశక్తి కేవలం కట్టుకథ అని లాక్ బైటపెట్టడం ఇందుకు ప్రమాణం. పారమార్థికశక్తుల భావనను పూర్తిగా ఎందుకు వదిలేయరాదు? జోల్‌బె కొత్త విధానంవలన సంవేదనవాదం అతి భౌతికతలోనేగాక జ్ఞానవాదంగానూ పెంపొందినది. నైతికశాస్త్రానికి ఇందులో చాలా ప్రధానమయిన పాత్ర ఉంది. పదార్థవాదాన్ని సహజతత్త్వంలో మేళవించడం తద్వారా మానవతా నైతికశాస్త్రాన్ని రూపొందించడం జోల్‌బె తలపెట్టినవాటిలో ముఖ్యమయినది. మనిషికీ మనిషికీ ఉన్న సంబంధంవలన సహజంగా సత్సంకల్పం పెంపొంది, తప్పనిసరిగా నైతికత జనిస్తుందని అతడు నమ్మాడు.

మతేతర, పారమార్థికేతర తత్త్వ విధానాలన్నింటికీ నీతిశాస్త్రం ఒక్కటే లోపం లాక్ చెప్పిన "ఆనంద సూత్రం" పరిస్థితిని మెరుగుపరచలేదు. హెల్‌విటస్ విస్తరించిన ప్రయోజనావాద నీతిశాస్త్రంకూడా, తార్కికంగా బెంథాం, అతని అనుచరులు, చెప్పిన సాపేక్షతా నీతికే దారితీసింది. ఉత్తరోత్తరా కార్ల్‌మార్క్స్, పదార్థవాద తత్త్వానికి, నీతిశాస్త్రం ఉండటానికి వీల్లేదనే వాదనకు తోడ్పడ్డాడు. మతరహిత వివేచనాత్మక నీతిబాహ్య ప్రమాణాలతో ఉండగలదనే సమస్య ఇంకా పరిష్కరించవలసి ఉంది. పునర్వికాసకర్తలు ఎపిక్యూరస్ సంప్రదాయం వలన ఈ సమస్యను పట్టించుకోలేదు. ఫ్రెంచి జ్ఞానవికాసానికి చెందిన వైజ్ఞానిక మానవతా సహజవాదం చక్కనిధోరణి చూపింది. హెగెల్ విధానంలో ఆశాజనకమయిన వైఖరిని జోల్‌బె కనుగొన్నాడు. ప్రకృతికి భావానికిగల వైవిధ్యం అందులో తొలగిపోయింది. "ప్రపంచ చరిత్రను గురించి హెగెల్ దృక్పథం వలన భావం ప్రకృతికి సంబంధించిన ద్వందవాదం, ఐక్యతలోని ఉన్నతస్థాయి తక్కువస్థాయిల మధ్య ఒక సంధి దశగా ఉన్నది. ఒకవైపున మత సిద్ధాంతాలతో సంబంధం పెట్టుకుని మరొక వైపున మతాలను ప్రక్కకు పెట్టాలనే ధోరణులు తలెత్తడానికి అవకాశాలు ఇచ్చింది." (లాగ్, హిస్టరీ ఆఫ్ మెటీరియలిజం.)

భావ పరిణామంలో ఒక దశకు చేరుకున్న తరువాత మతం (అలౌకికంలో నమ్మకం) వివేచనాత్మకం కాకుండాపోతుందని హెగెల్ భావించాడు. కనుక స్వేచ్ఛనుకోరే అభ్యుదయ జర్మనులు సంకుచిత జాతి, దేశ దృక్పథాలకు మించి చూస్తారని వాంఛ భవిష్యత్తును గమనిస్తారని భావించారు. "గ్రీకుల కాలంలో ఉన్న స్వేచ్ఛాయుత సమన్వయ మానవాళిని, ప్రాచీన రోమన్ కాలంలో ఉన్నా స్వయంగా ఆధారపడగల మానవతా వైఖరిని అలవర్చుకుంటారని అనుకున్నారు" (డేవిడ్‌స్ట్రాస్). సంవేదన వాదంతోను రూపొందించిన రీతిలో సహజవాదానికి పదార్థవాదానికి సమన్వయం అని. హెగెల్ అనుచరుడు స్ట్రాస్ వూహించినట్లుగా భవిష్యత్తుకు తత్త్వమనీ నమ్మాడు : తదనుగుణంగా

అతడు ఈ నిర్ణయానికి వచ్చాడు : "లోకంలో జీవితంపట్ల అసంతృప్తి చెంది, అందువలన జనించే నైతికావసరాలుంటే అవి అవినీతికరమయినవని అనవచ్చు. అటువంటివి వినయ విధేయతలకు సూచనకాదు. తలబిరుసుతనానికి, గొప్పలు చెప్పుకోవడానికి మాత్రమే చిహ్నం అని భావించాలి. మనకు తెలిసిన ప్రపంచాన్ని ఇంద్రియాతీత లోకాన్ని వూహించడం ద్వారా మెరుగుపరచాలనడం, మానవుడిని అలౌకిక శక్తుల ద్వారా ప్రకృతిని మించిపోయేటట్లు చేయాలనడం అర్థరహితం. ప్రపంచంతో అసంతృప్తి చెందడం నైతిక వివేచనకానే కాదు. అదొక నైతిక బలహీనత మాత్రమే. వాస్తవ సూత్రాలను పెంపొందించాలంటే, తప్పుడు సూత్రాలు అవసరమయిన కుశాగ్ర బుద్ధి అవసరంలేదు, కనుక ఇంద్రియ సంవేదనకు సూక్ష్మబుద్ధి అవసరంలేదు. కానీ వాస్తవమయిన నైతికతకు సూక్ష్మబుద్ధి అవసరం".

నీతిభావన తననుంచి విడదీయడానికి వీలులేదు గనుక, అది అంతర్వర్తిగా ఉంటుంది కనుక, రుడాల్ఫ్ వాగ్నర్ దేహంలేని ఆత్మను వూహించాడని జోల్చె ప్రకటించాడు. "మా విషయంలోకూడా అలౌకికంలేని శారీరకశాస్త్రంగాని, వివేచనా సూత్రంగానికాక, సహజమయిన ప్రపంచంలో నైతికభావన, దానితోసంతృప్తి చెందడం వలన అలౌకిక ఆత్మను నిరాకరిస్తున్నాము." (CZOLDE, DIE GRENZEN UND URSPRUNG DER MENSCH LICHEN ERKENNTNIS) జోల్చె నీతి శాస్త్రంలో కాంట్ ధోరణులు ఉన్నవి. అయినప్పటికీ నైతిక సాపేక్షతలోని ఒడుదుడుకులను నీతికి సంబంధంలేని విధానంలోను ఉన్న లోపాలను సవరించాలంటే, భౌతిక శాస్త్రానికీ మానసిక శాస్త్రానికీ ఉన్న అఖాతానికి వారధి నిర్మించాలని అన్నాడు ఆ విధంగా వివేచనాత్మక నీతిశాస్త్రానికి బాటలు వేసారు.

మానవుడి అనంతమయిన భావస్వేచ్ఛా పోరాటంలో ఇట్లాంటి మేధస్సు ప్రయత్నాలు చాలా ప్రధానమయిన దశలు మాత్రమే. మార్క్సు వాటిని మెచ్చుకోలేకపోయాడు. మార్క్స తత్త్వంలో అభ్యంతరకరమైన హెగెల్ లక్షణాలు సంక్రమించాయేగాని, అభ్యుదయకర విప్లవాత్మక ధోరణులు రాలేదు. మార్క్సిజంలో (గతితార్కిక పదార్థవాదం) తాత్త్విక పునాదులను ఆస్కారం ఏర్పడింది. కమ్యూనిస్టు ప్రణాళిక ప్రచురించేముందే, ఆ కాలంలో ఏంగెల్స్ మద్దతుతో మార్క్సు, యువహెగెల్ వాదులతోను, జర్మన్ సోషలిస్టులమని భావించే తాత్త్విక రాడికల్స్‌తోను తీవ్రమైన వాదోపవాదాలు సాగించాడు. వారంతా ఫ్యూయర్ బాహ్ శిష్యులే. మార్క్సిస్టు విధానంలో అంతర్భాగమయిన ఆ వివాదంలో హెగెల్‌ను అతడి శిష్యులకు వ్యతిరేకంగా మార్క్స ఏంగెల్స్‌లు సమర్థించారు. హెగెల్ శిష్యులు గురువులోని మార్మికమయిన భావవాదానికి వ్యతిరేకంగా, అతడిలోని పదార్థవాద సహజవాద ధోరణులకు ప్రాతినిధ్యం వహించారు.

మానవుడు వివేచనఆధారంగా సాగిపోవాలనే తొలిప్రయత్నమే ఫ్రెంచి విప్లవమని, హెగెల్ చెప్పిన చిరస్మరణీయమయిన మాటలలో అర్థాన్ని, హైన్ స్పష్టమయిన భాషలో చెప్పాడు. తమ గురువు ధోరణులలో విప్లవధోరణులు కనుగొన్న కవిని హెగెల్ రాడికల్ వాదులు-యువహెగెలియన్లు, జర్మన్‌సోషలిస్టులు. చాలా మెచ్చుకున్నారు. హైన్ ఇలా ప్రకటించాడు. "మతంలోను సంప్రదాయంలోను ప్రజల విశ్వాసాన్ని బలహీనపరచగలిగితే, జర్మనీని ఒక రాజకీయశక్తిగా రూపొందించవచ్చు." జర్మనీలో గాఢంగా ప్రభావితం చేసిన సంస్కరణవాదాన్ని ఎలాగయితేనేమి, పునర్వికాస ధోరణి ప్రశ్నించింది. హెగెల్ చూపిన మార్గంలో డేవిడ్‌స్ట్రాస్, ఫ్యూయర్‌బాహ్, బాయర్ సోదరులు, మోసెస్, హేస్, గడ్జకోవ్, ముంట్, కార్ల్‌గ్రూన్, జోల్‌బె ఇంకా అనేకమంది రాడికల్ ఆలోచనాపరులు పయనించారు.

విప్లవం తప్పదంటూ ప్రవక్తపాత్రను నిర్వహించకముందు మార్క్స్ యవ్వన దశలో పైనపేర్కొన్న ప్రతిభావంతుల కోవకు చెందినవాడే. పారిశ్రామికంగా రాజకీయంగా వెనుకబడి ఉన్న జర్మనీవంటి దేశం 19 వ శతాబ్దపు మధ్యకాలంలో ఐరోపా నాగరికతాభివృద్ధికి చేయగలిగిందేమీ లేదని మార్క్స్ నమ్మాడు. కాకుంటే మానవుడి కోర్కెలకు సంబంధించి, చారిత్రక రీతులకు సంబంధించి తాత్త్విక అవగాహనకు వీలుంటుంది. తరువాత ఇట్లాంటి అభిప్రాయాన్నే వెల్లడించిన జర్మన్ సోషలిస్టులను మార్క్స్ తీవ్రంగా విమర్శించాడు.

రైనిష్‌గజెట్ సంపాదకుడుగా మార్క్స్ తన రాజకీయ జీవితాన్ని ఆరంభించాడు. హెగెల్ ధోరణిలో ఉదారబూర్జువా వర్గపు పత్రిక అది. ఉదారవాదిగా మార్క్స్ ఫ్రాన్సు నుంచి వచ్చే సోషలిస్టు భావాలను విమర్శనాత్మకంగా చూచాడు. 1840లో, యువ హెగెలియన్ మోసెస్‌హేస్ పారిస్ నుండి అత్యంత ఉత్సాహంతో తిరిగివచ్చి, "మానవత్వంలేని మానవజాతి" విమోచనకై సూచిస్తున్న మార్గాలను శ్లాఘించాడు. అప్పటికే ఫ్రాన్సులో ఉన్నత స్థాయికి చేరుకున్న సోషలిస్టు ఉద్యమాన్ని గురించి చెబుతుండగా, మార్క్స్ సానుభూతితో విన్నాడు. సమాజాన్ని కిందినుంచి నిర్మించాలనే సోషలిస్టు భావనకు హెగెల్ చారిత్రక గతితార్కికంలో చోటులేదన్నాడు. ధనం, లాభం, పేదరికం వంటి శాపాలనుండి విమోచన పొందిన స్వేచ్ఛా సమాజసృష్టికి తననుతాను కాదనే ధోరణి అవసరమన్నాడు. వ్యతిరేకతను వ్యతిరేకించే దానినుండి ఉన్నతమైన సమన్వయం జనిస్తుంది. అంటే ధనం, లాభం, పేదరికంపై ఆధారపడే సమాజం పూర్తిగా నిస్సహాయమై, దానికి వ్యతిరేకమయిన ప్రతి - సిద్ధాంతం పుట్టాలి. ఇది తప్పనిసరిగా కాలానుగుణంగా జరుగుతుంది. అంతవరకు వాస్తవమయిన హెగెలియన్‌వాది, వాస్తవమే వివేచనమని కొనసాగాలి. గొప్ప మార్పుకు తప్పనిసరిగా

ఉండాల్సిన పరిస్థితులు ఏవి? మార్పులు అభిలషణీయం గనుక వాటంతటవే వచ్చి పడవు. అవసరంకొద్దీ, మార్పులు జరుగుతాయి : సమాజాన్ని విప్లవపూరితంగా పునర్నిర్మాణం చేయడమనేది మానవుడికోరిక, సంకల్పం, మానవుడి అభిలాష, మానవుడి ప్రయత్నం వలనగాక అవసరంకొద్దీ జరుగుతుంది.

ఇవి హెగెల్ వాదనలు. వ్యవస్థను అట్టిపెట్టడానికి మితవాదులు తరువాత వీటిని వాడుకున్నారు. ధనం, లాభం, పేదరికం అనేవి అంతమవుతాయని సోషలిస్టులు భావించారేతప్ప, తప్పనిసరిగా జరుగుతుందని నిర్ధారించలేకపోయారని మార్క్స్ ఒక నిర్ణయానికి వచ్చాడు. కనుక ఫ్రెంచి విప్ల సంప్రదాయాలలో, నైతిక వాదుల సిద్ధాంతాలవలన ఉత్తేజం పొందిన సోషలిస్టు ఉద్యమాన్ని స్వప్నంగా మార్క్స్ చిత్రించాడు. అయితే ఇతర కారణాలవలన పారిస్‌వెళ్ళి సోషలిస్టు ఉద్యమాన్ని, అందలి భావాలను అధ్యయనం చేయడానికి అంగీకరించాడు. తన విధానానికి అక్కడ ద్వితీయ ఆధారం అతడికి లభించింది. ఫ్రెంచి సోషలిస్టు ఉద్యమంలోని ఉద్వేగ సంప్రదాయ ప్రభావంవలన, మార్క్స్ రాజకీయభావాలు మితవాదాన్ని దాటి విప్లవాత్మక ఆచరణవైపుకు సాగాయి. అప్పటికి హెగెల్ రాజకీయతత్త్వాన్ని విమర్శించడంలో మార్క్స్ హెగెల్ చెప్పిన రాజ్యభావాన్ని వ్యతిరేకించలేదు. హెగెల్ సూచించిన రాజ్యం మార్క్స్ ఆలోచనలో ఉండిపోయింది. అయితే జర్మనీ జాతికాక, కార్మికుడు ఈ రాజ్యాన్ని స్థాపించాడు.

వాస్తవానికి మార్క్స్, జర్మనీలు ఏదో సందేశం ఉందనే హెగెల్ విశ్వాసంనుంచి పూర్తిగా బైటపడలేక పోయారు. 1870 లో ప్రష్యా సైన్యం పారిస్‌లో కవాతు తొక్కుతుండగా, ఏంగిల్స్‌కు వ్రాసిన లేఖలో మార్క్స్ ఇలా అన్నాడు. “ప్రష్యనులు గెలిస్తే జర్మన్ కార్మికవర్గ కేంద్రీకరణ ఆధిపత్యంలో జర్మన్‌రాజు కేంద్రీకరణ ఉంటుంది. పశ్చిమ ఐరోపాలో కార్మికోద్యమం ఫ్రాన్సునుంచి జర్మనీ ఆధిపత్యానికి వస్తుంది. 1866 నుంచి ఇప్పటివరకు రెండు ఉద్యమాలను పోల్చిచూస్తే ఫ్రెంచికంటే జర్మన్ కార్మికవర్గం సిద్ధాంతపరంగాను నిర్మాణవ్యవస్థలోను ఆధిక్యత వహించిందని తెలుస్తుంది. ఫ్రెంచివారికంటే ఆధిపత్యం వహించినపుడు, ప్రౌధానుకంటే మనభావానికి ఔన్నత్యం ఉందని ప్రపంచానికి విదితమవుతుంది.”

తప్పనిసరిగా రానున్న విప్లవానికి కాబోయే ప్రవక్తగా మార్క్స్, తొలుత తనకున్న రాడికల్ హెగెలియన్ల సంబంధాలనుంచి తప్పుకున్నాడు. ఇతడు కోరే విప్లవం “నిజమైన” మానవుడి కార్యకలాపాల వలననే వస్తుంది. మార్క్స్, హెగెల్ గతి తార్కిక ఆయుధంతో రాడికల్ హెగెల్ వాదులపై దాడి జరిపాడు. హెగెల్ తత్త్వాన్ని మళ్ళీ కాళ్ళపై నిలబెట్టి తన కొత్త తత్త్వానికి ప్రాతిపదిక వేసుకున్నట్లు చెప్పుకున్నాడు. మార్క్స్ అక్రమ

మార్గాలద్వారా పోరాడిన హెగెలియన్ రాడికల్స్ చారిత్రక ప్రాధాన్యతకు గుర్తింపుగా ఈ వాఖ్యాన్ని చెప్పవచ్చు. “1830 ప్రాంతాలలో హెగెల్ వాదులమధ్య బేధాభిప్రాయాలు స్పష్టపడినవి. యువ హెగెల్ వాదులైన వామపక్షంవారు, పవిత్ర సనాతులతోను ఫ్యూడల్ తిరోగమన వాదులతోను జరిపిన పోరాటంలో, అంతవరకు అనేక వివాదాంశాలపై రాజ్యం చూపుతున్న సహనం, ఇచ్చిన రక్షణ తగ్గిపోగా వారు కొద్దికొద్దిగా తమ తాత్త్విక అంశాలను వదిలేసారు. అప్పటికి తాత్త్విక ఆయుధాలతో పోరాటం కొనసాగించినా, నైరూప్య తాత్త్విక లక్ష్యాలను వదిలేసారు. సంప్రదాయబద్ధంగా వస్తున్న మతంతో ఆనాడున్న రాజ్యంపైన సూటిగా దాడి ప్రారంభించారు. అయితే ఆనాడు రాజకీయాలు చాలా ప్రమాదకరంగా ఉండటంవలన మతంపైనే ప్రధాన పోరాటం సాగింది. 1840 నుంచి ఈ పోరాటం రాజకీయంగాను ఉన్నది. 1835లో స్ట్రాస్ ప్రచురించిన జీసస్ జీవితం తొలి ప్రేరణ కలిగించింది”. (ఏంజిల్స్, లడ్విగ్ ఫ్యూయర్‌బాహ్).

హెగెల్ భావవాదంపై తొలుత తిరుగుబాటుచేసి కొత్తమార్గాన్ని అనుసరించినవాడు ఫ్యూయర్‌బాహ్. తత్త్వచరిత్రలో అతడిని, 19వ శతాబ్దంలో పదార్థవాదాన్ని తిరగదోడటానికి సారధిగా పేర్కొంటారు. డేవిడ్ స్ట్రాస్‌కూడా ఈ గౌరవాన్ని పంచుకున్నాడు. కేవలభావాన్ని స్వయంగా గుర్తించే విధానంగా చారిత్రక గతితార్కిక పద్ధతి హెగెల్ సూచించగా ఫ్యూయర్‌బాహ్ మొట్టమొదట నిరాకరించాడు. చరిత్రపు ప్రేరణఇచ్చే శక్తిభావాలుకాగా, వాటిమూలాన్ని అన్వేషించడంలో సాంఘిక ఆదిమమానవశాస్త్రంలో ఫ్యూయర్‌బాహ్ తేలాడు. భావంకంటే ముందు భౌతిక ప్రపంచం ఉందనే నిర్ధారణకు అతడు వచ్చాడు. ఉనికివలన ఆలోచన నిర్ధారిత మవుతుందన్నాడు. “ఆలోచననుంచి వస్తువురాదు, ఆలోచన వస్తువునుంచి వస్తుంది. మెదడుకుబైట ఉనికిలో ఉన్న వస్తువే బాహ్యవస్తువుగా గుర్తిస్తాం.” ఫ్యూయర్‌బాహ్ తనువ్రాసిన భవిష్యత్తు తత్త్వాన్ని, హెగెల్ గతితార్కిక భావవాదానికి వ్యతిరేకంగా, గతితార్కిక పదార్థవాదంగా గుర్తించాడు.

ఫ్యూయర్‌బాహ్ గతితార్కిక పదార్థవాదానికి స్థాపకుడుగా గుర్తింపుపొందిన, 18వ శతాబ్దపు సంప్రదాయాన్ని అనుసరించి సంవేదవాదాన్ని చెప్పాడంటే సరిగా ఉంటుంది. ప్రకృతిలో ఒకభాగంగా మానవుడిని ఉంచడంవలన అతడు ఇంద్రియాధికారాన్ని విస్తరించాడు. హెగెల్‌వాదంలో కనుగొన్న ప్రోత్సాహాన్ని ఆధారంగా ఇతడు మానవతావాదాన్ని పునరుద్ధరించాడు. “ఈ కొత్తతత్త్వంవలన మానవుడు, అతడికి ఆధారమయిన ప్రకృతి తత్త్వానికి విశ్వజనీనమైన ఉన్నతవస్తువుగా ఉన్నది.” (FEUERDACH, GRUNDSAETZE DER PHILOSOPHIE DER ZUKUNFT).

ఆ విధంగా ఫ్యూయర్‌బాహ్ విధానంలో, ఆదిమ మానవశాస్త్రం శారీరకశాస్త్రం రెండూ విశ్వవిజ్ఞాన స్థాయినందుకున్నాయి. అప్పటివరకు పదార్థవాదం భౌతికజ్ఞానంపైనే ఆధారపడింది. ఫలితంగా మానవతావాదంతో సమన్వయీకరించడానికి వీలులేకపోయింది. మానవతావాదం నీతిశాస్త్రానికి అత్యంత ప్రాధాన్యతను ఇచ్చింది. నైతికంగా ఉండాలనే ధోరణికి మూలాన్ని మానవుడిలో చూడలేకపోతే, తర్కం దీనిని అలౌకిక, ఇంద్రియాతీత, వివేచనారహితవాదంలోకి తీసుకువెళుతుంది. యాంత్రిక విశ్వవాదాన్ని, వాస్తవ అతి భౌతికతను, మానవతా నీతిశాస్త్రంతో సమన్వయీకరించి, ప్రకృతితత్త్వంలో అంతర్భాగం చేయడమనేది ఒక గందరగోళ సమస్య అయిపోయింది. ఈ సమస్యను పరిష్కరించడంలో ఫ్యూయర్‌బాహ్ చాలావరకు తోడ్పడ్డాడు. ఆ దృష్ట్యా, ఏంగిల్స్ పేర్కొన్నట్లు ఫ్యూయర్‌బాహ్ మానవతా పదార్థవాదం "సంప్రదాయతత్త్వం" నుంచే వచ్చింది. ప్రేరణకు మూలాధారమయిన వాటినుంచి భేదించిన మార్క్సిస్టు గతితార్కిక పదార్థవాదం, మానవాళిని అమానుషం చేసింది. మానవచరిత్ర, రాజకీయ సాంఘికసాంస్కృతిక మేధస్సు సంబంధమైన చరిత్ర అంతటినీ మతరహిత ప్రయోజనా వాదానికి లొంగి ఉండేటట్లు చేసింది. దేన్ని అయితే నిరాకరిస్తున్నామని చెప్పారో అటువంటి ఆత్మరహిత యాంత్రిక పదార్థవాదంపైనే ఉద్వేగపూరిత జీవితాన్ని ఆధారపడేటట్లు చేసారు. సరిగా గ్రహించనందువలన ఇదంతా జరిగింది.

మానవుడి ఉనికి మార్పులకే పరిమితమై తాత్త్వికాలోచన ఉండాలని ఫ్యూయర్‌బాహ్ అనలేదు. ఒకవేళ అలా జరిగితే, మానవశాస్త్రం చరిత్ర సామాజికశాస్త్రంతో తాదాత్మ్యం చెందినట్లయ్యేది. "ఈ విషయంలో ఫ్యూయర్‌బాహ్, హెగెల్ ధోరణి కలవాడు. మానవుడే అన్నింటికీ కొలమానం అనే ప్రాటాగరస్ సూత్రాన్ని హెగెల్ అంగీకరించినట్లే ఇతడు కూడా ఒప్పుకున్నాడు. అతడిదృష్టిలో సత్యం అంటే మానవుడికి ఏది సత్యమో అది మాత్రమే. అనగా మానవేంద్రియాలు గ్రహించినంతవరకే నన్నమాట – ఇంద్రియజ్ఞానం ఆదిమ మానవుడితో పరిమితంగాక అతిభౌతిక అర్థంతో అన్నదని ఫ్యూయర్‌బాహ్ అంటాడు. అంటే వ్యక్తిలోని వాస్తవాలు మాత్రమేగాక, సత్యానికి రుజువులుగాను, వస్తుసత్యంగాను చూడాలన్నమాట." (లాంజ్, హిస్టరీ ఆఫ్ మెటీరియలిజం).

"ప్రాచీనతత్త్వం అహం అనేది రూపంలేని భావనగా తలచింది. అహం అంటే ఆలోచనా జీవి మాత్రమే. శరీరం అందులో భాగంకాదు. కొత్తతత్త్వాన్ని అనుసరించి ప్రారంభంలోనే సూత్రం ఇలా ఉంటుంది: నేను నిజం, బుద్ధిజీవిని; శరీరం నాలో భాగం; అంతేకాదు, శరీరం సంపూర్ణత, అహం, నేను అనేదానికి సారాంశం...

"మన భావాలన్నీ ఇంద్రియాలనుంచి జనిస్తాయి. కనుక భావాలకు మూలాన్ని

మనిషిలో చూచే భావావాదం సరైనదే. కానీ ఏకాకి అయిన వ్యక్తిలో నుంచే వీటిని రాబట్టాలని ప్రయత్నించడం దోషం. భావాలు పరస్పర ప్రసారం వలన, మానవుల మధ్య సంబంధాల వలన జనిస్తాయి. ఏకాకిగాకాక ద్వంద ధర్మంవలన మనం భావాలను వివేచనను పొందుతాం. మానవుడికి భావము భౌతికము అనే రెండు దృక్పథాలున్నవి. మానవుడికీ మానవుడికీగల సంబంధం వలన సమాజం తొలిసూత్రంగాను, వాస్తవానికి విశ్వజనీనతకు ప్రమాణంగాను రూపొందుతున్నది". (FEUERBACH, PHILOSOPHIE DER ZUKUNFT). పై సూత్రబద్ధ వాక్యాలవలన ఫ్యూయర్‌బాహ్ తత్వం అంతా తెలుస్తున్నది. రాడికల్ హెగెలియన్ల చారిత్రక ప్రధాన్యత వహించిన, మేధస్సు సంబంధమయిన ప్రయత్నాలన్నింటికీ ఈ తత్వమే ఉత్తేజాన్ని ఇచ్చింది. మార్క్సు కూడా వారితోబాటు మొదట్లో ఉన్నాడు. ఫ్యూయల్‌బాహ్ పదార్థవాద మానవతా తత్వాన్ని విమర్శిస్తూ మార్క్స్. తన గతితార్కిక పదార్థ వాదాన్ని రూపొందించడం ప్రారంభించాడు. ఆరంభంలో జరిగిన ఈ దోషం మొత్తం మార్క్సు విధానంపై చెరగని ముద్రవేసింది.

ఫ్యూయర్‌బాహ్ మార్క్సు విమర్శలేని ముఖ్య విషయాలన్నీ 1845లో మార్క్సు వ్రాసిన 11 సిద్ధాంతాలలో ఉన్నవి. 1886లో ఏంగిల్స్ ఈ భావాలను విపులీకరిస్తూ, "లడ్విగ్ ఫ్యూయర్‌బాహ్ అండ్ ది ఔట్‌కం ఆఫ్ క్లాసికల్ జర్మన్ ఫిలాసఫీ" అని వ్రాసాడు. ఫ్యూయల్‌బాహ్ మానవతావాదంపైన పదార్థవాదాన్ని మానవత్వంతో వ్రాయడం అనేది ఏంగిల్స్ దాడికి గురయినది. ఫ్యూయర్‌బాహ్‌పై మార్క్సు వ్రాసిన మరొక వ్యాసం, అప్పట్లో ప్రచురితం కాకపోయినా 1940లో వెలువడిన ది జర్మన్ ఐడియాలజీ అనే గ్రంథంలో చేర్చారు. ది మార్క్సిస్ట్ – లెనినిస్ట్ లైబ్రరీలో భాగంగా ఇది ఉన్నది. "ఫ్యూయర్‌బాహ్" అనే శీర్షిక ఎవరో చేర్చినట్లునది. మూల పత్రిలో శీర్షిక "పదార్థవాద భావవాద దృక్పథాల వ్యతిరేకత" అని ఉన్నది. సిద్ధాంతపరమయిన వ్యాసం అది. ఫ్యూయర్‌బాహ్‌పై వ్రాసిన గ్రంథంలో పీఠిక వ్రాస్తూ ఏంగిల్స్ ప్రచురితం కానీ మార్క్స్ వ్యాసాన్ని ప్రస్తావించాడు". 40 సంవత్సరాలు గడిచిన అనంతరం, మళ్ళీ ఆ విషయాన్ని చర్చించుకునే అవకాశం లేకముందే మార్క్సు చనిపోయాడు. హెగెల్‌తో మా సంబంధాన్ని అనేకచోట్ల వ్యక్తం చేసినప్పటికీ, సమగ్రమైన పొందికయిన దృక్పథాన్ని అందివ్వలేదు. మా ధోరణికి హెగెల్ తత్వానికి మధ్య వారధిగా ఉన్న ఫ్యూయర్‌బాహ్ విషయం మేము ఎన్నడూ మళ్ళీ పరిశీలించలేదు." 1884లో వ్రాసిన తన గ్రంథంలో ఏంగిల్స్ ఇలా అన్నాడు. "ఈ గ్రంథం మాకూ హెగెల్ తత్వానికీని ఉన్నట్టి సంబంధాన్ని పూర్తిగా వివరిస్తుంది. ఫ్యూయర్‌బాహ్ ప్రభావాన్ని పూర్తిగా గుర్తించడం జరిగింది."

ఫ్యూయర్‌బాహ్ వ్రాసిన "ఎస్సెన్స్ ఆఫ్ క్రిస్టియానిటీ" అనే గ్రంథం "పదార్థవాదాన్ని మళ్ళీ గద్దెనెక్కించింది" అని స్పష్టంగా ఏంగిల్స్ అంగీకరించాడు. మార్క్సు సహితం

"అత్యంత ఉత్సాహంతో ఈ కొత్త భావాన్ని ఆహ్వానించాడు." పిమ్మట ఫ్యూయర్‌బాహ్ దోషాలను ఏంగిల్స్ ఒక పట్టికగా వ్రాసాడు. "ప్రేమను దైవంగా చూడటం, 1844 నుంచీ జర్మనీలో చదువుకున్న వారిలో వాస్తవ సోషలిజాన్ని ఒక అంటువ్యాధిలా వ్యాపింపచేయడం" దోషాలన్నాడు. "వాస్తవ సోషలిజం" ఒక అంటువ్యాధి అని ఫ్యూయర్‌బాహ్‌ను విశ్వాసపాత్రంగా అనుసరించినవారు ఎందుకు ఖండించారు? బ్రిటిష్ ఫ్రెంచి సోషలిస్టులకంటే ఉన్నతమయిన స్వేచ్ఛా సమాజాన్ని "మానవ స్వభావంనుంచి" రాబట్టడమే ఇందుకు కారణం.

ఈ విమర్శలో అసలు ధోరణిని మూలరచనలో చూడవచ్చు. అది ఈవిధంగా ప్రారంభం అయింది. "జర్మన్ సిద్ధాంతకర్తలనుంచి వింటున్నట్లుగా గత కొన్నాళ్ళుగా జర్మనీ అసమాన విప్లవంలో పయనించింది. హెగెల్ తత్త్వం దిగజారడం స్ట్రాస్‌తో ప్రారంభం అయి విశ్వవ్యాప్తంగా అభివృద్ధిచెంది, గత శక్తులన్నింటినీ తుడిచిపెట్టింది. సూత్రాలన్నీ ఒక దానినిమించి మరొకటి పోతుండగా, మానసికంగా ఏర్పరచుకున్న వీరులందరూ అత్యంత వేగంగా క్రిందకు త్రోసివేయబడ్డారు. మూడు శతాబ్దాలలో జరగనంత వేగంగా మూడేళ్ళలో 1812–45 మధ్యగతం తుడిచిపెట్టుకుపోవడం జరిగింది. ఇదంతా కేవల ఆలోచనా పరిధిలో సంభవించింది.

తన తత్త్వంలో చారిత్రక జ్ఞానాన్ని చూచి మార్క్స్ గర్వించేవాడు. అయితే అతడు తత్త్వాన్ని రూపొందించడానికి ప్రారంభించిన విమర్శలో వైజ్ఞానికాభివృద్ధికి సంబంధించిన చారిత్రక ప్రాధాన్యతను గుర్తించలేకపోవడం కనిపిస్తుంది. అతడు తన తత్త్వాధిక్యతను చూపదలిచాడు. అందులో గతంలేకుండా భవిష్యత్తునంతా తానే గుత్తాధిపత్యం తీసుకోవాలని ప్రయత్నించాడు. కనుక సిద్ధాంతం అంతా స్వచ్ఛందమయినదిగా చేయాలని చూచాడు. తనతత్త్వాన్ని అంచనా వేయడంలో చారిత్రక దృష్టిని కనుక మార్క్స్ అన్వయిస్తే గతంలో లేనిభావం, తాత్త్వికంగా, రాజకీయంగా, ఆర్థికంగా ఒక్కటి కూడా లేదని గ్రహించవలసి వస్తుంది. ఇతడి తత్త్వంలో అంతా, లోగడఉన్న తత్త్వాలకు కొనసాగించడంగానే కనిపిస్తున్నది. ("జర్మనీ ఆదర్శవాదం మానవుడి ఆలోచనకు ఎనలేని సేవలు చేసిన అనంతరం, పతనమయింది. తన సిద్ధాంతానికి కొత్త సాక్ష్యంఇవ్వడానికి వీలుగా, మితంగా ఉన్నదంతా తననుతాను రద్దుగావించుకుని వ్యతిరేకతలోకి పోతుందనే విషయాన్ని రుజువుచేయడానికి ఉదాహరణగా జర్మనీ భావవాదం అగుపించింది. హెగెల్ మరణానంతరం పదేళ్ళకు తాత్త్వికాభివృద్ధిలో మళ్ళీ పదార్థవాదం వచ్చింది.

"చారిత్రకభావాలు గతంలో అభివృద్ధిచెందినవాటి ఫలితంగా మార్క్సిస్టు చారిత్రక దృక్పథం జనించింది. గతంలోని భావాలన్నీ, వాటికి వాస్తవ విలువ ఉన్నంతవరకూ

మార్క్సిజంలో చోటుచేసుకున్నాయి. భావాలకు లోగడ ఏ కాలంలోను లేనంత గట్టి ప్రాతిపదికలుకూడా ఏర్పడ్డాయి. కనుకనే మార్క్సిజం సంపూర్ణం, అవగాహనకలదీ, సరైనదీకూడా." – జార్జి ప్లెఖనోవ్, హిస్టరీ ఆఫ్ మెటీరియలిజం. చరిత్ర, సమాజం తత్త్వానికే సంబంధించిన మార్క్సు పదార్థవాద వ్యాఖ్యానం నిలబడేదికాదు.

ఫ్యూయర్‌బాహ్‌ను, అతడి అనుచరులను, మార్క్స్ తన "జర్మన్ ఐడియాలజీ" లో విమర్శించినదంతా అసంబద్ధంగాను, అసంపూర్ణంగాను ఉన్నది. 1844 నుంచి 1848 వరకు హెగెల్ గొప్పవాడని, తానొక్కడే ప్రవక్తనని మార్క్సు రుజువుచేయదలిచాడు. సోషలిజానికి తాత్త్విక సమర్ధన కావాలనేదాన్ని నిరాకరించాడు. ఫ్రెంచి జ్ఞానవికాసానికి, హెగెల్ అనంతరం తాత్త్విక రాడికలిజానికి చారిత్రక సంబంధం ఉన్నదనేదాన్ని కూడా అతడు కాదని రుజువు చేయదలిచాడు.

మార్క్సు సిద్ధాంతపరమయిన యుద్ధం అలా ఆరంభమయింది. హెగెల్ శకంలో ప్రత్యక్ష ఫలితాలకు పూర్తిగా వ్యతిరేకధోరణిని కనబరచడం మార్క్సులో గమనించతగినది. అతడికి చారిత్రకదృష్టిలేదని తెలిపే విచారకరమయిన విషయం అది. మతపరమైన ఆలోచనలో ఉన్న చారిత్రక ప్రాధాన్యతను కూడా మార్క్సు గ్రహించలేకపోవడం ఆశ్చర్యాన్ని తెలుపుతుంది. చారిత్రక దృష్టిలో మార్క్సుకు ఉన్న లోపం వలన, మతవిమర్శకు గల ప్రాధాన్యతను కూడా అతడు ప్రస్తుతించలేకపోయాడు. రాజకీయంగాను, సామాజికంగాను వ్యవస్థను కొనసాగించడానికి మతం నైతిక ప్రమాణాలను సమకూర్చింది. కనుక మతాధికారాన్ని తగ్గించడం విప్లవచర్యలో మౌలికమయిన ప్రాధాన్యం వహిస్తుంది. యువకులయిన హెగెల్ వాదులు ఆ పని చేసారు. మతసంప్రదాయంపైన ధైర్యంగా వారు చేసిన దాడిలోని విప్లవ ప్రాధాన్యతను మార్క్సు శ్లాఘించలేకపోయాడు. వారి ప్రయత్నాన్ని కోపంగా కొట్టిపారేసాడు. వ్యవస్థపై తిరుగుబాటుకు ముందు చేయవలసిన పనే మతాన్ని ఎదిరించడం. "స్ట్రాస్ నుంచి స్టర్నర్ వరకు జర్మనీ తాత్త్విక విమర్శ అంతా మతభావాలను దుయ్యబట్టడంతోనే సరిపోయింది." (కార్ల్‌మార్క్స్, జర్మన్ ఐడియాలజీ). నిస్సందేహంగా వారలాచేసారు. హెగెల్ రాడికల్ వాదుల మేధారంగపు ప్రయత్నాలలో ప్రాధాన్యత అంతా అక్కడే ఉన్నది. పునర్వికాస సంప్రదాయాన్ని అనుసరించి, తాత్త్విక విప్లవ ప్రమాణాన్ని వారు పెంచారు. రాజకీయ సాంఘిక విప్లవాలకు సిద్ధాంతపరమయిన పరిస్థితి సృష్టించాలంటే ఇది అవసరం. మానవుడు తన విధికి తానే నిర్ణేత అని నిజంగా మార్క్సు నమ్మలేదు. చరిత్ర, సామాజిక పరిణామాన్ని గురించి మార్క్స్ దృక్పథం అంతా ప్రయోజనా వాదంతోను, విధివాదంతోను ఉన్నది. అందుకే అతడు ఫ్యూయర్‌బాహ్ మానవతా వాదాన్ని ఎదుర్కొన్నాడు. ఈ వాదాన్ని వాస్తవ సోషలిస్టులో భావించుకున్నవారు

ప్రచారంచేయగా, ప్రతిభావంతులయిన విజ్ఞానవేత్తల పరంపరానుగతంగా పెంపొందిస్తువెళ్ళారు.

మార్క్సు తాను విమర్శించడానికి వీలుగా ఫ్యూయర్‌బాహ్ అనుచరుల అభిప్రాయాలను కొన్నింటిని ఉదహరించాడు. గతి తార్కిక పదార్థవాదానికి వ్యతిరేకంగా ఉన్నాయని మార్క్సు వాటిపై దాడి జరిపాడు.

"ఫ్రెంచివారు రాజకీయాల ద్వారా కమ్యూనిజానికి వెళ్ళారు. జర్మనుల అతి భౌతికత ద్వారా సోషలిజానికి వచ్చారు. ఇది తరువాత మానవ శాస్త్రంగా మారింది. తుదకు మానవతావాదంలే తేలింది."

"ప్రకృతి నాలో తనను గుర్తిస్తే, అప్పుడు నన్ను నేను ప్రకృతిలో గుర్తిస్తారు. దాని జీవితంలో నా జీవితాన్ని చూస్తాను... ప్రకృతి మనకిచ్చిన ప్రేరణకు వ్యక్తీకరణ చూపుదాం."

"ఫ్యూయర్‌బాహ్‌ను గురించి మాట్లాడటం అంటే బేకన్‌నుంచి నేటి వరకు తాత్త్వికశ్రమ నంతటిని గురించి మాట్లాడటమే. తుది ప్రయోజనం, తత్త్వానికి అర్థం గురించి నిర్వచనం చేస్తుంటారు. ప్రపంచ చరిత్రకు తుదిఫలితంగా మానవుడిని చూస్తారు... మనం మనకోసమే మానవుడిని పొందాం. మతంతోను రుగ్మతలో ఉన్న ఆలోచనలతోను, తనకు తెలియని దానితోను నిమిత్తంలేని మానవుడిని పొందు. పవిత్రమయిన ప్రాయికమయిన మానవుడు లభించాడు.

"కమ్యూనిజంలో మానవుడు తన సారాన్ని గుర్తించాడు. కమ్యూనిజం వలన మానవుడు ఆధారపడటంలో అట్టడుగుస్థాయికి పోతాడు. జడపదార్థంపై ఆధారపడి, పశుప్రాయమయిన సంబంధాలతో ఉంటాడు. శ్రమను ఆనందాన్ని విడదీస్తాడు. స్వేచ్ఛగా నైతిక కార్యకలాపాలు సాగించే సాధన మానవుడిలో లేదు."

"కమ్యూనిజానికి వాణిజ్య ప్రపంచానికి ఉన్న ఒకే ఒక తేడా ఏమిటంటే, కమ్యూనిజంలో మానవుడి వాస్తవమయిన ఆస్తి పూర్తిగా దూరం కావడం ఆదర్శప్రాయంగా పేర్కొనడానికి వీలులేదు.

"కమ్యూనిస్టులు సిద్ధంచేసిన సామాజిక వ్యవస్థను లేదా విధానాలను చూపుతారు. అన్ని విధానాలు పిడివాదంతోను నియంతృత్వంతోనూ కూడినవి". (పైన ఉదహరించిన వాక్యాలన్నీ మార్క్సు అప్పటికి ప్రచురితంకాని జర్మన్ ఐడియాలజీలో ప్రస్తావించాడు).

మార్క్సు గతితార్కిక పదార్థవాదం ప్రాధాన్యత అంతా, వ్యతిరేక సిద్ధాంతంగా ఖండించక దానినిబట్టి రాబట్టవచ్చు. తాత్త్విక రాడికల్ వాదాన్ని మార్క్సు ఎదుర్కొనదలిచాడు. ఆ వాదం రాజకీయ విప్లవాలను, సాంఘిక పునర్నిర్మాణాన్ని

మానవతా దృక్పథంనుంచి పరిశీలించదలచింది. సోషలిజానికి నాంది పలికిన ఫ్రెంచి ఇంగ్లీషువారిని మార్క్సు సమర్థించవలసి వచ్చింది. వారినే తరువాత కేవలం స్వప్నవిహారులని అతడు వెక్కిరించాడు. ("ఈ సోషలిస్టులు లేదా వాస్తవ సోషలిస్టులు విదేశీ కమ్యూనిస్టు సాహిత్యాన్ని నిజమయిన ఉద్యమాల వలన జనించిందనిగాక, కేవల సిద్ధాంతపరమయిన రచనలుగా భావిస్తారు. కేవల ఆలోచన వలన ఇది పరిణమించిందని వారూహిస్తారు. ఇదంతా జర్మనీ తాత్త్విక విధానాల సరళి– ఒక వేళ ఈ రచనలన్నీ ఒక పద్ధతిని సూచిస్తున్నప్పటికీ, ఆచరణాత్మక అవసరాలవలన జీవిత పరిస్థితులవలన, ఆయా దేశాలలోని ఆయా వర్గాలవలన జనిస్తాయని వీరికి స్ఫురించదు." (మార్క్సు, జర్మన్ ఐడియాలజీ).

మానవుడిని ఏకాకి అయిన వ్యక్తిగా పరిగణించాడనే దృష్టితో ఫ్యూయర్‌బాహ్ మానవతా పదార్థవాదాన్ని మార్క్సు తృణీకరించాడు. ఈ విమర్శ సమర్థనీయంకాదు. "వ్యక్తి తానుగా మానవ స్వభావాన్ని తనలో వ్యక్తీకరించడు. మానవస్వభావం సమాజంలోను, మానవుడితో మానవుడు ఐక్యం కావడంలోను వ్యక్తం అవుతుంది. ఏకాకితనం అనేది మితమైనది, హద్దులతో కూడినది. సమాజం అనేది స్వేచ్ఛ అంతిమత్వంతో కూడినది (FEUERBACH, PHILOSOPHIE DER ZUKUNFT). ఫ్యూయర్‌బాహ్ మానవతావాదం వ్యవస్థ నిర్మాణావశ్యకతను కాదనడం లేదనడానికి ఇదొక స్పష్టమయిన ఆధారం. మానవుడు చిరకాలంగా స్వేచ్ఛకోసం పోరాడుతున్న ఫలితంగా, వ్యక్తి తన సార్వభౌమత్వాన్ని దేనికీ సమర్పించడు. అతడు నాగరిక సమాజాన్ని సృష్టించాడు. తన సృష్టికి, వూహజనితమయిన సమష్టి భావనకు తన స్వేచ్ఛను అర్పించడు. హెగెల్ కంటే వాస్తవానికి ఫ్యూయర్‌బాహ్ ఇంకా ముందుకు పోయాడు. మార్క్సు సమాజానికి సంబంధించిన జీవ దృక్పథాన్ని హెగెల్ నుంచి స్వీకరించాడు. ఆ దృక్పథంలో వ్యక్తి స్వేచ్ఛావకాశాలు తృణీకరించబడినవి.

ఫ్యూయర్‌బాహ్‌పై మార్క్సు చేసిన సిద్ధాంత రచనలో, మానవుడు సార్వభౌమత్వం గల నీతివంతుడుగా, మానవతా దృక్పథాన్ని నిశితంగా విశ్లేషించాడు. "మతసారాన్ని ఫ్యూయర్‌బాహ్ మానవసారంలో కలిపేసాడు. మానవసారం అనేది విడిగా వ్యక్తులలో ఉండే నైరూప్యభావన కాదు. సామాజిక సంబంధాల ప్రతీకే ఈ సారం..." (ఆరవ సిద్ధాంతం). ఆదిమ వివేచనావాదమే మత సారాంశం. సహజ సంఘటనలను వివరించడానికి ప్రతిపాదనలుగానే మానవుడు దేవుళ్ళను సృష్టించాడు. మానవుడు స్వభావసిద్ధంగా వివేచనాత్ముడు గనుక, వివేచనావాదం మానవుడి సారాంశం. స్వేచ్ఛాపోరాటంలో మానవుడి నిజ స్వభావాన్ని కనుగొనడం చాలా పురోగమనమే సమాజ సంబంధాలు ఉండాలంటే, ఆ సంబంధాలు ఏర్పరిచే వ్యక్తులు ముందుగా

ఉండాలి. వివేచనవలన వ్యక్తులు ఈ సంబంధాలను ఏర్పరచుకున్నారు. హెగెల్ సమాజాన్ని గురించిచెప్పిన జీవదృష్టివలన ప్రభావితుడైన మార్క్స్, వ్యక్తుల కలయికే సమాజమని స్పష్టమయిన సత్యాన్ని విస్మరించాడు. ఈ అనియంత్రత భావంవలన సమాజాన్ని, అదేదో దైవదత్తం అయినట్లు మార్క్సు స్వీకరించి, సాంఘిక సంబంధాలను పరమ సత్యాలుగా పరిగణించాడు.సమాజంలోని వ్యక్తుల కార్యకలాపాలవలన సాంఘిక సంబంధాలు వస్తాయి. మానవుడు సృష్టించిన వాటిని, మానవుడే మార్చగలడు. మానవ సంకల్పం, మానవ చర్య అనేవి సమాజపు ఉనికికి ప్రాథమిక విషయాలు.

"తత్త్వవేత్తలు ఇన్నాళ్ళు ప్రపంచాన్ని భిన్నంగా వ్యాఖ్యానించారు, దాన్ని మార్చాలి" అనేది ఫ్యూయర్‌బాహ్ పై సిద్ధాంతంలో చివరి విషయం. మార్క్సిజానికి నిగ్గు అందులోనే ఉన్నది. మానవుడి సృజనశక్తిలో విశ్వాసాన్ని ఈ సూత్రం ప్రకటిస్తున్నది. గతితార్కిక పదార్థ వాదానికి అనుకూలంగా ఫ్యూయర్‌బాహ్‌కు చెందిన మానవతావాదాన్ని నిరాకరించడంలో మార్క్స్, తన క్రియాశీలత్వాన్ని తానే వ్యతిరేకించాడు. మానవుడు తన విధికి తానే నిర్ణేత. ప్రపంచాన్ని తిరిగి మలచడంలో, మానవుడు తనకుతాను తయారుచేసుకుంటాడు. గతితార్కిక విధానం మార్క్సిస్టు తత్త్వంతో ఉన్న గొప్ప విప్లవకారులకు కూడా ఎలాంటి అవకాశాన్ని, ప్రపంచాన్ని మార్చేందుకు ఇవ్వడంలేదు. గతితార్కిక పదార్థవాదానికి, విప్లవాత్మక సమాజ పునర్నిర్మాణ కార్యక్రమానికి, సమన్వయించడానికి వీల్లేనంత విరుద్ధత్వం ఉండటమే మార్క్సిజంలో మూల దోషం. ఈ విరుద్ధ భావాలు మార్క్సులో జనించినవి కావు. ఒకటి హెగెల్‌నుంచి సంక్రమించగా మరొకటి ఫ్రెంచి విప్లవ సంప్రదాయంనుంచి వచ్చింది.

ఫ్రెంచి విప్లవకాలంలో సంఘర్షణకు తలపడిన వివేచనావాద, ఉద్వేగవాద జీవిత దృక్పథాలు, తరువాత ఐరోపా మేధావులను, సాంస్కృతిక చరిత్రను రెండు విభిన్న ధోరణులలో తీసుకపోయాయి. వీటిని సమన్వయంచేసే ప్రయత్నంలోనే మార్క్సిజపు చారిత్రక ప్రాధాన్యత ఉన్నది. ఈ సమన్వయం హెగెల్ విధానంలోను గర్భితంగా లేకపోలేదు.అదంతా పునర్వికాసం, సంప్రదాయ వివేచనావాదం. 18వ శతాబ్దపు జ్ఞానవికాసం, రూసో ఉద్వేగవాదం సంప్రదాయాలవలన వచ్చినదే. ఫ్యూయర్‌బాహ్ భౌతిక మానవతావాదం, అతడి అనుచరుల తాత్త్విక రాడికల్‌వాదం కూడా, వివేచన, ఉద్వేగ జీవిత దృక్పథాలను సమన్వయీకరించే ధోరణి కనబరిచింది. అయినప్పటికీ ఈ తత్త్వాలను మార్క్సు ఎదుర్కొన్నాడు. వీరంతా గతి తార్కిక వాదాన్ని భావ వాదంగాను, సృష్టి ప్రయోజన వాదంగాను గమనించి స్వేచ్ఛాదర్శానికి పొసగవని నిరాకరించడమే ఇందుకు కారణం. మార్క్సిజం మొదటిదశలో హెగెల్ భావవాదాన్ని అందుకున్నది. యువ హెగెల్ వాదులు, తాత్త్విక రాడికల్సు తమ గురువునుంచి

రాబట్టిన భౌతిక సహజవాదాన్ని మార్క్సిజం వ్యతిరేకించింది. గతితార్కిక విధానంపట్ల ఆకర్షితుడైన యువ మార్క్స్ వైజ్ఞానిక సహజవాదాన్ని యాంత్రికమయినదని, చారిత్రకం కాదని తృణీకరించాడు. అతడి విమర్శవలన తేలిందేమంటే జ్ఞానవికాసంకర్మవాదాన్ని చరిత్రలో చూడకుండా, మానవుడి సృజనపాత్రను గుర్తించింది అని మాత్రమే. యువ హెగెల్ వాదులు, ఫ్యూయర్‌బాహ్ అనుచరులతో వివాదానికి దిగిన మార్క్స్ సాంఘిక పరిణామ క్రమంలో మానసిక చర్యకు చోటివ్వలేదు. అంతేగాదు మానవుడి అభివృద్ధి క్రమంలో కూడా మానసిక చర్యకు తావులేదు. "చైతన్యత, మతం, ఇంకేదన్నా కానివ్వండి, మానవుడిని జంతువులనుంచి తేడాగా చూసేందుకు తోడ్పడుతున్నది. ఇవన్నీ వాటి భౌతిక నిర్మాణంవలన, వాటంతటవి మనుగడ సాగించడం ప్రారంభించిన తరువాత జంతువులనుంచి తాము వేరని తెలుసుకోవడం సంభవం" (మార్క్స్, జర్మన్ ఐడియాలజీ) మెదడు భౌతిక నిర్మాణంలో ఒక భాగం ఇంద్రియ సంవేదన, ప్రత్యక్ష దృష్టి, శారీరక రీతులుగా వివరించవచ్చు. కానీ భావాలోచన కేవలం మానసిక సంఘటన. ఆదిమ మానవుడికి జంతువులలో అత్యంత ఉన్నతస్థాయి చేరుకున్నదానికి తేడా మానసికమయినదే. నిప్పును కనుగొనడం ఆలోచనారహితంగా తలవని తలంపుగా జరిగిన భౌతికచర్యే కావచ్చు. ఆ తరువాత ఆదిమ మానవుడు తన ఉనికి నిమిత్తం నిప్పును వాడుకోవడంలో మానసికచర్య అంతకుముందే ఉన్నదని స్పష్టపడుతున్నది. కనుక మానవ శాస్త్రంతో ఏ మాత్రం పరిచయమున్నా మార్క్స్ పైనచెప్పిన విషయాన్ని అంగీకరించడానికి వీలులేదు.

తరువాత వ్రాసిన పుటలలో సాంఘిక పరిణామ చరిత్రలో మానసిక కార్యకలాపాలన్నీ లేనట్లుగా, సమాజం నిర్జీవ యంత్రం అయినట్లుగా చిత్రించాడు. "భావోత్పత్తి ఆలోచనలు, చైతన్యత తొలుత సూటిగా పదార్థ కార్యకలాపాలలో మిళితమై ఉంటాయి. అలాగే పదార్థానికీ మానవులకూ సంబంధం జీవితానికి సంబంధించిన భాషకూడా కలిసిపోతుంది. పదార్థ ప్రవర్తనవలన ఆలోచన, భావం, మానవుల మానసిక పరస్పర కలయిక జరుగుతున్నది." ఇందులో తొలివాక్యం కొంతవరకూ సరైనదే. తరువాత అంతా దోషబద్ధమే. పదార్థ కార్యకలాపం అంటే ఏమిటి? "పదార్థం" అనేది భౌతికతకు విశేషణంగా వాడితే కొంత అర్థం ఉన్నది. ఆదిమ మానవుడి భౌతికచర్యలు సహితం కొంతవరకు మానసిక చర్యననుసరించే ఉన్నవి. పరిసరాలకు, శారీరక ప్రతిచర్యలకు తేడాను స్పష్టంగా అప్పట్లో చూడలేకపోవచ్చు. అయినప్పటికి, రాయి కిందపడటానికి, మొక్క పెరగడానికి, పక్షి ఎగరడానికి, పోల్చితే మానవుడి చర్యలు గుణాత్మకంగా భిన్నమయినవి. భౌతిక ప్రవర్తనలవలననే భావాలు ఆలోచనలు జనించవు. భౌతిక సాంఘిక పరిసరాల వలన భావాలు ప్రభావితమవుతాయి.

దోషబద్ధమయిన మాటలతోను నిర్దుష్టంకాని వర్ణనలలోని వాదనలను గందరగోళ పరచినందువలన "జీవితం చైతన్యతవలన నిర్ధారితం కాలేదని, చైతన్యత జీవితంలో నిర్ధారితమయిందని అనే నిర్ణయానికి రావడం జరిగింది."

తరువాత మార్క్సు తన ప్రకటనలను తిరిగి రూపొందించాడు. తొలుత వాడిన రూపంలో అర్థం లేనందున, "ఉనికి" అనేపదం అంటే పదార్థ ఉనికి అనివాడాడు. జీవితానికి బదులుగా వాడిన మాటఇది. జీవితానికి చైతన్యతకూ కార్యకారణ సంబంధంలేదు. ఒకటి మరొకదాని లక్షణంగా మాత్రమే వ్యక్తం అవుతుంది. ఈ ప్రకటనలను సరిగా రూపొందిస్తే, వైజ్ఞానిక పదార్థవాదానికి మూలసూత్రం అవుతుంది. అప్పుడు ఉద్రేకాలతో సహ మానసిక కార్యకలాపాలన్నింటినీ పూర్తిగా గుర్తించినట్లు అవుతుంది. మానవతావాదంతో సమన్వయీకరణ కుదురుతుంది. ఈ కార్యకలాపాలన్నింటికీ చైతన్యతే ప్రాతిపదిక. జీవశాస్త్రాన్ని అనుసరించి భౌతిక రసాయినిక పదార్థ రీతులవలన చైతన్యత జనిస్తుంది.

18వ శతాబ్దం పదార్థవాదం, ఆనాడున్న విజ్ఞాన పరిమితులలో ఈ స్థాయికి చేరుకున్నది. అదినేడు ఇంకా అభివృద్ధిపరచడానికి సహకరిస్తుంది. అయినప్పటికీ భావవాదంతో కూడిన హెగెల్ గతి తార్కికతలోనే చారిత్రక పదార్థవాదానికి గట్టి పునాదులున్నాయని మార్క్సు కనుగొన్నాడు. 18వ శతాబ్దం పదార్థవాదాన్ని అతడు నిరాకరించాడు. మానవుడి స్వభావంలో ఎప్పుడూ కనిపించేదేదో ఉన్నదని నమ్మి, అందులో నుంచి తార్కికంగా పౌరుల హక్కులు విధులు రాబట్టవచ్చునని పదార్థవాదం తలచింది. హెగెల్ భావవాద ప్రమాణంలో, మానవ స్వభావంలో స్థిరంగా ఏదయినా ఉంటుందనే వైఖరిని మార్క్సు నిరాకరించాడు. ("ఉనికికీ ఉనికి కాని దానికీమధ్య మరొకస్థితిలో మరింకేదీ లేదు"– హెగెల్). మానవ స్వభావం "సామాజిక సంబంధాలు ప్రతీకే" అని మార్క్సు నొక్కిచెప్పాడు. మానవ స్వభావానికి సంబంధించి 18వ శతాబ్దంలోని భావం లోపభూయిష్టమయినది. సాంప్రదాయకంగా, సహజ నియమ సిద్ధాంతం నుంచి దీన్ని రాబట్టారు. వైజ్ఞానికంగా, డార్విన్‌కు ముందున్న జీవశాస్త్రంపై ఆధారపడ్డారు, జీవులలో మార్పు ఉండదని ఆనాడు నమ్మేవారు. అది నిరాకరించిన మార్క్సు డార్విన్ చెప్పిన క్రమత్వాన్నికూడా ఎదుర్కొన్నాడు. అతడి విప్లవ సిద్ధాంతం ఈ భావనలవలన విరుద్ధంగా ఉంటుంది. 18వ శతాబ్దపు మానవ స్వభావ విశ్వాసాన్ని తృణీకరించడంలో హెగెల్ భావవాద ప్రమాణాన్ని ఆధారంగా స్వీకరించిందేకాని, జీవశాస్త్రజ్ఞుల జ్ఞానం ఎక్కువ తెలిసినందువలన కాదు.

హెగెల్ గతితార్కికతలో తన విప్లవ సిద్ధాంతానికి తాత్త్వికంగా మద్దతు లభించిందని మార్క్స్ అనుకున్నాడు, అందుకే ఇతర తత్త్వాలు అన్నింటినీ నిర్ణయించడానికి

గతితార్కికత ఒక్కటే అతడికి ప్రమాణం అయింది. గతితార్కికత ఆదర్శభావం. విప్లవాలు మనుషులు తెచ్చినవికావు. అవసరంకొద్దీ అవి జరుగుతాయి. అంటే ముందే నిర్ధారితమైనాయన్నమాట. మార్క్స్ గతితార్కిక పదార్థవాదం కేవలం పేరులోనే పదార్థవాదం. గతితార్కికతను మూలాధారంగా చేసుకున్న ఈ తత్త్వం మౌలికంగా భావవాదంలో కూడిన తత్త్వం. 18వ శతాబ్దం వైజ్ఞానిక సహజవాద సంపదను కాదనడంలో ఆశ్చర్యంలేదు. ఫ్యూయర్‌బాహ్ అతని అనుచరుల మానవతా పదార్థవాదాన్ని పేర్కొనడంలోను విస్తుచెందవలసింది లేదు.

హెగెల్‌ను ప్రమాణంగా చేసి 18వ శతాబ్దపు పదార్థ వాదాన్ని తృణీకరించిన మార్క్సు సంవేదనా తత్త్వాన్ని విమర్శించే ప్రయత్నం చేసాడు. మనస్సు రాగద్వేషాతీతమయింది కాదని, ప్రభావాలను స్వీకరించే ఉదాసీన లక్షణం కాదని అన్నాడు. సంవేదనలు ప్రత్యక్ష జ్ఞానం అనేది వ్యక్తికి వస్తువుకు ఉన్న పరస్పర సంబంధాన్ని బట్టి జనిస్తాయి. శారీరక శాస్త్రం, మానసిక శాస్త్రం, జీవశాస్త్రం ఆధారంగా గ్రహించే సమస్యను మార్క్సు వూహించాడని ఈ అభిప్రాయం వలన తెలుస్తున్నది. తెలుసుకునే రీతులలో వస్తువు మారుతుంది. వస్తువుపై వ్యక్తి చూపే ప్రభావంవలన జ్ఞానం జనిస్తుంది. ఇక్కడ వ్యక్తి చర్యకు ప్రాధాన్యత ఉన్నది. కేవల ఆలోచన వీలుకాదని జ్ఞానార్జనకు సత్యాన్వేషణకు సాధనగా కేవల ఆలోచన పనికిరాదని తేలిపోయింది. ఫలితంగా మార్క్సిస్టు పదార్థవాదానికి ప్రాతిపదిక పదార్థం కాదు. డెమోక్రటిస్ కాలంనుంచి విజ్ఞానం తత్త్వంకూడా పదార్థమే మూలమని చెబుతున్నా మార్క్సు దృష్టిలో పదార్థంతో మానవుడికిగల సంబంధమే మౌలికమయింది. ఇది భావవాద స్థితి. మార్క్సు ననుసరించి మానవుడు ఒక భౌతిక వ్యవస్థ పదార్థానికీ అతడికీ గల సంబంధం, ఒక వస్తువుకూ మరొక వస్తువుకూ గల సంబంధం వంటిదే. జడపదార్థపు ప్రతి చర్యలలో చైతన్యత తెలివి ఎక్కడినుంచి వస్తాయి? అంటే స్థాణువు అయిన పదార్థానికీ మానవుడికి తేడా ఏమిటి? ఈ ప్రశ్నలకు పదార్థవాదం సంతృప్తికరమయిన సమాధానం చెప్పాలి. మానవుడున్నాడని, ప్రాథమికంగా అతడు అనిర్వచనీయమని, హెగెల్ చెప్పే కేవల భావానికి "వ్యక్త రూపమని" మార్క్స్ తలచాడు.

"ఆర్థిక మానవుడు" బ్రతుకుదెరువుకు ఉత్పత్తి చేయడంతో ఆవిర్భవిస్తాడు. ఇతడు సాంఘిక సంబంధాల కూడలి మాత్రమే. కానీ మానవులకు ఇంకా ప్రాచీన చరిత్ర ఉన్నది. మానవులకు పూర్వం జీవపరిణామంలో ఇది అస్పష్టంగా ఉంటుంది. సామాజిక సంబంధాలలోకి రాకముందు మానవుడి పరిణామ క్రమంపై మార్క్సు పూర్తిగా శీతకన్ను వేసాడు. ఫలితంగా మానవ స్వభావాన్ని గురించి మార్క్సుకు ఏమీ

తెలియదు. సామాజిక సంబంధాలు ఏర్పరచుకోవడానికి ప్రోత్సహించేది మానవ స్వభావం.

మానవ స్వభావానికి ఆధారం అయిన ఈ రీతి అంతా స్థిరమయినది. లేకుంటే, ఆటవిక నియమాలతో నివసించే జంతువులకు మానవుడికి విచక్షణ ఉండదు. మానవ స్వభావం, ఆర్థిక, రాజకీయ సామాజిక వ్యవస్థకంటే ముందే ఏర్పడింది. మనసుకు మూలం ఉన్నది. ఆ దృష్ట్యా మానసిక కార్యకలాపాలన్నీ భౌతిక ఉనికిలోని తొలి దశలలోనే నిర్ధారితమయినవి. ఆ తరువాత సామాజిక స్థితిగతులు నిర్ధారణకు తోడ్పడుతవి. మానవుడిలో మార్పుకు మానసిక భౌతిక చర్యల సమాంతర రీతులు ఇమిడి ఉన్నవి. ఇవి రెండూ కార్యకారణ సంబంధాలతో లేవు. ముందు వెనుకల క్రమంలో ఉన్నవి. ఆదిమ చైతన్యావస్థనుండి జీవ శారీరక పరిస్థితులలో మనసు పరిణమిస్తుంది. జీవసంబంధమయిన శరీరం పదార్థ నిర్మాణమే. ఉనికిలో పదార్థానికే తొలిస్థానం ఇవ్వాలి.

మానసిక సంఘటనలను విశ్లేషించడంలో సామాజిక చరిత్ర ఆరంభానికి నుంచి మార్పు పోలేదు. అందుకే అతడి పదార్థవాదం పిడివాదం, విజ్ఞాన రహితం. మానవ స్వభావంలో స్థిరంగా ఒకరీతి ఉండదని చెప్పడంవలన నీతిని నిరాకరించినట్లయింది. శాశ్వత విలువలకు గుర్తింపులేకుండా నీతిశాస్త్రం సాధ్యపడదు. అవి మానవ స్వభావంలో లేకుంటే నీతికి అలౌకిక ప్రమాణం ఉండాలి. కనుక శాశ్వతంగా ఉండే నైతిక విలువలను వ్యతిరేకతను కనబరచటం లేదా మతంలోకి పోవడం అనేవి రెండే మార్క్సిస్టు పదార్థవాదానికి మిగిలాయి. సిద్ధాంతరీత్యా శాశ్వత విలువలను నిరాకరించడానికే నిశ్చయించిన మార్క్సిజం ఆచరణలో మొండి వైఖరి వలన మతపరమయిన మూర్ఖవాద ముద్రనుకూడా వేయడం గమనించవచ్చు.

✦ ✦ ✦

# మార్క్సిజం

మార్క్సిజం ఒక తత్త్వంగా గాక, విప్లవసిద్ధాంతంగా, తుదకు ప్రపంచోద్యమ సిద్ధాంతంగా ఆకర్షణ పొందినది. సోషలిజాన్ని విజ్ఞానంగా రూపొందించాలని మార్క్సు భావించాడు. హెగెల్ గతితార్కికం ఈ ప్రయోజనానికి ఉపకరించింది. తత్త్వభాగం వరకు మార్క్సిజం, హెగెల్ విధానంలోనుంచే వచ్చింది. విప్లవ తత్త్వం మాత్రం "బూర్జువా" ఫ్రెంచి విప్లవ సిద్ధాంతం, అనుభవాలనుంచి రాబట్టారు. ఆర్థిక విశ్లేషణ మార్క్సిజంలో అతి ప్రధానమయినది. ఇందులోని మౌలికమైన సూత్రాలు బ్రిటిష్ రాజకీయ, ఆర్థిక శాస్త్రవేత్తల నుంచి స్వీకరించారు. వారిని, పెట్టుబడిదారీ విధానానికి సిద్ధాంతకర్తలుగా మార్క్సు పేర్కొన్నాడు. ఆయావర్గాల ఆర్థికావసరాల వలన సిద్ధాంతాల సృష్టి పొందుతాయని, ఆ వర్గాల స్వార్థపూరిత ఆసక్తులను పెంపొందించడానికి, కాపాడటానికి అవి సహకరిస్తాయని చెప్పిన మార్క్సిజం, తనను తానే ఖండించుకుంటున్నది.

తాత్త్విక సూత్రాలు, విప్లవ రాజకీయ సిద్ధాంతాలు, ఆర్థిక సిద్ధాంతాలు మార్క్సిజానికి ఆధారాలు. ఇవన్నీ పెట్టుబడిదారీ వర్గాసక్తుల నిమిత్తం బూర్జువా సిద్ధాంతంగా పెంపొందాయని మార్క్సిస్టులు అన్నారు. వీటిని ఒక సమగ్ర విధానంగా మార్క్సిజం రూపొందించింది. ("19వ శతాబ్దంలో మానవాళికి చెందిన మూడు అభివృద్ధి దేశాలు మూడు సిద్ధాంత స్రవంతులను కొనసాగించడం, సంపూర్ణం గావించడంలోనే మార్క్సు ప్రతిభ ఉన్నది. సంప్రదాయ జర్మనీ తత్త్వం, సంప్రదాయ ఇంగ్లీష్ రాజకీయార్థిక విధానం, ఫ్రెంచిసోషలిజం కలిసి ఫ్రెంచి విప్లవసిద్ధాంతాలుగా పెంపొందాయి," (లెనిన్, టీచింగ్స్ ఆఫ్ కార్ల్‌మార్క్స్).

"తాత్త్విక, రాజకీయ, ఆర్థిక, సోషలిస్టు విధానాలకు ప్రాతినిధ్యం వహించిన మహోన్నతుల బోధనలవలన మార్క్సు రచనలు సూటిగా జనించి కొనసాగాయి." (లెనిన్, త్రీ సోర్సెస్ అండ్ త్రీ కాంపనెంట్ పార్ట్స్ ఆఫ్ మార్క్సిజం). ఇవన్నీ కార్మిక వర్గానికి చెందినవారు సృష్టించినవికావు. వారిలో ఎవరూ కార్మిక వర్గాసక్తులను కాపాడుతామని చెప్పలేదు. మార్క్సు అలా చెప్పాడు. పుట్టుకతో అతడు మధ్య తరగతికి చెందినవాడు. బూర్జువా ఉదారవాదానికి చెందిన మేధావిగా పెరిగాడు. అయినా వారు భావించి పెంపొందించిన ఆశయాలు కార్మిక సిద్ధాంతాలకు ఉపకరించాయి.

భావాలకు వర్గ ముద్రలు వేయడం దోషపూరిత ఆచారం. భావాలు మానవ సృష్టి. ఆ విధంగా మానవజాతికి చెందినట్టివే తప్ప ఏ ఒక్క వర్గానికీ కాదు. భావాలు స్థిరంకాదు. నాగరికత ఆవిర్భవించిననాటి నుండి భావాలు నిరంతర పరిణామ క్రమంలో ఉన్నవి. ప్రపంచవ్యాప్తంగా భిన్నశకాలలో ఉన్న మానవులు, వారి సమాజాలు వర్గాలుకూడా వివిధ సహజ సామాజిక స్థితిగతుల ప్రభావానికి లోనయినట్లే, భావాలుకూడా ప్రభావితం చెందాయి. భావాలకు వాటి స్వతంత్ర ప్రతిపత్తి ఉన్నది. అది చైతన్యవంతమయినదేకాని గతితార్కికం మాత్రం కాదు. కనుక కార్మికవర్గ సిద్ధాంతంగా పేర్కొంటున్న మార్క్సిజాన్ని రూపొందించడంలో, బూర్జువా విప్లవపు రాజకీయ, సిద్ధాంతాలు, సంప్రదాయ పెట్టుబడిదారీ ఆర్థిక సిద్ధాంతాలు, హెగెల్‌తత్త్వ సూత్రాలు అన్నీ తోడ్పడినవి. మార్క్సిజంలో ప్రత్యక్ష లక్షణాలు కార్మిక విప్లవానంతరం కూడా సజీవంగా ఉంటాయి. మార్క్సిజం పాత భావాలకు వ్యతిరేకమయినదీ కాదు, వ్యతిరేకతకు వ్యతిరేకీ కాదు. పాత భావాలు లేకుండా మార్క్సిజం లేదు. అందువలన భావాల చైతన్య సూత్రాలను గతితార్కికం అనజాలం.

చరిత్రకు పదార్థవాద వ్యాఖ్యానాన్ని ఇవ్వడం, సాంఘిక, రాజకీయ, సాంస్కృతిక చరిత్ర ఆర్థికంగా నిర్ధారణ అయిందనే సిద్ధాంతం మార్క్సుతోనే ప్రారంభం కాలేదు. "చరిత్రకు సంబంధించిన మార్క్సిస్టు భావం వాస్తవానికి గతంలో పెంపొందిన చారిత్రక భావాలనుండే జనించింది" – ప్లెఖనోవ్, హిస్టరీ ఆఫ్ మెటీరియలిజం.

కేథలిక్ మితవాది వికో, చరిత్రకు సంబంధించిన కొత్తజ్ఞానాన్ని కనుగొన్నారు. 18 వ శతాబ్దంలో గిబ్బన్ ఇతర చరిత్రకారులు, సిద్ధాంతీకరించకపోయినా, చరిత్రను అధ్యయనం చేయడం. వ్రాయడంలో విప్లవపూరిత మార్పులు తెచ్చారు, వికోను ఇంకా పెంపొందిస్తూ చారిత్రక సమస్యలకు మానవశాస్త్ర భాషాశాస్త్ర ధోరణిని హెర్డర్ చూపెట్టాడు. చివరగా హెగెల్ చరిత్ర తత్త్వం వచ్చింది. అలాగే విప్లవానంతర కాలంలో మహోన్నత ఫ్రెంచి చరిత్రకారులు బయలుదేరారు. ఉదాహరణకు, గిజో ఇలా వ్రాసాడు – "రాజకీయ సంస్థలను అవగాహన చేసుకోవడానికి. ఆస్తి స్వభావ, సంబంధాలను తెలుసుకోవడం అవసరం."

సమాజం, దానిభాగాలు, వ్యక్తుల భావనాసరళి, వారిసామాజిక పరిస్థితికి అనుకూల్యత, భిన్న వర్గాలకు చెందిన వ్యక్తుల సంబంధాలు సంక్షిప్తంగా చెప్పాలంటే ప్రజల స్థితిగతులు ఇవన్నీ, ప్రజలు ఎలా నివసించారో తెలుసుకోగోరిన చరిత్రకారుడి దృష్టికి మొట్టమొదట రావాలి. వారు ఎలా పరిపాలించబడినారో అనే విషయాన్ని ప్రచారకర్త గ్రహించాలి. (GUIZOT, L' HISTOIRE DE FRANCE) మధ్యయుగాల

తొలిరోజులలో ఫ్రాన్సు చరిత్ర వ్రాయడానికి ఈ పద్ధతి గిజో ప్రయోగించాడు. ఇంగ్లీషు విప్లవ చరిత్రలో అతడు వర్గపోరాట భావనలను ప్రవేశపెట్టాడు.

సమాజ పరిణామంలో రాజకీయ విప్లవాలకు సంబంధించిన "గర్భితకారణాన్ని" ఆగస్టన్ థైరీ కనుగొన్నాడు. ఆధిపత్యం వహిస్తున్న సామాజిక ఆసక్తిని వ్యక్తంచేయడమే ప్రజాభిప్రాయంగా అతడు పరిగణించాడు. యవ్వనదశలో సెయింట్ సైమన్‌కు కార్యదర్శిగా థైరీ పనిచేసాడనేది స్ఫురణకు తెచ్చుకుంటే ఆసక్తికరంగా ఉంటుంది. "స్వాప్నికుడినుంచి" చరిత్ర విజ్ఞానానికి సంబంధించిన పాఠాలను నేర్చి వుంటాడు. విజాట్ థైరీకంటె మిగ్నెట్ తదితర ఫ్రెంచ్ ఉదార చరిత్రకారులు–మిషెలా సరేసరి–ఇంకొంచెం ముందుకు వెళ్ళి సామాజిక పరిణామంలో వూతం యిచ్చే ఆధారాన్ని ఆర్థిక సంబంధాలలో కనుగొన్నారు.

17, 18 వ శతాబ్దంలో తొలిరోజులలో ఉన్న నైతికవాదులలో బాహాటంగా సోషలిస్టు భావాల సంప్రదాయాన్ని కనుగొనవచ్చు. వారంతా వ్యక్తిపరమైన ఆస్తివిధానాన్ని ఖండించారు. తత్ఫలితంగా శ్రామిక వర్గాలను ఆర్థికంగా దోచుకోవడం జరుగుతున్నదన్నారు. స్వేచ్ఛ, సమానత్వం, న్యాయం అనేవి సాధించాలంటే ఉమ్మడి యాజమాన్యం ఉండాలన్నాడు. పోటీ, వైరుధ్యాలు ఒక వైపున, స్పర్థలు, సంఘర్షణ మరొక వైపున, ఇతరుల కష్టంతో లాభాలు పొందాలనే గర్భిత కోరిక, ఇత్యాది దోషాలన్నీ ఆస్తివలన జనిస్తాయని, దీనికి అనుగుణంగానే అసమానత్వాలు విడదీయడానికి వీలులేకుండా తలెత్తుతాయని అన్నారు. ఇది కమ్యూనిస్టు ప్రణాళికనుంచి ఉదహరించినవి కావు. రూసో వ్రాసిన 'డిస్కోర్స్ ఆన్ ఇనీక్వాలిటీ' నుంచి ప్రస్తావించారు. ఇలాగే జ్ఞానవికాస తత్త్వవేత్తలకు ముందున్నవారు విప్లవపూరిత భావాలను బోధించారు. ఇందులో థామస్ మోర్, కుంపనెల్లా, ఫేనెలాన్ సుప్రసిద్ధమైనవారు. ఇంకా మోరిస్, బెలామీ, కాబె తదితరులు స్వాప్నికులుగా పేరొందారు. స్వాప్నికుడనే పదం చాలా అపనిందలకు గురిఅయింది. మార్క్సిస్టు "వైజ్ఞానిక సోషలిజం" స్వాప్నిక స్వభావంతో ఉన్న నైతిక ధోరణి మాత్రమే. 18వ శతాబ్దంలో తొలి రోజులలో మాబ్లే, మోరెల్లె వంటివారు మార్క్సిజానికి దారిచూపినట్లు నిష్పాక్షిక చరిత్రకారులెవరైనా చెప్పగలరు.

వీరిరువురూ, క్రైస్తవమత పూజారులే. మాబ్లే, పునర్వికాస సంప్రదాయంలో ఉన్న పండితులవలె ప్లేటో వాది. "వైజ్ఞానికి సోషలిజానికి మార్గగామి" అని ఇతడిని ఫ్లింట్ వర్ణించాడు. (రాబర్ట్ ఫ్లింట్, హిస్టరీ ఆఫ్ ది ఫిలాసఫీ ఆఫ్ హిస్టరీ) సమాజ ప్రథమదశలో సమానత్వం ఉండేదని మొట్టమొదట ప్రకటించిన వాడు బహుశా మాబ్లేయేనేమో. సమాజ అంతిమస్థాయిలోనూ సమానత్వం పునరుద్ధరణ చెందుతుందని కూడా అతడు ప్రకటించాడు. ఫిజియోక్రాట్ల ఆర్థిక సిద్ధాంతాన్ని ఎదుర్కొనటానికి

ఇతడొక గ్రంథం వ్రాసి, వ్యక్తిపరమైన ఆస్తి మానవుల దురదృష్టాలన్నింటికీ మూల కారణమనీ అన్నారు. ఆ గ్రంథంలో భావాలు ఈ విధంగా సంక్షిప్తంగా పేర్కొనవచ్చు. ఆస్తివచ్చినక్షణంలో అసమానత్వం తప్పనిసరి అవుతుంది. స్వార్థాల సంఘర్షణ వలన సంపదలోనూ పేదరికంలోనూ ఉండే దోషాలన్నీ వచ్చి, మానవుడి మనసును పశు ప్రాయంచేసి, పౌరుల మర్యాదను భంగంపరచి, యుద్ధానికి దారితీస్తుంది. బాబఫ్, మార్క్స్ చెప్పిన అదనపు విలువ సిద్ధాంతాన్ని ముందే వూహించిన మాబ్లే ఉన్నతవర్గాలలో అదనంగా వచ్చినదంతా ఇతరులను దోచినందువలననే వచ్చిందన్నాడు (MABLY, DOUTES PROPOSEES AUX PHILOSOPHES ECONOMISTES).

ఫ్రెంచి విప్లవానికి కొన్ని దశాబ్దాలకుముందే, మాబ్లే కమ్యూనిస్టు సిద్ధాంతాలు బహుళ ప్రచారంలో ఉండేవి. అతడిని అనుసరించి మోరెల్లె వచ్చాడు. అతడు వ్రాసిన సుప్రసిద్ధ గ్రంథం, పేరు లేకుండా ప్రచురితమయింది (LES CODES DE LA NATURE, DU LE VERITABLE ESPRIT DE SES LOIS TOUT TEMPS NEGLIE OU MECONNU). అదే సంవత్సరంలో రూసో వ్రాసిన “డిస్కోర్స్ ఆన్ ఇనీక్వాలిటీ” ప్రచురితం అయింది. మోరెల్లె గ్రంథంలో ఒక అధ్యాయం చాలా వినూత్నమయినది. “ప్రకృతి ధోరణిని అనుసరించి నమూనా శాసనం” అనేది యీ అధ్యాయానికి శీర్షిక. మానవుడు పతనం అయ్యాడని క్రైస్తవమతం చెప్పే సిద్ధాంతాన్ని ఇతడు నిరాకరించాడు. అలాగే ప్రకృతిలో మానవుడి స్థితిని గురించి హాబ్స్ దృక్పథాన్ని కూడా ఇతడు తృణీకరించాడు. మోరెల్లె దృష్టిలో మానవుడు ప్రాయికంగా మంచివాడు. విశ్వాసం నుంచి నీతి సూత్రావళులు రాబట్టడం ఆ కాలానికి చాలాకొత్త. మానవుడిలో కుటిలత్వం అనేది సామాజిక స్థితిగతుల వలన వస్తుందని దీనికి మూలకారణం వ్యక్తిపరమైన ఆస్తి అని అన్నాడు. కనుక వ్యక్తిపరమైన ఆస్తినే తొలగిస్తే, స్వేచ్ఛ, న్యాయం, నీతి ప్రధానంగా వుండే సాంఘిక క్రమం స్థాపించవచ్చునన్నాడు. అటువంటి సాంఘిక పరిస్థితులలో నీతి అనేది గణిత సూత్రాలవలె సాధారణంగానూ, స్పష్టంగానూ ఉంటుంది.

మాబ్లే, మోరెల్లె చారిత్రక ప్రాధాన్యం ఏమంటే, వారి సంప్రదాయంలో వారికి ప్రాతినిధ్యంవహిస్తూ బాబఫ్ ఆచరణ రంగంలో ఉండటమే. బాబఫ్ విప్లవాత్మక కార్మికోద్యమానికి ముందు దారిచూపాడనే విషయాలన్నీ చరిత్ర జ్ఞానంగల మార్క్సిస్టులెవ్వరూ కాదనరు. మాబ్లే, మోరెల్లెనుంచి తాము ఉత్తేజం పొందానని బాబఫ్ స్పష్టంగా అంగీకరించాడు. LE CODE DE NATURE అనే గ్రంథం ముఖ్యంగా తనకు ప్రేరేపణ యిచ్చిందన్నాడు. బాబఫ్ శిష్యుడు, జీవిత చరిత్రకారుడు అయిన బానరోతి అనే అతడు రూసో భావాలవల్లనేగాక, మాబ్లేవలనకూడా ప్రభావితుడయ్యాడు. బానరోతి ప్రవచనం “న్యాయానికి సమానత్వం ముఖ్యం” అనేది ప్రౌధాన్ తత్వానికి మూలం

అయింది. మార్క్స్ కమ్యూనిస్టు ప్రణాళిక వ్రాయకముందు "వర్గాలమధ్య యుద్ధచరిత్రే గతంలో సమాజ చరిత్ర." అనే మార్క్స్ సూత్రాన్ని ఫ్రెంచి విప్లవకాలంలోనే బానారోతి సంపన్నులకు, కార్మికులకు సంఘర్షణలుగా పేర్కొన్నారు. కార్మికులు సమానత్వాన్ని సమర్థించగా సంపన్నులు విచక్షణ కోరారు. అంటే కార్మిక విప్లవ ప్రవక్తకు ముందే మార్క్సిజాన్ని ఇతడు బోధించాడన్నమాట. 18వ శతాబ్దపు నైతికవాదులు, తత్త్వవేత్తలు, కావాలన్న సాంఘిక సంస్కరణ అధికారాన్ని విప్లవాత్మకంగా హస్తగతం చేసుకోవడంవలన ప్రజలు సాయుధులై తిరుగుబాటు చేయడంవలన సాధించ వచ్చునన్నారు.

మార్క్సిజంలో ఇతర సిద్ధాంతాలను మార్క్సుకు ముందే లూయీ బ్లాంక్ బోధించాడు. 1890లో అతడు అధికారయుత రాజ్యాన్ని స్థాపించాలని తన గ్రంథంలో వ్రాసాడు (L' ORGA-NISATION DU TRAVIL). అటువంటి రాజ్యం విప్లవానికీ సాధన అని "సమష్టిత్వాన్ని పొందడం" అని వర్ణించాడు. బ్లాంక్ చెప్పిన విప్లవాత్మక రాజ్య సిద్ధాంతంలో అధికారం హస్తగతం చేసుకోవడానికి, సోషలిజాన్ని స్థాపించడానికి మధ్య కార్మిక నియంతృత్వ భావం సంధికాలంలో పనిచేసేదిగా చూపాడు. మార్క్స్ కలలుగన్న వర్గరహిత సమాజాన్ని అతడు వూహించాడు. "ఉన్నతవర్గం, క్రిందివర్గం అనేవి ఒకనాడు వుండకుండా పోతాయి. అప్పుడు రక్షణయిచ్చే అధికారంతో పనిలేదు. అప్పటివరకూ, రాజకీయాలద్వారా తప్ప సోషలిజం ఫలప్రదం కాదు."

మార్క్సుకంటే ముందే మార్క్సిజాన్ని బ్లాంక్ మరొకడుగు ముందుకు తీసుకవెళ్ళాడు. బాఫ్, అతడి అనుచరుల నైతిక ధోరణిని వదిలేసి విప్లవాత్మక నియంతృత్వ స్థాపనకై ఒక పన్నుగడను చూపాడు. విప్లవాత్మకంగా అధికారాన్ని హస్తగతం చేసుకోవాలనడంలో బానరోతి కొన్ని పరిమితులలో ప్రస్తావనచేసాడు. "ప్రజలకు సార్వభౌమత్వం అధికారాన్ని యిచ్చేముందు ధర్మంపట్ల ప్రేమను బోధించాలి." (CONSPIRATION POUR L' EQALITE). బ్లాంక్ నియంతృత్వ కార్యక్రమం ప్రకారం, బూర్జువాతో ఘర్షణ, కార్మికులకు, ఆయుధాన్నివ్వడం, శాసనసభలకు ఎన్నికలు లేకుండాచేయడం, శాసనసభను రద్దుగావించడం, బూర్జువా పత్రికలను అణచివేయడం రాజ్యయంత్రాగాన్ని సంపూర్ణంగా పునర్వ్యవస్థీకరించడం పేర్కొనదగినవి? ప్రజాస్వామ్య ప్రాతిపదికను విస్తరించే రాజకీయ, మేధావుల ప్రయత్నంలో సోషలిస్టు సిద్ధాంతాలు జనించాయి. ప్రజాస్వామ్యంనుంచి సోషలిజానికి ఆలోచనా వుద్యమాలు, గతితార్కికంగా కాక, నిరంతరంగా ఉన్నవి. మానవుడి స్వేచ్ఛాన్వేషణ చిరకాలంగా సాగటమే ఇందుకు ప్రోత్సాహాన్ని యిచ్చింది. స్వేచ్ఛా హద్దులను సోషలిస్టు భావాలు ఇంకా విపులం గావించాయి. ఫ్రెంచి బూర్జువా వర్గం అధికారంలో కుదుటపడేనాటికి 1830 లో ఫ్రెంచి విప్లవం ముగిసింది. 18వ శతాబ్దంలో ఉన్నతాదర్శాలను, స్వేచ్ఛను, ప్రగతిని, కాంక్షించినవారంతా, ప్రజలకు

కావలసిన మార్పులు రాలేదని భావించారు. నాటి మేధాసంబంధమయిన ఉద్రేకపూరిత వాతావరణంలో సోషలిస్టుభావాలు రూపురేఖలు దిద్దుకున్నాయి. (కార్మిక వర్గం కంటే మధ్య తరగతి కమ్యూనిజపు చారిత్రక ప్రాధాన్యతను త్వరగా గుర్తించాలనడం సబబుగా వుంటుంది. ప్రజాస్వామ్యం నుంచి తార్కికంగా కమ్యూనిజం వచ్చిందని మధ్యతరగతి భావించింది. ఫ్రెంచి విప్లవ రాజకీయ పోరాటాల వలన, స్వేచ్ఛలేదని పోరాడే మధ్యతరగతివారు ఆ సూత్రాలపట్లే తిరుగుతున్నట్లు కనుగొన్నారు. (FRANCOIS FEJTO, EUROPE ON THE EVE OF THE REVOLUTION, IN THE OPENING OF AN ERA 1848, EDITED BY TAILOR).

ప్రజాస్వామ్య ఆదర్శంనుంచి తార్కికంగా వచ్చిన సోషలిస్టు భావాలకు, లామార్టిన్, మిషెలా, విక్టర్ హ్యూగోల వంటి ఉద్వేగవాదులు తోడ్పడ్డారు. కాథలిక్ ఉదారవాదం క్రైస్తవ సోషలిజంగా పెంపొందినది. ఉదా॥ లామానా ఇలా వాదించాడు. ప్రపంచంలో దోషం ఎప్పుడు ప్రవేశించింది? అది కొందరి సుఖం వలన వచ్చిందా? లేదు. కొందరికి అవకాశాలు లేకుండా చేసినందువలన, సంపన్నుల స్వార్థం నిమిత్తం చేసిన చట్టాలవలన పేదల శ్రమనుంచి వారు మాత్రమే లాభంపొందే రీతులవలన ఇదంతా జనించింది. ఆ వాదనలో అలా ప్రకటించాడు. "ఎవరైతే పనిచేస్తారో, అతడికి ఉత్పత్తిలో సమానభాగం అందేటట్లు చూడాలి" (FELICITE LAMELLAIS LIVRE DU PEOPLE).

18వ శతాబ్దంనుంచి నైతికవాదులు, సంస్కరణవాదులు పరంపరానుగతంగా బేధించిన సోషలిస్టు కమ్యూనిస్టు భావాలను ప్రప్రథమంగా, 1825లో చనిపోయిన హెన్రీ సెయింట్ సైమన్ ఒక క్రమంలో రూపొందించాడు. (ఈ సంప్రదాయాన్ని నాగరికత చరిత్రలో అనంతంగా వెనక్కువెళ్ళి చూడవచ్చు). 1830 ఫ్రెంచి విప్లవానంతరం సెయింట్ సైమన్‌చెప్పిన విప్లవాత్మక సాంఘికతత్త్వంపట్ల, అభ్యుదయకర బూర్జువా వర్గంవారు ఆకర్షితులయ్యారు. బోనాల్డ్, డమెయిస్ట్ర్ తదితరుల తిరుగమన రాజకీయ సిద్ధాంతాలను ఎదుర్కొనడానికి శక్తివంతమయిన ఆయుధం, సోషలిస్టు తత్త్వంలో లభించింది. లాప్లాస్, కువేర భౌతిక సిద్ధాంతాల ఆధారంతో సెయింట్ సైమన్ మొట్టమొదట సాంఘిక రాజకీయ చరిత్రకు భాష్యం చెప్పాడు. కాండారీస్ చరిత్రతత్త్వ ఆధారంగా ఇతడు భావాలు స్వీకరించాడు. "సమాజ ప్రగతి వ్యక్తి ప్రగతిలో పరిశీలించవచ్చు. అనేకమంది వ్యక్తులలో పరిశీలించిన అనంతరం నియమం ఏర్పడుతుంది." అని కాండరీస్ చెప్పాడు. చరిత్రకు వికో చెప్పిన వృత్తాకార భాష్యం సెయింట్ సైమన్ సాంఘిక రాజకీయ తత్త్వంపై ప్రభావాలు చూపెట్టింది. అయితే ప్లేటో తత్త్వంపట్ల ఆనాడు చాలా ఆకర్షణ ఉండేది. గత సంప్రదాయాలు ప్రభావాల

వలన సెయింట్ సైమన్ ఒక నిర్ణయానికి వచ్చాడు. "కవులు ఊహించిన స్వర్ణయుగం మానవజాతిని జోకొట్టినది. అది వాస్తవానికి నిరుపయోగం. ఆ దశలోనే మానవులు దానికి తిలోదకాలు ఇవ్వవలసింది. స్వర్ణయుగం గతంలో లేదు. భవిష్యత్తులో ఉంది. సమాజక్రమాన్ని సంపూర్ణంగావించడంలో ఉన్నది. మన పూర్వీకులు దానిని చూడలేదు. మన సంతతి ఒకనాడు అక్కడకు చేరుకుంటారు. వారికి బాటను సుగమం చేయడం మన కర్తవ్యం" (ENFINTIN, DOCTRINE DE SAINT-SIMON).

ఈ మార్గాన్ని సిద్ధంచేయడానికి ఏమిచేయాలో చెప్పడంలో సెయింట్ సైమన్ వైఫల్యం పొందలేదు. "జనాభాలో అధిక సంఖ్యాకుల నైతిక, శారీరక, స్థితిని మెరుగుపరచడానికి, రాజ్యంలో అత్యవసరమయిన వ్యయాన్ని వ్యక్తీకరించాలి. శరీర పుష్ఠిగల వ్యక్తుల నుంచి శ్రమను స్వీకరించడానికి అటువంటివారి మనుగడకు ఇది అవసరం. కార్మికులకు ప్రత్యక్ష జ్ఞానాన్ని అత్యంత వేగంగా అందించగలవారిని మరొకవర్గంగా చూడాలి. వివేచనను పెంపొందించడంలో అవసరమయిన ఆనందాన్ని సమకూర్చే నిమిత్తం మరికొందరు వ్యక్తులను సంరక్షించాలి." మార్పుకుముందు సెయింట్ సైమన్ ఆర్థిక ప్రాతిపదికల విశ్లేషణవలన ఆధునిక పారిశ్రామిక యుగాన్ని చారిత్రక ప్రాధాన్యతను సరిగా అంచనా వేయవచ్చునన్నాడు. అతడి శిష్యుడు, గురువు జీవితచరిత్రను వ్రాసిన బాజార్డ్, సమకాలీన సమాజపు ఆర్థిక నిర్మాణాన్నీ వివరంగానూ, లోతుపాతులతోనూ పరిశీలించాడు. 1829లోనే అతడిలా వ్రాసాడు. "చరిత్రలో మూడో విమోచన దశగా కార్మికవర్గం రద్దవుతుంది. పతనాన్ని సంపాదించేవారు సహచరులుగా మారతారు." రైతులుగాను, రైతులనుంచి వేతనాలు సంపాయించేవారిగానూ మారిన దశలన్నీ అధిగమిస్తారు. (Martin Buber, Paths in Vtopia).

ఆగస్టిన్ థైర్ ఆగస్ట్ కోమ్టె భిన్న దృక్పథాలు గలవారైనా సెయింట్ సైమన్ ప్రభావానికి లోనయ్యారంటే అతడి చారిత్రక ప్రాధాన్యతను గమనించవచ్చు. కోమ్టె ప్రత్యక్షవాదానికి, సెయింట్ సైమన్ తత్వం ప్రాతిపదికలు వేసినట్లు సమర్థులైన చరిత్రకారులు పేర్కొన్నారు. అటువంటి తత్వాన్ని స్వప్నవాదులుగా వెక్కిరించడం, మార్క్స్ మితిమీరిన విమర్శలలో ఒకటి, మరణశయ్యపై సెయింట్ సైమన్ ఇలా ప్రకటించాడు. "మన జీవితమంతా ఒక్క ఆలోచనలో వ్యక్తంచేయవచ్చు మానవులందరు వారి సహజ ప్రతిభలను స్వేచ్ఛగా పెంపొందిచడానికి హామీవుండాలి."

ఛార్లెస్ ఫూరోర్ సామాజిక సమస్యలకు, నైతిక దృక్పథాన్ని ఆవలంబించడంలో తన జీవితంలోని బాధాపూరిత అనుభవాలనుంచి ఎంతో నేర్చాడు. కనుక స్వప్నవాది అయిన ఫూరోర్, మార్క్స్ సిద్ధాంతంలోని ఆర్థిక నియతివాదానికి వ్యక్తీకరణ అనవచ్చు. గందరగోళమైన అతడి జీవితం, దోషపూరితమైన ఆలోచనలు ఏవీకూడా

ప్రజాస్వామ్యంనుంచి సోషలిజానికి మారుతున్న చరిత్రపై ముద్రను వేయలేదు.

అయితే సాంఘిక సమస్యలకు అతడి నైతిక దృక్పథం నేటికాలానికి పాఠాన్ని నేర్పుతున్నది. అతడు నిజమయిన స్వాప్నికుడు. "18వ శతాబ్దంలోని రూసోవాణికి ఇతడు ప్రతిధ్వని అనవచ్చు. బహుశ వ్యంగ్య ప్రతిధ్వని కావచ్చు. మానవజాతి తప్పుదారిన పోతున్నదని ఇతడు కనుగొన్నాడు." (అలెగ్జాండర్‌గ్రె ది సోషలిస్ట్ (ట్రెడిషన్).

ఫూరర్‌కు ప్రముఖ శిష్యుడైన కన్సిడరెంట్ భావాలు స్పష్టమైనవి, ఒక పద్ధతిలో వున్నవి. కొన్ని దృక్పథాలలో కమ్యూనిస్టు ప్రణాళికను ఇతడు ముందే వూహించాడు. 1843లో కన్సిడరెంట్ వ్రాస్తూ, స్వేచ్ఛాయుత పోటీ అనేది అరాచకసూత్రం అన్నాడు. మధ్యయుగాలలో కార్పొరేషన్లు, గిల్డులు, దిగజారిన ఫలితంగా యీ సూత్రం ఆవిర్భవించిందన్నాడు. దీనివలన "విశ్వవ్యాప్తంగా పరిశ్రమలోని అన్నిరంగాలలో గుత్తాధిపత్యం వస్తుందన్నాడు." (మార్టిన్ బ్యూబర్ ఉదహరించిన పాత్స్ యిన్ యుటోపియా లోనిది). తన ముందున్న సోషలిస్టు "స్వప్నవాదులకు" భిన్నంగా మార్క్స్ తన ''వైజ్ఞానిక'' సోషలిజాన్ని అందించాడు. కార్మికుల గురించి తనకంటె ముందున్నవారికి ఏమీతెలియదని అతడు విమర్శించాడు. కొత్త సాంఘికవ్యవస్థ గురించి వూహాపూరిత అనుభవంతో కల్పనలు చేసారని అన్నాడు. వారంతా నీతికి ప్రాధేయపడ్డారు. వారికి చరిత్రకు సంబంధించిన తత్త్వంలేదు. సోషలిస్ట్ ఆలోచనల గురించి మార్క్సుకంటే ముందున్న చరిత్రను నిష్పాక్షికంగా అధ్యయనంచేస్తే, యీ స్వాప్నికులపై చేసిన ఆరోపణలన్నీ ఆధార రహితమని తెలుస్తుంది. నీతికి ప్రాధేయపడ్డారనే విమర్శ మార్క్సిస్టు దృక్పథంనుంచి మాత్రమే దోషపూరితమయినది. ఇటువంటి నైతిక ప్రాధాన్యత నిరాకరించడం వలన మార్క్సిజంలో పేర్కొన్న భావాలు. ఆదర్శాలు ఎందుకూ కొరగాకుండా పోయాయి.

"వైజ్ఞానిక దృక్పథంనుంచి ఇటువంటి నీతికి ప్రాధేయపడటంవలన, న్యాయం కావాలనడంవలన ఒక్క అంగుళంకూడా ముందుకుపోలేము" అనడం విజ్ఞానానికి సంబంధించిన దోషపూరిత అవగాహనే కారణం.

మిగిలిన విమర్శ విషయాలు సంబంధించి 19వ శతాబ్దపు మధ్యకాలంలో, కార్మికుడనేది మార్క్స్ వూహాఫలితమే. అతని కలలో భాగం పంచుకునేవారు. సహజంగా, కార్మికుడినిగురించి తెలుసుకొనే కంటే ఆశ్చర్యంలేదు.

కమ్యూనిస్టు మానిఫెస్టో ప్రచురించకముందు ప్రౌధాన్‌తో జరిగిన వాదోపవాదాలతో మార్క్స్ స్వయంగా యీ విషయాన్ని గ్రహిస్తూ, కార్మికుడు అనేవాడు లేనందున తనకంటే ముందున్న సోషలిస్టు ఆలోచనాపరులు ఆ విషయాన్ని గురించి

తెలుసుకోకపోవడం సహజమేనన్నాడు. "ఈ సిద్ధాంతకర్తలు, స్వప్నవాదులు వారిమనసులోవున్న విజ్ఞానాన్నే అన్వేషించారు. ఎందుకంటే వారు అనుకున్నంతగా ఇంకా విషయాలు పురోగమించలేదు. వారి కళ్ళఎదుట జరుగుతున్న వాటినే చెపుతూ ఉండటానికీ సాధనాలుగా తోడ్పడ్డారు." Poverty of Philosophy.

30 సంగ అనంతరం ఇటువంటి అభిప్రాయాలనే ఏంగెల్స్ వ్యక్తంచేసాడు. "సోషలిస్టు పితామహులందరూ స్వప్నవాదులు–ఆ స్థితి వారికి తప్పదు. ఆనాటికి పెట్టుబడిదారీ ఉత్పత్తి అసల్పంగానే పెంపొందినది. కనుక నవసమాజాన్ని వారు వూహా సిద్ధాంతాల నిర్మించారు. ప్రాచీన సమాజాలలో వీటికి ఆస్కారం లేదు." (Anti Duchring).

ఏంగెల్స్ వైజ్ఞానిక సోషలిజాన్ని గురించి ఇంకొంచెం ముందుకుపోయి ఇలా చెప్పాడు ; "ఈ వాదం ఎంత కలలతోవున్నా, అద్భుత భావాలుగా అనిపించినా, అవిచాలా ప్రాధాన్యత వహించినవి. వాటిని ముందుగానే వూహించడం మానవుడి మేధస్సుకు నిదర్శనం. వాటి సత్యాన్ని ఇప్పుడు వైజ్ఞానికంగా రుజువుపరచవచ్చు." (Peasant War in Germany).

"వారంతానవసమాజాన్ని ఆలోచనలోనే నిర్మిస్తే", మార్క్స్ కూడా అపనే చేసాడు. "వైజ్ఞానిక సోషలిజం", గతితార్కిక పదార్థవాదం అనేవి సిద్ధాంతపరంగా ఆదర్శప్రాయమైన సృష్టి మాత్రమే. తన పూర్వీకులకంటే తాను వైజ్ఞానికంగా పయనిస్తున్నానని మార్క్స్ తన విచక్షణను చాటుకున్నాడు. దీనిని వున్నపళంగా స్వీకరించగలగాలని, ముందే ఏర్పరచుకున్న భావాలనుంచి రాబట్టడంగాని తగదు. సామాజిక పరిణామంలోని అనుభవపూరిత నియమాలనుంచి, ఆధునిక సామాజిక శక్తులనుంచి మాత్రమే మార్క్స్ తన ప్రమాణాలను వూహిస్తానంటాడు. సోషలిజం తప్పనిసరిగా వస్తుందని "చారిత్రకాభివృద్ధి ఆవశ్యకతఅనీ" అతడు రుజువుచేయదలచాడు. వైజ్ఞానిక సోషలిజానికి తోడ్పడిన "చారిత్రపరిణామ నియమాలు" మార్క్స్‌కు కమ్యూనిజం తప్పనిసరిగా వస్తుందని వూహించడానికి తోడ్పడింది. సంఘర్షణవలన ప్రగతి వుంటుందనే హెగెల్ భావమే – మార్క్స్‌కు ఆధారం. అది ప్రపంచానుభవంకాదు. ముందే ఏర్పరచుకున్న ఒకభావం. దానినుంచి వైజ్ఞానిక సోషలిజాన్ని రాబట్టారు. ఒక భావనగా యిది ఆదర్శతత్వానికి చెందినది. ఒకవేళ దీనిని మళ్ళీ కాళ్ళపై నిలబెట్టాలని మార్క్స్ అన్నప్పటికీ పరిస్థితి అంతే. ఫలితం ఏమంటే "1840 ప్రాంతంలో వూహాపూరిత సోషలిస్ట్ భావాలకు సమాధానంగా కాపిటల్ మొదటిభాగం చివరలో చిత్రీకరణ వున్నది," (ఎన్‌సైక్లోపీడియా బ్రిటానికా, 13వ ప్రచురణ), కమ్యూనిస్టు ప్రణాళికలో చూపిన చిత్రణ ఇంకా ఆకర్షణీయంగా

ఉన్నది. అప్పటికీ ఆర్థిక నియతివాదం ఇంకా మార్క్స్‌కు లభించనేలేదు. తరువాత మార్క్సిజంలో ముందుగా వూహించిన తాత్త్విక భావాలను ఏంగెల్స్ విస్తృతపరిచాడు. "ప్రజల నైతిక అంతర్వాణి, దోషపూరితమని ప్రకటించిన" ఆర్థిక సంఘటన ఆనాటికే వునికిలేకుండాపోయింది. (కమ్యూనిస్టు మానిఫెస్టోకు రైజనోవ్ వ్రాసిన పీఠికనుంచి). గతితార్కిక విధానంలోని భావవాదం అణచివేయడానికి వీలులేదు. నైతిక అంతర్వాణి అనేది ఆర్థికశక్తి కాదు. మానవుడి చిరకాల స్వేచ్ఛాపోరాట సంప్రదాయాన్ని అనుసరించనంతవరకు మార్క్సిజంకూడా నీతికి విజ్ఞప్తి చేయడం నుంచి తప్పించుకోలేక పోయింది. మార్క్సిజం చారిత్రక ప్రాధాన్యత అంతా ఇందులోనే వుంది. అయితే మార్క్స్ తనకంటే ముందున్న వారిని వెక్కిరించడంలో చారిత్రక దృష్టిని అనుసరించలేకపోయాడు. తాను కలుషితంలేని భావానికి ప్రవక్తను అని నమ్మాడు. అదంతా తనకు సాక్షాత్కరించినట్లే భావించాడు.

భావాన్ని వూహించడమనేది దేహానంతరం ఆత్మకు సంబంధించిన విషయం. అంటే తుది లక్ష్యానికి చెందిన సిద్ధాంతం అన్నమాట. ఇది మానవుడు భావించడం ప్రారంభించినప్పటి నుండి వస్తున్నదే అప్పటినుంచి వూహల స్వప్నాలుకూడా ఉన్నవి. ఇన్ని యుగాలుగా ఈ వూహా స్వప్నాలు కొన్ని ప్రవక్త ధోరణులలోను మరికొన్ని దైవం సాక్షాత్కరించిన వాటిగాను ఉన్నవి. ఇవి రెండూ మతాన్ని అంటిపెట్టుకున్నవే. గ్రీస్‌లో మతేతరంగా ఉన్న ధోరణులలోను పునర్వికాస కాలంలోను ఇందుకు మినహాయింపు ఉన్నది. మతపరమయిన ఆలోచన దిగజారిపోతుండగా క్రమేణా, దేహానంతరం ఆత్మకు సంబంధించిన విషయాన్ని మతేతరంగా ఆలోచించారు. ఈ భావానికి భిన్నంగా మానవుడు భవిష్యత్తుగురించి ప్రవక్తవలె చెప్పే ధోరణి, విశ్వాసంకంటే సంకల్పానికి ఎక్కువ స్థానం కల్పించింది. ఆధునిక భావ స్వప్నాలకు మూలం అదే. మానవుడు తన విధిని మలచుకోవడానికి శక్తిగలవాడని విశ్వసించడంలో ఈ వాదానికి ఆధారం ఉన్నది. మానవుడి సృజనశక్తిని, సార్వభౌమత్వాన్ని వ్యతిరేకించడం పూర్వీకులనుంచి సంక్రమించినదే. మార్క్సు ప్రకటించిన వైజ్ఞానిక సోషలిజం కూడా భవిష్యత్తు సమాజానికి సంబంధించిన విషయాన్ని మానవాళిముందుంచాడు. కనక అది కూడా భావస్వప్నమే. అయితే ఈ లక్ష్యానికి చేరుకోవడానికి మానవుడి సంకల్పంగాని, మానవుడు కావాలని చేసే ప్రయత్నంగాని అక్కరలేదు. వ్యక్తితో సంబంధంలేని ఉత్పత్తిశక్తుల అభివృద్ధే ఇందుకు సహకరిస్తుంది. మార్క్సిస్టు భావస్వప్నం సాక్షాత్కరించిన సత్యం వంటిది. విధి వాదంలోకి అది క్రమేణా దిగజారిపోయింది. "మానవాళి ఆవశ్యకతనుంచి స్వేచ్ఛా పరిధిలోకి గంతువేసింది". కానీ ఈ గంతు అంధకారంలోకి కూడా కావచ్చు. అక్కడ వెలుగు చూద్దామనే గుడ్డి విశ్వాసంతో ఇది చేయవచ్చు. (మార్క్స్, ఏంగిల్స్

వాదనలన్నీ భావ స్వప్నాలుగా సోషలిజానికి ఉపయోగించారు. వివేచనకు, న్యాయానికి మానవ సంకల్పానికి, సమాజంలో ఒడుదుడుకుల చక్కబాటుకు విజ్ఞప్తిచేస్తున్న ఈ వాదం పారిశ్రామికవాదంలో గతితార్కికంగా పెంపొందుతున్న చైతన్యస్థితిని గమనించలేదు–(మార్టిన్ బూబర్, పాత్స్–ఇన్ యుటోపియా).

చిత్తశుద్ధి లేదనడంకంటే, దోషబద్ధం అని భావించతగిన రీతిలో మార్క్సు తనకంటే ముందున్న సోషలిస్టు ఆలోచనలను నిరాకరించాడు. దీనికి ఆధారం ఏమంటే ఆనాడు "వాస్తవ సోషలిస్టులు"గా భావించుకున్న జర్మన్ తాత్త్విక రాడికల్స్‌ను వ్యతిరేకించి, ఫ్రెంచి సోషలిస్టుల స్వప్న భావాలను సమర్థించాడు. వైజ్ఞానిక సోషలిజానికి స్థాపకుడైన మార్క్సు, జర్మన్ సోషలిస్టులను వ్యతిరేకించగా, వారు మార్క్సుకు ముందున్న కమ్యూనిజాన్ని భావ స్వప్నం అంటూ : ఫ్రెంచి ఇంగ్లీషు సాంఘిక సంస్కర్తల విప్లవకారుల ప్రపంచానుభవ సిద్ధాంతానికి భిన్నంగా వైజ్ఞానికంగా సోషలిజానికి చేరుకున్నామన్నారు. ("కమ్యూనిజం ఫ్రెంచికి చెందగా సోషలిజం జర్మనీది. ఫ్రెంచివారు రాజకీయాలతో కమ్యూనిజానికి చేరుకోగా జర్మనులు అతి భౌతికతవలన సోషలిజానికి వచ్చారు. ఇది మానవ శాస్త్రంగా మారిపోయింది. ఇవి రెండూ తుదకు మానవతావాదంలో కలిసాయి. జర్మన్ ఐడియాలజీలో మార్క్సు ఉదహరించాడు – (ది రైనిష్ ఏనల్స్ లేదా ఫిలాసఫీ ఆఫ్ ట్రూ సోషలిజంనుంచి స్వీకరించాడు).

"వాస్తవ సోషలిస్టులు బాహ్య ఒత్తిడులపై ఆధారపడిన ప్రస్తుత సమాజాన్ని" వ్యతిరేకిస్తున్నందున మార్క్సు వారిపై ఆగ్రహం చూపాడు. "మానవుడి అంతర్గత స్వభావం, అంటే వివేచన" ఆధారంగా స్వేచ్ఛా సమాజాన్ని వాస్తవ సోషలిస్టులు వూహించారు. మార్క్సు వ్యంగ్య అవహేళనకు గురైన ఈ సోషలిస్టులు భావానికి మూలం ఏమిటి? "నా లక్ష్యాన్ని సాధించుకోవడానికి అందరి లక్షణాలను ముందుకు తీసుకుపోవడం వలన, లక్ష్యసాధన జరుగుతుంది కనుక తుది ఫలితంగా వ్యక్తి చైతన్యావస్థ సాధారణ ఉనికితో పొందికగా ఉంటుంది." (హెగెల్, ఫిలాసఫీ ఆఫ్ లా). హెగెల్‌కు సంబంధించిన రాడికల్స్ వాదులుగా ఫ్యూయర్‌బాహ్ అనుచరులు (జర్మను సోషలిస్టులు) గురువు బోధననుంచి ఇలా వూహించారు. "జీవసమాజం విశ్వసమానత్వం అధారంగా ఉంటుంది. అలాగే పెంపొందుతుంది. వ్యక్తులను వ్యతిరేకిస్తూ సంపూర్ణతవైపుకు పురోగమిస్తుంది. అవధులులేని సమన్వయానికి విశ్వ సంతోషంలో వ్యక్తి లీనం అయేటట్లు చేస్తుంది. సామాజిక సమన్వయం విశ్వ సమన్వయానికి ప్రతిబింబం మాత్రమే."

మంచైనా చెడైనా ఈ నిర్ణయాలన్నీ జీవసమాజ భావననుంచి రాబట్టినవే. హెగెల్‌నుంచి వీటిని మార్క్సు స్వీకరించాడు. అయితే విప్లవానికి నుంచి రాబోయే ప్రవక్త ఛాందసమయిన ఉత్సాహం చూపించడంతో, చరిత్రకు సంబంధించి తన

వివేచనా దృక్పథాన్ని మార్క్సు పునాదులతో సహా పెకలించివేసాడు.

మార్క్సు శాస్త్రీయ సోషలిజం, గతితార్కికత విశ్వాసంవలన హెగెల్ దృక్పథంపట్ల పక్షపాతం వలన జనించింది. వ్యతిరేకతను వ్యతిరేకిస్తేతప్ప సోషలిజం రాదు. కనుక సోషలిజానికి చెందిన విజ్ఞాన సిద్ధాంతం, సాక్ష్యాధారం మాట అలాఉంచి పెట్టుబడిదారీ సమాజ వ్యవస్థలో దానికి వ్యతిరేకవైఖరి ఉందని భావించాలి. అందుకే మొదటినుంచీ శాస్త్రీయ సోషలిజం విధివాదంగా మతేతర విధివాదంగా ఉన్నది. 1844లో ప్రథమంగా పెట్టుబడిదారీ సమాజం పతనం కావడం తప్పదని మార్క్సు చాటాడు. "వాణిజ్యం, ధన సంపాదన, ఆస్తి పెంచడం, మానవుల దోపిడి ఇత్యాదులన్నీ సమాజంలో గండి పడటానికి దోహదం చేస్తాయి. దీన్ని బాగుచేసేశక్తి పాత వ్యవస్థలో లేదు." (DEUTSCH-FRALZOESISCHE JAHRBUECHER, EDITED BY ARNOLD REUGE). ఇది పిడివాదం వూహాలోచన. మార్క్సు స్వప్న భావికలలో సోషలిస్టుల సంప్రదాయాన్ని అనుసరించే ధోరణి ఉన్నది. ఈ ప్రకటనను రుజువుచేయడానికి అసలు ప్రయత్నమే జరుగలేదు. ఎందుకంటే తాత్త్విక, న్యాయశాస్త్రాలలో విద్యాభ్యాసం చేసిన మార్క్సుకు, "అల్పమయిన" ఆర్థిక శాస్త్రంతో పరిచయం లేకపోవడమే. అయితే హెగెల్ గతితార్కిక పథకంలో తాను వూహించిన సోషలిజాన్ని ఇమడ్చడానికి, కాబోయే ప్రవక్త, ఆర్థిక శాస్త్రం అధ్యయనం చేయవలసి వచ్చింది. పెట్టుబడిదారీ విధానం తప్పక పతనమవుతుందనే వాదానికి సాక్ష్యం విధిగా లభిస్తుందని అతడు తలచాడు. ఈ సత్యాన్వేషణ అలా ఉండగా, యువ హెగెల్ వాదులతో వాదోపవాదాలకు తలపడి పెట్టుబడిదారీ సమాజం పతనమవుతుందనే విశ్వాసాన్ని మళ్ళీ నొక్కిచెప్పారు. "వ్యక్తిపరమైన ఆస్తి ఆర్థికంగా చూస్తే తననుతాను హరించివేసే ధోరణిలో పోతుంది. అభివృద్ధిరీతులన్నీ అందుకు దోహదంచేస్తాయి. వ్యక్తిపరమయిన ఆస్తితో నిమిత్తం లేకుండా అది గ్రహించకముందే ఇలా జరుగుతుంది." (హెూలీ ఫామిలీ).

చిట్టచివరకు ఆర్థిక తత్త్వంలోగాక హెగెల్ తత్త్వంలో పరిష్కారమార్గం కనుగొన్నారు. మార్క్సు కాలంనుంచి పెంపొందిన ఆధునిక మనోవిజ్ఞానం, కోరుకున్న ఆదర్శాన్ని, ప్రత్యక్ష దృశ్యాలను మనం ముందే వూహించుకున్న రీతులలో చూడవచ్చునని కనుగొన్నది. హఠాత్తుగా మార్క్సుకు ఆలోచనతట్టింది. హెగెల్ పేర్కొన్న "ప్రపంచ భావన"నే ఆర్థికశక్తిగా ఎందుకు స్వీకరించరాదు అనుకున్నాడు. అప్పుడు కేవలం కనుగొనడమేగాకుండా, వ్యతిరేకతను వ్యతిరేకిస్తూ మానవాళిని ముందుకు తీసుకువెళ్ళే మహాశక్తికి పదార్థరూపాన్ని ఇచ్చి, దాని కళ్ళపై నిలబెట్టడంకూడా సాధ్యం అయింది. పెట్టుబడిదారీ సమాజం పతనంగావడం వ్యతిరేకతలలో ఒకటి కనుక అది తప్పదు. మార్క్సిజానికి పునాది ఏర్పడింది. అయితే మానవ చరిత్రకు హెగెల్ వాదాన్ని

అన్వయించడం జరిగింది. (ఆర్థికరంగంలో కనుగొనడానికి బదులు విధిలో మార్క్సు కనుగొనడం గమనార్హం" – YEOPOLD SCHWARZ SCHILD, The red Prussian).

"హెగెల్ తత్త్వం లేకుండా శాస్త్రీయ సోషలిజం ఉండేదేకాదు." (ఎన్‌సైక్లోపీడియా బ్రిటానికా, 13వ ప్రచురణ).

చరిత్రలో గొప్ప వ్యక్తుల పాత్రను గురించి హెగెల్ వెలిబుచ్చిన అభిప్రాయంలో "ప్రపంచభావన" స్థానే, "చారిత్రక ఆవశ్యకత" అనే మాటపెడితే, అదంతా మార్క్సు వ్రాసినట్లే భావించవచ్చు. (ఏంగిల్స్, పెజంట్ వార్ ఇన్ జర్మనీ) – హెగెల్ వాడిన పదానికి మానవత్వారోపణలతో భాష్యంచెబితే, "చారిత్రక ఆవశ్యకత" ను కూడా అతి భౌతిక భావనగాను, సృష్టి ప్రయోజన ధోరణితో ఉన్నట్లు పేర్కొనవచ్చు. చారిత్రక ఆవశ్యకతకు దైవసంకల్పానికి బేధం చూపడానికి ఆధునిక పాండిత్య ప్రతిభను వినియోగించవచ్చు. అయితే కొత్త ఉత్పత్తి సాధనాలలో విప్లవాత్మక ధోరణికి చెందిన చారిత్రక ఆవశ్యకతకు, విధి ముందే నిర్ణయించిన తత్త్వం లేకపోలేదు. బ్రతుకుదెరువు సంపాదన నిమిత్తం ఆర్థిక శక్తినంతటినీ వినియోగించడాన్ని చూస్తే కొత్త ఉత్పత్తి సాధనాలు ఎందుకు, అలా పరిణమించాయో వివరించవచ్చు. అది అతిభౌతికశక్తితో కూడిన ఆవశ్యకత కాదు. మానవుడు కావాలనుకున్న ఆవశ్యకత మాత్రమే. మానవుడి కృషే యీ ఆవశ్యకతను సంతృప్తి పరుస్తుంది. మానవుడి సంకల్పంలో ఈ ఆవశ్యకతను సాధించే ధోరణి వ్యక్తం అవుతుంది. సంకల్పం ఆచరణను పురిగొల్పుతుంది. కొత్త ఉత్పత్తి సాధనాలు ఆవిధంగానే జనిస్తాయి. మానవుడు ప్రతిపాదిస్తాడు, తృణీకరిస్తాడు. ఆవశ్యకతను గుర్తించడమే స్వేచ్ఛ అని హెగెల్ సిద్ధాంతం చెబుతున్నది. మార్క్సిస్టు సిద్ధాంతంలోనే సామాజిక పరిణామానికి హెగెల్ సిద్ధాంతం మానవ చైతన్యతను అందిస్తున్నది. దీనికి మార్గాంతరంగా, ఉత్పత్తి సాధనాల పరిమాణంముందే నిర్ధారితమయిన ఆర్థికరీతిగా భావించాలి. తుదికారణం మానవుడి వివేచన అందనిచోట ఎక్కడో ఉందన్నమాట. నియతివాదాన్ని మానవచరిత్రకు అందుబాటులో ఉంచాలంటే మానవుడి సృజనశక్తిని గ్రహించడం అవసరం. కాకుంటే మానవుడే చరిత్రను సృష్టిస్తాడనేది కేవలం అలంకారప్రాయంగానే ఉంటుంది. భావాల చైతన్యం ఆలోచన జీవిద్వారా వ్యక్తం అయ్యే సమాజప్రయోజనం, చారిత్రక జీవ దృక్పథానికి మూలం. వికో, మిషెలా, మార్క్సు ఇటువంటి చారిత్రక దృక్పథాన్ని ప్రవచించారు.

పెట్టుబడిదారీ వ్యవస్థ పతనంకావడం, సోషలిజం రావడం తప్పదని సిద్ధాంతీకరించిన మార్క్సు, వ్యవస్థాపిత సాంఘిక క్రమాన్ని కూలద్రోయడానికి సాయుధ విప్లవం అవసరం కూడానని ప్రథమంగా చెప్పాడు. ఆ విధంగా పుట్టుకతోనే పరస్పర విరుద్ధంగా మార్క్సిజం ఉంది. ఏ సాంఘిక వ్యవస్థ అయినా పతనంచెంది,

అదృశ్యంగావడం తప్పనిసరైతే, ఆ వ్యవస్థను కూలద్రోయడానికి హింసాయుత విప్లవం అవసరం. బలవంతంగా మార్పు తేవలసివస్తే, తప్పనిసరిగా మార్పు జరుగుతుందనేది సరైనవాదం కాదు. అంతకంటే ఆధిక్యత వహించిన శక్తిని ప్రయోగించి దీనినే అనవచ్చు. చరిత్ర నిర్ధారితమైనదనే వివేచనావాద పదానికి మానవ సంకల్పం కోరే ఉద్వేగ జీవిత దృక్పథానికి ముడివేయబోయిన మార్క్సిస్టు చారిత్రకవాదం తననుతానే ఖండించుకున్నది. అవి రెండూ కలపడం అసంభవం కాదు. హెగెల్ గతితార్కికంలో అవి కలిసాయి. వివేచన ఉద్వేగ వాదనల నుంచే అభ్యుదయ భావం జనించింది. ప్రకృతి వివేచనా విధానమే. అందులో భాగమయిన సమాజంకూడా వివేచనారీతే. జీవపరిణామం కొనసాగడంలోనే సామాజిక పరిణామం ఏర్పడింది. యాంత్రిక దృక్పథంలో జోక్యం చేసుకోరాదంటే, ప్రకృతి పరిణామాన్ని ఆపడానికి యాంత్రికమయిన దైవం ప్రయత్నించినా అనుమతించరాదు. సాంఘిక శక్తులు విప్పారడంతో మానవుడు చేసే ప్రయత్నాన్ని కూడా అడ్డుకోరాదు. భౌతిక, జీవ, సామాజిక పరిణామాలకు చెందిన యాంత్రిక దృక్పథం పదార్థవాదానికి మూలం.

వికో, మిషెలా, మార్క్సులలో ఎవరు సిద్ధాంతీకరించినా సామాజిక ప్రపంచానికి మానవుడే సృష్టి కర్త అన్నప్పుడు, భౌతికవాద తత్త్వంలో వైవిధ్యం ఏర్పడుతుంది. ఇది తొలగాలంటే సృష్టి ప్రయోజన వాదంనుంచి పరిణామానికి సంబంధించిన యాంత్రిక దృష్టిని వేరుచేసి చూడాలి. ఉద్వేగవాదాన్ని వివేచనతో సమన్వయీకరించాలి. సంకల్పం (స్వేచ్ఛ) నిర్ధారిత పరిణామ క్రమంలో ఇమిడేటట్లు చూడాలి. మానవుడి సృజనాత్మకపాత్రను గుర్తిస్తేనే ఇది సాధ్యం. యాంత్రిక విధానంలో మరమేకువలె, ఉత్పత్తి సాధనాల అభివృద్ధి వలన నిర్ధారితమయిన వైఖరిలో మానవుడిని చూడరాదు. ఉత్పత్తి సాధనాలను సృష్టించే మానవుడు ఒక సార్వభౌమత్వ శక్తిగలవాడు. ఆలోచనా జీవి. అలాకాకుంటే విమోచనావాదం చెప్పే నియతివాదానికి, ముందే విధి నిర్ణయించిందనే సృష్టి ప్రయోజనవాదానికి తేడా లేదు. స్వేచ్ఛాభావన, ఎంపిక చేసుకునే అవకాశం, మానవులలో ఒకరిని గురించి మరొకరిని విచక్షణతో చూపుతుంది. చరిత్రకు సంబంధించిన వివేచనా దృక్పథం జీవితంలో ఉద్వేగధోరణిని ఆటంకపరిస్తే, స్వేచ్ఛాభావన అనేది వృధా ఆదర్శమే ఆవుతుంది. అయినా మార్క్సిజాన్ని అనుసరించి, విప్లవాలన్నీ తప్పనిసరిగా జరుగుతాయి. అవి చారిత్రకావసరాలు హెగెల్ గతితార్కికభావవాదంతో భేదించి, ఆచరణతత్త్వాన్ని చూపానంటున్న మార్క్సిజం, మానవుడే చరిత్రను సృష్టించాడంటున్నది. ఉద్వేగవాదానికికూడా ఇదొక మౌలికసూత్రం. మార్క్సిజంలోని ఈ భావవాద సారాంశాన్ని స్పష్టంగా గ్రహించకపోతే, మానవ ప్రయత్నంతో విప్లవాన్ని తేవాలనే ఉద్వేగభావన, వివేచనాత్మకమయిన అభ్యుదయ

భావనతో సమన్వయీకరించడం సాధ్యం కాదు. భౌతికవాద తత్త్వానికి ఈ సమన్వయీకరణ చాలా అవసరం.

ఆలోచనాజీవి రూపొందించే భావాల చారిత్రక విధానంలో స్పష్టమయిన పాత్రను నిర్వహిస్తాయని గుర్తించడంవలన, వివేచనాయుత ప్రగతి దృక్పథానికిగాని యాంత్రిక పరిణామ దృక్పథానికిగాని వ్యతిరేకం కాదు. వివేచనాయుత అభ్యుదయ భావానికి ఉద్వేగవాదానికి చెందిన విప్లవానికి మధ్య భౌతికవాద తత్త్వంలో సమన్వయీకరణ జరుగుతుంది. ఇది భావ వాదానికి వ్యతిరేకం కాదు. భావ వాదాన్ని కలుపుకుని, దానిని అధిగమించి, భావాలకు మూలాన్ని ప్రకృతిలోని వివేచనాక్రమం చూడటం సంభవిస్తుంది. సమాజ పరిణామ క్రమంలో ఆలోచనా జీవి ఒక యాంత్రికమైన దైవం అన్నదే పనిచేయదు. ఆలోచనా జీవికూడా పరిణామ క్రమంలో ఒక భాగమే. మానవుడి మెదడుకూడా ఉత్పత్తి సాధనమే. భావాలు చరిత్ర సృష్టికై మానవుడిని ఆచరణకు పురిగొల్పుతుంది.

మార్క్సిజంలోని తాత్త్విక ధోరణులు ఆ సిద్ధాంతకారులే స్పష్టంగా ఆలోచించలేదు. అందువలన వివేచనా వాదానికి ఉద్వేగవాదానికి సంబంధించిన విప్లవ దృక్పథాలలో వైవిధ్యంవచ్చి మార్క్సిస్టు చారిత్రక దృష్టి అంతా కలుషితం అయింది. ఆ విధంగా అతడు ఉద్వేగవాది కూడా. హైన్‌మన్ వ్రాసినట్లు మార్క్సు, "తన జాతికి చెందిన ద్రష్టల ఆగ్రహాన్ని, స్పినోజాకు చెందిన ప్రశాంత విశ్లేషణాశక్తిని మేళవించాడు." విప్లవానికి ప్రవక్త మరొక వ్యక్తిత్వంలో ఉండజాలడు. ఏ విప్లవం కావాలన్నా ఆచరణ, ఆలోచన కలవాలి. వాటికి ప్రేరణగా వివేచనావాదం ఉద్వేగవాద జీవిత దృక్పథం సమన్వయం పొందాలి.

తత్త్వవేత్తలు ప్రపంచాన్ని అనేక రీతులుగా వ్యాఖ్యానించారు : దానిని మార్చడం ఇప్పటి కర్తవ్యం." అనే మార్క్సు సిద్ధాంతంలో సమన్వయీకరణ ఉన్నది. మార్క్సిస్టు తత్త్వంలోనే విప్లవ సిద్ధాంతం పునర్వికాస మానవవాదంనుంచి సంక్రమించింది. అందులో చరిత్ర తత్త్వం మధ్య సంబంధం కనబడుతుంది. మానవవాద సంప్రదాయంతో ఉత్తేజం పొందిన బేకన్ తన "ఎడ్వాన్స్‌మెంట్ ఆఫ్ లెర్నింగ్" అనే గ్రంథంలో సూక్తులనుంచి ఆచరణకు, తత్త్వంనుంచి చరిత్రకు ఉదాహరణనుంచి అన్వయానికి మారవలసిన ఆవశ్యకతను నొక్కి చెప్పాడు. బేకన్ వివేచనావాది, ఆగమన తర్కాన్ని చెప్పినవాడు. దీనివలన న్యూటన్ యాంత్రిక సహజ తత్త్వం సాధ్యం అయింది. బేకన్ మానవ పంథా వలన ప్రభావితమయిన చరిత్రను గమనించిన వికో, మానవాళి తనను తానే సృష్టించుకుంటుందే ఉద్వేగ మాటలను చూపాడు. (SCIEENZA NVOVA). తత్త్వచరిత్ర ద్వారా మార్క్సుకు బేకన్‌కు ఉన్న సంబంధాన్ని ఇంకా చాలా

దూరంవెళ్ళి గమనించవచ్చు.

సోషలిజం తప్పదని నమ్మడంలో మార్క్సిజమే ప్రథమం కాదు. ఫ్రెంచి "భావస్వాప్నికలు", బ్రిటిష్ కమ్యూనిస్టులు ఇలాంటి విశ్వాసాన్ని మార్క్సుకంటే ముందే చాలా జిజ్ఞాసతో బోధించారు. అయితే వారి విశ్వాసానికి అనుగుణంగా, క్రమానుగతంగా శాంతియుత మార్పులను మాత్రమే వూహించారు. వారి విశ్వాసానికి అనుకూలంగా విజ్ఞానాన్ని ప్రస్తుతించారు. సైంట్ సైమన్ తన సోషలిజాన్ని "విశ్వగురుత్వాకర్షణ విజ్ఞానం" అన్నాడు. ఫురోర్ "ఒక విధమయిన విజ్ఞానం" అని తన సిద్ధాంతానికి నామకరణ చేసాడు. మార్క్సుకంటే ముందే వూహించిన ప్రౌధాన్ చాలా ఉద్రేకపూరితంగా తన సిద్ధాంతానికి "శాస్త్రీయసోషలిజం" అని పేరుపెట్టాడు. కమ్యూనిస్టు ప్రణాళిక ప్రచురించకముందే ప్రౌధాన్ భావస్వప్నం (యుటోపియా) అనే పదం వాడాడు. కమ్యూనిస్టు ప్రణాళిక తొలి ముసాయిదాలో, ఏంగిల్స్ వ్రాసిన దానిలో ఈ పదంలేదు. తరువాత మార్క్స్ దానిని ప్రవేశపెట్టాడు. 1884లో ప్రౌధాన్ మార్క్సుకు వ్రాసిన లేఖలో ఇలా పేర్కొన్నాడు. "సాధారణీకరణ ప్రజాస్వామ్యం మధ్య విరుద్ధత్వాలను బైటపెడితే, సైంట్‌సైమన్, ఫురోర్ భావస్వప్నాలకు పట్టినగతే వీటికీ పడుతుంది. అప్పుడు విజ్ఞానస్థాయిని చేరుకున్న సోషలిజం సమాజాన్ని ఆవరిస్తుంది. సమాజాన్ని ఎవరూ ఆపలేనంత శక్తితో మరొక లక్ష్యానికి తీసుకుపోతుంది. ఈ సోషలిజానికి రాజకీయ ఆర్థికతకు ఏమీ తేడాలేదు. ప్రౌధాన్ ఆస్తిని చౌర్యం అనగా, ఆ సిద్ధాంతాన్ని కాదనడానికి మార్క్సు "ది పావర్టి ఆఫ్ ఫిలాసఫి" అని ఒక గ్రంథమే వ్రాయవలసి వచ్చింది. కానీ లోగడ ఆస్తిపై ప్రౌధాన్ పుస్తకాన్ని ప్రస్తావిస్తూ మార్క్సు ఇలా వ్రాసాడు. "ఈ గ్రంథం రాజకీయ ఆర్థికతను విప్లవ పూరితం గావిస్తున్నది. ప్రప్రథమంగా రాజకీయ ఆర్థికతను ఒక విజ్ఞానంగా రూపొందిస్తున్నది – (హోలీ ఫామిలీ).

ప్రౌధాన్ సమష్టి వాదానికి వ్యతిరేకం గావడం, ఆ దృష్ట్యా విమర్శించడంలో, మార్క్సు అతనిని దుయ్యబట్టాడు. మార్క్సు పిడివాద ధోరణికి వ్యతిరేకంగా ప్రౌధాన్ హెచ్చరిక చేసాడు. మరొక కొత్త దర్శనాన్ని (తత్త్వం) నిర్మించడానికి ప్రౌధాన్ భాగస్వామి కాదలచుకోలేదు. "అనుభవానికి పూర్వమే జ్ఞానం ఉందీ అని పిడివాదాలను తొలగించిన తరువాత మళ్ళీ మనం కొత్త సిద్ధాంతాలను ఇచ్చి ప్రజలను చిక్కుల్లో పెట్టకూడదు. కేథలిక్ గ్రంథాన్ని కూల ద్రోసిన మార్టిన్ లూథర్ తన స్వంత ప్రొటస్టెంటు మత జ్ఞానాన్ని అందించి వైవిధ్యంలో పడినట్లు మనంకూడా ఆపని చేయరాదు. మనం కొత్త ఉద్యమానికి దారితీసే వారుగా ఉన్నాం. అంతేగానీ కొత్తమతానికి నాందిపలికే దేవదూతలు లాగా ప్రవర్తించవద్దు. తర్కబద్ధమయిన మతంగాని, వివేచనపేరిట

మతంగాని మనం తెచ్చిపెట్టకూడదు" – కార్ల్ మార్క్స్ ప్రౌఢాన్ లేఖ.

సోషలిజం తప్పదనే విశ్వాసంతో ఉన్న భావస్వాప్నికులు, మార్క్సుకంటే ముందు బాబఫ్‌తో మొదలుకొని ఎందరో విప్లవాన్ని బోధించగా–వీరు, ఖండించారు. ("విప్లవాలు మానవాళికి వాస్తవంగా ఉపయోగం గాకపోగా నిరాఘాటంగా సాగుతున్న ప్రగతిని ఆపడం మినహా మరే ప్రమాణాన్ని సాధించలేరు. రాజకీయ వాస్తవాలు సామాజికంగా మెరుగుపడటం నిరాఘాట పురోగమనంతో ఉంటుంది– విలయం గాడ్విన్, పొలిటికల్ జస్టిస్").

వ్యవస్థను హింసాయుతంగా కూలద్రోయాలని చెప్పినవారిలో మార్క్సు మాత్రం ప్రథముడుకాడు. ఫ్రెంచి విప్లవాన్ని ఆదర్శంగా భావించిన రాజకీయ భావవాదులు ఓర్పువహించలేక విప్లవాగ్నిని చిందించారు. ఫ్రెంచి ఉదారవాద చరిత్రకారులు 19వ శతాబ్దంలో వర్గపోరాటం ఉందని భావించి దానితోపాటుగా రక్తపాతం సాగుతుందన్నారు. థైర్‌కూడా ఇలా వ్రాసాడు : "యుద్ధం అంటే విప్లవం తప్పనిసరి అని పునరుద్ఘాటిస్తున్నాను. పోరాటంవలననే న్యాయం చేకూరుతుందని మానవుడికి దైవం మార్గాన్ని చూపుతున్నది." (థైర్, హిస్టరి ఆఫ్ ది ఫ్రెంచి రివెల్యూషన్). సంప్రదాయం నైతికవాదుల ప్రమాణం ఆధారంగా హింసను ప్రభోధించిన బాబఫ్ ధోరణి నెపోలియన్ శకానంతరంకూడా, 1830 నుండి 1848 వరకు ఆకర్షించింది. బ్లాంక్విస్టులు సాయుధ తిరుగుబాటును సమాయత్తం చేస్తారు. బ్రిటన్‌లో బ్రాంటెర్ ఓబ్రేన్ నాయకత్వాన ఛార్టిస్టు ఉద్యమంలో శక్తివంతమయిన ఒక దళం ఉండేది. వారి సిద్ధాంతం ఇలా ఉండేది : "ఏ దేశంలోనైనా ఏ కాలంలోనైనా సంపన్నులు తమ అధికారాన్ని న్యాయంగా, హృదయపూర్వకంగా, అంతరాత్మవలన వదిలేసిన ఘట్టాన్ని ఒక్కటి చూపమని చరిత్రకారులను ప్రశ్నిస్తున్నాను. నిర్బంధం ఒక్కటే వారిని జీవకారుణ్య వాదులుగా మార్చింది." (ది పూర్ మాన్స్ గార్డియన్).

మార్క్సు తన పూర్వీకులను "స్వాప్నిక ఉద్వేగవాదులన్నాడు". మితిమీరిన ఉద్వేగవాదాన్ని మార్క్సుకూడా వాంఛించాడు. ఫ్రెంచి విప్లవం మితిమీరిన ఉద్వేగవాదం వలననే దుఃఖపూరితంగా అంతమయింది. మానవచర్యకు ప్రాధాన్యం ఇచ్చే ఉద్వేగవాదాన్ని మార్క్సిజం ప్రబోధించినందున, అదొక విప్లవాత్మక సిద్ధాంతం అయింది. కానీ హెగెల్ నుంచి సంక్రమించిన వివేచనాయుత తాత్త్విక మూలసూత్రాన్ని ఉద్వేగవాదం కొట్టిపారేస్తున్నది. గతితార్కికత ఒక వివేచనాయుత భావన. గతితార్కిక పదార్థవాదం వివేచనాయుత తత్త్వం. ఫ్రెంచి విప్లవం చివరిదశలో మారుమ్రోగిన హింసాయుత వైఖరి, మితిమీరిన ఉద్వేగవాదానికి మారురూపం మార్క్సిజంలో ఈ రెండు దృక్పథాలు సిద్ధాంత ప్రతి సిద్ధాంతాలుగా వైవిధ్యంతో ఉన్నవి. "ప్రపంచాన్ని మార్చడంతో మానవుడు

మారతాడని" చెప్పడం సమన్వయం ప్రపంచాన్ని మార్చేశక్తి మానవుడికి ఉన్నది. "పరిణామాన్ని విప్లవంద్వారా తొందరగా ముందుకు తీసుకుపోవడం ఒక నైతికహక్కు". ఇది ప్రకృతిలో మానవుడు భాగం అనే వాస్తవంవలన జనించింది. హెగెల్ భాషలో ఇది గతి తార్కిక విధానం. నిరంతరంగా జరిగే మార్పు. మహోన్నత మానవుడికంటే ప్రపంచం గొప్పది. ఈ స్థితి ఎన్నడయినా ఇలాగే ఉంటుంది. కనుక ప్రపంచాన్ని మార్చేశక్తి మానవుడికి పరిమితంగానే ఉంటుంది. భాగంకంటే పూర్ణం (మొత్తం) గొప్పదికదా. ఇది స్పష్టమయిన సత్యం. ఉత్సాహపూరిత విప్లకారులు ఈ సత్యాన్ని గ్రహించక, వివేచనా రహితంగా మారి, ప్రకృతి నియమానికి మానవ స్వభావానికి వ్యతిరేకంగా ప్రవర్తిస్తున్నారు. గాడ్విన్ హెచ్చరించినట్లు మానవాళికి నిజంగా ఉపయోగపడే బదులు నిరంతర ప్రగతికి అడ్డుపడుతున్నది.

అందువలన విప్లవకారుడు అద్భుతాలు చేద్దామనుకొనక వినయంగా ఉండాలి. అతడి జీవితతత్త్వంలో వివేచనావాదం ఉద్వేగవాదం న్యాయంగా సమన్వయం పొందాలి. విప్లవ చర్యపై ఎక్కువ దృష్టి పెట్టిన మార్క్సిజం, వివేచనారహిత వాదంలోకిమొగ్గి, ఒక విశ్వాసంగా దిగజారిపోయింది. మార్క్సు విప్లవ సిద్ధాంతం మానవకృషి భావంతో కూడినది. మానవులు నైతిక ప్రేరణవలన ఆచరణకు ఉపక్రమించారని మార్క్సిజంలో మొండివాదన ఉంది. మానవ ప్రగతి నిరంతరంగా సాగడానికి మానవ స్వభావమే చాలుననే కారణాన్ని నిరాకరించిన మార్క్సిజం కృతనిశ్చయంతో ఉన్న కొద్దిమంది విప్లవచర్యకు పూనుకొంటే చరిత్రలో అదే నిర్ధారించిన విషయంగా మారుతుందని ప్రకటించాడు. చరిత్రకు మార్క్సిస్టులు చేసిన భాష్యం వారి విప్లవ సిద్ధాంతం, మానవాతీత ఆచారం సృష్టి అయింది. (పార్టీలో సంఘటిత కార్మికులు విప్లవానికి ముందుంటారు). ప్రజాస్వామ్యానికి ప్రత్యామ్నాయంగా నియంతృత్వ మార్గాలను మార్క్సిజం చూపింది.

ఆర్థిక దృక్పథంలోకూడా మార్క్సు కంటే ముందే మార్క్సిస్టు భావాలు రూపొందిన ప్రచారం చేసినవారున్నారు. వారిలో ముఖ్యులు ఆర్థిక సమస్యలను కార్మిక దృక్పథంతో చూడలేదు. వాస్తవానికి మార్క్సిజం తన ఆర్థిక మూలసూత్రాలను సంప్రదాయ రాజకీయ ఆర్థికవేత్తలనుంచి స్వీకరించగలిగింది. 18వ శతాబ్దంలో, 19వ శతాబ్దపు తొలిభాగంలో బ్రిటిష్ కమ్యూనిస్టు సిద్ధాంతకారులు స్థూలంగా మార్క్సు ఆర్థిక విధానంలోని అన్ని ధోరణులుకూడా వూహించారు. కాని 17వ శతాబ్దపు మధ్యలోనే ఇంగ్లీషు విప్లవకాలంలో హేరింగ్టన్ అనే రిపబ్లికన్ ఆర్థిక నియతివాదాన్ని ప్రబోధించాడనే విషయం లోకానికి అట్టే తెలియదు. సాంఘిక, ఆర్థిక శక్తులవలన ప్రభుత్వ నిర్మాణం పనిచేసేతీరు నిర్ధారితమవుతుందని చెప్పాడు. 8వ హెన్రీ ఆధ్వర్యాన పెరిగిన 'మత విప్లవాలు', వార్స్ ఆఫ్ రోజెస్‌ను (1485లో బ్రిటన్‌లో జరిగింది. దీనివల్ల కేంద్రీకృత

ప్రభుత్వమేర్పడింది. ట్యూడర్ వంశీకులు రాజ్యానికి వచ్చారు.) ఆర్థిక దృక్పథంతో హేరింగ్టన్ వివరించాడు. చట్టాన్ని కత్తితో కాపాడాలని హాబ్స్ చెప్పిన సిద్ధాంతాన్ని ప్రస్తావిస్తూ హేరింగ్టన్ ఇలా వ్రాసాడు. "సాయుధులైనవారే జాతికి రక్షణ, కానీ సైన్యం పశుప్రాయమయినది. వారికి ఆకలి ఎక్కువ, కనుక తగిన ఆహారాన్ని అందివ్వాలి. సైన్యానికి సరైన కార్యక్రమాన్ని రూపొందించలేకపోతే సైనికబలం ఉన్నా లేకున్నా ఒక్కటే" (హేరింగ్టన్, ఓషియానా) తన సుప్రసిద్ధ గ్రంథంలో కాండొరీస్, ఉత్పత్తి శక్తులను ప్రస్తావించి మానవధోరణి అభివృద్ధి గావడానికి అవి ఉత్సాహాన్ని యిస్తాయన్నాడు. "ఆయుధాలు చేసే వాళ్ళు ఆహారం సిద్ధం చేసుకోవడం, పోషకాహారాన్ని కొంతసేపు అట్టిపెట్టుకోవడానికి కొన్ని విధానాలు రూపొందించుకుపోవడం– ఆహారపు నిల్వలు సృష్టించుకోవటం ఇత్యాదిలక్షణాలన్నీ మానవ సమాజాన్ని జంతువునుండి వేరుచేసి చూడటానికి తోడ్పడింది." (TABLEAU HISTORIQUE). ఫ్రెంచి విప్లవానంతరం పెట్టుబడిదారీ విధానాలు విమర్శిస్తూ సిస్మొండి తన సుప్రసిద్ధ గ్రంథాన్ని ప్రచురించాడు. సంప్రదాయ రాజకీయ ఆర్థికతకు అమూల్యంగా తోడ్పడినట్లు ఈ గ్రంథానికి చరిత్రలో పేరు వచ్చింది. (NOUVEAUX PRINCIPES D' ECONOMIE POLITIQUE OU DE LA RI CHESSE DAN SES RAPPORTS AVEL LA POPULATION).

లాక్ ఆస్థినిగురించి యిచ్చిన నిర్వచనంలో విలువకు సంబంధించిన శ్రమసిద్ధాంతపు మూలం ఉన్నది. "ప్రకృతి ప్రసాదించిన వాటితో మానవుడు తన శ్రమను జోడించడంవలన" ఆస్తి వస్తున్నది. "శ్రమవిలువ సిద్ధాంతానికి ఆడమ్ స్మిత్, డేవిడ్ రికార్డో పునాదులు వేసారు. వారి కృషిని మార్క్స్ కొనసాగించాడు. వారి సిద్ధాంతాలను మార్క్స్ నిర్ధారించి పొందికగా రూపొందించాడు." (లెనిన్ ది త్రీ సోర్సెస్ ఆఫ్ మార్క్సిజం). సంప్రదాయ రాజకీయ ఆర్థిక విధానంలో సమష్టి వర్గప్రయోజనాలు వాటి సంఘర్షణలు కూడా యిమిడివున్నవి. కౌలు, లాభం, వేతనాల పంపిణీ సిద్ధాంతం, వ్యక్తులుగాక సమాజంలో వర్గాలు వున్నాయని ముందే భావించింది.

శ్రమవిలువ సిద్ధాంతంవలన తాత్కాలికంగా అదనపు సిద్ధాంతం వచ్చింది. బ్రిటిష్ కమ్యూనిస్టు సిద్ధాంతకర్తలు దీనిని చాలా నిర్దుష్టంగా పెంపొందించారు. వారంతా సంప్రదాయ రాజకీయ ఆర్థికవేత్త అయిన రికార్డో అనుచరులు తాత్వికంగా వారు రాడికల్ వుదారవాదాన్ని కోరారు. ఐతే "బూర్జువా సిద్ధాంతం" మార్క్సుకంటే ముందే మార్క్సిస్ట్ ఆర్థిక మూల సూత్రాలన్నీ "బూర్జువా ఉదారవాద" సాంఘిక, తాత్త్విక పరిస్థితులలో విలసిల్లినవి. చరిత్ర తత్త్వాన్ని నిష్పక్షపాతంగా చూస్తే యిందులో చాలా ప్రాధాన్యత ఉన్నది. మార్క్సిస్ట్ చారిత్రకవాదం అంతా మార్క్సిస్టు సంపదే ఖండిస్తుంది.

ఛార్లస్‌హాల్ ఒక వైద్యుడు. వృత్తిరీత్యా పేదల జీవితాలతో అతడికి సన్నిహిత సంబంధం ఏర్పడింది. వర్గసంబంధమైన ఆర్థిక దృష్టితోగాక, నైతికవాదిగా వారి జీవిత సమస్యలను పరిశీలించాడు. అయినప్పటికీ అదనపు విలువ సిద్ధాంతాలను సమర్థిస్తూ నిర్ణయానికి వచ్చాడు. పదింట ఎనిమిది వంతులు ప్రజలు, వారి శ్రమ ఉత్పత్తిలో ఎనిమిదోవంతు మాత్రం పొందగలుగుతున్నారు. 8 రోజులలో ఒకరోజు, లేదా, రోజు అంతటిలో ఒకగంట పేదవారు తనకోసం, తన భార్యాబిడ్డలకోసం పనిచేస్తున్నాడన్నమాట. ఇతర రోజులలో లేదా రోజులోని యితర గంటలలో అతడు ఇతరులకోసం పనిచేస్తున్నాడు." (ఛార్లస్ హాల్, ది ఎఫెక్ట్స్ ఆఫ్ సివిలిజేషన్స్).

విలియం థాంసన్ను "శాస్త్రీయ సోషలిజానికి ప్రతిభావంతుడయిన పితామహుడు"గా చిత్రిస్తారు. (మెంజర్ : ది రైట్ టు ది హోల్ ప్రొడ్యూస్ ఆఫ్ లేబర్స్). రాజీ అంటూ ఎరుగని ప్రయోజనావాదిగా (బూర్జువా లిబరల్) ఉన్నప్పటికీ అతడిలా ప్రకటించాడు. "శ్రమలేకుంటే సంపదలేదు. సంపదకు శ్రమ ఒక్కటే మూలం." (విలియం థాంసన్ : ఎంక్వయిరీ ఇన్ టు ది ప్రిన్సిపుల్స్ ఆఫ్ ది డిస్ట్రిబ్యూషన్ ఆఫ్ వెల్త్).

మార్క్సిస్టు ఆర్థిక సిద్ధాంతాలను ముందే వూహించిన వారి జాబితా చాలావుంది. పైన పేర్కొన్న వారుగాక థామస్ హాడ్జ్‌స్కిన్, జాన్ గ్రే, జె.ఎఫ్. బ్రే ప్రత్యేకంగా పేర్కొనదగినవారు. గ్రే యిలా అన్నాడు. "ఆస్తికి ఏకైక ప్రాతిపదిక శ్రమ వాస్తవానికి ఆస్తి అంతా కూడగట్టిన శ్రమ మాత్రం." (జాన్ గ్రే, లెక్చర్స్ ఆన్ హ్యూమన్ హాపీనెస్).

హాడ్జ్‌స్కిన్ భావాలు యిలా ఉన్నవి. విజయం లభించేవరకూ, ఉత్పత్తిచేసే పరిశ్రమ ఒక్కటే ఫలవంతం అయ్యేవరకూ పనిలేకుండా గడపటం ఒక్కటే పేదరికంగా గుర్తించేందుకు; దున్నే వాడికే ఫలం దక్కాలని రుజువయ్యే వరకూ; బానిసత్వంపైగాక న్యాయ సూత్రాధారంగా ఆస్తిహక్కు నిర్ధారణ అయ్యేవరకూ, దున్నేభూమికంటే, మనిషికి ఎక్కువ గౌరవం లభించేవరకూ నడిచే యంత్రంకంటె మానవుడికి ఎక్కువ ఆదరణ–భూమిపై శాంతి ఉండదు, ఉండటానికి వీలులేదు. అలాగే మానవులమధ్య సత్సంబంధాలు నెలకొననంతవరకూ పరిస్థితి కుదుటపడదు.

మార్క్సుకు ముందున్న ఆంగ్లేయులలో, అనేక సందర్భాలలో, మార్క్సిస్టుగా చాలా ప్రభావం చూపాడు" అని బ్రే గురించి చెబుతారు (A Gray, Socialist Tradition).

మార్క్సిజానికి చెందిన వాస్తవ విలువలు పూర్తిగా గ్రహించాలంటే ఉదారవాద సంప్రదాయంలోనే దానిని చూడవలసింది. వ్యక్తి స్వేచ్ఛా సూత్రాన్ని ఉదారవాదం చాటింది. అయితే ఆచరణలో యీ సూత్రం లాంఛనప్రాయం గావడంతో ఎందుకూ

కాకుండాపోయింది. ఈ సూత్రాన్ని ఆచరణలో పెట్టడానికి సోషలిజం హామియిచ్చింది. ఆచరణలో సోషలిజం నిర్మాణాత్మక ఉదారవాదమని తిరోగమన విధానంకాదని మార్క్సిజాన్ని చారిత్రక ప్రాధాన్యతతో గమనించడమని బెర్న్‌స్టైన్ చెప్పాడు.

నైతిక సమస్యలోకూడా మార్క్సిస్ట్ ధోరణిచూస్తే బూర్జువా ప్రయోజనవాద సంప్రదాయం ఉన్నట్లు గమనించవచ్చు. బెంథాం భావపూరిత నైతిక సన్యసత్యం అనేది సంపన్నులకు సంబంధించినదని, తద్భిన్నమయిన సాంఘిక సాంస్కృతి వాతావరణంలో అది సరిపోదని చెప్పాడు. తాత్త్విక రాడికల్స్ నైతిక సమస్యలను వ్యక్తిగత దృక్పథంలో చూసారు. సమాజంకోసం వ్యక్తిత్యాగం చేయాలనే నీతినివారు ప్రస్తావించారు. ఒడంబడి ఉండటం నమ్రత అనే గుణాలు వారు అభినందించక సమాజ సౌభాగ్యం, సంపద అనేవి వ్యక్తి హక్కులకోసం అతడి ఆసక్తుల నిమిత్తం పెంపొందించుతారని వారు భావించారు. అంత ఆసక్తత తులనాత్మకంగా వుండటం వలన నైతికక్రమం వస్తుందన్నారు. వ్యక్తి వాదాన్ని బూర్జువాల నైరూప్య సిద్ధాంతంగా మార్క్స్ తృణీకరించటంవలన, నైతిక సమస్యలన్నింటికీ వ్యక్తిగతమైన పంథాను నిరాకరించాడు. ప్రయోజన వాదులు చెప్పే నైతిక సాపేక్షవాదం వివేచనాత్మకంగా పైకి ఎట్లా కనిపించినా మార్క్స్ సాపేక్షతావాదం పిడివాదం మాత్రమే హెగెల్ నైతిక ప్రత్యక్షవాదాన్ని భవిష్యత్తులో చూపడమే యిందులో కనిపిస్తుంది.

మార్క్సిజం ఒకవ్యక్తి సృష్టించిందికాదు, కార్ల్ మార్క్స్‌కు ముందు, మూడు, నాలుగు వందల సంవత్సరాల మానవాలోచన, మానవ కార్యకలాపాల మొత్తాన్ని తీసుకుంటే అందులోనుంచే మార్క్సిజం స్వీకరించిందని చెప్పవచ్చు. అప్పటినుంచి మానవ జ్ఞానం చెప్పుకోతగినంతగా అభివృద్ధి చెందింది. ఆధునిక పదార్థ విజ్ఞాన పరిశోధనలు ప్రారంభ దశలోనూ, భౌతిక తత్త్వం పునాదులను పెకలించి వేసినట్లు కనిపించవచ్చు. 19వ శతాబ్దంలో పదార్థ విజ్ఞాన ప్రతిపాదనలు కొన్ని దోషపూరితమని రుజువయింది. కొత్త వాస్తవాలను కనుగొన్నారు. ఆవిధంగా మార్క్స్ చెప్పిన పదార్థవాదాన్ని కూడా తిరగదోడాలి. జ్ఞానాభివృద్ధివలన పునరుద్ధరణ జరగడానికి మార్క్ భోదనలలో ఆటంక పరచేదేదీలేదు.

తత్త్వాన్ని విషపూరితంగావించిన ద్వంద వాదసమస్యను పరిష్కరించడంలో మార్క్సిస్టు తాత్త్విక ప్రాధాన్యత ఉందంటారు. విజ్ఞానం ప్రాచీనకాలంలో ఆరంభమైనప్పటినుండి ప్రపంచం ఎలా మొదలయింది అనే సమస్య విషయమై అతి భౌతిక వూహలు ఆధిపత్యం వహించి ద్వంద వాదాన్ని తెచ్చిపెట్టాయి. కాలానుగుణంగా మనసు – పదార్థం అని రెండుగా ప్రపంచం చీలిపోయింది. తుదకు డేకార్ట్‌విధానంవలన యీరెండింటికీ మధ్య ఉన్న అగాధానికి వారధి నిర్మించలేమని తత్త్వం ఒక నిర్ధారణకు

వచ్చింది. దీనిఫలితంగా యింద్రియాలద్వారా పొందిన జ్ఞానానికి బాహ్య సత్యం ఎంతవరకనేది సందేహాస్పదమయింది. భౌతిక ప్రపంచ వాస్తవాన్ని తృణీకరించడం సంభవించింది. జ్ఞానాన్ని అభిలషించడం వలన తత్త్వం ఆత్మహత్య చేసుకున్నది.

తాత్త్విక పితామహులు విజ్ఞానాన్ని ఆరంభించినవారు, ప్రాచీన సహజవాద ఆలోచనాపరులు ఆరంభించిన పదార్థసత్యం అనే సంప్రదాయం పూర్తిగా చనిపోలేదు. గసెండి, హాబ్స్ మొదలైన తత్త్వవేత్తలు తిరగదోడగా 18వ శతాబ్దంలో సాధారణ పదార్థవాదం ఉత్తేజం పొందింది. యాంత్రిక విశ్వవాదాన్ని డేకార్ట్ చెప్పిన నీతులను అంగీకరిస్తూ అతడి మానసిక, భౌతిక సమాంతరవాదాన్ని తృణీకరించింది. హెగెల్ వాదంతో ప్రక్కదారులు పట్టిన మార్క్స్ యాంత్రిక సహజవాద సంప్రదాయాన్ని కాదని, భావవాదపూరితమైన గతితార్కికంలో నెట్టుకపోయాడు.

అయినప్పటికీ 18వ శతాబ్దపు పదార్థవాదానికి చెందిన ఇంద్రియజ్ఞాన వాదంకంటే, మానసిక-భౌతిక సమాంతర వాదంకంటే మార్క్స్ పంథా ప్రయోజనకరమయినది. అనుభవంకంటె జ్ఞానమే ముందున్నది అనే కాంట్ వాదంకంటె మార్క్స్ వైజ్ఞానిక ధోరణి అవలంబించాడు. ముందువెనుకల సంబంధంలోగల యీ సమస్యనుచూచిన మార్క్స్ ఉనికితో చైతన్యత నిర్ధారిత మవుతుందన్నాడు. మనసు-పదార్థ ప్రపంచాలకు మధ్య వూహించుకున్న అగాధానికి ఇతడు వారధి నిర్మించాడు. మానవుడి ప్రత్యేక సృష్టినికాదని జీవశాస్త్రం కొత్త సిద్ధాంతాన్ని తెచ్చిన సందర్భంలో, మార్క్స్, ఏక సత్తావాదాన్ని రూపొందించాడు. విజ్ఞానం జీవితానికి మూలాన్ని కనుగొన్నది. జీవితం ఆవిర్భవించిన సంఘటనలుగా ఇటీవల తెలిసేటంతవరకు ఏ పరిస్థితులలో భౌతిక రసాయినిక స్థితిగతులలో ప్రాణం రావటానికి అవకాశం ఏర్పడిందీ స్పష్టంగా తెలియలేదు. చైతన్యత జీవితం సొత్తు. కనుక ఉనికివలన (పదార్థ ఉనికి) చైతన్యత నిర్ధారితం అవుతుందనడం సరైన వైజ్ఞానిక ప్రతిపాదనే.

ఒక్కడుగు ముందుకువస్తే మార్క్స్ తాత్త్విక ఆలోచనలలో ప్రాధాన్యత స్పష్టమవుతుంది. వైజ్ఞానికంగా, ప్రాణం వుంటేగాని మనసు వుండదు. పదార్థం లేకుండా స్వతంత్రించి మనసు ఉండటానికి వీలులేదు - ఒకే ప్రపంచంలో రెండు దృక్పథాలుగా ఉన్న ప్రాణం-మనసు అనేది ఒకదానికంటే ఒకటి ముందున్నవి. అతి భౌతిక విషయంగా తొలి వాస్తవం. దీని ఫలితంగా పదార్థం జీవితాన్ని సృష్టించగలదు. చైతన్యత, గ్రహణశక్తి, మనసు, భావాలు అన్నీ జీవి పరిణామంలో వచ్చినవి. అనుభవం అంతా వాస్తవమే. అలౌకిక వాస్తవమనేది వూహ మాత్రమే. మనసు పదార్థం, భౌతిక ప్రపంచం, ఆలోచనా ప్రపంచం, భావలోకం అన్నీ సమానంగా వస్తాయి. వీటి

సంబంధాలను గురించి వాస్తవ వైజ్ఞానిక అవగాహన, తత్వానికి ఉండాలి. ఈ అవగాహనకు దోహదం చేసిన మార్క్సుకు తత్త్వ చరిత్రలో, ఘనమైన స్థానం లభించింది.

ప్రత్యామ్నాయంగా పదార్థరహిత ఆత్మలో మనసుకుమూలాన్ని చూడటం మరో దృక్పథం. అటువంటి మనసుకు, దానిలోకం వేరేవున్నది అన్నారు. పదార్థ ప్రపంచంతో భిన్నమైన లోకంగా దీన్ని ప్రకటించారు. కేవల ద్వందవాదాన్ని వూహించిన తత్త్వం విజ్ఞానానికి, వివేచనావాదానికి తిలోదకాలు యిచ్చింది. పదార్థరహిత ఆత్మదోషంలేని భావం విశ్వాసానికి సంబంధించినవి. తార్కికంగా రాబట్టిన ఉనికి (సత్) విషయాలు కావు. వాస్తవానుభవాలు అంతకంటేకావు.

జ్ఞానాన్ని తత్త్వం చిరకాలంగా మతం, మతజ్ఞాన ఆధిపత్యంనుంచి విమోచన పొందడానికి పోరాటం జరుపుతున్నది. దీనిఫలితంగా సహజవాదానికి భిన్నంగా 18 వ శతాబ్దంలో పదార్థ సహజవాదం వచ్చింది. అప్పటికే బాల్యావస్థలో ఉన్న జీవశాస్త్రం, మానవుడికి జంతువుకు మధ్య దేకార్ట్ చూపే విచక్షణ నిరంకుశమైనదంటూ ద్వందవాదాన్ని నిరాకరిస్తూ యాంత్రిక భావాన్ని సర్వసాధారణచేసింది. లాక్ యింద్రియ జ్ఞానవాదాన్ని కాండియాక్ ఇంకా గట్టిపరచగా, మూఢనమ్మకాలు. పవిత్రమైన ద్వేషభావాలు యిత్యాది సంప్రదాయాలనుంచి మానవుడు వివేచన పొందే ఉద్యమాన్ని ముందుకు తీసుకుపోవడం సాధ్యం అయింది. విప్లవానంతరం మిడిమిడిజ్ఞానంతో వచ్చిన ఉద్వేగ ప్రతిక్రియ హెగెల్ జోక్యంతో పై ఉద్యమంలో నిరంతరకు అడ్డుకట్టలు పడినవి.

మార్క్సు తన యవ్వనదశలో హెగెల్‌వాదంతో పరిచయం వలన ప్రాచీన మానవ భావసంపదను తగినంతగా తెలుసుకోలేకపోయాడు. హెగెల్ గతితార్కిక ప్రభావంతో, 18వ శతాబ్దపు యాంత్రిక పదార్థవాదాన్ని మార్క్సు నిరాకరించాడు. అదే సమయంలో మానవ సంప్రదాయానికి చెందిన, సాంఘికన్యాయాన్ని కూడా స్వప్నవాదం అంటూ వెక్కిరించి తనకు సంబంధం లేనట్లుగా చూచాడు. ఈ విధంగా మార్క్సు కొత్త తత్వాన్ని ప్రతిపాదించడం, విప్లవానికి ప్రవక్త కావడంలో ఏ ఆధారం లేకుండా ప్రారంభించినట్లు నమ్మినా, మార్క్సుకు మేధావుల పరంపరానుగత సంపద ఎంతో ఆధారంగా వున్నది. డెమోక్రటస్, ఎపిక్యూరస్, లుక్రిటస్, బ్రూనో, గసెండి, హాబ్స్, హాల్‌బాహ్, డిడరో, ఫ్యూయర్‌బాహ్, ఇత్యాదులు, మార్క్సు తత్వానికి సంపదగా తోడ్పడినవారే. అందువలన తన పూర్వీకులకంటె తత్వచరిత్రలో మార్క్సు ప్రాధాన్యతలోగాని, గౌరవంలోగాని ఏమాత్రం తీసిపోలేదు. మానవ స్వేచ్ఛకు మార్క్సు సహకారం చాలా గొప్పది. ప్రాచీన తాత్విక సమస్యలపై విజ్ఞాన కాంతిపుంజాలు ప్రసరిస్తుండగా, అటువంటి కాలంలో ఉండటంవలన మార్క్సుకు ఎంతో సదవకాశం లభించింది.

అనుభవ ప్రపంచానికి వివేచనాత్మక వివరణ ఇవ్వాలంటే మార్మికమైన ఒడిదుడుకులనుంచి తప్పుకోవాలంటే ఏకసత్తా వాదంగానే తత్వం ఉండాలి. ఏకసత్తావాద తత్వంలో మార్పుజరిగే ప్రయత్నంబట్టి బహుళత్వానికి చోటువుంటుంది. పదార్థ విజ్ఞానంలో యదార్థానికి సంబంధించిన భావాలు ఎలా మారినప్పటికీ పదార్థవాదతత్వం మాత్రమే ఏకసత్తావాదం కాగలదు. ఉనికివలన చైతన్యత నిర్ధారితమైనదని ఎందరోచేసిన ప్రతిపాదన పదార్థ తత్వానికి సరైన వైజ్ఞానిక పునాదులు నిర్మించింది. అయితే మార్పుచేసిన సామాజికాలోచనలు ఉత్తరోత్తరా ఈ ధోరణులు పయనించిన దారిమళ్ళాయి. మార్క్సిజం తన తాత్విక సంప్రదాయాలను సరిగా పాటించలేదు. సామాజిక సూత్రంలో మార్క్సిజం పదార్థవాదాన్ని నీచంగాచూసి, మౌలికమైన నైతికవిలువలు కాలప్రదేశాలను అధిగమిస్తాయనే వాస్తవాన్ని కాదన్నారు. ఉత్పత్తి శక్తులను మనుషులతో సంబంధం లేకుండా చూచి చరిత్రలో సృష్టిప్రయోగవాదాన్ని ప్రవేశపెట్టి మానవుడే తన విధికి నిర్ణీత అనే విశ్వాసాన్ని మార్క్సిజం తానే ఖండించింది. మార్క్స్ చెప్పే చారిత్రకవాదం ఆర్థిక నియతివాదాన్ని ప్రవేశపెట్టి మానవ స్వేచ్ఛకు అవకాశం లేకుండా చేసింది. మానవుడు వ్యక్తిగా ఎప్పుడూ స్వేచ్ఛాపరుడు కాలేని స్థితిని తెచ్చి పెట్టింది. సమకాలీన సామాజిక తత్వమంతా మార్క్స్ సిద్ధాంతంలోని దోషాల వలన చాలావరకు ప్రభావితమయింది. తన తత్వంనుంచి తార్కికంగా మార్క్స్ సామాజికవాదం అనుసరించలేదు.

ద్వందవాదానికి వ్యతిరేకంగా, చిరకాలంగా, జరుగుతున్న తాత్విక పోరాటాలవలన ఎంతో సాధించటం జరిగింది. తాత్వికంగా మానవతావాదులు ఉదార సంప్రదాయాలన్నింటినీ మార్క్సిజం సంక్రమింప జేసుకున్నది. పరస్పర విరుద్ధంగా కనిపించే యాంత్రిక సహజవాదం, వుద్వేగ మానవతావాదం, అనే రెండు ఆలోచనా స్రవంతులు ఫ్యూయర్ బాహ్‌లో సమన్వయం పొందాయి. కనుకనే అతడు మార్క్స్‌తో పోలిస్తే హెగెల్ ప్రభావాన్ని పూర్తిగా వదిలేయగలిగాడు. అయినప్పటికీ, ఫ్యూయర్‌బాహ్ పదార్థవాద మానవత్వంలో, మానవుడంటే, నైరూప్యతలోనూ, మార్మిక ముసుగులోనూ అనిర్వచనీయంగానూ స్వీకరించడం గమనించవచ్చు. సాంఘిక న్యాయంకోసం ఆక్రందించిన ప్రవక్త మార్క్స్, హెగెల్‌వాది అనడంకంటె మానవతావాదిగానే ఎక్కువగా కనిపిస్తాడు. కాని ఫ్యూయర్‌బాహ్ మానవతావాదంలోని బలహీనతలు మార్క్స్ నిశిత మనస్తత్వంలో నుంచి తప్పించుకోలేకపోయాయి. మానవుడి ఉనికి మార్పును వివరించాల్సిన అవసరాన్ని అతడు గుర్తించాడు. తన విధిని తానే నిర్ణయించుకునే సార్వభౌముడుగా మానవుడు మానవుడుగా వుంటాడని, ప్రాపంచికానుభవంతో రుజువు పరచాలంటే, ఇది అవసరమయినది. చరిత్రను విశ్లేషణాత్మకంగా అధ్యయనం చేయాలని

మార్క్సు తలపెట్టాడు. జీవితానికి మానవతా దృక్పథంతో కూడిన వివేచనాయుత ప్రాతిపదికను అన్వేషించాడు. అదే సమయంలో భౌతిక ఉనికికి జరిగే పోరాటమంతా మానవ పిపాస అని మానవశాస్త్రం కనుగొన్నది. ఆదిమ మానవుడి జీవనభృతి ప్రయత్నంలో ప్రయోగించిన తెలివితేటలు మనుగడకై సాగించిన జీవపోరాటం గమనించిన మార్క్సు, సమాజానికి మూలం, ఆ తరువాత జరిగిన మానవాభివృద్ధి అంతా ఆర్థికపరమైన ఉద్దేశాలతోనే వున్నదన్నాడు. భౌతిక, పిపాసను, ఆర్థికపరమైన ఉద్దేశంగా భావించడంలో పొరపాటుపడిన మార్క్సు చారిత్రకవాదం దారితప్పింది.

మానవుడు ఆవిర్భవించిన అనంతరం కొంతకాలం వరకూ ఏ ఆర్థిక ఉద్దేశ్యం లేకుండానే, తనను కాపాడుకోవాలనే జీవపిపాసతో ఉన్నాడు. మనుగడకై ఆదిమ పరికరాలను సృష్టించుకోవడం కేవలం భౌతిక అవసరం మాత్రమే. మానవశాస్త్రంలో జరిగిన పరిశోధనలవలన మానవుడు సాంఘిక పరిణామ తొలిదశలో సాగించిన మనుగడ పోరాటంలో ఎటువంటి ఆర్థిక ఉద్దేశాలులేవని స్పష్టపడింది. కాగా పరిశోధన వలన భౌతిక మనుగడ పోరాటం మానసికాభివృద్ధికి ప్రేరణ కల్పించిందని తెలిసింది. చైతన్యత, మనసుకు సంబంధించిన ప్రాథమిక స్థాయి అంతా ఆదిమానవుడి జీవసంపదే. ఆ విధంగా మానవుడి ఉనికి మార్పుకు సంబంధించిన భౌతిక స్థితిగతుల వలన పరిణామం నిర్ధారణ అయింది. ఈ వాస్తవాలనుంచి తార్కికంగా చూస్తే చారిత్రకంగా ఆర్థిక నియతివాదం సమాజం పుట్టినప్పటినుంచి ఉన్నదని రుజువుకాదు. పైగా, పదార్థవాదంనుంచి ఆర్థిక నియతివాదం రాలేదుకూడా. ఇంకా చెప్పాలంటే మానవవాదానికి ఇది వ్యతిరేకమైనది. ఎందుకంటే వ్యక్తితో సంబంధంలేని శక్తులేవీ పనిచేసి మానవుడిని తొలగిపోయేటట్లు చేస్తాయని ఈ వాదం చెపుతుంది. ఆర్థికంగా నిర్ధారణ అయిన సమాజంలో మానవుడు ఉత్పత్తిదారుడుకాడు. ఉత్పత్తి సాధన మాత్రమే ఫ్యూయర్‌బాహ్ చెప్పిన పదార్థవాద మానవ తత్వాన్ని ఒక వివేచనాత్మక ప్రాతిపదికపై ఉంచాలని మార్క్సు చేసిన ప్రయత్నం అంతా సరిగ్గా విరుద్ధ ఫలితాలు యిచ్చింది. ఫ్యూయర్‌బాహ్ చెప్పిన మార్మిక నైరూప్యతస్థానే ఆర్థికంగా దానంతటదే నడిచే పద్ధతిని మార్క్సు ప్రవేశపెట్టాడు. ఈ నైరూప్యభావాన్ని మానవుడి నుంచి సమాజానికి మార్క్సు అంటగట్టి, దానికి సమష్టిత్వం కల్పించాడు.

పదార్థవాద తత్వంతో పొందికగా ఉండే సామాజిక శాస్త్రాన్ని చూపలేకపోవడం మార్క్సు వైఫల్యమే, సాంఘిక న్యాయంకోసం ప్రయత్నించిన మార్క్సు యీ వైఫల్యం పొందాడు. తనకంటే ముందున్న మానవవాదులనుంచి అతడికి ఈ ధోరణి సంక్రమించింది. వారిని మాత్రం స్వప్న భావవాదులని మార్క్సు ఈసడించాడు. ఏమైనా అతడి అనుచరులు స్తుతిస్తున్నట్లు, అతడు కూడా నమ్మినట్లు మార్క్సు చరిత్రకు

సంబంధించిన నిర్జీవ గణితబద్ధమైన ప్రవక్త ఏమీకాడు. విప్లవం అంటే అతడికి ఆవేదనతో కూడిన విశ్వాసం వున్నది. అతడు ఉద్వేగవాది. ఆవిధంగా మానవవాది కూడా, విప్లవభావం ఉద్వేగభావమే, తాను నివసిస్తున్న ప్రపంచాన్ని తిరిగి మార్చడంలోనే మానవుడి శక్తిలో నమ్మకం ఉండటమే ఇందుకు కారణం. ప్రయోజనాత్మకమయిన ప్రయత్నాన్ని వదిలేస్తే సాంఘికాభివృద్ధి యాంత్రిక పరిణామం అవుతుంది. అందులో హఠాత్తుగా జరిగే మార్పులకు అవకాశం ఉండదు. తరచు అతి వేగంగా సంభవించే ఉద్రిక్తతలకు చోటుండదు. విప్లవ ప్రవక్తగా మార్క్స్ ఉద్వేగవాది. మానవుడి సృజనశక్తిలో అతడు, తనవిశ్వాసాన్ని ప్రకటించాడు. విప్లవాల వలన సాంఘిక పరిణామక్రమం వేగాన్ని పుంజుకుంటుంది. మార్క్స్ మానవవాది కావటంతో అతడి విప్లవ సిద్ధాంత శక్తిలో నైతిక ధోరణి ఉన్నది. నిష్పాక్షికతను విడనాడని మార్క్స్ విమర్శకులు కూడా, సత్యా న్వేషణలో మేధస్సుకు సంబంధించిన చిత్తశుద్ధిలో మార్క్స్‌కు గౌరవాన్ని యిస్తారు. ఉన్నతస్థాయి నైతిక జిజ్ఞాస లేకుండా, అన్యాయాన్ని గాఢంగా నిరశించకుండా, మార్క్స్ అణగారి పోయిన, దోపిడీకి గురయిన వారిస్థితిని మెరుగు పరచాలని ఏకాకిగా పోరాటం చేపట్టేవాడుకాదు.

మోసానికి, కల్లిబొల్లి కబుర్లకు వ్యతిరేకంగా పోరాడిన మార్క్స్ ప్రాచీన ప్రవక్తల సంప్రదాయంలో ఒక గొప్ప నైతిక శక్తివంతుడు. పెట్టుబడిదారీ విధానంలో సారాంశాన్ని నిర్దాక్షిణ్యంగా బయటపెట్టిన మార్క్స్ నైతికంగా దానిని ఖండించాడు. విశ్లేషించిచూస్తే సామాజిక నీతిశాస్త్ర సిద్ధాంతంగా, "కాపిటల్" గ్రంథం కనిపిస్తుంది. అత్యధిక శ్రమజీవుల కష్టాలకు వ్యతిరేకంగా అతడు ఎంతో శక్తివంతంగా తన అభ్యంతరాలను తెలిపాడు. మార్క్స్ కావాలని తన ఆర్థిక సిద్ధాంతాల ఆధారంగా నైతిక విజ్ఞప్తులను దూరంగా పెట్టాడు. వ్యవస్థాపితమైన సాంఘిక అసమానత్వాలను పవిత్రమైనవంటూ సమర్థించే మోసకారులంటే మార్క్స్‌కు వుండే ద్వేషమే ఇందుకు కారణం. అయినప్పటికీ నీతివేత్తగా అతడు చరిత్రపై ప్రభావాన్ని చూపెట్టాడు. అతడి సనాతన అనుచరులు మాత్రమే ఈ ప్రభావానికి గురికాలేదు.

"స్వేచ్ఛారాజ్యం" అని సోషలిజాన్ని చిత్రించాడు మార్క్స్. అందులో మానవుడు తన సామాజిక పరిసరాలకు యజమాని. అటువంటి మానవసిద్ధాంతాన్ని ప్రబోధించినవాడు. కార్మిక సమష్టి దేవతను పూజించాడు. మార్క్స్ ననుసరించి సోషలిజంలో మానవుడి వివేచన అంతవరకూ మానవుడి జీవితంపై నిరంకుశంగా ప్రభావితంచేస్తున్న వివేచనా రాహిత్యను అధిగమిస్తుంది. ఆర్థిక నియతివాద దోషంనుంచి బయటపడితే మార్క్సిజంలో ఉన్న మానవవాదం స్వేచ్ఛాభావన, నైతికత యీకాలంలో కొత్తవిశ్వాసాన్ని చిగురింపజేస్తుంది. ఇంతవరకు కూడగట్టిన మానవ సంపదలో ఇదొక

భాగం. భవిష్యత్తు నిర్మాతలు దీనికి వారసులు వారు ఏ ఒక్క వర్గానికి చెందినవారుకారు.

జీవిత మూలాన్ని గురించి సరైన జ్ఞానం కానందున, మానవవాదాన్ని వివేచనాత్మక పునాదులు నిలబెట్టడం సాధ్యంకాలేదు. 19వ శతాబ్ద ప్రభుత్వ కాలంనుంచి విజ్ఞానంలో జరిగిన పురోభివృద్ధివలన, యాంత్రిక విశ్వవాదంలోను, పదార్థ తత్త్వంలోనూ కొన్ని మార్పులు తప్పనిసరి అయినవి. కానీ యీ విజ్ఞాన వివేచనాత్మక మానవవాదాన్ని ఘనవిజయం పొందేటట్లు చేసింది. నిర్జీవ పదార్థానికి ప్రాణానికి సంబంధం వున్నది. ఇది పదార్థంలో ఒకదశలో సంభవం. ఇందువలన మానవుడికి విశ్వానికి జీవపరిణామం ద్వారా సంబంధం ఏర్పడుతుంది. మానవుడికి అత్యంత ప్రాధాన్యత కలిగిందంటే ఇంతవరకూ జరిగిన భౌతిక క్రమంలో అతడు అత్యున్నతస్థాయికి చేరువవడం కారణం. మానవవాదం మార్మికములోది కాదు. జీవితాలకు సంబంధించిన కవిత్వ దృక్పథమూ కాదు. విజ్ఞానం ఆధారంగా మానవవాదాన్ని పదార్థతత్త్వంతో కలపవచ్చు. ఈ పదార్థతత్త్వం సామాజిక శాస్త్రానికి పునాది అవుతుంది. నియతివాదాన్ని తృణీకరించకుండానే మానవుడి సృజనశక్తికి వ్యక్తి స్వేచ్ఛకు సమాజశాస్త్రంలో లోటు ఉంటుంది. వివేచన సంకల్పంతో చేతులు కలుపుతుంది. సహకారం, నిర్మాణ వ్యవస్థ అనేది స్వేచ్ఛాపిపాసను ఆపనవసరంలేదని స్పష్టపడుతున్నది. మానవవాదంతో పొందికగా ఉండే పదార్థతత్త్వం నీతిశాస్త్రాన్ని కూడా చూపుతుంది. ఇందలి విలువల ప్రమాణాలకు మానవుడిలోని అంతర్గత వివేచనే ఆధారం.

మార్క్సిజంలో ప్రత్యక్షలక్షణాలన్నీ, దోషాలను తొలగించుకుంటే, విజ్ఞానాధారంగా స్పష్టపడి సమగ్రమైనతత్త్వంలో పొందికగా ఉంటుంది. దీనినే సమూల లేక సమగ్ర మానవవాదం అనవచ్చు. ఈ తత్త్వంలో యాంత్రిక విశ్వవాదం, హేతుబద్ధమైన నీతిశాస్త్రం కలిసిపోతాయి. దీనివలన మానవుడి స్వేచ్ఛా పిపాస, సత్యాన్వేషణ సంతృప్తిగా సాగుతుంది. ఈ ఆదర్శాలకు అనుగుణంగా భవిష్యత్తులో ఆచరణకు ఉపక్రమించడానికి మానవవాదం మార్గదర్శకం అవుతుంది.

✦ ✦ ✦

# వివేచనారహితవాదపు కవలలు

19వ శతాబ్దపు తొలి దశాబ్దంలో విప్లవానంతర ఉద్వేగ ఉద్యమంవలన వివేచనారహిత వాదం కట్టలు త్రెంచుకుని ప్రవహించింది. కానీ ప్రకృతి విజ్ఞాన శాస్త్రాల మహోన్నత పురోగమనంతో ఆ ప్రవాహం ఆగిపోయింది. తత్ఫలితంగా 18వ శతాబ్దంలోని మతరహిత వివేచనావాదం మళ్ళీ నిలదొక్కుకుని ఐరోపా మేధావి జీవితానికి, తాత్త్వికంగానూ సామాజికంగానూ మార్గదర్శి అయింది. తత్త్వవేత్తగా సామాజిక శాస్త్రజ్ఞుడుగా, హెగెల్ వివేచనా వాదానికి, ఇంగ్లీషు ఉదారవాదానికి చెందినవాడు మార్క్సు.

అయితే సాంఘిక న్యాయం త్వరగా సాధించాలనే మహోన్నత మానవతా ఆదర్శంవలన, ఉండబట్టలేక, దగ్గరదారిగా, హింసాయుత విప్లవాన్ని సూచించాడు.

వివేచన–ఉద్వేగ వాదాల సమన్వయంలో మార్క్సిజం ప్రారంభమైంది. సామాజిక పరిణామ నియమాలు, మానవేచ్ఛలో స్వేచ్ఛను, ప్రయత్నాన్ని ఆటంకపరచవనే తాత్త్విక ప్రాతిపదికతో ప్రారంభించిన మార్క్సిజం, అలాగే కొనసాగించినట్లయితే మితిమీరిన ఉద్వేగవాదం లేకుండానే, విప్లవ భావాన్ని కాపాడటం సాధ్యమయ్యేది. అల్పసంఖ్యాకులు హింసాయుత ధోరణితో స్వైరవిహారం చేయగలిగేవారు కాదు. జర్మనీ తాత్త్విక రాడికల్స్‌గా పేరొందిన ఫ్యూయర్‌బాహ్, అతని అనుచరులు ప్రారంభించిన వైజ్ఞానిక మానవ ఉద్యమం పెంపొంది ఉండేది. దగ్గర దారిలో పోవాలనే ఆకర్షణవలన ఫ్రెంచి విప్లవాన్ని అనుసరించిన మార్క్సు, రానున్న విప్లవానికి ప్రవక్తగా మారి కార్మికుడికి అధికారం హస్తగతం చేయాలని భావించారు. వివేచనావాద రాచమార్గాన్ని వదిలి పునర్వికాస కాలంనుంచి సామాజిక భావవిమోచనకు పోరాడి మానవతా ఆలోచనను నిర్మించిన వారి ధోరణికి తిలోదకాలిచ్చి, మార్క్సు ఎటో వెళ్ళిపోయాడు. విప్లవోద్యమాన్ని, స్వయం విఘాత సిద్ధాంతంతో తల పెట్టినందువలన, గుడ్డి దారిలో పడిపోయాడు. మార్క్సిస్టు నవ్య ఉద్వేగవాదం మానవుడిని మూకలో కలిపివేసింది. మూకకు మార్మికశక్తు లంటగట్టింది.

అయినప్పటికీ మొదటి ప్రపంచయుద్ధానికి పూర్వంవరకూ మార్క్సిజాన్ని ఆమోదించిన సోషలిస్ట్ ఉద్యమం, మిడిమిడి ఉద్వేగవాదానికి చెందిన విప్లవానికి బదులు, వివేచనాధోరణి ఉదారవాద సంప్రదాయానికి అత్యంత ప్రాధాన్యతనిచ్చింది.

20వ శతాబ్దం ఆరంభంనుంచీ విప్లవ ఉద్వేగధోరణి ప్రబలడం, రష్యాలో విప్లవం విజయం పొందడంతో, మార్క్సిస్ట్ సిద్ధాంతం అనుభవపూర్వకంగా సరైనదని భావించారు. వాస్తవానికి అదేమీకాదు. ఎందుకంటే, ప్రవక్త ఆశించిన విప్లవ పరిస్థితులులేని దేశంలో ఈ విప్లవం జరిగిందిగనుక. అయినప్పటికీ మార్క్సిస్ట్ సిద్ధాంతాన్ని సమర్థించేందుకు అనుగుణంగా భాష్యం చెబుతున్నారు. చారిత్రకంగా నిర్ధారితమైగాక, కొద్దిమంది అధికారంలో ఉన్న అల్పసంఖ్యాకులు, కావాలని హింసాయుతంగా సాధించినదాన్ని సమర్థిస్తున్నారు. మార్క్సిజంలో పరస్పర విరుద్ధత్వాలు ఇలాంటి వ్యాఖ్యానాలకు తావిస్తుండగా, వివేచనా రహితవాదం ఒక స్థాయికి చేరుకున్నది. కమ్యూనిస్టులకు మార్క్సిజం ఒక పిడివాదంగానూ, గుడ్డిగా నమ్మవలసిందిగానూ అయిపోయింది. ఈ కొత్త విశ్వాసాన్ని దోషబద్ధమయిన నీతివాదంతో బలపరచుకోవడానికి ప్రయత్నిస్తున్నారు. కమ్యూనిజం. వివేచనారహిత ఆచారమై మిడిమిడి ఉద్వేగవాదాన్ని ఆకర్షించింది. ఇట్లా ఆకర్షితులైనవారంతా పుట్టుకతోనే కార్మికులు కారు.

చరిత్రతో నిమిత్తంలేకుండా, రష్యాలో విజయం సాధించిన ఒక సంవత్సరం తరువాత, జర్మనీలో విప్లవం విఫలమైంది. మార్క్స గనుక తప్పుడు ప్రవక్తగాకుంటే విప్లవం అక్కడ విజయవంతం కావలసింది. ఓటమి అనంతరం, కమ్యూనిస్టులు తమ తృప్తికోసం ఒకవాదం లేవనెత్తారు. పతనమవుతున్న పెట్టుబడిదారీ విధానం, మరొక సామ్రాజ్యవాద యుద్ధానికి దారి తీస్తున్నదనీ, దీనివలన విప్లవ విజయం తుదకు తథ్యమనీ అన్నారు. ఉద్రేకపూరితంగా ఉన్న చాలామంది ప్రజలు, ఉదాహరణకు కళాకారులు, కమ్యూనిస్టుపార్టీలో చేరడంతో కొత్త విశ్వాసానికి తగిన పారితోషికం లభించింది. లోగడ వివేచనాయుత సంప్రదాయానికి చెందిన మార్క్సిజం-శాస్త్రజ్ఞులనూ, పండితులనూ, మేధావులనూ ఆకర్షించి, కార్మికుడి విమోచనకు కృషి చేయడంలో తోడ్పడింది. నూతన సాంఘిక వ్యవస్థలోని కమ్యూనిస్టు విశ్వాసం హింసాయుత విప్లవంతోనే స్థాపించాలి. ఇదే తప్పుడు ఉద్వేగవాదం. సంప్రదాయబద్ధంగా వస్తున్న ఉద్వేగవాదం వ్యక్తిస్వేచ్ఛను తృణీకరించి, మూకశక్తిలో మార్మికమై ఉన్న విశ్వాసాన్ని పెంపొందించింది. సమష్టి ఉద్వేగవాదం అనేది పరస్పర విరుద్ధ విషయం. సరైన ఉద్వేగవాదంలో అంతా వ్యక్తిపరంగా ఉంటుంది. అనంత శక్తులతో జయించడం సృష్టించడం అతడి చేతిలోపని. విప్లవ ప్రవక్తగా మార్క్స తన వివేచనా-యుత మార్గాన్ని తప్పాడు. అతడి ఉద్వేగధోరణికాస్తా ఆర్థిక నియతివాద విశ్వాసం వలన దేనికీ పనికిరాకుండా పోయింది. వివేచన-ఉద్వేగవాదం పరస్పరం తృణీకరించుకోగా, మార్క్సిజం సమష్టి వివేచనారహితంగా మారిపోయింది. తొలుతగల ఉన్నత ఆదర్శాలు, సదుద్దేశాలు అన్నీ అలాగ ఉండగా, మార్క్సిజంలోని దోషాల వలన, ఆచరణలో

కమ్యూనిజం చెడు మార్గాలను అనుసరించడం జరిగింది.

కమ్యూనిజానికి ప్రతిక్రియగా జాతీయ సోషలిజం, లేదా ఫాసిజం, అరమరికలు లేని వివేచనారహిత ఆచారంగా తలెత్తిందంటారు. కానీ అది వాస్తవంకాదు. ఈ రెండింటికి పునాదులు అంతకుముందే ఉండిన భావోద్యమాలలో చూడవచ్చు.

మధ్యయుగాలు అంతమయ్యేవరకు స్వేచ్ఛకొరకు మానవుడి కృషి మానవుడికి దేవుడితోగల సంబంధంతో ముడివడి ఉంది. 16వ శతాబ్దంలో పునర్వికాస కాలంలో పాత సమస్యలకు బదులుగా, మానవుడికి–సమాజానికి, వ్యక్తికి–రాజ్యానికిగల సంబంధం సమస్యగా తయారయింది. ఇది ప్రాచీనమైనట్టి సమస్య. ప్లేటోవంటి మేధావిని వేధించిన సమస్య. ప్రాచీన గ్రీసులోని స్వతంత్ర నగరాలకంటే ఆధునిక ప్రపంచంలో పెద్దజనాభావలన క్లిష్టమయిన సాంఘిక ఆర్థిక నిర్మాణాలవలన ఈ సమస్య చాలా కలవరపెడుతున్నది. చివరకు అనాదిగా వస్తున్న ఈ సమస్యకు సామాజిక ఒడంబడిక అనే భావన పరిష్కార మార్గంగా కనిపించింది.

సామాజిక ఒడంబడికకు సంబంధించిన ఉదారవాదంలో 'వ్యక్తిసార్వభౌమత్వం' అనేది మౌలిక సమస్య అయింది. అయితే ప్రాతినిధ్య ప్రభుత్వంలోని పార్లమెంటరీ ప్రజాస్వామ్యం, పెట్టుబడిదారీ వ్యవస్థతో కూడిన ఆర్థికవిధానం, వ్యక్తిసార్వభౌమత్వాన్ని రాజ్యాంగబద్ధమయిన కట్టుకథ గావించాయి. పౌరులలో అధిక సంఖ్యాకులు, ఆర్థికంగా లొంగిపోయి ఉండటంవలన చట్టంలో అందరూ సమానులనే రాజ్యాంగపుహక్కు అపహాస్యపాలయింది. రాజకీయ ప్రజాస్వామ్యం ఇదొక వృథా లాంచనమయింది. సామాజిక, రాజకీయ సిద్ధాంతాలతో ఆచరణలో వస్తున్న విరుద్ధాలను సమన్వయం చేయలేక, ఉదారవాదం క్రమేణా, సామాజిక ఒడంబడిక సిద్ధాంతాన్ని విడనాడింది. తరువాత వ్యక్తిని రాజ్యానికి లొంగుబాటు గావించిన నైతిక సిద్ధాంతాలు, జీవశక్తి అనే అభిప్రాయానికి దారిచూపాయి. రాజ్యమనేది కృత్రిమసృష్టి కాదని సహజమైన జీవ విధానమని భావించడంవలన, వ్యక్తులకంటే రాజ్యం ఎక్కువని వ్యక్తులు వారంతటవారు ఉండలేరని, కనుక రాజ్యానికి లొంగి ఉండాలనే అభిప్రాయం వచ్చింది. తార్కికంగా సమష్టివాదం, తలెత్తడానికి, వ్యవస్థకూ స్వేచ్ఛకూ సమన్వయం చేకూర్చడంలో ఉదారవాదం విఫలం కావడమే ప్రధాన కారణంగా కనిపిస్తుంది. (సోషల్ డెమోక్రటిక్ సిద్ధాంతకర్త బోల్షివిక్ రాజ్యాన్ని ఖండిస్తూ, భావరంగంలో మానవ స్వేచ్ఛను చాలా అదుపులో పెట్టారన్నారు. అయినా మార్క్సుకు విశ్వాసపాత్రుడైన శిష్యుడుగా, వ్యక్తి సంధికాలంలో ఉండేవాడనీ, సమాజం నిరంతరంగా తప్పనిసరిగా ఉంటుందని, వ్యక్తి యాదృచ్ఛికమనీ అన్నాడు కార్ల్ రెన్నర్. The institution of private Law and Social Functions).

ఉదారవాద సంక్షేమ రాజ్యంలో, వ్యక్తి సంపాదించే శక్తికలవాడుగా భావించడం జరిగింది. (బెవరిడ్జ్). మార్క్సిస్టు ధోరణిగల ఈ భావన బిస్మార్క్‌కు కూడా నచ్చింది.

రాజ్యానికి సంబంధించిన జీవభావన ఫలితంగా వ్యక్తివాదానికి గ్రహణం పట్టడం, కొత్తగా సమష్టివాద ఆచారం రావడం, వీటన్నింటికీ 19వ శతాబ్దపు చివరిలో మానవశాస్త్రం, సాంఘిక మనోవిజ్ఞానంలో ఆధారాలు కనిపించడం జరిగింది. అంతకుముందు డార్విన్ పేర్కొన్న మనుగడ పోరాటం, అర్హుడే బ్రతకగలడని చెప్పడం, పెట్టుబడిదారీ ఆర్థిక వ్యవస్థకు అనుకూలంగా వ్యాఖ్యానించారు. అదికూడా వ్యక్తి సార్వభౌమత్వాన్ని తగ్గించివేసి నిస్సహాయుడైన సాంఘిక జీవిగా పరిగణించింది. బలంగలవాడిదే రాజ్యమనే సూత్రం సరైనదని చెప్పడానికి వ్యక్తివాద సిద్ధాంతాన్ని వాడుకున్నారు. సాంఘిక పరిస్థితులను అనుసరించి చూస్తే వ్యక్తులు ఎవరికివారు తమ అభివృద్ధికి దోహదం చేసుకోలేరు గనుక, వారందరినీ రాజ్యానికి లొంగి ఉండేటట్లు చేసారు. అదృష్టవంతులయిన కొందరు తమకున్న అధికారాలు, అవకాశాలు ప్రకృతి ప్రసాదించినట్లు చెప్పారు. విజ్ఞానాన్ని ఇలా వక్రీకరించినందువలన కొద్దిమంది ఉన్నతులు ఉంటారనే ప్రజాస్వామ్య వ్యతిరేక సిద్ధాంతం, అతీత మానవుడి నియంతృత్వం అనే సూత్రాలు వెలుగులోకి వచ్చాయి.

గందరగోళంగా ఉన్న ఇటువంటి మానసిక వాతావరణంలో మార్మికమైన సమష్టివాదం జనాన్ని ఆకర్షించింది. ఉద్రేకాలను ఆకర్షణీయమైన ఈ విధానంవలన వివేచనారహితవాదం అడ్డం వేసుకోవలసి వచ్చింది.

వివేచనావాదంలోని ఉదారసూత్రాలు అపహాస్యం పాలయినాయి. తత్వంలోను నీతిశాస్త్రంలోను ప్రాపంచిక అనుభవానికి పైచేయి అవడంవలన, తెలివికంటే ఉద్రేకానికీ, జ్ఞానంకంటే అంతర్బుద్ధికీ, వివేచనకంటే ప్రేరణకూ విలువనిచ్చారు.

కడ్‌వర్త్ (1617-1688) అనంతరం, ఇంగ్లీషు నీతిశాస్త్రం తత్వానికి తిలోదకాలు ఇచ్చింది. ఇతడు నీతి ఆధారంగా అతిభౌతిక విధానాన్ని రూపొందించాడు. సాధారణ తత్వంలో అంతర్భాగంగా కడ్‌వర్త్ నీతికి స్థానం ఇచ్చాడు. అతని గ్రంథం Treatise concerning eternal and immutabl morality లో ఈ విధానం ప్రధానంగా కనిపిస్తున్నది (The intellectual system of the Universe). అనంతరం ఇంగ్లీషు నైతిక సిద్ధాంతాలన్నీ "ఆచరణయుక్తమై" విలువలకు అతి భౌతిక భావనలను ఆలోచించడం మానేసి ఇష్టం వచ్చిన రీతిగా భావించారు. అతి భౌతిక వాదానికి వివేచనా విధానం లేకుండాచేసి, నైతికతత్వం దానంతటదే ఉన్నదనీ, దాని ప్రయోజనాన్ని బట్టి అర్హత నిర్ణయించాలని అన్నారు. నైతిక విలువలకు ప్రత్యామ్నాయాధారం మతము

లేదా అంతర్బుద్ధి అన్నారు. “18వ శతాబ్దంలో నైతికతత్త్వం సంకుచితం గావడానికి దాని ప్రారంభదశే కారణం. అది ఆగమన సూత్రంతో కూడినది. వాస్తవాలను సమీకరించి, వాటిని వివరించడానికి సిద్ధాంతాలను అన్వేషిస్తారు. వాస్తవాలను సమీకరించడం ముఖ్య విషయాలుగా భావిస్తారు. కనుక సాధారణ తత్త్వంలో భాగంగా నైతిక సిద్ధాంతాన్ని చూపే ధోరణే లేదు. జ్ఞానవాదానికి అనుగుణంగాను దీన్ని భావించలేదు. నైతికదృష్టి ఇంద్రియాలపరంగా జనిస్తుందా? వివేచనలో పడుతుందా? అనేది సుదీర్ఘంగా ఆలోచించక జ్ఞానవాదానికి సమీపంగా ఎలావచ్చిందో పరిశీలించక పోవడం వలన ఈ లోపం ఉన్నది. కడ్‌వర్త్, ప్రైస్‌గారల దృక్పథం విశాలమైనది. కడ్‌వర్త్ 17వ శతాబ్దంవాడు. హ్యూం నైతిక సిద్ధాంతం మనోవిజ్ఞానానికి చెందినది కనుక అందులో అతిభౌతికత చాలా స్వల్పం... లాక్ వ్యాసాలలో చర్చను ముగించడానికే నైతిక సిద్ధాంతాన్ని మధ్యలో ప్రవేశపెడతారు. నైతిక సిద్ధాంతానికి సంబంధించిన అతిభౌతిక వాదంలో దీనికి చాలా ప్రాధాన్యత ఉన్నా ఇదొక ప్రత్యేక విషయంగానే పరిగణించారు. బిషప్ బర్కిలి అతిభౌతికవాది....ఇతడి నైతిక సిద్ధాంతాలను బహుశా పాలే వ్రాసి ఉండవచ్చు. బ్రిటిష్ నైతిక వాదులలో విలక్షణుడైన బట్లర్ అతిభౌతిక విషయంతో సంబంధం లేకుండా నైతిక దృక్పథాన్ని ఇంద్రియ సంవేదనగాను, హృదయ దృష్టిగాను అవగాహన చేసుకుని, వాటికి చాలా స్వల్ప ప్రాధాన్యతను ఇచ్చాడు. న్యాయవాదికి, రాజకీయవాదికి, దైవజ్ఞుడికి నీతితో ప్రత్యేకమయిన ఆసక్తి ఉంటుందనేది చెప్పనక్కరలేదు. ఇతరుల దృష్టిలో నీతి అంటే మత శాస్త్రజ్ఞులకు చెందినదే. నీతిని గురించి ప్రస్తావించినప్పుడు ఆధ్యాత్మిక మతజ్ఞానం, అరిస్టోటల్‌ను గుర్తుకు తెచ్చేరీతిలో చట్టబద్ధమైన నియమాలను ప్రస్తావిస్తారు. అయినప్పటికీ ప్రతిచోటా మతజ్ఞానమే ఆధిపత్యం వహించింది”..... (LA SELBY-BIGG, THE BRITISH MORALIST).

సాంఘిక రాజకీయ సిద్ధాంతాలకు తాత్త్విక పునాదులుండాలి. అతిభౌతికత లేకుండా తత్త్వమనేది సాధ్యంకాదు. తొలుత వచ్చిన ఉదారవాదం తాత్త్వికపరమైనదే. దాని అభివృద్ధికీ తత్త్వాభివృద్ధికీ పొత్తు ఉన్నది. సంప్రదాయబద్ధమైన మార్మిక అలౌకిక దృష్టినుంచి పదార్థ వాస్తవ అతి భౌతికతవైపు పయనించడం స్పష్టంగా కనిపిస్తుంది. ఈ తాత్త్విక విప్లవంలో వివేచన జీవసంబంధమయినదని ఆవిధంగా మానవుడిలో ప్రకృతి నియమం వ్యక్తం అవుతున్నదని, తత్ఫలితంగా వివేచనాత్మక మతరహితమైన నీతి విధానం సాధ్యపడుతుందని వెల్లడయింది. హార్ట్‌లే చూపిన మార్గాన్ని ప్రీస్ట్‌లే, ఎరాస్మస్ డార్విన్ ఇంకా అన్వేషించారు. హ్యూం సంశయవాదం, లాక్ చెప్పిన ప్రపంచానుభవజ్ఞాన వాదంనుంచి జనించ అవసరం లేదని హార్లే అభిప్రాయపడ్డాడు. లాక్‌కు సరైన వారసుడుగా హార్ట్‌లే భావించుకోవడం వివాదాస్పదమైనది. ఇంద్రియ

జ్ఞానవాదాన్ని ఇతడు విపులీకరించగా, అది పదార్థవాదానికి దారి తీస్తున్నందున ప్రపంచానుభవవాదులు దానిని నిరాకరించారు. ఈ తత్త్వాన్ని స్థాపించిన పితామహుడి తార్కికాభివృద్ధిని అంగీకరించకపోవడంతో, ఉదారవాదం కాస్తా తాత్త్విక ప్రతిచర్య ప్రభావంలోకి వచ్చింది. పదార్థవాదానికి వ్యతిరేకంగా ప్రపంచ అనుభవాలకు బయలుదేరడంతో చివరకు అది సంశయవాదంలో మునిగిపోయింది.

పునర్వికాసం, సంస్కరణవాద సంప్రదాయాల సంఘర్షణల ఆధారంగా ఉదారవాదం పెంపొందినది. తాత్త్వికంగా లాక్ కాలంనుంచీ ఉదారవాదం గందరగోళంగా ఉన్నది. నవ్య థామస్ వాదానికి నాంది పలికిన హూకర్, ఉదారవాదంలో సంస్కరణ రీతులను ఆధిపత్యం వహించునట్లుచేసాడు. 18వ శతాబ్దపు ఫ్రెంచి వాతావరణంలో వైజ్ఞానికి వివేచన వాదాన్ని మళ్ళీ చిగురింపచేసారు. లాక్ పేర్కొన్న సూత్రాలను అధిగమించి పునర్వికాసంలో సహజ సంప్రదాయాలు తాత్త్వికంగా నిలదొక్కుకున్నవి. లాక్ పేర్కొన్న ఇంద్రియ జ్ఞానవాదం చివరకు బర్కిలీ ఆత్మాశ్రయ ఆదర్శవాదానికి, హ్యూం చెప్పిన సందేహవాదానికి దారితీసింది. ఇవిరెండూ పైకి ఎంతో భిన్నంగా కనిపించినప్పటికీ ప్రాపంచికానుభవ తత్త్వంలోని లోపాలను బైటపెట్టాయి. ఇందులో తాత్త్విక ప్రతిచర్య ప్రమాణం ఉన్నది కనుక, ఇది తీవ్ర పరిణామాలతో కూడినది. మానవజ్ఞాన పరిమితులను నిర్ధారించదలచిన లాక్, ఇంద్రియాతీతంగా ఏమీ తెలియదన్నాడు. అయినప్పుడు, బాహ్యసత్యాన్ని గురించి తెలుసుకునే ప్రయత్నం చేయాలన్నాడు. ప్రాపంచికానుభవ తత్త్వం పుడుతూనే అతి భౌతిక వాదాన్ని నిరాకరించింది.

బర్కిలి ఇంకా ముక్కు సూటిగా పోయాడు : అనుభవం వలన బాహ్య ప్రపంచ సత్యాన్ని రుజువుచేయలేం. ఆత్మాశ్రయవాదం తప్పదనే బదులు, తుది సత్యంగా దేవుడున్నాడని తత్త్వం ప్రతిపాదించాలన్నాడు. ప్రాపంచికానుభవ వాదం ఆవిధంగా తత్త్వాన్ని మార్మిక – అలౌకిక అతిభౌతికత్వానికి తెచ్చింది. అంతేగాక వ్యక్తగతమయిన దైవంలో విశ్వాసాన్ని కలిగించే మత ధోరణి కూడా మళ్ళీ వచ్చింది.

హ్యూం సందేహవాద ప్రధాన్యమేమంటే, వాస్తవ (పదార్థ) అతిభౌతిక విధానం తృణీకరించడమే. అయితే అతడి సంశయధోరణివలన దేవుడినికూడా నిరాకరించేటంతవరకూ పోలేదు. నాస్తికతనుండి తన ధోరణిని అతడు వేరుచేసి చూపాడు. ఫ్రెంచి విజ్ఞాన సర్వస్వకర్తను ప్రప్రథమంగా కలిసినప్పుడు జరిగిన సన్నివేశమే ఇందుకు ఉదాహరణ. ఆ సంభాషణలో హ్యూం మాట్లాడుతూ, నిర్ధారణతోకూడిన నాస్తికవాదిని తానింకా కలుసుకోవలసి ఉందన్నాదు. వెంటనే డిదరో తిప్పికొడుతూ, "మీ ఎదుట అలాంటివారు తొమ్మిదిమంది ఉన్నార"న్నాడు. తుదిసత్యాన్ని తత్త్వం

కనుగొనలేకపోతే మానవుడు. మతంలోకి పోవాలన్నమాట. అజ్ఞానవాదం మానవజ్ఞానానికి సంపూర్ణ పరిమితిని విధిస్తున్నది. సత్యానికి వాస్తవానికీ సంబంధించిన జ్ఞానం అసాధ్యమని ఈ వాదం చెబుతున్నది. (రెయిడ్ చూపినట్లుగా హ్యూం ప్రాపంచికానుభవవాదం మన జ్ఞానాన్నంతటినీ ప్రాతినిధ్యం వహించే భావాలతో నిర్మిస్తాడు. ప్రాపంచికానుభవ దృష్టికి అతడిచ్చిన ప్రాధాన్యతవలన వాస్తవ ప్రపంచంపై పట్టు సడలింది.) అజ్ఞానాన్ని ఆచారంగా పెంపొందించే అధునాతన విధానమిది. (1808 లో డ్యూబా రెమాన్డ్ జర్మనీ వైజ్ఞానిక వైద్యసంఘ సమావేశంలో, ప్రకృతి జ్ఞాన పరిమితులు అనే అంశంపై ప్రసంగించాడు. అజ్ఞానాన్ని చాటినందుకు ఆ ప్రసంగం సుప్రసిద్ధమయింది). విశ్వాసానికి అజ్ఞానమే పునాది. కనుక హ్యూం పేర్కొన్న అజ్ఞానవాదం మతాన్ని తిరగదోడటానికి తగిన మేధారంగాన్ని సృష్టించినట్లు, తత్త్వానికి సంబంధించిన నిశిత చారిత్రక పరిశీలకులు అభిప్రాయపడ్డారు. ప్రాపంచికానుభవవాద తత్త్వంవలన తార్కికంగా జనించే వాదం ఇలానే ఉంటుంది. మానసిక సంఘటనలకు కార్యకారణ వాదానికి ఇచ్చే వివరణ అసంపూర్తిగా ఉన్నప్పుడు, వివరణ అసాధ్యమని చూపడం, ఇకముందు అన్వేషణ అంతా వృధా అని చెప్పడమే. జ్ఞానార్జన ఆగినచోట అనుభవం స్థానంలో అంతర్బుద్ధి ప్రవేశిస్తుంది. ప్రాపంచికానుభవం మార్మిక వాదానికి మార్గాలు వేస్తుంది. బర్కిలీ దేవాలయానికి తీసుకుపోయినా, అసంభవమని హ్యూం చెబుతున్నా ప్రాపంచికానుభవ తత్త్వం మంచిదని చాటిన ఉదారవాదం సహజమతాన్ని స్వీకరించక తప్పలేదు, వివేచనారహిత వాదానికి పోక తప్పలేదు. (19వ శతాబ్దంలో పెంపొందిన వివేచనారాహిత్యత 20వ శతాబ్దం వరకూ కూడా తొంగి చూచింది. ప్రాపంచికానుభవవాదాన్ని హ్యూం నాశనం చేసిన ఫలితంగా ఇది సంభవించింది– (బెట్రాండ్ రస్సెల్, హిస్టరీ ఆఫ్ వెస్టరన్ ఫిలాసఫీ).

మతానికి సంబంధించిన సహజ చరిత్ర చిరకాలంగా మన్ననలను పొందుతున్న ఆత్మభావనలోని కట్టుకథను బట్టబయలు చేసింది. దాంతోబాటే భౌతిక ప్రపంచం కూడా కొట్టుకపోయింది. మిగిలిందల్లా అందికా పొందికా లేని విడి "భావాలు" మాత్రమే. మన ఇంద్రియాలకు సంబంధించిన ప్రపంచానుభవమే లోకం అంటే. అది ఆదర్శప్రాయం, వివేచనారహిత ప్రపంచం. సంఘటనలమధ్య సంబంధం ఉండనక్కరలేదు. కనుక ఎప్పుడైనా ఏదైనా ఎక్కడైనా జరగవచ్చు. ప్రాపంచికానుభవ వాది చెప్పే లోపం అద్భుతాలమయం. శూన్యంనుంచి సృష్టిచేసే సర్వశక్తివంతుడైన దేవుడు లేకుండా ఈలోకం ఉండదు. హ్యూం అజ్ఞానవాదం ఫలితంగా ఇదంతా వచ్చిందని డ్యుగాల్డ్ స్టీవర్ట్ చూపాడు. అతడు రెయిడ్ అనుచరుడు. హ్యూం సందేహవాదాన్ని వ్యతిరేకించాడు. స్టీవర్ట్ లౌకిక వాస్తవ వాదాన్ని అనుసరించాడు.

హ్యూం సిద్ధాంతం మత జ్ఞానానికి దారితీసిందని చూపాడు. కారణం అవసరమనే విశ్వాసాన్ని దేవుడు మనకిస్తాడని, హ్యూం వాదనల వలన విదితమవుతున్నది. అయితే అది తార్కికావసరం కాదని హ్యూం వాదిస్తాడు. స్టీవర్ట్ దీనికి సమాధానమిస్తూ అటువంటప్పుడు అంతర్బుద్ధిగాని, మన రాగద్వేషాలు గాని కారణమై ఉండాలన్నాడు. ఏమైనా అనుభవానికి పూర్వమే నమ్మకం ఉన్నదనడం మతానికి ముఖ్యమయినది.

నాస్తికుడు కాకుండానే ఉదారవాదిగా ఉండవచ్చునని చూపడానికి స్టీవెర్ట్ ప్రయత్నించాడు. స్వేచ్ఛపట్ల జ్ఞాన వికాసానికి గల ఉత్సాహాన్ని, సాహసోపేత ధైర్యాన్ని, స్వేచ్ఛాపరుడైన వ్యక్తి ఎక్కడాలొంగక, తన విధానాలను కొనసాగించే రీతులను గమనించిన అనంతరం, స్టీవర్ట్ అలా చెప్పాడు. (డిగోల్డ్ స్టీవర్ట్, యాక్టివ్ అండ్ మోరల్ పవర్స్). నైతిక ప్రపంచంలో ఒక పథకం ఉన్నదని మనోవిజ్ఞానం రుజువు చేసినట్లు పాలె పేర్కొన్నాడు (నాచురల్ థియాలజీ). అత్యధిక సంఖ్యాకులకు అత్యంత మంచిని సమకూర్చే చర్య ఉత్తమమని బెన్థాం చెప్పినదానితో ఇతడు అంగీకరించాడు. అంతకుముందు శతాబ్దంలో మతపరమయిన ప్రయోజనవాదం అనుసరించి, మరణానంతరం శిక్షలు పారితోషకాలు ఉంటాయన్నాడు.

హ్యూం రాజకీయంగా టోరీ అయినప్పటికి అతని ప్రభావంవలన బ్రిటన్‌లో ఉదారవాదం తాత్త్విక లక్షణాలతో బంధాలు త్రెంచుకున్నది. (19వ శతాబ్దపు తొలిరోజులలో ఇంగ్లీషు తత్త్వం అంటూ అట్టేలేదు లెసిలీ స్టీఫెన్, ది ఇంగ్లీష్ యుటిలిటేరియన్స్) వ్యక్తివాదం కేవల స్వార్థంగా దిగజారింది. ప్రతి మానవుడు స్వంత విషయాలను చూచుకోవాలనే సూత్రాన్ని సమర్థించుకున్నాడు. "ఎవరికివారు స్వయంగా సహాయం చేసుకోవడం వలన అనుకోకుండానే పొరుగువారికి సహాయపడతారనేది దైవాజ్ఞకు రుజువు" (ఏడమ్‌స్మిత్). ఈ దైవాజ్ఞవలన మానవుడు తన విధికి తానే నిర్ణేతకాకుండా పోతున్నాడు. వ్యక్తిత్వ సూత్రంతో కూడిన మానవవాదతత్త్వం, వ్యక్తి సార్వభౌమత్వాన్ని చాటుతుంది. దీనికీ పైన పేర్కొన్న దైవాజ్ఞ భావానికీ పొసగదు. దైవాజ్ఞవలన ప్రపంచం నడుస్తున్నదని చెబితే మానవుడి స్వేచ్ఛ అర్థరహితమవుతుంది. సాంఘిక రాజకీయ వ్యవస్థాపన అంతా ప్రపంచంలో భాగమే గనుక మానవుడి స్వేచ్ఛకు అర్థంలేకుండా పోతున్నది. అట్లాంటి పరిస్థితిని మానవుడెలా మారుస్తాడు? ఆధునిక ఉదారవాదానికి సంబంధించిన సాంఘిక రాజకీయ సిద్ధాంతాలు సంప్రదాయబద్ధమైన ప్రకటనలుగా మారిపోయినట్లు తాత్త్విక ప్రతిచర్యవలన గమనించవచ్చు.

"వాస్తవ సంఘటనల ఆధారంగా ఏ విధానాన్ని అనుసరించాలని అడిగే ఆచరణవాదులు, సరైన వివేచనకుగాని ప్రకృతి నియమానికిగాని పొదలచుకోలేదు. అనుభవం సంప్రదాయం వలన వ్యవస్థాపితమయిన విధానాన్ని ఆమోదించి,

వివరాలన్నిటినీవదిలేసి, నైరూప్యవాదనలకు తిలోదకాలిచ్చారు. అన్వేషణను తాత్త్వికులకు విడిచిపెట్టారు. అంటే గ్రంథాలయాలలో పుస్తకాల పురుగులుగా ఉన్నవారికి వదిలేశారన్నమాట. రాజకీయాలనేవి వ్యాపారంవంటివి. వాటిని ఆ ధోరణిలోనే చర్చించాలి. ఇలాచూస్తే వ్యక్తివాదం ప్రాపంచికానుభవ వాదంతో సరిపడుతుంది. వాస్తవాలతోనూ వ్యక్తిగత ఆసక్తులతోనూ ప్రారంభించి, తొలి సూత్రాలను నిర్లక్ష్యం చేస్తేగనుక ఇటువంటి వ్యక్తివాదం బాగానే ఉంటుంది." (లెనిన్ స్టీఫెన్ : ది ఇంగ్లీష్ యుటిలిటేరియన్స్).

సంప్రదాయం స్థాపించిన వ్యవస్థ పవిత్రమైనదనడం, బర్క్ చెప్పే టోరీవాదాన్ని బలపరుస్తుంది. దీనికి అనుభవాన్ని జోడించినంతమాత్రాన అట్టే తేడారాదు. తాత్త్విక సంప్రదాయంనుంచి దారితప్పిన ఉదారవాదం ఆత్యహత్య గావించుకొన్నది. అంతిమక్రియలవద్ద నవ్య ఉదారతత్త్వవేత్తలు తుది పలుకులు పలికారు. రాజ్యానికి సంబంధించిన జీవసిద్ధాంతాన్ని వీరు ప్రవచించారు. అంటే వ్యక్తివాదాన్ని తృణీకరించారన్నమాట.

దీని ఫలితంగా తత్త్వంలో వివేచనారహితవాదం బలపడింది. సాంఘిక రీతులను అధ్యయనం చేయడానికి వైజ్ఞానిక పద్ధతులు అన్వయించాలనడంతో 19వ శతాబ్దాంతంలో వివేచనకు వ్యతిరేకంగా తిరుగుబాటు జరిగింది ("ఉదారవాద తత్త్వవేత్తలు గావించుకున్నవారు విప్లవపూరిత అతివాదాన్ని త్రోసిరాజని, మతనైతిక విషయాలలో అంతర్బుద్ధికి ప్రాధాన్యత ఇచ్చారు") సాంఘిక పరిణామానికి అన్వయించిచూస్తే డార్విన్ సిద్ధాంతాన్ని మరోరీతిలో భాష్యం చెప్పారు. వ్యక్తివాదంకాని, సమష్టివాదంకాని ఇందులో ఉన్నవి. విజ్ఞానవేత్తలు మానవుడి మనసుకు సంబంధించిన శారీరక, అంగవిశ్లేషణ చేయడంద్వారా సత్యాన్ని తెలుసుకోగలగాలి. గతంలోనూ వర్తమానంలోనూ మానవ సంస్థలెలా ఉండేవో పరిశోధన జరగవలసి వచ్చింది. తత్ఫలితంగా ఆదిమ మానవశాస్త్రం, సాంఘిక మనోవిజ్ఞానం రెండు నూతన శాస్త్రాలుగా అభివృద్ధి చెందాయి. ఫ్రేజర్, వెస్టర్‌మార్క్, హాబ్‌హౌస్, రివర్స్ ఇంకా అనేకులు ఆదిమమానవుల ప్రవర్తన, సాంఘిక వ్యవస్థను గురించి పరిశోధనా జరిపారు. దీనివలన 18, 19 శతాబ్దాలలోని వివేచనాత్మక సాంఘిక రాజకీయ సిద్ధాంతాల గురించి సందేహాలు బయలుదేరాయి. శాస్త్రజ్ఞులు వివేచనలో విశ్వాసాన్ని వదులుకోవడానికి సిద్ధంగా లేకున్నా నియమబద్ధమయిన ప్రపంచంలో చాలా క్లిష్టమయిన సమస్యలెదురయ్యాయి. మానవుడి సాంఘిక ప్రవర్తన ప్రేరణాత్మకంగానేతప్ప తెలివితేటలతో లేదని ప్రపంచానుభవ జ్ఞానం సూచించింది. కనుక అంతర్బుద్ధికి, వివేచనారహిత విధానాలకు ఎక్కువ అర్థస్థానం ఇస్తేగాని గతంలోని చరిత్రను

అవగాహన చేసుకోవడానికి భవిష్యత్తుకు పోవడానికి వీల్లేదనిపించింది. జీవశాస్త్రాల గురించి ముఖ్యంగా నవ్య జీవవాదం గురించి లోపభూయిష్టమయిన జ్ఞానాన్ని ఆధారంగా చేసుకుని, వివేచనారహిత తత్వాన్ని బెర్గ్‌సన్ రూపొందించాడు. "వివేచనకు వ్యతిరేకంగా జరిగినతిరుగుబాటు, రూసోతో ఆరంభమై జీవితరంగంలో ఆలోచనాపరిధిలో విస్తరిస్తూపోయింది". (బెర్ట్రాండ్ రస్సెల్, హిస్టరీ ఆఫ్ వెస్టరన్ ఫిలాసఫీ).

లాంఛనప్రాయమై, దిగజారిన ఉదారవాదం బ్రిటన్‌లో పతనమౌతుండగా, ఫ్రాన్సులో విప్లవానంతర ఉద్వేగ ప్రతిచర్యగా కొద్దికాలంపాటు ఉదారవాదం నిలదొక్కుకుంది. 19వ శతాబ్దపు మధ్యలో ఐరోపా అంతటా ఉదారవాదం చాలా బలంగా ఉన్నది.

ఫ్రాన్సులో, మిషెలా, విక్టర్‌హ్యూగోల తరువాత, క్వినే, ఫాగా, రినోవా, ఫౌలీ మొదలైనవారు జాగర్తగా ఉదారవాదాన్ని ప్రభోదించారు. రాజ్యానికి వ్యక్తిస్వేచ్ఛకు మధ్య వైవిధ్యాన్ని గురించి ఇతరులు తటపటాయిస్తుండగా, రినోవా స్పష్టంగా ప్రకటిస్తూ, పౌరులుగాఉన్న వ్యక్తులేతప్ప, సమష్టిగా ఉండే రాజ్యమంటూ లేదని, పౌరులు తమ ఇచ్ఛను దత్తంచేసేశక్తి ఏదీ లేదని స్పష్టంచేసారు. (ఛార్లెస్ రినోవా, CHARLES RENOUVIER, PHILOSOPHIE ALALYTIQUE DE L' HISTOIRE). కానీ ఫౌలే కలగాపులగ సిద్ధాంతాన్ని ప్రవచిస్తూ రాజ్యమనేది "ఒడంబడికతో కూడిన జీవ విధానం" అన్నాడు. (ALFRED FOUILLEE, LA SCIENCE SOCIALE CONTEMRAINE). సంప్రదాయబద్ధమైన ఉదారవాదంలో ఆఖరివాడు అనాటోల్ ఫ్రాన్స్. జ్ఞానవికాసానికీ, మానవుడి తిరుగుబాటు సంప్రదాయానికీ అనుకూలంగా ఉన్న ఇతడు విజ్ఞానానికీ, స్వేచ్ఛకూ విరుద్ధమైన పాత వ్యవస్థను, దాని పిడివాదాన్ని, జీవితమంతా తీవ్రంగా వ్యతిరేకిస్తూనే ఉన్నారు. మతవ్యవస్థ ఆధిపత్యం పోనిదే ఆధునిక నాగరికత మానవుడికి స్వేచ్ఛను యివ్వజాలదన్నాడు. మూఢవాదాలకూ, రాగద్వేషాలకూ, వ్యతిరేకంగా, సాహసోపేతమయిన పోరాటం జరిపిన అనాటోల్, వివేచనా వాదంలో నమ్మకముంచడమేగాక, విజ్ఞానం విమోచనను కలిగిస్తుందని నమ్మాడు. బర్గ్‌సన్ ఆధిపత్యం, సోరెల్ ఉద్వేగధోరణివలన వివేచనారహితవాదం ప్రచారం ఉన్నరోజులలో అనాటోల్ ఈవిధంగా చేయగలిగాడు. ఇతడి ఉదారవాదంవలన అంతకుముందు ఫ్రెంచి రాడికల్స్ ఇదే వైఖరిని అనుసరించడంవలన గస్డే (Guesde) వివేచనాయుత మార్క్సిజానికి జార్ (Jaures) సోషలిస్టు మానవతావాదానికీ దోహదం ఏర్పడింది.

19వ శతాబ్దంలోని లాంఛనప్రాయమయిన ఉద్వేగవాదంలో అసంబద్ధతలూ, పరస్పర విరుద్ధత్వాలూ ఉండగా వాటికి ప్రతిచర్యగా వచ్చిన ధోరణికి సోరెల్ ప్రాతినిధ్యం వహించాడు. తొలుత ఇతడు 18వ శతాబ్దానికి చెందిన ఉదారవాది అయినా

పార్లమెంటరీ ప్రజాస్వామ్యంలో మోసంవలన జుగుప్స చెందాడు. వ్యక్తిస్వేచ్ఛను, రాజకీయ పరిపాలనావశ్యకతను, ఆర్థికవ్యవస్థను, సమన్వయీకరించడంలో ఉదారవాదం విఫలమయింది. దీనివలన సోరెల్ అరాచకవాదం వైపుకు పోయాడు. ప్రయోజనావాదం, ఫలితాలనిచ్చే ఉదారవాదంనుంచి అరాచకవాదం జనించడం తర్కబద్ధమే–ఆ ధోరణిలో సోరెల్, బర్గసన్ తత్త్వప్రభావానికి లోనయ్యాడు. ఉద్వేగవాద వివేచనారాహిత్య ప్రవక్తగా మారాడు. సంఘాన్ని సంస్కరించాలంటే హింస ఒక్కటే మార్గమని ఛాందసంగా బోధించాడు. కార్మిక విప్లవాన్ని కావాలంటూనే, మార్క్స్ చారిత్రక నీతివాదాన్ని తృణీకరించాడు. ప్రకృతి, సమాజం గుడ్డిగాతప్ప ఏ నియమాన్ని అనుసరించి సాగడంలేదన్నాడు. హింసను శ్లాఘించడం, కార్మిక విప్లవాన్ని కాంక్షించడంతో సోరెల్, ఫాసిస్ట్ తత్త్వవేత్తగా పరిగణింపబడ్డాడు. సోరెల్ శిష్యుడనని ముస్సోలినీ ప్రకటించుకున్నాడు. రష్యా విప్లవంవలన తన కలలు ఫలించాయని, లెనిన్ ఆదర్శపురుషుడనీ అంతిమదశలో సోరెల్ ప్రకటించాడు. ఫాసిజానికీ, కమ్యూనిజానికీ జన్మస్థానం ఒకేవ్యక్తిలో ఉండటం చాలా ప్రాధాన్యత వహించిన విషయం. వివేచనకు వ్యతిరేకంగా జరిగిన తిరుగుబాటును ఇతడు చాలా శక్తివంతంగా సమర్థించాడు. 19వ శతాబ్దాంతంలోనూ, 20వ శతాబ్దారంభంలోనూ జనించిన తాత్త్విక ప్రతిక్రియే ఇతడిని ప్రోత్సాహపరిచింది.

19వ శతాబ్దపు తొలిరోజుల్లో ఉద్వేగవాదానికి సంబంధించిన, తాత్త్విక సంప్రదాయం జర్మనీకి వ్యాపించింది. పునర్వికాసం వెలిగించిన మానవ స్వేచ్ఛాకాంతిపుంజం జర్మనీలో చివరిసారిగా మెరిసింది. జ్ఞానం, స్వేచ్ఛ, సత్యం అనేవాటిని ఆరాధించేవారి సంఖ్య పెరుగుతన్నకొద్దీ పునర్వికాస ధోరణి కొనసాగింది. వివేచనకూ ఉద్వేగానికీ, తెలివికీ ఉద్రేకానికీ జ్ఞానానికీ తత్త్వానికీ సమన్వయీకరణ చేయడంలో చాలా అభివృద్ధి జరిగింది. జర్మనీ చరిత్రలో స్వర్ణయుగమని చెప్పుకోదగిన సంప్రదాయం, హెగెల్, ఫ్యూయర్‌బాహ్ అనుచరులు సంక్రమింపజేసుకున్నారు. తాత్త్వికంగా వీరు “రాడికల్స్” అని పిలుచుకున్నారు. దేశానికి మంచి భవిష్యత్తు ఉందనిభావించారు. లాంఛనప్రాయమైన ఉదారవాద పరిమితులు దాటేటటువంటి ఆధునిక నాగరికత కొత్తదశలో అడుగుపెట్టి స్వేచ్ఛనూ, జ్ఞానాన్ని, సత్యాన్నీ అన్వేషించడంలో నూతనాధ్యాయాన్ని ప్రారంభించింది.

“మూడు తరాలకు సంబంధించిన సుప్రసిద్ధ పండితులు మేధస్సుకు సంబంధించిన ఉదారవాద స్రవంతిని తెచ్చారు. పెత్తందారీతనంనుంచి స్వాతంత్ర్యం పొందడం, నిష్పాక్షిత, సహనమనేవి ఇందలి ప్రధాన సూత్రాలు. భిన్న రంగాలలో, సంప్రదాయబద్ధంగా పెత్తందారీ విధానానికి తలఒగ్గడం కాకుండా విమోచనపొందడం

గమనార్హం. విజ్ఞానం కనుగొన్నవాటి ఆధారంగా పదార్థవాద తత్త్వంవచ్చి అతిభౌతిక వూహలతో నిమిత్తంలేకుండా కొనసాగింది. మతం మానవశాస్త్రానికి సంబంధించిన తత్త్వమేతప్ప అలౌకికంగా ఊడిపడిందేమీకాదని తేలిపోయింది. ఇతర చారిత్రక గ్రంథాలవలె బైబిల్‌నుకూడా నిశితంగా పరిశీలించారు. కొందరి దృష్టిలో క్రీస్తు లేనేలేడనికూడా రుజువయింది. విజ్ఞానం తరువాత జర్మనీలో చరిత్ర ఉదారవాదశకంలో ప్రాధాన్యత వహించింది. నిష్పాక్షిక బాహ్యసత్యాలను అది బోధించింది. దీనివెనుక ఉన్న మానవసత్యాన్ని విస్మరించరాదన్నది" (ఫ్రెడరిక్ కార్ల్‌సెల్, జర్మనీ ఫ్రీ నాజీ పొలిటికల్ థాట్, న్యూయార్క్ ఫిలసాఫికల్ లైబ్రరీ ప్రచురించిన 20వ శతాబ్దపు రాజకీయ ఆలోచన అనే గ్రంథం నుంచి).

కాంట్ నుంచి విభిన్నమయిన ఆలోచనా స్రవంతి వచ్చింది. తొలుత న్యూటన్ సహజతత్త్వంతోనూ, జ్ఞానవికాసంతోనూ, ఇతడు ప్రభావితుడయినా, పునర్వికాసంకంటే సంస్కరణవాదమే ఇతడిని ప్రేరేపించింది. కనుక ఇతడి ఉదారవాదం రాడికల్ ఫ్రెంచి వారికంటే ఇంగ్లీషు మితవాదులతో సన్నిహితంగా ఉన్నది. జర్మనీ తత్త్వంలో ప్రాపంచికానుభవవాదాన్ని మొట్టమొదటగా ప్రవేశపెట్టిన కాంట్, హ్యూం అజ్ఞానవాదం నుంచి దీనిని రక్షించబూనాడు. ఆత్మాశ్రయ, బాహ్యవిధానాలకు గల అగాధాన్ని తగ్గించి వారధి నిర్మిస్తే ప్రపంచానుభవ తత్త్వానికికూడా అతిభౌతికత ఉండవచ్చునన్నాడు. మొట్టమొదట ఇటువంటి తేడాను డేకార్ట్ ప్రతిపాదించాడు. డేకార్ట్ విధానాన్నే కాంట్ తిరగదోడాడు. ఆ విధంగా ఆధునిక తత్త్వాన్ని మొదలంటా నరికివేయడానికి కాంట్ విప్లవం పూనుకొన్నది. అంతేగాక కొత్తరకమైన మధ్యయుగాల వాదాన్ని కూడా ఇతడు ప్రారంభించాడు. (రైడ్ చాలా నిశితంగా హ్యూంను విమర్శించాడేగాని కాంట్ జోలికి పోలేదు. కాంట్ చెప్పిన సత్యానికి పరోక్షపు ఆధారాలను ఇతడి రచనలు సమకూర్చాయి (షోపెన్‌హార్). భావానికి బదులుగా అంతర్బుద్ధిని ప్రవేశపెట్టి అది మార్మికమైనదనీ, మనసుకూ పదార్థానికీ మధ్య వివరించేందుకు వీలులేని బంధమనీ చెప్పారు. 'ఇంద్రియ సంవేదనలవలన మనం ఉత్తేజితం అవుతాం. అలాగే ప్రత్యక్ష ప్రమాణం వలన ఉత్తేజం పొందుతాం. ఇదంతా ఏ విధంగా జరుగుతుందో తెలియదు' రైడ్).

కాంట్ నిశిత తత్త్వంలోని ఆత్మాశ్రయవాదం, ఫిషె ఉద్వేగవాదాన్ని పోషించగా మరోవైపున వివేచనపై తిరుగుబాటుచేసిన షోపెన్‌హార్‌కు ఉత్తేజాన్ని కల్పించింది. వీరిరువురూ ఇంకా నిషె, బెర్గ్‌సన్, సోరెల్ మరికొందరు, ఫాసిజానికి తత్త్వవేత్తలుగా శ్లాఘనీయులయ్యారు. జర్మన్ జాతీయవాదానికి ప్రవక్తగా ఫిషె ఉన్నాడు. 19వ శతాబ్దంలో ఉదారవాదం, జాతీయవాదం వింతగా కలిశాయి. ఈ రెండింటి కలయిక వలన, ఇటలీ, జర్మనీలలో ఫాసిజం జనించింది. ప్రజాస్వామ్యానికి సంబంధించి

లాంఛనప్రాయమయిన భావన వచ్చి, ప్రశాంతంగా వ్యక్తివాదం స్థానే సమష్టివాదాన్ని ప్రవేశపెట్టింది. దీనితో ఉదారవాద రాజకీయ వేత్తలు తప్పుద్రోవనపడి జాతీయవాదాన్ని కావాలన్నారు. ప్రజాస్వామ్యం పేరిట ఏమి పలికినా, అధికారం కొరకు జరిగే పెనుగులాటలో రుజువయిందేమంటే, జాతీయవాదం ఫలించినచోట తిరోగమన సాంఘిక, సాంస్కృతిక దృష్టిని ఆకర్షించడమేగాక వ్యవస్థను అట్టిపెట్టాలనే శక్తులతో చేతులు కలిపింది.

ఇటలీలో, సోరెల్ వివేచనారహిత ఉద్వేగవాద ప్రభావమేగాక, జాతీయవాదం విజయం పొందడానికి, ఫ్రెంచి రాజరికపు మితవాద సంకుచిత సిద్ధాంతాలను ఆమోదించడంకూడా చాలావరకు కారణమని చెప్పవచ్చు. జాతీయవాదం పోరాడే రోజులలో, ఉదారవాదమిచ్చిన మద్దతును విస్మరించిన జాతీయవాది, ఉదారవాదాన్ని విమర్శిస్తూ దానికి తాత్త్విక దృక్పథంలేదనీ ఈ లోపాన్ని తాను తీర్చగలననీ అన్నాడు. "మానవ కట్టుబాట్లకు అత్యున్నతస్థాయి జాతిలోనే ఉన్నది. జాతి అంటే వ్యక్తుల సముదాయంగాక, జీవ విధానమన్నమాట. మార్మికరంగం గతాన్ని, వర్తమానాన్ని, భవిష్యత్తులో అన్ని తరాలను ఆవరించే పద్ధతి. ఇందులో వ్యక్తి ఒకభాగం మాత్రమే. అందుకతడు ఎంతో విధేయుడుగా ఉండాలి" (ENRICO CORRIADINI, DIS CORSI, POLITICI).

పై భావాలను పరేటొ "వైజ్ఞానికంగా" విస్తృతపరిచాడు. సంఘంలో మేధావులు, సాంఘిక పునరావృతం అనే సిద్ధాంతాలద్వారా ఇతడు నియంతృత్వానికీ, సంకుచిత భావానికీ, సామాజిక ప్రమాణాలను చేకూర్చాడు. ఇతనితోపాటు జంటైల్ వంటి ఉదారవాద తత్త్వవేత్తకూడా ఈ అభిప్రాయాలకు ఆమోదముద్ర వేసాడు. ఫాసిస్టు రాజకీయసిద్ధాంతానికి జంటైల్ సాంస్కృతిక రూపాన్నందించాడు. ముసోలినీ అధ్వర్యాన విద్యామంత్రిగా ఇతడు వీరుల జీవితాలను పాఠ్యప్రణాళికలోచేర్చి జాతీయవాద చిహ్నాలుగా వీటికి విపరీత ప్రాధాన్యత కల్పించాడు. జాతీయ సంస్కృతులలో మానవభావం వ్యక్తీకృతమౌతుందని, జాతిద్వారానే వ్యక్తి తనను తాను వెల్లడించుకోవాలనీ చెప్పాడు. ఉదారవాదం కనుక తొలుత ఉన్నట్టి తాత్త్విక స్థితినుంచి దూరంగా జరిగిపోయినట్లయితే క్రోసేకు స్నేహితుడూ శిష్యుడూ అయిన జంటైల్ ఫాసిజాన్ని సమర్థించనక్కరలేదు. తాత్త్వికంగా వచ్చిన ఈ ప్రతిచర్య జంటైల్‌లోనే కనిపించింది. "మానవుడు సహజంగా మతపరమయినవాడు. ఆలోచించడమంటే దైవాన్ని గురించి ధ్యానం చేయడమే. మానవుడికి భిన్నంగా సర్వస్వమూ దైవమే. మానవుడు ఏమీకాదు. ఫాసిస్టు రాజ్యం మతంతోసహా ఆధ్యాత్మిక విలువలను అన్నింటినీ పట్టించుకుంటుంది. మరేదైనా సార్వభౌమత్వశక్తిని సహించడమంటే రాజ్యం ఆత్మహత్య చేసుకోవాల్సిందే.

ఆధ్యాత్మికమైనదంతా స్వేచ్ఛాపూరితం. ఇదంతా రాజ్యశక్తుల అవధులకులోబడే ఉంటుంది. ఎందుకంటే రాజ్యమే ఆధ్యాత్మికం గనుక" (GIOVANNI GENTILE, FASISM AND CULTURE).

మానవుడు దైవాధిపత్యంనుంచి విమోచన పొందితేతప్ప లౌకికరాజ్యంలో స్వేచ్ఛాపోరాటం సాగించలేడు. తాత్త్వికంగాచూస్తే, ఆధ్యాత్మిక బానిసత్వానికి వ్యతిరేకంగా మానవుడుచేసే తిరుగుబాటులోనుంచే ఉదారవాదం జనించింది. ఆవిధంగా 19వ శతాబ్దం వరకు ఆధునిక నాగరికత ఆవిర్భవించి పెంపొందడానికి ఉదారవాదం ప్రేరణలను ఇచ్చింది. పైన పేర్కొన్న కారణాలవలన తాత్త్వికంగా ప్రతిచర్యవచ్చి జంటైల్ వంటి ఉదారవాదులుకూడా ఫాసిజానికి ఆకర్షితులయేటట్లు చేసింది.

జాతీయవాదం, సంస్కరణ వాదంనుంచి జనించింది. క్రైస్తవమతంలో తొలుతఉన్న ప్రజాస్వామిక వ్యక్తివాద సంప్రదాయాలకు వ్యతిరేకంగా మానవుడు తిరుగుబాటుచేసి మళ్ళీ మతానికి బలం చేకూర్చాడు. మిడిమిడి ప్రజాస్వామ్యంతోకూడిన ప్రొటస్టంట్ క్రైస్తవమత ప్రభావానికి గురైనప్పుడల్లా ఉదారవాదం తన పునర్వికాస సంప్రదాయాన్ని విస్మరించింది. తాత్త్వికంగా ప్రతిచర్యవచ్చి వివేచనారహిత వాతావరణ మేర్పడగా, ఫాసిజం, కమ్యూనిజం వ్యాపించడానికి దోహదం కలిగింది. సంస్కరణవాదం ప్రభావంక్రింద ఉదారవాదం, జాతీయవాదంతో చేతులు కలిపింది. జాతీయ-సోషలిజం లేదా ఫాసిజం అనేవి మార్మికమయిన సమిష్టివాద ఆచారాలకు నిజస్వరూపాలు.

జాతీయరాజ్య భావనకు పుట్టినిల్లు జర్మనీ. అందువలన జాతీయభావాన్ని ఆదర్శంగాచేసి చూపడం జర్మనీ సంస్కృతికి విశిష్ట లక్షణమయింది. రాజకీయభావాన్ని తాత్త్విక స్థాయికి తీసుకువచ్చారు. జాతీయ చైతన్యత అనేది ద్వేషభావంతో కూడినది. జాతి కొందరి మనుషులకు చెందినట్టిది. ఐరోపాలో మరే ప్రాంతీయ సంస్కృతిలోనూ ఈ భావం ఇంత గాఢంగా నాటుకుపోలేదు. అయినప్పటికీ 16వ శతాబ్దంలో జనించిన జాతీయవాదం 19వ శతాబ్దంవరకూ జర్మనీలో సఫలీకృతం కాలేదు. దీనివలన నిస్పృహ భావన వ్యాపించింది. మానసికంగా తక్కువ అనుకునే ధోరణివలన సంకుచిత జాతీయ సంస్కృతీదృక్పథం ఏర్పడింది. చరిత్రకు ముందున్న రోజులలో మధ్య, తూర్పు ఐరోపాలోని అడవులలో ట్యుటానిక్ జాతులు ఆటవికంగా నివసించేవి. క్రైస్తవమతం వారిని నాగరీకులుగా రూపొందించింది. ఆ జాతుల పురాణగాథల వలన జర్మనీ సంస్కృతి ఉత్తేజం పొందినది. పురాణవీరుడైన సైగ్ ఫ్రయిడ్ (SIEGFRIED) జర్మనీ పురుషాధిక్యతకు ఆదర్శప్రాయుడయ్యాడు. టాసిటస్ చిత్రించిన ట్యుటాన్ భయంకర స్వరూపానికి ఇతడు ప్రాతినిధ్యం వహించాడు. ప్రాచీన జర్మనీ జాతులు ఆటవికంగా, జిత్తులమారిగా, మోసపూరితంగా, సాహసోపేతంగా ఉండేవారు. సైగ్ ఫ్రయిడ్ చాలా

శక్తివంతుడూ ఎదురు లేనివాడూ. అతడు అదృశ్యాకారుడు. భయంకర జంతువు రక్తంలో అద్భుతంగా స్నానంచేసిన కారణంగా ఇతడికి ఆ పేరు వచ్చింది. అతీత మానవుడికి ఇతడు నమూనా. సైగ్ఫ్రయిడ్‌ను ఆదర్శంగా పెట్టుకుని, అత్తిల నుంచి బిస్మార్క్ వరకు జర్మనీలో చారిత్రక వీరులందరినీ జాతీయవాద సాహిత్యంగా అభివర్ణించింది.

అటువంటి పుక్కిటి పురాణాలు, గాథలు అల్లడంలో కవులూ, కథకులూ, చరిత్రకారులమని చెప్పుకునేవారు కొందరూ నిమగ్నులై ఉండగా, ఆధునిక జర్మనీ జాతీయవాద తత్త్వవేత్తగా ఫిషె ఆవిర్భవించాడు. జాతీయవాదంతో ఉదారవాదం కలిసిపోయినంత వరకు, ఫిషె ఉదారవాదే, సోషలిజానికి నాంది పలికినవాడుగా, "ప్రజల మనిషిగా" అతడిని శ్లాఘించారు. అయినప్పటికీ జర్మన్ ఫాసిజానికి చెందిన నార్‌డిక్ జాతి ఔన్నత్య గాథకు ఇతడు ప్రవక్త అయ్యాడు. జర్మనీవారు శుద్ధమైన రక్తం గలవారనీ, "ప్రకృతి మార్మిక శక్తులు" వీరికున్నాయనీ అతడు వర్ణించాడు. జాతి పవిత్రత వలన జర్మనీవారు "ఎంపిక అయిన ప్రజలనీ అతిభౌతికంగా నిర్ధారితులనీ, నైతికహక్కు ఉన్నవారనీ, ఒత్తిడి జిత్తుల వలన తమవిధిని సాధించగలరని" పేర్కొన్నాడు. (ఫిషె, స్పీజెస్ టు ది జర్మన్ నేషన్). నైతిక ప్రమాణాలలో ద్వంద విధానాన్ని ఫిషె ప్రభోదించాడు. (విమోచన సమరాల అనంతరం ఫిషె వేసిన పునాదుల ఆధారంగా ప్రాచీన జర్మనీయొక్క జాతీయవాదం మళ్ళీ కొత్తపుంజాలను వెదజల్లుతున్నది. స్టెయిన్, ఆంట్ ఆవిర్భవించిన అనంతరం 1813లో జర్మనీని అంధకారంనుంచి అత్యున్నతస్థాయికి వీరు తీసుకుపోయారు. (ఆల్‌ఫ్రెడ్ రోజన్‌బర్గ్, MYTHUS). వ్యక్తిచేస్తే మోసపూరితమైనదిగా భావించినదానిని, రాజ్యంచేస్తే పవిత్ర విధిగా పేర్కొన్నారు. "రాజ్యాలమధ్య బలవంతుడి చట్టం మినహా మరేహక్కూ నియమమూ లేవు." (ఫిషె, స్పీచెస్ టు ది జర్మన్ నేషన్). చట్టాన్ని ఉల్లంఘించడం, హింసాయుత చర్యలు, మోసం ఇత్యాది సాధనాలేవి ప్రయోగించినా రాజ్యపరంగానైతే తప్పులేదు. జాతి సమష్టి ఇచ్ఛను అమలు పరచడానికి చట్టాలు పరిమితులు విధించవు. ఫాసిజానికి ఇదీ మూలం. దీనిని రూపొందించినవాడు ఉదార తత్త్వవేత్త. అప్పటికే పెట్టుబడిదారీ విధానం ఇంతా పరిణితి దశలోనే ఉన్నది. కమ్యూనిజం నాటికి మార్పు వూహాలోనే జనించలేదు.

ఫిషెలో అంతర్లీనంగా ఉన్న సాంస్కృతిక సంకుచితవాదం, ఉగ్రవాదం, ఉద్వేగపూరిత జాతీయ వాదమూ ఇత్యాదులన్నీ అనేకమంది రచయితలు,చరిత్రకారులు విశ్వవిద్యాలయాల్లో ప్రొఫెసర్లూ ఇంకా విపులీకరించారు. మొదటి ప్రపంచయుద్ధానికి ముందే రెండు తరాల జర్మన్ యువకులపై ఉద్వేగ, మేధస్సు రంగాలలో చాలా

శక్తివంతమైన ప్రభావాన్ని వీరంతా కలిగించారు. జర్మన్ పెట్టుబడిదారీ విధానం వర్ధిల్లుతుండగా, జర్మన్ సామ్రాజ్యం నిలదొక్కుకొనగా, ఆ సమయంలో జర్మనీకి ప్రపంచవ్యాప్తంగా సాధించవలసిందేదో ఉన్నదంటూ ఫాసిస్టు సిద్ధాంతం, ఆచరణ అమోదయోగ్యమయింది.

19వ శతాబ్దాంతంలో పాల్ డ లగార్డ్, జులియస్ లాంగ్ బెన్ గారలు ఉభయులూ ఫిషె జాతీయవాద తత్త్వాన్ని, అందులో ఉండిన మార్మిక భావాన్ని పెంపొందించారు. అంతర్ముఖి ఆచారాన్ని వీరు ఆరంభించి, జర్మనీ జాతియొక్క నైతిక ఆధిక్యతకు పునాదులను కట్టుదిట్టంచేసారు. గష్టావ్ ఫ్రెన్‌సన్, విల్ హెల్మ్ షాఫర్, హాన్స్‌గ్రీన్ మొదలగువారు ఈ మార్మికాచారాన్ని ఛాందసంగా ప్రభోదించారు.

జర్మనీ విస్తరణ వాదానికి సిద్ధాంతకర్త డ లగార్డ్. బిస్మార్క్‌యొక్క సుప్రసిద్ధ సిద్ధాంతాన్ని (DRALG LACH OSTEL) ఇతడు కట్టుదిట్టంగావిస్తూ ఇలా వ్రాసాడు. "మనకు తూర్పునఉన్న పొరుగు వారిని జర్మనీలుగా మార్చడం అభిలషణీయమైన చర్య అవుతుంది. రష్యా మరొక మూడువందల మైళ్ళు తూర్పుగా జరిగిపోయి 'మధ్య ఆసియాకు' వెడితే మంచిది. అట్లా పోవడానికి రష్యాగనుక నిరాకరిస్తే, మనమే యుద్ధంచేసి మరీ భుక్తంచేసుకోవాల్సి వస్తుంది (PAUL DE LAGARDE SCHRIFTEL FUER DEVTSCHLALD). హౌస్టన్ ఛాంబర్లేన్ అనే ఆంగ్లేయుడు జర్మనీ పౌరుడుగా మారి, సాంస్కృతిక సంకుచిత వాదంతో, తప్పుడు విజ్ఞానవాదంతో కూడిన జర్మనీ నైతిక ఆధిక్యతను, మార్మికమైన ప్రమాణాలను ప్రభోదించాడు. ఇతడు ఫ్రెంచి ఆదిమానవ శాస్త్రజ్ఞుడైన గోబినాకు శిష్యుడు. హిట్లర్ జాతీయ సోషలిజానికి సిద్ధాంతకర్తగా ఉండిన ఆల్‌ఫ్రెడ్ రోజెమ్‌బర్గ్‌కు ముందున్నవాడు గనుక ఫాసిజంయొక్క వర్గసిద్ధాంతమూ కాదు ఆర్థికంగా నిర్ధారితమైనది కాదు.

ట్రైట్‌షెక్ (TREITZSCHKE), అనే చరిత్రకారుడు స్లావ్ జాతికి చెందినవాడు. ట్యుటాన్ జాతుల ప్రాచీన పోరాట గాథలను తన వూహలతో జోడించి వ్రాసి, జర్మనీ జాతీయవాదానికి సాంస్కృతిక పునాదులను కల్పించాడు. ''పుట్టుకతోనే దండయాత్రికుడైన ట్యుటాన్ ఎక్కడున్నాసరే తన ఆస్తిని స్వీకరిస్తాడు. చరిత్రకు యుద్ధమే ఉన్నతన్యాయస్థానం". (HEINRICH VON TREI TZSCHKE, History of Germany). అట్లాంటి సూత్రాలతో జర్మనీయువతరాన్ని ట్రైట్‌షెక్ రెచ్చగొట్టాడు. వారంతా సైస్‌ఫ్రెడ్‌వలె అతిమానవులు కావాలని కాంక్షించాడు. ఈ విధంగా ఫాసిజానికి పునాదులు ఆర్థికంగాగాక, ఉద్రేకపూరితంగా పడినవి. తాత్త్వికంగా వచ్చిన ప్రతిచర్య వాతావరణంలో వివేచనారహిత ధోరణి ప్రబలింది.

"1930లో రైష్టాగ్‌లో 30 రాజకీయ పక్షాలున్నాయి. సిద్ధాంతపరంగాచూస్తే వాటిని రెండు ముఠాలుగా విభజించవచ్చు. మితవాద అభ్యుదయ పక్షాలు మాత్రం కాదు. వివేచనావాదానికీ వివేచనా రాహిత్యతకూ జరిగే సంఘర్షణలలో ఈ రెండుముఠాలు ఉన్నాయి. వేదికపై ఉపన్యసించే వివేచనతోవాదించే మేధావులూ, ఉద్రేకాలను రెచ్చగొట్టే మూకస్వామ్య నాయకులూ వెల్లడించిన ధోరణులన్నీ ఈ ముఠాలో కనిపించాయి. నాజీజర్మనీ ముందున్న రాజకీయరంగంలో వివేచన, వివేచనారాహిత్య శక్తులమధ్య సంఘర్షణే ఇదంతాను" (ఫ్రెడరిక్ కార్ల్‌సెల్, ది జర్మనీ ఫ్రీ నాజీ పొలిటికల్ థాట్, ట్వెంటియత్ సెంచరి పొలిటికల్ థాట్, ఫిలసాఫికల్ లైబ్రరీ న్యూయార్క్).

షోపెన్‌హార్ వివేచనపై తిరుగుబాటు ప్రారంభించాడు. 19వ శతాబ్దంలో కళ, సాహిత్యం, తత్త్వంలో ఇది ప్రతిబింబించింది. తరువాత ఫాసిజానికి ఇదే నాంది పలికింది. ఫిషె ఉద్వేగవాది అయినా పూర్తిగా వివేచనారహితవాదికాడు. షోపెన్‌హార్ ద్వారా జర్మనీలో ప్రవేశించిన తాత్త్విక ప్రతిచర్య స్రవంతిలో అతడు కొట్టుకపోలేదు. కాంట్ శిష్యుడయిన షోపెన్‌హార్, టైక్-నోవాలిస్ వర్గ ప్రభావానికి గురయ్యాడు. అయితే పునర్వికాస ఉద్వేగవాదానికి అతడు స్వస్తిపలికి, ప్రతిచర్యతో కూడిన నిరాశావాదంలో సేదతీరాడు. ఫ్రెడరిక్ ష్లెగల్ ఇతడికి భారత మార్మికవాదాన్ని పరిచయంచేసాడు. షోపెన్‌హార్ అంతర్వాణిని విన్నాడు. సత్యం అతనికి సాక్షాత్కరించింది. The world as will and idea అనేటువంటి అతడి ప్రధాన గ్రంథంలో కొన్ని భాగాలు పవిత్ర పరికించగా వ్రాసానన్నాడు.

కాంట్ నిశిత తత్త్వంలో యదార్థవస్తువు (Thing-in-itself) అనే భావన నిర్వీర్యమయినది. మార్మికమయిన అతిభౌతికతలోనికి వెళ్ళిపోయినస్థితి ఇందులో కనిపిస్తుంది. ఒక విధంగా హెగెల్, ఫీషెలు కూడా ఈ భావాన్ని తృణీకరించారు. షోపెన్‌హార్ ఇందుకు విరుద్ధంగా చేసాడు. బహుశా హెగెల్‌పై ద్వేషంతో ఇలా చేసి ఉండవచ్చు. (హెగెల్‌కు గల బహుళ ప్రచారాన్ని చూసి షోపెన్‌హార్ అసూయపడినమాట వాస్తవం. హెగెల్‌ని మించిపోవాలనే ఉద్దేశంతో బెర్లిన్ విశ్వవిద్యాలయంలో సరిగ్గా హెగెల్ క్లాసులు తీసుకునే సమయానికి షోపెన్‌హార్ కూడా తన క్లాసులు నిర్వహించేవాడు. అయితే హెగెల్ తరగతులు కిటకిటలాడి పోతుండగా, షోపెన్‌హార్ వట్టి బెంచీలకు చెప్పవలసివచ్చేది. షోపెన్‌హార్ నిరాశావాదానికి ఈ చేదు అనుభవం కారణమని అతడి చరిత్రను రాసేవాళ్ళు పేర్కొంటారు. ఉద్రేకంగా ఎలాంటి ప్రతిక్రియ ఉన్నప్పటికీ, హెగెల్ విమర్శకు బాగా గురైన కాంట్ భావాన్ని షోపెన్‌హార్ పెంపొందించాడు). పదార్థవస్తువు అంటే ఇచ్ఛ అని వ్యాఖ్యానించాడు. కాంట్ హేతువాదానికీ ఇతడి వ్యాఖ్యానానికీ కనిపించేటంత తేడా నిజంగాలేదు. కాంట్

నీతిశాస్త్రంలో అంతర్లీనంగా ఇచ్ఛకు ఆధిక్యత ఉన్నది. సంకల్పంలో ఉన్న తేడాల వలననే మానవులలో మంచిచెడ్డలు ఉన్నాయని కాంట్ భావించాడు. అతిభౌతికమయిన నీతి సూత్రానికి ఇచ్ఛతో చాలా సంబంధమున్నదని అన్నాడు. కాంట్ అతిభౌతిక వాదంలో అంతర్లీనంగా ఉన్న విషయాన్ని షోపెన్‌హార్ బహిర్గతం చేస్తూ, ఇచ్ఛ అనేది ఏకైక సత్యమనీ, వ్యక్తిఇచ్ఛకు విశ్వసంకల్పానికి తాదాత్మ్యం కల్పించాడు. (విశాలమైన ఇచ్ఛ ఒక్కటే వాస్తవమైనది. జీవ అజీవ ప్రపంచానికంతటికీ ఇది సమంగా ఉంటుంది. బెర్ట్రాండ్ రస్సెల్).

ఒక మర్మజ్ఞానం బదులుగా మరొక మర్మభావాన్ని ప్రవేశపెట్టినంత మాత్రాన స్పష్టమయిన వ్యాఖ్యానంచేసినట్లు కాదు. షోపెన్‌హార్ ఇచ్ఛను ఇలా నిర్వచించాడు : "ఉనికి అంతటికీ ఆద్యంతాలు, మూలసూత్రం ఇదొక్కటే. జీవితాన్ని దానికి సంబంధించిన అన్ని దృక్పథాలను ప్రపంచ సంఘటనలను జనింపచేసేది ఇచ్ఛ అనే శక్తిమాత్రమే జగత్తే దైవం అనే మర్మభావానికి దగ్గరగా ఈ నిర్వచనం ఉన్నది. కానీ హఠాత్తుగా ఇందుకు వ్యతిరేకమైన ధోరణిలో కూడా పయనించకపోలేదు : ఇచ్ఛ అనేది కారణ రహితమూ, ఉద్దేశ్యం లేనిదీ, గుడ్డిప్రేరణాను. షోపెన్‌హార్ యవ్వనంలో పెంపొందించిన ఉద్వేగవాదం కాస్తా అతడి పరిణితిచెందిన తత్త్వపు విధివాదంలో కొట్టుకపోయింది. అందువలన గ్రీక్ వివేచనాయుత మానవత్వంనుంచి అతడు మారిపోయి జగత్తే దైవం అని హిందూ మర్మభావానికి ఆకర్షితుడైనాడు. అయితే వాస్తవానికి జగత్తే దైవమని షోపెన్‌హార్ భావించలేదు. అతడు చెప్పే జగదేచ్ఛకూ స్పినోజా చెప్పేదానికి తేడా ఉంది. షోపెన్‌హార్ జగదేచ్ఛ దైవంకాదు. మానవుడిలో మంచితనానికి ధర్మానికి ప్రతిరూపంకూడా కాదు. ఇందుకు విరుద్ధంగా చెడుకు, కుటిలత్వానికి, బాధలకు మూలమే షోపెన్‌హార్ చెప్పిన ఇచ్ఛ. కనుక జ్ఞానం పెరిగేకొద్దీ దుఃఖంకూడా పెరుగుతుంది. ప్రపంచం అంతా విశాల కారాగారం. దానినుంచి తప్పించుకునే మార్గంలేదు. తన ఇచ్ఛవలన మానవుడు శాశ్వతంగా బానిస అయ్యాడు. జగదేచ్ఛలో భాగంగా ఉన్న మానవేచ్ఛను మానవుడు అదుపులో ఉంచలేడు. స్వేచ్ఛాన్వేషణ అనేది భ్రమ. అతడు ఆవిర్భవించినప్పటినుండి తప్పుదారి పట్టించేదానికి ఇది తోడ్పడుతుంది. అందని చందమామ వంటిది స్వేచ్ఛాపిపాస. జగదేచ్ఛ విషవలయం. దానినుంచి మానవుడికి మార్గాంతరం లేదు. శక్తినిస్తుందనుకున్న జ్ఞానం మానవుడి బంధాలను దృఢం చేస్తున్నది. మేధస్సు, తెలుసుకునే శక్తికూడా ఇచ్ఛనుంచి జనించినవే గనుక జ్ఞానం ఏవిధంగానూ సహకరించదు. "మనస్సు కేవలం ఇచ్ఛకు సాధనమని షోపెన్‌హార్ ప్రతిపాదన చాలా హాస్యాస్పదమైనట్టిదీ, కించపరిచేదీను. మానవజాతి శక్తినంతటినీ భ్రమగా భావిస్తున్నది. మేధస్సుకు షోపెన్‌హార్ ఇచ్చిన స్థితి

తల్లక్రిందులుగా ఉన్నది. ఇచ్ఛచేతిలో మనస్సు కీలుబొమ్మ అని అతడు భావించాడు. మానవుడి ప్రేరణలను హేతుబద్ధం చేయడానికి, నైతిక ఉద్దేశాలు అంటగట్టడానికి ఇతడు ప్రయత్నించాడు." (థామస్‌మన్, ది లివింగ్ థాట్స్ ఆఫ్ షోపెన్‌హార్).

సంస్కరణవాదం వలన తాత్త్విక ప్రతిచర్య జనించగా, అది అనుకోకుండా బ్రిటిష్ ప్రాపంచికానుభవ వాదానికి సహకరించింది. రూసో దీనినే చేపట్టాడు. షోపెన్‌హార్‌లో ఇది పరాకాష్ఠనందుకున్నది. "ఇచ్ఛ అత్యంత ప్రధానమయిందనే సిద్ధాంతాన్ని ఏదోఒక రూపంలో ఆధునిక తత్త్వవేత్తలలో చాలామంది ముఖ్యంగా ఫిషె, బెర్గ్‌సన్, జేమ్స్, డ్యూయిలలో చూడవచ్చు. ఇచ్ఛను ఎంత స్థానంలో ఉంచితే జ్ఞానాన్ని అంతతక్కువ స్థాయిలో అట్టిపెట్టారు. తాత్త్విక ధోరణిలో వచ్చిన ఈ మార్పు ఈ కాలంలో గమనార్హం. రూసో-కాంట్‌లు దీనిని ప్రతిపాదించగా షోపెన్‌హార్ మొట్టమొదట ఇచ్ఛ పవిత్రమయిందని ప్రకటించాడు. (బెట్రాండ్ రస్సెల్, హిస్టరీ ఆఫ్ వెస్టరన్ ఫిలాసఫీ").

షోపెన్‌హార్ శిష్యుడనని చాటిన నిషె, ఇచ్ఛకు సర్వశక్తివంతగుణాన్ని ఆపాదించి, వీరుడి మానవద్వేషాన్నీ క్రూరత్వాన్నీ ఒక ఆధారంగా రూపొందించాడు. కాంట్‌ను "నైతికఛాందసులు"గా ఖండించిన నిషె, ఒక ప్రత్యేక వర్గానికి చెందినవాడు. జర్మనీ సంప్రదాయ తత్త్వంనుంచి సాధారణ తాత్త్విక ప్రతిక్రియనుంచి విభేదించి ఇతడు తనమార్గాన్ని అనుసరించాడు. క్రైస్తవమత పిడివాదాలలో విశ్వాసాన్ని విజ్ఞానం వచ్చి నాశనం చేయడం వలన విలువలన్నీ పోతున్నాయని, "జీవితాన్ని కాదన్నట్లయిందని" భావించాడు. 19వ శతాబ్దంలోని సహజవాదం కేవలం ప్రక్కదారులు పట్టించిన పద్ధతిని, జీవితానికి కొత్త అర్థాన్నివ్వలేక పోయిందని అన్నాడు. "తాత్త్విక విధానాలు వాటి స్థాపకులకు మాత్రమే అంతా వాస్తమనిపిస్తుంది. తరువాతవచ్చిన తత్త్వవేత్తల దృష్టిలో ఈ విధానమంతా తత్త్వం ప్రారంభించిన తిరుగుబాటును కొనసాగించడానికి జ్ఞానాభివృద్ధి తోడ్పడింది. అయితే ప్రకృతి సంఘటనలన్నింటినీ విజ్ఞానం పూర్తిగా వివరించలేకపోయింది. ముఖ్యంగా, జీవశక్తి, మానసిక రీతులను సరిగా వివరించలేకపోయింది. దీనివలన తాత్త్వికాలోచన గందరగోళం కావడానికి మతాధిపత్యం తోడ్పడింది. భావవిమోచనకు కృషిచేయడంలో మానవుడి మార్గానికి అడ్డంకి ఏర్పడింది. నాగరికత ఆవిర్భవిస్తున్నప్పుడు కూడా సరిగా, ఇలాగే జరిగింది. ప్రత్యక్షజ్ఞానం అసంపూర్తిగా ఉన్నందున అలౌకిక శక్తులను వూహించారు. చిట్టచివరకు 19వ శతాబ్దంలో, వివేచనకూ-వివేచనారాహిత్యానికీ, విజ్ఞానపరమైన సహజవాదానికీ-వివిధ ముసుగులలో ఉన్న అలౌకిక వాదాలకూ, మతరాహిత్యానికీ-పారలౌకికవాదానికీ, పదార్థవాదానికీ-ఆధ్యాత్మికవాదానికీ సంఘర్షణగా తత్త్వం రూపొందినది. ఒకమాటలో

చెప్పాలంటే జ్ఞానానికి విశ్వాసానికీ సంఘర్షణ జరిగింది. కొత్త తత్త్వాన్ని అనుసరించి జరగవలసిన తార్కిక పరిణామం జరగకపోగా అందుకు విరుద్ధంగా ఆలోచనా స్రవంతి పోవడంకూడా తత్త్వబద్ధంగానే జరిగింది. అంతకుముందు శతాబ్దాల్లోని మానసిక అలవాట్లు ఉద్రేకరీతులు క్రమంగా అదృశ్యంకావడం ఈ విధానంలో చూడవచ్చు.

తాత్త్విక ఆలోచనలలో వచ్చిన సంక్షోభం రాజకీయ, సాంఘిక సిద్ధాంతాల మధ్య విస్తృతమౌతున్న విరుద్ధాలలోను, అలాగే ఆచరణలో కూడా వచ్చిన పరస్పర విరుద్ధాలు గమనించవచ్చు. 19వ శతాబ్దపు అనుభవ సారాంశం ఏమంటే మానవుడు తనలో–విశ్వాసాన్ని కోల్పోవడమే. వ్యక్తివాదానికి సమష్టివాదంవలన గ్రహణం పట్టింది. రాజకీయస్వేచ్ఛా, సాంస్కృతిక స్వతంత్ర ప్రతిపత్తీ, మేధారంగంలో స్వేచ్ఛా అన్నీ నియంతృత్వానికి బలైనాయి. నియంతృత్వం వలన ప్రజాస్వామ్యం ప్రమాదంలోపడింది. అదే సమయంలో జ్ఞానాభివృద్ధి జరగడంతో ప్రకృతిపై పరిశోధనల వలన అనేక నూతన విషయాలు తెలిసాయి. మానవుడి ఉనికి మార్పుల గురించి ఎన్నోవిషయాలు బయల్పడినవి. మానవ స్వభావంలోనే మర్మం బైటపడింది. నాగరికత పుట్టినప్పటినుంచీ మానవుడు మేధస్సులోనూ సాంస్కృతికా నైతికా ఆదర్శాలలోనూ చేస్తున్న ప్రయత్నాలకు కొత్త అర్థంవచ్చింది. స్వేచ్ఛ అనేది అందని ఆశకాదనీ, జ్ఞానం కేవలం భ్రమ కాదనీ, నీతి ఒకమర్మం కాదనీ, సత్యమనేది రూపురేఖలు లేని అతిభౌతికం కాదనీ తేటతెల్లమయింది. సంప్రదాయబద్ధంగా వస్తున్న ఈ ఆదర్శాలన్నీ మానవుడు గ్రహించడానికి వీలైనవని, మానవ ప్రయత్నానికి అందుబాటులో ఉండేవని తెలిసింది. జ్ఞానాభివృద్ధి వలన సృజనశక్తి కూడా విస్తరించి వీటన్నింటికీ మద్ధతును చేకూర్చింది.

"సంప్రదాయబద్ధంగా వస్తున్న అబద్ధాల" పై 19వ శతాబ్దానికి చెందిన నాగరికతపై తిరుగుబాటు చేయాలని, కొత్త పునర్వికాసం పిలుపునిచ్చింది. ఈ తిరుగుబాటుకు నిషె మారురూపంగా నిలిచాడు. మేధస్సుతో కూడిన జీవితానికి, దిగజారిపోతున్న నైతిక వ్యవస్థకు ఎంతో గందరగోళం ఆవరించి ఉండగా, ఈ సంఘర్షణలకు నిషె వ్యక్తిత్వాన్ని కల్పించాడు. ఆత్మవంచన చేసుకోవడంలో చాలామంది సఫలీకృతులయ్యారు. నిషెకు ఆకళ తెలియదు. ఉద్రేకాల సంఘర్షణకు తద్వారా జనించిన రుగ్మతను అతడు అనుభవించాడు. దానివలన అతడికి పిచ్చెత్తినట్లయింది. (నిషె జీవితాన్ని కొత్తగా అధ్యయనం చేసినందువలన ఈ అభిప్రాయం వ్యక్తమయింది. 'నిషె బలహీనుడు సున్నితమయినవాడు... సునిశిత మనస్కుడు. తన రుగ్మతను గ్రహించినవాడు. దీనిపై పగ తీర్చుకోవడానికి అతడు గట్టి మనస్తత్వాన్ని శ్లాఘించాడు. జీవితంలో భౌతికానందాలను అనుభవించే శక్తి లేక వాటిపై పగ తీర్చుకోవడానికి గ్రీక్ నియంత డైనీషియల్ వెర్రి ఆవేశాలను ప్రస్తుతించాడు.' (హెచ్.ఎ. రైబ్నర్, నిషె

: ది స్టోరీ ఆఫ్ ఎ హ్యూమన్ ఫిలాసఫర్).

19వ శతాబ్దం ప్రత్యక్షంగా సాధించిన వాటిపైన ఒక సిద్ధాంతం, వినాశనం గావించిన వాటిపై మరొక సిద్ధాంతం చారిత్రక పాత్రను నిర్వహిస్తున్నట్లు ఫాసిజం, కమ్యూనిజం పేర్కొన్నాయి. నిషె, సిద్దాంతంలోగాని ఆచరణలోగానీ వీటికి ఆధారం లభించలేదు. కానీ నిషె నిర్వచించిన డైనిషియన్ నియంత పాత్ర చాలా ఆధిపత్యం వహించింది. ఆధునిక నాగరికతను అతడు కొట్టిపారవేయడంతో ఫాసిస్టులు నిషెను తమ తత్త్వవేత్తగా భావించారు. సోషలిజానికి,అంతకంటే ఎక్కువ జాతీయవాదానికి నిషె వ్యతిరేకి. "ఐరోపా జాతీయవాద రుగ్మతతో బాధపడుతుండగా, స్వాతంత్ర్యం కొరకు యుద్ధంచేసిన జర్మనులు అర్థం పర్థం లేకుండా గుడ్డి మార్గంలో పడిపోయారని నిషె అన్నాడు – ECCE HOMO). నిషె చిత్రించిన అతి మానవుడు "మంచి ఐరోపా వ్యక్తి". మేధస్సు సంస్కృతి, నైతిక విలువలు, ఆధునిక నాగరికతతో ఉన్నంత మేరకు అతి మానవుడు వాటికి ప్రతిరూపంగా ఉంటాడు. జర్మనీ ధోరణికి అవి సరిపడవని, దిగజారిపోయిన వాటినన్నింటిని నాశనం చేయాలని ఫాసిస్టులు తలపెట్టారు. "మంచిచెడ్డలకు అతీతం" అనే నిషె భావాలను నాజీలు, నీతిని కాదనే తమ ధోరణికి అనుకూలంగా సమర్థించుకోవడానికి అడ్డం పెట్టుకున్నారు. మంచి చెడ్డలను నిషె విడమర్చి చూపాడు. ఈ మాటలకు సాంప్రదాయానుసారంగా వస్తున్న అభిప్రాయాలు దీని వలన జనించిన "బానిస నీతిపై"నా తిరుగుబాటు ప్రకటించడమే నిషె ఉద్దేశం. దోషమనే భావాన్ని అపహాస్యం చేయడంలో, షోపెన్‌హార్ తత్త్వాన్ని నిషె దృష్టిలో పెట్టుకున్నాడు. మంచిచెడ్డలనేవి దేవుడూ దెయ్యానికీ ప్రాతినిధ్యం వహిస్తాయని నిషె సిద్ధాంతం పేర్కొంటున్నది. వూహాతీతమైన ఈ మహాశక్తుల మధ్య మానవుడు నిస్సహాయకుడుగా మారిపోయాడు. బహుశా గెటె పాత్ర మెఫిస్టో ఫిలస్ నమూనాగా నిషె అతిమానవుడిని రూపొందించి ఉండవచ్చు. చెడ్డగా ఉండే సాహసంగాని, మంచిగాఉండే సత్తాగాని లేని మానవుడి నటన చూసి, మానవ ద్వేషి అయిన తత్త్వవేత్త గెటె నవ్వుకున్నాడు. మంచిచెడులనే రెండు సూత్రాలు ఒక శాశ్వతమయిన సిద్ధాంతంగా నిషెను ఆకర్షించి ఉండాలి. దీనివలననే అతడు క్రైస్తవమతంలో ఆసక్తిని కనబరిచాడు. ఈ రెండు సూత్రాలకు దైవమే రూపంగనుక, తార్కికంగా చూస్తే మంచి చెడ్డలకు అతీతంగా పోవడమే ఆధ్యాత్మిక స్వేచ్ఛ అవుతుంది.

వాగ్నర్ ప్రభావం క్రింద తొలుత నిషె తన తత్త్వాన్ని ప్రారంభించాడు (ది బర్త్ ఆఫ్ ట్రాజెడీ ఫ్రమ్ ది స్పిరిట్ ఆఫ్ మ్యూజిక్). గ్రీకుల సంస్కృతిలో డైనీషియా అపోలో మధ్య ఉన్న సంఘర్షణలను ఎంతో చాకచక్యంతోను కావాలని అతిశయోక్తిగా చేసిన కవిత్వపు వూహలతోను ఇతడు చిత్రీకరించాడు. డైనీషియా ధోరణి బలానికి నిరంతర

విలాసాలకు ప్రాతినిధ్యం వహిస్తుంది. జయించాలని మానవుడిని పురిగొల్పుతుంది. మార్మికమయిన పారవశ్యంలో ముంచెత్తుతుంది. ప్రేమ చావులకు ప్రాతినిధ్యం వహిస్తుంది. ఇందులో కవిత్వపు అతిశయోక్తులను తొలగించి చూస్తే మానవుడి స్వేచ్ఛాపిపాస, జీవితంలోని ఈ ప్రేరణను గురించి చైతన్యంగా ఉండటం, ప్రకృతిని జయించే తన శక్తిలో విశ్వాసం, సృజనాత్మక శక్తిని గమనించడం జీవితానందాలను అనుభవించడం, చావుకైనాసరే వెరవకుండా అనుభవాన్ని పొందడం, ఇత్యాదులన్నీ ఈ ధోరణిలో ఉన్నాయి. నిషె తత్త్వాన్ని కవిత్వపు మలుపులు ధోరణులనుంచి విడదీసి చూడలేము.

డెమోక్రటిస్ నుంచి ఎపిక్యులస్ వరకూ ఉన్న తత్త్వవేత్తలకు సంబంధించిన విషయాన్నే నిషె, డైనీషియా ధోరణిగా పేర్కొన్నాడు. సోక్రటిస్, యూరిపిడిస్, ప్లేటోల నాయకత్వంవచ్చి వీరందరినీ మించిపోగా అది అపోలో ధోరణిగా చిత్రీకరించారు. అపోలో ధోరణి అంటే శాంతిని కోరడం, సమన్వయంగా ఉండటం, జీవితపు ప్రేరణలను అదుపులో ఉంచడం అని ఇతడు పేర్కొన్నాడు. ఈ విధమయిన పోలిక చేసి నిషె, మార్మిక అతిభౌతిక ధోరణి బానిస మనస్తత్వానికి బానిస భావానికి దారితీస్తుందని చెబుతూ తాను సహజవాదాన్ని కోరుతున్నట్లు చెబుతున్నాడు. డైనీషియా సంస్కృతిలో మానవుడి స్వేచ్ఛా పిపాసకు సృజనశక్తికి పూర్తి అవకాశాన్ని కల్పిస్తున్నది. అదే సరైన మానవత్వ విధానం. అపోలో ధోరణి మానవుడి ప్రతిభకు హద్దు ఏర్పరుస్తుంది. మార్మిక, అతివాద సరిహద్దులలో మనిషి లొంగిఉండేటట్లు చేస్తుంది. దేవుళ్ళను సృష్టించి మనిషిపై పెత్తనం చెలాయింపచేస్తున్నది.

19వ శతాబ్దంలో రెండు ధోరణులకు మధ్య వచ్చిన సంఘర్షణ నిషె కవిత్వంతో కూడిన తత్త్వంలో వ్యక్తంకాగా అతడు డైనీషియా ధోరణిని అనుకూలించాడు. మానవుడి ప్రతిభ స్వేచ్ఛగా వ్యక్తంకావడానికి ఆటంకం ఉన్నంతవరకు ఈ వైఖరి వినాశకరమైనట్టిది. తార్కికంగాచూస్తే తాత్త్విక ప్రతిక్రియపై ఇతడు తిరుగుబాటు చేసాడు. మానవుడు ఆధ్యాత్మిక, మార్మిక, దేవుళ్ళ ఆధారంలేకుండా స్వశక్తిపై నిలబడలేడేమోనని సందేహించడం మానవశక్తిని నిరాకరించడం తాత్త్విక ప్రతిచర్యలో ఉన్నవి.

19వ శతాబ్దపు సంస్కృతి విచ్ఛిన్నం అవుతుండగా నిషె దానిని ఎదుర్కొని, బాధామయమైన ప్రపంచానికి తన జీవితం ప్రతీకగా ఉన్నట్లు భావించాడు. బాధను పరిష్కరించడం అతడి తత్త్వానికి మూలమయింది. "WILLE ZUR MACHT" అనే సుప్రసిద్ధమయిన సూత్రంలో పరిష్కారాన్ని కనుగొన్నాడు. సత్సంకల్పం అనే అతిభౌతిక భావంనుంచి కాంట్ తన నైతిక విధానాన్ని రాబట్టాడు. నిర్ధారితమయిన విశ్వంలో ఇది పై తొడుగుగా ఉన్నది. మానవేచ్ఛ ఆధారంగానే స్థిరమయిన విలువలలో

రూపొందించవచ్చునని నిషె అన్నాడు. జీవితంలో విధివాదం ఉన్నదని వైజ్ఞానిక సహజవాదం చూపుతున్నట్లు నిషె వాదించాడు. అక్కడే అతడు పొరపాటుపడ్డాడు. "ఆధునిక తాత్విక ధోరణి దైవశక్తిలో విశ్వాసాన్ని కొనసాగిస్తున్నది. ప్రతిదీ ఎలాఉండాలో మనమీదే ఆధారపడి జరుగుతున్నట్లుగా భావిస్తున్నారు. ఏదైనా ఉన్నతస్థితినుంచి భిన్నంగా ఉండాలని కోరుకోవడం, ప్రతిదీ భిన్నంగా ఉండాలని భావించడమే. దీనివలన ఉనికి అంతటినీ వ్యతిరేకించే ధోరణి వ్యక్తమవుతున్నది" (WILLE-ZUR-MACHAT).

మొత్తంమీద నిషె జీవితమంతా డైనీషియా పద్ధతిలోనే నడిచింది. అప్పుడప్పుడు చేసిన తప్పులను క్షమించవచ్చు. 19వ శతాబ్దపు విషాదాంతంతో ఇతడి జీవితం ముగిసింది. వివేచనావాదాన్ని ఖండించడం, వివేచనారహితవాదాన్ని అపహాస్యం చేయడం, సంప్రదాయవాదాన్ని విమర్శించడం, ఉద్వేగవాదాన్ని గర్హించడం, నీతిశాస్త్రాన్ని చెప్పబోవడం, నైతిక విలువనన్నింటినీ మానవ ద్వేషభావంతో నిరాకరించడం, జాతీయవాదాన్ని ఖండించడం, సోషలిజాన్ని వెక్కిరించడం ఇవన్నీ ఒకేసారి చేసాడు.

నిషెతో ఒకశకం అంతమయింది. మరొకశకం ఆరంభంకానున్నది. పరస్పర విరుద్ధాలుగా కనిపించే రెండు ఉద్యమాల ఆధిపత్యంతో ఈ కొత్త శకం ఆరంభమవుతున్నది. రెండు సిద్ధాంతాలూ అతడినుంచి ప్రేరణపొందినవే. వివేచనారహితవాదాన్ని ఘనంగా చూపెట్టినందుకు, వీరఆరాధన ఒక ఆచారంగా రూపొందినందుకూ అతనిని ఫాసిస్టులు తమ తత్త్వవేత్తగా భావిస్తున్నారు. మానవద్వేషవాదంలోనూ, పశుత్వంలోనూ, నైతిక శూన్యవాదంలోనూ, ఇతడినుంచి కమ్యూనిస్టులు పాఠాలు నేర్చుకున్నారు. నిషె తత్త్వం ఆర్థికంగా నిర్ధారణ అయిందికాదు.

నిషె తత్త్వంలో ఫాసిజానికి తోడ్పడే ధోరణులను, స్టీఫెన్‌జార్జ్, అతని అనుచరులు, ఒక వింత రూపంలో చూపెట్టారు. సోక్రటీస్ కాలంనుంచీ, ఐరోపాచరిత్ర అంతా "మేధస్సుపొందిన విజయంవలన విషాదాంతం అయింది" అని వారు ప్రకటించారు. అపోలో శక్యాంతరం ఇప్పుడు కొత్తగా డైనీషియా యుగం ప్రారంభం కావాలి. విశ్వమంతా మారిపోవాలని కలగన్నారు. ప్రజాస్వామ్యమనే బూటకం. మేధస్సుపేరిట నటన, అవినీతి, దిగజారుడు విధానం మొదలైన వాటిస్థానే అతీత మానవుడికి సంపూర్ణంగా లొంగుబాటు, విధేయత రావాలని, మానవ సంబంధాల శాస్త్రాన్ని చెప్పారు. రానున్న నాయకుడికి స్టీఫెన్‌జార్జ్ స్తోత్రపాఠం చదివాడు. "మా దేహాలను దున్ని వేయండి. ఎందుకిలా చేసావని ఎవరూ అడగరు." మొదటి ప్రపంచయుద్ధం వరకూ ఎవరో తెలియని స్టీఫెన్ నాజీ ఉద్యమ తాత్విక కవిగా సుప్రసిద్ధుడయ్యాడు.

నిషెనుంచి ప్రేరణ పొందాడు.

ఫాసిజం, కమ్యూనిజం రెండూ కూడా తాత్త్విక ప్రతిచర్య ఫలితంగా జనించినవే. "భౌతిక సిద్ధాంతాల సంక్షోభంవలన" ఈ ప్రతిచర్య ఇంకా బలపడి 20 శతాబ్దారంభంలో వివేచనారహిత వాదంగా మారింది. ప్రకృతి, చరిత్రకు సంబంధించి మార్క్సిస్ట్ నీతివాదాన్ని నమ్మిన కమ్యూనిస్టులు వివేచనా వాదులుగా కనిపించవచ్చు. కానీ నియతి వాదాన్ని ఇంత మొండిగా సమర్థించడమే వివేచనను తృణీకరించడం. అదొక అంధ విశ్వాసం. ఆ సిద్ధాంతం సంగతి అలా ఉంచి, ఆలోచనలో వారి ధోరణి అంతా ఉద్రేకాలను రెచ్చగొట్టడంగానే కనిపిస్తున్నది. మర్మమైన మూక శక్తిలో అంధవిశ్వాసాన్ని దోషాలు చేయమనడం వీరి లక్ష్యంగా కనిపిస్తున్నది. 19వ శతాబ్దపు ఉదార సంప్రదాయం, ప్రజాస్వామిక రీతులంటే, జుగుప్సను వ్యక్తపరచడంలో కమ్యూనిస్టులు ఫాసిస్టులకేమాత్రం తీసిపోలేదు. సమష్టివాదం నియంతృత్వపు మూసలో, అందరినీ ఒకే ధోరణిలో నడిపించడం యిరువురూ కోరారు. నీతిని గురించి ద్వేషభావాన్ని సమానంగానే వ్యక్తంచేసారు. నాయకత్వపు వీరి ఆరాధనను ఇద్దరూ ప్రభోదించారు. సిద్ధాంతపరంగా చూపే తేడా కృత్రిమమైనది. ఈ రెండింటికీ మధ్యవచ్చిన పోరాటం నాగరిక ప్రపంచాన్ని నాశనంచేసింది. ప్రపంచాన్ని అధికారంతో పాలించడమే వీరి లక్ష్యం.

జాతీయవాదం, సోషలిజం రెండూ సమష్టివాదాలే. నియంతృత్వ సిద్ధాంతాలే. ఇవి రెండూ కలిసి ఆధునిక సంస్కృతి నాగరికత ఆదర్శాలుగా ఉన్న తాత్త్విక వ్యక్తివాదం, విశ్వజనీన మానవతావాదంపై చావుదెబ్బ తీయడానికి సిద్ధంగా ఉన్నాయి. జాతీయవాదం, సోషలిజం రెండింటినీ ఫిషె ప్రభోదించడంలోనే, భవిష్యత్తులో వీటికలయికకు చిహ్నాలు కనిపించాయి. జర్మనీ జాతీయవాదం సోషలిజాన్ని గురించి మాట్లాడినట్లే, కమ్యూనిజం జాతీయవాదంతో చేతులు కలపడమేగాక జాతీయవాదంగా దిగజారిపోయింది. జాతీయ సోషలిజం, కమ్యూనిస్టు జాతీయవాదం రెండూకూడా బొమ్మాబొరుసూ వంటివి.

# 20 వ శతాబ్దపు సంక్షోభం

సమకాలీన ప్రపంచ పరిస్థితులను గమనిస్తే దిగజారిపోతున్నట్లుగా, పతనావస్థలో ఉన్నట్లుగా, నీతిరాహిత్యంగా కనిపిస్తున్నది. ఆధునిక నాగరికత సంపూర్ణంగా విచ్ఛిన్నం కావడం, సర్వనాశనంచేసే యుద్ధం రావడం మార్గాంతరాలుగా కన్పిస్తున్నాయి. చిన్నాభిన్నమయిన ప్రపంచం శాంతిని కోరుతుండగా, మరొక వైపున ఎటుచూసినా యుద్ధపు మాటలు వినిపిస్తున్నవి, అందుకు సిద్ధపడుతున్నట్లు కనిపిస్తున్నది. వివేచన ఉన్నవారెవరూ మరో యుద్ధాన్ని కోరుకోరు. అయినా, విధివలె యుద్ధంకూడా తప్పనిసరిగా కనిపిస్తుంది. మనిషికి తనపై తనకే విశ్వాసం పోయింది. మానవజాతి నిరాశలో ఒక హద్దుకు చేరుకున్నట్లున్నది. ఇదొక విచిత్రపరిస్థితి. మానవుడి సృజనాత్మక శక్తులు ఇంతకుముందెన్నడూలేనంతగా ఇప్పుడు బహిర్గతమవుతున్నవి. అతనికి తెలిసిందికూడా చాలా ఎక్కువగా ఉంది. పనులుచేసే శక్తికూడా అమేరకు హెచ్చుగానే ఉంది. అయినప్పటికీ ఏదో లోపించింది. మానవ సృజనశక్తికి ఆటంకం ఏర్పడుతున్నది. ముందుకుపోవాలనే అనంతమయిన తృష్ణనూ, మేధస్సు భావసంబంధమయిన అవరోధాలను ఛేదించడంలోనూ మానవుడు తన శక్తిని కోల్పోయినట్లయింది.

రాజకీయ సిద్ధాంతాలు, సాంఘిక న్యాయసూత్రాలు ఇంకా బోధిస్తూనే ఉన్నారు. ప్రజాస్వామ్యం, స్వేచ్ఛ, సమానత్వాల గురించి వీరంతా మాట్లాడుతున్నారు. అయితే సమకాలీన ప్రపంచ వాస్తవాలన్నీ 19వ శతాబ్దంలో వచ్చిన సిద్ధాంతాలకు భిన్నంగా ఉన్నవి. ఆ సిద్ధాంతాలు దోషపూరితం అయినందువలనగాని, కావాలని మోసపుచ్చినందువలనగాని ఈ పరిస్థితి ఏర్పడలేదు. ఆధునిక సమయంలో ఆర్జించిన జ్ఞానాన్ని పూర్తిగా వినియోగించుకోవడంలో మానవుడు విఫలంచెందాడు. జీవిత సమస్యలకు వీటిని అన్వయించడంలోను సరైన అవకాశాన్ని చేజిక్కించుకోలేకపోయాడు. ఈ వైఫల్యం అర్ధశతాబ్దంపైగా కొట్టొచ్చినట్లు కనిపిస్తుండగా, రానురాను నిస్సహాయస్థితికి చేరుకొన్నది. మానవుడి ప్రతిభ పూర్తిగా అలసిపోయినట్లున్నది. ఉదారవాదం, ప్రజాస్వామ్యం, మార్క్సిజంవంటి రాజకీయ, సాంఘిక సిద్ధాంతాలు ఆచరణలో పెట్టి చూచినప్పటికీ, ఇంకా ఏదో లోపం ఉన్నదనిపించింది. ఆధునిక జీవిత సమస్యలను ఈ సిద్ధాంతాలు పరిష్కరించగలిగినట్లయితే ప్రపంచం అగమ్యగోచర స్థితికి వచ్చి ఉండేది కాదు. ఆయా సిద్ధాంతాలను కోరుకున్నవారు చిత్తశుద్ధిగా అమలుపరచలేదనడం

కూడా వాస్తవంకాదు. ప్రజాభిమానం కోల్పోయిన విశ్వాసాలను అంటిపెట్టుకుని, ఇతరుల చిత్తశుద్ధిని శంకించడం ఆత్మవంచనే అవుతుంది.

సాంఘిక, రాజకీయ, ఆర్థిక భావాలు, ఆదర్శాలు అవి సంప్రదాయబద్ధమయినా, విప్లవాత్మకమయినా, అందలి దోషాలను సమకాలీన చారిత్రకానుభవం బైటపెట్టింది. భౌతికంగాను మానసికంగాను సాధ్యమయ్యే విషయాలు ప్రపంచంలో ఎన్నో ఉన్నాయి. స్వేచ్ఛాయుతమయిన మంచి సమాజాన్ని రూపొందించడం కూడా ఆచరణసాధ్యమే అయినా పరిస్థితులు దిగజారిపోతున్నవి. నిస్సహాయత, నిరాశ ఎక్కువై మానవుడిలోని ఆచరణకు ఆటంకమై నాగరిక జీవితాదర్శాలను భ్రష్టపరుస్తున్నవి. 18, 19 శతాబ్దాల భావాలతో నేటికాలపు సమస్యలను పరిష్కరింపబూనితే వైఫల్యం, నైరాశ్యం తప్పదు. భౌతిక ప్రగతిస్థాయికి నాగరిక మానవుడి మానసిక, నైతికస్థాయి చేరుకోలేదు. ఈ కాలంలో సంక్షోభానికి అదే మూలకారణం.

చరిత్రలో కొత్త సమస్యలతో నాగరిక ప్రపంచం సతమతం అయిన కాలం లేకపోలేదు. మానవ మేధస్సును కలవరపెట్టిన సమయం అది. పాతభావాలు, సిద్ధాంతాలతో పరిష్కారానికి పూనుకుంటే పరిస్థితులు ఎదురుతిరిగాయి. చరిత్రలో సింహావలోకనంచేసి చూడాల్సిన సమయం ఆసన్నమయింది. అనుభవాన్ని ఆధారంగా గతాన్ని పరిశీలించి సంప్రదాయ భావాలను పరీక్షించి, చిరకాలంగా మన్ననలను పొందుతున్న ఆదర్శాలను నిశితంగా గమనించి, వాటిలో లోపించిందేమిటో చూచుకొని, నేటి నిస్సహాయస్థితికి, నిస్పృహకు, నిరాశకు దారితీయడానికి కారణాలు గమనించాలి. చిరకాలంగా అభిమానిస్తున్న భావాలను, ఉత్తరోత్తరా వచ్చిన జ్ఞానం ఆధారంగా నిరాకరించవలసి ఉంటుంది. పాతవిలువలను తిరిగి అంచనావేయవలసి ఉంటుంది. కొత్తభావాలను రూపొందిస్తూ, కొత్త ఆదర్శాలను ఏర్పరచుకోవలసి ఉంటుంది. భవిష్యత్తులో సాగిపోయేటందుకు వీలుగా ప్రేరిపించగల ఆచరణ మార్గంచూపే ధోరణి కావలసిఉంది. (మానవత, వైజ్ఞానిక, పారిశ్రామిక, సాహిత్య, రాజకీయ రంగాలలో 19వ శతాబ్దం ఎంతో నాగరికాభివృద్ధి చెందింది. అయితే మానవజీవితాన్ని నూతన మలుపు తిప్పడంకూడా ఈ సందర్భంలోనే జరిగింది. ఆ మలుపు ఏదో ఇంకా పూర్తిగా అవగాహనకాలేదు. జీవిత విలువలు క్రమంగా వెనుకబడుతున్నవి. నాగరికత వ్యక్తీకరణ కాకుండానే నిలబడిపోయింది. (ఎ. ఎన్. వైట్‌హెడ్, ది ఎడ్వంచర్స్ ఆఫ్ ఐడియాస్).

పాత సాంఘిక సంస్థలూ రాజకీయ విధానాలూ దిగజారి, పతనమౌతుండగా వాటికి సంబంధించిన సిద్ధాంతాలు అపఖ్యాతిపాలై సంక్షోభాన్ని ఇంకా ఎక్కువచేసింది. కొన్ని సిద్ధాంతాలలోని దోషాలు, అసంబద్ధతలు, వైఫల్యాల కారణంగా నిరాశా నిస్పృహలు, గందరగోళం ప్రబలింది. సంస్కరణకూ విప్లవానికీ సంబంధించిన ఈ

పరిస్థితి సర్వత్రా కనిపిస్తున్నది. ఆధునిక ఆటవికత్వంపేరిట మనిషికి సంక్షేమమూ భద్రతా సమకూర్చుతూ సామాజికంగా అదుపును, భావస్వేచ్ఛలేని బానిస జీవితాన్ని గడపడమా? లేక విశ్వాసంపేరిట మధ్యయుగాల్లో వ్యాపించిన ఆగమ్యగోచర పద్ధతులకు పోవడమా? అనేవి నేడు నాగరికజాతి నెదుర్కొంటున్న సమస్యలు. సిద్ధాంతాలపరంగా వస్తున్న ఘర్షణ రాజకీయంగా ధృవీకృతమయి చివరకు మారణాయుధ పోరాటంగా పరిణమించే ప్రమాదముంది. భయంకరమయిన ఈ చిక్కునుండి బైటపడటానికి నాగరిక ప్రపంచంలోని ఆలోచనాపరులు మార్గాన్వేషణ చేస్తున్నారు. మానవుడి ప్రతిభకు చరిత్రలో ఇంత వరకెన్నడూ ఇటువంటి క్లిష్టపరీక్షరాలేదు. తనలోతాను విశ్వాసాన్ని పెంచుకుంటే, భద్రతపేరిట వేయబోతున్న సంకెళ్ళను నిరాకరించే ధైర్యంకూడా అతడికి లభిస్తుంది.

ఆధునిక ప్రపంచాన్ని ఎదుర్కొంటున్న సమస్యలను విశ్లేషించిచూస్తే, సాంఘిక తత్వాన్నీ, రాజకీయ సిద్ధాంతాలనూ పూర్తిగా మార్చేయాల్సి ఉంటుందనీ ప్రజాజీవితంలో నైతిక విలువలకు అత్యధిక ప్రాధాన్యత రూపొందించాలనీ స్పష్టపడుతున్నది. అందువలననే అనుకోని కోణాలనుంచికూడా నీతికోసం విజ్ఞప్తులు వినిపిస్తున్నవి. విచక్షణారహితంగా అధికారంకోసం తాపత్రయపడే రాజకీయవేత్తలు కూడా నైతిక బాధ్యతలనుగురించి మాట్లాడుతున్నారు. ఐనప్పటికీ పరిస్థితి దిగజారిపోతూనే ఉన్నది. బలం కలవాడిదే రాజ్యమనే సూత్రం. రాజకీయాధికారంకోసం పెనుగులాట, ఆర్థిక దోపిడీకై తాపత్రయం ఆధిక్యత వహిస్తున్నాయి. ఏ దేశమయినా తాను ఈ దోషాలను పాటించడంలేదంటే, అబద్ధమాడుతుందనే భావించాలి.

ప్రజాజీవితంలో నైతికరీతులు లేకపోవడంపట్ల విచారాన్ని వ్యక్తపరచడం, నైతిక విలువలకు విధేయతను ప్రకటించడం, చాలా ప్రధానమయిన విషయాలు. రాజకీయవేత్తలు ఆచరణలో దేనినీ పాటించలేకపోవడం, కేవలం చిత్తశుద్ధి లేకపోవడం వలననే కాదు. వారొక వలయంలో చిక్కుకున్నారు. ఒక ఆటలో నిమగ్నమయినప్పుడు ఆ నియామాలననుసరించి ఆడవలసి ఉంటుంది. రాజకీయాచరణకు అధికారం ముఖ్యమయినప్పుడు, రాజకీయాలలో నీతిగురించి మాట్లాడినా, ఆచరించలేకపోవడానికి ప్రధానకారణమని గ్రహించాలి. ఏ మార్గాన్ని అనుసరించినాసరే లక్ష్యాన్ని చేరుకోవాలనే పద్ధతిలో రాజకీయాలు నడిపిస్తున్నారు. ఈ సుడిగుండంలో చిక్కుకున్నవారు ఎంత ఉత్తములయినా అధికార రంగంలో అట్టడుగుకు పోవడం తప్పదు.

మితవాద, అతివాద రాజకీయ సిద్ధాంతాలు, తిరోగమన విప్లవ సూత్రాలకు మూలాధారమయిన సాంఘిక తత్వాలను ఇప్పుడు పునః పరిశీలించ వలసిన అవసరమేర్పడింది. ఆచరణలలో ఈ సిద్ధాంతాలకు అట్టే తేడాలేదని స్పష్టమయింది. ఏ మార్గాన్ని అనుసరించినా అధికారం రాబట్టడమే అందరికీ సర్వసాధారణాంశం.

సాంఘికంగా మార్పు తేవాలంటే అధికారం హస్తగతం చేసుకోవడం ఒక్కటే మార్గంకాదని చెప్ప గలిగిన రాజకీయ సిద్ధాంతం వచ్చిననాడు ప్రజా జీవితంలో నీతికి ఆస్కారం ఉంటుంది. అటువంటి నూతన రాజకీయ సిద్ధాంతానికి మానవుడిని సార్వభౌముడుగా పరిగణించే సాంఘిక తత్త్వం ప్రాతిపదికగా ఉండాలి.

నీతి అంతరాత్మకు సంబంధించినది. వ్యక్తులు మాత్రమే దాన్ని పాటించగలరు. నీతిమంతులు లేకుండా నైతిక సమాజం ఏర్పడదు. నవ సమాజాన్ని ఏర్పరచాలనే వారంతా ఇప్పటివరకూ ఈ క్రమాన్ని తల్లక్రిందులుచేసారు. మానవ ప్రతిభ వికసించడానికి వీరు ఆదర్శాలను పేర్కొన్నారు. మంచి నియమాల వలన చక్కని జీవితాదర్శం ఏర్పడుతుందని ఉదారవాదులు నమ్మారు. ఈ "సంస్కరణ వాదాని"కి వ్యతిరేకంగా, సోషలిస్టులు, తరువాత కమ్యూనిస్టులు మానవాభివృద్ధికిగాను అందరి యాజమాన్యంతో కూడిన ఆర్థిక పునర్నిర్మాణం అవసరమన్నారు. తత్ఫలితంగా సమష్టి వాదాలలో వ్యక్తికి గ్రహణంపట్టింది. సమష్టివాద సాంఘిక తత్త్వాలవలన రాజకీయ రంగంలో నియంతృత్వం ప్రబలింది.

సాంఘిక తత్త్వంలో వ్యక్తికి కేంద్రస్థానం ఇవ్వడం సులభమే. వాస్తవానికి, ఉదార సాంఘిక తత్త్వానికీ రాజకీయ సిద్ధాంతానికీ వ్యక్తివాదమే మూలంగా ఉండేది. ఆధునిక నాగరికత సాధించిన ఘన విజయాలకు ప్రేరణ కల్పించింది ఉదారవాదమే. అయితే ఆలోచనలో, వ్యక్తివాద సూత్రం నిరాకారంగా మారి వ్యక్తి సార్వభౌమత్త్వం చట్టబద్ధమయిన కట్టుకథగా మిగిలిపోయింది. ఉదారవాదం పతనం చెందేసరికి భిన్న సమష్టివాదాలు తలెత్తి వ్యక్తి స్వేచ్ఛను వెక్కిరిస్తూ స్వేచ్ఛగా ఉండాలంటే వ్యక్తి, గుంపులో కలిసిపోవాలన్నారు. లేకుంటే ఆత్మార్పణలో తప్ప స్వేచ్ఛ లభించదన్నారు. వ్యక్తి సార్వభౌమత్వాన్ని చట్టబద్ధమయిన కట్టుకథగా చేసిన ఉదారవాదానికి భిన్నంగా కమ్యూనిస్టులూ, సోషలిస్టులూ పేర్కొంటున్న స్వేచ్ఛా భావన దోషపూరితమయినది.

నీతిగురించి స్పష్టమయిన ప్రమాణాన్ని చేకూర్చలేకపోవడం వలన ఉదారవాద సాంఘిక తత్త్వం పతనమయింది. వ్యక్తి నీతివంతుడు కనుక సార్వభౌముడనే ఉత్తమ సూత్రంతో ఈ విధానం ఆరంభమయింది. ఇదొక ప్రాచీన విశ్వాసం. ఐరోపాలో క్రైస్తవమతం ఈ భావాన్ని ప్రచారంచేసింది. దైవాంశంగా మానవునిలో గల ఆత్మ ఆధారంగా మానవుడు నీతివంతుడని చెప్పారు. ఆదిలో ఇదొక ఉన్నతభావంగా తలపోసారు. దీనివలన ఉత్తేజం పొందిన ఐరోపా మానవాళి మధ్యయుగాల్లో ప్రబలంగా ఉన్న పితృస్వామ్య విధానాన్ని, మతపరమయిన సంస్థలను త్రోసిరాజన్నది. కానీ మానవుడు నీతికి సంబంధించిన విషయంలో మత విశ్వాసాన్ని జొప్పించడంవలన అతడి సార్వభౌమత్వానికి హద్దులేర్పడినవి. ఒక విధంగా విమోచన భావానికి ఇది

వ్యతిరేకం కాదు. ఇంకా తరచి చూస్తే మానవుడు మానవుడుగా నీతివంతుడు కాలేడని, అలౌకిక శక్తికి లొంగిఉంటేనే ఇది సాధ్యమని అర్థం వస్తున్నది. ఇటువంటి మానసిక లొంగుబాటువలన స్తంభించిపోయిన వ్యక్తి స్వేచ్ఛాపరుడు కాలేడు. ఆధునిక నాగరికతలోని తొలిదశలో ఈ మానసిక బానిసత్వానికి వ్యతిరేకంగా జరిగే పోరాటం విశిష్ట లక్షణాలతో కూడినది. ఆ పోరాట ఫలితమే ఉదారవాదం. 18వ శతాబ్దంలో ఇదొక దశకు చేరుకున్నది. దీని కాంతిపుంజాలే విజ్ఞానప్రభోదంగా ప్రజ్వరిల్లినది.

ఫ్రెంచి విప్లవం తాకిడివలన ఉదారవాదానికి ప్రమాదమేర్పడింది. సహజ వాదానికీ, ప్రకృతి మతానికీ వ్యతిరేకత కలిగింది. సాంఘికంగానూ వ్యక్తిపరంగానూ నీతికి పారమార్థిక ప్రమాణాలు చూడనారంభించారు. (విక్టోరియా శకాంతంలో సాంకేతికంగాను, సంపదలోను, సంఘనిర్మాణంలోను విపరీతమయిన మార్పులు జరుగుతుండగా, క్రైస్తవమతాన్ని ఇమడ్చడం ఎలాగన్నది మేధావుల సమస్యగా మారింది– (ఎలాన్ విలార్డ్ బ్రౌన్ వ్రాసిన "ది మెటఫిజికల్ సొసైటి, విక్టోరియన్ మైండ్స్ ఇన్ క్రైసిస్" చూడండి.) ఫ్రాన్సులో విక్టర్ కజిన్ "చవకబారు పదార్థవాదం" పైన ధ్వజమెత్తాడు. తొలి "వైజ్ఞానిక ఉత్సాహం దారి తప్పినందుకు" విమర్శించాడు. 19వ శతాబ్దంలోని నైతిక తత్త్వానికి సంబంధించిన పారమార్థిక వాదానికి వ్యతిరేకంగా ఉదార సాంఘిక సంస్కర్తలూ, రాజకీయ సిద్ధాంతకర్తలూ నీతికి సంబంధించిన ప్రయోజనవాదాన్ని ప్రవేశపెట్టారు. పారమార్థిక వాదంలో నైతికవిలువలు అతిభౌతిక భావనలు కనుక మానవ అనుభవానికి అందుబాటులో ఉండవన్నారు. సంఘసంస్కర్తలు నీతికి ఏ ప్రమాణం లేకుండా చేసారు. దీనివలన అసలు నీతినే కాదన్నట్లయింది. ఈ రెండు వాదాల మధ్య నాగరిక ప్రపంచం గందరగోళానికి గురైంది.

పార్లమెంటరీ ప్రజాస్వామ్యాన్ని ఆచరణలో పెట్టడం, పెట్టుబడిదారీ ఆర్థికవిధానం వ్యక్తిని నిస్సహాయుణ్ణి గావించాయి. నైతికంగా వచ్చిన గందరగోళం, సామాజికంగా ఏకాకి కావడంతో మానవుడికి తనపై తనకే నమ్మకం పోయినట్లయింది. వ్యక్తిస్వేచ్ఛను సమష్టివాదం వెక్కిరిస్తుండగా, సమాజంలోని అనుభవం దీనికి తోడైంది. తనలో విశ్వాసాన్ని కోల్పోయినవ్యక్తి, సమష్టి సాంఘికతత్త్వం ఊహించిన మూకస్వామ్యాన్ని ఆహ్వానిస్తూ, అందులో భద్రతకై వెతుకులాడాడు. రాజకీయాలలో వ్యక్తిపాత్ర అదృశ్యమయింది. రాగద్వేషాలను రెచ్చగొట్టి మూకల్ని ఆకర్షించడం రాజకీయాలలో ప్రధానాంశం అయింది.

సాంఘిక సిద్ధాంతాలపైనా, రాజకీయాచరణలపైనా ప్రభావం చూపెట్టాలంటే నైతికతత్త్వానికి గట్టి ప్రాతిపదిక ఉండాలి. నీతిశాస్త్రానికి పునాది ఏమిటి? మానవుడు తనకుతాను నీతివంతుడు కాగలడా? అనేవి జటిలమయిన సమస్యలు. ఇప్పటివరకు

అలౌకికశక్తి, సాంఘిక ఒత్తిడి ఉంటేతప్ప మానవుడు నైతికంగా ఉండలేడని అభిప్రాయం ప్రబలి ఉన్నది. దీనివలన మానవుడు నీతివంతుడనే అభిప్రాయం వృధా అయిపోతున్నది. ఇప్పుడా నమ్మకాన్ని పునరుద్ధరించాలి. లోగడఉన్న పరిమితులను అధిగమించాలి. వివేచనాత్మకమయిన రాజకీయ సిద్ధాంతాన్ని, నీతిపరమయిన రాజకీయాచరణను చూపగల విప్లవ సాంఘికతత్త్వం అవసరమయింది.

మానవ స్వభావాన్ని గురించి, ప్రకృతిలో అతనిస్థానాన్ని గురించి, మతంతో నిమిత్తం లేకుండా కొన్ని ప్రతిపాదనలు గతంలో చేసినప్పుడు, ఆధునిక నాగరికతా చరిత్రలో పైనచెప్పిన ధోరణిలో చాలా ముందుకుపోవడం జరిగింది. ఆనాడు ధైర్యంగా ఆలోచనాపరులు ఊహించగా, ప్రకృతిని గురించిన జ్ఞానం విస్తరిస్తున్న కొద్ది, వారి అభిప్రాయానికి బలంచేకూరింది. 18వ శతాబ్దపు వైజ్ఞానిక సహజవాదంలో ఈ భావాలు పరాకాష్ఠనందుకొన్నాయి. మానవతా దృక్పథంతో, సృష్టివాదాన్ని త్రోసిపుచ్చి, ప్రకృతిలోనే మానవుడికి మూలం ఉన్నట్లు కనుగొన్నారు. నియమబద్ధ విశ్వం నుండి జనించిన మానవుడు వివేచనాపరుడుగా ఉంటాడు. మనుగడకై పోరాటంసాగించే నిమిత్తం తొలుత అతడు సమాజాన్ని సృష్టించుకున్నాడు. 19వ శతాబ్దంలో కనుగొన్న విప్లవాత్మక జీవశాస్త్ర సూత్రాలు ప్రాచీన ఆలోచనాపరుల మాటలను నిజం చేసాయి. కానీ అదే సమయంలో ఉదారవాదంలో వచ్చిన అసంబద్ధతల వలన, అస్పష్టతల వలన నాగరిక ప్రపంచం నైతిక సంక్షోభానికి గురైంది.

ఈ శతాబ్దారంభంలో పదార్థ విజ్ఞానం కొత్త సూత్రాలను కనుగొని, వైజ్ఞానిక సహజవాదానికి ఆయువుపట్టు ఏర్పరచిన మూలపదార్థం, కార్యకారణ వాదానికి సంబంధించిన ప్రాచీన భావాలను చెల్లవని చెప్పగా, విజ్ఞానాన్ని ఆధారంగా చేసుకుని బయలుదేరిన నూతన మార్మికవాదం, మానవతా సహజవాదాన్ని ప్రశ్నించింది. బాహ్యసత్యాన్నేగాక మానవజ్ఞానంలోని వాస్తవికతనుకూడా సందేహించింది. జ్ఞానసిద్ధాంతానికి విపరీతమైన ప్రాధాన్యత ఇచ్చినందువలన విశ్వశాస్త్రానికీ మూలపదార్థ శాస్త్రానికీ సంబంధించిన గందరగోళం ఏర్పడింది. మేధస్సుపరంగా వచ్చిన గందరగోళం నైతిక సంక్షోభాన్ని ఇంకా తీవ్రతరం చేసింది.

ప్రకృతి శాస్త్రాల ప్రమాణంతో మనోవిజ్ఞానం, వివేచనారాహిత్య విధానాలను బోధించనారంభించింది. అంతఃకరణ ముసుగులో మళ్ళీ మార్మికవాదం, అలౌకికవాదం నీతిశాస్త్రంలో చోటుచేసుకున్నాయి. మానవుడు వివేచనారహితుడు. అంధకారశక్తుల ప్రేరణలవలన అతడు అంతర్బుద్ధితో గమనం సాగిస్తుంటాడు. ప్రజా జీవితంలోగాని, వ్యక్తి జీవితంలోగాని నీతి అనేది కేవలం అదుపులో ఉండే పోలీసు వంటిదిమాత్రమే. శాంతి భద్రతలను కాపాడే ఈ ఆధ్యాత్మిక శక్తులు లేకుంటే, బలంగల వాడిదే రాజ్యమనే

ఆటవిక సూత్రం పరిపాలిస్తుంది. విచిత్రమేమంటే, ఇప్పుడు ఆ సూత్రమే ప్రాధాన్యత వహించింది.

మానవుడు వివేచనకు విలువనిచ్చే నైతికతత్త్వం ఒక్కటే ఈ విషవలయంనుండి బైటపడటానికి మార్గాంతరంగా ఉన్నది. అయితే మానవుడిలో వివేచనకు ఆధారమేమిటి? వివేచనంటే ఏమిటి? అది అతి భౌతికమా? లేక జీవసంపదా? అతి భౌతికమైతే, వివేచనలో నీతికి మూలం ఉన్నంతమాత్రాన సమస్య పరిష్కారంకాదు. ఇది కేవలం ఒక సమస్యను మరొక సమస్యపై రుద్దడమే ఔతుంది. ప్రకృతిలో కనుపించే నియమం జీవ విధానంలో వివేచనగా ఉన్నది. ప్రకృతిలోని నియమం భౌతికంగా నిర్ధారితమైంది.

విప్లవాత్మకమయిన సాంఘికతత్త్వానికి ప్రాతిపదికగా వ్యక్తి సార్వభౌమత్వం ఉండాలి. మానవుడు నీతిమంతుడనే వాస్తవం ఆధారంగానే ఈ సూత్రాన్ని నిర్వచింపవచ్చు. చిరకాలంగా ఇలాంటి నమ్మకమున్నప్పటికీ ఆచరణలో అది నిలబడటంలేదు. మానవుడు హేతువాదికనుక నీతిగా ఉంటాడనే వాస్తవం ఇప్పుడు ప్రబలంగా రావాలి. తనలోని నియమాలను అనుసరించే నడుస్తున్న ప్రకృతిలో నైతికరీతి ఉన్నది. అటువంటి ప్రకృతినుంచి మానవుడు ఆవిర్భవించాడు.

భౌతికవాద తత్త్వానికి చెందిన యాంత్రిక విశ్వవాదం నుంచి, తర్కబద్ధంగా, మతరహితమయిన వివేచనాత్మకమయిన నీతిశాస్త్రాన్ని రూపొందించవచ్చు. అతిభౌతికం, అలౌకికంతో అవసరంలేని నైతికతత్త్వం నేడు కావాలి. మానవుడికి అతని స్వయంశక్తిపై నమ్మకమేర్పడాలంటే విశ్వానికి సంబంధించిన శాస్త్రజ్ఞానం చూపెడుతున్న మార్గాలను అనుసరించాలి. అప్పుడుగానీ భౌతికతత్త్వం నీతిశాస్త్రానికి సంబంధించిన ఫలితాలను ఇవ్వజాలదు. భౌతికవాదానికి యాంత్రికమయిన విశ్వవాదమున్నది. ఆ పునాదిని తొలిగిస్తే భౌతికవాదం నిలబడదు.

విశ్వవాదంగా, పదార్థవాదం, అర్థ శతాబ్దంపైగా అనేక సవాళ్ళ నెదుర్కొంటున్నది. ఈ శతాబ్దారంభంలో భౌతిక శాస్త్రజ్ఞులు పదార్థానికి మూలం అణువు కాదని కనుగొనడంతో, పదార్థానికి "పదార్థరాహిత్యత" ఏర్పడింది. తొందరపడి తీర్పుచెప్పారు. 19వ శతాబ్దంలోని ప్రకృతి తత్త్వం సరైనది అవునా? కాదా? అని ప్రజలు సందేహపడనారంభించారు. ప్రపంచానికి మూలాధారంగా "ఘనపదార్థాలు" లేవని భౌతిక విజ్ఞానం కనుగొనేసరికి, వైజ్ఞానిక ప్రకృతివాదం పూడిపోయిందని తత్త్వవేత్తలు ఊహించారు. నేటి సంక్షోభానికి అదేనాంది. చిరకాలంగా మతానికీ విజ్ఞానానికీ, మతపరమైన ఆలోచనలకూ వైజ్ఞానిక ధోరణికీ, విశ్వాసానికీ వివేచనకూ, మార్మికమైన సంశయవాదానికీ అనుభవపూర్వకమైన మానవుడి శక్తికీ జరుగుతున్న సంఘర్షణే

మరలాచెలరేగింది. జీవన్మరణ సమస్యగామారినఈ పోరాటం నాగరిక మానవాళిని సందేహంలో పడవేసింది.

మతాన్ని దివినుంచి భువికిదించిన విజ్ఞానం ఇప్పుడు ఆఖరి ప్రతిఘటనలను ఎదుర్కొంటున్నది. "వైజ్ఞానిక" ఆయుధాలతో భౌతికవాదంపై ధ్వజమెత్తిన తత్త్వాలన్నీ, వివేచనాత్మక మతాలతుది ఘడియలలో కాలంగడుపుతున్నవి. మానవుడు ఎన్నడూ ఏది తెలుసుకోజాలడంటూ వీరు క్రొత్తరకమయిన మార్మిక వాదాన్ని భోదిస్తున్నారు. సృష్టి ప్రయోజనవాదాన్ని జీవితంలోనూ తిరగదోడుతున్నారు. మానవుడికి అతడిపై అతడికి నమ్మకం లేకుండా చేస్తున్నారు. నేటి సంక్షోభానికి ఇదే ప్రధాన లక్షణం. దీన్నుంచి బైటపడాలంటే విశ్వంలో కేంద్ర స్థానాన్ని మానవుడికి ఇచ్చే తత్త్వం రావాలి. తనవిధికి తానే మానవుడు బాధ్యుడుకావాలి. మతంపై విజ్ఞానం ఆఖరు విజయాన్ని సాధించి ఉత్సవం జరుపుకోవాలి.

సాంస్కృతిక సంక్షోభం వచ్చిందంటూ కొందరు చెబుతున్నారు. అట్లాంటి సంక్షోభమే ఉంటే అది కొద్దిమంది మేధావుల అనుభవానికి పరిమితమై ఉండాలి. వాస్తవానికి మేధస్సుకు సంబంధించిన సంక్షోభమే ఇదంతా. లేకుంటే అనంతంగా విస్తరిస్తున్న విజ్ఞానంగల ఆధునిక మానవుడు, పాతదేవుళ్ళస్థానే గణితదైవాన్ని స్థాపించాలనే ప్రయత్నమెందుకు చేస్తాడు? ప్రపంచానుభవాలను, ప్రత్యక్షవాదం, వాస్తవవాదం ఇత్యాది మిడిమిడి వైజ్ఞానిక విధానాల ఆధారంగా మతాన్ని తిరగదోడటంలో పండితులు విజయం పొందవచ్చు. ఈ ప్రమాదాన్ని ఎదుర్కోవడానికి స్వయం సంపూర్ణమయిన తత్త్వం, యాంత్రికమైన విశ్వవాదంతో ప్రారంభించి, మతేతరంగా – పరిణమించిన నీతిశాస్త్రంతో అంతమయే విధానాన్ని ప్రవేశపెట్టాలి. మానవ ఉనికికి సమగ్రతనూ, వివరణనూ ఇచ్చే తత్త్వంకావాలి. ప్రకృతిని దాటిపోకుండా, మానవుడి అవగాహనకు సిద్ధాంతపరంగా అందుబాటులో ఉండే విధానాల ఆధారంతో, కోరిక, ఉద్రేకం, ప్రేరణ, అంతరాత్మ, ఇచ్ఛ, వివేచనను వివరించగలగాలి.

అలౌకిక వాదపు ఊబిలో పడకుండా ఉండాలంటే, సాపేక్షతావాద లోపాలను తొలగించుకోవాలంటే, నీతిశాస్త్రాన్ని తత్త్వంతో పొందుపరచుకోవాలి. అంతేగాని మరొక తుఫానొస్తే తట్టుకొని నిలబడలేని గాలి మేడలను నిర్మించి ప్రయోజనంలేదు. యాంత్రిక విశ్వవాదం, భౌతిక సత్యంతోకూడిన మూలపదార్థవాదం పునాదులు చేసుకుని, సహజ వివేచనావాదం ఆధారంగా, మానవ నైతిక శాస్త్రాన్ని నిర్మించుకోవాలి. తరువాత అజీవ–జీవ పదార్థాలకు కలయిక ఎక్కడో చూడాలి. ప్రకృతిలోని యాంత్రిక విధానంనుంచి జీవం ఆవిర్భవిస్తున్నదని కనుగొన్నదాన్నిబట్టి, నియమబద్ధమయిన విశ్వంనుంచి మానవుడి వివేచనను రాబట్టవచ్చును. భౌతిక మనో విజ్ఞానాలకు

అఖాతమున్నదని ఇన్నాళ్ళుగా ఊహించినదానికి ఈ విధంగా వారధి ఏర్పడుతుంది. తత్త్వాన్ని ఎంతగానో కలవరపరిచిన జ్ఞానవాద సమస్యకూడా పరిష్కారమౌతుంది. సత్యం అతిభౌతిక భావన కాకుండా పోతుంది. ప్రత్యక్ష జ్ఞానవస్తువుగా సత్యం నిలబడుతుంది. సత్యస్వభావాన్ని తెలుసుకొన్న దాన్నిబట్టి ఇతర విలువలు స్పష్టపడటమేగాక, వాటిని వివేచనాత్మకంగా స్థాయీభేదాలతో అమర్చవచ్చు. ఉనికి–మార్పులతో ఉన్న మానవుడు, ప్రపంచంలోనే నైతిక విలువలను రాబట్టిన అనంతరం, వాటిని సాంఘిక తత్త్వంతో సమన్వయీకరించవచ్చును. సమకాలీన ప్రపంచాన్ని ఎదుర్కొంటున్న ఆర్థిక, రాజకీయ సమస్యలకు మానవతా దృక్పథంతో పరిష్కారమార్గాన్ని చూపవచ్చు.

కొత్త అంతా పాత నుంచి వస్తుంది. మానవ జ్ఞానసంపదను ఆధారంగా తీసుకుని ఆలోచనాచరిత్రను గ్రహించాల్సి ఉంటుంది. నాగరికత ఆవిర్భవించిన నాటినుంచి సంతత ధారావాహికంగా వస్తున్న మానవ ఆలోచనా స్రవంతి ఆధారంగా, మనం కోరుకొంటున్న నూతనతత్త్వాన్ని రూపొందించవచ్చును. మహోన్నతమైన ఆ మానవ సంపదను గ్రహించకపోవడంలోనే సంక్షోభం జనిస్తున్నది. విలువలలో తాత్కాలికమైనవి, శాశ్వతమైనవి ఉన్నవి. మానవ పరిణామంలో శాశ్వత విలువలను ఇప్పుడు కనుగొనాల. మానవుడు ఆవిర్భవించినప్పటినుండి స్థిరంగానూ, ఐక్యంగానూ, ఏకరీతిలోనూ వచ్చిన భావాలను కొత్త సాంఘిక తత్త్వానికి ప్రాతిపదికలుగా చేసుకోవాలి. సాంప్రదాయిక తత్త్వవేత్తలను కలవరపెట్టిన సమస్యలను పరిష్కరించడంలో అటువంటి తత్త్వానికి చిక్కేమీ ఉండదు. ఈ పరిష్కారం సిద్ధాంతపరమైనదికాదు. నూతన తత్త్వం చూపిన ప్రేరేపణ వలన ఆచరణకు ఉపక్రమించడం జరుగుతుంది.

అతిభౌతిక ఊహలకు ఆధారం భౌతికంలోనే అన్వేషణ చేయడాన్ని ప్రాచీన తత్త్వవేత్తలు ఎప్పుడయితే మానివేశారో, అప్పటినుండే ద్వంద్వవాద దోషంలో తత్త్వం చిక్కుకుపోయింది. మధ్యయుగాల్లోని మతపరమయిన తత్త్వవేత్తలంతా స్పష్టంగా ద్వంద్వవాదులే. మతజ్ఞానానికి వివేచనాత్మకంగా ఎదురుతిరిగిన డేకార్ట్, లెబ్నిజ్, కాంట్ కూడా ద్వంద్వవాద విషవలయంనుంచి బైటపడలేకపోయారు. తార్కికంగా వచ్చిన ద్వంద్వవాద తత్త్వం అలా ఉండగా, మానవుడికి మతం ఒక్కటే భద్రతను సమకూర్చడానికి సిద్ధపడింది. మతపరమయిన వ్యక్తి దైవేచ్ఛకు,సృష్టిలో ప్రయోజనవాద మున్నదనే "నైతిక నియమానికి" లొంగి ఉండవలసి వచ్చింది. స్వేచ్ఛ లేకపోవడమే నీతి అని పేర్కొన్నారు. ప్రపంచానుభవ వాదాన్ని అతిగా పేర్కొంటున్న వారు సహితం మతపరమైన వ్యక్తులుగానే ఈనాడు మిగిలిపోయారు. ప్రత్యక్షానుభవానికి అందనిదంతా అతిభౌతికమేనని వీరంటారు. పైకి వైజ్ఞానికంగా కనుపించే ఈ ప్రతిపాదన ఆధారంగా

నూతనమైనట్టి మార్మిక వాదాన్ని వీరు రాబట్టుతున్నారు. మానవుడు తన శరీరానికి మించి బైట దేనినీ తెలుసుకొనలేడనేంతవరకూ ఈ నూతన మార్మికవాదం విస్తరించింది. ప్రపంచం అంతా ఎవరూ చొచ్చుకుపోలేని మార్మిక ముసుగుతో ఉన్నదని, అంధకారమయిన ప్రతికోణంలోను దేవుడిని ఊహించవచ్చని వీరంటారు. మానవుడి అజ్ఞానం ఆధారంగానే, ఆధునిక ప్రపంచానుభవ వాదులు భగవంతుడిని స్థాపించుతున్నారు.

నాగరిక మానవాళి అంతటికీ నేటి సంక్షోభం ఆవరించింది. మేధస్సుగాని, సంస్థలుగాని నేటి అవసరానికి ఆదుకోలేకపోతున్నాయి. రెండు పెత్తందారీ విధానాల మధ్య ఎంపిక చేసుకోవడంగాక, మూడవ మార్గాంతరం ఉండాలి. జీవితానికి సృష్టిలో ప్రయోజనం ఉన్నదనే ప్రవక్తలే ఆధ్యాత్మిక పెత్తందారీ విధానాన్ని ప్రభోదిస్తున్నారు. రుగ్మత కంటే వీరి నివారణోపాయం మరింత ప్రమాదకరంగా ఉంది.

సోరోకిన్, మారిటన్, బెర్డెవ్‌లు ఇటువంటి సందేహాస్పద నివారణోపాయాన్ని సూచిస్తున్న వారిలో ప్రముఖులుగా ఉన్నారు. వివేచనాత్మక వైజ్ఞానిక దృక్పథంతో ఆధునిక జీవిత సమస్యలకు పరిష్కారమార్గం సూచిస్తున్నట్లు వీరంటున్నారు. అయినప్పటికీ మానవుడు తనలో విశ్వాసాన్ని కోల్పోవడం వలన సంక్షోభం ఏర్పడిందనేది సర్వసాధారణమైనది. వీరు చెప్పేదేమంటే చరిత్రలోనూ, జీవితంలోనూ, మానవుడికి – మానవుడుగా ఎలాంటి ప్రాధాన్యతాలేదు. మార్మికమైన విశ్వాసం మాత్రమే జీవితానికి తరుణోపాయాన్ని కల్పిస్తుంది. అది లేకుంటే జీవితసాగర సంక్షోభంలో మానవుడు నిస్సహాయుడుగా, లక్ష్యం లేకుండా కొట్టుకపోతాడు. సమకాలీన ప్రపంచ స్థితిని వీరు ఆవిధంగా వివరిస్తున్నారు.

సాంస్కృతిక వలయాలను గురించి సోరోకిన్ చెప్పే సిద్ధాంతం మొండివాదన మాత్రమే. అనుభవానికి రాకముందే మానవ చరిత్రను ఒక మూసలో పోయవలసిన అవసరమేమున్నది? ముందే నిర్ధారితమైన సాంస్కృతిక వలయాలున్నాయనడానికి కారణాలేమిటి? సోరోకిన్ “వివేచనాత్మకంగా, వైజ్ఞానికంగా” పేర్కొంటున్న సిద్ధాంతం వెనుక ప్రథమకారణం,లేదా అన్నింటినీ కదిలించే శక్తిపై నమ్మకం లేకపోలేదు. ఈ సిద్ధాంతంలో మతపరమైన సారాంశంకూడా ఉన్నది. భావవాదానికి సంబంధించిన సంస్కృతి అత్యున్నత సంస్కృతి. సోరోకిన్ పేర్కొనే భావ, ఆదర్శ సంస్కృతులలో అస్పష్టత ఏమీలేదు. అవి ఆధ్యాత్మికమైనట్టివి. జ్ఞానేంద్రియ సంస్కృతి భౌతికమైనట్టిది. భౌతికవాదాన్ని ప్రక్కన అట్టిపెట్టినా, నియతివాదాన్ని సులభంగా త్రోసివేయడానికి వీలులేదు. ఎందుకంటే సృష్టిలో ప్రయోజనమున్నదనే భావన నిర్ధారణతో కూడినట్టిది. మానవ చరిత్రగతి, సాంస్కృతిక వలయాలలో పునరావృతం గావడం కూడా,

నిర్ధారితమయిన విధానమే. పైగా ముందే నిర్ధారితమైనది కూడా. ఈ నిర్ధారణ సాంస్కృతిక వలయంలో ఉన్నదికాదు. దైవం నిర్ధారించిన విధానంలోని భాగమే ఇది. మతాన్ని తిరగదోడాలని, విశ్వాసాన్ని పునరుద్ధరించాలని సోరోకిన్ స్పష్టంగానే చాటాడు.

మారిటన్, బెర్డైవ్‌లు చెప్పినదానిలో పై వాదానికి మించి అట్టే భిన్నమైనదేమీ లేదు. మానవుడు విశ్వాసాన్ని విడనాడి, భయాన్ని అనుభవించి, భద్రతారాహిత్యతను చూచి, తిరిగి విశ్వాసం దగ్గరకే చేరుకొంటాడని వీరి సిద్ధాంతాల సారాంశం. మళ్ళీ మతపరమైన ఆలోచనలకు వెళదామని వీరంతా ఆక్రందిస్తున్నారు. వివేచనావాదాన్ని, విజ్ఞానాన్ని జోడించినందువలన, ఆధునిక మత తత్త్వం సనాతన తిరోగమనవాదానికి భిన్నంగా కనిపించవచ్చును. ఏమయినా వివేచనను విశ్వాసంతో, మార్మికవాదాన్ని మానవ వాదంతో, ఆధునీకరణను మధ్యయుగాల వాదంతో సమన్వయం చేయబూనడం వృధాశ్రమగానే మిగులుతుంది.

నేటి సంక్షోభం వలన వివేచన వైపుకు, నీతికి మరలిపోవాలనే ఆలోచన కలుగుతున్నది. కానీ ఈ ఆక్రందన అరణ్య రోదనంగా మారుతున్నది. విజ్ఞానం చెప్పే బాహ్య సత్యాన్ని సంశయించడం, కొన్ని స్పష్టమయిన లోపాల ఆధారంగా విజ్ఞానాన్ని ప్రశ్నించడం, ఇందుకు కారణం. ఫలితంగా ఎటుచూసినా నిస్పృహ, భావదారిద్ర్యం కనిపిస్తున్నది. విజ్ఞానం చెప్పే బాహ్యసత్యాన్నే సందేహిస్తే, అలౌకిక వాదంతో నిమిత్తం లేని తత్త్వం సాధ్యమేనని నమ్మకపోతే, నాగరిక ప్రపంచాన్ని అలుముకున్న నైతిక సంక్షోభం నుంచి బైటపడటం కష్టం. ఇకమిగిలిందల్లా సత్యప్రమాణాలకు నీతికి అలౌకికమైన భ్రమలలో అన్వేషణ సాగించడమే. దైవాంశ లేని వ్యక్తుల మతానుభవాల ఆధారంగా సాగిపోనైనా పోవాలి.

విలువలను గురించి నిర్ణయించడంలో ఎదురౌతున్న అనిశ్చిత ఊహల వలన సునిశిత మనస్కులు చిత్రహింసకు లోనవుతున్నారు. జీవిత తత్త్వానికి మూలాధారం దుఃఖం ఒక్కటే మిగిలిందని సంక్షోభంలో చిక్కుకున్నవారు భావిస్తున్నారు. నైతిక గందరగోళం నుంచి, మేధస్సుకు సంబంధించిన సంక్షోభం నుంచి వీరికి రెండే మార్గాలు ప్రత్యామ్నాయంగా కన్పిస్తున్నవి. నియంతృత్వ రాజ్యం కల్పిస్తున్న రక్షణ, ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక భద్రత ఒక మార్గంకాగా, దైవాన్వేషణకై త్రొక్కిసలాడటం మరో మార్గంగా ఉంది.

నాగరిక మానవాళి ఈరెండు మార్గాల సంక్షోభం నుండి బైటపడలేదు. ఇవి రెండూ ఓటమికే దారితీస్తాయి. ఒకటి నాగరికంగా కనుపించే ఆటవిక విధానమనీ, సాంఘికరీతి అనీ, సాంస్కృతిక వాతావరణమనీ, కోస్లర్ పేర్కొనే “20వ శతాబ్దపు

ఆదిమ మానవుడు" అనీ చెప్పవచ్చును. రెండోది 400 సం।। క్రితం మానవుడు తిరుగుబాటు చేసిన స్థాయిని తగ్గించి వేయడమే. ఆ తిరుగుబాటు కాలంలో అతి కొద్ది కాలమైనప్పటికీ, సత్యాన్వేషణలోనూ, స్వేచ్ఛా పిపాసలోనూ మానవుడు మహోన్నతంగా పురోగమించాడు. ఆ ప్రమాణం తగ్గించడమంటే మానసిక బానిసత్వానికి మరలి, స్వేచ్ఛా హక్కును ధ్వంసం చేయడమే. 20వ శతాబ్దంలో నాగరిక మానవుడు, ఒత్తిడి చేస్తేతప్ప నీతిగా ఉండలేడనీ, సత్యపంథా ననుసరించలేడనీ, తన అంతరాత్మ ప్రకారం ధర్మాన్ని పాటించలేడనీ సిగ్గువిడిచి అంగీకరించడమే ఔతుంది. అంతరాత్మ అనేది దైవం ప్రసాదించింన మార్మికవాణి కాదు. అదొక జీవసంపద. పరిణామంలో ఆవిర్భవించిన కొత్తదనం మాత్రమే. నేటి సంక్షోభంనుంచి బైటపడటానికి పైమార్గాన్ననుసరిస్తే, స్థిరత్వం కోసమూ, భద్రత కోసమూ మధ్యయుగాల్లోకి పోవడమన్నమాట.

మరొక మార్గం లేదా? ఆధునిక నాగరికత నాశనం కావాల్సిందేనా? మానవజాతి శక్తిసంపదంతా ఖర్చయిపోయిందా? మానవ సృజనశక్తి గట్టెక్కిందా? స్వేచ్ఛ అనేది వృథా భావనేనా? చిరకాలంగా సాగిన స్వేచ్ఛాన్వేషణ ఎండమావుల వేటేనా? జ్ఞానం అసాధ్యమనీ, అజ్ఞానమే ఆనందదాయకమనీ, నిర్ధారణకు రావాల్సిందేనా?

నాగరిక మానవాళికి పైన పేర్కొన్న రెండు ప్రత్యామ్నాయాలే పరిమితంకావు. నూతన మార్గాలు చూపే ప్రత్యామ్నాయమున్నది. వివేచనకు, ప్రజాజీవితంలో నైతిక ప్రవర్తనకు వీలుండాలంటే, ప్రకృతి నుంచి ఆవిర్భవించిన మానవుడు, ప్రాయికంగా వివేచనాత్ముడనే నమ్మకం కలగాలి. నియమబద్ధమైన విశ్వం, అతి భౌతికమయిన కేవల వివేచనకు సంబంధించినది కాదు. ప్రేరణలు, అంతఃకరణలు అనిర్వచనీయాలు కావు. విశ్లేషించడానికి వీల్లేనివికావు. అవి వ్యక్తుల వివేచనాయుత ప్రవర్తనకు సంబంధించినవే.

దీని సారాంశం ఏమంటే, మతరహితంగా నీతి సాధ్యమని, నైతిక ప్రవర్తనకు, విలువల నిర్ణయానికి మానవుడిలోని అంతర్గత వివేచనే ఆధారమనీ స్పష్టపడుతున్నది. మానవుడు సంపూర్ణంగా మలచినవాడేమీ కాదు. అతని ప్రతిభావ్యుత్పన్నతలు అనంతంగా విప్పారుతూనే పోతుంటాయి. జీవ సంపదలో ఇదంతా ఒక భాగమే.

దృఢవిశ్వాసాన్ని అట్టిపెట్టుకోవడంలో వెనుకంజ వేసేవారికి ఇదంతా విడివాదంగా గోచరించవచ్చు. ఎందుకంటే దృఢ విశ్వాసపరులు తదనుగుణంగా ఆచరణకు ఉపక్రమించాల్సి ఉంటుంది. మానవ సృజనశక్తిలో నమ్మకమున్నవారు,

సాంఘిక శూన్యావస్థలో సిద్ధాంతాలు చెప్పడానికి అంగీకరించనివారు, ఆచరణకు తోడ్పడేవిగానే విశ్వాసాలుంటాయని నమ్మేవారు, పిడివాదమని ఎవరో విమర్శించినంత మాత్రాన భయపడవలసిన పనిలేదు. ఆలోచనకనుక ప్రయోజనాత్మకమయితే మేధాసంబంధమైన కృషి కేవలం ఆత్మవాదుల అభ్యాసం కానట్లయితే, చిక్కులన్నీ విడిపోయి, మేధస్సు పరిధి విస్తరించి, అన్వేషణారంగం పెరిగి మానవ జ్ఞానపరిధి విశాలమైనదిగా మారుతుంది.

ఫలప్రదమయ్యే ఆచరణ ఉండాలంటే స్పష్టమయిన భావాలు దృఢమైన విశ్వాసాలు అవసరం. ఆచరణలో పొందిన అనుభవాన్ని బట్టి భావాలకు స్పష్టత, విశ్వాసానికి దృఢత్వం చేకూరుతుంది. తాత్త్వికుని అధ్యయనంగానీ, పరిశోధనాలయంలో విజ్ఞాని పరిశీలనగానీ, విద్యావేత్తబోధనా భావాలోచనగానీ, జీవితానికి సంబంధం లేకుండా కేవలం వైజ్ఞానికరంగానికే పరిమితంచేస్తే, సిద్ధాంత సమస్యలు సహితం చిక్కుల్లోపడి పరిష్కారాలు మార్మికంగా తయారవుతాయి. నైరూప్య ఆలోచన, తార్కిక చింతన జీవితానికి అవసరమే. ఇంకా వాటి ప్రయోజకత్వం కూడా వాటి ప్రాధాన్యతను ఇనుమడింపచేస్తుంది. అది లేకుంటే నైరూప్య ఆలోచన. తార్కిక చింతన బాధ్యతా రహితమయిన మేధస్సు లక్షణంగా దిగజారవచ్చు.

ఆధునిక మేధావులు వృత్తిపరంగా వెల్లడించే సంశయవాదాన్ని విజ్ఞానాన్వేషణగా చూడరాదు. పిడివాదాన్ని కాదనడానికి ఎటువంటి విశ్వాసంతో పోరాడినా ఫరవాలేదు. మానవజ్ఞానం ఎప్పుడూ లోపభూయిష్టంగానే ఉంటుంది. తెలుసుకోవలసింది ఎప్పుడూ ఉండనే ఉంటుంది. అంతమాత్రాన జ్ఞానార్జనలో శూన్యవాదానికి పోనక్కరలేదు. ఇక్కడే విజ్ఞానాన్ని ఆధారంగా చేసుకుని మతాన్ని తిరగదోడటం, అలౌకిక అతిభౌతికవాదం వైపుకుపోవడం, కొత్త మార్మికవాదాన్ని ప్రవేశపెట్టడం జరుగుతున్నది.

భౌతిక సత్యాన్ని (పదార్థవాదం అనేమాట నిజంగా అభ్యంతరకరమైతే) విమర్శించేవారు, వివేచన, నైతిక ప్రవర్తనల గురించి చెప్పేటప్పుడు, భౌతికవాదానికి, విశ్వశాస్త్రంగాగాని, అతిభౌతికంగాగాని, జీవిత తత్త్వంగాగాని, ఆధునిక విజ్ఞానంలో ఎలాంటి ఆస్కారమూ లేదంటారు. కనుక మతరహితమయిన నీతిశాస్త్రం సాధ్యపడదన్నమాట. విలువలను నిర్ణయించడానికి ఏ ప్రమాణాన్ని హేతుబద్ధంగా సూచించరు, అంగీకరించరు.

అలౌకికతత్త్వానికి భిన్నంగా, వివేచనాధారంగా నైతిక సాంఘికతత్త్వాన్ని నిర్మించడం సాధ్యపడదని పై వాదనల సారాంశం. భౌతికవాదం పాతకాలపుదని అత్యంత ఆధునిక మేధావులు కొందరు ఆగ్రహంతో కొట్టిపారేస్తుంటారు. వారి ధోరణి

భావాదర్శమనిచెబితే అభ్యంతరం చెబుతారు. పదార్థవాదిగా (భౌతికసత్యం) లేక భావవాదిగా మాత్రమే ఉండాలనే ప్రతిపాదనచూసి వీరంతా మందహాసంచేస్తారు. పదార్థవాదాన్ని కాదనే భావతత్త్వం మార్మికమయిన అతిభౌతికతకు, అలౌకిక విధానానికి చెందినదని వీరు గుర్తించరు. మధ్యే మార్గాన్ననుసరిస్తూ నూతన తాత్త్విక విధానాలనూ, నిశిత వాస్తవికవాదం, నవ్య వాస్తవికవాదం, తార్కిక ప్రత్యక్షవాదంవంటి వాదనలనూ గందరగోళంతో ఉన్న ప్రపంచానికి అందించ ప్రయత్నిస్తారు. వాస్తవికతను మార్మికంగా గమనించడమే ఈ విధానంలోని సారాంశం. భావాలుగానీ, పదార్థంగానీ వాస్తవం కాదంటారు. వాస్తవం రెండు ప్రాయికమయిన లక్షణాల కలయిక లేక సమన్వయం అనికూడా అంగీకరించరు. అయినప్పుడు వాస్తవం అంటే ఏమిటి? సాధారణమయిన ప్రశ్నకు సూటిగా  సమాధానం చెప్పేటప్పుడు కుతర్కవాదాన్ని ఆధునిక వైజ్ఞానిక పండితులు వినియోగించుకుంటున్నారు.

జీవిత పరమసత్యం మానవుడన్నా కావాలి లేదా అజీవమయినా కావాలి. మానవుడి అవగాహనకు అందుబాటులో లేనిది ఏదో అయిఉండాలి. గ్రహింపరాని ఈ మార్మికసత్యం, దేవుడనుకొని పూజింపవచ్చును. లేదా విశ్వనియమంగా భావించవచ్చును. లేదా విశ్వసమ్మేళనంగానూ, నైతికరీతిగానూ, అతిభౌతిక ఐక్యతగానూ గమనించవచ్చును. అలాగయితే ప్రపంచానికి ఏదో ప్రయోజనమున్నదనే భావన తప్పనిసరవుతుంది. అప్పుడు మానవుడి సృజనశక్తికి, ఎంపికకు, స్వేచ్ఛకు అవకాశంలేదు. ప్రత్యామ్నాయంగా, అవగాహనకు అందని మార్మికత, పదార్థానికీ భావనకీ చెందక, మానవుడిలోనే ఉంటూ, అంతఃకరణగా భావించబడుతున్నది. అంటే మార్మికవాదం సంపూర్ణంగా ఉన్నదన్నమాట. ఆధునిక మేధావులుచెప్పే ఈ తత్త్వం, కనిపించేదానికి భిన్నంగా సిద్ధాంతీకరిస్తున్నది. మేధస్సుకంటే అంతరాత్మను ఉన్నతస్థాయిలో ఉంచి, వివేచనారాహిత్యతను దివ్యమయినదిగా భావిస్తున్నది. ఇటువంటి తత్త్వం వలన మానవుడు యంత్రంగా మారిపోయినా, పైకిమాత్రం అనంత శక్తివంతుడుగా కనిపిస్తాడు. అతడు మానవతను కోల్పోతాడు. యంత్రం సృష్టికర్తకాదు. సృష్టికి మానవుడు ఒక సాధనగా మాత్రమే ఉపకరిస్తున్నాడు.

బెర్గ్‌సన్ ప్రవచించిన వైజ్ఞానిక వివేచనారహిత వాదం, అంటే, అంతర్బుద్ధివాదం ఫాసిజానికి తాత్త్విక పునాదులు వేసింది. మానవుడి వ్యక్తిత్వాన్ని గురించీ, స్వేచ్ఛను గురించీ తమకుగల జుగుప్సను సమర్థించుకోడానికి జీవశాస్త్రం, ఆదిమ మానవశాస్త్రం ఆధారంగా ఉన్నట్లు ఫాసిస్టులు పేర్కొంటున్నారు. యుద్ధాన్ని శ్లాఘించడం, జాతి అవున్నత్యాన్ని దివ్యమయినదిగా భావించడం కూడా వైజ్ఞానిక పరమైనదిగా వీరు చెబుతుంటారు.

18వ, 19వ శతాబ్దాల్లోని వైజ్ఞానిక ప్రతిపాదనలలో కొన్నింటిని ఇప్పటి విజ్ఞానం తృణీకరిస్తున్నదనడంలో సందేహంలేదు. భౌతిక తత్త్వం కూడా ఆవిధంగానే పదార్థ వాస్తవవాదం ఆధారంగా మార్చి, విస్తృతపరచవలసిఉంది. అంతమాత్రాన ఆధునిక విజ్ఞానం నిర్దుష్టంగా అందిస్తున్న విషయాలు భౌతికవాదం యొక్క మూలసూత్రాలను కాదనడంలేదు. ఉనికికి సంబంధించిన వివరణ చేస్తున్నప్పుడు ప్రపంచానుభవాన్నీ, తర్కాన్నీ సమన్వయీకరించి సమగ్ర తత్త్వంగా పేర్కొంటున్నారు. అందువలన భౌతికవాదం నిరంతరం అజ్ఞానానికి అనుగుణంగామారుతూ, విస్తరిస్తూ, నిర్దుష్టంగా రూపొందుకుంటూ సాగిపోతుంటుంది.

సంప్రదాయబద్ధమైన భౌతికవాదంలో నీతిశాస్త్రానికీ విశ్వవాదానికీ సంబంధం లేకపోవడం పెద్దలోపం. భౌతికవాద చరిత్ర నైతిక తత్త్వంతో నిమిత్తం లేకుండానే ఉండగలదని భావించారు. పదార్థానికీ మనస్సుకూ ఆనాడు ఊహించిన తేడా నేడు వెల్లడవడంవలన ఆలోపాన్ని సవరించవచ్చును. డేకార్ట్ చెప్పిన మానసిక-భౌతిక సమాంతరవాదం ఇక చెల్లదు. విశ్వంలో నియమం, పదార్థ నియతివాదంలో హేతువిధానం ప్రాతిపదికలుగా, జీవపరిణామంలోనే వివేచనకు వ్రేళ్ళున్నాయని కనుగొనవచ్చు. యాంత్రికమయిన విశ్వవాదం వివేచనాత్మకమయిన నీతిశాస్త్రం కలిపి సాధారణ తత్త్వాన్ని రూపొందించవచ్చును.

భౌతికవాదాన్ని తృణీకరించడం, దానినే పదార్థసత్యంగా పేర్కొనడం, ఆధునిక విజ్ఞానంతో దీన్ని సమన్వయీకరించడంతో కొన్ని ఫలితాలేర్పడుతున్నాయి. అతిభౌతికంతో నిమిత్తంలేని వివేచనావాదం సాధ్యం కాగలదు కానీ, అలౌకికవాదంతో సంబంధంలేని నైతికతత్త్వం అసాధ్యమని అనడానికి వీలులేదు. వివేచన గనుక అతి భౌతికమైనదయితే వివేచనావాదానికీ మార్మికవాదానికీ తేడా కనుగొనడం కష్టం. హేతువాదానికీ నిర్హేతుకవాదానికీ విచక్షణ చూపడంకూడా అర్థరహితమవుతుంది. అతి భౌతిక వివేచనావాదంతో అంటే అంతర్బుద్ధివాదంతో నీతిశాస్త్రం కనుక జతగూడిఉంటే అలౌకికవాదమే వీటన్నింటికి ప్రమాణంగా ఉండాలి. దైవత్వం ఒక్కటే మంచితనం అవుతుంది. సత్యం అంటే ఋషికి సాక్షాత్కరించే విషయమన్న మాట. వివేచన, నీతి అనేవి దేవుళ్లకు ఋషులకు సంబంధించినదైతే, తన స్వశక్తిపై ఆధారపడి తన విధిని తానే మలచుకోగలమానవుడికి అందులో చోటులేదు. భౌతికవాదిగా మాత్రమే మానవుడు తనమీదతాను విశ్వాసాన్ని పెంపొందించుకుని, తనతోపాటు మానవాళి విధిని రూపొందించడంలో పురోగమించగలడు.

17వ శతాబ్దంలో తొలుత ఆరంభమయిన ఆధునిక రాజకీయ సిద్ధాంతాలన్నీ వ్యక్తితోనే ప్రారంభించాయి. సమాజానికి మూలం ఏమిటనేదే సమస్యగా పరిణమించింది.

నాగరిక సమాజాన్నెలా స్థాపించారు? నాగరిక సమాజ మూలాన్ని తెలుసుకుంటే ఆధునిక రాజకీయ సంస్థల సృష్టికి అదే మార్గదర్శకంగా ఉండగలదు. సమాజమూలాన్ని గురించి వివిధ ఆలోచనాపరులు భిన్న రీతులలో వివరణ ఇచ్చారు. మానవుడు వివేచనాత్ముడనే ధోరణి అంతర్లీనంగా వారి ఆలోచనలలో ఉన్నారు. సామాజిక ఒడంబడిక సిద్ధాంతం 16వ శతాబ్దంలో రూపొందించినప్పటికీ చివరకదే ప్రజాస్వామ్యానికి ప్రమాణమయింది. తాత్త్వికంగా చూచినప్పుడు దీనికి వేరేగా వ్యాఖ్యానం చేసారు, లాక్ వ్యాఖ్యానానికి భిన్నంగా రూసో భాష్యం చెప్పాడు. లాక్ సిద్ధాంతంపై ఆధారపడిఉన్న ఉదారవాదం వ్యక్తి సార్వభౌముడనే మానవతా సూత్రాన్ని అట్టిపెట్టింది. రూసో నియంతృత్వానికి ప్రవక్త. అతడి జనేచ్ఛ సిద్ధాంతం ఇందుకు నాంది పలికింది. మధ్యయుగాల్లో ప్రబలిఉన్న దైవాంశసంభూత హక్కు అనే సూత్రాన్ని తొలగించి అతిభౌతికమయిన సార్వభౌమత్వ భావనను ప్రవేశపెట్టారు. రాజులు దైవాంశ సంభూతులుగా పరిపాలనచేస్తే, రూసో ప్రజాస్వామ్యం కూడా అతిభౌతిక ప్రమాణాన్నే ఆధారం చేసుకుంది. ఉత్తరోత్తరా మానవుడిని పూర్తిగా మరచిపోయారు. సంస్థలకు ఎక్కువ ప్రాధాన్యం ఇచ్చారు. ఆదిమ సమాజమేర్పడినప్పటినుంచీ, మానవుడి ఉనికికీ, మార్పుకూ తోడ్పడేనిమిత్తం సంస్థలను సృష్టించుకున్నాడనే విషయాన్ని పూర్తిగా విస్మరించాడు. చివరకు సృష్టికర్తకంటే సృష్టికి ఎక్కువ ప్రాధాన్యత లభించింది. ప్రస్తుత సాంఘిక సంక్షోభానికి ఇదే ఆధారంగా ఉన్నది.

మధ్యయుగాల్లో ఉన్న వాదంతో పోల్చితే ఆధునిక ప్రజాస్వామ్యం మెరుగనే చెప్పవచ్చు. కానీ వ్యక్తులు రాజ్యాంగబద్ధమైన కల్పిత విషయాలుగా మారిపోయాయి. తెలివి–తేటలు, ఉద్రేకం, ఇచ్ఛ గల మానవుడికి గ్రహణం పట్టింది. ఆధునిక ఉదారవాదంలో వ్యక్తి ఆర్థికపరమయినవాడుగానే మారిపోయాడు. 19వ శతాబ్దంలోని తాత్త్విక, మౌలికవాదం వ్యక్తిస్వేచ్ఛనే ప్రధానంగా భావించింది. క్రమేణా అది ఆధునిక ప్రజాస్వామ్య సంప్రదాయంలో దిగజారిపోయింది. పెట్టుబడిదారీ సమాజంలో ఆర్థికజీవి బానిసగానూ, బానిసలను పోషించేవాడుగానూ ఉండగలడు. వ్యక్తిని ఈ విధంగా కించపరచడంతో ఉదారవాదానికీ సంబంధించిన ప్రజాస్వామ్య సిద్ధాంతంలో వ్యక్తిస్వేచ్ఛ అపఖ్యాతిపాలయింది. తత్ఫలితంగా మార్క్సిస్టు సమష్టివాదం తలెత్తింది. ఇందులో మానవుడు సంస్థలమధ్య సంపూర్ణంగా అదృశ్యం అవుతాడు. సమాజాన్ని నియంతృత్వ సంస్థలుగా పునర్మిస్తే వ్యక్తిస్వేచ్ఛ ఉంటుందని మార్క్సిజం భావించింది. నియంతృత్వాలు ఘర్షణలుపడి ప్రజాస్వామ్యాన్ని నాశనంచేస్తున్నాయి. చరిత్రలో ఇలాంటి సంక్షోభం బహుశా ఎప్పుడూలేదేమో, రాజకీయ, ఆర్థిక, నైతిక, భావసంబంధమయిన ఈ సంక్షోభం మానవజాతి మనుగడ అంతటినీ ప్రభావితం చేస్తున్నది.

రోమన్ సామ్రాజ్యం చివరిదశలో పతనం పొందినట్లుగానే ఆధునిక ప్రపంచంకూడా ఇంచుమించు ఆ దారినే పయనిస్తున్నది. నిరాశావాదులైన ప్రవక్తలు నాగరికం అంతమౌతున్నట్లు చెబుతున్నారు. పరిస్థితి ఆశాజనకంగా కనిపించడంలేదు. మానవతా సంప్రదాయానికి గ్రహణం పట్టడమే ఈ పతనావస్థకు కారణం. మానవవాద సంప్రదాయానికి భిన్నంగా పయనించడం ప్రారంభించినప్పుడే ఆధునిక నాగరికతకు ఈ దశ పట్టింది. మానవుడిని సంస్థలకు లొంగిపోయేటట్లు చేయడం, ఊహాజనితమైన సమష్టి తత్త్వాల ముందు మానవ వివేచన మేధస్సును ఖాతరు చేయకపోవడం, మానవులకంటే జాతి గొప్పదనడం, వ్యక్తులకంటే సమాజం ఉన్నతమైనదనడం ఇత్యాది కారణాలు పురస్కరించుకుని పతనావస్థ ఏర్పడింది. దోషపూరితమైన ఈ భావాల ఆధారంగా అనేక రాజకీయ సిద్ధాంతాలు బయలుదేరి మానవతావాద సంప్రదాయానికి వ్యతిరేకంగా, వ్యక్తికి విలువ ఇవ్వకుండా సమష్టితత్త్వాలను ప్రోత్సహించినది. ఆధునిక నాగరికతకు ప్రేరణ కల్పించిన వ్యక్తిత్వం నాశనం కావడంతో భయానక పరిస్థితి ఏర్పడింది.

తొలి మానవుడు జీవిత పోరాటంలో పోషకాహారం నిమిత్తం కొమ్మలు విరిచి వాటి ఆధారంగా పండ్లు త్రెంచడం మొదలు పెట్టినప్పటినుంచీ, మానవసృష్టి సాగిపోతూనే ఉన్నది. చిరకాలంగా వస్తున్న ఈ సృష్టియొక్క అనుభవం అట్లా ఉండగా, మానవుడు తనలో విశ్వాసాన్ని కోల్పోయాడు. ఇంతకుమించిన విషాదాంతం బహుశా ఏ భాషలోనూ వెలువడలేదేమో. ఈ సంక్షోభంనుంచి బయటపడాలంటే మానవుడు తనపై విశ్వాసాన్ని మళ్ళీ తెచ్చుకుని మానవవాదాన్ని తిరగదోడాలి. నేటి సంక్షోభం సర్వాంతర్యామిగా ఉన్నది. సునిశితమైన కొందరు వ్యక్తులు తప్ప ప్రజాబాహుళ్యం ఇంకా ఈ సంక్షోభాన్ని గురించి పట్టించుకోవడంలేదు. ఈ విషయమై వారిలో చైతన్యత కలుగలేదు. అందువలననే పరిష్కారం ఇంకా జటిలమైంది. సంక్షోభాన్ని గురించి అందరూ గ్రహించేటట్లు చూడటం ప్రథమ కర్తవ్యం. కారణమేదయినప్పటికి సాధారణ స్త్రీ పురుషుల దైనందిన జీవితంలో సంక్షోభాన్ని అనుభవిస్తూనే ఉన్నారు. ఈ అనుభవం నుంచి గుణపాఠం నేర్చుకోవడంలో వారికివి సహకరించాలి. అప్పుడు సంక్షోభాన్ని గురించి ప్రయోజనాత్మకమైన జాగరూకత కలుగుతుంది. ఇది జరిగితే కారణాలను అవగాహన చేసుకోవడంకూడా సంభవమే.

ప్రకృతిలోగాని సమాజంలోగాని, మానవుడు పరిసరాలవలననే ఉక్కిరిబిక్కిరి కాకూడదు. లోగడ స్వేచ్ఛాన్వేషణలో మానవుడు జీవితాన్నుంచి పరారీ అయ్యాడు. బలవత్తరమైన శక్తితో పోరాడటం దేనికని భావించరాదు. అటువంటి సమరంలో ఓటమి పొందేకంటే, తెలివిగా ఉపసంహరించుకుని సమాజానికి వెలుపల ప్రశాంతంగా

ఉండాలనుకొన్నాడు. ప్రకృతి శక్తులుకూడా తన దరిదాపులకురావని భ్రమచెందాడు. ఒకానొకప్పుడు ఇట్లాంటి పలాయనం సాధ్యం కావచ్చుగాక. నేడు ప్రపంచంనుంచి ఎవరూ పారిపోలేదు. మతాలను ఆశ్రమాలను సహితం మానవసత్యాలు వెన్నాడుతున్నాయి. జీవితపు ఒడుదుడుకులను భ్రమఅని త్రోసిపుచ్చడానికి వీలులేదు.

మానవుడు స్వేచ్ఛకోసం పోరాడాలి. భౌతిక ప్రపంచంలో భావవిమోచన పొందాలి. ఇది వృధాస్వప్నం అనో చిరకాలంగా జరుగుతున్న మోసం అనో భావిస్తే తప్ప సాధించడం సాధ్యమే. జీవితంలో ఎదురౌతున్న అనేక ఆశలకు తట్టుకుని నిలబడగలననే ధీమా మానవుడికి ఉన్నప్పుడు ఆమేరకు అతడు స్వేచ్ఛాపరుడే. మానవుడు స్వేచ్ఛను వాంఛించడమేగాక, స్వేచ్ఛను సాధించగల శక్తిమంతుడుకూడా. ఇది వాస్తవమేగాని ఊహకాదు. మానవతావాదానికి సారాంశం ఇదే. ఆధునిక సంస్కృతికీ ఆలోచనకూ ఈ తత్త్వం బాగా సహకరించింది. ఆధునిక కాలంలో అభివృద్ధికి తోడ్పడిన మానవవాదం వ్యక్తుల వ్యవహారాలపై ప్రభావాన్ని చూపెట్టడంలో ఎందుకు విఫలం అయింది? భౌతిక ప్రపంచాన్ని గురించి తెలుసుకున్నంతగా తనను గురించి మానవుడు తెలుసుకోలేడు. మానవుడికి ప్రథమ స్థానమున్నప్పటికీ అతడంటే ఏమిటో ఇంకా వివరణ జరగవలసి ఉంది. మానవుడు తనకుతానే మర్మంగా మారాడు.

నేటి శాస్త్రీయధోరణిని అనుసరించి మానవాళికి సంబంధించిన భావనలేదు. మానవతావాదం ఉద్వేగభావమనీ, కళ, సాహిత్యానికి మాత్రమే అది ఉపకరిస్తుందని భావించారు. అయితే తనను గురించి మానవుడు ఇప్పటికే చాలా తెలుసుకున్నాడు. అజీవ పదార్థంనుంచి ప్రాణమెలావచ్చిందో ఇంకా స్పష్టంగా తెలియకపోవచ్చు. కానీ పరిణామక్రమాన్ని గురించి విజ్ఞానంలో సందేహానికి తావులేదు. భౌతిక విధానంలో ప్రాణం రావడానికి బైటి శక్తులేవో తోడ్పడ్డాయని నమ్మే అవసరం లేదు. భౌతిక విధానంలోనే ఇది గర్భితంగా ఉన్నది. అర్థశతాబ్దానికి పూర్వంకంటే ఇప్పుడు జ్ఞానమెంతో పెరిగింది. అంతమాత్రాన మానవుణ్ణి గురించిన జ్ఞానం ఒక దశకు చేరుకున్నదని చెప్పవచ్చు. జీవితాన్ని గురించికూడా ఇంకా అంతా తెలియకపోవచ్చు. కానీ తెలియరానిదంటూ ఏమీలేదు. ఉనికిలో ఉన్నదంతా మానవ అవగాహనకు అందుబాటులోనిదే.

ప్రకృతినుంచి ఆవిర్భవించిన మానవుడు, సృష్టిలోని అత్యుత్తమమైనదంతా స్వీకరించాడు. సృజనాత్మక శక్తిఅంటూ ఉంటే అది మానవుడిలోనే ఉంది. అతనిద్వారానే సృజన వ్యక్తమవుతుంది. మనిషి చెడ్డవాడనీ, అవినీతిపరుడనీ, ఆలోచనారహితుడనీ, కనుక ప్రపంచాన్ని గురించి ఎలాంటి ఆశలు పెట్టుకోరాదనీ చాలామంది భావించారు. కాని మానవుణ్ణి గురించి తెలిసినదాన్ని బట్టి అతడు ప్రాయికంగా వివేచనాపరుడని

భావించాల్సి వస్తుంది. వివేచనారహితంగా కనిపించే మానవుడి ప్రవర్తనలోకూడా, విశ్లేషించి చూస్తే వివేచన కనిపిస్తుంది. తన పరిసరాలను దృష్టిలో ఉంచుకుని తెలివిగా స్పందించడంవలన మానవుడిలో నీతి జనిస్తుంది. అంటే మానవుడి వివేచన నుంచి నీతి వస్తున్నదని చెప్పవచ్చు. మానవ స్వభావంలో వివేచన ఇమిడి ఉండటంవలన, తన జీవసంపద గురించి అతనికి గుర్తుచేయడంవలన మళ్ళీ ఆత్మవిశ్వాసంపొంది, ఇంతకాలం జరిగిన హానిని తొలగించుకోగలడు. గతంలో జరిగిన దోషాలను గుర్తించి సవరించుకునే ప్రయత్నంలో, నేటి సంక్షోభానికి మానవుడు మార్గాంతరాన్ని కనుగొనగలడు. గతంలోకంటే ఇంకా ఉన్నతమయిన వాటిని సాధిస్తూ ముందుకుపోగలడు.

నేటి సమస్య నైతిక సమస్య. ముఖ్యంగా సమాజపరమయిన నీతి వేధిస్తూన్న సమస్య. నైతిక ప్రవర్తనకు ఒక ప్రమాణాన్ని కనుగొనాలి. అంతర్బుద్ధిలో నీతి ఉన్నదంటే, ఒకానొక పరిస్థితిలో ఇద్దరు మనుషులు ఎలా ప్రవర్తిస్తారో చెప్పడం కష్టం. అంతర్బుద్ధిగాని, ప్రేరణగాని ఎలాపనిచేస్తున్నదో తెలియదు కదా! అందరికీ సంబంధించిన సాధారణమయిన ప్రవర్తన ఉండటానికి వీల్లేదన్నమాట. అంతర్బుద్ధి ఆధారంగా ఉన్న నీతిలో ప్రమాణానికి తావులేదు. బాహ్యప్రమాణం లేనప్పుడు నైతికవిలువలు స్వప్నజగత్తులో ఉండాల్సిందే.

వివేచనా ప్రమాణానికి నిలబడగల విధానాలు కావాలి. మానవుడు, జీవశాస్త్రం, శారీరకశాస్త్రం, మానసికశాస్త్రం అందిస్తున్న జ్ఞానాన్ననుసరించి మానవుడు వివేచనాపరుడని స్పష్టపడుతున్నది. అంతర్లీనంగా ఉన్న వివేచనకు ప్రస్తావించిచూస్తే నీతి కనిపిస్తుంది. అప్పుడు వాస్తవాన్ని అనుసరించి విలువలను రాబట్టవచ్చు. ఈ విధంగా నీతికి బాహ్యప్రమాణాలను సమకూర్చవచ్చు. మంచిని వివేచనాత్మకంగా భావించినప్పుడే అందరికీ సంబంధించిన ప్రమాణాలుంటాయి. మానవుణ్ణి గురించిన సారాంశం అవగాహనచేసుకుని, అతడి ప్రాయికమయిన వివేచనను కనుగొన్న తరువాత సమస్య సులభంగా పరిష్కారం అయింది. జీవులుగా మానవులు ఒకేవిధమయినవారు కావడంవల్ల, ఒకేపరిస్థితులలో ఇంచుమించు ఒకేధోరణిలో స్పందిస్తారని చెప్పవచ్చు. అయితే ఇందుకు సంబంధించిన కనీసజ్ఞానం మానవుడికి ఉంటేనే ఇది సాధ్యపడుతుంది. విడమర్చి చూడగలగడం, నిర్ణయానికి రాగలగడం అనే శక్తి మానవుడికి ఉందికనుక ఒకే పరిస్థితులలో ఒకేవిధంగా స్పందించే ఆనవాయితీకూడా అభివృద్ధి చేయవచ్చు. రాజకీయాలలోనూ, ప్రజాజీవితంలోనూ నీతిని ప్రవేశపెట్టగలమనే ఆశ ఉన్నదంటే కారణాలు ఇవే.

మతేతరంగా వివేచనాత్మకనీతికి అవకాశం ఉన్నదని గుర్తించడంతో ఆధునిక

ప్రపంచంలో నూతన దృక్పథాలేర్పడినవి. మానవుడి హుందాతనం, వ్యక్తిత్వం, సార్వభౌమత్వం, సృజనాత్మకతవంటి భావాలు అర్థవంతమయినవి. తనంతటతానుగా మానవుడు మంచిగా ఉండలేడనే భావనవలన నిస్సహాయత, నిస్పృహ జనిస్తుంది. సామాజిక రాజకీయ విమోచనకుముందు భావవిమోచన జరగాలి. మానవ ఉనికి స్వయం సంపూర్ణమని గ్రహించాలి. తన విధికి తానే నిర్ణేతఅనీ, తను నివశించే ప్రపంచాన్ని మెరుగుపరచుకోగలడనీ గుర్తించాలి. ఇప్పుడున్న జ్ఞానాధారంగా ఈ గుర్తింపువస్తే మానవుడికి ఆత్మవిశ్వాసం ఏర్పడుతుంది. నేటి నైతిక సంక్షోభానికి పరిష్కారం లభిస్తుంది.

బుద్ధి-జీవులందరికీ ఈ భావాలు నచ్చుతాయి. కానీ వీటిని ఎంతవరకూ ఆచరణలో పెట్టగలమని సందేహిస్తారు. అదే నేటి సంక్షోభ సారాంశం. మానవుడు ఆత్మవిశ్వాసాన్ని కోల్పోయినదానికి నిదర్శనం. ఒక భావం మంచిదేనంటూ, ఆచరించడానికి నిస్సహాయత వ్యక్తపరిస్తే అంతకంటే విషాదం మరొకటి లేదు. ఆచంయుక్తమయిన దానినే అనుసరించాలి. మంచిభావాలు ఆచరణయుక్తం కాకపోతే మానవుడు చెడుభావాలను ఆచరించాలన్నమాట.

చిరకాలంగా అనేకమంది నైతికవాదులున్నారు. వారు ఉన్నతాదర్శాలను ప్రభోదించారు. కానీ అవి ఆచరణలోకి రాలేదు. ఇప్పుడు ప్రజాజీవితంలో నీతిని ప్రవేశపెట్టడానికి, తాను బోధించేవాటిని ఆచరించడం కొందరయినా మొదలుపెట్టాలి. ఆధునిక ప్రపంచం ఉన్నతశాలవలె కన్పిస్తున్నది. ఉద్రేకాలు వ్యాపించి ఉండగా వివేచన కనిపించడంలేదు. కనుక బోధించడం వృధా. కానీ కొందరు వ్యక్తులు వివేచనతోను, నీతిగాను నివశిస్తే అద్భుతమయిన ఫలితాలు వస్తాయి. ఆచరించడానికి మించినదిలేదు. అప్పుడు చాలామంది వారిని అనుసరిస్తారు.

ద్వేషం, అసూయ, అధికారతృష్ణ ఇత్యాదులే ప్రజలను ఆకర్షిస్తున్నవి. మనిషిని మూకలో కలిపేసిన రాజకీయవాదులూ, సంఘనిర్మాతలూ పెనుభూతాన్ని సృష్టించారు. ఆలోచన లేని పశుతుల్యంగా మానవుడిని మార్చేసారు. అధికార రాజకీయాల ప్రయోజనంకోసం ఇదంతా చేసారు. అధికారంలోకి రావడానికి రాజకీయపార్టీలకు ఓట్లు కావాలి. ఉద్రేకాలకు, రాగద్వేషాలకు విజ్ఞప్తిచేస్తే జనాన్ని ఆకర్షించడం సులభం. వివేచనలో అది లేదు. ప్రజలు ఎంత వెనుకబడిన వారయితే అంతగా ఉద్రేకాలు, రాగద్వేషాలు వారిని ఆకర్షిస్తాయి. కనుక ప్రజల్ని వెనుకబడినవారుగా అట్టిపెట్టడం ఆధునిక ప్రజాస్వామ్య రాజకీయాలలో స్పష్టంగా కనిపిస్తున్నది. అధికారం చెడగొడుతుందని చెబుతారు. చెడిపోయినవారినే అధికారం చెడగొట్టగలదు. చెడిపోనివారికి అధికారంలోకి వచ్చే అవకాశంలేదు. కనుక ప్రజాస్వామ్యం కాస్తా

మూకస్వామ్యంగా దిగజారింది. దీనికి ప్రత్యామ్నాయంగా, హింసాయుత విప్లవంతో అధికారాన్ని హస్తగతంచేసుకుని, సాంఘిక మార్పులను బలవంతంగా పైనుంచి అమలుపరిచినా సత్ఫలితాలు రాలేవు.

✦ ✦ ✦

# మార్గాంతరం

సమకాలీన ప్రపంచంలో అలముకున్న అంధకారాన్ని చూచి మానవాళికి భవిష్యత్తు ఉన్నదని నమ్మేవారంతా కలవరపడుతున్నారు. వారంతా దిగ్భ్రాంతి చెంది చూస్తూ ఊరుకోరాదు. నిస్సహాయంగా విధికి వదిలేసి స్థంభించిపోరాదు. నాగరిక ప్రపంచాన్ని భయపెడుతున్న కారణాలేమిటో ఆలోచించి, దానిని అంతం చేయడానికి కృషి చేయాలి.

అనేక విధాలయిన సనాతనత్వాలు, అంధ విశ్వాసాలు ఉన్మత్త వాతావరణాన్ని సృష్టిస్తున్నాయి. ఇందుకు వ్యతిరేకంగా అభ్యుదయలోకం వివేచనను ఎలుగెత్తి చాటటంతో ప్రారంభించాలి. మరొక యుద్ధం తప్పదనే విధివాదంలో నమ్మకం ఉంచటం బాధ్యతారాహిత్యానికి, ఆలోచనారాహిత్యానికి నిదర్శనం. ఈ యుద్ధం పాతవ్యవస్థను హరించివేసి నూతన విధానానికి దారికల్పిస్తుందని నమ్మటం కూడా అర్ధరహితం మార్క్సిస్టు ఆర్థిక నియతివాదానికి అనుగుణంగా ఈ అభిప్రాయం ఉంటే ఉండవచ్చును. మానవ సంస్కృతిలోని చైతన్యంపట్ల యీ వాదం తన అజ్ఞానాన్ని బయటపెట్టుకొంటున్నది. చరిత్రకు పూర్వం ఆటవిక నియమం ఆధిక్యత వహించినట్లు ఇప్పుడుకూడా మానవుడిపై విశ్వాసం లేకుండా ఆర్థిక నియతివాదం వచ్చింది. (కార్ల్‌మార్క్స్ ఫ్రెడరిక్ ఏంగిల్స్ వ్రాసిన కమ్యూనిస్టు మానిఫెస్టోను గమనించాలి).

మరొక ప్రపంచయుద్ధం ప్రమాదకర పరిస్థితులకు దారితీస్తుందని, ఆధునిక నాగరికత తుడిచి పెట్టుకుపోతుందని గుర్తించడానికి పెద్దఊహ అవసరంలేదు. ఈ ప్రమాదం రాకుండా నివారించడానికి భారీ ఎత్తున ప్రయత్నాలు జరగాలి. ఇందుకుగాను కాలదోషం పట్టిన రాజకీయ వాదాలను, చరిత్రకు సంబంధించిన సిద్ధాంతపరమయిన ఊహాగానాలను తొలగించి వాటిస్థానే కొత్తవి ప్రవేశపెట్టాలి. విధి నిర్ణయించిందా! అన్నట్లుగా మూడవ ప్రపంచయుద్ధం వైపుకు సాగుతున్న ధోరణిని పాశ్చాత్య ప్రజాస్వామ్యంకాని, రష్యన్ కమ్యూనిజంకాని నిరోధించలేవు. సమకాలీన సంక్షోభంనుంచి తప్పించడానికి ఈ రెండు వ్యవస్థలు తగిన నాయకత్వాన్ని ఇవ్వడంలేదు. ఈ దోషాలన్నింటికి సర్వరోగ నివారిణిగా చూపుతూ నామ మాత్రంగా ఒక వ్యవస్థ ఉండగా, రెండవ వ్యవస్థ ఆదర్శంపట్ల ఆసక్తిని కోల్పోయి స్వేచ్ఛకోసం పోరాడే వారిని వ్యతిరేకిస్తున్నారు. నియంతృత్వాధిపత్యాన్ని, భావాలను అణచివేసే పద్ధతిని అడ్డుకుంటే

వీరు సహించటం లేదు. రెండవ ప్రపంచయుద్ధానంతరం రెండుగా చీలిపోయిన ప్రపంచనాయకత్వం మధ్య అభ్యుదయ లోకం ఊగిసలాడుతున్నది. ప్రజాస్వామ్య స్వేచ్ఛను, ఆర్థిక సమానత్వాన్ని, మానవ సంపద సమకూర్చిన సాంస్కృతిక విలువలను, ఈ అభ్యుదయ లోకం ఇంకా కాంక్షిస్తున్నది. ప్రమాణాల విలువ, ప్రవర్తనకు అంగీకారం లేనంతకాలం ప్రయోజనం ఉండబోదు సరికదా, సహకారం కూడా లభించదు. తత్ఫలితంగా చిత్రహింసకు గురి అవుతున్న సందేహాలు, అనుమానాలు, మానవ ద్వేష ప్రయత్నాలతో పరస్పరం వెన్నుపోటు పొడుచుకుంటూ ఉండగా, అస్థిరత్వం భయం వలన ప్రమాదపరిస్థితి రానున్నదా అనిపిస్తున్నది. చరిత్రలో ఏర్పడిన ఈ ప్రమాదకర పరిస్థితుల నుంచి నాగరిక ప్రపంచానికి నూతన ఆశ, నూతన విశ్వాసం, నూతన ఆదర్శం కల్పించే విప్లవాత్మకమయిన సిద్ధాంతం ఆచరణతో కూడినట్టి నూతన తత్త్వం కావాలి.

ఈ నూతన తత్త్వంలో స్వేచ్ఛాభావానికి తగిన ప్రాతిపదిక కల్పిస్తేగాని కొత్త ఆశలు చిగురించవు. విభిన్న సిద్ధాంతాల వేషాలు, పరస్పర విరుద్ధమయిన అపస్వరాలు పలికే ఆదర్శాలు, ఘర్షణకు లోనవుతున్న మొండి వాదనలు ఆధారంగా సాంఘిక వ్యవస్థలను, రాజకీయ సిద్ధాంతాలను, విమోచన గావించాలంటే సాధ్యమయిన పనికాదు. మానవాభివృద్ధి అనేది కేవలం ఆశగానే మిగిలిపోతుంది. స్వేచ్ఛకు ఒక ప్రమాణం ఏర్పరిస్తేగాని, తగిన ప్రయత్నానికి నాంది పలకజాలం.

మానవ మనుగడకై జరిగిన పోరాటంలో స్వేచ్ఛాన్వేషణ ఉన్నది. తన శారీరక అవసరాలను సంతృప్తిపరచుకోవడంలో మానవుడు ప్రకృతిపై సాగించినపోరాటం సాధించినవిజయం ఇందులో కనిపిస్తుంది.

జ్ఞానార్జన ప్రయత్నానికికూడా ఆధారం ఇక్కడే లభిస్తుంది. ప్రకృతి నిరంకుశత్వం నుండి క్రమంగా విమోచన పొందడానికి, భౌతిక, సామాజిక పరిసరాలనుండి స్వేచ్ఛ అనుభవించడానికి,జ్ఞానార్జన తోడ్పడుతుంది. అందువలన స్వేచ్ఛాపిపాస అనేది, మనుగడకోసం సాగించిన జీవనపోరాటాన్ని ఇంకా ముందుకు తీసుకుపోవడం ఆధునిక సమాజంలో వ్యక్తి స్వేచ్ఛగా ఉండాలంటే ఆర్థికంగా సమృద్ధి, కేవలం భద్రతేగాక, మానవ ప్రతిభా వ్యుత్పన్నతలకు, మేధస్సు వికాసానికి తోడ్పడేందుకు వీలుగా, సాంస్కృతిక నిరంకుశత్వం లేని మానసిక పరిస్థితికూడా చాలా అవసరం. సాంఘికవ్యవస్థ మంచిచెడ్డలను నిర్ణయించడానికి సమాజంలోని వ్యక్తులు ఏమేరకు స్వేచ్ఛను సాధించారన్నది కొలమానంగా స్వీకరించాల్సి ఉంటుంది. ప్రతిదానికీ మానవుడే కొలమానం అని ప్రాచీన వివేచనాతత్త్వం పేర్కొంటున్నది. వ్యక్తికి ఆయా రాజకీయ సంస్థలు, రాజకీయ వ్యవస్థలు ఏ మేరకు స్వేచ్ఛను ఇవ్వగలుగుతున్నాయో దానినిబట్టి

ఇకముందు ఆయా వ్యవస్థల ప్రతిభను కొలిచే తత్త్వం అవసరం. జాతికాని, వర్గంకాని ఏ సమష్టి విధానంలో అయినా వ్యక్తుల కలయిక మాత్రమే. స్వేచ్ఛాన్వేషణలో మానవుడు సృష్టించుకున్నదే సమాజం.వ్యక్తిగా ఆదిమ మానవుడు తాను సాగించే మనుగడ పోరాటాన్ని సమర్థవంతం చేసుకోవడానికి సహకారం సాంఘిక సంబంధాలు నెలకొల్పాలి. సమాజాభివృద్ధికి ఇదే ప్రాతిపదిక. వ్యక్తులు వ్యక్తులుగా సాధ్యమయినంత స్వేచ్ఛను పొందటంలోనే సామాజిక సంబంధాల ప్రయోజనమున్నది. ఏ సాంఘిక వ్యవస్థనయినా, అభ్యుదయం, విమోచన, ఏ మేరకు ఉన్నదో అంచనా వేయాలంటే, వ్యక్తులు అనుభవించే స్వేచ్ఛనంతటినీ కలిపి చూడటమే ప్రమాణం. వ్యక్తిస్వేచ్ఛ వృధా అని, నిర్వికారమని కొట్టి పారేసే రాజకీయ తత్త్వంకాని, సాంఘిక పునర్నిర్మాణ పథకంగాని పరిమిత ప్రయోజనాన్ని మాత్రమే సాదించగలదు. వ్యక్తిని సమష్టిలో కలిపివేసి చూచే రాజకీయ విధానంకాని, ఆర్థిక పరిశోధనకాని, స్వేచ్ఛకు అనుగుణమయిన సాధనమాత్రం కాదు. స్వేచ్ఛను లేకుండా చేయడం స్వేచ్ఛకు దారితీస్తుందని వాదించడం అసంబద్ధమయిన విషయం. మానవ ప్రయత్నం సమష్టిగాని, వ్యక్తిపరంగాకాని, క్రమంగా స్వేచ్ఛను విస్తరించడానికి మాత్రమే ఉపయోగపడాలి. స్వేచ్ఛ అంటే వ్యక్తి స్వేచ్ఛ మాత్రమే.

ఆర్థిక పునర్నిర్మాణం చేసినంత మాత్రాన సమాజంలో దానంతటదే స్వేచ్ఛావాతావరణం ఏర్పడదు. దోపిడీకి గురైన వర్గాలను, అణచివేతకు బలైన ప్రజలకు ప్రాతినిథ్యం వహిస్తున్నామనే పార్టీ రాజకీయాధికారాన్ని చేజిక్కించుకున్నమాత్రాన స్వేచ్ఛ వచ్చిపడదు. వ్యవక్తిపరమయిన ఆస్థిని రద్దుగావించడం, ఉత్పత్తి సాధనాలను ప్రభుత్వ యాజమాన్యం క్రిందకు తీసుకురావడం, ప్రణాళికాబద్ధమయిన ఆర్థికవిధానం మాత్రమే శ్రమదోపిడిని అంతంచేయజాలదు, సంపదను సమంగా పంపిణీ చేయజాలదు. ఆధునిక సాంకేతిక విజ్ఞానం, నైపుణ్యత సమష్టికృషి పూర్తిగా వినియోగించుకోవాలనే నెపంతో వ్యక్తిస్వేచ్ఛను నిరాకరిస్తున్న ప్రణాళికబద్ధమయిన ఆర్థికవిధానం. తన ప్రయోజనాన్ని చేజేతులా పాడుచేసుకొంటున్నది. ఆర్థికసమానత్వం. సాంఘిక న్యాయంతో కూడిన ఉన్నత ప్రజాస్వామ్య వ్యవస్థను నెలకొల్పేబదులు రాజకీయ నియంతృత్వాన్ని తెచ్చి పెడుతున్నది రాజకీయ ప్రజాస్వామ్యం లేకుండా, రాజకీయ ప్రజాస్వామ్యంగాని సాధ్యమయ్యేవికావు.

అత్యధికులకు, అత్యంతమంచిని సమకూర్చాలంటే ప్రణాళికబద్ధమయిన ఆర్థిక వ్యవస్థ మాత్రమే చేయగలదని భావించడంకద్దు. సంపదను సమానంగా పంపిణీ చేయడం, సాంఘికన్యాయాన్ని సమకూర్చడం అని దీని అర్థం. అలాగయితే ప్రణాళికను, స్వేచ్ఛను సమన్వయీకరించడం సాధ్యమే. ఏనెపంతో, ఏ రకమయిన నియంతృత్వాన్ని

ప్రవేశపెట్టినా అది స్వేచ్ఛా ధర్మానికి పొసగదు.

పాశ్చాత్య ప్రపంచంలో ఆచరిస్తున్న ప్రజాస్వామ్యంకూడా నిరుత్సాహకరంగానే ఉంది. సంప్రదాయికంగా పేర్కొంటున్న ప్రజాస్వామిక సోషలిజంకూడా ఫలప్రదమవుతుందని నమ్మకం లేదు. ప్రజాస్వామ్యం మళ్ళీ జీవం పోసుకోవాలి. మానవ సాంప్రదాయానికి మరలాలి. ఇది కేవలం తలలు లెక్కపెట్టడానికే పరిమితం కారాదు. సార్వభౌమత్వపు హుందాతో తలెత్తుకొనే అవకాశం లేనిచోట ఈ పద్ధతి మరీ అవసరం. లాంఛనప్రాయమయిన పార్లమెంటరీ విధానానికి బదులు వాస్తవంగా ప్రజాస్వామ్యం ఆచరించే రీతులు కావాలి. తలలు లెక్కబెట్టడం మినహా మరే ఆచరణలేని ప్రజాస్వామ్యం సమష్టి విధానానికి జోహారులర్పించడం మాత్రమే అవుతుంది. ఈ విధానంలో వ్యక్తికిగాని, తెలివితేటలకుగాని అవకాశం ఉండదు. లాంఛనప్రాయమయిన పార్లమంటరీ విధానంలో తెలివితేటలు, వివేచన, వ్యక్తి కట్టుబాటు నైతిక సమర్థతవంటివి శుష్కప్రాయాలే అవుతాయి. రాజకీయ వ్యవస్థకు, సాంఘిక పరిపాలనకు సంబంధించిన మార్పులు తెచ్చి మానవధర్మాల ప్రభావం వీటిపై పడేటట్లు చేస్తేతప్ప ప్రజాస్వామిక జీవితవిధానం సాధ్యం కాదు.

మానవ విలువలకు అడ్డొస్తుందనే దృష్టితో నియంతృత్వాన్ని ఓడించడం ఆదర్శప్రాయంగా ఉంటే ఉండవచ్చును. ప్రజాస్వామ్య వ్యవస్థలో సహితం ఈ విలువలకు ప్రభావం లేనప్పుడు పైమాటలకర్థంలేదు. నియంతృత్వానికి ఆకర్షితులుకాకుండా ఆలోచనచేయని అనేక మందిని అట్టిపెట్టాలంటే ఆధునిక సంస్కృతిలో మానవతా సాంప్రదాయాల్ని తిరగదోడటం ఒక్కటేమార్గం. మళ్ళీ మానవుడే అన్నింటికి కొలమానం కావాలి. నాయకత్వానికి తెలివితేటలు, వివేచన, నైతిక ప్రతిభ, వ్యక్తి ఆదర్శం గీటురాళ్ళు కావాలి. ప్రజాస్వామ్యం ఏదో ఉన్నదిలే అన్నట్లు భావించరాదు. ప్రజాస్వామ్యం సాధ్యమా? అనే ప్రశ్న నేడు స్వేచ్ఛాపిపాసువులందరినీ కలవర పెడుతున్నది. ప్రజాస్వామ్యానికి మూలసూత్రమయిన అత్యధిక సంఖ్యాకులకు అత్యంత మంచిని సమకూర్చటమనేది, ప్రజావ్యవహారాల్లో ఉన్నవారు తమ అంతఃకరణకు ప్రాతినిధ్యం వహించే స్వేచ్ఛాపరులయినప్పుడే ఇదంతా సాధ్యపడుతుంది.

అన్నిటికంటే ప్రధానమయినది నైతిక ప్రమాణం, పార్లమెంటరీ ప్రజాస్వామ్యానికి హామీ ఇచ్చేది చట్టంకాదు. అధికారంలో ఉన్న అధికసంఖ్యాకుల నైతిక అంతఃకరణ మాత్రమే ప్రజాస్వామ్యానికి రక్షణను సమకూరుస్తున్నది. పరిశీలనగా చూస్తే నియంతృత్వానికికూడా నైతికప్రాతిపదిక లేకపోలేదు. మంచిలక్ష్యానికి నియంతృత్వమొక మార్గమని చెబుతారు కాని అధికారంచూపే ఆశలముందు సమష్టి నైతికత నిలబడటం కష్టం. విలువలనేవి వ్యక్తుల ద్వారానే ఆచరణలోనికి వస్తాయి. కనుక భావస్వేచ్ఛగల

వ్యక్తుల ప్రభుత్వ మేర్పడితే వారు తమ అంతఃకరణకు బాధ్యులుగా ఉంటారుగనుక అలాంటివారు అత్యధిక సంఖ్యాకులకు అత్యంత మంచిని సమకూర్చగలుగుతారు. నియంతృత్వం తాకిడిని తట్టుకొని ప్రస్తుత సంక్షోభం నుండి బయటపడాలంటే ప్రజాస్వామ్యానికి ఇటువంటి తాత్త్విక పునరాలోచన అవసరం.

కొద్దిమంది మేధావులకే పరిమితమయ్యే పాలనను కోరడంలేదు. కానీ స్వేచ్ఛాపరులయిన వ్యక్తుల అదుపాజ్ఞలలో రాజ్యపాలనాధికారం ఉంచితే. వ్యక్తుల సృజనాత్మక శక్తులు అనంతంగా విప్పారడానికి సహకరించే సాంఘిక వ్యవస్థ రూపొందుతుంది. ఈ స్వేచ్ఛాయుత వ్యక్తులు స్వార్థానికి లోనుకాకుండా, సమష్టితత్వానికి లోనుకాకుండా, ప్రజాబాహుళ్యానికి ఆకర్షితమయ్యే నినాదాలకు కొట్టుకుపోకుండా ఉండాలి. తరచు ఎన్నికలు జరపడం మాత్రమే ప్రజాస్వామిక ఆచరణ కాదు. అందరకూ ఓటుహక్కు ఇచ్చి ఎన్నికలు జరిపినప్పటికీ, పాలనాధికారులను ఎన్నుకున్నప్పటికీ కూడా, ప్రజాస్వామ్యం కేవలం లాంఛనంగా మిగిలిపోవచ్చు. పరిమిత కాలానికైనాసరే అధికారం దత్తంచేస్తే ఆచరణలో ప్రజాస్వామ్యం నాశనమయ్యే ప్రమాదమున్నది. ప్రజలకోసమే ఉన్నామనే ప్రభుత్వం, ప్రజలవలన-ప్రజలయొక్క ప్రభుత్వంమాత్రం కాజాలదు.

స్థానికసంస్థల ప్రాతిపదికపైన రాజ్యాన్ని ఏర్పరిచినప్పుడే ప్రజాస్వామ్యం వాస్తవంగా ఉంటుంది. పౌరులు వ్యక్తులుగా తమ సార్వభౌమాధికారాన్ని గుర్తించడం, తెలివిగా దాన్ని ప్రయోగించడం, స్థానిక సంస్థల్లో సాధ్యమవుతుంది. సమాజంతో సమాన ప్రాతిపదికగా ఏర్పడే రాజ్యం యీ విధమయిన స్థానిక రాజకీయ వ్యవస్థలతో నిర్మితం కావాలి. ఎన్నుకొన్న ప్రతినిధిని వెనక్కు పిలిపించడం, జనాభిప్రాయసేకరణ వలన స్థానిక ప్రజాస్వామిక సంస్థలు కట్టుదిట్టంగా నడుస్తుంటే వాటి ప్రభావం ప్రత్యక్షంగాను సమర్థవంతంగాను రాజ్య యంత్రాంగంపై ఉంటుంది. అటువంటి ప్రజాస్వామ్యంలో పార్టీ రాజకీయాలకు మించిన పద్ధతులు అమలుకు వస్తాయి. ప్రతిభననుసరించి వ్యక్తికి గుర్తింపు వస్తుంది. వ్యక్తి చొరవతో స్వతంత్రించి తనకున్న జ్ఞానాన్ని, తెలివితేటలను ఉపయోగించడం, నైతికంగా బ్రతకడం, నిస్వార్థంగా వివేచనను చూపగలగడం అనేవి పార్టీ విధేయతవలన, పార్టీ పోషణవలన గ్రహణం పట్టేగతి తప్పుతుంది.

ప్రజాస్వామ్యం సాధ్యమయ్యే పరిస్థితులను సృష్టించడం అవసరం. తొలుత ప్రజలలో స్వేచ్ఛా పిపాసను పురిగొల్పడం, తనపై తాను ఆధారపడాలనే కోరిక కలిగింపచేయడం స్వేచ్ఛగా ఆలోచించే ధోరణిని ప్రబలించడం, భద్రత పేరిట తమ స్వేచ్ఛను ఏ పెత్తందారీ విధానానికి మార్పిడిచేయకుండా ఉండటం మొదలయిన ప్రయత్నాలు కట్టుదిట్టంగా జరగాలి. ఇటువంటి ప్రజాస్వామ్యం నిమిత్తం,

వివేచనావాదం, సార్వజనీక మానవతా వాదంపై ఆధారపడే నూతన పునర్వికాసం కావాలి. ఆ వాతావరణంలో మానవ విలువలు జయప్రదంగా కొనసాగే మేధస్సుతోకూడిన స్వేచ్ఛాధోరణులు ప్రబలుతాయి. నీతి ప్రబలితే వ్యక్తి సమష్టికి బలికాకుండా, జాతికి వర్గానికి దాసోహం అనకుండా మనగలిగన సమాజం సుస్థాపితమౌతుంది. ఇట్లాంటి సుగుణాలున్న వ్యక్తులే ప్రజాదరణను పొందగలుగుతారు. సమాజంలో మిత్రులుగా, తాత్త్వికులుగా, మార్గదర్శకులుగా గుర్తింపును, మన్ననలను పొందుతారు.

మానవతావాద సంప్రదాయాలు, నైతిక సమూలవాదం ఆధారంగా నూతన విప్లవతత్త్వం ఉత్తేజం పొందాలి. వ్యక్తివాదం ఆధారంగా 19వ శతాబ్దంలోని రాడికల్సు మతరహిత వివేచనావాదాన్ని హేతుబద్ధమయిన నీతి సాధ్యమేనని రుజువుపరచారు. భౌతికశాస్త్రాల సూత్రాలు, పద్ధతులు అన్వయించి మానవుణ్ణి, సమాజాన్ని అధ్యయనం చేసారు. జీవ, అజీవ పదార్థంతోకూడిన ప్రకృతిని గురించి వందేళ్ళకు పూర్వంకంటే ఇప్పటి జ్ఞానం ఎంతో పెరిగిపోయింది. మానవుడి జీవితానికీ, పరస్పర సంబంధాలకూ వర్తించే సమస్యలను వైజ్ఞానిక దృక్పథంతో పరిశీలిస్తే ఫలప్రదం కాకమానదు. చరిత్రకు పూర్వం ఆటవికస్థితినుండి మానవుడు చాలాకాలం క్రిందటే బైటపడ్డారని, సామాజిక సంబంధాలు వివేచనాత్మకంగా సమన్వయీకరించ వచ్చునని నేడు సుస్పష్టంగా చెప్పవచ్చును. విచ్ఛిన్నమౌతున్న అవినీతికర వ్యవస్థ స్థానే ప్రజాస్వామిక స్వేచ్ఛతో నిండిన నూతన వ్యవస్థను స్థాపించి నైతిక విలువలకు స్థానం ఇవ్వగలమని చెప్పవచ్చును. మానవుడు నియమబద్ధ ప్రకృతినుండి ఉద్భవించాడు గనుక ప్రాయికంగా వివేచనావాది అయిన వ్యక్తి నీతిమంతుడుగా ఉంటాడు గనుక, హేతుబద్ధంగా రూపొందిన సమాజం నీతికి స్థానం కల్పిస్తుంది. సమాజ సంబంధాలలో పరస్పరం సహకరించుకునే విషయాలు హేతుబద్ధంగా సాగిపోవాలనే కోరిక వలన నీతి కూడా జనిస్తుంది.

సమాజాన్ని సమూలంగా మళ్ళీ ఏర్పరచాలన్నప్పుడు ప్రాథమిక స్థాయినుండి ప్రయత్నం జరపవలసి ఉంటుంది. విప్లవతత్త్వం రూపొందించడానికి మానవ సంపదనంతా ఆధారం చేసుకుంటున్నప్పుడు సిద్ధాంత విపులీకరణ, సూత్రాలను ఏర్పరచడం, రాజకీయాచరణ, ఆర్థికనిర్మాణం యిత్యాది అంశాలన్నీ సమ్మిళితంచేసి నవ్యమానవవాదం అంటున్నాం. మానవవాదాన్ని వికసింపచేసి, పునరుద్ధరించి విజ్ఞానం ఆధారంగా ఇంకా విస్తృతపరచి ఆధునిక నాగరికత సమకూర్చిపెట్టిన సాంఘికానుభవాన్ని దృష్టిలో పెట్టుకుంటున్నందున ఇందులో నూతనత్వం ఉంది. అందుకే నవ్య మానవవాదం అయింది.

ఇప్పటికే అనేక సిద్ధాంతాలు ఉద్భవించాయి. నిజంగా నూతనత్వమేదో

ఉంటేతప్ప వేరొక సిద్ధాంతాన్ని ఆలోచనాపరులెవ్వరో ఇక పట్టించుకోరు. ఐతే పూర్తి కొత్తదనం సాధ్యమయ్యేదికాదు. చరిత్రంతా అద్భుతాల పరంపరేమీకాదు. శూన్యం నుండి ఏదీ ఊడిపడదు. కొత్తది అంటే ఆవిర్భవించే విలువ మాత్రమే. మానవుడిలో గర్భితంగా ఉన్న ప్రతిభావ్యుత్పన్నతలు విప్పారినప్పుడే నూతనత్వం వస్తుంది. ఇక్కడ ప్రతిపాదిస్తున్న నూతన విప్లవ సిద్ధాంత భావాలు ప్రపంచవ్యాపితంగా ఆలోచనాపరుల దృష్టిలో ఉన్నవే. మానవ చరిత్రలో నెలకొన్న సంక్షోభం గురించి విజ్ఞాన-పరులంతా ఆలోచిస్తూనే ఉన్నారు. తత్ఫలితంగా కాలాన్ని, ప్రదేశాన్ని దాటిపోయి, విలువలను పునరాలోచిస్తూ, మానవాళికంతటికీ సమాన ప్రాతిపదికనిచ్చే ధోరణిలో ఆలోచన సాగింది. దీని కారణంగానే మానవ చరిత్రకు తాత్త్విక పరమయిన వ్యాఖ్యానం కూడా వచ్చింది. ఈ నూతన ధోరణి వలన, ఆధునిక ప్రపంచంలో అలుముకున్న అంధకారంనుండి నాగరిక మానవాళి బైటపడి భవిష్యత్తును చూడగలుగుతారు.

రాజ్యానికి, వ్యక్తికిగల సంబంధం విషయమై ప్లేటోనుండి నేటివరకు ఒక ప్రధాన రాజకీయసమస్య అయిపోయింది. రాజకీయ ఆలోచనాపరులు ఈ సమస్యతో గందరగోళపడి, సమాజానికి వ్యక్తి వ్యతిరేకమని భావించేవరకూ వెళ్ళారు. సమాజానికి వ్యక్తి విరుద్ధమైనమాట వాస్తవమే. వ్యక్తియొక్క స్వేచ్ఛను హరించకుండా, సమాజ ప్రగతి సాధ్యంకాదు. సాంఘిక వ్యవస్థను సమన్వయీకరించడానికి వ్యక్తి స్వేచ్ఛను హరించడంవలన మానవచరిత్ర వైఫల్యం చెందింది. తత్ఫలితంగా ఆత్మ విధ్వంసకరమయిన పద్ధతులుతప్ప ప్రపంచానికి భవిష్యత్తులేదని అనిపించింది. ఇదంతా దృష్టిలో పెట్టుకొని ప్రస్తుత సంక్షోభానికి మార్గాంతరం చూపవలసిఉంది. సమాజానికి-వ్యక్తికి ఒకవైపున, వ్యక్తికి-రాజ్యానికి మరొకవైపున ఉండిన సంబంధాన్ని ఇంకోసారి పరిశీలించవలసి ఉంది.

ఈ సంబంధాల సమన్వయీకరణలో వైఫల్యత చెందినందువలననే రాజకీయ ఆలోచనారంగంలో దోషపూరిత సిద్ధాంతాలు వెలువడ్డాయి. గతంలో అయితే ఈ వైఫల్యం తప్పనిసరైనది. మానవుడు-సమాజం ఎలావచ్చాయో తెలియనందువలన అట్లాంటి స్థితి ఏర్పడింది. అప్పుడు ఊహామాత్రమే మిగిలింది. ఇప్పుడు అంధకారంలో వెతుక్కోవలసిన పరిస్థితి లేదు. అతిభౌతిక సూత్రాలాధారంగా రాజకీయ సిద్ధాంతాలు రూపొందించాల్సిన అవసరంకూడాలేదు. జీవశాస్త్రం, ప్రాచీన మానవశాస్త్రం మానవుడి పరిణామాన్నిగురించి, సమాజం నెలకొన్న స్థితిగతుల గురించి అనుభవంతో కూడిన జ్ఞానాన్ని ఎంతో అందించింది. సమాజాన్ని మానవుడు సృష్టించాడనటంలో సందేహానికి తావులేదు. రాజ్యానికి, సమాజానికిముందు వ్యక్తి ఉన్నాడు. మానవుడి ప్రగతికి, స్వేచ్ఛకు ఈ రెండు వ్యవస్థలు ఏర్పడ్డాయి. అయినప్పటికి ఆ లక్ష్యం విస్మరించి, మార్గాన్నే

ప్రధానంగా స్వీకరించాం. సమాజంలో మానవుడి స్థానాన్ని గురించి దోషపూరితమయిన భావన కలగడంవలన లక్ష్యాలకు, మార్గాలకుగల సంబంధంకూడా తారుమారైంది. రాజకీయాచరణను సమాజ నిర్మాణంనుంచి నీతిశాస్త్రాన్ని వేరుచేసి చూసారు.

మార్క్సిజాన్ని తృణీకరిస్తున్న సామాజిక సిద్ధాంతాలుకూడా వ్యక్తిని స్పష్టమయిన భావనలేని విధంగా ప్రభోదించాయి. ఆధునిక పదార్థశాస్త్రంలో అణువువలె వ్యక్తికూడా ఉనికిలోలేని సాంఘిక అణువువంటివాడని పేర్కొన్నారు. తత్ఫలితంగా అలౌకిక శక్తి ఏదోఒకటి సమాజాన్ని సృష్టించిందని భావించారు. విచిత్రమేమంటే సమష్టివాదులు సహితం సమాజానికి వ్యక్తే మూలం అంటారు. ఆవిధంగా సమాజాన్ని మానవుడు సృష్టించాడని అంగీకరిస్తున్నారు. మానవుడు సమాజాన్ని ఎలా సృష్టించాడో ఏ ప్రయోజనాన్ని ఆశించాడో చూడాలి. మనుగడ పోరాటంలో వ్యక్తి సమాజాన్ని సృష్టించాడు. జీవపరిణామం నుంచి ఆవిర్భవించిన వ్యక్తి–వ్యక్తిగానే తన పోరాటాన్ని ప్రారంభించాడు. కాలానుగుణంగా ఏకాకిగాఉండే వ్యక్తి తాము మరికొందరితో కలిస్తే పోరాటాన్ని జయప్రదంగా సాగించగలనని గ్రహించాడు. అది సమాజానికి మూలం.

మనుగడ పోరాటానికి స్వేచ్ఛా పిపాసే ప్రధానాంశం. ప్రాచీనకాలంలో ప్రకృతిశక్తులు మానవుణ్ణి భయపెడుతుండగా వాటికి వ్యతిరేకంగా అతడు పోరాటం సాగించవలసివచ్చింది. ఆ శక్తులనుంచి అతడు విమోచన పొందాలని ఆశించాడు. అదే మనుగడకోసం సాగిన జీవనపోరాటం. ఆ పోరాటాన్ని కొనసాగించడంలోనే స్వేచ్ఛా పిపాస దాగి ఉన్నది. ఉత్తరోత్తరా జరిగిన మానవాభివృద్ధి అంతా ఈ స్వేచ్ఛాపిపాస ఆధారంగానే జరిగింది. స్వేచ్ఛాపిపాస ఉండటంవలననే మానవాళి సమాజాన్ని సృష్టించుకొని మనుగడ పోరాటాన్ని ఉన్నతస్థాయిలో కొనసాగించింది. తన స్వేచ్ఛాపోరాటం కోసం మానవుడు సృష్టించుకొన్న సమాజం అతని స్వేచ్ఛనే హరించడం వివేచనాత్మకం కాదు. వాస్తవంగా చూస్తే సమాజం మానవుడికి బానిస సంకెళ్ళు వేసింది. ఈ రోజుల్లో కూడా, మానవుడు యంత్రాన్ని సృష్టిస్తే ఆ యంత్రమే అతన్ని బానిసగా చేస్తున్నది. అయినా జీవసంపదగా లభించిన స్వేచ్ఛా పిపాసను పూర్తిగా అరికట్టడం సాధ్యంకాదు. అనేక యుగాలుగా మానవుడు స్వేచ్ఛా పోరాటాన్ని సాగించాడు. ఇంకా సాగిస్తూనే ఉన్నాడు. ఆ పోరాటం చరిత్రే ప్రపంచ చరిత్ర.

నూతన విప్లవాత్మక సాంఘిక తత్త్వానికి ప్రాతిపదిక ఏమంటే సమాజంకంటే వ్యక్తి ముందు అని, సాంఘిక వ్యవస్థకంటే వ్యక్తిస్వేచ్ఛ ప్రాముఖ్యం వహించాలని మాత్రమే. కేంద్రీకృతమయిన ఆధునిక సమాజంలో వ్యక్తి స్వేచ్ఛాపరుడెలా అవుతాడని ప్రశ్న. పెట్టుబడిదారీ విధానంతోకూడిన స్వేచ్ఛాయుత వ్యాపార ధోరణిగాని, ప్రాతినిధ్యపు ప్రజాస్వామ్య వ్యవస్థగాని యీ సమస్యను పరిష్కరించలేదు. కానీ ఈ

రెండు వ్యవస్థలు వ్యక్తి స్వేచ్ఛను కోరుతూనే ఉన్నవి. కమ్యూనిజం, సోషలిజం, వ్యక్తిస్వేచ్ఛను స్పష్టంగానే నిరాకరిస్తున్నవి. ఈ సంక్షోభంనుండి పరిష్కారమార్గం కనుగొనాలంటే వ్యక్తిస్వేచ్ఛను సాంఘిక వ్యవస్థను సమన్వయీకరించే ప్రత్యామ్నాయ రాజకీయసిద్ధాంత మవసరం.

విజ్ఞానం, పదార్థ వాస్తవతత్త్వం (భౌతికవాదం) ఆధారంగా విప్లవాత్మకమయిన సాంఘికతత్త్వం ప్రత్యామ్నాయాన్ని చూపెట్టాలి. ఆర్థిక నియతి వాదంలో ప్రయోజనవాదం ఇమిడిఉన్నది. అందువలన భౌతికతత్త్వంనుండి తార్కికంగాచూస్తే ఆర్థిక నియతివాదం రాబట్టజాలము. విప్లవ భావంలోనే అంతర్లీనంగా మానవుడి సార్వభౌమత్వానికి గుర్తింపు ఉన్నది. దీనిని ఆర్థిక నీతివాదంలో సమన్వయీకరించడం సాధ్యపడదు. ఉత్పత్తిశక్తుల చేతుల్లో మానవుడు కేవలం కీలుబొమ్మ అయితే అతడు చరిత్రను సృష్టించడంగాని, తన ప్రయోజనాలకనుగుణంగా సమాజాన్ని మార్చడంగాని ఎలా సాధ్యపడుతుంది? ప్రపంచాన్ని వాస్తవంగా గుర్తించని భావవాదం కంటే చరిత్రలో భావాలు స్వతంత్ర ప్రతిపత్తితో ప్రధానపాత్రను నిర్వహించాయనే భావ వాదంలో, మానవుడు సమాజాన్ని సృష్టించాడనే భావం ఇమిడి ఉన్నది. మార్క్సిస్టు విప్లవ సిద్ధాంతంలో అంతర్లీనంగా మానవతాసూత్రం ఉన్నది. మానవుడి మేధస్సులో చిరకాలంగా భావాలు జనిస్తున్నాయని, అవి జీవపరిణామ ఫలితంగా వచ్చాయనీ, మానవుడు ఆచరణకు పూనుకోకముందు భావాలు ఉంటాయని, చారిత్రకాభివృద్ధికి అవి తోడ్పడతాయని గుర్తించనందువలన ప్రయోజనవాదం తలెత్తింది. కేవల నీతి వాదానికి, విధిముందే అంతా నిర్ధారించివేసిందనడానికి తేడాను చూపడం కేవలం కుతర్కానికే సాధ్యపడుతుంది. జీవిత సంఘటనలు, సమాజం ముందే నిర్ధారితమైపోతే, వాటిపై మానవుడి అదుపు ఉండదు. వాటిని మార్చాలనే అభిప్రాయం కూడా అతనికి కలగడానికి వీలులేదు. ఇలా నిర్ధారితమయ్యే విధానం దైవం సృష్టించిందా? లేక మార్మికమయిన ఆర్థిక విధానమా? లేక ఉత్పత్తి సాధనాలా? అనేవి అప్రస్తుతం. వీటిల్లో దేనికీ తేడాలేదు. ఏమైనా మానవుడు సార్వభౌముడు కాదని, తన విధికి తానే బాధ్యుడు కాదని యీ వాదనలు చెబుతున్నాయి. ప్రకృతి, జీవితం, సమాజం గురించి మతపరమయిన ప్రయోజన వాదం, మార్క్సిస్టులు చెప్పిన ఆర్థిక నియతి వాదం రెండూ కూడా సాంఘిక విప్లవ భావానికి వ్యతిరేకాలే.

మార్క్సిజం చెప్పే సమాజవిప్లవ సిద్ధాంతంలో మరొకదోషమున్నది. అదికూడా మతాభిప్రాయంతో పోలినదే. ఉత్పత్తి సాధనాల అభివృద్ధివలన సాంఘిక విప్లవం నిర్ధారితమయిందనడంవలన తొలుత ఉత్పత్తి సాధనం ఎలావచ్చిందనే ప్రశ్న జనిస్తుంది. ఈ ప్రశ్న తుదికారణం ఏది? అనేదానికి పోలి ఉన్నది. మానవుడికి ముందు

జీవపరిణామం ఆ తరువాత సాంఘిక విప్లవంగా కొనసాగించడం స్పష్టంగా కనబడుతున్నది. మానవాకారంతో కూడిన కోతికీ, మానవుడికీ, విచక్షణ గమనిస్తూ పొందికగా ఉండే సిద్ధాంతాన్ని రూపొందించడం అవసరమయింది. కోతికి మానవుడికి మధ్య తప్పిపోయిన సంబంధం తరువాత కనుగొనవచ్చు. ఐతే ఆదిమ మానవశాస్త్రాన్ని గురించిన తత్త్వం ఈ విషయమై అంతగా ఆందోళన చెందడంలేదు. కొంతవరకూ ఊహ ఆధారంగా దీన్ని పరిష్కరించుకొనవచ్చును.

మానవుడికి సన్నిహితంగా ఉండే కోతి చెట్టెక్కి శ్రమపడి పళ్ళను అందుకొనేబదులు, చెట్టుకొమ్మను విరిచి, దానితో పళ్ళను రాలగొట్టాలనే ఆలోచన చేసిందనుకొందాం. ఆవిధంగా ప్రాణంలేని పరికరం సృష్టించినట్లయింది. దూరంగా ఉన్నవాటిని అందుకొనే నిమిత్తం అంగాలను విస్తరించేదానికి బదులు ఇంకొక వస్తువు సహాయంతో కాళ్లను వాడటంవలన ప్రకృతికి అనుగుణంగా జీవి అనుసరించాలనే అవసరం తప్పిపోయింది. తొలిసారి వచ్చిన ఉత్పత్తిసాధనం ఆర్థికంగా నిర్ధారితమైనదికాదు. దీని సృష్టికి అలౌకికశక్తి అవసరంలేదు. జీవపరిణామంలో ఆర్థికంగాగాక భౌతికంగా ఇది నిర్ధారితమయింది. ఆలోచనచేయడానికి అనువైన మెదడు అభివృద్ధిచెందిన ప్రారంభదశలో ఇట్లా హఠాత్పరిణామంగా తొలి పరికరాన్ని ఉత్పత్తిచేయడం సంభవించింది. ఇతర ప్రాణులకు,తొలి మానవుడికి స్పష్టమయిన తేడా ఏర్పడినదశలో, ఉత్పత్తిసాధనాన్ని సృష్టించుకోవాలనే ఆలోచన ముందుగా కలిగింది. మనుగడకోసం సాగించే పోరాటంలో ప్రాచీన మానవుడు పరికరాలను తయారుచేసుకొన్నాడు. జీవపరిణామంలో మానవుడికి పూర్వం ప్రేరణలలో ఇటువంటివి కనుగొనవచ్చు.

సామాజిక పరిణామ నియమాలను తొలుత ఎలా వచ్చాయో తెలుసుకోవడానికి మానవ స్వభావం ప్రాచీన మానవశాస్త్రం గమనించవలసి ఉంటుంది. మానవుడు ప్రాణం ఉన్న యంత్రంకాదు, ఆలోచించగల జీవి అనవచ్చు. మానవాకారంపోలిన కోతిలో వచ్చిన తొలి ఆలోచన మానవజాతి పుట్టుకకు నాంది అనవచ్చు. ఆ సంఘటనతో మానవ స్వభావం నిర్ధారితమయింది. అక్కడే ఆచరణకన్నా ముందు ఆలోచన వచ్చింది. తత్ఫలితంగా సామాజిక పరిణామంలోభావాలు స్వతంత్రపాత్రను నిర్వహిస్తున్నాయి. భావాలు వాటంతటవే జనించవు. అతి భౌతికంగా భావాలు జనించవు. భావాలు మానవుడి మెదడులో జనిస్తాయి. జీవపరిణామ క్రమంలో భౌతిక, రసాయినిక సమ్మిళితం వలన మెదడు ఏర్పడింది. మానవుడికి ముందు జీవులలోగల ప్రేరణలలో భావాల పుట్టుకకు నాంది ఏర్పడిందని వైజ్ఞానికంగా వివరించవచ్చును. నిర్జీవ పదార్థంగా పేర్కొంటున్న ప్రకృతిలో జీవపరిణామం జరిగింది. చిరకాలంగా తత్త్వాన్ని

కలవరపెడుతున్న ద్వంద్వ సమస్యను పరిష్కరించడానికి, మానసిక సంఘటనలకు పదార్థమే ఆధారమని కనుగొనడం జరిగింది. ద్వంద్వవాద దోషంఉండి బైటపడినతత్త్వం మానవుణ్ణి సార్వభౌముడిగా చాటవచ్చు. ఇన్నాళ్ళుగా పరలోకమేదో ఉందని మానవుడు గ్రహించలేని, అదుపులో ఉంచలేని శక్తులేవో ఉన్నాయని మానవుడు తనంతట తాను ఉండజాలడని ఇత్యాది నమ్మకాలెన్నో ప్రబలిఉన్నాయి. అవన్నీ ఇప్పుడు తొలగిపోతాయి. వైజ్ఞానిక మానవవాదంలో విప్లవాత్మక సాంఘికతత్త్వానికి గట్టి ప్రాతిపదికలేర్పడినాయి.

ప్రకృతి చరిత్రవలె మానవచరిత్రకూడా నిర్ధారితమయింది. ఈ నిర్ధారణ స్వయంగా జరిగిందేకాని సర్వకాలాలకు ఎవరూ నిర్ణయించిందికాదు. నిర్ధారణ కావడానికి అనేక కారణాలున్నాయి. అవి పరస్పరం అదుపాజ్ఞలు విధించుకుంటాయి. భావాల చైతన్యత, సాంఘికాభివృద్ధిలో గతితార్కిక విధానం సమానాంతరంగా సాగుతుంటుంది. ఇవి రెండూ స్వేచ్ఛాపిపాస అనే మానవుడి జీవప్రేరణ వలననే ఉత్పన్నమౌతున్నది. కనుక ఒకదానిపై మరొకటి ప్రభావం చూపించడం సహజం. విప్లవాత్మక సాంఘిక తత్త్వమేదయినా చరిత్రలోని ప్రాథమిక సత్యాన్ని గమనించాలి. అప్పుడు వ్యక్తిస్వేచ్ఛను హరించకుండా సమాజాన్ని పునర్నిర్మించే ఉత్సాహాన్ని పొందవచ్చు. మానవుడు యంత్రం అయితే, బృహత్తర సాంఘిక విధానంలో ఒక చక్రంవంటి వాడయితే, ఉత్పత్తిసాధనాల చేతుల్లో కీలుబొమ్మ అయితే, సాంఘిక విప్లవానికి ప్రయోజనమే లేదు. అటువంటప్పుడు మానవులంతా తమ కారాగారంలో, ఒకేరీతిలో భద్రతపేరిట మనుగడ సాగించవలసి ఉంటుంది. భావస్వేచ్ఛగల మానవులకు అవకాశమేలేదు. అట్లాంటిచోట స్వేచ్ఛాపిపాసవులు మృతప్రాయులే.

సమాజానికి మానవుడు నమూనా. సమాజంలో పరిణమించే రీతులన్నీ ప్రతివ్యక్తిలోను అంతర్లీనంగా ఉంటాయి. కనుక స్వేచ్ఛను కోల్పోకుండానే సాంఘిక బాధ్యతలను మానవుడు నిర్వర్తించగలడు. స్వేచ్ఛగా ఉండగల మానవతతోనే స్వేచ్ఛాసమాజ మేర్పడుతుంది. ఆధునిక సమాజం చాలా క్లిష్టమయినది. అందులో మానవుడు సార్వభౌముడుగా, తనలోగల సామాజిక లక్షణాల ఆధారంగా జీవించగలడు. తన ప్రతిభలను పెంపొందించుకోవడానికి ఇతరుల సహకారం స్వీకరించగలడు. సమాజంలో ఇదేవిధంగా ఆచరణకు ఉపక్రమించే వారు ఉంటారుగనుక పరస్పర సహకారం సాధ్యమే.

మానవుడు వ్యక్తిగా మనుగడ సాగించాలనేది, జీవసంబంధమయిన తృష్ణ. సమాజం సృష్టించడానికి ఇదే దారితీసింది. కనుక వ్యక్తుల సాంఘిక బాధ్యత అనేది ఎవరికోసమో చేసేదికాదు. సాధారణ పరిస్థితులలో స్వచ్ఛందంగానే మానవుడు తన బాధ్యతలను నిర్వర్తిస్తాడు. మానవుడు ప్రతిభను వికసింపజేయడానికి సమాజ పరిణామం

ఎంత అవసరమో సమాజాన్ని కాపాడుకోవడం కూడా అంతే అవసరం. కనుక సాంఘిక బాధ్యతలు వ్యక్తిస్వేచ్ఛకు పొసగకపోవడం అంటూ ఏమీలేదు. జీవపరిణామంలోని ఉన్నతస్థాయిలో మానవుడు సాగించే జీవపోరాటమే. కనుక మానవుడిలో గర్భితంగా ఉన్న శక్తియుక్తులను వికసింప చేసుకోవడానికి అడ్డొచ్చే వాటన్నింటినీ క్రమంగా తొలగించుకుంటూపోవడమే స్వేచ్ఛ అని నిర్వచింపవచ్చు. లేకుంటే "మానవుడు స్వేచ్ఛగా పుట్టాడు" "స్వేచ్ఛ మానవుడి జన్మహక్కు" అంటూ చారిత్రక సంక్షోభ సమయాల్లో చేసిన చిరస్మరణీయ ప్రకటనలన్నీ అర్థం లేనివిగానే పోతాయి. మానవుడిలో అనంతమైనట్టి శక్తులే గనుక లేకపోతే, స్వేచ్ఛ అనేది సాధించరాని ఆదర్శంగాను వృధా స్వప్నంగాను మిగిలిపోతుంది. జీవసంపదగా స్వేచ్ఛ పోరాటం సాగినప్పుడే దానిని జన్మహక్కు అనవచ్చు. అట్లాంటి స్వేచ్ఛాభావనలలో రూపురేఖలులేని ధోరణి అంటూ ఏమీలేదు. స్పష్టమయిన ప్రమాణాలతో స్వేచ్ఛను పొందడం సాధ్యమే. ఏ సాంఘిక విధానంలోనయినా స్వేచ్ఛ అనేది అక్కడి వ్యక్తులు వాస్తవంగా అనుభవించే స్వేచ్ఛననుసరించి ఉంటుంది. వ్యక్తి తన ప్రతిభను వ్యక్తం చేసుకోవడానికి ఏ మేరకు అవకాశమున్నదనే అంశాన్ని బట్టి దీనికి ఒక కొలత ఏర్పడుతుంది. స్వేచ్ఛా భావనలతో మార్మికమయిన విషయమేదీలేదు. అది స్పష్టమయిన జీవ సంపదమాత్రమే.

దేశాలు జాతీయంగా స్వతంత్రం కావచ్చు. ఆర్థికంగా సుసంపన్నం కావచ్చు. సైనికంగా శక్తివంతంకావచ్చు. "ఉన్నత సమాజం" సాధించినట్లు కనిపించవచ్చు అయినా అక్కడి వ్యక్తులు స్వేచ్ఛాపరులు కారు. వారికి వేసిన సంకెళ్ళు బంగారపు గొలుసులైతే కావచ్చు. స్వేచ్ఛకు స్పష్టమయిన రూపురేఖలు చిత్రించిన తరువాత కథలు చెప్పి భ్రమపడితే కుదరదు. జీవిత ప్రయోజనం స్వేచ్ఛను అనుభవించడమే అయితే. సామాజికాభివృద్ధిని అనుభవపూర్వకంగా అంచనా వేయవచ్చు. 20వ శతాబ్దంలో మానవుడు తన ప్రతిభావిశేషాలను వెల్లడి చేసుకోవడానికి ఎక్కువ అవకాశాలను సాధించలేక పోయాడంటే, అంతకుముందు శతాబ్దాలకంటే మానవజాతి పురోగమించింది అనలేము. కాలానుగుణంగా జరిగిన సంఘటనలే పురోభివృద్ధి కాదు. పారంపర్యతలోని ప్రాధాన్యతననుసరించి పురోభివృద్ధి ఉంటుంది. వ్యక్తి స్థితిననుసరించి మార్పులోని ప్రాధాన్యత అంచనా వేయవచ్చు. వ్యక్తులు మెరుగుపడటానికి అభివృద్ధి కావడానికి వ్యక్తీకరించుకోవడానికి ఉన్న అవకాశాలనుబట్టి అంచనాలు వేసుకోవచ్చు. సత్యాన్వేషణ స్వేచ్ఛా పిపాసలో – ఎంతముందుకు పోయామనేదాన్ని బట్టే ఈ అంచనా ఉంటుంది.

స్వేచ్ఛకు సత్యానికి గల పరస్పర సంబంధాన్ని కనుగొనడంలో విప్లవాత్మక మయిన సాంఘిక తత్త్వంలో విశిష్టతను చూడవచ్చు. లోగడ సాంఘిక తత్త్వాలలో

స్వేచ్ఛను ఒక సాధనంగానే పరిగణించారు. ఇప్పుడు స్వేచ్ఛకు ప్రధానమయిన విలువ అనేస్థాయి చేకూరింది. స్వేచ్ఛ మానవ జీవితాదర్శం, అనుభవం కూడా. సత్యం అతి భౌతిక విధానమయితే స్వేచ్ఛతో వీటికి ఎలా సంబంధం కుదురుతుంది?

మనుగడకై జరిగే జీవపోరాటం మానవ స్థాయిలో యాంత్రికంగా అనుసరించడంలో లేదు. ప్రకృతిని జయించడంలో ప్రయోజనాత్మకమయిన కృషి సాగించడంతో ఈ పోరాటం ఉన్నది. మానవునికి ముందున్న జీవులకు మానవునికి గల తేడా ప్రధానంగా ప్రయోజనం అనే దానిలోనే ఉన్నది. మనుగడకై గుడ్డిగా సాగినపోరాటం మానవ స్థాయిలో కావాలని జరిపే స్వేచ్ఛా పోరాటంగా ఉంది. ఈ ప్రయోజనం సాధించడానికి ప్రకృతిపై మానవుడు జరిపే పోరాటంవలన విజ్ఞానం పెంపొందినది. అదే సత్యాన్వేషణ ఇప్పుడు సత్యానికి స్వేచ్ఛకు సంబంధం స్పష్టపడుతుంది. మానవుడి స్వేచ్ఛా పిపాస ఫలితమే సత్యాన్వేషణ. ప్రకృతి గురించి మానవుడికి జ్ఞానాభివృద్ధి జరుగుతుండగా ప్రకృతిని జయించే శక్తికూడా వృద్ధిఅవుతున్నది. జ్ఞానవస్తువుగా ఉన్న సత్యానికి మానవుడి స్వేచ్ఛా పిపాసకు స్పష్టమయిన సంబంధమేర్పడింది.

సత్యం అంటే బాహ్యమయిన వాస్తవంతో సరిపడేదే. విజ్ఞానం వలన ప్రకృతిని గురించికాని అందులో ఒక భాగాన్ని గురించిగాని సుమారుగా తెలుసుకోగలుగు తున్నాము. కనుకనే జ్ఞానానికి వస్తువుగా సత్యాన్ని పేర్కొనవచ్చును. రెండు రెండ్లు నాలుగనే జ్ఞానం మనకున్నది. అదేసత్యం. ఏ రెండు వస్తువులను తీసుకొన్నా వాటితో మరిరెండు వస్తువులను జతచేస్తే అవెప్పుడూ నాలుగే అవుతాయి. ఈ సంఘటనలో మార్పుండదు ఏ పరిస్థితులలోనయినా ఇది జరుగుతుంది. సత్యాన్ని గణిత భావనగా పేర్కొనడం కూడా ఉంది. ఐతే గణితం కొలవడానికి ఒక పద్ధతి మాత్రమే. ప్రత్యక్షానుభవానికి అందుబాటులో లేని వాస్తవానికి సంబంధించిన విషయాలను కొలచి చెప్పడం సాధ్యమయ్యే పనికాదు. అందుకే గణితాన్ని ఉపయోగిస్తాం. స్వేచ్ఛాన్వేషణ వలన జ్ఞానం లభిస్తుండగా జ్ఞాన వస్తువుగా సత్యం ఉంటుంది. జ్ఞానం అంటే వాస్తవంతో సంబంధం కలది మాత్రమే. సత్యానికి వాస్తవానికి ఉన్న పొందికను బట్టి జ్ఞానవస్తువే సత్యం అనిచెప్పవచ్చు. స్వేచ్ఛ, జ్ఞానం, సత్యం పొందికగా సమన్వయీకరించి ఒక తత్త్వంలో ఇమడ్చ వచ్చును. భౌతిక, మానసిక, నైతిక ఉనికికి సంబంధించిన అన్ని దృక్పథాలను ఈ తత్త్వం వివరించగలదు. అన్ని విషయాలలో ఆవరించగల తత్త్వం ద్వంద్వ వాదాన్ని త్రోసిపుచ్చి, భావ భౌతిక వాదాలను సమీకరించి, నీతిశాస్త్రాన్ని ప్రకృతిజ్ఞానాన్ని ఇముడ్చుకుంటుంది. స్వేచ్ఛాపిపాసవలన సత్యాన్వేషణ జరుగుతున్నది. ఇది మనుగడకై జరిగే జీవపోరాటం ప్రయోజనాత్మకంగా కొనసాగించడమే. విశ్వజనీన నైతిక విలువలు గుర్తించడంలో సాంఘిక పునర్నిర్మాణానికి

సిద్ధాంతరీత్యాగాని ఆచరణరీత్యాగాని ఎటువంటి అసంబద్ధతా లేదు. అయితే మానవ స్వేచ్ఛను పెంపొందించాలనే ప్రయోజనం మాత్రం స్పష్టంగా ఉండాలి.

ప్రకృతి శాస్త్రాలనుండి సామాజిక శాస్త్రాన్ని వేరుచేయడం సాధ్యపడదు. ప్రకృతిలో భాగమే సమాజం. జీవితానికిమూలం నిర్జీవ పదార్థంలో ఉన్నట్లు జీవశాస్త్రం చూపుతున్నది. ప్రకృతి, సాంఘిక సంఘటనలను అధ్యయనం చేయడం ద్వారా రాబట్టిన జ్ఞానాన్ని తర్కబద్ధమయిన భావాలుగా రూపొందిస్తే నేటి కాలానికి సరిపడే తత్త్వం రూపొందుతుంది. ఆవిధంగా విజ్ఞానాలన్నింటినీ కలిపిచూసే శాస్త్రంగా తత్త్వం ఉంటుంది. మానవ ప్రవర్తనను సామాజిక సంబంధాలతో సాఫీగా అమర్చడానికి ఈ తత్త్వం ఉపయోగిస్తుంది. ఆర్థిక, రాజకీయ విషయాలు ఆచరణకు పెట్టేటప్పుడు మానవ సంబంధాల సమస్యలు పరిశీలించేటప్పుడు, సంస్థలను రూపొందించేటప్పుడు ఆచరణయోగ్యమయిన ప్రయోజనకర దృక్పథాన్ని అనుసరించాలనే అభిప్రాయమున్నది. అంటే తాత్త్విక సూత్రాలు, సిద్ధాంతపరమయిన నమ్మకాలు అడ్డురాకూడదనే దీని తాత్పర్యం. రాజకీయ వేత్తలు ఆర్థిక వేత్తలు ఆచరణ దృక్పథం కలిగి ఉండాలంటారు. ఉన్న పరిస్థితులలో అవకాశాలు చూచుకొని సమస్యలను పరిష్కరించాలంటారు. ముందుగానే కొన్ని భావాలేర్పరచుకొంటే, లేక ఒక తత్త్వానికి అనుగుణంగా నడిస్తే రాజకీయాలలో ముందుకురాలేరని ఆర్థిక రంగంలో ఆచరణ కుదరదని భావిస్తున్నారు.

తత్త్వాన్ని గురించి ఇటువంటి భావం ఉండటం వలన ఎందరో ఉత్తములు నిరాశతో ఉన్నారు. సత్యాన్వేషణ, జ్ఞానార్జనలో వారు దైనందిన వ్యవహారాలకు దూరంగా ఉంటూ ఆలోచనలో నిమగ్నమై అంతర్ముఖులై అనంతాన్ని తమలోనే చూచుకొంటున్నారు. ప్రజాబాహుళ్యంలో అత్యధిక సంఖ్యాకులు ఇటువంటి తత్త్వాన్ని పట్టించుకోవడమేలేదు. తమ సమస్యల్ని తత్త్వం పట్టించుకోనప్పుడు అటువంటి తత్త్వంతో వారికి ఉపయోగం లేదు. భావప్రపంచానికీ, భౌతిక ప్రపంచానికీ కృత్రిమతేడాలు కల్పించారు. భౌతిక ప్రపంచంలో సత్యానికీ నైతిక విలువలకూ చోటులేదు. కనుక అక్కడ బలగం కలవాడిదే రాజ్యం అన్నట్లుగా చూస్తున్నారు.

ఇదొక భయంకరమయిన విషాదఘట్టం. స్థూలంగా పరిశీలిస్తే, వివేచనా బద్ధమయిన ఆలోచనగానూ, నైతిక విలువలూ, సత్యప్రియత్వంగానీ ఇంతవరకూ మానవ ప్రవర్తనకు మార్గదర్శకంగా లేవనేచెప్పాలి. ఈ ధర్మాలన్నీ భావప్రపంచానికి చెందినవని తలపోసినంతకాలం పరిస్థితి ఇలాగే ఉంటుంది. మనిషి సుఖ దుఃఖాలు, మార్పులు, చేర్పులూ మొదలయిన దైనందిన వ్యవహారాల్లో చేదోడువాదోడుగా ఉండే అవకాశం తత్త్వానికి లేకుండా పోయింది. అయితే మానవుడి మేధస్సుకు ఈ తత్త్వం అందుబాటులోనే ఉన్నది. వివేచనాబద్ధంగా ఆలోచించడం, నైతిక విలువలను

పాటించడం, సత్యాన్ని ప్రేమించడం, మొదలయిన ధర్మాలు ఆచరించేవారే నేడు అధికసంఖ్యలో కావాలి. భావానికీ పదార్థానికీ, మనసుకు–శరీరానికీ, ఆలోచనకు – ఆచరణకూ వారధినిర్మించే తత్త్వం నేడు కావాలి.

దైనందిన ప్రపంచ వ్యవహారాల్లో మునిగితేలుతున్న ప్రజలకు తత్త్వంతో పనిలేదని సర్వసాధారణంగా అనుకుంటున్నారు. ఈ జీవిత సమస్యల ఒడుదుడుకులకు తత్త్వవేత్తలు దూరంగా ఉంటూ వారి భావ ప్రపంచంలో విహరిస్తున్నారు. తత్త్వాన్ని గురించి దోషపూరితంగా ఉన్న ఈ భావన తొలగిపోవాలి. దీనివలన ఆధునిక ప్రపంచంలో చాలా గందరగోళ పరిస్థితులేర్పడినవి. మానవుడి నిత్యవ్యవహారాల్లో తత్త్వప్రభావమున్నదని కనుక తత్త్వంయొక్క అవసరం గుర్తించేటట్లు చేయాలనీ నేడు ప్రయత్నించాలి.

గగన వీధులనుండి ఊహాలోకంనుండి తత్త్వం భూమి మీదదిగి మానవ ప్రయోజనానికి తోడ్పడాలని కార్ల్‌మార్క్సు సూచించాడు. తన సిద్ధాంతాన్ని ముగిస్తూ, ఇప్పటివరకూ ప్రపంచాన్ని వివరించడంతోనే తత్త్వవేత్తలు సరిపెట్టుకున్నారనీ, ఇప్పుడు ప్రపంచాన్ని మార్చాలనీ మార్క్సు అన్నాడు. అప్పటినుంచీ ప్రపంచాన్ని మార్చడానికి భిన్న సిద్ధాంతాలు వెలువడ్డాయి. అయినప్పటికీ ఉత్తమ ప్రపంచాన్ని నిర్మించగలననే ఆశ శాశ్వతంగా అడుగంటినట్లనిపిస్తున్నది. ఆధునిక నాగరికత సర్వనాశనమయ్యే ప్రమాదసూచనలున్నాయి. రాజకీయ, ఆర్థిక, సాంఘిక రంగాల్లోనేగాక, నేటి సంక్షోభం ఇంకా ప్రగాఢమై నైతిక సంక్షోభంగా మారింది. మానవుడి ఉనికీ, ఆత్మ, మనోభావాలు, అంతఃకరణ ఇవన్నీ ఈ సంక్షోభంవలన చిక్కుకున్నాయి. ఇటువంటి కలవరపరిచే సన్నివేశం వలన సందేహవాదం ప్రబలి ఆధునిక నాగరికతా విలువలను గురించి సంశయమేర్పడింది. అయినప్పటికీ మానవజాతి భవిష్యత్తులో ఆశలు వదులుకుని ఆలోచనాపరులింకా ఉన్నారు. ఆధునిక నాగరికత నాశనంగాక తప్పదని స్పెంగ్లర్ వ్యక్తంచేసిన అభిప్రాయంతో అందరూ అంగీకరించటం లేదు. ఈ సంక్షోభంలో నుండి బయటపడటానికి వారు మార్గాంతరాలు అన్వేషిస్తున్నారు.

సంక్షోభానికి మార్గాంతరం అంటే ఆచరణ కావాలన్నమాట. రాజకీయంగా ఉన్న అస్థిరత్వం ఆర్థికంగా ఉన్న భద్రతారాహిత్యత సాంఘికంగా అలుముకున్న సంక్షోభంవలన యుద్ధానికి తగిన వాతావరణం ఏర్పడుతుంది. నాగరిక మానవాళి కృతనిశ్చయంతో ఈ పరిస్థితి ఎదుర్కొనవలసి ఉన్నది. ఆచరణకుముందు భావాలు కావాలి. తార్కికంగా పొందిక అయిన భావాలతోకూడిన తత్త్వం కావాలి. సంప్రదాయబద్ధమయిన తత్త్వాలన్నీ సమగ్ర విధానాలుగా పేర్కొంటున్నారు. విజ్ఞానప్రభావం వలన తత్త్వానికి సంబంధించిన యీ భావాన్ని తొలగించాలి. సంపూర్ణ

భావాలతోకూడిన విధానాన్ని నేటి తత్త్వవేత్త ఎన్నడూ చూపెట్టటంలేదు. భావాలకు స్వంత చైతన్యత ఉన్నది. భావం ఎంత మహోన్నతమయినదైనా ఆలోచనా రంగంలో గమనిస్తే, తుదిరూపం ఉండటానికి వీలులేదు. కానీ సృజనాత్మకంగా ఉండాలంటే వివేచనాత్మకమయిన ఆలోచనతోనే మానవుడి ఆచరణ ఉండాలి. నేడు మానవ ప్రవర్తనలో పొందిక లేనందువలన సంక్షోభం ఏర్పడింది. వివేచనాత్మకంగా ఆలోచించడం, నిశితంగా విశ్లేషించి చూడటం, అనేవాటికంటే ఉద్రేకానికి ఆధిక్యత యిస్తున్నారు.

ఆలోచన వలన ఆచరణ స్తంభిస్తుందంటారు. అన్వేషణ సందేహానికి దారితీస్తుందంటారు. వివేచనాత్మకమయిన ఆలోచన చేసేవారికి మానవజ్ఞాన పరిమితి తెలియడమేగాక మానవ ప్రయత్నంలో నిస్పృహలు కూడా ఎదురౌతాయి. ఇటువంటి దృక్పథంగల తాత్త్వికుడు, మానవ ప్రయత్నంలో ప్రపంచాన్ని మార్చలేమని, మౌనం వహిస్తున్నాడు. ఈ ధోరణి వలననే నూతనమయిన మార్మికవాదం ప్రబలింది. దీనికితగ్గట్లే ఆధునిక మనోవిజ్ఞానంలో కొన్ని శాఖలు అంతర్బుద్ధికి అత్యధిక ప్రాధాన్యతనిస్తూ ఏవో మార్మికమైన ప్రేరణల వలన మానవుడు ఆచరణకు ఉపక్రమిస్తున్నాడనీ, వివేచనాతెలివితేటలతో యీ ఆచరణను అదుపులో పెట్టలేమనీ చెబుతున్నవి. అంటే ఉద్రేకాలను విశ్లేషించలేమని, వాటికి వివేచనాత్మక ప్రాతిపదికలు చూపలేమని సారాంశం. ఇదే జీవ సత్యమయితే మానవ చర్యలలో దేనినీ అదుపులో ఉంచలేము. అందువలన ఆచరణకు పురిగొల్పేది ఉద్రేకం మాత్రమేనా? అనే అంశాన్ని పరిశీలించాల్సి ఉంటుంది. వివేచనవలన ఉద్రేకాన్ని అదుపులో పెట్టలేమా? అన్నదికూడా చూడవలసి ఉన్నది. సంఘాన్ని పునర్నిర్మించాలనే దృక్పథంతో చెప్పిన సిద్ధాంతాలన్నీ విఫలమయ్యాయి. వివేచనకు బదులు ఉద్రేకానికి అధికప్రాధాన్యత నివ్వడమే ఇందుకు కారణం. కొందరు ఒకరకమైన ఉద్రేకాలకు ప్రాధాన్యతనిస్తే మరికొందరు ఇంకోరకమయిన ఉద్రేక భావాలతో రెచ్చగొట్టారు. సర్వరోగ నివారిణిగా చూపిన ఈ తత్త్వాలు ప్రయోజనాన్ని సమకూర్చలేకపోయినాయి. ఇవెందుకు విఫలమయ్యాయో నిశితంగా పరిశీలిస్తేతప్ప ప్రస్తుత సంక్షోభానికి మార్గాంతరం లభించదు. ప్రపంచవ్యాప్తంగా ఇటువంటి ప్రయత్నం వ్యక్తిగతంగానూ, కొందరు సహకార దృక్పథంతోనూ చేస్తున్నారు. వారూ ఇటువంటి దృక్పథానికే వచ్చారు. మానవవాదాన్ని తిరగదోడాలని అంటున్నారు. రెండు తరాలుగా ప్రపంచ వ్యాప్తంగా స్వైరవిహారం చేస్తున్న సమష్టి వాదానికి వ్యతిరేకంగా మానవ దృక్పథం కావాలంటున్నారు. మితవాదులూ, ఉదారవాదులూ, సోషలిస్టులూ, కమ్యూనిస్టులూ– పరస్పరం ఘర్షణలోనున్న నేటి రాజకీయ విధానాలన్నీ ఒక విషయంలో మాత్రం ఒకేధోరణిలో

నున్నవి. మనిషిని సమూహంలో కలిపేయడంలో వీరంతా ఒకేత్రాటిపై నిలిచారు. సంఘాన్ని సృష్టించింది మానవుడు. మానవుడి కార్యాచరణే చరిత్ర. రాజకీయ సంస్థలు మానవుడి సృష్టి అయినప్పటికీ తాను సృష్టించిన సంస్థలే మానవుణ్ణి నిస్సహాయునిగా చేసినవి. సృష్టికర్తను సృష్టికి లోబడేటట్లు చేయడమే ప్రస్తుత సంక్షోభానికి మూలం. మానవుడికి మళ్ళీ అర్హస్థానం, సార్వభౌమత్వం అట్టిపెట్టడమే మానవతావాదాన్ని తిరగదోడటమంటే. సంక్షోభం నుంచి బైటపడటానికి ఇదొక్కటే మార్గం.

✦ ✦ ✦

# నవ్య మానవవాదం

వ్యక్తికి సామాజిక జీవితానికి సంబంధించిన సమస్యల పరిష్కారానికి ప్రాతిపదికగా ఉనికి అంతటినీ దృష్టిలోపెట్టుకొన్న తత్త్వము అవసరం. మరోమార్గమయినా అక్రమదారులకు మళ్ళిస్తుంది. అంటే, సామాజిక రాజకీయతత్త్వం సరిగా ఉండాలంటే దానికి తాత్త్వికపునాది ఉండాలన్నమాట. తత్త్వానికి విజ్ఞానానికి సమాజానికి సంబంధాలు చూడటం చాలా ముఖ్యమయిన విషయం సమాజంపై విజ్ఞానప్రభావం స్పష్టమే. ప్రజాజీవితంలో చిత్తశుద్ధి సత్ప్రవర్తన ఉండాలని నేడు ఘోషిస్తున్నారు. ఇది తృప్తికరంగా జరగాలంటే సాంఘిక తత్త్వంలోను రాజకీయ ఆలోచనలలోను నీతిశాస్త్రానికి ఉన్నతస్థానం కల్పించాలి. ఇది సంభవించాలంటే నైతిక తత్త్వానికి విజ్ఞానానికి సంబంధం ఉండాలి. విజ్ఞానానికీ తత్త్వానికి సంబంధం లేనంత కాలం సాంఘిక సిద్ధాంతానికి రాజకీయ ఆచరణకు నైతికవిలువలతో సమన్వయం చేకూర్చటం సాధ్యపడదు.

అలౌకిక విషయాలలో విశ్వాసాన్ని చూపుతూ, కనిపించేదానికి మించి వాస్తవం ఉన్నదంటు ఊహలలో నిమగ్నమయిన మతంతో తత్త్వంకూడా చేతులు కలిపి విజ్ఞానానికి భిన్నంగా నడకసాగించింది. తాత్కాలికమైన సహజ సంఘటనలను గురించి మాత్రమే విజ్ఞానం పరిశీలిస్తుందని దానికి తక్కువస్థానం ఇచ్చారు. కేవల వివేచన సహాయంతో తుదికారణాన్ని కనుగొంటానంటు అతిభౌతికవాదం ఎంత ప్రగల్భాలు పలికినప్పటికీ, వృత్తిపరంగా తత్త్వవేత్తలు సంకుచిత వర్గసంబంధం కనబరచినప్పటికీ, విజ్ఞానం-తత్త్వం పరస్పర సంబంధాన్ని విడనాడలేదు. ఒకప్పుడు విజ్ఞానానికి వేరొకప్పుడు తత్త్వానికి ప్రాధాన్యతలు మారుతూ వచ్చాయి.

ఆదిమ మానవ చరిత్రలోని తొలిదశను గమనిస్తే, విజ్ఞానంకంటే తత్త్వం ముందున్నది. తరువాతి కాలంలో పదార్థ ప్రపంచానికి సంబంధించిన జ్ఞానం అనుభవాలను అధిగమించి ఆలోచనపుటూహల అన్వేషణలో ముందుకు సాగాయి. ఆధునిక నాగరికత ఉదయిస్తున్న కాలంలో, మధ్యయుగాల అంతిమదశల్లో, విజ్ఞానం మళ్ళీ జీవం పోసుకోవడానికి తత్త్వమే ప్రేరణ కల్పించింది. అప్పటినుంచీ విజ్ఞానం, ప్రకృతి మర్మాల పొరలను విప్పుకొంటూ మున్ముందుకు సాగుతున్నది. ఇదంతా గమనించిన తత్త్వం, చిరునవ్వుతో, తనబిడ్డ ఉద్రేకంగా సాగిపోతూ భ్రమలను

వాస్తవాలనుకోవడంపట్ల హేళన గావించింది. ప్రాపంచిక అనుభవ జ్ఞానానికి సత్యం వాస్తవం అందుబాటులో ఉండవని, అలౌకిక మార్మిక రంగానికి సంబంధించిన వీటిని గ్రహించడానికి ఊహలతోకూడిన కేవల వివేచన మాత్రమే ఉపకరిస్తుందని పేర్కొన్నది.

ఊహాతత్త్వంలో నీతిశాస్త్రం ఒకభాగంగా ఉంటూవచ్చింది. జీవశాస్త్ర జ్ఞానం చూపెట్టిన మార్గంలో మతంతో సంబంధం లేకుండా మానవుడితో ముడిపడిఉన్న విషయాలను గుర్తించడానికి నీతిశాస్త్రం నిరాకరించింది. సామాజిక రాజకీయ తత్త్వం హేతువాద ప్రభావంలోకి వచ్చింది. హేతువాదం ఇంకా చాలావరకు అతిభౌతిక పరిధిలోనే ఉంది. అంతేగాక ఆదిమ మానవశాస్త్రం, భాషాశాస్త్రం, జాతులకు సంబంధించిన శాస్త్రం కూడా హేతువాదంపై ప్రభావం చూపించింది. నైతిక విలువలకు విజ్ఞానరంగానికి కార్యకారణ సంబంధం లేదనిపించింది. వాస్తవాలనుండి విలువలను రాబట్టడాన్ని గమనించిన నైతికతత్త్వం గందరగోళపడింది. సాంఘిక ప్రవర్తన, రాజకీయ సంఘటనలు ప్రాపంచిక వాస్తవాలుగనుక, విలువలకు ఎలాంటి సంబంధము లేదని భావించారు. నీతికి ఆధారంగా మతం ఒక్కటే మిగిలింది. అయితే అలౌకిక విషయాలలో విశ్వాసాన్ని సడలించడానికి విజ్ఞానం ఎంతో సహకరించింది. కనుక మతం సాంప్రదాయకంగా ఉండిపోయింది. ఫలితంగా ప్రజాజీవితంలో నీతికిగల స్థానం చిక్కుల్లో పడింది. ఆధునికంగా విశ్వాసంగల మానవుడు మతాన్ని చుక్కానిగా భావిస్తున్నాడు. లేదా ఇది కేవలం వ్యక్తిపరమయిన విషయంగా భావిస్తున్నాడు. ప్రజా జీవితంపై మతప్రభావమేమీ లేదు. అంటే, సాంఘిక ప్రవర్తనలో రాజకీయ ఆచరణలో ప్రమాణాలను నిర్దేశించే హక్కు తార్కికంగాచూస్తే మతానికి లేదు. నైతిక విలువలకు వీటికి బొత్తిగా సంబంధంలేదు. మానవుడి వ్యక్తిగత జీవితంలోనే మతానికి ఎంతోకొంత అర్థం ఉన్నది. ఆధునిక ప్రపంచంలో మతాన్ని ఆధారంగా చేసుకొని జీవితం సాగించేవారి సంఖ్య నేటికి విపరీతంగా ఉన్నందున నైతిక విషయాల స్థితి మరీ అధ్వాన్నమయింది.

అదృష్టవశాత్తు మనం శకాంతానికి వచ్చాము. విజ్ఞానాన్ని–తత్త్వాన్ని విడివిడిగా అట్టిపెట్టడానికి వీలులేని పరిస్థితి ఏర్పడింది. మానవుడి ఆలోచనా స్రవంతిలో అత్యున్నత లక్షణాలయిన విజ్ఞానం–తత్త్వం మధ్య చిరకాలంగా వస్తున్న తేడా తొలగిపోవడమే విశేషం. కాలం, ప్రదేశం (ఆకాశం), పదార్థం, కార్యకారణతత్త్వం ఇవన్నీ కేవల ఆలోచనకు సంబంధించినవిగానూ, అతిభౌతిక ఊహాసమస్యలుగాను ఉంటుండేవి. అవన్నీ ఇప్పుడు (గణితంతోసహా) విజ్ఞానాన్వేషణ పరిధిలోకి రావడంతో ఈ సమస్యలు పరిష్కారం అయినవి. ('సైన్స్ అండ్ ఫిలాసఫీ' గ్రంథంలో, 'ది హ్యూమనిస్ట్ వే' పదునాల్గవ సంపుటికలో 2, 3 సంచికలలో, రచయిత వ్యాసాలను గమనించవచ్చు). విశ్వశాస్త్రం, ఉనికి (సత్తా) శాస్త్రం, జ్ఞానశాస్త్రం అనేవి తత్త్వానికి మూలంకాగా,

ఇవన్నీ విజ్ఞానశాస్త్రంలో కలిసిపోయాయి. విజ్ఞానశాస్త్ర ప్రభావం, దాని ఫలితంగా జనించిన సాంఘికశాస్త్రం సమాజాభివృద్ధిపై ప్రభావాన్ని చూపెట్టాయనడంలో సందేహంలేదు. తత్ఫలితంగా ప్రకృతి, జీవితం, సమాజం-అంటే ఉనికి అంతటినీ కలుపుకొని, తార్కికంగా సమన్వయంతోకూడిన విధానాన్ని రూపొందించడం సాధ్యం అయింది. సామాజిక, వ్యక్తిగత సమస్యలకు మూలాన్ని జీవ, భౌతిక పరిణామ విధానంలోచూచే అవకాశమేర్పడింది. అదే సమయంలో సమస్యల పరిష్కారానికి విజ్ఞానం తోడ్పడుతూ వచ్చింది. వాస్తవాలకు విలువలకు ఉన్న సంబంధంలోని చిక్కు విడిపోయింది. ఎందుకంటే విలువలే వాస్తవాలని విదితమయింది. మానవుడి మేధస్సు విజ్ఞానం వలన వికాసం పొందింది. కనుక ఆధునిక నాగరికత నీతితో సంబంధం తెంచుకోవలసిన అవసరంలేదు. నీతి మానవుడిలో అంతర్భాగం.

భావస్వేచ్ఛా పిపాస ఇన్నాళ్ళుగా ఉపచేతనావస్థలో ఉంటూవచ్చినా, మానవాభివృద్ధికి మానవుడు పుట్టినప్పటినుండీ ఇది తోడ్పడుతూ వచ్చింది. మానవుడు స్వేచ్ఛాజీవియని, తన నిర్ణయానుసారం వ్యవహరించగలడని, మంచిచెడ్డలను విడమర్చి చూడగలడని, ఏది సరైనదో ఏదికాదో గమనించగలడని, అతీతమయిన శక్తి దయాదాక్షిణ్యాలపై ఆధారపడిగాక మానవుడు ఇదంతా స్వయంగా చేయగలడని భావిస్తూ వచ్చాడు. మానవుడి భావస్వేచ్ఛా పిపాసకు మతంకూడా ఒకరకంగా వ్యక్తీకరణే. మతాల చరిత్రను గమనిస్తే, సర్వాత్మవాదంనుండి సృష్టికి ప్రయోజనం ఉన్నదనే హేతువాదంవరకు పరిణమించిన విశ్వాసాన్నిబట్టి తననుతాను అధిగమించి పోవాలనే ధోరణి మతంలో గర్భితంగా ఉన్నట్లు గమనించవచ్చు. భావస్వేచ్ఛా పిపాస వలననే సాంఘిక రాజకీయ జీవనంలో స్వేచ్ఛ ఉండాలనే ధోరణి వచ్చింది. అలౌకిక శక్తిని, లేదా అతిభౌతిక ప్రమాణాన్ని కావాలనడంమానేసి, ప్రపంచ దృక్పథాన్ని అలవరచుకొంటే దానిలోనుండి స్వేచ్ఛా పిపాసకు అనువైన సూత్రాలు రాబట్టవచ్చు. ప్రపంచం స్వయం సంపూర్ణం, స్వయంగా సాగిపోతుంది. అటువంటి ప్రపంచంలో అంతర్భాగమైన మానవుడు స్వేచ్ఛగా ఉండగలడు.

శాశ్వతంకాని ఈ ప్రపంచంలో మానవుడు స్వేచ్ఛగా ఎలా ఉండగలడు? అన్న ప్రశ్న చిరకాలంగా మానవుడిని వేధిస్తూనే వస్తున్నది. ఈ ప్రశ్నకు సాంఘిక, రాజకీయ తత్త్వశాస్త్రం సమాధానం ఇవ్వాలి. ఆచరణకు పనికివచ్చేటట్లు కూడా ఈ సమాధానం ఉండాలి. తృప్తికరమైన సమాధానం రావాలంటే స్వేచ్ఛ మానవుని జన్మహక్కని రుజువు చేయగలగాలి. మతపరమైన మొండివాదంకాని రాజకీయతత్త్వం తాత్కాలికంగా పేర్కొనే సూత్రాలుగానీ ఇందుకు ఉపకరించవు. స్వేచ్ఛాపిపాస, జీవసంపద అన్నీ మానవుడు భావస్వేచ్ఛను పొందగలడని, అలౌకిక శక్తిపైన విశ్వాసాన్ని విడనాడగలడని

గ్రహించగలిగితే మానవుని సార్వభౌమాధిక్యతకు ఉన్నతార్థం చేకూరుతుంది. ఇందుకు సాక్ష్యాధారం ఆధునిక విజ్ఞానంవలన లభిస్తున్నది. ప్రతివ్యక్తిలోను స్వేచ్ఛగా ఉండగల సత్తా ఉన్నది. ఈ విషయం తెలిస్తే అతను స్వేచ్ఛాపరుడౌతాడు. అటువంటి భావస్వేచ్ఛా జీవులతో సృష్టించినదే స్వేచ్ఛా సమాజం అవుతుంది.

ఐరోపాలో మధ్య శకాంతంలో దైవ సంరక్షణపై మానవుడు తిరుగుబాటుచేసి స్వశక్తిపై ఉండగలననే గ్రహింపురాగా ఆ ధోరణిలో పయనించాడు. విజ్ఞానశాస్త్రం విస్తరిస్తుండగా 18వ శతాబ్దంలో మానవుని తిరుగుబాటు ఒక స్పష్టమైన స్థాయికి చేరుకొన్నది. చిరకాలంగా మానవత - సామాజిక తత్త్వాన్ని రూపొందించాలనే ప్రయత్నానికి చాలా దోహదం ఏర్పడింది. ఇందులో మతరహితమైన నీతిశాస్త్రం, మతార్థ వాదంతో కూడిన తత్త్వశాస్త్రం ప్రధాన ప్రాతిపదికలుగా ఉన్నాయి. అప్పటినుండి, జీవిత మర్మాలను ప్రకృతి ధర్మాలను విజ్ఞానం చాలా సునిశితంగా పరిశీలించింది. ఐనప్పటికి తాత్త్విక ఆలోచన ఈ వేగాన్నందుకోలేక పోయింది. 18వ శతాబ్దంలోని సహజ మానవతావాదం, 19వ శతాబ్దంలో దాని పరిణితివలన ప్రేరణ పొందిన తత్త్వం మానవుణ్ణి చింతలలోను సామాజికంగాను స్వేచ్ఛాపరుణ్ణి చేయగలదనిపించింది. అటువంటి తత్త్వాన్ని నవ్యమానవవాదం అనడం సముచితంగా ఉంటుంది. విజ్ఞాన సమన్వయీకరణ ఉండటంవలన ఈ తత్త్వం క్రొత్తది. ప్రకృతిలోని యాంత్రిక విధానానికి భిన్నంగాకాక ఉన్నతరూపంగా మాత్రమే మానవుడి సార్వభౌమాధిక్యతను ఈ తత్త్వం పరిశీలిస్తుంది.

లోగడ మానవుడి సార్వభౌమాధిక్యతా భావానికి, సంప్రదాయవాదంలో ఉద్వేగ మానవతావాదం జతగూడి ఉండేది. దీనివలన తార్కికంగా రెండు ప్రత్యామ్నాయ నిర్ణయాలు వచ్చినవి. ఒకటి స్వేచ్ఛా పూరితమైన ఇచ్ఛా సిద్ధాంతం. రెండవది గ్రీకులు, ఆ తరువాత క్రైస్తవులు నమ్మిన నైతిక సిద్ధాంతం. విశ్వనైతిక క్రమంలో మానవుడి ఆత్మ ఏకం అవుతుంది కనుక అతడు నీతిపరుడని వారి సిద్ధాంతం. స్వేచ్ఛాపూరితమయిన ఇచ్ఛలో జీవపరిణామ విధానం కనుక ఉండకపోతే అదొక మార్మికమైన గుణంగా భావించవలసి వస్తుంది. తత్ఫలితంగా దీని మూలం గ్రహించలేమని, మానవుడికి ఇదొక వరప్రసాదమని మాత్రమే అనుకోవలసి ఉంటుంది. ఇటువంటి భావన మనకు తెలియకుండానే అలౌకిక వాదానికి దారితీస్తుంది. విశ్వాసం ఉంచి మానవుడి సార్వభౌమత్వాన్ని రాబట్టిన సిద్ధాంతంవలన క్రైస్తవమతం దాన్ని స్వీకరించింది. తొలి ప్రతిపాదనను అంగీకరిస్తే నీతికి సంబంధించిన క్రైస్తవ సిద్ధాంతం తార్కికంగా సరైనదే అనిపిస్తుంది. కానీ విప్లవాత్మక సానాజికతత్త్వ పునాదులవద్ద ఈ సిద్ధాంతం నిలబడదు. విప్లవాత్మకమని ఎందుకంటున్నామంటే మానవుడి నిరంతర సృజనాత్మక వ్యక్తీకరణ

సామాజిక పరిణామం కనుక దేవుడి అనుగ్రహంవలననే మానవుడు నీతిపరుడిగా ఉండగలడని నమ్మే అలౌకిక నైతికవిధానం తన ప్రతిపాదనను తానే ధ్వంసం చేస్తున్నది. మానవుడు నీతిమంతుడు. కనుక సార్వభౌముడు. అతని సార్వభౌమత్వం ఉన్నతశక్తి నుంచి వచ్చింది. అందువల్ల అతడు సార్వభౌముడు కాడు. దీని సారాంశం ఏమంటే, మానవుడు సృజనాత్మక శక్తిని అంగీకరించడం.

మానవ సార్వభౌమత్వ సిద్ధాంతం వద్దనే భేదాభిప్రాయం వస్తున్నది గనుక సాంఘికతత్వాన్ని నీతిశాస్త్రాన్ని రూపొందించేటప్పుడు రెండు ప్రత్యామ్నాయాల మధ్య ఘర్షణ ఏర్పడుతున్నది. లోగడ సనాతన విధానాలన్నీ పరిగణించినట్లుగా కనుక పయనిస్తే సాంఘిక లేదా భావస్వేచ్ఛ తుడిచిపెట్టుకు పోతుంది. మానవుడు స్వేచ్ఛాపరుడిగా ఎన్నడూ ఉండలేడు. స్వేచ్ఛాపూరితమైన ఇచ్ఛ అనేది కేవలం అలంకారపూరితమైనదన్నమాట. అటువంటి ప్రమాణంవల్ల నీతిశాస్త్రం ఆధారరహిత మౌతుంది. పిడివాద ప్రమాణాలవలననే నీతిశాస్త్రానికి స్థిరత్వం ఏర్పడగలదన్నమాట.

సరైన నీతిశాస్త్రం లేకుండా విప్లవాత్మక సాంఘికతత్త్వం సాధ్యంకాదు. నీతిశాస్త్రంలో కీలకమైన సమస్య విలువలకు సంబంధించిన ప్రమాణం. అవి మానవుడిలోనే ఉంటే సమస్య పరిష్కారం అవుతుంది. అయితే ఈ పరిష్కారంవలన స్వేచ్ఛాపూరితమయిన ఇచ్ఛ అనే సమస్య మళ్ళీ గెలుస్తుంది. మార్మికమైన ఈ భావన వ్యక్తిని ఏకాకిచేసి, సాంఘికవ్యవస్థను సహకారాన్ని మానవ సంబంధాలు సాఫీగా సాగడాన్ని ఈ సిద్ధాంతం అంగీకరించదు. మానవుడే భూమిపై సంచరించే దేవుడైతే, సార్వభౌముడైతే, కేవలం తన ఇచ్ఛానుసారం నడిచే వాడైతే, ఆ ఇచ్ఛమార్మిక మయినదైతే, సహకారం అదృశ్యమవుతుంది, సమాజం విచ్ఛిన్నమౌతుంది.

అంతర్బుద్ధివలన విలువలు ఉంటాయని పేర్కొనే నైతికతత్త్వం, మిగిలిన మతాలకు భిన్నమైనదైతే కావొచ్చుకానీ ఇందులోను అలౌకికవాదం ఉంది. అంతర్బుద్ధి అనేదాన్ని విశ్లేషించి యాంత్రికమైన జీవప్రేరణలలో వాటికి ఆధారం చూపకపోతే, మానవుడు గ్రహించలేని మార్మిక మూలం ఏదో ఉందని అనుకోవలసి ఉంటుంది. ఇటువంటి అంతర్బుద్ధితో కూడిన నైతికతత్త్వం ఏదో తెలియరాని అలౌకిక శక్తులను ఆధారం చేసుకోవలసి ఉంటుంది. దీనంతటికీ ప్రత్యామ్నాయంగా, మానవుడికిముందు జరిగిన జీవపరిణామంలో అంతర్బుద్ధికి ఆధారం చూడవలసి ఉంటుంది. అంతర్బుద్ధితోకూడిన నీతివాదం పిడివాదం కాదు అనాలంటే మరోమార్గం లేదు.

నీతిసమస్యకు సంతృప్తికరమైన పరిష్కారమార్గం కనుగొనాలంటే మానవ ఉనికిని ఇంకా చాలా లోతుగా పరిశీలించినవలసి ఉంటుంది. లోగడ నైతిక తత్త్వవేత్తలు

స్వర్గంవైపుకు తమ దృష్టినిపోనిచ్చారు, లేదా మానవుడిలో భగవంతుణ్ణి అన్వేషించారు. మానవుడి పూర్వీకాలయిన జంతుజాలాన్ని దృష్టిలో ఉంచుకొంటే సంతృప్తికరమైన ఫలితాలు రావచ్చు. నీతిశాస్త్రానికి సంబంధించిన సంప్రదాయ సిద్ధాంతాలు మతపరంగా, వివేచనాత్మకంగా, ఆదర్శవాదంగా, అంతర్బుద్ధి ఆధారంగా రూపొందించబడినది. ఆధునిక నాగరికత ఎదుర్కొంటున్న సంక్షోభంలోనుంచి బైటపడాలంటే ఈ నీతి సిద్ధాంతాలన్నింటిని పునర్విమర్శించాలి. అప్పుడు వాస్తవమైన విప్లవాత్మక సాంఘికతత్త్వం సాధ్యమౌతుంది. ఆధునిక నాగరికతకు అటువంటి తత్త్వమే ప్రేరణ ఇవ్వగలదు. నీతికి మానవుడిలోనే ఆధారం కనుగొంటే లోగడ ఉద్వేగ, సంప్రదాయ మానవతావాదాలు మానవుడిలో చూచిన మార్మిక దృష్టికి ఇప్పుడు ఉద్వాసన చెప్పవచ్చు.

మానవుడి మర్మాన్ని ఆధునిక జీవశాస్త్రం పరిశీలించింది. జీవపరిణామం ఫలితంగా మానవుడు ఆవిర్భవించాడు. మానవుడిలో నీతిని గ్రహించడానికి, మార్మిక దృష్టిని త్రోసిరాజనడానికి, ప్రేరణలు, అంతర్‌దృష్టి ఎలా పనిచేస్తున్నాయో మనం పేర్కొనే అంతరాత్మ నైతికదృష్టి జీవవిధానంలో ఎలా ఉన్నాయో గమనిస్తే సరిపోతుంది. విశ్వసంబంధమయిన విధానంలో భాగంగా భౌతికవిశ్వం ఉండగా అందులోనే జీవపరిణామం అంతర్భాగంగా ఉంది. నిర్జీవపదార్థం నుంచి జీవం ఆవిర్భవించింది. నియమబద్ధమయిన ప్రకృతిలో మానవుడి పరిణామాన్ని చూడవచ్చు. పొందికగా ఉన్న విశ్వంలో మానవుడి వివేచన నైతిక భావనకు కార్యకారణ సంబంధం ఉన్నది. అంటే వివేచనాత్మకంగా నీతివంతంగా ఉండటం మానవ స్వభావమన్నమాట. ఆవిధంగా అతడు ఇతరులతో సామరస్యంగాను శాంతియుతంగాను జీవితం సాగించగలడు.

ఈ వాదనలవలన ఒక విషయం నిర్ధారకమవుతుంది. లోగడ భౌతికవాదంగా పేర్కొన్న సిద్ధాంతాన్ని ఇప్పుడు పునర్నిర్మించవచ్చు. ఇందులో మానవునికి సంపూర్ణ భావస్వేచ్ఛ ఉంటుంది. దీనివలన స్వేచ్ఛాయుతమైన సమన్వయీకరణతోకూడిన సమాజాన్ని నిర్మించవచ్చు. ఆధునిక విజ్ఞానశాస్త్రం ఆధారంగా మళ్ళీ భౌతికవాదాన్ని తిరగదోడటం ఒక్కటే సరైనతత్త్వం ఔతుంది. మరేదయినా చివరకు మతంలో కలిసిపోయి ఆత్మవాదంతో అంతమవుతుంది. నాగరికత ఆవిర్భవించినప్పటినుండి వివేచనాత్మకమైన తత్త్వానికి, ప్రయోజనాత్మకమయిన విజ్ఞానపరిశోధనకు భౌతికవాదం మాత్రమే సరైన ప్రాతిపదిక కల్పించింది. మతపరంగాను, సృష్టికి ప్రయోజనం ఉన్నదనే సిద్ధాంతంపరంగాను, ఆదర్శపద్ధతిలోను, మార్మికదృష్టిలోను జీవితాన్ని గురించి అనేక ప్రత్యామ్నాయ ఆలోచనలు లేకపోలేదు. కానీ ఈ సిద్ధాంతాలేవీ కూడా తమ ప్రతిపాదనలను రుజువు పరచలేకపోయాయి. కనీసం పరీక్షకు కూడా కట్టలేకపోయినవి. భౌతికవాద ప్రతిపాదనలన్నీ సరైనవే. ఇప్పటికి కొన్ని విషయాలు మనకు

తెలియకపోయినా అవి తెలుసుకోవడానికి వీల్లేదని మాత్రం భౌతికవాదం చెప్పదు. దీని సిద్ధాంతాలన్నీ రుజువుపరచవచ్చు. ఇందుకు అలౌకికంగా ఆధారాలు కావాలని భౌతికవాదం అంగీకరించదు. ఈ విధంగా అలౌకికతత్త్వాన్ని తొలగించి మానవుణ్ణి భావస్వేచ్ఛాపరుణ్ణి గావించి, పొందికగాను మంచితనంతోను ప్రపంచాన్ని నిర్మించుకొనే అవకాశాన్ని ఇచ్చిన మానవ దృక్పథంగల తాత్త్విక ప్రాతిపదిక మాత్రమే సరైనది.

ఇన్నాళ్ళుగా భౌతికవాదాన్ని గురించి కొన్ని భావనలున్నవి. అధునాతన విజ్ఞాన పరిశోధనలవలన వాటిలోకొన్ని తృణీకరించవలసి ఉంటుంది. అప్పుడు విప్లవాత్మకమయిన సాంఘిక తత్త్వం, మతరహితమయిన మానవ నీతిశాస్త్రము ప్రాతిపదికలుగా భౌతికవాదం రూపొందించవచ్చును. పదార్థాన్ని గురించిన పాత భావనలను భౌతిక విజ్ఞానం త్రోసిపుచ్చింది. కానీ భౌతిక ప్రపంచాన్ని శూన్యమనిగాని, దేహంలేని మనసులనిగాని పదార్థశాస్త్రం అనలేదు. న్యూటన్ పేర్కొన్న ప్రకృతి తత్త్వాన్ని అనుసరించి, వాస్తవికత అంటే అణువుల సముదాయం మాత్రమే. కానీ ప్రపంచం ఆ విధంగా నిర్మాణంకాలేదు. అయితే పదార్థ రహితంగా భౌతికశాస్త్రం ముందుకు సాగలేదుకూడా. అనుభవంతోకూడిన ప్రపంచ దృక్పథానికి పదార్థమే ఆధారం. క్షేత్రం అనేది ఆకారంలేని గణిత నిర్మాణం కాదు. దీనిని కొలవవచ్చును. పరిణామాన్ని తెలుసుకోవచ్చును. కనుక ఇది భౌతికమే.

భౌతికవాదానికి విజ్ఞానపరంగా వస్తున్న అభ్యంతరాలను నివారించాలంటే నూతనతత్త్వాన్ని "పదార్థ వాస్తవ వాదం" అంటే సరిగా ఉంటుంది. (భౌతిక, జీవ, మనో విజ్ఞాన శాస్త్రాలలో ఆధునిక పరిశోధనల ఆధారంగా రచయిత గావించిన విస్తృత సిద్ధాంత పరిశీలనను 'ది ఫిలసాఫికల్ కాన్సిక్వెన్సెస్ ఆఫ్ మోడరన్ సైన్స్' అనే అముద్రిత గ్రంథం పరిశీలించాలి). ఈ విధంగా పునర్నిర్మాణం గావించి క్రొత్తపేరు పెట్టినప్పటికీ, ఎలాంటి గందరగోళం లేకుండా ఉండేందుకు భౌతికవాదం ఒక్కటే సాధ్యమయిన తత్త్వమని స్పష్టం చేయాలి. జీవితానికి సరైన మార్గదర్శకత్వాన్ని చూపేదిగాను, ప్రపంచాన్ని వివేచనాత్మకంగా వివరించేదిగాను భౌతికవాదం ఉండాలంటే ప్రత్యక్ష జ్ఞానానికి సంబంధించిన శాఖలన్నింటిని తార్కికంగా సమన్వయీకరించాలి. అదే తత్త్వానికి నిర్వచనంగా పేర్కొనవచ్చు.

పరిణామం వివిధ రూపాలతో కూడిఉన్నది. ఈ భిన్నత్వంలో ఏకత్వాన్ని అన్వేషించడం మానవుడిలో చిరకాలంగా వస్తున్నది. ఇదే తత్త్వానికి ప్రాతిపదిక. ప్రాపంచికానుభవాలు అవగాహనచేసుకొని వివరించే ప్రయత్నం గావించడం శతబ్దాలుగా సాగుతున్నది. దీనంతటికి ఒక సాధారణ ప్రాతిపదికను చూడాలని మానవుడు ప్రయత్నించాడు. అదే మూలపదార్థమని ఆధునిక భౌతికవిజ్ఞానం

చెబుతున్నది. అది కాదంటే మానవుడి అవగాహనకు అందుబాటులో లేనిది మార్మికదృష్టి కలది ఏదో అయిఉండాలి. అంటే విశ్వాసంతో కూడినదేదో అన్నమాట. భౌతికవాదానికి మతం ఒక్కటే ప్రత్యామ్నాయం. విశ్వం స్వయం సంపూర్ణమని బైటశక్తుల ప్రమేయం లేకుండా సాగిపోతుందని ఆధునిక విజ్ఞానం అంగీకరించకపోతే అప్పుడు సృష్టికర్త కోసం లోగడ మానవుడు అన్వేషించినట్లు ఇప్పుడు కూడా అలాంటి శక్తిపై ఆధారపడవలసి ఉంటుంది. పూర్వీకులు అనుసరించే ఈ ధోరణి ప్రబలుతున్నది. దైవాన్వేషణలో చాలామంది విజ్ఞాన శాస్త్రజ్ఞులు కూడా నేడూ నిమగ్నమై ఉన్నారు. ఇప్పటి సంక్షోభానికి ఈ విచిత్రమయిన పరిస్థితి దోహదం చేస్తుండగా మానవుడు మళ్ళీ మధ్యయుగాల్లోకి వెళ్ళే ప్రమాదంకూడా లేకపోలేదు.

కానీ పూర్వీకులు అనుసరించే ప్రమాదకర పద్ధతికి ఆధునిక పదార్థవాదం దోహదం చేయడంలేదు. పదార్థాన్ని గురించి విప్లవ ధోరణి భావాలలో కాదుగాని ప్రత్యక్ష గ్రహింపులో వచ్చింది. ఉనికి దృష్ట్యా మూల పదార్థం (ద్రవ్యం) వాస్తవ భావనే కేవల ఆలోచనగాను ఆకారంలేని వస్తువుగాను దీన్ని పరిగణించవచ్చు. ఇందలి నైరూప్య స్వభావంలో ఎలాంటిమార్పు లేకుండానే ప్రాపంచిక వాదం ఒక నూతన అర్థాన్ని ప్రవేశపెట్టింది. ఊహతోకూడిన ఆలోచనకు ప్రపంచానుభవంతో కూడిన జ్ఞానానికి ఉన్న సంబంధమే అది. ఈ రెండింటినీ కలిపిచూస్తే సత్యం వెల్లడౌతుంది.

విజ్ఞానం కేవలం ప్రపంచానుభవం మాత్రమేకాదు. భావనలతోకూడిన ఆలోచన, విజ్ఞాన విధానం రెండూ వేర్వేరుకావు. రెండింటికీ పునాదిఒక్కటే. అనుభవం భావనలకు దారితీస్తుంది. ఇవి మానసిక చిత్రణలు. వీటివలన మానవుడు మాట్లాడగలుగు తున్నాడు. భాషాధారంగా భావనలు నిర్మించాడు. అవి మనసులో అంతర్భాగాలవు తున్నవి. అనుభవం నుంచి రాబట్టి సాధారణీకం చేసిన వాటినే భావ చిత్రణలు అంటున్నాం. ప్రపంచానుభవం ఉన్న విజ్ఞానపూరితమయిన ఆలోచనలకు ప్రేరణ కలుగుతున్నది. మానవుడి భావనలు కూడా ఇందుకు మార్గదర్శకత్వాన్ని కలిగిస్తున్నాయి. అనుభవానికి పూర్వం వచ్చిన విషయాలు కావివి.

మానసికమయిన రీతులు, అలవాట్లు, వాటంతటవే వచ్చినవికావు. చిరకాలంగా మానవుడు ప్రపంచానుభవంతో సాధించిన వాటికి ఇవి ప్రాతినిధ్యం వహిస్తాయి. భాషాపరమైన ప్రకటనలు సహితం ప్రపంచానుభవ జ్ఞానానికి సంబంధించినవే. ఈ విధంగా చూచినప్పుడు మూల పదార్థానికి సంబంధించిన భావన అనుభవానికిముందే వచ్చిన ఆలోచనగా పేర్కొనవచ్చు. ఆకాశం, కాలం, కార్యకారణత్వానికి సంబంధించిన భావాలు కూడా యిలాంటివే. ప్రపంచానుభవం వలన వచ్చిన భావనలు క్రమంగా ఆలోచనా రీతులుగా మారినవి. కనుక కేవల ఆలోచనకు సంబంధించినవిగా వీటిని

భావించినప్పటికీ, మానవుడి మనసు వీటిని సృష్టించినట్లు కనిపించినప్పటికీ, ఇవి కేవలం మానసిక సంఘటనలు మాత్రంకావు. ఇవన్నీ అనుభవాలనుంచి రాబట్టినవే. నూతన అనుభవం వీటిని త్రోసివేయదు. కాగా ఆ భావాల ఉనికిని ఇవి ఇంకా వికాసవంతం చేస్తున్నవి.

ప్రపంచానుభవానికి సంబంధించిన ఏకైక మూలపదార్థం లోగడ భావించినట్లుగా లేదని ఆధునిక పదార్థ విజ్ఞానశాస్త్రం పరిశోధనలు తెలుపుతున్నవి. దీని నిర్మాణం భిన్నంగా ఉన్నది. కాని మూలపదార్థానికి సంబంధించిన భావనమాత్రం అలాగే ఉన్నది. వాస్తవానికి సంబంధించిన జ్ఞానం విస్తరించింది. మూలపదార్థమేదీ మానసికమైనదనే సూచన విమర్శకు నిలబడదు. అయితే ఉనికిలోని భిన్నత్వంలో ఏకత్వ ప్రాతిపదికలు ఉన్నాయని అంగీకరిస్తున్నారు. గణితబద్ధంగా కొలవగలిగినవన్నీ పదార్థవాస్తవాలకు సంబంధించినవే. ఆధునిక పదార్థశాస్త్రం చూపెట్టే ప్రపంచమంతా శాస్త్రజ్ఞుడి మనసులో నుంచే సృష్టించినదైతే కవిత్వానికీ, కళలకూ, విజ్ఞానసిద్ధాంతాలకు తేడా ఉండదు. పరిశీలక యంత్రాలన్నింటినీ పదార్థవిజ్ఞాని అవతల పారవేయవచ్చు. గణితబద్ధమయిన వివేచన కూడా ఒకసాధనంగా వినియోగించనవుసరంలేదు. రాశికి సంబంధించిన కొలతలకు మినహాయిస్తే ఖచ్చితంగా ఉండాలని పట్టుబట్టడంలో అర్థంలేదు. కొలవాలంటే అందుకు తగిన వస్తువేదో ఉండాలిగదా!

శాస్త్రజ్ఞుడు అధ్యయనం చేయదలచిన వస్తువెంత ముఖ్యమో అలాగే అంతకుముందే ప్రపంచానుభవం ద్వారా సంపాదించిన జ్ఞానం కూడా అంతేముఖ్యం. విజ్ఞానం అంతాకేవలం బాహ్యమయినదేకాదు. ప్రపంచానుభవంలో అటువంటి దేదీలేదు కూడా. మనోవిజ్ఞానం లోనేకాదు, పదార్థ విజ్ఞానంలో సహితం వస్తువుకీ, మనిషికీ తేడాచూపడం అర్థరహితమేగాక తప్పుదారులు పట్టిస్తుందికూడా. బాహ్య ప్రపంచంలో శాస్త్రజ్ఞుడు కూడా ఒకభాగమే. అతడి మనసులోని భావాలు బాహ్యసత్యాలను ప్రతిబింబిస్తాయి. అవన్నీ అతడికి ముందున్న మానవుల అనుభవాల సృష్టి మాత్రమే. ఇదంతా తెలిసినప్పటికీ బాహ్య ప్రపంచాన్ని వాస్తవం కాదనడం, అది కేవలం మానసిక దృష్టి అనడం, కళాఖండంవలె ఊహద్వారా సృష్టించినదనటం జరుగుతూనే ఉన్నది. మూలపదార్థం లేకుండా భౌతికశాస్త్రం ఉండగలదని చెప్పడంలో – దేహంలేకుండా మనసు ఉండగలదని చెప్పినట్లే అయింది. భౌతిక శాస్త్రజ్ఞుని దేహం నిస్సందేహంగా ఒక పదార్థమే. మూల పదార్థం వాస్తవం కాకపోతే యితడి దేహమూ అంతేనన్నమాట. శాస్త్రజ్ఞుడంటే దేహంలేని మనసుమాత్రమే అనుకోవలసి వస్తుంది.

ఇప్పటివరకూ పదార్థ ప్రపంచాన్ని, మానసిక ప్రపంచాన్ని తలపోసిన తత్త్వవేత్తలు ద్వంద్వవాదమనే విషవలయాన్ని సృష్టించారు. భావనకు ప్రపంచానుభవాన్ని కలిపి

చూస్తే యింతవరకూ జటిలంగా కనిపించే సమస్య పరిష్కారమవుతుంది. అంటే నైరూప్య వివేచనమూ, వాస్తవ ప్రకటనలనూ మిళితం చేయాలన్నమాట. పదార్థ వాస్తవవాదంగా నామరణం చేయబడిన భౌతికవాదం లేక తత్త్వం ఈ మార్గాంతరాన్ని సూచిస్తున్నది.

జీవపదార్థం భౌతిక సత్యం. అందువలన ప్రాణం లేని ప్రకృతికీ, ప్రాణంఉన్న ప్రపంచానికీ వారధి నిర్మించలేనంత అఖాతంలేదు. జీవితానికి సంబంధించిన చైతన్యత తెలివి, యిచ్ఛ మొదలయినవన్నీ భౌతికమైన మూలపదార్థంనుండి రాబట్టవచ్చు. జీవపరిణామంలో భాగం కనుక అంతర్లీనంగా, వీటన్నింటికీ ఒక నిరంతర సంబంధమున్నది. జీవశక్తి మానసిక సంఘటనలకు పదార్థేతరంగా వివరణ అన్వేషించాల్సిన అవసరంలేదు. ప్రేరణలు అంతః కరణలు మార్మికమయిన విషయాలేమీకావు. అవన్నీ ప్రాథమికమయిన అనిర్వచనీయాలు. మానవుడి వైజ్ఞానిక ఉద్వేగ లక్షణాలన్నింటిని కలిపి చూస్తే దానినే ఆత్మ అనవచ్చు. జీవ సంఘటనలలో మానవుడు పదార్థ వాస్తవ, ఏకత్వ తత్త్వానికి ఒక పరిపూర్ణతను సమకూరుస్తున్నాడు. దీనినే సమాజానికి అన్వయిస్తే నవ్య మానవవాదంగా భావించవచ్చును. పదార్థేతరంగా, దేనినో ఊహించుకునే అవసరానికి బదులు, జీవిత సమస్యలకూ, ప్రపంచ దృక్పథానికీ సంతృప్తికరమైనటువంటి సమాధానాలను నవ్యమానవ వారం సమకూరుస్తున్నది. స్వయం సంపూర్ణంగా ఉంటూ తనంతటతానుగా కృషి జరుపుతున్న ప్రపంచంలో అంతర్భాగంగా ఉన్న మానవుడు, స్వేచ్ఛాపరుడుగా ఉంటాడు.

విశ్వం ఒక పదార్థ విధానం. దానిలో నుంచి వచ్చిన మానవుడు కూడా పదార్థానికి చెందిన వాడే. అయితే ఒక గొప్ప తేడా ఇక్కడ లేకపోలేదు. భౌతిక ప్రపంచం నియమబద్ధమైనది. దాని నియమాలు అంతర్గతంగా ప్రపంచంలోనే ఉన్నవి. కానీ మానవుడికి ఇచ్ఛ ఉన్నది. అందువలన అతడు నిర్ణయం తీసుకోగలడు. అజీవ పదార్థానికీ, మానవుడికీ మధ్య విస్తారమయిన జీవపరిణామం జరిగింది. జీవపరిణామంలో కొన్ని ప్రత్యేక నియమాలున్నవి. వాటిని కూడా అజీవ ప్రపంచంలోని సాధారణ నియమాలతో సంబంధమున్నదని చూపెట్టవచ్చు. అజీవ పదార్థంనుండి జీవపదార్థం వస్తున్నది. చైతన్యత తరువాత ఎప్పుడోగాని రాలేదు. కనుక మానవేచ్ఛకు ప్రకృతిలోని నియమాలకు సరాసరి సంబంధమున్నట్లు చూపడంకష్టం. మధ్య పరిణమించిన జీవ ప్రపంచంలో వీటికి వేర్లు ఉన్నవి. ఐతే అజీవ పదార్థంనుంచి జీవపరిణామం జరుగుతున్నది కనుక ప్రకృతిలోని నియమబద్ధతకు మానవేచ్ఛ వ్యతిరేకం మాత్రంకాదు. వివేచన ఈ రెండింటినీ సమన్వయపరుస్తున్నది. నియమబద్ధ ప్రకృతిలో అంతర్భాగమయిన మానవుడు చైతన్యవంతుడు కావడం వలన, తత్ఫలితంగా వివేచన జనిస్తున్నది.

మానవుడు ఎక్కడినుంచో భూమిమీద ఊడిపడలేదు. మనసు, తెలివి, ఇచ్ఛతో సహా అతడు భౌతిక ప్రపంచంలో ఒక అంతర్భాగమే. భౌతిక ప్రపంచం నియమబద్ధమయిన విశ్వక్రమం కనుక మానవుని ఉనికి, అతనిలోని మార్పులు, అతని ఉద్వేగాలు, ఇచ్ఛ భావాలు, అన్నీ నిర్ధారితమైనవే. అందువలన మానవుడు ప్రాయికంగా వివేచనాత్ముడు. విశ్వంలోని నియమమే మానవుడిలో వివేచనగా ప్రతిధ్వనిస్తున్నది. మానవుడిలో అంతర్గతంగా ఉన్న వివేచనకు నీతితో సంబంధమున్నది. అప్పుడే మానవుడు తనంతటతాను నీతిమంతుడుగా ఉండగలడు. నీతికి ఆధారం వివేచన. అంతరాత్మకు ప్రభోధాన్నిచ్చేదినీతి. అంతరాత్మ అనేది మాయామర్మలతో కూడినదికాదు. చైతన్య దశలో అదికూడా జీవసంబంధమైనదే. మానవుడిలోని ఈ అంతర్గత వివేచన వలన పొందికగా ఉండే సామాజిక విధానం రాగలదనే హామీ ఉన్నది. ఇదే నైతిక విధానంకూడా నీతి హేతుబద్ధం గనుక ఈ వాదన సబబైనది.

నవ్యమానవవాదం అన్ని విలువలనూ స్వేచ్ఛఅనే ఉన్నత విలువలలోంచి రాబడుతుంది. జీవితానికి స్వేచ్ఛ అత్యున్నతమైన విలువ. మానవుడికి స్వేచ్ఛా పిపాస అనేదే అర్థవంతమయిన సారాంశం. స్వేచ్ఛను జీవపరిణామ విధానంలో కూడా గమనించవచ్చు. మానవుడి జీవపరిణామసంపద నుంచి నైతిక విలువలను రాబట్టినందున మానవుడికి అతీతంగా ఈ విలువలకు మరొక ఆధారాన్ని వెతుక్కోనక్కరలేదు. మానవత ఉంటే నీతి ఉండవచ్చు. ఇందు నిమిత్తం దైవాన్ని, మార్మికమయిన అతిభౌతిక వాదం అవసరంలేదు. మానవతకు సంబంధించిన నీతి పరిణామక్రమంలోంచి వచ్చినదే.

భూమిపై మానవుడు ఆవిర్భవించినప్పటినుండి తన మనుగడకోసం పరిసరాలలో పోరాడవలసి వచ్చింది. స్వేచ్ఛకై సాగిన అనంత పోరాటానికి అదే నాంది. నాటినుంచి స్వేచ్ఛా పిపాసతోనే మానవుడు సాంస్కృతిక ప్రగతిని, విజ్ఞానాన్ని, కళాసృష్టిని సాధించగలిగాడు. విశ్వమంతా మానవుడికి పరిసరమే. విశ్వం అనంతం. మానవుడు సాగించే మనుగడ పోరాటం కూడా శాశ్వతం. విశ్వాన్ని అతడెన్నడూ జయించలేడు. కనుక అతనిలోని స్వేచ్ఛా పిపాస చావదు. శాశ్వతంగా ఉంటుంది. ఈ విషయమై మానవుడు చాలా సందర్భాలలో అవగాహనలేకుండా ఉంటున్నాడు. అయినా పరిసరాలు తెలుసుకోవాలని, తద్వారా జయించాలనీ, అతనిలో పిపాస ఉన్నది. స్వేచ్ఛా పోరాటంలోనే మానవుడు సత్యాన్ని కనుగొంటున్నాడు. సత్యం మార్మికమయిన అతి భౌతిక విధానమూకాదు. నిరాకారమైన విలువకాదు. మానవుడి జ్ఞానమే సత్యం. కనుక సత్యమే వాస్తవం. బాహ్యంగా చూస్తే దానికి యదార్థత ఉండదు.

మానవతావాదంలో స్వేచ్ఛ, జ్ఞానం, సత్యమనేవి విలువల సోపానాలు. అవి

స్వయం ప్రతిపత్తి కలవి కావు. తార్కికంగాను, మౌలికంగాను యీ విలువలు పరస్పరం సంబంధంకలవి. కనుక స్వేచ్ఛను అవినీతి మార్గంలో సాధించలేము. వికాసవంతుడు అబద్ధాలకోరుగా ఉండజాలడు.

గతంలోకూడా మానవవాదం మానవుని సార్వభౌమాధిక్యతను చాటింది. కానీ మానవుడంటే ఏమిటో వివరించలేదు. మానవుణ్ణి గురించి వూహిస్తూపోగా మార్మికవాదానికి దారితీసి, మతం మళ్ళీమళ్ళీ వచ్చిపడింది. ఆ విధంగా మానవవాదం తననుతానే ఓడించుకొన్నది. ఇప్పుడు విజ్ఞానసంపద వలన ఈ దోషాలనుండి మానవతావాదాన్ని విమోచన గావించవచ్చును. మానవుణ్ణి గురించి తప్పుత్రోవను పట్టించిన మార్మిక, అతిభౌతిక భావనలు ఇక అవసరంలేదు. మానవుడి ఉనికి మార్పులతో ప్రారంభించి స్పష్టమైన అవగాహన చేసుకోవచ్చు. అవగాహనకు అందని శక్తులేవో ఉన్నాయని, వాటికి మానవుడు లొంగిపోవాలని, గతంలో ఊహించిన పద్ధతులు ఇప్పుడవుసరంలేదు. తెలివి, వివేచన, ఇచ్ఛ, ప్రేరణ అంతరాత్మ యిత్యాది మానవ లక్షణాలన్నీ అతడు ఆవిర్భవించకముందు జీవపరిణామంలోకి తలెత్తినట్లు ఆధారాలున్నవి. గ్రహింపుకు భిన్నంగా జ్ఞానార్జన చేయగలగడం మానవుడికి, ఇతర జీవజాలానికీ ప్రధానమైన తేడాలు సూచిస్తున్నది. జ్ఞానం వలన స్వేచ్ఛ పరిధిని విస్తృత పరచుకొనే నిరంతర పోరాటం, సత్యాన్వేషణచేసే శక్తి అతడికి లభించాయి.

చిరకాలంగా మానవుడిని గురించి జీవిత ప్రయోజనాన్ని గురించి వస్తున్న అసంబద్ధమయిన విషయాలనుండి విమోచన పొందడానికి విజ్ఞానం తోడ్పడింది. మానవస్వభావం యొక్క సత్యాన్ని విజ్ఞానం చూపెట్టింది. మానవుడు ప్రాయికంగా వివేచనాత్ముడు. అతని స్వభావం నమ్మడంకాదు. ప్రశ్నించడం, విచారణ చేయడం, తెలుసుకోవడం తన అవగాహనకూ, అదుపుకూ మించి ఉన్న శక్తులగురించి తెలుసుకోలేక అజ్ఞానాంధకారంలో తడుముకుంటూ, అంధవిశ్వాసంలో నిస్సహాయకారిగా మానవుడు ఉంటాడు. కాని జ్ఞానవెలుగు ప్రసరించేటంత వరకే ఈ స్థితి ఉంటుంది. మానవుడికి సత్యాన్ని గురించి అందుబాటులో ఉన్నదంతా అతని జ్ఞానమే. అజ్ఞానంపై ఆధారపడిఉన్న ప్రతిపాదనలను విడనాడి తన వివేచనవలన ఎక్కువ సత్యాన్ని తెలుసుకోగలుగుతున్నాడు.

ఆధునిక విజ్ఞానం ఆధారంగా మానవుడి సార్వభౌమత్వాన్ని నవ్యమానవవాదం చాటిచెప్పగలుగుతుంది. మానవుడికి సంబంధించిన విషయంలో మార్మికతను విజ్ఞానం తొలగించింది. మానవుడు వివేచనాత్మక, నైతిక సమాజాన్ని రూపొందించగలడు. స్వాభావికంగా మానవుడు వివేచనావాది, నీతిమంతుడు కావడమే ఇందుకు దోహదం చేస్తున్నది. ఐచ్ఛికంగాతప్ప మానవుడి స్వభావంలో వత్తిడులేమీ లేవు. మానవ

స్వభావంలో నీతి ఒక భాగంగా హత్తుకుపోయింది. ప్రస్తుత సంక్షోభానికి మార్గాంతరం చూపేటంతవరకూ, నవ్యమానవవాదం ఒక సాంఘిక తత్త్వం, ప్రకృతి తత్త్వంలోనుండి పదార్థం మనసులతోకూడిన విధానాలలో నుండి దీన్ని రాబట్టడం జరిగింది. నవ్యమానవవాద తత్త్వం భౌతిక సత్యం. దీని విశ్వనిర్మాణం యాంత్రికమయినది. దీని జ్ఞానవాదంలో భావాలోచన, ప్రత్యక్షదృష్టి సమన్వయీకరించడం జరిగింది. మనోజ్ఞానాన్ని శరీరశాస్త్రంతో కలిపి వాటిని రసాయనశాస్త్రం ద్వారా పదార్థశాస్త్రానికి ముడిపెడుతుంది. దీన్ని నీతిశాస్త్రం వివేచనాత్మకమయినది. ప్రకృతిలోని క్రమత్వంనుంచి, విశ్వంలోని పొందికనుంచి వివేచనను రాబట్టింది.

వివేచన, ఉద్వేగము, తెలివి జీవసంబంధమయిన విధానాలుగా గుర్తించి నవ్యమానవ వాదం, మానవుడు చరిత్రను సృష్టిస్తాడనే ఉద్వేగపూరిత విప్లవ సిద్ధాంతంతో సమాజ ప్రగతి క్రమంగా సాగుతున్నదనే వివేచనాత్మక భావాన్ని సమన్వయీకరించింది. చరిత్ర అంతా మానవ ప్రయత్నాన్ని చూపడమే. మానవుడు నియమబద్ధ ప్రకృతిలోభాగం కనుక చరిత్ర అదృష్ట సంఘటనల కలగాపులగం మాత్రం కాదు. సాంఘిక పరిణామం కూడా నిర్ధారితమైనది. భౌతికవాదాన్ని దోషబద్ధంగా వ్యాఖ్యానించినందువలన (1) ఆర్థిక నియతివాదం జనించింది. నవ్యమానవవాదం దీన్ని తృణీకరిస్తున్నది. సాంఘిక పరిణామంలో మానవేచ్ఛ ప్రధానమయిన శక్తిగా పనిచేస్తుంది. చరిత్రను నిర్ధారించడంలో యీ మానవేచ్ఛ అత్యంత శక్తివంతమయిన పాత్ర నిర్వహిస్తున్నది. అలా కానట్లయితే వివేచనాత్మకంగా నిర్ధారితమయిన సామాజిక పరిణామంలో విప్లవాలకు ఆస్కారమేలేదు. పరిణామవిధానాన్ని వేగంగా ముందుకు తీసుకుపోవడమే విప్లవం. కొద్దిమంది వ్యక్తుల ఇచ్ఛ ఇందుకు సహకరిస్తుంది. మానవుడి భావాలుకాని, యిచ్ఛకాని ఆర్థిక ప్రోత్సాహంవలన ప్రభావితమయిందనడానికి ఆధారాలు అట్టే లేవు.

భావాలను రూపొందించడం కూడా శరీర క్రమంలో భాగమే. ఒకసారి మానవుడి మనసులో భావాలేర్పడితే తరువాత వాటంతటవే ఉంటాయి. వాటి నియమాలననుసరించి అవి నడుస్తాయి. భావచైతన్యత, సాంఘిక పరిణామగతి, తార్కిక విధానం, పరస్పరం ఒకదానిపై మరొకటి ప్రభావం చూపెట్టుకుంటూ, సమాంతరంగా సాగిపోతుంటాయి. కానీ చరిత్రలో ఏ ఒక్క సమయంలోను సామాజిక సంఘటనలకు, భావ చైతన్యతకు కార్యకారణ సంబంధంలేదు. సాంస్కృతిక విధానాలు, నైతిక పద్ధతులు, వ్యవస్థాపితమయిన సాంఘిక సంబంధాలపై, రుద్దబడిన సిద్ధాంతపరమైన, ఉపనిర్మాణాలు మాత్రంకావు. అవికూడా తార్కికంగా చూస్తే భావాల చరిత్రవల్ల నిర్ధారితమయినవే.

స్వేచ్ఛా ప్రపంచాన్ని, సాంఘిక న్యాయాన్ని సమకూర్చే నూతన ప్రపంచాన్ని సృష్టించాలంటే, సమాజాన్ని ఆర్థిక పరంగానే పునర్వ్యవస్థీకరించే విప్లవం మాత్రమే చాలదని నవ్యమానవవాదం అంటున్నది. జీవితానికి స్వేచ్ఛాపిపాస ప్రధానమయింది కనుక, మానవుడి ప్రతిభావ్యుత్పన్నతలు విప్పారకుండా ఆటంకపరిచే సామాజిక స్థితిగతులను తొలగించడమే వివేచనాపరులైన మానవుల ప్రయత్నంగా ఉండాలి. ఈ ప్రయత్నంలో వింత సఫలత పొందితే ఆ మేరకు స్వేచ్ఛను సాధించినట్లే. ఏ సామాజిక విధానంలోనయినా, సమష్టికృషిలో నయినా, అభ్యుదయానికి, విమోచనకూ, కొలమానం మానవుడి స్థితి మాత్రమే.

(1) కార్ల్‌మార్క్స్ ప్రతిపాదించిన సిద్ధాంతమిది.

మానవుడు ఆలోచనాపరుడుగా తన ప్రపంచాన్ని తాను నిర్మించుకొంటాడు. వ్యక్తిగా ఈ పనిచేస్తాడు. చరిత్రలో ఇది ప్రధానమయిన వాస్తవం. నవ్యమానవవాదం ఈ దృక్పథానికి అత్యంత ప్రాధాన్యతను ఇస్తుంది. మెదడు ఆలోచనకు పరికరం. మెదడు ఉండేది వ్యక్తికి మాత్రమే. అది సమష్టిగా ఉండాలి. ప్రతిభావంతులయిన వ్యక్తులు, భావాలను ఛేదించే ఆలోచనలు చెప్పగా అవి విప్లవాలకు దోహదంచేస్తాయి. సమకాలీన ఆధునిక నాగరికతా సంక్షోభంనుంచి మార్గాంతరంగా చూపాలంటే, వ్యక్తికి తగినస్థాయి, గౌరవం, పునరుద్ధరించాలంటే భావ సాహసికులు, స్వేచ్ఛాపిపాసకులూ, స్వేచ్ఛాయుత వ్యక్తులతో కూడిన స్వేచ్ఛా సమాజాన్ని నిర్మించాలనేవారు ముందుకుసాగాలి.

సమాజాన్ని ఈ విధంగా పునర్వ్యవస్థీకరించడానికి వ్యక్తిస్వేచ్ఛను హరించకుండా అందరి ప్రగతి, సౌభాగ్యం సాధించడానికి పౌరులకు విద్యప్రధానం కావాలి. ప్రపంచాన్ని సాంఘికంగా పునర్నిర్మించాలని, మానసికంగాను, నైతికంగాను విమోచనపొందిన వ్యక్తులు సహకరించి కృషిజరపాలని నవ్యమానవవాదం కోరుతున్నది.

నవ్యమానవవాదం విశ్వజనీనమయినది. పెట్టుబడిదారీ, ఫాసిస్ట్, సోషలిస్టు, కమ్యూనిస్టు-మరే ఇతర జాతీయ రాజ్యాలు సరిహద్దులతో పరిమితంగాక, 20వ శతాబ్దం పునర్వికాస ప్రభావంలో ఇవన్నీ తొలగిపోయి విశ్వజనీనమయిన స్వేచ్ఛాపరులతో కూడిన వ్యక్తులతో సమాజం ఉండాలని ఈ తత్త్వం చెబుతున్నది.